# మహాభారత చరిత్రము



294.592309
వేంక..మహా
5357

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి

5357

# మహాభారత చరిత్రము

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

cod - 13086

**MAHABHARATA CHARITRAMU**
**By Pendyala Venkata Subramanyasastri**

ప్రచురణ నెం. : 1609

294.592309
వేంక - - మహిం

ప్రతులు : 1000

వి.పి.హెచ్. ప్రథమ ముద్రణ : డిశంబరు, 1991

ముఖచిత్రం : రమ

జన ప్రతి వెల రు. 45-00
గ్రంథాలయ ప్రతి వెల : రూ. 75-00

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞానభవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు - 500 001

5357

విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాదు, అనంతపురం, విశాఖపట్నం,
హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ.

ISBN : 81-7098-274-X

ముద్రణ : పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్ 1-1-517/B/1, న్యూ బాకారం,
గాంధీనగర్, హైదరాబాదు-500 380. ఫోన్: 68413.

# పరిచయం

మహాభారత గాథను చారిత్రకంగా పరిశీలించే కృషి ఆంధ్రలో 1921 లో మొదలైంది. ఆ సంవత్సరం మద్రాసులోని గోఖ్లే హాలులో కీ. శే. కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రసంగం ఇందుకు శ్రీకారం చుట్టింది.

పిమ్మట కొందరు విమర్శక పండితులు ఈ కృషిని కొనసాగించారు. ఇట్టి రచనలన్నిటిలోకి మకుటాయమానమైనది, కీ. శే. పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారి "మహాభారత చరిత్రము"

1933, అనగా దాదాపు 60 సంవత్సరాల క్రితం వెలువడిన ఈ గ్రంథం అనాడు గొప్ప సంచలనాన్ని సృష్టించింది సనాతన పండితులు శాస్త్రిగారిపై దూషణలతో, నిందలతో దుమ్మెత్తి పోశారు. శపించారు ఐనా తన వాదనలను ధైర్యంతో చిత్తశుద్ధితో వివరిస్తూ శ్రీ శాస్త్రిగారు సాగించిన వివాదం, సత్యాన్వేషణ పట్ల వారికిగల దీక్షకు తార్కాణం.

మహారాష్ట్ర, బెంగాల్‌లలో ఈ విమర్శా దృష్టి అంతకుముందే మొదలైంది. పూనాలోని భండార్కర్ సంస్థవారు, మహాభారత మూలప్రతిని సంపాదించి, సంశోధించి ప్రకటించిన ఉదంతం, చరిత్ర పరిశోధనా రంగంలో కలికితురాయి లాంటిది.

మనకు లభించిన భారతగాథ దృష్ట్యా, పాండవులు సర్వసద్గుణ సంపన్నులు, కౌరవులు అన్ని దుర్గుణాలకు మూలం. కనుకనే కురుక్షేత్రం, ధర్మక్షేత్ర మైంది. ఈ యుద్ధాన్ని నిర్వహింపచేసిన శ్రీకృష్ణుడు, అవతార పురుషుడు యుగప్రవక్త ఐనాడు.

నిజంగా ఇలాగే జరిగిందా? తప్పొప్పులు, మంచి చెడ్డలు ఉభయపక్షాలలోను లేవా? అసలీ యుద్ధంలో చారిత్రక ఎంత? ఈ గాథను పంచమవేదంగా వ్యాసాదులు రూపొందించటంలో అంతరార్థం ఏమిటి?

శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అరవయ్యేళ్ళ క్రితమే ఈ ప్రశ్నలు లేవనెత్తారు. తమకు తోచిన సమాధానాలు ఇచ్చారు

పాండవులు భారతీయులు కారు, టిబెట్ దేశీయులు; ద్రౌపది పంచభర్తృక కాదు, అర్జునుడి పత్ని; ఆమె అయోనిజ కాదు, ఒకే పన్నాగంతో ద్రుపద పుత్రికగా వ్యవహరించింది. కౌరవులలో అసూయా, ద్వేషాలు మూర్తీభవించిన

మాట నిజమే కాని అందుకు పాండవులు, ద్రౌపది, శ్రీకృష్ణుకు ఇత్యాదుల రెచ్చ గొట్టే చర్యలు కూడా ఒక కారణం. సర్పయాగం అంటె పాములను చంపడం కాదు, నాగజాతి ప్రజల నిర్మూలన - ఇలాంటి అనేకాంశాలను శాస్త్రిగారు ఈ గ్రంథంలో సోదాహరణంగా నిరూపించారు.

గత అరవయ్యేండ్లుగా సాగిన చరిత్ర పరిశోధన, ఈ రచయిత నిర్ణయా లను చాలావరకు ధృవపరుస్తున్నది. కొన్ని విషయాలలో భేదాభిప్రాయాలుండ వచ్చు బహు భర్తృత్వం, బహు భార్యాత్వం సామాన్యమైన ఆ రోజులలో ద్రౌపది పంచభర్తృక కావటంలో ఆశ్చర్యం లేదు. ఇప్పటికీ అట్టి ఆచారం హిమాచల ప్రదేశ్‌లో కొన్ని తెగలలో కనిపిస్తునే ఉంది.

పంచమ వేదంగా, శ్రీకృష్ణుని అవతార పురుషునిగా, పాండవులు సకల సద్గుణ సంపన్నులుగా రాయవలసిన అవసరం ఏమొచ్చింది? ఎవరు ఎప్పుడు ఇలా చేశారు?

ద్వైపాయనుడు, వైశంపాయనుడు, శౌతి - అను ముగ్గురు రచయితల ద్వారా మహా భారతం ప్రస్తుత రూపంలో లక్షకుపైగా శ్లోకాలతో ఏర్పడ్డది. జయ, భారతం, మహా భారతం - అంటూ విస్తృతమైంది.

భాషా పరంగా కనిపించే వ్యత్యాసాలే కాక, వాస్తవాలను చెప్పటం చెప్పకపోవటంలో కూడా ఇది రుజువౌతుంది. ధృతరాష్ట్రుడు, పాండురాజులు నియోగ పద్ధతి ద్వారా జన్మించారు అని స్పష్టంగా చెప్పిన రచయిత, కర్ణుడ్ని సూర్యపుత్రునిగాను, పాండవులు వేరే దేవతాశక్తుల ప్రభావంవల్ల జన్మించినట్లు ఎందుకు చెప్పాడు? వాస్తవం చెప్పటం గౌరవప్రదంగా ఎంచని సంస్కారం, లేక కుసంస్కారం ఏదో అప్పటికి ఏర్పడ్డది. ఒకే రచయిత ఇలా చేసి ఉండ వచ్చు. లేక వేర్వేరు రచయితలు చేసి ఉండవచ్చు.

శ్రీకృష్ణుని యుగ ప్రవక్తగా కీర్తించిన భాగం అంతా చాలాకాలం తర్వాత చేర్చబడ్డది. గౌతమబుద్ధునికి ప్రతిగా రామ, కృష్ణులను అవతార పురుషు లను చేసిన వైదిక రచయితలు ఇందుకు కారణం. ఇదంతా క్రీ. పూ. 400 ప్రాంతంలో జరిగింది. అప్పటికి వాసుదేవ భక్తి ఏర్పడ్డది. ఈ ధోరణి కొన సాగింపుగా, భాగవతం, వారి వంశా లేర్పడ్డాయి. సర్వోపనిషత్ సారమైన భగవద్గీత భారతంలో అంతర్భాగమైంది.

ఇదంతా వైదిక మత పునరుద్ధారణ కృషిలో శతాబ్దాలపాటు జరిగిన రచనా వ్యాసంగం.

ప్రాచీన సాహిత్యం అంతా ఇలా పెరిగినదే. ఆ మాటకొస్తే బౌద్ధ జాతక కథలు, జైనుల పురాణగాథలూ, ఇలాంటివే. వైదిక, బౌద్ధ, జైన మతాలు పోటా పోటీగా చేసిన మత సాహిత్య సృష్టి ఇది.

కొన్ని ధర్మాలు, మానవతా విలువలు బోధించాలనే సదాశయంతోనే ఆ రచయితలు ఇట్టి అభూత కల్పనలు చేసి ఉండవచ్చు. కాదనలేము. కల్పనా సాహిత్యం ద్వారా నీతిబోధ, ధర్మ ప్రచారం చేయటం అనాది పద్ధతి. అందులోని చారిత్రకాంశాలను గ్రహించి, అసందర్భాలను త్రోసిపుచ్చి, విచక్షణా దృష్టిని అలవరచుకోవటం ఆధునిక పద్ధతి అది మానవుని శైశవ దశ. ఇది ఉన్నత దశ.

ఇట్టి విచక్షణాదృష్టిని పాఠకులలో కలిగించటానికి ఈ గ్రంథం ఎంతగానో తోడ్పడుతుంది. దాదాపు విస్మరించబడిన ఈ గ్రంథాన్ని సేకరించి ప్రకటించగలిగినందులకు మేము ఎంతో సంతోషిస్తున్నాము. ఈ గ్రంథం 1928-1933 లలో రెండు ముద్రణలు పొందింది. రచయిత రెండో ముద్రణలో కొంత అదనపు సమాచారం ఇచ్చారు. ఈ రెండు ముద్రణలను జాగ్రత్తగా పరిశీలించి పూర్తి సమాచారంతో మా యీ మొదటి ముద్రణను మీకు అందిస్తున్నాము. ఇందుకు తోడ్పడిన మిత్రుడు శ్రీ అవంత్స సోమసుందర్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

విజయవాడ
3-11-91

ఏటుకూరు బలరామమూర్తి
ఎడిటర్, విశాలాంధ్ర ప్రచురణాలయం

# "మహాభారత చరిత్రము" పై అభిప్రాయాలు

(Sir S. Radhakrishnan, Vice Chancellor has written thus)

My dear Sastrulu Garu

Thank you very much for sending me your two books on Mahabharata I am sorry I have no time to read the latter, but I glanced through the former, and I am greatly impressed by your independence of judgment and critical powers. I hope you will continue the work which you have been doing.

Andhra University,
Waltair,
24th June 1932.

Yours Sincerely,
S RADHAKRISHNA.

శ్రీ పండిత సీతానాథతత్వ భూషణరాయిగారిటులు వ్రాసియున్నారు.

......మీరు వ్రాసిన మహాభారత చరిత్రములోని యాంగ్ల పీఠికను శ్రద్ధతోఁ జదివితిని......మీరు వ్రాసిన విషయములలోఁ గొన్నిటితో నేనేకీభవించుచున్నాను. కాని మీరు చెప్పిన విషయము లన్నియు సరియగునో కావో స్థిరముగాఁ జెప్పలేకున్నాను. నాచే రచింపఁబడిన "(1) కృష్ణ-గీత, (2) కృష్ణ-పురాణములు" అను రెండు గ్రంథములందో మహాభారత మనేకులచే వ్రాయఁబడిన గ్రంథమనియు, నానా యుగములలో వృద్ధిచేయఁబడిన దనియు. మహాభారత కృష్ణుఁ డితిహాస పురుషుఁడు కాఁడనియు, ఋగ్వేదములోని యాంగిరస కృష్ణుఁడు, అసుర కృష్ణుఁడు, ఛాందోగ్యములోని దేవకీనందన కృష్ణునియొక్క మిశ్రణ మనియుఁ జూపించుటకుఁ బ్రయత్నించితిని. ఈ సృష్టింపఁబడిన జీవన చరిత్రయందుఁ గాలక్రమమున ననేకకథలు కల్పింపఁబడి చేర్పఁబడినని—వర్ణసంకర విషయమై నాచే సంపాదితమగు భగవద్గీత సంస్కృతము—ఇంగ్లీషు యొక్క ప్రథమాధ్యాయమునందు 40 శ్లోకపుటీక యందును, ఆ శ్లోకమునకే వ్రాసిన యింగ్లీషు ఫుట్‌నోట్సు నందును వ్రాసిన విషయము చూచినచో నా యభిప్రాయముఁ దెలిసికొనఁగలరు. మీస్వాధీనచిత్తతకు, సంస్కారముక్తతల కానందించితి,

210.8.3.
కారన్వాలీస్‌వీధి, కలకత్తా.

భవదీయుఁడు
శ్రీ సీతానాథ తత్వభూషణోపాధిక.

మహాభారత చరిత్రమునుగూర్చి "పూనా"లోని బాండార్కరు ఓరి యన్టల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూటువారు ఇట్లు వ్రాయుచున్నారు:

......Being written in Telugu, it is unfortunately to me a sealed book. Nevertheless, from the English summary I can see that you have made a very deep study of the Great Epic and arrived at some very important conclusions regarding the history of this great work. I feel therefore that you are just the sort of scholar to whom our critical edition of the Mahabharata will make a strong appeal. ... ... ...

V. S HEKTHENKER,
M.A., Ph.D.,
General Editor, Mahabharata.

ఆంధ్ర యూనివర్సిటి వైస్ ఛాన్సెలర్‌గారైన శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగా రిట్లు వ్రాయుచున్నారు.

బెజవాడ, 7-11-1928

My dear Friend,

Many thanks for sending me your criticism of the Mahabharata.

In the field of higher criticism of the Mahabharata though I led the way 7 years ago, the first scholary developments are due to Mr. Vedam Venkatachalam Iyer and yourself. I am sure your very valuable book will stimulate further study and thought on our great Epic.

I am deeply impressed by the boldness and research displayed by your critical study. With best regards.

Yours Sincerely,
C. R. REDDY.

## THE HINDU DAILY

"...While scholars in the Bombay Presidency are engaged in turning out an authorised version of the Mahabharata by collecting manuscripts from various parts of India, many prominent persons and scholors have turned their attention to the task of critically examining the knotty problems that arise out of a careful study of the epic. Mr. C. R Reddi set the ball rolling by his famous lecture on the Mahabharata in the Gokhale hall in 1921 Mr. Subrahmanya sastry Pendyala, who had been already carrying on researches in this direction, was spurred to greater activity by this lecture. The fruits of his extensive research and mature scholarship are given to Andhradesa by the publication of his work under review. Some of his conclusions are startling. That the Pandavas were not the sons of soil (Bharata varsha) but were emigrants from Tibet, that they had no claims to the kingdom of the Kurus, that the story of Draupadi having five husbands is a pure myth, and the Duryodhana and his party are pointed in black colours —are some of the positions maintained in the volume by the author who freely draws upon authorities like Mr Vaidya, Griffith, Winternitz, Jayaswal and Fleet.

A map of India at the time of the Mahabharata has been added at the end of the volume which enhances its value."

12th December 1928.

## University of Edinburgh.

21-1-34

Dear Sir,

I am much obliged to you for sending me your work in Telugu on the development of the Mahabharata. I gather from the English synopsis which you have supplied that you have presented to you fellow-countrymen modern views of the process of evolution of that text. It is clear that much and prolonged study will be required before these issues can be elucidated, and I have no doubt that your disscussion will be helpful in attracting attention to these difficult problems. So far as I follow your position, you seem to realise clearly the essential difficulties presented by the present narration and the solution which lies in the gradual transformation of the Kaurava epic to favour the incoming Pandava.

Yours very truly,

**(Sd) A. B. Keith: D. Lit.**

## మొదటి ముద్రణకు

# పీఠిక

భారత భాగవత హరివంశ విష్ణుపురాణాద్యనేక గ్రంథ పరిశీలన చేసి బ్రహ్మశ్రీ పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తాము కనిపెట్టిన క్రొత్త విషయములను ఈ మహాభారత చరిత్రములో పొందుపఱచియున్నారు. వీరు కడు శ్రద్ధతోను సూక్ష్మబుద్ధితోడను ఈ కార్యమును నిర్వహించిరి. పాండవులు భారతీయులు గాక త్రివిష్టపదేశీయులనియు, కౌరవ రాజ్యార్హులు కారనియు, ద్రౌపది పంచభర్తృక కాదనియు ద్రౌపదీవస్త్రాపహరణ గాథ యసత్యమనియు శ్రీకృష్ణుడు లోకోత్తర వ్యక్తియనియు, పూతన శకటాసురాదులు వ్యాధిగ్రహాదులనియు, దుర్యోధనాదులు ఉత్తమ కౌరవులనియు, ధర్మరాజు రాజనీతి పారంగతుడనియును ఈ పుస్తకమున సహేతుకముగ నిరూపింపబడెను. ఇంకను ఎన్నియో విశేషాంశములు ఇందులో కాననగును.

శ్రీ శాస్త్రిగారి క్రొత్త సిద్ధాంతములు పరీక్షార్హములగును. విజ్ఞులు ఈ పనికి దొడంగుదురుగాక. బహుగ్రంథ పరిశీలనా ఫలమగుటచే ఈ పుస్తకము జిజ్ఞాసువులకు ఆదరణీయ మగును.

ఇట్లు
విద్వాన్ గరిమెళ్ళ సోమన్న
ఎం.ఏ., ఎల్. టి.

## మొదటి ముద్రణకు

# గ్రంథారంభ సమర్థనము

ఒక్కనాఁటి పురాణముచేతనె పురాణశ్రవణలోలుఁడగు "పాలకుర్తి వెంకయ్య" యను కాకినాడ తాలూకా "మేడపాడు" నివాసి యగు రసికు నానందింపఁజేసి యాతనిచే జీవితాధారమునకుఁ దగిన భూవసతినొంది "అభిజన" మగు, అంబికపల్లి అగ్రహారమును వదలి మేడపాడునే నివాసముగా నొంది యచట "మహాలింగేశ్వరాలయముం గట్టి శివప్రతిష్ఠఁజేసి పౌరాణికుఁడు నన్నదాత శక్తుఁడు నను ప్రఖ్యాతినొంది పరమపదమునొందిన మా తండ్రిగారగు పెండ్యాల వెంకయ్యగారు నా పదియవయేటనె నాచే నాంధ్రమహాభారతముఁ జదివించి నన్ను మహాభారత కథాలోలునిగాఁ జేసిరి. వారు నాఁటిన బీజమె నన్నీ గ్రంథమును జేయించినది. పురాణకథన జీవకులగు మా పితృవ్యులు రామశాస్త్రిగారును, మాతులులు వింజమూరి సుబ్రహ్మణ్య శాస్త్రిగారును మా తండ్రిగారు నాటిన దానిని దోహదము చేసి వృద్ధి నొందించిరి. మా తండ్రిగారు పురాణముఁ జెప్పు నపుడె విమర్శనాంశములు కొన్ని నా హృదయక్షేత్రమునఁ బ్రవేశించినవి. శ్రీకృష్ణ చరితమును ముచ్చటించునపు డాయన తారకమంత్ర 'జపాలోలురగు టచేఁ గాఁబోలు కృష్ణుఁడు రామునివంటి శుద్ధచారిత్రుఁడు కాఁడనుచుండిరి. సీతా పాతివ్రత్య కథానిమగ్నులగుటచేఁ గాఁబోలును కుంతీ ద్రౌపదులే కురువంశ నాశకు రాండ్రనుచుండిరి. పిమ్మట మా మేనమామగారు "వెర్ల చోడవరము"లోఁ బురా ణముఁ జెప్పుసమయమునఁ దద్గ్రామవాసులగు "దండు నరసింహరాజుగా" రను వారు కర్ణార్జునుల చరిత్రలను విమర్శింపుచు నర్జునునకు గర్ణుఁడెందును సరిరాడని విమర్శించుచుండిరి. కర్ణుని గురించి యీ క్రింది పుక్కిటి కథ నొకప్పుడు మా పినతండ్రిగారు చెప్పిరి.

"ధర్మజుఁడు కర్ణునివలె దానమునందును వీరుఁడు కాఁడట. కర్ణుని యుదార స్వభావమును ధర్మజునకుఁ జూపి యాతని సిగ్గుపరుప నొకనాఁడు ప్రస్తావనవశమున శ్రీకృష్ణుఁడు ధర్మజునితో బావా, నీకు మేరుపర్వతమును స్వాధీనపరచిన దాని నెంతకాలములో దానముఁ జేయఁగల వనగా ధర్మజుఁడు "ఘన" ప్రమాణముఁ దెలిసికొని కొన్ని వత్సరములలో దానిని ఛేదించి బీద

లకు దానముఁ జేయవచ్చుననెనట. తత్కాలాగతుఁడె యగుఁ గర్ణునిఁజూచి కృష్ణుఁడు ధర్మజు నడిగినటులె యడుగఁగా గర్ణుఁడు, విశేషకాలమెందుకు, ఈదవాని కొక్కనికె నిమిషములో నా పర్వతమంతయు ధారవోతుననెనట! కర్ణుని యా యుదార స్వభావమునకు ధర్మజుఁడు సిగ్గువడెనట" ఇట్టిదె దానకంకణ విషయమగు నొక కథ కర్ణుని విషయమై చెప్పఁబడెను. ఇట్టి విమర్శనలు వినుచున్న నాకు సంస్కృతాంధ్ర భాషలలో విజ్ఞాన మలవడిన పిమ్మటఁ గొంత కాలము నేను స్వగ్రామమునఁ బౌరాణికుఁడనై యాంధ్ర మహాభారతముఁ బెక్కుసారులు పురాణముఁ జెప్పితిని. నన్నయ తిక్కనల కవితా శైలికిఁ జొక్కి పలుసారులు కొన్ని ఘట్టములఁ జదివితిని. ఇటులుండఁ గాకినాడ కలాశాలలో శ్రీ సర్ దివాన్బహద్దరు, ఆర్. వేంకటరత్నము నాయుడుగారి దయవలన నాంధ్రోపాధ్యాయుఁడ నైతిని. కాకినాడ చేరిన పిమ్మట రాజకీయముననే గాక గ్రంథ విమర్శనము నందును విశేష ప్రజ్ఞావంతులగు శ్రీ దుగ్గిరాల వేంకట సూర్య ప్రకాశరావుగారితో విశేషపరిచితి కలిగినది. వా రాంగ్ల భాషలో "వైద్యా" పండితుఁడు మొదలగు వారు వ్రాసిన భారత విమర్శనల నపుడపుడు వినిపించు చుండిరి. సంఘ సంస్కరణ విషయములో మాకు భిన్నాభిప్రాయముండినను, విశేషవిమర్శకులగు బ్ర॥ శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు మహాభారత గాథలలోని విశేషాంశములు, అందు పాంచాలీ పరిణయ కాలమున ధర్మజుఁడు "మా పూర్వులు పోయిన దారిని మేము పోవుదుమ"నుటయు, అనుక్రమణికాధ్యాయములోఁ "బౌరులు పాండవుల పుట్టుక ననుమానించిరి" అను సంశయముల నొకప్పుడు చెప్పి యీ గ్రంథ రచనలో వారి మతమునకుఁ దీసికొనువారైరి. దేవీభాగవతములోఁ బాండవులనుగురించి భారతమునకు భిన్నముగా రచియింపఁబడి యున్నదనియు బ్రహ్మయ్యశాస్త్రిగారె చెప్పి మహత్సహాయముఁ జేసియున్నారు. అంతకు ముందె నేను మచిలీపట్టణమునఁ బ్రచురింపఁబడు "ఆంధ్రభారతి" పత్రికలో "మహాభారత యుద్ధకాలము" అను వ్యాసమును వ్రాసియుంటిని. అంతవఱకు నాకు సంస్కృత గ్రంథములఁజూచి విమర్శనము వ్రాయు నలవాటులేదు. కాకినాడనుండి "బందరు"లోని "జాతీయకలాశాల" కుపాధ్యాయత్వమును మార్చుకొంటిని. ఆ కాలమున గ్రంథములఁ జదువ నవకాశము విశేషముగాఁ గలిగెను. ఇపుడు కోయంబత్తూరు వ్యవసాయ కలాశాలలోఁ బండితులుగా నుండిన మ॥ రా॥ శ్రీ దువ్వూరి బాలకృష్ణమూర్తి గారు (అపుడు గోదావరీ మండల ప్రాంతమున కగ్రికల్చెర్ అసిస్టెంటు డైరక్టరు) గోదావరి డిస్ట్రిక్టు అసోసియేషన్ ద్వారా, "శ్రుతి స్మృతి పురాణేతిహాసముల" ననుసరించి వ్యవసాయ చరిత్రము నాంధ్రభాషలో వ్రాసినవారికి నూఱు మొదలు

నూటయేబది రూప్యముల వఱకు బహుమతి నిత్తుమని ప్రకటనను జేయించుటయే గాక జాతీయ కలాశాలకు వచ్చి, కీ॥శే॥ కోపల్లె హనుమంతరావు పంతులుగారి సన్నిధిని నీవీ గ్రంథమును వ్రాయఁగలవని వింటిని. తప్పక వ్రాయమని రెండుసారులు ప్రోత్సహించిరి. నేను శ్రుతుల యర్థముఁ దెలిసికొనలేనేమోయని మొదట సందేహించితిని. గాని యొకప్పుడు "దుగ్గిరాల ప్రకాశరావు పంతులుగారు "గ్రిఫిత్" భాషాంతరీకరించిన "యథర్వవేదము" లోని కొన్ని యంశముల నాంధ్రీకరించి చెప్పుటచేతను బందరు టవున్ హాలు లైబ్రరీలో నాల్గు వేదములు శాస్త్రగ్రంథములు (సంస్కృత భాషలోను, ఆంగ్లానువాదములు) నుండుటచేతను, నాకు శిష్యుఁడు మిత్రుఁడునగు "మైనేపల్లి అప్పారా"వను విద్యా ప్రియునిఁగూడి వేదములలో వ్యవసాయమునకు గల భాగములను "అనుక్రమణిక" (ఇండిక్స్) చూచి యాతఁడు చెప్పఁగా విద్యారణ్యాదిభాష్యములఁ జూచి యవసరాంశములను వ్రాసికొని యుక్త కాలముననే వ్యవసాయ చరిత్రను పంపవలసిన చోటున కంపితిని. పర్లాకిమిడి కాపురస్థులగు బ్ర॥ శ్రీ॥ పారనంది రామశాస్త్రిగారును బంపిరట! నా దానికిఁ బ్రాశస్త్య మెక్కువగా నున్నదనియు బహుమతికిదియె యర్హమనియు, గో॥ డి॥ ఆ॥ శక్రబెరీ గారొక యుత్తరమును వ్రాసిరి. దువ్వూరి బాలకృష్ణమూర్తిగారును; డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారింట నీకిచ్చు బహుమతి నిచ్చెదనని చెప్పిరి. నా రెండవ కుమార్తె వివాహ సందర్భమున వారిఁజూచుటకు గుంటూరు వెళ్ళి మీరిచ్చు పారితోషిక మిపుడిప్పించినఁజాల సంతోషింతుననగా నిపుడు తొందర పనిలో నుంటిని వెనుకనుండి వ్రాసెదనని, తిరిగి యింకొకసారి జ్ఞాపకపరుపగా గ్రంథ ప్రచురణమునకుఁ దొందరయుండినఁ బ్రచురించుకొనవచ్చునని కార్డు నొకదానిని వ్రాసి మహదుపకారముఁ జేసిరి. కాళయుక్తి వత్సరమున నీయఁదగిన యాబహుమాన ముదారపురుషులగు వారింతవఱకీయకపోయిన నెప్పటికైన నిత్తురనియే నిరీక్షించుచున్నాను. ఆ వ్యవసాయచరిత్రను "భారతి" పత్రికలో శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు ప్రకటించి మహదుపకారముఁ జేసి యున్నారు. బాలకృష్ణమూర్తిగారు ప్రత్యక్షముగా నొక మహదుపకారముఁ జేసినందులకు వారికిఁ గృతజ్ఞుఁడను. ఆ యుపకార మేదియన నాకాశగొలిపి విశేష గ్రంథములను నాచేఁ జదివించుటయే. అథర్వవేదముఁ జదువునపుడు "కుంతాపసూక్తము"లో పరీక్షిత్తుయొక్క ప్రశంసయు "ఐతిరేయ" బ్రాహ్మణములో జనమేజయుని ప్రశంసయుఁ గాన్పించినవి. ఆ కాలముననే "మలబారు" నిధికై మ రా॥ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగా రతిపరిశోధనతోఁ గూడిన మహాభారతోపన్యాసమును (దీ. 6-12-1921) మద్రాసులోని గోఖ్లేహాలులోఁ జేసి

యున్నారు. ఆంధ్రపత్రికలో నావ్యాసముయొక్క సంక్షిప్తభాగము ప్రచురింపఁబడెను. నేనా కాలమున జాతీయ కళాశాలలో నాంధ్రభారతభాగములనె పాఠముఁ జెప్పుచుండుటచేతను జనసామాన్యమునకు విరుద్ధముగాఁ గాన్పించు శ్రీ రెడ్డిగారి యుపన్యాసమును ఖండింపుచు వ్రాయమని కొందరు విద్యార్థులు, మిత్రులు నన్నుఁ బ్రోత్సహించిరి. మొదట నిష్టపడితినిగాని రెండు మూడుసారు లాయుపన్యాసాంశములఁ జదువఁగా వారు చెప్పిన యంశములు విరుద్ధముగాఁ గాన్పింపలేదు. అందుచే ఖండనము వ్రాయలేదు. అపుడె "దుర్యోధనుఁడు—భారవికవి" యను నొక వ్యాసమును కృష్ణాపత్రికకు సుయోధన పాత్రౌచిత్యముఁ గూర్చి వ్రాసితిని. మహాభారతకాల భరతఖండ పటమును లిఖించి విద్యార్థులకుఁ బాఠము చెప్పితిని ఆ పటమును వ్రాయుటలో నచటి చిత్రలేఖకోపాధ్యాయులగు బ్రహ్మశ్రీ ఈరంకి వెంకట శాస్త్రిగారు చాల సహాయముఁజేసిరి పిమ్మట జాతీయ కళాశాలా వ్యవహారము నాకు సరిపడకనేమి తద్గ్రామజలము నాకు పడకనేమి బందరు వదలి మ రా శ్రీ దివాన్ బహద్దరు ధురిశేటి శేషగిరిరావు పంతులుగారి యనుగ్రహము వలన "రాజోలు" హైస్కూలున సంస్కృతోపాధ్యాయుఁడనైతిని. అచటనుండినపుడు నాకు ద్వితీయకళత్రవియోగ మైనది. ఆ విచారము నవనయింపు నుపాయము సదా గ్రంథావలోకనమె యనితలఁచి రాత్రి నాల్గు గంటలు మాత్రమె నిద్రకై యేర్పరచి సదా గ్రంథపఠనమునకె కాలమును వినియోగించువాఁడను. నన్ను "నాంధ్రసాహిత్యపరిషత్తు"న 1914 సంవత్సరము నుండియు గౌరవసభ్యునిగా జేర్చుకొనిరి. కాని 1922 సంవత్సరమునఁ బిఠాపురమునఁ జరిగిన పరిషదుత్సవమున మాత్రము "రామాయణ" చరిత్రతో సంబంధించిన వ్యాసముఁ జదువుటకుఁ బదునేను నిమిషముల కాలవ్యవధియని యైదాఱు నిమిషములలోనె ముగింపుకావలెనని తొందర పెట్టిరి.

మ॥రా॥శ్రీ శ్రీరాజా విక్రమదేవవర్మగారి యాధిపత్యమున "తుని"లో 18-10-28 సంవత్సరము తేదీని జరిగిన యాంధ్ర సాహిత్య పరిషదుత్సవ సమయమున "మహాభారత చరిత్ర" యను వ్యాసముఁ జదువుటకు నాకు సంపూర్ణావకాశమునిచ్చిరి. 1½ గంటల కాలము వ్యాసమునంతయుఁ జదివితిని. జనసామాన్యాభిప్రాయ విరుద్ధములుగా నుండిన నా వ్యాసాంశములు సభికులను "క్రోధాశ్చర్య" నిమగ్నులఁజేసినవి. దానికి వెంటనె ప్రత్యేకసభఁజేసి ఖండనముఁ జేయింపఁ గొందరు బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారిం బ్రోత్సహింపగా వారు నా వ్యాసాంశములు గ్రంథనిదర్శన సహితముగా నున్నవి గాన ఖండింప వీలులేదనిరని యా ప్రోత్సాహకుల నడుమనుండిన వారును నా మిత్రులు నగు పండితారాధ్యుల సూర్యనారాయణకవిగారు పిమ్మట

నాతోఁ జెప్పియున్నారు. అప్పటి డి। బో। ప్రసిడెంటు రావుసాహేబు మాదిరెడ్డి వేంకటరత్నము నాయుడుగారి పక్షపాతము నాపై నుండుటచే నేను బోర్డులోని యుద్యోగమునకు సెలవుపెట్టి చిరకాలాశ్రయమగు పిఠాపుర సంస్థానమున మ॥రా॥ శ్రీ దివానుగారు కోటా సుబ్బారావునాయుడుగారి యొక్కయు శ్రీ పిఠాపురము మహారాజావారియొక్కయు ననుగ్రహమున పిఠాపురములోని హైస్కూలున నాంధ్రోపాధ్యాయుఁడనుగాఁ బ్రవేశించితిని. ఒకనాడు ప్రస్తావనవశమున శ్రీదివానుగారితో భారత విశేషములను ముచ్చటింపుచుండగా తుని వ్యాసము నంతయు వినగోరెదనని "రుధిరోద్గారి సంవత్సర ఆశ్వయుజ పుష్య మాసపు సాహిత్య పరిషత్పత్రికలోఁ" బ్రచురింపఁబడిన యా వ్యాసమునంతయు విని దీనిని విపులముగాఁ బెంచి వ్రాసిన బాగుండునని ప్రోత్సహించిరి. వారి ప్రోత్సాహముచేతనే యీ గ్రంథమును వ్రాసితిని. ఈ గ్రంథైక దేశమగు "మహాభారత రచనా విధానము" అను దానిలోని ముఖ్యాంశములను, రక్తాక్షి సంవత్సర వైశాఖ శుద్ధ పూర్ణిమకు అన్నవరములో "శ్రీ సత్యనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవ కాలమున" బ్రహ్మశ్రీ ప్రసిద్ధికెక్కిన చళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి యాధిపత్యమున నగు పండిత సభలో నుపన్యసింపగా శ్రీ శాస్త్రిగారు గొన్నిట నభిప్రాయ భేదమున్నది గాని విమర్శనాంశము లీ వ్యాసమునఁ బొందుపడియున్నవనిరి. ఆ వ్యాసములోని "వింటర్నిడ్జు" గారి యభిప్రాయములు "విశ్వభారతిఁ" జదివి మన్మిత్రులు శ్రీ పెద్దాడ సత్తిరాజుగారు వినిపించిరి. ఆ వ్యాసమునే పిఠాపురము వచ్చినపుడు బ్రహ్మశ్రీ మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారికి వినిపించితిని. ఇందును గురించి నేనొకసారి వ్రాయ నుద్దేశించితిని గాని కార్యవ్యవధి కలుగనందున వ్రాయలేదనియు నా యభిప్రాయము లిందు చాల కలవనియు స్వల్పములో మాత్ర మభిప్రాయభేదము కలవనియు వారు సెలవిచ్చిరి మహాభారతరచనా విధానమును వ్రాయుటకు నొకప్పుడు మ।రా॥శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు "ఆంధ్రభారతి"లో వ్రాసిన యొక చిన్నదగు వ్యాసము బీజమైనది. నాకుఁ జిరకాలమిత్రులు—మిత్రులేకాదు, సోదర నిర్విశేషులును రెడ్డిరాణి ప్రతికాధిపతులు నగు మ॥రా॥ శ్రీ మల్లిడి సత్తి రెడ్డిగారు నేను రచియించు "మహా భారత చరిత్రము"ను ముద్రింపింతుమను మహదానంద వార్తను నాకు వ్రాసిరి. వారి సహాయము లేకుండిన నా ప్రయత్నము వ్యర్థమెయగును. గ్రంథమును వ్రాయ నారంభించి యొకటి రెండు "ఫారములు" ప్రస్సున కిచ్చితినొ లేదొ, అంతలోనే వ్యాధిగ్రస్తుండనై తొమ్మిది మాసములు మంచముపట్టి "చావుతప్పి కన్ను లొట్టపోయినది" అను సామెతకు నేనె నిదర్శనమై కుడికన్నుఁ బోగొట్టుకొని యెటులనో జీవించితిని. రోగగ్రస్తుఁ

దనై యుండినపుడును కొన్ని యంశములఁ జెప్పి "పొత్కులూరి లక్ష్మణ
మూర్తి" యను మిత్రపుత్రునిచే వ్రాయించుచు నూట నాలుగు పేజీల గ్రంథము
ముద్రణమున కీయఁగలిగితిని. అంత మిగుల నవశుఁడనై మిత్రులచే జీవితాశ
లేదనిపించుకొంటిని గాని బ్ర॥ శ్రీ॥ శ్రీమాన్ సముద్రాల భాష్యకారాచార్యుల
వారి యనిర్వచనీయ కరుణా కటాక్షముతోఁ గూడి యమృత హస్తము నాపై
సోకుటచేతనే యిప్పటికిటుల మనఁ గలిగితిని. నేను మంచముపట్టి సంశయ
జీవుడనైన సమయము నా జీవితములోకెల్ల బరమనీచకాలము. అపుడు కుమార్తె
ప్రసవ సమయము, నన్నుఁ జూడవచ్చు చుట్టముల రాయిడి, దరిద్రము, అంత
వఱకు నింటనుండిన యల్లుఁడలిగి పలాయితుఁడగుట, తలపోటుచే రాత్రులు నిద్ర
లేక పోవుట, నా యింటికి సమీపమున దేవయాన నాటకమును చేర్చికొను శూద్రులు
ప్రతి దినము రెండు మాసములు రాత్రి యొంటిగంటవఱకు మద్దిల తాళములతోఁ
జెవులు బ్రద్దలగు నటుల ధ్వనిని జేయుట, అప్పులవాండ్రు తమ సొమ్ముఁ
దెమ్మనుట మొదలగు నీతి బాధల సంకలితములైనవి. నేను రోగగ్రస్తుఁడనై
యుండినపుడు పై యధికారివలె గాక బంధువు వలె శ్రీ కోకా సుబ్బా
రావు నాయుడుగారు నన్నుఁ బెక్కుసారులు చూడవచ్చి క్షేమమారసి
యనేక విధములగు సహాయముఁ జేయుచు ధైర్యముఁ జెప్పుచుండువారు.
భాష్యకారాచార్యులుగారు చేసిన యుపకృతి జన్మాంతము వఱకు మఱువరాని
దేను. శ్రీ సత్తిరెడ్డిగారును, రెండు మూడుసారులు "రాయవరము" నుండి
పిఠాపురము వచ్చి క్షేమమారసి పోవుచుండువారు. నా దరిద్రస్థితినిఁ దెలిసి
శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు "అకాలవర్షము" కురిసి
నటులఁ దలవని తలంపుగా నూఱురూపాయలు మనియార్డరుచేసి దరిద్రవిచ్ఛిత్తిఁ
జేసిరి. కంటి వైద్యమునకు మద్రాసు పోవలయునని శ్రీ కోకా సుబ్బారావునాయుడు
గారి సహాయ సంపత్తితోఁ బ్రోత్సాహము కలిగించిరి. వారు ప్రోత్సాహపరచి
పంపనిచో నేను సంపూర్ణాంధుఁడనై యుందును. శ్రీ దివాన్బహద్దరు దుర్శేటి
శేషగిరిరావు పంతులుగారు, దుగ్గిరాల ప్రకాశరావుపంతులుగారు కూడా నన్ను
చెన్నపురి కంపను సహాయముఁ జేసిరి. నాకు చెన్నపురి క్రొత్త. నా కచట
మిత్రులుగా నుండిన కొత్తపల్లి సూర్యారావుగారు కాకినాడకుఁ గాపురము వచ్చిరి.
కాని చూచిన వేళావిశేషముచే మ రా॥ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పరమ
మిత్రులై యవ్యాజకరుణను నాపై నుంచి పదియడుగులైన నడువలేని నన్ను
"సెంట్రల్ స్టేషను" నకు వచ్చి తమ యింటికిఁ గొంపోయి డాక్టరు బి. సుబ్బా
రావుగారిచే నా కంటినిఁ బరీక్ష చేయించి యశ్రమముగా నన్నుఁ గన్నాసుపత్రిలోఁ
జేర్పించిరి. చేర్పించుటయేకాదు, దినము విడచి దినమైన దప్పక నన్నుఁ జూడఁ

గొన్ని మైళ్ళు నడచివచ్చి రోగగ్రస్తుఁడను గాన జిహ్వాచాపల్యముచే నవయుచున్న నాకుఁ గావలసిన భోజనపదార్థములఁ గూడ తెచ్చి యిచ్చుచుండిరి. వారుచేసిన యుపకృతికిఁ బ్రత్యుపకృతి గలదా? అరవగోలెకాని పరిశుభ్రమగు తెనుఁగుమాట వినపడని యీ యాసుపత్రిలో సోమశేఖరశర్మగారి దర్శనము నాకు నిక్షేప దర్శనముగా నుండెడిది. వారితో నచట మహాభారత చారిత్రక సంభాషణ ములు జరుగుచుండెడివి. "జయస్వాయి, ప్లీటు" మొదలగువారు వ్రాసిన యంశములను వారు వినిచెడివారు. దేశోద్ధారక శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు, సర్. దివాన్ బహద్దరు ఆర్ వేంకటరత్నము నాయుడు గారు, దుగ్గిరాల ప్రకాశరావు పంతులుగారు, సత్తిరెడ్డి గారు నాకు మద్రాసునందైన ఖర్చులను భరించి యనిర్వచనీయోప కృతిం జేసిరి. నేను భారతమును దల్లక్రిందుగ విమ ర్శించుట చేతనే నా కన్ను పోయినదను ప్రథ మా పిఠాపురములో వ్యాపించి నది ఎటులైననేమి, "మేజర్ రైటు" దొరగారి యింజక్షనులతోఁ గుడికన్ను పోయినను యెడుమకంటితోనైన జీవింపఁ గలిగితిని. తిరిగి పిఠాపురము వచ్చి "కృష్ణద్వైపాయనుఁడు శ్రీకృష్ణుఁడు" అను భాగములను వ్రాయునప్పటికి మరల రోగగ్రస్తుఁడనై చెన్నపురి రెండుసారులేగి కంటి వైద్యముఁ జేయించు కొనవలసినవాఁడనైతిని. ఈ రెండుసారులును నాకు శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు, సర్ వేంకటరత్నము నాయుడుగారలే ద్రవ్యసహాయముఁ జేసి కాపాడిరి. సోమశేఖరశర్మగారి సహాయమెప్పుడును నాకు కలుగుచుండు నదియేను. రెండు మూడుసారులు మద్రాసు వెళ్ళినపుడు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యమూల్య పరిచితి కలిగినది ప్రతిసారియు మ॥ రా॥ శ్రీ డాక్టరు అచంట లక్ష్మీపతిగారి యాలోచనా సహాయము లేకుండగ నేను వైద్యముఁ జేయించు కొనలేదు. వారొకప్పుడు నా భారతచరిత్రముఁ దిలకించి యెటులనైన నీచరిత్రను బూర్తిచేయవలయునని మిగులఁ బ్రోత్సహించిరి కన్నాసుపత్రిలో నాకు బరిచిత మైన శ్రీ డాక్టరు పి. నారాయణస్వామి నాయుడు, డి. నరసింహరాజుగారు నను వారు నా భారత చరితమును వినుచుఁ దక్కిన డాక్టర్లకొ వింతగా నా కథలఁ జెప్పుచు నా కచట నితరరోగులకంటె విశేషోపచారముఁ జేయించిరి కడపటి సారి కుడికంటిని దీయించుకొను నవసరము కలిగినపుడు మహత్సంశయగ్రస్తుఁ డనై యుండఁగా నవ్యాజ కరుణ సమేతులై సర్. దివాన్‌బహద్దరు వేంకట రత్నము నాయుడుగారు, డాక్టరు "కొమన్నాయరుగారి"తో నా విషయమై స్వయ ముగాఁ జెప్పి నా భయమును వాపిరి. నేను రోగినిగా నుండిన సమయముననే నేను తునిలోఁ జదివిన వ్యాసమునకు ఖండనమును వ్రాసి బ్రహ్మశ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి సోమయాజిగారు, ఆం॥ సా పరిషత్పత్రికలో "మహా భారత

కథా తత్వ నిర్ణయము" అను వ్యాసమును వ్రాసిరి దానికి ప్రత్యుత్తరమును వ్రాయుటకు, పరిషత్పత్రికలో "భారత మీమాంస" యను నింపగు పరిశోధక వ్యాసము విరళముగా "చర్ల నారాయణశాస్త్రిగారు" వ్రాయుచుండుటచేఁ దావు లేకుండెను. భారతీ పత్రికవారు నా ప్రత్యుత్తరము పరిషత్పత్రికలోఁ బ్రచురించుట మంచిదనిరి. తక్కిన మాసపత్రికలు విపుల వ్యాసములఁ బ్రకటింప నోపవు. అందువలనె దానికిఁ బ్రత్యుత్తరము వ్రాయుటకంటె "మహాభారత చరిత్ర"ను బూర్తి చేసినం దానిచేతనె ప్రత్యుత్తరము కూడ సిద్ధించునని యాయుద్యమమునుండి విరమించితిని. చర్ల నారాయణశాస్త్రిగారి వ్యాసమె సోమయాజిగారి ఖండనమునకుఁ జాలవఱకుఁ బ్రత్యుత్తరముగా నుండునని తలఁతును. తక్కినది యీ పుస్తకముచేఁ జరితార్థమగునని తలఁతును. ఈయేడు "బళ్లారి"లోఁ జరిగిన పరిషదుత్సవ కాలమున "అనంతపుర" కలాశాలాంధ్రోపాధ్యాయుఁడగు బ్రహ్మశ్రీ ప్రయాగ వేంకటరామశాస్త్రిగారు "భారత విశేషములు" అను పరిశోధక వ్యాసము చదివిరి. అది సర్వ విధముల నా గ్రంథములోని "రచనా విధానము"ను భాగమునకు మాతృకయో, పుత్రికయో యనఁ జెల్లును. కాని శ్రీ శాస్త్రిగారు పరిషత్పత్రికలో నా వ్యాసముఁ జూడకపోవుటచేఁ నటుల వ్రాసితి ననిరి. నే"ననంతపురమున"కేగినపుడచ్చటి కలాశాలలో మహాభారత చరిత్రముఁ గూర్చి యొక యుపన్యాసముఁ గూడఁ జేయుంచిరి. "శతపథ బ్రాహ్మణము" అప్పటి కాఱు మాసములకు ముందు నేను చూచియుండలేదు దానిలో విశేషములు మహాభారతమును గురించినవి కలవని విని మన్మిత్రులు శ్రీ దుగ్గిరాల ప్రకాశరావు పంతులుగారికి వ్రాయఁగా వారు నాకు విశేష పరిశ్రమఁజేసి "జూలియన్, యగ్గ్‌హింగు" దొరగారి యాంగ్లీకరణములోని విశేషములను 8 పుటల యుత్తరముగా వ్రాసి మహదుపకారముఁ జేసిరి ఇంతలో శతపథ బ్రాహ్మణమును గూడ నొక మిత్రుడిచ్చుటచే మూలముఁ గూడఁ జూచితిని గదా యని మిగుల నానందించితిని. శ్రీ కోకా సుబ్బారావు నాయుడుగారు పదేపదే నేను వ్రాసెడి చరిత్ర మెంత యైనదని నన్నుఁ బ్రోత్సాహపరచుచు, కన్ను జాగ్రత్త పరచుకొనియే గ్రంథమును వ్రాయుమాయని దయతోఁ జెప్పుచుండెడివారు. అందఱి కంటె నా మాంద్యమును సహించి నేనిచ్చిన గ్రంథాంశమును ముద్రింపించుచు పదేపదే యుత్తరముల ద్వారా నాకుఁ బ్రోత్సాహముఁ గలిగించెడి సత్తిరెడ్డి గారి గ్రంథ రచనకు ముఖ్య కారకులని ముమ్మాటికిఁ జెప్పవలసి యున్నది. అందుండిన దేశ పటము శ్రీ సుసర్ల సూర్యప్రకాశముగారు వేసి నాకు సర్వవిధముల సహాయముఁ జేసిన పైని నుడువఁబడిన వారికి సదా కృతజ్ఞుఁడను. అరుదుగాఁ గాన్పించు నా యీ గ్రంథముచే మహాభారతముఁ జదువుట కసహ్యము

కలుగునని పెక్కండ్రు నన్ను నిరుత్సాహ పరచినవారును ఉన్నారు. కాని నా దృఢాభిప్రాయ మేమన, నేను వ్రాసిన వ్రాతలలోని సత్యము గ్రహించుటకుఁ బెక్కండ్రు పదేపదే మహాభారతపఠనముఁ జేయుదురనియు దానివలన నేదేని యాముష్మికముండిన నది నాకుఁగూడ కొంత లభించుననియే నా తలంపు సోమయాజులుగా రంతటివారు నా గ్రంథమును ఖండించుటకై భారతముఁ జదివితినని వ్రాసిరిగదా! ఆ పుణ్యములోని శతాంశమైన నాకుఁగలుగదా! ఏ గ్రంథాంశమైన ప్రతిపాదింపబడినదానిని "మంథనముఁ" జేయఁ బెక్కుసార్లు లాగ్రంథముఁ బఠింతురనియు దానివలన నా గ్రంథముపై సభిమానము హెచ్చుగ కలుగుననియు ద్వైతాద్వైతాది మతగ్రంథములిటులే వ్యాప్తినొందిన వనియు నా తాత్పర్యము. ఇందువలన మహాభారత పఠనము హెచ్చుగునని తలఁతును.

## భాష

భాష మతాచారకల్పము భాషాస్ఖాలిత్యము మతాచారస్ఖాలిత్య సదృశము. పూర్వాచారపరులకు నస్ఖలితమగు మడితోనె సత్క్రియవుఁ జేయు తలఁపు కలిగి యుండును. శాస్త్రమర్యాదఁ దెలియకగాని తెలిసినదాని నాచరించుటలో దేశకాల పరిస్థితు లనుకూలింపనపుడుగాని చూడకగాని యనాచారయుక్తుఁడైనచో వాని నెల్లపు డనాచారుడుగా మసలువాఁడు నీవు స్ఖలితుఁడవైతివని గేలిసేయుట యుక్తముగాదు. నేనింటికడ నుండినపుడు స్నాన సంధ్యల నాచరించి మడితోడనె భుజించుచుందును. కాని రోగగ్రస్తుఁడనై కంటికిఁ గట్టుకట్టించుకొని యుండి తద్వ్యతిరిక్తముగాఁ జేయనొప్పినది కాదు. అటులనే కన్నుండి యితరులచే వ్రాయించుకాలముననను వ్రాసినదానిఁ బరిశీలించు నోపిక లేకను పెక్కు భాషాస్ఖాలిత్యములిందుఁ బ్రవేశించినవి. నా తాత్పర్యము మాత్రము సులక్షణమగు భాషతోడను వ్రాయవలయుననియే. దీనిని రెండవసారి ముద్రింపించునవస్థ కలిగినచో(పాండవ వయోనిర్ణయాదితర) కథాస్ఖాలిత్యములతోఁబాటు భాషాస్ఖాలిత్యము గూడ దిద్దఁ బ్రయత్నింతును. ఈ గ్రంథముఁ జదువువారు తొలిసారి చదివినంతమాత్రమున నాపై నలుఁగక విమర్శించినచో వారికిఁ గృతజ్ఞుఁడ నగుదును.

పిఠాపురము
ది. 28-2-23

సుజన విధేయుఁడు
**పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి**

# The Story of Mahabharata

## (In Telugu)

By Pendyala Venkata Subrahmanya Sastry.

1. The work is a critical review showing how the original Sanskrit poem of 8,000 slokas was developed into a tremendous volume of 100 thousand slokas.

2. That the Pandavas and their allies are not such ideal persons and personified concentrations of human virtues.

3. That the methods adopted by them and their chief ally and protector Sree Krishna were not above reproach.

4. That Duryodhana, his brothers, relatives and generals were men of high principles and were Provoked to assume the attitude they assumed under stress of political exigencies even at the cost of their kingdom.

The salient points to which prominence was given in the publication under review will be summarised below :—

(1) *The date of Mahabharata War*:- Reckoned with reference to Kaliyuga eras, Pandavas should be supposed to have existed 5028 years before the beginning of the Kaliyuga. But this cannot be said to be correct. From Mahabharata and Vishnu and Bhagavata Puranas, it is found that Pandavas were born sometime after the beginning of Kaliyuga. Kalhana the author of Raja-tarangini which is a history of Kashmir, mentions that

Kauravas and Pandavas lived 658 years after Kaliyuga had begun From the statement in Vishnu Bhagavata Puranas, it can be determined that the Mahabharata war was fought in 1685 B. C.

(2) *The composition of mahabharata*:- Krishnadwaipayana was not the only author of mahabharata of 100,000 Slokas now extant. Dwaipayana composed an epic of 8800 Slokas. The work was completed within three years after the declaration of the war at Kurukshetra, and it is known by the name of 'Jaya'. In it are chronicled the events commencing with the arrival of Pandavas at 'Hastipuri' after the death of King Pandu up to the slaugter of Upapandus by Aswadhama. A hunderd years afterwards of Vysampayana added 15200 slokas to the existing poem 'Jaya' under the designation of 'Bharata.' After half a century 'Southi' brought out a work called 'Mahabharata' with one lakh of slokas in all adding several episodes to the two previous works: 'Jaya' and 'Bharata'. There is reason to believe that in 4th and 5th centuries there were two distinct and separate works known as Bharata and 'Mahabharata.' It is also note worthy that copies of Mahabharata available in different parts of the country have different episodes incorporated in them and this must be due to the interpolations and embellishments made by older Pandits of those parts of the country. With great effort and leisurely research it may not be impossible to differentiate and determine the Bharata composed by Vysampayana and developed into Mahabharata by Southi.

## PECULIARITIES IN THE STORY

The matrimonial relations and influence of Bharata Khanda at the time of Mahabharata extended up to the Caspian Sea on the west and Tibet, China, and Mangolia on the north. Even prior to that there had been continuous intercourse among the Aryans who had already been permanent settlers in this country and the people of those lands. That the issue of the mixed marriages between the Aryans and the non Aryanin habitants of the country had by that time gained Power and influence, is a factor not to be ignored. As a result of the impact with a struggle among the mixed and pure Aryan races, the people of Tibet seemed to have taken opportunity for the intervention and brought about a great war described the poem under review. That war had led to the extintion of the ancient Kuru Royal family long before established in Bharata Khanda and to the installation of the Pandav royal family of Tibetan extraction instead, which however, did not last long. The male population having almost disappeared after the war, the women were obliged to perpetuate to the race by mixed marriages and other, illegitimate methods. Subsequent makers of law had of necessity to recognise them as legitimate issue. The belief in gods and super-human beings having got a strong hold on the minds of people, they easily believed that issue could be begotten in a miraculous and mysterious manner by the favour of gods. That belief is responsible for sons and daughters being born in rivers, pots, grass, rain, wind, sun, fire etc.

## THE NAGAS

These Nagas that are described in the beginning of the Mahabharata are not the inhabitants of a separate country; but only a sect of the Dravidians that lived in some corner of the continent of India. Between these men and the Pandavas there seems to be hereditary enmity. The Nagas outcast those of their race that asserted relationship with the Pandavas. This inimical feeling continued till the rule of Janamejeya and Parikshit. The Sarpayaga (snake sacrifice) of Janamejeya can be interpreted as a massacre of the Nagas of Taxila. After this massacre the Naga kingdom of Hindustan disappeared. The Naga kingdom of Central India began into insignificance after Arjun and Bhima had begun to establish their pay here. Bhima was born of a couple composed of a Naga lady and a king of Tibet; and Arjun loved a Naga maid. The son born of Arjun and the Naga lady was vanished from the Naga, Kingdom, who then was forced to take refuge and outilve his dishonour in Tibet.

## LOOSENING OF DRAUPADI'S GARB

The incident of the loosening of Drapadi's garb in the open Court is inconsistently described in the Maha Bharata. Thirteen illustrations can be given from the same epic to disprove the occurrence. Yudhishthir beguiled Draupadi to put on her garb loosely and to pretend to be in menstruation with the intention of bringing disrepute upon Drutharastra and Duryodhan. this fact is dealt with at length by Kumarilabhatt in his Tanthravarthika. Lord Krishna was ignorant of this incident as he was then wholly engaged in a twelve month's fight with Salva at

a coastal region. Duryodhan earnestly intended to insult her in the presence of his courtiers addressing her as a servant maid and as a pawn won at dice and thus wreak, vengeance upon her in retaliation for her former insolence in the Maya Sabha :- the court built by the divine architect Maya. Draupadi began to show her defiance and disobedience to authority even before her coming to the Court. She replied to the questions put to her in the Court in a way quite unbecoming of her sex and status. Her defiant language provoked the infuriated Duryodhan the more. In a wild temper Dussasan caught herby her floating hair when accidentally her loose garb became more loose. This gradually is made much of as the incident of loosening Draupadi's garb.

## SOCIAL EVILS

Gambling and intemperance were universally prevalent in the society of those days. The sanctity of married life was then little understood and observed.

## THE LUNAR RACE OF KINGS

The warrior-class of the Aryans that traced the descent from them moon-god married women of other clans that lived in India and left behind them a hybrid race. Taking advantage of the evils of the society Kunthi appears to have brought forth Karna and Arjun living in company with some Tibetans. Kunti took Yudhisthir,Bhima,Nakula,and Sahadev into her care to bring them up as her adopted sons from some hermitage of Tibet or must have procured them by some doutful means and brought them to Hastipura in her widowhood to pass them for Pandu's sons and to claim for them a share in the empire. The gods of Sun, Yama, Air and

Indra are even mentioned and proved to be the sages of Tibet in the Vedanukramanika. The supposition held by the citizens of Hastipura that the Pandav princes were sons born of Kunti after the demise of Pandu is an addition to the doubts already mentioned regarding their mysterious origin.

## POPULAR HATRED FOR THE PANDAVS

As the birth of the Pandavs was mysterious and doubtful and as their morale was quite different from that of the general public the people entertained a kind of ill will against them. The sages of India did not include the name of Yudhishthir's horse-sacrifice in their hymn of Brahmana due to their hatred for them. Though Parikshit's name is included in the Vedic literature composed in the reign of Janamejaya, it should be understood that it was the result of the changed public opinion.

## PANDAV PARTISANS.

Bhima, Drona, Krupa, Vidura, Vyasa had an affinity for the Pandavs because like them they too were of questionable pedigree. The partialty and extreme fondness which Krishna had for the Pandavs may be explained by referring to the similar doubtful parentage he had like the Pandavs.

## KRISHNA DWAIPAYANA

As is supposed in general, Krishna Dwaipayana was not the sole intellect that wrote the eighteen Puranas and the composer of the vedas into four parts. He is one of the eight and twenty Vyasas It appears that he composed one sentence of Yajurveda kataka and one of the three parts of the Maha Bharata the Jaya. The works of the other Vyasas are slowly com-

ing into light at present. Dwaipayana was avowedly partial to the Pandavs. With the co-operation of Yaza and Upayazas, sages born of virgins like himself. Dwaipayana brought Draupadi to the parental care of Drupada and by means of marriage made her related to the Pandavs as well. Only with his help the Pandavs could gain half of the kingdom of the Kurus. Again they are more famous than their brethren only because they are dipicted in bright colours by Dwaipayana in his 'Jaya.'

## SREE KRISHNA

Lord Krishna is represented in the Maha Bharata not as an incarnation of God but only as a diplomatist and statesman. The mention made of his being an incarnation of God at certain places in the epic is not consistent with what follows and what goes before such a mentioning. He was regarded in diverse ways in different centuries. In the age of Sakatayana (12th century B C.) he was regarded as a warrior, in the age of Panini (5th century B. C.) as a religious reformer, and in the age of Patanjali (2nd century B. C.) as an incarnation of God It seems that he became an ally of the Pandavs at first to get their succor to fight successfully with Jarasandha. His strategy in fighting with Sisupala and Jarasandha is not without some blemish. He did not seriously think of conciliating the cousins by a well-thought-out pact, which fact is clearly given expressions to by Duryodhan and Balarama. In view of such evils in Krishna, his relations Balarama, Pradyumna, Samba etc. did not agree to be one with him in showing favour to the Pandavs. Satyaki and Krisna were actuated by some selfish motives in

befriending the Pandavs. Kruthavarma, Krishna's daughter's father-in-law championed the cause of Duryodhan ignoring his near relationship with Krishna. Arjun's vision of the Godly form of Krishna is not a divine enchantment; but only a farcical wonder. It may be surmised that Bhurisrava, Saindhava, Drona, Karna and Duryodhan were got killed by Krishna by treacherous means. The episodes in the Bhagavata and the Bharata represent inconsistently the facts that deal with the preservation of Draupadis' chastity and Parikshit's life, Krishna's vigour was on the wave as he grew in years. While he was dying he entertained a humarish doubt about the chastity of his many wives that would survive him. In accordance with his apprehension we notice that his wives lived a passionate life with some Rakshashas. Deeds considered faulty from the modern stand point, were less faulty during the times of Krishna and Yudistur.

## VIRATA

Virata was the sympathiser of the Pandavs as he himself belonged to a hybrid race. He was only a nominal king and his subjects enjoyed little security of person and property.

## THE PANCHALAS

That these were the ancient enemies of the Kurus and Pandavs is described in the Satha Pada Brahmana. This makes both oriental and occidental Scholars doubt the fight between the Kurus and the Pandavs must have been the fight between the Kurus and the Panchalas. This war was caused by Drona's usurpation of the northern part of Drupada's kingdom Ahichatra.

The soldiers that fought with the Pandavs were the Panchalas whom Drona and Karna could not extirpate. These while sleeping, were slain by Aswathama. Their leader Drustajyamna was according to the Maha Bharata a descendant of Sveta and a relation of Yaja. When Druppad desired a Brahmin warrior to slay Drona, Yaza manazed to send a descendant of Sveta as suddenly as dramatic persons are brought to appear an the stage during dramatic performance. Krishna heard that Aswathama was determind to take up arms, but without informing Drustajyamna of the same made him fight with him readily. This readiness to fight proves that Drustajyamana was valiant and tactful Sikhandi, a female by birth, stood against Bhishma in battle after acquiring skill in warfare and he may be supposed to be one adopted by Putra.

## DRAUPADI

Living as devotee to the north of the Himalayas for many years with the name of Nalayani she married Maudgalya. She found little happiness in his company, deserted him, and came to Yaja that lived in the Gangetic valley. Yaja took her with him to Drupad's Puthrakamesti sacrifice and entrusted her to his care. Prior to this, Yaja took an oral promise from the Pandavas that they would marry her. Vyâsa helped Yâja in this matrimonial alliance. Drupada was ignorant of this preconceived plan. Draupadi is popularly believed as the wife of the five brothers but Kumârilabhatt in Tantri Varthi commentary suggests that the Pandavas accepted polyandry outwardly and that Draupadi was in fact only the wife of Arjun. She was a courageous woman and the Pandavas had great

veneration for her. She was bold to deny the superiority of Sree Krishna and Virata. She could taunt Saindhava and Kichaka by virtue of her masculine vigour and could silence the courties of Dhrutarastra with her wide knowledge in the law of Dharma The episode Na'avani in the Mahabharata says that Draupadi suffered from 'Atyanada a disease peculiar to women, so defined in the medical books of Charaka It may also be surmised that Krishna made her die childless with the intention of preventing future struggles between her sons and those of Subhadra for kingship. She, in sort, excels most eminent women and is fit to be an ideal to all women except in her compliance to be the wife of many.

## KUNTI

Kunti is the cause of the fight between the Kurus and the Pandavas. Karna and Arjun only were born of her. She took into her care the other four with a malevolent motive. She divulged her secret motherhood. when Yudhistira and her other sons kept silent when she expressed a desire to retire into the forest to die unknown at the end of the war. No poet except Krishna Dwaipayana finds virtues in her worthy of praise.

## THE PANDAVS

These are Tibetans but not Aryans. These made their way into India to make fortune by fomenting internecine struggles between the tribes that then settled in Hindustan. Instances can be shown of their having reinforcements and supplies of war weapons from Tibet. Their mode of living and their customs were different from those of the People of Hindustan.

All the kings of Hindustan, Bahlika Bhurisrava, Salya, Jarasandha, Bruhad Bala, and all their kingsmen, the kurus and the other Arya Kshatriyas hated them. Their partisans, the kings of Matsya, Yadava, and Dravidian races were only non-Aryans. Jarasandha the king of Magadha was their enemy. Jarasandha's son being persuaded by Krishna sided the Pandavs, but his Grandson declared enmity with the Pandavs like himself. The king of the Panchalas sided them and was the cause for the destruction of the kingdom of Hastinapura. He died heirless and left the kingdom to the Pandavs with none to perpetuate his memory, like the king of Kanuj that helped Mohammed Ghori, the invader of India, in the 12th century A.D. The Pandavs bitterly hated the Brahmins. They brought about Drona's murder and humiliated Aswathama. They permitted Krupacharya to stay in Hastinapura, when persuaded by Krishna to do so. The Pandavs' descendants Parikshit and Janamejaya also had the same hatred for the Brahmins. The Pandavs in going to Varanavatha got the help of the Brahmins but Yudhistira in return did not favour them after the war. The building of inflammable material (the lac house) was burnt by the Pandavs themselves. Their wanderings in the forests were to search for a tribe that would espouse their cause. The people of Hindustan suspected their honesty and denied them alms in their period of exile and disguised life. These adopted polyandry and, as Wilson supposes, they were surely Tibetans. These never gained the confidence of their subjects. They protected themselves with mercenary armies. Their empire disintegrated and dwindled into

insignificance after the rule of four of their successors. These gradually became domiciled in India Babruwaha a one of their descendants was taken in adoption by a Dravidian king and the kingdom of the Pandvas rose up in Southern India.

## YUDHISTIR.

Yudhistir appears a better statesman than Krishna. He rescued his brothers from many difficulties. The proposed truce with the clause that the Pandavas should have five villages was only a stratagem to separate Karna and Drona and to induce the Yadavas and the Panchalas to declare war. This clause in the truce is not less diplomatic than the offer of the recent German king Kaiser to give Alsace and Lorain to France, of the English to give Gibraltar and Egypt to the Spaniards and the Egyptians respectively, on the eve of the Great European war Sanjaya described Yudhistir as a lion in a lamb's garb.

## BHIMA

The extinction of the Karna dynasty is due to him. He was the cause of the Great War. As an economist and expert financier he carefully spent the state aevenue and did not allow even Yudhistir to take a pie of it without his consent. He persecuted the relations of the dead Karna so much that they preferred death in the wilderness to staying in his kingdom. He could not realise the strength of his own party or that of the opposite party. He slew Jarsaandha and Duryodhanan with the help of Krishna and Arjuna. Krishna did not allow his heirs to succeed to the throne.

## ARJUNA

He was born of a Tibetan Aryan but in India. His decendants ruled India for four generations. He is a reputed warrior. Later authors say that he could defeat Kalakeya, Nivathakavacha, and Gandharva. Many heroes were slain by him. He is so widely known because he was taught by Krishna 'Bhagavatgita' the famous holy song. He was regarded during the times of Satakayana and Panini as a compeer of Krishna; but after the time of Patanjali he was degraded to a less respectable place.

## DURYODHANA

He is not so vicious as he is generally supposed He never harmed the Pandavs without being harmed by them. Throwing the Pandavs into the Ganges and making them lose at the game of dice where only a retaliation for the evils done to him. Duryodhana agreed to become a party to the pact but Krishna did not allow it to be effected perhaps to do more mischief. His brothers were only four, of whom he was the eldest. Bhasa, Bharvi, and Kshmendra consider him less vicious than he is depected by Nanniahbhat. He was made to do bad things by his advisers, Bhishma, Drona and Salya. He was less cruel on the battle field than the pandavs. Suti represents him as a virtuous man deserving access to heaven after his death.

## DUSSASANA

He was as devoted to his brother Duryodhana as Lakshmana was to Rama. Believing that Kaikeyi and Dasaradha were the cause of Rama's leaving for the forests, Lakshmana incensed against them. Because Rama asked him to out off the nose and ears of Surponakha he did so. In the same way, Dussasana apprehending that Sri Krishna would bring his brother into trouble with the connivance of Bhishma and others, wanted to shackle his hands and feet when he came to his brother to effect a compromise between the rival families. As Droupadi mocked Duryodhana in the Court of Maya, Dussasana dragged her by the hair into the gambling court when his brother ordered him to bring her there. It is not a fact that he disrobed her. It is stated in Bhartam itself that Yudhistira sent word to her to wear her garb loose so that the act of disrobing her might be attributted to the Kauravas and

thus their good name might fall into disrepute. How intense was Dussasana's devotion to his brother, was revealed when the latter desired to commit suicide. His great prowess was highly exhibited on the 10th day of Bhishma's fight. Bhima himself confessed before Gandhari his blunder in having drunk Dussasana's blood.

## KARNA

He was very brave, generous and loyal. He defeated in an open fight Jarasandha who overthrew Sri Krishna and whom Bhima could not kill but by an artifice and wrested the town of Malini from him.

He conquered single-handed all the kingdoms won by Bhima, Arjuna, Nakula and Sahadeva and made the people thereof pay tribute to Duryodhana. Bhishma as well as Sri Krishna admired the valour of Karna. On one occasion Arjuna was terribly afraid of him. Indra and Salya cheated him. Sri Krishna got him killed through treachery. Karana was awre of the fact that his parting from his armour and ear-rings would result in self-destruction but still when Indra asked for them, he gave them away to him. Such was his liberality. Kunti Krishna and Bhishma persuated him to join the Pandava in as much as they were his own brothers and asked him to be the Lord of their territory but his loyalty to his king was so unflinching that he fought by his side till his death. He mocked Droupadi for having married five husbands and advised her to marry one who would not stoop to pledge his wife in gambling. The reason was this; Drustadyumna told her at the time of her Swayamvara to marry whom so ever that might shoot the Matyayantram after describing to her the pedigree of all the heroes that attended the ceremony. Karna was one of them and when he was prepared to aim at the mastyayantram she insulted him by declaring in the presence of all the kings and princes that because he was a sudra, she would not marry him. But she had no hesitation in marrying afterwards the five Pandava brothers Yudhistira repented all his life for the foul means employed in killing Karna.

## SAKUNI

Has anyone heard in any age of kind of diplomacy by which one has taken possession of another's kingdom without

causing either physical or mental suffering to the latter? Sakuni obtained possession of the kingdom of the Pandavs ingenuously without shedding one drop of blood of the enemy. In contrast to this it can be asserted that the Pandavs causes terrible slaughter in recovering their kingdom after a crafty war. Though Sakuni displayed no valour in his skill he did not cause any suffering to the people. Verily, the diplomacy stands good comparison to that of Chanakya. When Duryodhana was rescued from the Gandharvas by the Pandavs, he advised him to restore their kingdom to them. He never afterwards told him to deny them the right to their kingdom.

## SUSARMA (Trigarthas).

Susarma was the king of Trigarthas who might also have been known as 'Samsaptakas'. They were always fighting with Arjuna. On the second day of Drona's fight, they kept Sri Krishna in great suspense about the fate of Arjuna. He continued to fight till the eighteenth day of the war and was at last killed by Arjuna, Panini (who lived in the 6th Century B. C.) mentioned in his work that the Trigarthas were a race of professional soldiers. The Kakindi sect was one of the branches of the Trigarthas. It would appear that these people were known as Kakatiyas in the benginning of the first century after Christ who set up a kingdom and ruled it (Anubandha Charitram).

## PARIKSHIT.

After the demise of Sri Krishna, Arjuna was killed by some of the fowlers of the Punjab. The Kings of Sindhu Gandhara, Trigartha, Magadha and Pragjotisha were hostile to the Pandavs. Apprehending a rebellion of the Subject States in the event of their settling at Hastinapura and finding that the people of their own State were ready to declare Civil Disobedience (it is stated in Mahaprastanika Parvam that the people set aside a decision of Sahadeva in the matter of a dispute regarding the possession of house sites among certain citizens). Yudhistira handed over his kingdom to Yuyutsa a brother of Duryodhana requesting him to install Parikshit an off-spring of their house on the throne and set out to Tibet, the place where they originally came from and lost his life on the way. The reason for Yudhistira's entrusting Parikshit to Yuyutsa

might be the confidence reposed by the people in him as he belonged to an ancient royal family. Thereafter Parikshit won the affection of his people in his Government. As his rule was pleasing to all nobody raised a finger in opposition against him. It would appear that Durjaya the son of Duryodhana lived in his time. Mention is made of this by Bhasa in his drama known as 'Oorubhanga'. It is stated in Adharvaveda (20th Kanda) that a Kaurava who lived with Parikshit was building his house. This is found in A atareya Brahmmana that the Kauravas who lived with Parikshit were treated right royally with all the honours due to him self. Parikshit as well as the Kauravas of his time were honoured with the prefix of Nyumcha (prefixing sixteen omkarams before their names) before their names in Sacrifices. From the above facts, it is evident that the Kauravas regained their former glory during the reign of Parikshit in the kingdom of Kuru. Parikshit is said to have reigned for a period of 60 or 64 years. In his later days he insulted a rishi called Samika. His son Srungi thereupon incited Takshaka, the enemy of Arjuna to kill him and he (Parikshit) was treacherously killed by being made to eat poisoned fruits.

## JENAMEJAYA.

His father Parikshit was killed by Takshaka. The successors of Takshaka called Nagas built a city called Takshasila and lived in it. They were very arrogant and profligate and became notorious decoits. (They waylaid Udanka the schoolfellow of Janamejaya and robbed him of his property). For these reasons, Janamejaya invaded against Takshasila and conquered the Nagas. He caused their ringleaders nearly eighty in number to be cast into flames. This is known as Snake Sacrifice. This does not find a place in the Vedas. The brahmins of those times used to marry the Naga maids and procreate children. (Astika and Somasrava were born in the same manner). After the Snake Sacrifice Janamejaya conquered the whole of the country and performed Aswamedha. This is born out not only by the Puranas but by Ayataraya Brahmana also Jenamejaya was one of the greatest emperors of the Pandava race He was a religious peformer. Although his ancestors were doing religious rites according to Krishna Yajurveda, he performed Aswamedha under the auspices of

his purohit Tura son of Kavasha according to Sukla Yajurveda which came into vogue in his time. It is recited in Matsya Purana that even though Vysampayana took objection to his method of doing it, he did not mind it. Since the Aswamedha required the performance of obscene acts as in 'Aswaseva of Patni,' he caused the Aswamedha Sacrifice itself to be abolished. He was the cause of the spread of Sukla Yajurveda in Northern India. During his time therewere two rishis who advocated religious reform.

## SWAETAKETU

He was one of the famous pandits during the reign of Janamejaya. Mention is made of him in Brahmmanas, Upanishads, Puranas and Dharma Sutras. His father was Uddalaka. Up to his time, the custom of a woman being in the possession of one man was not in vogue. Uddalaka did not object to his wife being taken away by another brahmin and accordingly explained to his son how Sanatana Dharma gave women freedom of action. It is found in Brihadaranykopanishat that the sages Naka and Kumaraharita endorsed the view of Uddalaka. Swetaketu did not agree with this view and enforced the observance of the marriage rites.

## YAGNAVALKYA.

He was the rishi that contributed to the repaid extension of Sukla Yajurveda during the reign of Janamejaya. The Puranas say that he obtained this lore through the worship of the Sun but there are two clear recitals in Satapada Brahmmana and two in Brihadaranyakopanishat that he learnt Sukla Yajurveda from Uddalaka father of Swetaketu. He was a great pandit and outwitted many scholars of Janaka's Court. Bharatam was written during the reign of Janamejaya. The Rigveda branch of Sakalya, Sukla Yajurveda branch of Tura ond Yagnavalkya, and krishna Yajurveda branch of Tittiri were also composed during his reign. It is inferred from one of the recitals of Sage Bhujya in Brihadaranyakopanishat that some of the brahmins living from Madradesa to Mithiladesa were on account of their reverence for Jenamejaya discussing with one another ofter his demise as to which world he departed.

## SATANIKA.

Panchala, Kasi, Midhila and Magadha ruled respectively by the kings Pravahana. Ajatasatru, Ayastuna and Amitayu threw away the yoke of the kingdom of Kuru and declared themselves independent during the period of the reign of Satanika. He married the daughter of the king of Mithila. He was the disciple of Yagnavalkya. It is learnt from Chandogyopanishat (1—10) that his kingdom suffered from a famine on account of a hail storm. During the reign of his grandson Chaknu, the capital was removed from Hastinapur to Kausambi, the former having been submerged under the Ganges and ruined. Hastinapur was never repaired since. Its ruins are now found in the Meerut District.

## UDAYANA.

He lived in the 7th century B. C. He was the most famous of the kings of the Pandu dynasty that ruled Kausambi. His account is amply described in Kathasaritsagaram. The poets Bhasa and Subandhu composed dramas as well as Kavyams about him. Kalidasa also highly praised him. Nothing is heard of the Pandu line of kings after his demise,

—: o :—

## రెండవ ముద్రణకు

# ఉపోద్ఘాతము

తొలుత నేను భారతమును విమర్శించుచు నీ మహాభారత చరిత్రమును వ్రాయునపుడు ప్రథమ ముద్రణముఁ గావించి శ్రీ మల్లిడి సత్తిరెడ్డిగారు మహోప కారముఁ జేసిరి. ఆ పుస్తకముపై ననేకులు పండితోత్తములు తమ సదభిప్రాయము లిచ్చియున్నారు. అందీక్రిందివారు ముఖ్యులు.

మ.రా.శ్రీ 1. కట్టమంచి రామలింగారెడ్డిగారు (ఆంధ్ర యూనివర్సిటీ, వైస్ ఛాన్సిలరు.)

2. సర్. యస్. రాధాకృష్ణపండితులు (ఇప్పటి ఆంధ్ర యూనివర్సిటీ, వైస్ ఛాన్సిలరు.)

3. పండిత సీతానాధతత్వ భూషణుఁడుగారు (ఆంగ్లమునఁ గృష్ణుని గూర్చియు, భగవద్గీతలఁ గూర్చియు విపుల విమర్శనములతో గ్రంథములను వ్రాసినవారు. బ్రహ్మసూత్రములపైని ఉపనిష త్తులపైని నాంగ్లమున నిపుడు గ్రంథములను వ్రాయుచున్నారు. కలకత్తా నివాసులు)

4. డాక్టర్ వి. టి. హెచ్. థెన్ కర్, యం యే. (పునహాలోని భాండార్కార్ ఇనిస్టిట్యూషనులో జనరల్ ఎడిటరు, మీరు భారత మును బరిశోధింపుచు ముద్రించుచున్నారు. మహారాజాధిరాజులు గవర్నమెంటు వారు ఈ సంఘమునకు సహాయము చేయు చున్నారు.)

5. ఎ.వి. నరసింహము పంతులుగారు, మద్రాసు.

6. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు. సాహితీసమితి, (గుంటూరు.)

ఇంకను బెక్కండ్రు పండితులు సదభిప్రాయ మొసఁగిరి. తూర్పు గోదావరిజిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిలువారు ప్రథమ పాఠశాలల పుస్తకాగారములలో నీగ్రంథము నుంపననుజ్ఞ నిచ్చిరి. గవర్నమెంటు టెక్స్టు బుక్కు కమిటీవారు లైబ్రరీలనుంచుట కంగీకరించిరి. పత్రికలలో 'హిందూ, ఆంధ్ర, భారతి, త్రిలింగ, సమదర్శిని' పత్రికలు తమ సదభిప్రాయమునే యొసఁగియున్నవి. 'భారతీతీర్థ సంఘము'వారు నాకు 'పురాతత్వకోవిద' బిరుదమొసంగిరి.

ఆంధ్రభాషలో విమర్శన గ్రంథములు తక్కువ. మహాభారతమును తత్రస్థవ్యక్తులను విమర్శించుట మఱియును దక్కువ దుర్బలమానసులకట్లు విమర్శించుట భీతావహముగా నుండును. విమర్శించినవారి కేదేని యనిష్టము సంభవించు నని వారు తలంతురు నా నేత్రవ్యాధికిఁ గారణమిదియ యని యసూయాపరులు హేళనముచేయుటయే కాదు, కొందఱు మిత్రులును నయోక్తులతో నయనిష్ఠురోక్తులతోఁగూడ నను నీకార్యమునుండి మరలింపఁ బ్రయత్నించిరి. కాని, నా నేత్రవ్యాధికిని విమర్శనఫలమునకును సంబంధ మించుకంతయు లేదను దృఢవిశ్వాసము నాకుండుటచేతనె తిరిగి విమర్శించి కొంత యిపుడు విపులము చేసితిని. ప్రాచీనము లగు భారత రామాయణాదులపైఁ దెనుఁగున విమర్శన గ్రంథము లవసరము. వంగ మహారాష్ట్రాదిభాషలలోఁ బెక్కు లిట్టిగ్రంథము లున్నవి. ఈ యంశమునే నా భారతచరిత్రమును 'హిందూపత్రిక' విమర్శింపుచు తెనుఁగున నిది నవీనపద్ధతి యని వ్రాసి వెల్లడించినది.

ఆంధ్రులలో శ్రీ వేదము వెంకటాచలయ్యగా రొక విపులమగు భారత విమర్శనమును వ్రాసియున్నారు. కాని యది యాంగ్లమున వ్రాయఁబడినందునఁ గేవలాంధ్ర భాషాకోవిదులకు దుర్గ్రాహము. కీర్తిశేషులగు శ్రీ బొబ్బిలి మహారాజావారు నేఁటికి నిరువదై దేండ్లకుఁ బూర్వమె యింపుగా శ్రీకృష్ణుని గుఱించి చిన్న పుస్తకమును వ్రాసియున్నారు. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగా రొకప్పుడు మద్రాసులోని గోక్లేహాలులో నిచ్చిన మహాభారతోపన్యాసమె పెక్కండాంధ్రులను భారతముపై దృష్టిని మరలించిన దనవచ్చును 'బంకిన్ చంద్ర ఛటర్జీ'గారి శ్రీకృష్ణ చరిత్రమును రెండు భాగములుగా 'ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల'వా రాంధ్రీకరించి ముద్రించియున్నారు. బ్రహ్మశ్రీ చర్ల నారాయణ శాస్త్రిగారు హిందీలోని 'భారత మీమాంస'ను గొంత తెనిగించియున్నారు. ఇప్పటికి ముప్పదియైదేండ్లకు ముందే రావుబహద్దరు పనప్పాకము అనంతాచార్యులు గారును విమర్శకాగ్రేసర బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగా రిరువదై దేండ్లకు ముందు కురుపాండవ దాయభాగనిర్ణయములఁ గూర్చి గ్రంథములు వ్రాసియున్నారు. బ్రహ్మయ్యశాస్త్రిగారి గ్రంథమును ఖండింపుచు బ్రహ్మశ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు 'కురుపాండవ దాయభాగ వినిర్ణయ' మను మఱియొక గ్రంథమును వ్రాసియున్నారు. సుయోధన పాత్రౌచిత్యమును విశదీకరింపుచు శ్రీ కోటమర్తి రఘుపతిరావుగారు 'సుయోధన విజయము' అను నొక చిన్న నాటకమును వ్రాసియున్నారు. కాని పాండవుల యంత్యదశలోఁ గల దేశస్థితిగాని పరిక్షిజ్జనమేజయుల చరితముగాని యిదివర కెవ్వరును వ్రాయలేదు. (పరిక్షిజ్జనమేజయాదులఁ గూర్చి యీ ముద్రణమునఁ గొంత వివ

రించితిని.) పరిక్షిజ్జనమేజయుల యొక్కయు వారి తరువాత నుండు రాజుల యొక్కయు చరిత్రము వ్రాయుట యత్యవసరము. పరిక్షిత్తును జనమేజయుని గూర్చి భారతములోను పురాణములలోనె కాక అథర్వ సంహితలోను శతపథ, ఐతరేయ బ్రాహ్మణములలోను ఉపనిషత్తులలోను నచటఁ నచటఁ జెప్పఁబడియున్నది. జనమేజయుని కాలమునను ఆతనికిఁ బిమ్మటను నుండినట్టియు భారతమునను వైదిక వాఙ్మయమునను బెక్కుచోటుల వర్ణింపఁ బడినట్టియు 'ఆపస్తంబుని'చేఁ బొగడఁబడినట్టియు, వివాహవిధి నేర్పఱచిన 'శ్వేతకేతు' మహర్షి యొక్కయు నాతనిసహాధ్యాయుఁడుగాఁ గాన్పించునట్టియు శుక్లయజుశ్శాఖ ప్రచారకుఁడై మహర్షివంద్యుఁడై కురు, మిథిల దేశప్రభువులకు గురువై జనమేజయునిచే గౌరవింపఁబడినట్టియు యాజ్ఞవల్క్యమహర్షి చరితము భారత చరితముతో సంబంధించి వర్ణింపఁ బడుట యవసరము.

నేను తొలిముద్రణమైన పిమ్మటను, మద్రాసులోని క్రిస్టియన్ కాలేజి, లయోలా కాలేజి, పచ్చయప్ప కాలేజీలలో నచటి పండితులు కోరుటచే భారత విమర్శనముతోఁ గూడిన యుపన్యాసముల నిచ్చితిని పైమూఁడు కళాశాలలోను మొదట నొక్కొక యుపన్యాసమునకే వారాహ్వానించినను నాయుపన్యాసాంశములు క్రొత్తగ నుండుటచే నచటి పండితులు విద్యార్థులు మఱియొక యుపన్యాస మీయుమనికోరుటయు మఱునాఁ డింక నొక యుపన్యాస మిచ్చుటయు జరుగుచుండెడిది. ఇట్లు పైమూడు కళాశాలలలోను నా ఉపన్యాసముల నిచ్చితిని. క్రిష్టియన్, లయోలా కాలేజీలలో నిశ్శబ్దముగానె నాయుపన్యాసముల నాలించిరి. కాని గడచిన నవంబరు (1982 సం॥) నెలలో మ. రా. సర్. కూర్మా వెంకటరెడ్డి నాయుఁడుగారి యాధిపత్యమున పచ్చయప్ప కళాశాలలో నే నిచ్చునుపన్యాసమున. సందర్భానుసారముగ 'అశ్వమేధములోని యశ్వసేవ'ను గూర్చి చెప్పునప్పుడు కొందఱు కేకలు వైచిరి. అపుడు శ్రీ విద్వాన్ గంటిజోగి సోమయాజులు యం యే. యల్.టి. గారు ఈయంశము నీనాఁటిరాత్రి నేను చదివి రేపు సభలో యథార్థముఁ జెప్పెదను గాన మఱునాఁడు తిరిగి యుపన్యసింప రమ్మని కోరి యట్లు సభ చేయించిరి. ఆ సభకు మ. రా. శ్రీ సామి వేంకటాచలము సెట్టిగారగ్రాసనాధిపులైరి. ఆ సభారంభముననే శ్రీ సోమయాజులుగారు లేచి నిన్నటిదినమున శాస్త్రిగారు చెప్పిన యశ్వసేవావిధానము సత్యముగా నట్లే యున్నది గాని యసత్యము కాదని చెప్పుటచే నందఱును సావకాశముగా నా యువన్యాసము నాలకించిరి ఇట్లని నా పుస్తక మందఱివలనను గౌరవింపఁబడినదని కాదు నా పుస్తకములోని యంశముల నీక్రిందివారు విమర్శించి దూషించిరి.

1. చతుర్వేదుల రామవయ్యగారు హిందూ బాంధవీ పత్రికాధిపతులు. (నెల్లూరుజిల్లా పల్లెపాడు.)
2. ఇంద్రగంటి సూర్యనారాయణగారు. ఎలిమెంటరీ స్కూలు మాష్టరుగారు (పెద్దాపురము తాలూకా వీరవరము.)
3. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు. (వజ్రాయుధ పత్రికాధిపతులు, శ్రీకృష్ణ భారతకర్తలు, రాజమహేంద్రవరము.)
4. కేశవరపు వేంకటశాస్త్రిగారు. (ఎ వి. యన్ కాలేజీపండితులు. విశాఖ పట్టణము )

పైవారి ఖండనముల కాయాపట్టుల నీ ద్వితీయ ముద్రణమున సమాధానములు నిచ్చియున్నాను. (2) ఇంద్రగంటి సూర్యనారాయణగారికి సంస్కృతము రాదు. మన్మథనాథదత్తుగారి యాంగ్లీకరణములోని యాదిసభాపర్వములను తెనుఁగు భారతమునె యాధారపఱచుకొని విమర్శింప నారంభించిరని తోఁచును. దత్తుగారి యాంగ్లీకరణమునకు సరియగు సంస్కృతశ్లోకములను మాయూరి పండితులకడనుండి వ్రాసికొని వెళ్ళుచుండు వారఁట! ఏకారణముననో వీరివ్యాసములను శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ వజ్రాయుధ పత్రికలో ముద్రింప నిరాకరించిరని వినియుంటిని 'హిందూబాంధవి' పత్రికలో నొకటి రెండు వ్యాసములే తమవాదమున కుపోద్ఘాతముగా సూర్యనారాయణగారు వ్రాసి యంతటితో ముగించిరి. కాన నిస్సారమగు వారి యభిప్రాయములకు నాయీ ముద్రణమున సమాధాన మీయనవసరము లేకపోయినది.

(1) చతుర్వేదుల రామవయ్యగారు నా పేరికిముందు 'డిండిమ' బిరుదముతో నధిక్షేపించుచు నైదాఱు వ్యాసములు తమ 'హిందూ బాంధవి' పత్రికలోఁ బ్రచురించిరి. నాకొక యుత్తరము నధిక్షేపింపుచు వ్రాసిరి. అందు నాతోఁ గూడ శ్రీ వేదం వేంకటాచలయ్యంగారిని కూడ నిరసించిరి. వారి వ్యాసములోని ముఖ్యాంశములకు నాయాపట్టుల సమాధానమును వ్రాసియే యున్నాను.

(3) శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, అధునాతనాంధ్రకవులలో వీరు మహాదృష్టవంతులు. ఆంధ్రావనిలో వీరు చూడని సంస్థానము లేదు. వీరి కుండినన్ని బిరుదము లీనాఁడె కాదు, ప్రాచీనాంధ్ర కవులకును - ఆంధ్రకవులకె కాదు- సంస్కృత కవులకును లేవు. శ్రీనాథున కుండిన కవిరాజ కవిసార్వభౌమ బిరుదములు వీరికిఁ గలవు. (కూచిమంచి తిమ్మకవికిని కవిసార్వభౌమ బిరుదము కలదు.) శ్రీనాథుఁ డొందిన కనకాభిషేక గౌరవము, అల్లసాని పెద్దన పొందిన 'కవి గండపెండేర' గౌరవము వీరికి గలిగినది. కాని 'దగ్గుపల్లి దుగ్గకవి' శ్రీనాథున కుండె ననిన 'సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్యభాషా పరిజ్ఞానపాట

వంబు, పన్నగపతి సార్వభౌమభాషిత మహాభాష్య విద్యా సమభ్యాసబలము, అక్ష పాదకణాదపక్షిలో దీరితన్యాయ కళాకౌశలము, స్మృతిసాంఖ్య సిద్ధాంత కబళన వ్యుత్పత్తి గౌరవము' వీరికిఁగలదా? అన్నియుఁ గాకుండినఁ గొన్నియేనుండెనా? అందువలననే వీరికిఁ గనకాభిషేకాది గౌరవములఁ జేయుట యుక్తము కాదని కొందఱు తలంతురు. వీరు పెక్కు గ్రంథములను వ్రాసిరి. వీరు భారతము నాంధ్రీకరించుట యను పెద్ద పనికిఁ బూనుకొనిరి. వేదశ్రౌతస్మార్తములను వీరు చదివినట్టులు చెప్పుదురు. బిల్హణీయమున 'నైవవ్యాకరణజ్ఞమేవ పితరం' అను శ్లోకములో ఛాందసునకుఁ గవితా కన్య సంకోచపడుచు దూరముగాఁ దొలఁగు నని వ్రాసియుండెనే కాని కృష్ణమూర్తిశాస్త్రిగారిని కవితా కన్యక వరించి శోభించినది. వీరు పెక్కులు పత్రికలు స్థాపించి కొంత కొంత కాలము నడపిరి. సారస్వత సేవచేసి వారి జీవితమును ధన్యము చేయుచున్నారు.

భారతము నాంధ్రీకరింపుచుండుటచే నెవరు భారతమును విమర్శింపు చుండినను వారిపైఁ దమరు ప్రచురింపుచుండు పత్రికలలో ఖండనములకుఁ గడంగుదురు. ఇందులకై బ్ర. శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, గరికపాటి రామమూర్తి, కోటమర్తి రఘుపతిరావు గార్లపైఁ జేసిన విమర్శనములే నిదర్శనములు.

భారతముపై విశేషాభిమానముఁ జూపు కృష్ణమూర్తి శాస్త్రిగారు నేను నవీనపద్ధతిగా విమర్శింప మిన్నకుందురా? క్రిష్టియన్ కలాశాలలో నేఁ జేసిన యుపన్యాస మాంధ్ర పత్రికలోఁ బ్రచురితముకాఁగానె తమ వజ్రాయుధ పత్రికలో నాపై దాడి వెడలు సూచనలు జూపిరి. 'లయోలా' కలాశాలలో నధునాతనుల భారతాంధ్రీకరణము సంస్కృతమునకు సరిగా లేదని నేఁ జెప్పుచుఁ గృష్ణమూర్తి శాస్త్రిగారి నామము నుచ్చరించితిని. అదియే సాకుగాఁ గొని తమ వజ్రాయుధమును నాపై మోపెట్టిరి. పిమ్మట వారు వెళ్ళిన రెండు పండిత సభలలో నన్నును నా గ్రంథమును గర్హించు తీర్పులు వొడసూపినవి ఇందులకు కలువాయి, ముక్తీశ్వర ములలో జరిగిన సభలే నిదర్శనములు. కాని యవి యయుక్తములు. కలువాయి లోని నిరాకరణపు తీర్పయుక్త మని 'ఫెడరేటెడ్డు ఇండియా' యను ఆంగ్ల వార పత్రిక యిట్లు నిరసించినది.

Finally a resolution was accented condeming in unmeasured terms the work of Pendyala Subrahmanya-sastry of Pithapuram who is alleged to have c mmitted the sin of criticising Bharatam and its author. It is unfortunate that our sence of veneratation to all that

is ancient should be so keen as to resent any criticism. Literary citicism is at its lowest ebb in Andhra and if the few who courageously come out with views of their own should be hunted out, I am afraid we are not advancing the cause of literature to any extent. Persons conversant with English literature know but too well how how strongly Shelly and Keats were criticised in their time though they are two of the greatest poets in the English Language. Perhaps the criticism made them great or helped them to become what they have become. Pendyala sastry might have exceeded his limits but to cry down such critics wholesale is not conducive to the developement of Andhra literature. I hope this aspect will commend itself to the Pandits and Others who may be concerned with Telugu literature and its future.

ముక్తేశ్వరములో ది 31-8-29 న ఆంధ్ర సాహిత్య పరిషద్వార్షికోత్సవమునకు వచ్చిన పండితులలోఁ గొందఱఁ గూర్చికొని నా భారత చరిత్రమును నిరాకరణముఁ జేయు తీర్పుకై ప్రత్యేక సభలు జేయించిరి. ఆ సభ కగ్రాసనాధిపులు శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులు గారు, నిరాకరణోపపాదకులు బ్రహ్మశ్రీ జనమంచి శేషాద్రి శర్మగారు. నిరాకరణోపపాదనము కాఁగానే తత్కాలగతులగు బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రిగారు ఈ తీర్పుఁ బెట్టుటకు సుబ్రహ్మణ్య శాస్త్రి యొక్క మహాభారతచరిత్రముఁ జదివిన వారెవరని యడుగ నెవడును దాము చదివినట్లు చెప్పలేదు గాని కృష్ణమూర్తి శాస్త్రిగారే తాము చదివితి మని పుస్తకసహితులై లేచిరట! (దానంజేసియే కృష్ణమూర్తిశాస్త్రిగారి ప్రోత్సాహముచేతనే యీసభకూర్పఁబడినట్లు తేటపడెను.) ఈ నిరాకరణ సభకు ముఖ్యకారణము నా పుస్తకములో వ్యాసాదులను నేను నిందింపుచు వ్రాసితి ననుటయే! ఆ యంశములే కృష్ణమూర్తిశాస్త్రిగారు సభలోఁ జదివిరట. ఇతరుల కెవరికి నా యంశమే తోఁచలేదు. ఆ సభ యాభాస సభయే యైనది. అందువలననే పత్రికలకు రిపోర్టు చేయఁబడలేదు. కృష్ణమూర్తిశాస్త్రిగారి వజ్రాయుధములో మాత్రము కలదు. నేను వ్యాసాదులంగూర్చి విమర్శించుటకుఁ గృష్ణమూర్తిశాస్త్రిగారి విమర్శనములను నేఁజదువుట కూడ నొక కారణమై యున్నది. వారు నా గ్రంథమును నిరాకరింపుచు వ్రాసిన వ్యాసములలోను ఆ

వ్యాసముల నన్నిటిని జేర్చికూర్చిన 'శ్రీ మహాభారత చరిత్ర నిరాకరణము' అను గ్రంథములోను నేను వ్యాసాదులను నిందించితి ననియుఁ బురాణపురుషులను నిందించితి ననియుఁ, బెక్కుసారులు నన్ను దూషించిరి. కాని నా పుస్తకమునకుఁ బూర్వమే వారు వ్యాస, భీష్మ, బలరామ, శ్రీరాములఁ గూర్చి యెట్లు వ్రాసిరో దిఙ్మాత్రముగా వ్రాయుచున్నాఁడను.

కృష్ణమూర్తిశాస్త్రిగారు 'కురుపాండవదాయభాగ విమర్శనము'న వ్యాసుని గూర్చి యిట్లు వ్రాసిరి.

(1) "ధర్మశాస్త్రము మాటకేమిగాని, మహానుభావుఁడై యడవులలోఁ దపము చేసికొను వ్యాసుఁ డంతవాఁ డిట్టిపాడు పనికియకొనెనని మన మొప్పు కొనుచున్నప్పుడు రెండు మూఁడు తడవులకు సందేహించి చర్చింపవలసి యున్నదా?"

అడవులలోఁ దపము చేసికొను వ్యాసుఁడు రాజాంతఃపురముఁ జొచ్చి 'అంబికాంబాలికలను దాసిని' గూడి బిడ్డలఁ గనుట, 'ఒకటికాదు, రెండుకావు, మూఁడుసారులు చేసిన- పాడుపను లనియే కృష్ణమూర్తిశాస్త్రిగారి ముఖ్యాభిప్రాయము. (మానవసేవ పత్రిక 19.2 అగష్టు సంచిక.)

భీష్మునిగూర్చి యిట్లు తమ వజ్రాయుధపత్రిక (1927 సంIIరము అక్టోబరు సంచిక)లో వ్రాసియున్నారు.

(2) 'భీష్ముని మెచ్చుకొనినారు దానికి సంతోషింపవలసినదేకా? భీష్ముని బ్రహ్మచర్యము స్వచ్ఛందమైనది కాదు. తండ్రి కోర్కెం దీర్పవ్రతంబుం బూనె గాని విరక్తుండై కాదు. అది యుత్తమ మన నొప్పదు. భీష్ముం డుత్తమపాత్రమే గాని తాను సమర్థుండై యుండియు నెవరికిం జెప్పవలసినట్లు వారికిం జెప్పి యుద్ధము గాకుండం జేయవలయు. అటులం జేయక తానొక పక్షముం జేరి పాండవులతో ఖండనముం జేసినాఁడు సరే! దుర్యోధనునియుప్పుఁ దినుచున్నాఁడఁట! అందుఁజేత యుద్ధముం జేసినాఁ డనుకొందము. తన చేరినపక్షమునకుఁ జేటుగాఁ దనచావునకు మార్గము తానే చెప్పి పరులకు లోలోన సలహా నిచ్చినాఁడు. ఇది స్వామిద్రోహము కాదా? స్వామిద్రోహపాతకము సామాన్యమా?"

(శ్రీ మంగిపూడి పురుషోత్తమశర్మగారి భీష్మచరిత్రము యొక్క ప్రథమ ముద్రణమునకుఁ బీఠిక వ్రాయుచుఁ గృష్ణమూర్తిశాస్త్రిగారు భీష్ము నించుమించుగఁ బైరీతినె విమర్శించిరి.)

(3) "బలరాముఁడు దుర్యోధన పక్షపాతి యనియే నా యభిప్రాయము. దుర్యోధనుఁడు బలరామునియొద్ద గదాయుద్ధము నేర్చిన ముఖ్య శిష్యుఁడు. తన చెప్పిన విద్యలో భీముఁ డట్లు చేసినప్పుడు కోపమువచ్చి రాముఁ డట్లు పలికినాఁడు.

అతని కా శిష్యునిపైఁ బ్రేమయున్నది. దానిం బురస్కరించుకొని వానికి యుద్ధములో సాహాయ్యముఁ జేయుటకుఁ బోవలసినదేకదా? తన తమ్ముఁడు పాండవ పక్షమున నుండెను. తమ్ముని కెదిరి పోరుట కిష్టము లేక యెటు చేయుటకును వీలు లేదని తీర్థయాత్రకుం బోయినాఁడు. కాని యుభయ పక్షములను సమాన మగుటచే నట్లు చేసినవాఁడు కాఁడు". (వజ్రాయుధపత్రిక.)

(4) "వీరు (గరికిపాటి రామమూర్తిగారు) రాముని మాత్ర మవతార పురుషుఁడని యన్యాయము లేనివాఁడని వ్రాసిరి. సంతోషమే గాని మాట వరుసకుం జెప్పుచున్నాము. రాముఁడు మహానుభావుఁడే కదా, లోకవృత్తముతో నవసరములేక యొకరి జోలికిం బోక యొక యడవిలోఁ గూర్చుండి ముక్కు మూసికొని తపముఁజేయుచున్న శంబూకుని తల నఱికినాఁడు. ఇది న్యాయమా? వాలి సుగ్రీవులు పోరాడుచుండఁ జాటు నుండి వాలిం దెగవేసినాఁడు. ఇది న్యాయమా? అగ్నిశుద్ధిం బొందియున్న సీతను సంపూర్ణ గర్భవతిని నరణ్యములకుం బడఁద్రోసినాఁడు. ఇది న్యాయమా?" (వజ్రాయుధ పత్రిక. సంపుటము 2. సంచిక 9).

(2, 3, 4 అంశములు శ్రీ గరికపాటి రామమూర్తి బి.ఎ గారి వ్రాతలను ఖండింపుచు కృష్ణమూర్తి శాస్త్రిగారు వ్రాసినవి).

ఇట్లు వ్యాసభీష్ములనే కాక శ్రీమన్నారాయణావతారము లగు బలరామ శ్రీరామచంద్రమూర్తులను విశేషముగాఁ దెగనాడిన కృష్ణమూర్తి శాస్త్రిగారు నేను వ్యాసాదులను నిందించితి నని 'ముక్తీశ్వర'పు సభలోఁ జెప్పుటయు శ్రీ మహాభారత చరిత్ర నిరాకరణము వ్రాయుటయు నెట్టివిశేషమో చదువరులకే తెలియఁ గలదు

వారంతటితోఁ దృప్తినొందక వజ్రాయుధపత్రికలో నన్నును నా గ్రంథమును, నా కులమును, నా విద్యను, నా వృత్తిని దూషింపుచు నైదుమాసములు వ్యాసములు వ్రాసి ప్రచురించుటయేకాక యఱువదినాలుగు పుటలు గల 'శ్రీ మహాభారత చరిత్ర నిరాకరణము' అను గ్రంథముఁ జేసి ప్రచురించినారు. నేను మూఁడు మాసములు సహించితిని గాని దూషణోక్తులు మితిమీఱి యుండుటచే 'సమదర్శిని' పత్రికకుఁ బ్రత్యుక్తులుగాఁ గొన్ని వ్యాసముల నంపితిని. ఆ వ్యాసములలో నొక వ్యాసము (ది. 24-4-29 సం.) కృష్ణమూర్తి శాస్త్రిగారి కోపమునకు హేతువగుటచే వెంటనే వారు రాజమహేంద్రపురములోని జాయంటు మేజిస్ట్రేటువారికడ నాపై నభియోగముం జేసిరి. వారికిఁ దొమ్మండుగురు న్యాయవాదులు. మహామహులైన మ.రా. జయంతి రామయ్యపంతులుగారు, ఆమ్నాయార్థవాచస్పతి వడలి లక్ష్మీనారాయణశాస్త్రిగారు, అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు,

నాళం కృష్ణారావుగారు మొదలగువారు సాక్షులు. కోర్టున కెపుడును బోవని నా కిది భయావహహేతువె యయ్యెను. శాస్త్రిగారిపక్షపుసాక్షు లగు నాళం కృష్ణారావుగారిని, అద్దేపల్లి లక్ష్మణస్వామిగారిని, నేను మీరి మధ్యవర్తులరై తీర్పుఁ జెప్పుఁ డనియు వారు చేసిన దూషణముఁ గూడఁ జూడుఁ డనియుఁ గోర మధ్యవర్తిత్వమునకు వారిష్టపడి కృష్ణమూర్తిశాస్త్రిగారితోఁ జెప్ప వారి మధ్యవర్తిత్వమునకు శాస్త్రిగారంగీకరింపలేదఁట! అందువలననే కాఁబోలు వారు తిరిగి సాక్షులుగా నెపుడును రానేలేదు! శాస్త్రిగారు నేనొంటరిగా నుండునపుడు నన్నుపహాస్య మాడుచు ధిక్కృతవాక్యముల ననుచుండిరి. సమదర్శినీపత్రికా ముద్రాపకులు తదధిపులుకూడ నాతో సమానముగా ముద్దాయిలైరి కాని వారు మద్రాసునుండి వచ్చి శాస్త్రిగారికి క్షమాపణము నిచ్చిరి నేనుగూడఁ గొంత కాలము తాళి పెద్దాపురపు డివిజనలు మేజస్ట్రేటుకోర్టున కృష్ణమూర్తిశాస్త్రిగారి పైని, వజ్రాయుధపత్రికకు సహాయాధిపులగు వైయాకరణ కేసరి పుల్లెల ఉమామహేశ్వరశాస్త్రిగారిపైని ముద్రాపకులగు బోడపాటి శివరామయ్యగారిపైని నభియోగముఁ దెచ్చితిని పండితులు పామరులవలె కలహించి కోర్టున కెక్కుట వ్రీడాకరమె యని చాల విచారించితిని కాని యది తప్పని దయ్యెను. నా యభియోగము వారి యభియోగము రాజమహేంద్రవరములోని ఆనరెరి ఫస్టుక్లాసు మేజస్ట్రేటుగారు దీర్ఘకాలము జరిపి విచారించిరి. ఆఱువది వాయి దాలకుఁ బైఁగా వాయిదాలు పడినవి. నేను సేవకునితోఁ బిఠాపురము నుండి కోర్టునకు వెళ్ళివచ్చినందులకే చాల వ్యయ మయ్యెను నా పక్షమున బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి, మద్యపానము అని యుచ్చరించు న్యాయ వాదులు కాక, భాషాపాండిత్యము గల మ. రా. కొల్లూరు సోమనాధశర్మ బి.యే. గారును కేశవరపు కామరాజుపంతులు బి. యే గారును న్యాయవాదులై ప్రశంస నీయముగాఁ బనిచేసిరి నాకు బంధువులగు శ్రీ మైలవరపు సాంబశివరావు బి యే. గారు నా కభియోగమునఁ గల్గుభీతిని బోఁగొట్టుచుఁ జాలసహాయముఁ దాము చేయుచుఁ దమకు కోర్టునకు రావీలులేనపుడు శ్రీ ప్రయాగ చలపతిరావు బి. యే. బి యల్ గారిని సోమనాధశర్మగారికి సహాయముగా నంపుచుండిరి. ఇట్లా యభి యోగము 'ఒక సంవత్సరముపై' నేడు మాసములు జరిగినది. "ప్రాఁబడిపోయెఁ గాక కవిరాణ్మణి కన్నదియేమి?" వారి కిరువదియు నా కిరువదియు రూప్యములు సమానముగా మాజస్ట్రేటుగా రపరాధము విధించిరి. ముద్రాపకులు నాకు క్షమా పణమును వ్రాసి యిచ్చుటచేతను, ఉమామహేశ్వరశాస్త్రిగా రనపరాధు లగుట చేతను విముక్తులైరి. శాస్త్రిగారు తమపక్షపువారిని రెండుసారులు తేకుండుటచే నాకు నష్టపరిహారముగా 'పంద్రెండు రూప్యములను' కోర్టువారు ముదరా నిప్పిం

చిరి. కృష్ణమూర్తిశాస్త్రిగారు నాపైఁ జేసిన యభియోగములో విశేషాంశము లుండునని కాఁబోలు, వారి యభియోగాంశముల నన్నిటిని వారిసాక్ష్యములతోఁ గూడ 'రెడ్డిరాణి పత్రిక'వారు తమ పత్రికలో 'పండితాభియోగము' అను గ్రంథముగాఁ బ్రకటించిరి: వారు తమ భారతమును ముక్త్యాలరాజావారు మొదలగు వారి కెవరికిని గృతిసీయలేదని సాక్ష్య మిచ్చుటగాని 'నీచార్థము లాసఁ జేసి కృతులం బొందించి మందాత్ములన్' అను పద్యములోఁగల యర్థవిశేషములతోఁ గాని నాకు నిమిత్తములేదు గాని నేను వారిపైఁజేసిన యభియోగములో నేను భారతములో నొక్క శ్లోకమునకైన నర్థముఁ జెప్పలేననుటకుఁ గృష్ణమూర్తిశాస్త్రిగారీక్రింది విధముగాఁ దమ 'స్టేటుమెంటు'లోఁ గూడ వ్రాయుటమాత్రమె వింతఁగా నున్నది. చూడుఁడు. "ఏ భారత ఘట్టమందైనా యొక్క శ్లోకమునకు అర్థము చెప్పగలరా?" అని మేము అంటిమి. భారతము విమర్శించుటకు వీరికి భాషాజ్ఞానము చాలదని మా యభిప్రాయము. చాలినంత భాషాజ్ఞాన మున్నయెడల వారుదాహరించిన శ్లోకములోని యర్థము వారు తెలుసుకొనలేక తప్పుదారిం బడి తప్పులు వ్రాయరు. ఆ శ్లోకముల కపార్థములు చేసినారు. "సంహితాస్తైః పృథక్త్వేన భారతస్య ప్రకాశితాః" అనగా సుమంతు జైమిని ప్రభృతులు భారతమును వ్యాసుల వారివద్ద చదివి దానిని లోకములో ప్రకాశింపజేసినారని యర్థము కాని వారు భారత సంహితలం జేసిరని యర్థము కాదు. వ్యాసులేకాక సుమంతు ప్రభృతులు భారత సంహితలం చేసిరని తప్పర్థము లోకప్రతారణము నిమిత్తము చేసియున్నారు. అపార్థము కల్పించినారు. ఇత్యాదులచే వారికి శ్లోకార్థము కాలేదని వ్రాసినాము ఇట్లు విమర్శించుట సరియైనదే కాని తప్పుకాదు"

(పైది కోర్టునుండి పుచ్చుకొనిన స్టేటుమెంటు నకలు)

కృష్ణమూర్తి శాస్త్రిగారట్లు స్టేటుమెంటును వ్రాయుటకుఁ గారణము వారి నిరాకరణ గ్రంథములో నన్ను దూషించిన దూషణములు ముప్పది యారింటిలో నాకు భారతశ్లోక మొక్కటియైన నర్థము కాదనియు శబ్దజ్ఞానము లేదనియు నేను లోకప్రతారణము చేయువాఁడ ననియు నా భారత చరిత్రయొక్క మొదటి ముద్రణము (24 పుటలోను రెండవ ముద్రణము 29 పుట) లోను శ్లో. వేదానధ్యాపయామాస మహాభారత పంచమాన్ సుమంతుం జైమినిం పైలం శుకం చైవ స్వమాత్మజం॥ ప్రభుర్వరిష్ఠో వరదో వైశంపాయన మేవచ। సంహితాస్తైః పృథక్త్వేన భారతస్య ప్రకాశితాః। (ఆదిపర్వ 89. 90) అను శ్లోకములకుఁ దాత్పర్యము, "వ్యాసుఁడు వేదములను భారతమును సుమంతుఁడు, జైమిని, పైలుఁడు, శుకుడు వైశంపాయనుఁడు ననుశిష్యులచేఁ జదివించెను. వారైదు గురు వేర్వేఱుగ నైదు భారతసంహితలం జేసిరి" అని వ్రాసితిని. దీనికి నిదర్శనముగా

'ఆశ్వలాయన గృహ్యసూత్రము'లోని, సూ. సుమంతు జైమిని వైశంపాయనపైల సూత్రభాష్య భారత మహాభారత ధర్మాచార్యాః (3-4-4) అనుదానిలోఁ గూడ సుమంత్వాదులు వేర్వేఱు భారతసంహితాకారు లని స్పష్టపడుచున్న దనియు వ్రాయఁగా దానికి నన్ను మిగులదూషించుచు రఘువంశము చదివినవానికైన నీటి యర్థమగు చుండఁగా వీరి కర్థము కాలే దనియు ఇట్లు శబ్దార్థ జ్ఞానము లేని వీరు విమర్శకులగుట లోకదురదృష్ట మనియు జోడు కాఁగడాలు వేసి చూచినను సుమంత్వాదులు వేర్వేఱు భారత సంహితఁ జేసినట్లు లే దనియు నెంతవఱకు వ్రాయవలయునో యంతవఱకు వ్రాసిరి. వారి శ్రీకృష్ణ భారతములో (1 సంపుటము 15 పుట) శ్లోకముల సారాంశముగా (వ్యాసుఁడు) "భారతార్థంబుఁ బ్రబలింప వాని నెల్ల శిష్యులగు సుమంతు జైమిని పైల శుక వైశంపాయనులకుం బ్రబోధించి" అని వ్రాసిరి పైశ్లోకములు భారతసంహితయొక్కటియా? లేక పెక్కులా? అను విమర్శనమున కత్యవసరములై యున్నవి. పై శ్లోకముఁ గూర్చియు 'ఆశ్వలాయనుని' పైసూత్రముఁ గూర్చియు నీక్రింద చెప్పఁబడు పండితులు విశేషముగా విమర్శించి నేఁ జెప్పినయర్థమునే చెప్పిరి.

(1) లోకమాన్య బాలగంగాధర తిలకు (గీతారహస్యమున) మహారాష్ట్ర భాషలో.

(2) బ్ర శ్రీ. నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (ఆంధ్రీకృత గీతా రహస్యమున 719 పుటలో.)

(3) రావుబహద్దరు, చింతామణి వైద్య పండితుఁడు (భారత విమర్శనమున) ఆంగ్లములో

(4) మ. రా. శ్రీ. మాడపాటి హనుమంతరావుగారు (ఆంధ్ర భారతి 1914 మెయి సంచిక.) మహా భారత సమీక్షణమను వ్యాసమున.

(5) బంకిన్ చంద్ర ఛటర్జీ (శ్రీకృష్ణ చరితము మొదటి సంపుటమున, వంగ భాషలో.)

(6) వేంకట పార్వతీశ్వర కవులు ఆంధ్రీకృత శ్రీకృష్ణ చరితమున.

(7) సప్రేపండితుఁడు భారత మీమాంసలో (హిందీలో)

(8) బ్ర శ్రీ చర్ల నారాయణశాస్త్రిగారు (భారత మీమాంసా వ్యాసమున) తెనుఁగులో.

(9) ప్రతాప చంద్ర రాయి ఆంగ్లీ కృత భారతమున.

(10) వేదం వేంకటాచలయ్యగారు (మహా భారత విమర్శనమున) ఆంగ్ల భాషలో.

(11) శ్రీ తేవప్పెరుమాళ్ళయ్యగారు సంస్కృత భారతమును తెనుఁగు వచనముగా నిట్టి శ్లోకములకుఁ జేసిరి.

"విద్వాంసుడును సమర్థుండును వరిష్ఠుండును ధర్మప్రదుండు నగు నా బ్రహ్మర్షి, సుమంతుఁడు, జైమిని, పైలుఁడు, తన పుత్రుడయిన శుకుఁడు, వైశంపాయనుఁడు నవెడి యేవురు శిష్యులను బిలిచి నియమంబున ఋగ్యజుస్సామాథర్వణము లనెడి నాలుగు వేదములను, ఐదవ వేదమైన మహాభారతమును, నధ్యయనము చేయించెను ఆ శిష్యులచే వేద సంహితలును భారత సంహితలును వేఱువేఱ చెప్పఁబడినవి"

పైఁ బదునొకండు మందియుఁ బై శ్లోకములకు 'వ్యాసుఁడు సుమంత్వాదులకు వేదములను మహాభారతమును జెప్పె ననియు సుమంత్వాదులు వేర్వేఱు భారత సంహితలఁ జేసి'రనియే తాత్పర్యముఁ జేసిరి. మొదటి యెనిమిదిమంది పండితులును బై శ్లోకములకు బలము కలిగించుటకు 'ఆశ్వలాయనుని గృహ్యసూత్రమునె' సాక్ష్యముగాఁ జూపిరి. తిలకుపండితుఁడు సుమంత్వాదుల భారత సంహితలు నశించుటకును, వైశంపాయన భారతము జైమిని యొక్క భారత భాగమగు 'అశ్వమేధపర్వము' నిలుచుటకు నేదియొ కథ కలదని గీతారహస్యములో వ్రాసియున్నాఁడు. (చూ. తెలుఁగు గీతారహస్యము 719 పుట) వేదం వేంకటాచలయ్యగారు 'సుమంత్వాదుల' భారత సంహితలకు వ్యవస్థను నిరూపించుచు వ్రాసియున్నారు. బంకిన్‌చంద్ర ఛటర్జీ శ్రీకృష్ణ చరిత్రమున మఱియొక పాశ్చాత్య పండితుని మతము నిందులకు బలముగాఁ జూపియున్నాఁడు. ఇందఱిలో 'తిలకు'ను బ్రఖ్యాత సంస్కృత పండితుఁ డందురు. నేను లోకప్రతారకుఁడ (సుమంత్వాదుల భారత సంహితలఁ జేసిరనుటచే) నైనటుల తిలకు కూడ పై యర్థమునే చెప్పి లోకప్రతారకుఁ డయ్యెనా! (అతనిని లోకమాన్యుఁ డందురే!) నేను రఘువంశముఁ జదువలేనట్లు (కృష్ణమూర్తి శాస్త్రిగారి మతమున) ఆంధ్రదేశస్థ పండిత మండలాగ్రగణ్యులును బహుశాస్త్రవేత్తలు బహుభాషా కోవిదులును కృష్ణమూర్తి శాస్త్రిగారికి ముఖ్య బంధువులు కలరని తెలియుచున్న 'మునికొండవలి' యభిజనముగాఁ గల శ్రీ నోరి సుబ్రహ్మణ్య శాస్త్రిగారును రఘువంశముం జదువలేదా! ఇంతకును వారు స్టేటుమెంటులోఁ జూపిన శ్లో: భాగములో 'తైః, భారతస్య, సంహితాః, పృథక్త్వేన, ప్రకాశితాః' అను నన్వయానుసారముగా నర్థముఁ జేసికొనిన నేఁ జేసిన యర్థము, తిలకాదులు చేసిన యర్థము సరిపోవును. కృష్ణమూర్తి శాస్త్రిగారి కట్లర్థము చేసికొనుశక్తి, లేక తప్పుగా వ్రాసిన యే మన్మథనాథ దత్తుగారి యాఁగ్లీకరణమునో విని తమదే సత్యార్థ మని నన్ను నిందించుట

యయుక్తము. వారి భారతాంధ్రీకరణములోఁ బైశ్లోకముల కర్థముకాక కప్పదాఁటు దాటిరి. ఇట్లే "ఏకవస్త్రాత్వధోనీవి" అను ద్యూతపర్వాంతర్గత శ్లోకమును (మన్మథనాథదత్తుగారి యాంగ్లీకృతార్థమునే గ్రహించి కాఁబోలు) కుమారిలభట్టాచార్యుఁడు చెప్పిన యర్థమును నేను వ్రాసినందులకు నన్ను నిందించిరి. కృష్ణమూర్తిశాస్త్రిగారి విమర్శనములో ఇంకొక్క యంశమును వ్రాసి వారిని గూర్చిన సంగతిని వదలెను.

నేను నేత్రవ్యాధితోఁ గూడియుండుటచే లేఖకులవలన భాషాస్ఖాలిత్యములు పెక్కులీగ్రంథమునఁ బ్రవేశించినవనియుఁ బుధవరులను మన్నింపు డనియుఁ గోరుచు నా మొదటి ముద్రణములోని గ్రంథారంభ సమర్థమున వ్రాసికొనినను 'దోషైకదృక్కు'లగు కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ నిరాకరణ గ్రంథాంతమున 'సభాపశ్చైరము, అధిక్యత, రాత్రింబవళ్ళు, ఆధ్వర్యము, తీర్థాయాత్రానెపము' ఇత్యాదులు వేనవేలున్నవనియు, నాకు భాషాజ్ఞానము తక్కువయనియు నిందించినారు. సభాపశ్చైరాదులు-కాంచనపిండు (నన్నియ), అర్ఘ్యపళ్లెము (మంచెన), దినవెచ్చెము (శ్రీనాథాదులు) మొదలగువానివంటివి. తక్కినవి స్థూలదృష్టిచేనైన లేఖనదోషములు. అయినను నా వ్రాతలోఁ దప్పులుండుటకుఁ దగిన హేతువును నేనే విన్నవించియున్నాను. కాని, కవిత్రయమువారి యశస్సుకంటెను నెక్కుడు కీర్తిని గడియింపవలయునను తలంపుతో వీరు తెలుఁగించు భారతములోని లెక్కకు మించిపోయిన శబ్దాదిదోషముల నటుండనిచ్చి నా మహాభారత చరిత్రమును నిరాకరించుచు వ్రాసిన వీరి నిరాకరణ గ్రంథమునఁగల దోషములలోఁ గొన్నిటిని గ్రంథవిస్తరణ భీతిని స్థాలీపుక న్యాయముగా నుదాహరించుచున్నాను. వానిని గమనించిన నస్ఖలితుఁడగు వీరి యుభయభాషాపాండిత్యము వెల్లడి గాఁగలదు. నిర్ణయించు (6 పుట), పునీతులు (88 పుట) ఇత్యాది గీర్వాణ శబ్దములు. బాతెకు (6 పుట) పైన (22 పుట) పేరులో (28 పుట) పేరున—ఇత్యాద్యాంధ్రశబ్దములు, 'గాధా' శబ్దమును వీరుపలుచోట్ల తవర్గచతుర్థాక్షరముగా వ్రాసినారు. అచ్చుతప్పుగానైన 'గాథ' అని యొక్కమాఱును ముద్రింపఁబడలేదు! అధర్వ, ధార్తరాష్ట్ర ధర్మరాజ, అథోనీవి, మొదలగునవియు దోషయుక్తములే.

తప్పులెన్నువారు తమతప్పు లెఱుఁగరుగదా!

నేను వారిపైఁ జేసిన యభియోగములో వారికి విధింపఁబడిన యిరువది రూప్యముల యపరాధమును గొట్టివేయుటకు వారు హైకోర్టునకు 'అపీలు' చేయఁగా జస్టిస్ జాక్సన్‌గారు అడ్మిషన్ కోర్టులోనే దానిని కృష్ణమూర్తి శాస్త్రిగారు నేరముఁ జేసినవా రనియె చెప్పుచు అపరాధము స్థిరపఱచినట్లు స్వరాజ్, హిందూ, ఆంధ్ర పత్రికలలో (ది. 20-4-1981) ప్రచురింపఁబడెను. పత్రికలలోఁ బ్రచురింపఁ

బుదువఱకు నవ్విషయము నాకుఁదెలియనేలేదు! పిమ్మటఁగాబోలు దాక్షిపంతుల ప్రహసనమును కృష్ణమూర్తి శాస్త్రిగారు వ్రాసిరని వింటిని వారి నిరాకరణ గ్రంథమును త్రిలింగపత్రిక (6-1-30) విమర్శించి విమర్శకులగు పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి నిరుత్సాహముగా నిట్లు నిందింపుచు వ్రాయుట యయుక్త మనినది. (4) కేతవరపు వేంకటశాస్త్రిగారు. వీరు ప్రత్యక్షముగా నా నామమునుంచి నా గ్రంథమును ఖండించుచుండుట లేదుగాని రెండేండ్లకు ముందు విశాఖపట్టణమున జరిగిన యాంధ్ర సాహిత్య పరిషద్వార్షికోత్సవమున నన్నుపలక్షించుచుఁ గొంద ఱిపుడు భారతమును వెఱ్ఱిగా విమర్శించుచున్నా రనియు వారి విమర్శనములపై పునర్విమర్శనముఁజేయుట వెఱ్ఱిపై వెఱ్ఱియనియు ద్రౌపదీ పంచపతిత్వాదికము బౌద్ధులు కల్పించి భారతములోఁ దూర్చి రనియు నుపన్యసించిరి.పిమ్మట ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో నొకవ్యాసమును వ్రాయుచు 'చింతామణివైద్య,పండిత సుబ్రహ్మణ్యశాస్త్రి' మొదలగు వారిట్లనుచున్నా రని మెల్లగ నా పేరు జాఱవిడిచిరి. విశాఖపట్టణపు సభ నగ్రాసనాధిపులగు బ్రహ్మశ్రీ మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయ శాస్త్రిగారు వేంకట శాస్త్రిగారి యుపన్యాసమైనపిమ్మట నన్నుఁ గనుఁగొని మీరు మధ్యాహ్నము సమాధాన మీయవచ్చునని చెప్పి మధ్యాహ్నము నే నుపన్యసింపఁ బోవుచుండ వివాదాంశముగాన మీ రుపన్యసింపరా దని వారించుటచే నా ప్రయత్నమును మానితిని. ఆ రీతి నాయన మానుమనుటకు దత్సభా నిర్వాహణ కార్యదర్శి యగు వేంకట శాస్త్రిగారి ప్రోత్సాహ మనియే తలంపఁబడెను. మహాభారత మంతయు 'బౌద్ధ మతస్థుల'చే ప్రక్షిప్తము చేయఁబడినదని వేంకటశాస్త్రి గారి మతము. అట్లే శ్రీ గొబ్బూరి రాఘవయ్య బి.ఏ. (ఎలమంచిలి) గారి మతమున ఖగోళశాస్త్రమునకు మహాభారతము 'అర్థవాద' రూపమని. "మహాఋషీణాం మతయశ్చభిన్నాః" అని కలదు కదా! వేంకటశాస్త్రిగారి మతమును ఖండించుచు నేను రెడ్డిరాణి పత్రికకు 'మహాభారతములోని ప్రక్షిప్తాదికము' అను నాలు వ్యాసములను వ్రాసితిని. మఱియు నాంధ్ర యూనివర్సిటీ కాలేజిలోని 'తెనుఁగు సంఘమున' శ్రీ వేంకటశాస్త్రిగారు మ.రా. పింగళి లక్ష్మీకాంత కవి యం.ఏ. గారి యాధిపత్యమున (ది. 14.2-1933) మహాభారతములోని ప్రక్షిప్తములు అను నంశముఁ గూర్చి యుపన్యసింప అగ్రాసనాధిపులగు లక్ష్మీకాంతకవి గారు బౌద్ధులు మహాభారతమునఁ బ్రక్షిప్తములు కూర్చిన మన పూర్వులు బుద్ధిహీనులై ప్రక్షిప్తములఁ దొలఁగింపకుండిరా! అని తమ యంత్యోపన్యాసమునఁ జెప్పిరి. వేంకటశాస్త్రిగా రాయుపన్యాసముననే నన్ను మనంబున నుంచికొని "పాండవు లెవరను విషయము గూర్చి మొన్న మొన్నటివఱ కేరికిని సందియంబు గల్గలేదు రాజా శ్రీ విక్రమదేవవర్మ గారి

అధ్యక్షతను 'తుని'లో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్సభలో పాండవుల మొదలగు వారెవరను విషయముఁ గూర్చి ఒక్కొక్క రుపన్యసించిరి. "కాని సభ్యు లుపన్యాసమును సాగనివ్వలేదు. అల్లరియు జరిగెను. ఆ యుపన్యాసము ముగిసినపిమ్మట శ్రీకౌతా శ్రీరామశాస్త్రిగారు మాట్లాడుచు ఆ మొదటివారి వాదమును ఖండించిరి. అప్పటినుండి వాదోపవాదములు బయలుదేఱినవి." (ఆంధ్ర పత్రిక ది 20-2-83 సం.ర సంచిక) అని (ది. 18-10-28 తేదిని) నేను తునిలోనిచ్చిన యుపన్యాసమును గూర్చి సనాయినొక్కు నొక్కిరి. తునిలోని నా యుపన్యాసముఁ గూర్చి ప్రథమ ముద్రణమున వివరించి యుంటిని; సభలో నిశ్శబ్దముగా దెబ్బదియైదు నిమిషములు నా యుపన్యాసమును సభికు లాలకించు టయు నడుమ నడుమను నేనె యాలస్యము చేయుచుంటినని తలఁచుచు సగ్రాస నాధిపులు నింకను నుపన్యసించవచ్చునా యని యొకటిరెండు తడవులడుగ శ్రీరంగీకారముఁ దెల్పుచుండుటయు జరిగినసంగతిగాని నా తరువాతను శ్రీ కౌతా శ్రీరామశాస్త్రిగారు నా యుపన్యాసమునుఁ బేర్కొనక దలపెట్టక ప్రాచ్య పాశ్చాత్య చిత్ర కళల గూర్చి యుపన్యసించుటయు వేంకటశాస్త్రిగారికి స్మృతిలో లేదనుకొం దును. ఆనాఁటి యుపన్యాసాంశములు సభలో నాఁడు జరిగిన విశేషములు (ది. 14-10-28) ఆంధ్రపత్రికలో రిపోర్టు చేయఁబడుటను వేంకటశాస్త్రిగారు గమనింపలేదు. అలమతివిస్తరేణ

## స్వవిషయము

మొదటి ముద్రణ మగువేళ బహుళ కష్టము లనుభవించితిని. పిమ్మట పిఠాపురమున గృహనిర్మాణముఁ జేసికొనుటయు నొక దౌహిత్రియు ముగ్గురు దౌహిత్రులు కలుగుటయు నా సోదరులకును పుత్ర పుత్రికాభివృద్ధి కలుగుటయునను నానందకర కార్యములు సంభవించెను 'లుప్తపిండోదక క్రియలఁ గలవాఁడ'నేమో యను విచారమొకప్పు డుండెడిది. ఆ విచారము పోయినది. డెబ్బదియైదేండ్ల వయస్సుగల నా తల్లికి నేన నేన యని నేనును నా కుమారితలు నా సోదరులుకూడ నామె మంచమెక్కిన యాఱుమాసము లుపచార ములఁ జేసితిమి ఆమె మా యుపచారముల కానందించుచునె (ది 12-4-82 నాఁడు) స్వర్గస్థురాలగుటచేతను, నాకుఁ బదునాఱవయేటను మృతి నొందిన తండ్రిగారికిని నుపచారములఁ జేసి యుభయులకు నంత్యకర్మముఁ జేసి యుండుటచేతను 'నిష్కృత్యాణుఁడ' నైతినని మనస్తృప్తి కలవాఁడనైతిని కృష్ణమూర్తి శాస్త్రిగారి యభియోగ కాలముననె 'పరిక్షిత్తు' అను నొక వచనగ్రంథమును బాలబాలికలకుఁ బాఠ్యగ్రంథముగా రచించితిని. అది 'ఆంధ్ర, మద్రాసు' యూనివర్సిటీలలో 1984 సం రపు 'ఇంటర్మీడియెటు' తరగతికిఁ బాఠ్యగ్రంథముగా నిర్ణయింపఁ

బడుటయేగాక పెక్కు హైస్కూళ్ళలోను పాఠ్యగ్రంథముగా నిర్ణయింపఁబడు చున్నది. ఇట్లని సర్వము సుఖావహమన వీలులేదు. నడుమనడుమ 'అక్షిరోగము, అప్పులబాధ, అల్లరయతుకలు' మొదలగునవి మానసిక వ్యథలఁజేయుచునె యున్నవి. అన్నిటికంటె హెచ్చైనది కృష్ణమూర్తి శాస్త్రిగారి యభియోగపుబాధ. నాకు 'చతుర్వేదుల రాఘవయ్యగారు' డిండిమ బిరుదము హేళనముగా నొసఁగిరి. ఇంచుమించుగ నాకాలముననె కృష్ణమూర్తిగారును 'కవిసార్వభౌమ బిరుదము' నొందిరి, కవిసార్వభౌమ శ్రీనాథకవి 'యోగానంద ప్రహసనకర్త' యగు డిండిమభట్టును గూర్చి-

"పగులగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచుఢక్క"

అని వ్రాసినట్లునాకే దేని పగులునేమో యని యనుకొంటిఁగాని యట్టి దేదియుఁ జరుగలేదు.

మఱియు, ప్రథమ ముద్రణ సమయమున శ్రీ సత్తిరెడ్డిగారు తామైదు వందల పుస్తకములను ముద్రింపించి యందు సగము నాకిచ్చెద మనియుఁ బుస్తకముయొక్క యధికారము మీకె యుండుననియు వ్రాసి యిచ్చి యట్లెచేసిరి. వారు తమ పుస్తకములను విక్రయించిరి నేను నూఱుపుస్తకములను మాత్రమే విక్రయించి తక్కినవి పండితులకు మిత్రులకుఁ బంచిపెట్టితిని. కాని పెక్కండ్రు తమకీ పుస్తకము కావలెనని పలుసారులు వ్రాయుచున్నారు. శ్రీ సత్తిరెడ్డిగారిని ద్వితీయ ముద్రణముఁ జేయఁగోరఁగా వారు సగము వ్యయమును నన్నుభరింపుఁడని యొకప్పుడు వ్రాసిరి. అందులకు నేను సమర్థుఁడను గాకుంటిని. ఇట్లుండ నాఱు మాసములకుఁ బూర్వము నా కనేక సమయములతో మహా సాహాయ్యముఁ జేసిన మహారాజశ్రీ కోకా వేంకట సుబ్బారావు నాయఁడుగారు (పిఠాపుర సంస్థానపు దివాన్‌గారు) మహా భారత చరిత్ర ప్రశంసఁజేయఁగా నది పునర్ముద్రణము కావలయుననియు, ద్రవ్యాభావమువేఁ దిరిగి ముద్రింపలేకుంటి ననియు నేఁ జెప్పఁ బునర్ముద్రణమున కగు ద్రవ్యమును దాము సహాయము చేసెదమని సహజౌదార్యముతో నాకుఁ బ్రోత్సాహ మొసఁగుటచే నిపుడు (100 పుటలు) పెంచి ముద్రింపఁగలిగితిని. ఇందులకు శ్రీ నాయఁడుగారికి సదా కృతజ్ఞుఁడను.

కృష్ణమూర్తిశాస్త్రిగారి యభియోగ కాలముననె నా కంటిలో (శకందరీ గ్లాకోమా) వ్యాధి వృద్ధినొందఁగా మద్రాసునకేగి 'కర్నల్ రైటు, డాక్టర్ కోమనునాయరుగార్ల'చే శస్త్ర వైద్యముఁ జేయించుకొని నిరోగుఁడనైతిని. భరత ఖండమున నిపు డుండిన నేత్ర వైద్యులలోఁ బైవైద్యు లిరువురు 'అశ్వినీదేవత'

లనవలసియుందురు. అంతఁ గాల్చిన సూదిని గంటఁ దూర్చినపుడు కర్పూరము విడిచినట్లే యుండు మోహన శక్తి కోమనునాయరుగారి హస్తమునందే కలదు. వారు చేసిన వైద్య విశేషముచేతనె నే నిట్టింకను సంచరించుచున్నానని తలంతును.

మొదటి ముద్రణముపైఁ బీఠిక వ్రాసినందులకు బ్రహ్మశ్రీ విద్వాన్ గరిమెళ్ళ సోమన్న పంతులు యం. యె. యల్. టి. గారికిఁ గృతజ్ఞుఁడ నగుచుంటిని. ఇపు డీగ్రంథాదియందుఁ జేరిన యాంగ్ల భాషానుక్రమణికను నాకు మిత్రులును హైస్కూలున నాకు సహోపాధ్యాయులు నగు మ.రా శ్రీ ఎనమంద్ర సూర్యనారాయణ యం. యే. యల్. టి. గారును మల్యాల కామేశ్వరరావు బి. యే గారును వ్రాసియిచ్చి విశేషసహాయము జేసిరి. వారికిఁ గృతజ్ఞుఁడను. నేత్ర వ్యాధిచే వ్రాసిన దానిని దిరిగి దిద్దుకొను శక్తిలేని నా ద్వితీయ ముద్రణ గ్రంథమును మ. రా. శ్రీ విమర్శకాదర్శక నడకుదుటి వీరరాజుపంతులుగారు దిద్ది తమ ముద్రాక్షరశాలలోనె ముద్రింపించినందులకు మిత్రులగు వారికి సదా కృతజ్ఞుఁడ నగుచున్నాను.

## చదువరుల కొక- మనవి

నేను వ్రాసిన విమర్శనాంశములలోఁ బెక్కులు నాకుఁ దెలియని తప్పు లుండవచ్చును. భాషాస్ఖాలిత్యముండవచ్చును. ఎంతగాఁ బరిశీలించినను ముద్రణ స్ఖాలిత్యము లనివార్యములు. అభిప్రాయ భేదములు ననివార్యములే. అందులకని నన్ను దూషింపకుఁడని వేఁడుచున్నాను. నిజమగు తప్పులను సవరించుకొనుట కెప్పుడును వెనుదీయను. అభిప్రాయ భేదములే లేకుండిన 'ప్రస్థానత్రయ'మునకు 'ద్వైతాద్వైతవిశిష్టాద్వైత' భాష్యములేల కలుగును ? అట్లే భారత గాథా విశేషములపై నాకును నభిప్రాయ భేదములున్నవని తలఁపఁగోరెదను. విమర్శించి సత్యముం గనుగొనువారికి నా విమర్శనము కొంత సహాయకారియగుననియు నేరికైనంత గొంత యిది సహాయమొసఁగిన నందువలన నేను ధన్యుఁడ నగుదు ననియే నమ్ముచున్నాను. ఓమ్ తత్సత్.

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి.
ప్రధానాంధ్రోపాధ్యాయుఁడు.
ఆర్. ఆర్. బి. హెచ్. ఆర్. హైస్కూలు,

ది. 22-4-1933
పిఠాపురము

# విషయసూచిక


| | | పుట. |
|---|---|---|
| మహాభారతము పంచమ వేదము | ... | 1 |
| మహాభారత యుద్ధకాలము | ... | 8 |
| మహాభారత రచనా విధానము | ... | 21 |
| మహాభారతగాథా విశేషములు (సాంఘిక విషయములు) | ... | 52 |
| శ్రీకృష్ణుడు | ... | 60 |
| పూతనారోగము - నిదానము | ... | 60 |
| నాగులు - నాగలోకము | ... | 62 |
| శ్రీకృష్ణుడు-ద్రౌపదీ మానరక్షకుడు | ... | 68 |
| సాంఘిక దురాచారములు | ... | 69 |
| చంద్రవంశము | ... | 76 |
| అశ్వమేధయాగకర్తలు | ... | 89 |
| పాండవపక్షపాతులెవరు ? | ... | 90 |
| భీష్ముడు | ... | 90 |
| ద్రోణుడు | ... | 91 |
| కృపుడు | ... | 94 |
| విదురుడు | ... | 95 |
| వ్యాసుడు | ... | 97 |
| స్వాయంభువాదివ్యాసులు | ... | 97 |
| కృష్ణద్వైపాయనుడు | ... | 107 |
| శ్రీకృష్ణుడు | ... | 119 |
| జరాసంధవధము | ... | 122 |
| శిశుపాలవధము | ... | 124 |
| సౌంభకవధము | ... | 126 |
| ఇతర విషయములు | ... | 146 |
| శ్రీకృష్ణుని జాతకము | ... | 151 |
| విరాటుడు | ... | 151 |

| | | పుట. |
|---|---|---|
| మలయధ్వజుఁడు | ... | 153 |
| పాంచాలురు | ... | 153 |
| ద్రుపదుడు | ... | 155 |
| ధృష్టద్యుమ్నుఁడు | ... | 157 |
| శిఖణ్డి | ... | 161 |
| ద్రౌపది | ... | 162 |
| కుంతి | ... | 168 |
| పాండవులు | ... | 169 |
| ధర్మరాజు | ... | 177 |
| ధర్మరాజు జాతకము | ... | 182 |
| భీష్ముఁడు | ... | 183 |
| అర్జునుని జాతకము | ... | 188 |
| నకుల సహదేవులు | ... | 188 |
| దుర్యోధనుడు | ... | 189 |
| దుశ్శాసనుఁడు | ... | 195 |
| కర్ణుడు | ... | 197 |
| శకుని | ... | 207 |
| సుశర్మ (త్రిగర్తలు) | ... | 210 |
| విశేషములు | ... | 213 |
| మహాభారతకాలపు రాజ్యములు | ... | 215 |
| కౌరవ పాండవ పక్షపు వీరులలో ముఖ్యులు | ... | 221 |
| పరిక్షిత్తు | ... | 223 |
| తక్షకుఁడు | ... | 232 |
| జనమేజయుఁడు | ... | 234 |
| అశ్వమేధము | ... | 241 |
| మతసాంఘిక సంస్కరణములు | ... | 245 |
| వివాహ నియమము - శ్వేతకేతువు | ... | 247 |
| శతానీకుఁడు | ... | 250 |
| యాజ్ఞవల్క్యుఁడు | ... | 251 |
| అశ్వమేధజుఁడు | ... | 252 |

శ్రీరస్తు

# మహాభారత చరిత్రము

భారతీయ వాఙ్మయమునందు స్మరణ దర్శన లేఖన పఠన పాఠనాదులచేఁ బురుషార్థము నర్థుల కొసఁగునది మహాభారత మని యార్యులు నుడువుదురు. రామాయణ మహాభారతగాథ "లాసేతు హిమాచలము" పెక్కు విధముల నాబాలగోపాలము గానముచేయఁదగిన సర్వరససంపత్తి గలవై యున్నవి. పాశ్చాత్యులు గూడ రామాయణ మహాభారతములఁ దమతమ భాషలలోని కనువదించుకొనుటయు, మహాభారతము ననాగరకులుగాఁ దలఁపఁబడు "మలయ ద్వీపగణవాసులు" కూడఁ దమ భాషలలో నొకటియగు "కవి" భాషలోని కనువదించుకొనుటయుఁ జూడ రామాయణ మహాభారతముల ప్రాశస్త్యము జగద్విదితమని స్పష్టమగుచున్నది

రామాయణ మహాభారతములు వీరులయొక్కయు వీరవనితలయొక్కయు దుర్మార్గుల యొక్కయు సత్పురుషుల యొక్కయుఁ బతివ్రతల యొక్కయుఁ జరిత్రలతోఁ గూర్పఁబడుటచేతను, నాయికా నాయకుల చరిత్రములు దేవమహిమలతోఁ గూర్పఁబడి, వారలు సత్యమునకొఱకుఁ గష్టపరంపరలనొంది తుదకు మహాయుద్ధములలో జయమునొందినట్లు వర్ణింపఁబడుటచేత నవి నానాజాతుల వారికి నింపగు "నితివృత్తములు" కలవై యున్నవి.

భారత రామాయణములను రచించిన కవులు కూడ నద్వితీయ ప్రతిభాశాలురు. ఒకఁడు వేదవిభాగకర్త. మఱియొకడు కవికులగురువు. రామాయణమువలె మహాభారతము కావ్యముగా మాత్రమె పరిగణింపఁబడలేదు.

## మహాభారతము పంచమవేదము

వేదమునందుండి [1]విధులు, [2]అర్థవాదములు మొదలగునవి మహాభారతమున నుండెను. మఱియు నిత్య, నైమిత్తిక, కామ్య కర్మములు విధానములు వేదచతుష్టయములోని వానికంటె నిందు విపులముగాఁ జెప్పఁబడి యుండెను.

---

1. ఈ కర్మముఁ జేసిన నిట్టి ఫలము గలుగునను వాక్యములు.
2. విధులను స్తుతించు రూపమునఁ జెప్పఁబడు గాథలు.

వేదములో నుండిన జ్యోతిష్టోమాదు లిహపర సాధకములై ద్విజులకేకాని స్త్రీ శూద్రుల కుపయుక్తములు గాకున్నవి. ఈ పంచమ వేదోదితములగు "తటాక ప్రతిష్ఠాదులు, నక్షత్ర, తిలదానాదులు, ద్విజులకు ద్విజేతరులకుఁ గూడ నిహ, పర, సాధన భూతములై యున్నవి. అందుల గుణస్తుతిరూపకములై [1]పరకృత్యాది చతుర్విధార్థ వాదములు విపులముగా నిందు చెప్పఁబడియున్నవి. వేదోదిత కర్మలుగూడ నీ మహాభారతమున విపులముగాఁ జెప్పఁబడెను. అందులకు "రాజసూ, యాశ్వమేధ వైష్ణ"వాది యాగవర్ణనములే నిదర్శనములు. హరిశ్చంద్ర, నహుషాదులగాథలు పురాకల్పార్థవాద సదృశము లనవలసియున్నది.

మఱియు వేదములో నొక భాగమగు బ్రాహ్మణాంతర్భూతమగు కల్పము (క్రతువిధానాదికము) నకువలె నీపంచమవేదమునందును ఆయా యంశములు చెప్పఁబడియున్నవి. వేదచతుష్టయమునకు వేదశిఖలనఁబడు నుపనిషత్తులుండును. అట్లే యీపంచమవేదమునకును, భగవద్గీత, అనుగీతాదిమహత్తరోపనిషత్తులున్నవి. వేదమునకు మంత్రద్రష్టలు, కాండర్షులు నుందురు. ఈ పంచమవేదమునకును, నారద, మార్కండేయ, రోమశాదులు మంత్రద్రష్టలును; కృష్ణద్వైపాయన, వైశంపాయన, సౌతులనువారు కాండర్షులు నై యున్నారు. వేదములకు శాకల్య, తైత్తిరీయ, వాజసనేయ, పైప్పలాదిశాఖాభేదము లుండినటుల నీపంచమ వేదమునకును, సుమంతు, జైమిని, పైలాది పంచశాఖలు కలవు. వేదములకు [2]"ఖిల" సంహిత లుండును. ఈ పంచమవేదమునకు హరివంశ మను ఖిలసంహిత కలిగియున్నది. పై కారణము లన్నిటిచేతను మహాభారతమును పంచమవేద మనిరి. దీనికి వ్యాసుఁడు నాతనిశిష్యపరంపరయు కారకు లగుటచే దీనిని "వైయాసికీ సంహిత" అనుట యుక్తమయియున్నది. మహాభారతము వేదముమాత్రమేకాదు! ధర్మశాస్త్రము, అర్థశాస్త్రము, మోక్షశాస్త్రముగాఁ గూడ తలఁపఁబడినది. చూడుడు.

---

1. అర్థవాదములు నాల్గు విధములు. (i) నిందార్థవాదములు. (ii) ప్రశంసార్థవాదములు. (iii) పరకృత్యర్థవాదములు. (iv) పురాకల్పార్థ వాదములు.
2. ఖిలసంహిత యనఁగా మొదటఁ జెప్పినయంశమునకు ననుబంధముగాఁ జేర్పఁబడిన భాగము. (లేక) మొదటఁజెప్పిన గ్రంథమునకుఁ దరువాతఁ జెప్పిన గ్రంథము (ఖిల మన శూన్యమైనది, నాశమైనది యను నర్థమిచ్చటఁ గాదు).

[1]అమితబుద్ధి గల వ్యాసునిచే నిది పుణ్యమైన ధర్మశాస్త్రము గాను, ఉత్కృష్టమగు నర్థశాస్త్రముగాను, పవిత్రమైన మోక్షశాస్త్రముగాను నిపుడు చెప్పఁబడుచున్నది. అట్లే ముందురాఁబోవువారు వినఁగలరు.

రామాయణమును రచించి వాల్మీకి చింతింపలేదు కాని భారతమును రచించి వ్యాసుఁడు విచారించె ననియుఁ దచ్చింతా శాంతి కొఱకు నారదోపదేశముచే, భాగవతమును రచించెననియు, శ్రీమద్భాగవతము యొక్క ప్రథమ స్కంధమునం గలదు. భారతమును రచించి చింతించుటకుఁ గారణ మేమై యుండును? మఱియు శిష్టులు రామాయణము నంతయుఁ బారాయణము చేయు చుండినటుల మహాభారతము నంతియుఁ బారాయణముఁ జేయక భగవద్గీతను మాత్రము పారాయణముఁ జేయుచుందురు. వర్షము కొఱకుఁ గొందఱు విరాట పర్వమునఁ జదువుట కలదు.

రామాయణ మహాభారతములు పాశ్చాత్య విద్యా పద్ధతి ననుసరించి బహి రంగ పరీక్షకు లోనగుచున్నవి. అంతరంగ పరీక్ష కంటె బహిరంగ పరీక్ష జన సామాన్య దృష్టి నాకర్షించి, విశేష వివాదములకుఁ గారణమగును. (బహిరంగ పరీక్ష యనఁగా గాథ జరిగిన కాలము, కవి కాలము, గాథావిశేషములు మొదలగు వాని విమర్శనము అంతరంగ పరీక్ష యనఁగా శబ్దార్థాది విమర్శన విశేషములు) కాని యీ వివాదముల వలన గ్రంథావలోకనము విశేషముగఁ గలుగుట యను ఫలము కలుగును గాన నా శక్తి కొలఁది మహాభారతమును బహిరంగ పరీక్షచే సంగ్రహముగ విమర్శించుచున్నాఁడను. గాథావిమర్శనమునకు ముందు మహాభారతగాథ జరిగిన కాలమెపుడు? మహాభారత గ్రంథ మెపుడు రచింపబడెను? అను సంశయములను గొంత విమర్శించెదను.

## మహాభారత యుద్ధకాలము

మహాభారతగాథ క్షాత్రకాలమున జరిగె నని చారిత్రకు లూహించు చున్నారు. క్షాత్రకాలము యొక్క తుదిని రచింపఁబడెనని తలఁపఁబడు "నథర్వ" సంహితలోను, ఐతరేయ బ్రాహ్మణములోను పాండవ వంశవర్ధ నుఁడును నర్జునుని పౌత్రుఁడు నగు పరీక్షితుని ప్రశంస కలదు. పరీక్షిత్తనయుఁ డగు జనమేజయుఁ డశ్వమేధయాగకర్తలలో ముఖ్యుఁడని ఐతరేయ బ్రాహ్మణ మునను, శతపథ బ్రాహ్మణమునను గలదు. జనమేజయునియందు నాఁటివారికి

---

2. శ్లో. ధర్మశాస్త్ర మిదం పుణ్య మర్థశాస్త్ర మిదం పరం
మోక్షశాస్త్ర మిదం పుణ్యం వ్యాసేనామితబుద్ధినా
సంప్రత్యాచక్షతేచేదం తథా శ్రోష్యంతిచాపరే.

మహాభారతము, ఆదిపర్వము, 62 అధ్యాయము.

విశేషగౌరవ ముండెడిది. అందువలన నాతఁడు మృతినొందిన తరువాత నాతఁ డేలోకమున నుండె నని ప్రశ్నల నడుగుచుండినటుల "బృహదారణ్యకోప నిషత్"(౬-౩-1)లోఁ గలదు. కాని పాండవధార్తరాష్ట్రుల పేరుల గాని వారి చరిత్ర గాని, వైదిక వాఙ్మయమునఁ గాన్పింపవు. సూత్రకారులగు "శాకటాయన పాణిన్యా చార్యులు" మాత్రము భారత యుద్ధవీరుల పేరుల నుచ్చరించుటయే కాక వాసు దేవార్జునులయందు నాఁటివారు భక్తితత్పరులై యుండిరని కూడఁ దమ వ్యాకర ణములయందు సూచించియున్నారు వైదిక గ్రంథములు పాండవధార్తరాష్ట్రులఁ బేర్కొనకుండుటకుఁ గల కారణములను ముందు వ్రాయఁగలను. శాస్త్రకాలాంత్య వాఙ్మయములో, పరీక్షిజ్జనమేజయులు పేర్కొనఁబడుటచే నంతకుముందు అనగా శాస్త్రకాల మధ్యభాగమునఁ గురుపాండవులుండిరని చెప్పవలసియున్నది. కాని శాస్త్రకాల మెప్పటిది యను సందేహము చాలమందిని బాధించును. ఆంగ్లేయ భాషా కోవిదులు శాస్త్రకాలము క్రీ. పూ 1400 సం రములు మొదలు క్రీ. పూ. 1000 సం॥రముల వఱకు నని నిశ్చయించిరి. కాని బాలగంగాధరతిలకు గారు క్రీ. పూ. 2000 సం॥రములు మొదలుకొనియే శాస్త్రకాలమైయున్న దని వ్రాసియున్నారు. నా తలంపుగూడ తిలకు గారి యభిప్రాయము ననుసరించి యున్నది. వేదవాఙ్మ యముచేఁ గాని, సూత్ర వాఙ్మయముచేఁగాని కురుపాండవుల కాలమును నిర్ణయింప లేము. కాని, మహాభారతములోని వర్ణనా విశేషములచేతను, విష్ణు భాగవత పురాణములలోఁ గురుపాండవుల కాలమును గుఱించి వ్రాసిన వ్రాఁతలచేతను, కురుపాండవుల కాలము - అనఁగా మహాభారత యుద్ధకాలము నిర్ణయింపవలసి యున్నది.

అందు మహాభారతములోని వర్ణనాంశములను ముందుగఁ బరిశీలింతము. శ్రీకృష్ణుఁడు సంధికిఁ బోయిన నక్షత్రము "రేవతి" యనియు, దుర్యోధనుఁడు కురుక్షేత్రమునకు సైన్యములను నడిపించినది "పుష్యమీ" నక్షత్రమనియు, బలరాముఁడు తీర్థయాత్రకుఁ బోయినదియు నా పుష్యమీ నక్షత్రమే యనియు, బలరాముఁడు తీర్థయాత్రను ముగించుకొని, భీమ దుర్యోధనుల గదాయుద్ధముఁ జూచుటకు వచ్చిననాఁడు "శ్రవణా" నక్షత్ర మనియు, నాటికిఁ బదునెనిమిది దినముల క్రితము యుద్ధప్రారంభమనియు, యుద్ధారంభమునుండి పదునాలుగవ నాఁటి రాత్రి కూడ యుద్ధమైనదనియు, నాఁటిరాత్రి రెండువంతులైన పిమ్మటఁ జంద్రోదయ మైనదనియు, నాయాఘట్టములయందు వర్ణింపఁబడియున్నది. మఱియు నుభయ సైన్యములు కురుక్షేత్రముఁ జేరిన పిమ్మటను, వ్యాసులవారు ధృతరాష్ట్రునితో నప్పటి "యుత్పాతములను" వర్ణించుటలో కొన్ని జ్యోతి శ్శాస్త్రసంబంధములఁగూడ సూచించియున్నారు. అందీ క్రిందివి ముఖ్యములు:

1అరుంధతికి వసిష్ఠుఁడు వెనుకయైనాఁడు. శనైశ్చరుఁడు రోహిణియం దుండి, పీడించుచున్నాఁడు. 2మాటిమాటికి భూమి కంపించుచున్నది. రాహువు సూర్యుని బొందుచున్నాఁడు. శ్వేతగ్రహము "చిత్ర" నతిక్రమించియున్నది.

3మహాఘోరమగు ధూమకేతువు "పుష్యమి" నాక్రమించి యున్నది. ఇది సైన్యముల కమంగళముఁ జేయును "మఘానక్షత్రములయం దంగారకుఁడును, శ్రవణమున బృహస్పతియు" వక్రించిరి. సూర్య పుత్రునిచే నుత్తరా నక్షత్ర మాక్రమింపఁబడుచున్నది.

శుక్రుఁడు పూర్వాభాద్రయందుఁ బ్రకాశించు చున్నాఁడు కాని, యుత్తరా భాద్రలోఁ గూడఁ బ్రకాశించుచున్నటుల నున్నాఁడు.

4శ్వేతగ్రహము పొగతోఁ గూడిన యగ్నివలె జ్యేష్ఠానక్షత్రము నాక్రమించి ప్రజ్వలించుచున్నది......శశిభాస్కరులు రోహిణీ నక్షత్రమును బీడించుచున్నారు. పరుషగ్రహము, చిత్రాస్వాతుల నడుమ నున్నది. అగ్నివంటి కాంతిగల యంగారకుఁడు శ్రవణములో వక్రించి వక్రించి బ్రహ్మరాశియందున్నాఁడు. సంవత్సరమునకు "అయనించి" "బృహస్పతి శనైశ్చరులు" విశాఖకు, సమీ

1. శ్లో॥ అరుంధతీ తయాప్యేష। వసిష్ఠః పృష్ఠతోకృతః
రోహిణీం పీడయ త్యేష స్థితో రాజన్ శనైశ్చరః॥

2. శ్లో॥ అభీక్ష్ణంకంపతే భూమి రర్కంరాహురు పైతిచ
శ్వేతోగ్రహ స్తథాచిత్రాం సమతిక్రమ్యతిష్ఠతి॥

3 శ్లో॥ ధూమకే తుర్మహాఘోరః పుష్యంచాక్రమ్యతిష్ఠతి
సేనయోరశివంఘోరం కరిష్యతి మహాగ్రః॥
మఘాస్వంగారకో వక్రః శ్రవణేచ బృహస్పతిః
భగంనక్షత్రమాక్రమ్య సూర్యపుత్రేణ పీడ్యతే॥
శుక్రః ప్రౌష్ఠపదేపూర్వ సమారుహ్య విరోచతే
ఉత్తరేతు పరిక్రమ్య సహితస్సముదీక్ష్యతే॥

4. శ్లో॥ శ్వేతోగ్రహః ప్రజ్వలిత స్సధూమ ఇవపావకః ఐంద్రం తేజస్వి నక్షత్రం జ్యేష్ఠామాక్రమ్య తిష్ఠతి......రోహిణీం పీడయంతౌ తావుభౌచ శశి భాస్కరౌ చిత్రాస్వాత్యంతరేచైవాధిష్ఠితః పరుషగ్రహః॥ వక్రానువక్రం కృత్వాచ శ్రవణం పావకప్రభః బ్రహ్మరాశింసమావృత్య లోహితాంగోవ్యవస్థితః। ...... సంవత్సరస్థాయినౌచ గ్రహౌప్రజ్వలితావుభౌ విశాఖాయా స్సమీపస్థౌ బృహస్పతిశనైశ్చరౌ॥...చతుర్దశీం, భూత పూర్వాంచ షోడశీం చంద్రసూర్యావుభౌగ్రస్తా వేకమాసీం త్రయోదశీం॥

పించు చున్నారు......చంద్ర సూర్య గ్రహణములు, ఒకదాని తరువాత నొకటి పదునాలుగు, పదునేను, పదునాఱు, పదమూఁడు దినములలో వచ్చినవి.

పై వర్ణనలయందుం గొన్ని యసందర్భములు కాన్పించుచున్నవి. కాని, యాఘట్టమునందే స్థలాంతరమునందు "కార్తిక శుద్ధ పూర్ణిమనాఁడు చంద్రుఁడు పద్మవర్ణము గల నభమునం దగ్నివర్ణము కలవాఁడై కళాహీనుఁడుగా నుండె" ననుటచేతను, భైయుత్పాతములు కార్తిక మార్గశీర్షమాసములలో నై యుండె ననుట స్పష్టము. పైవర్ణనములలోని శ్వేతగ్రహమేదియో తెలియకున్నది. అట్టిదియే "పరుషగ్రహమును." ఒకచో "నంగారకగ్రహము" మఘానక్షత్రములయందు వక్రించి యున్నాఁడనియు, మఱియొకచోట శ్రవణమున వక్రించి వక్రించి బ్రహ్మరాశి (ధనుస్సున) నున్నాఁడనుటచే నావత్సరమున నంగారకుఁడు రెండుసారులు వక్రతను బొందియుండె నని తోఁచుచున్నది. బృహస్పతి శ్రవణమున వక్రించె నని మొదటఁ జెప్పి, మఱియొకచోట విశాఖను బృహస్పతి శనైశ్చరులు సమీపించుచున్నా రనుటయు, శనైశ్చరుఁడు రోహిణిని బీడించుచున్నాఁ డని యొకచోటను, మఱియొకచోట నుత్తరలో నున్నాఁ డనియు విశాఖను సమీపించుచున్నాఁ డని వేఱొకచోటను నుడువుటయుఁ గార్తిక మార్గశీర్ష మాసములలో "శశి, భాస్కరులు" అందు, భాస్కరుఁడు, రోహిణిని బీడించుచున్నాఁ డనుటయు, శుక్రుఁడు కార్తికమాసమునఁ బూర్వోత్తరాభాద్రలలో నవఁగా, సూర్యునికంటె నాలుగు లేక యైదురాసులు ముందుండుటయు విచారణీయాంశములై యున్నవి. రోహిణిని భాస్కర శనైశ్చరులు పీడించుచున్నారని చెప్పుటలో "వేధించుచున్నా" రని తాత్పర్యమై యుండును. కాని శనైశ్చరుఁ డుత్తరానక్షత్రమునుండి విశాఖకు సమీపించుటయు శ్రవణమునుండి యైదు నక్షత్రములు వెనుకకు వక్రించుటయు నర్థమగుటలేదు. మఱియు నావత్సరము, పదునాలుగు పదునేను పదునాఱు పదమూఁడు దినములలోఁ జంద్రసూర్యగ్రహణములు గలుగుటకూడ విచారణీయమే మహాభారతముననే యావత్సరము మార్గశీర్షమాసమున నొకపక్షములో రెండుక్షయతిథులు కలిగినవని చెప్పుటచే పదమూఁడు దినములలోఁ బూర్ణిమామావాస్యలు సంభవించి యపుడే సూర్యచంద్ర గ్రహణములు కలిగియుండిన వనుటకు సందేహింప నవసరములేదు. పరుష శ్వేత గ్రహము లెవ్వి? రవికి శుక్రుడు నాలుగైదురాసుల నతిక్రమించి ముందు వెనుక లుండునా? గురుఁ డయిదాఱు నక్షత్రములను వక్రించునా? శని మూఁడు నాలుగు నక్షత్రముల నెనిమిదితొమ్మిది మాసములలో నతిక్రమించునా? యను సంశయములు జ్యోతిశ్శాస్త్రజ్ఞు లాలోచింపవలసిన యంశములై యున్నవి (భూలోకమున మహాజనసంక్షయ మగునని తెల్పుటకు గ్రహగతులు తప్పె

నని కొందఱుచెప్పుదురు. కాని యది ఖగోళశాస్త్రానభిజ్ఞుల వాక్యము. భూగోళ మెక్కడ! దీనికంటె పెక్కువందల రెట్లు పెద్ద వగు గురు శనిమండలము లెక్కడ! భూలోకము నందైనను ఒక్క భరత ఖండముననే యీ యుపద్రవము కలుగఁబోవుచున్నది. అందుల కా మహాగోళములలో మార్పు కలుగునా? ఇట్టిదే మూఢ విశ్వాసము.) ఇదివఱకు వ్రాసిన యంశమువలన మహాభారత యుద్ధకాలమును నిర్ణయింప నైతి గాకున్నది. మహా భారతములోని యింకొక యంశమును విచారింతము.

మహాభారతవ్యాఖ్యాతలలో "నీలకంఠాచార్యుఁడు" ముఖ్యుఁడు. అతని వ్యాఖ్య ననుసరించియే మద్రాసునందు నేఁటి కేఁబదినాలుగు సంవత్సరములకుఁ బూర్వమున నే. వేంకట సుబ్బాశాస్త్రులవారును, రమారమి యిరువది యేండ్లకుఁ బూర్వము కుంభకోణమున ఆర్. కృష్ణమాచార్యుల వారును మహాభారతముఁ బరిష్కరించి యాంధ్రసంస్కృతాక్షరములతోఁ దమ సంస్కృతభారతములఁ బ్రకటించిరి. (ఆ రెండు ప్రతులనే విశేషముగ నే నాధారపఱచుకొనుచున్నాఁడను. మఱియు కలకత్తాలోని ప్రతాపచంద్రరాయిగారి ప్రతి యొకటియు, శ్రీ పీఠాపురపు మహారాజావారి సౌధ పుస్తకాగారమునం దుండిన వ్రాఁతప్రతియు, ఆంధ్ర పరిశోధక మహా మండలికి "శ్రీ చెలికాని లచ్చారావు" గారిచే సంపాదింపఁబడిన వ్రాఁతప్రతియుఁ గూడ నాచేఁ బరిశీలింపఁబడినవి. (మొదటి యీ రెండు ప్రతులలో నుల్లిఖితములగు నంశములఁ జూడఁగా నీలకంఠాచార్యుఁడు భారత యుద్ధారంభ మేమాసమున నేతిథియం దారంభింపఁబడి యున్నదను దానిఁగూర్చి కొంత విచారణమును సలిపిన సంగతి తెలియనగును. ఆ చర్చ భీష్మపర్వమునఁ బదునేడవ యధ్యాయము యొక్క రెండవ శ్లోకమగు "మఘా విషయగస్సోమః" అనుదానికి సంబంధించి యున్నది.

[1]"మఘ" యన, పితృదేవతాక నక్షత్రము. దానియొక్క "విషయ"మన దేశము అనగా పితృకము. దానిని సోముఁడు పొందెను. ఆదియే కురుపాండవ

1. "మఘా విషయగస్సోమ మస్తద్దినం ప్రతిపద్యతేతి" మఘా ప్రిత్యంనక్షత్రం తస్యవిషయో దేశః పితృలోకః తద్గతస్సోమః కురుపాండవ యుద్ధారంభదినముక్తం భారత సావిత్ర్యాం. శ్లో. హేమంతే ప్రథమేమాసి శుక్లపక్ష త్రయోదశీ ప్రవృత్తం భారతం యుద్ధం నక్షత్రేయమదైవతే "ప్రథమే మార్గశీర్షే అత్రత్రయోదశీ శబ్దేన తద్యుక్తా చతుర్దశ్యేవగ్రాహ్యా" శ్లో. అర్జునేన హతో భీష్మో మాఘమాసే సితాష్టమీతి త్రయోదశ్యాంతు మధ్యాహ్నే భారద్వాజో నిపాతిత ఇతి. తత్రైవ యుద్ధస్య - దశమే పంచదశేహ్ని హతయో ర్భీష్మ ద్రోణయో రిష్టమీత్రయోదశీ సంయోగ

యుద్ధారంభదినము భారతసావిత్రియందు—హేమంతర్తువునందు మార్గశిరశుద్ధ త్రయోదశియందు యమదైవత నక్షత్రమున యుద్ధమారంభింపఁబడెను.

---

దర్శనాత్ అత్రపుష్యేపి మాఘశబ్దో మకరాయనాభిప్రాయేణ తదానీం తత్సంభవాత్— అన్యథా సప్తమీ ద్వాదశ్యోరేవ తయోర్హననం-యత్తు అమావాస్యాయాం దుర్యోధన హననం తత్తైర్వోక్తం - తత్రాప్యమావాస్యాశబ్దః ఇష్టిదినే ప్రతిపద్యేవ ప్రయుక్తోవేదితవ్యః - యమదైవత ఇతి భరణీనగ్రాహ్యా కింతు యుగ్మదైవతం మృగశీర్ష మేవ గ్రాహ్యం- తస్యహి పూర్వదళం శుక్రదైవత్యత్వా దాసురం-ఉత్తరార్ధంతు బుధ దైవత్యత్వా ద్దైవం తేన తత్రాసురాణా ముపరమో దేవానా మభ్యుదయశ్చ సిద్ధ్యతి-కించ శ్లో చత్వారింశ దహాన్యాసన్ ద్వేచమే నిస్సృతస్యవై పుష్యేణ సంప్రయాతోస్మిన్ శ్రవణే పునరాగత ఇతి। యుద్ధారంభాదష్టాదశేహ్ని తీర్థయాత్రాత్ ఆగతస్యబలదేవస్య వచనాత్ - శ్రవణే యుద్ధసమాప్తిర్దృశ్యతే-తతః ప్రాచీనే అష్టాదశర్క్షే మృగశీర్ష ఏవ యుద్ధారంభస్సంభవతి - నత్వేకవింశే భరణ్యాం అష్టాదశదినమధ్యే నక్షత్రత్రయ క్షయస్య కల్పయితు మయుక్తత్వాత్ - కార్తికీ కృత్తికాయోగానుపాతేన చతుర్దశ్యాం మృగస్యైవ సంభావనాచ్చ - ఏతేన యుద్ధారంభం ప్రకృత్య - మఘావిషయగస్సోమ స్తద్దినం ప్రతిపద్యతేతిభీష్మపర్వణి సంజయ వాక్యా న్మఘాయాం యుద్ధారంభ ఇత్యపి నిరస్తం - బలదేవ వాక్య విరుద్ధత్వాత్ - శబ్దార్థస్తు - మఘాశబ్దేన తత్సహచరాః పితరో లక్ష్యంతే - తేన యుద్ధే మృతానాం ఉత్తమదేహప్రదానార్థం చంద్ర స్తదా పితృలోకే సన్నిహితో భూదితి - స్వర్గిణాం దివ్య దేహలాభఃచంద్రాధీన ఇతి శాస్త్ర ప్రసిద్ధః - తథా-ద్వాదశ రాత్రియుద్ధే చంద్రోదయకాలే। శ్లో॥ త్రిభాగమాత్రశేషాయాం రాత్రౌ యుద్ధమవర్తతేత్యుక్తం - తత్ర త్రిభాగేత్యస్య త్రిముహూర్త శేషాయామిత్యర్థః - తథా శ్లో। అష్టపంచాశతం రాత్ర్యః శయానస్యతుమే గతాఇతి భీష్మవచనంతు శ్లో। మాఘోయంసమను ప్రాప్తః... త్రిభాగమాత్రః పక్షోయమితి వాక్యశేషానుసారాత్ అశతం, శతహీనం యథాస్యాత్తథాష్టపంచ అష్టపంచాశద్రాత్రయో వ్యతీతా ఇత్యర్థః. తథాచ పౌషకృష్ణాష్టమీతో మాఘశుక్ల పంచమ్యంతావధిదిన సంఖ్యా పూర్యతే పక్షస్యచ తృతీయోభాగో గతోభవతి తత్రాప్యేకతిథి క్షయాత్ పంచమ్యాం ద్విచత్వారింశత్తమత్వం జ్ఞేయం- శేషోభవితతుమర్హతీత్యత్ర కార్యశేషో దేహత్యాగాది రేవ శేషో నతుతక్ష శేషఇతి వ్యాఖ్యాజ్ఞేయా - తత్రాయంనిష్కర్షః - కార్తికశుక్లద్వాదశ్యాం

(ఉత్తరదేశీయులు బహుళ పాడ్యమి మొదలు పూర్ణిమాంతము నొక మాసముగా లెక్కింతురు. మార్గశిరమాస మనఁగా నాంధ్రులయొక్క కార్తిక బహుళ పాడ్యమి యని తలంపవలెను ఈ క్రింది నట్టి లెక్కయే చెప్పఁబడినది) మార్గశిరమాసమున శుద్ధ త్రయోదశి యనఁగా చతుర్దశి యని గ్రహింపవలెను. ఏమనఁగా ఆ భారత సావిత్రియందే, అర్జునునిచే 1 భీష్ముఁడు మాఘశుద్ధాష్టమి యందును, త్రయోదశినాఁటి మధ్యాహ్నమున ద్రోణాచార్యుఁడును గొట్టఁబడి రనుటచేతను యుద్ధారంభమైన పదియవనాఁడును బదునేనవనాఁడును గొట్టఁబడిన "భీష్మద్రోణుల" కష్టమీ త్రయోదశీ సంబంధము చూపఁబడుటవలనను. ఇక్కడ పుష్యమాసమునందును, మకరాయనాభిప్రాయముచే మాఘశబ్దము గ్రహింపఁబడెను. అపుడు పుష్యమాసమున మకర సంక్రమణము సంభవించు టచే (ఒక్కొకప్పు డాంధ్రులకు పుష్యబహుళమున సంభవించిన మకరసంక్రాంతి నౌత్తరాహులు, మాఘమాసమునందైన మకరసంక్రమణ మందురు. కాని భారత యుద్ధవత్సరమున పుష్యశుద్ధముననే మకరసంక్రమణమై యున్నదని వ్యాఖ్యాత తాత్పర్యము.) సప్తమీ ద్వాదశి దినములలోనే భీష్మ ద్రోణుల మృతి కల్గి యుండును. అమావాస్యయందు దుర్యోధనుఁడు చంపఁబడెనని భారత

---

రేవత్యాం కృష్ణప్రయాణం - తతో మార్గశీర్ష కృష్ణపంచమ్యాం పుష్యే సేనయోర్నిర్యాణం - తతః పంచమ్యాఉపరి షష్ఠిమారభ్య సప్తదినాని గణయిత్వా తదుపర్యాష్టమేహ్ని అమావాస్యాభవిష్యతీత్యనేన త్రయోదశ దినాత్మకోయంకృష్ణపక్షో మహోత్పాతజనకఇతి సూచితం. క్షీణయోశ్చ తిథ్యోః పక్షాంతరే పునర్వృద్ధ్యాసంఖ్యా పూరణంభవతీతి మార్గశీర్ష కృష్ణ పంచమీమారభ్య పౌషశుక్ల ప్రతిపత్ ద్విచత్వారింశతిథిః భవతీతి బలదేవ వాక్యోక్తా దినసంఖ్యాదానుగృహీతా భవతి - యత్తు। శ్లో। సప్తమాచ్చాపి దివసా దమావాస్యాభవిష్యతి। సంగ్రామంయోజయేత్తత్ర తాం వ్యాహు శ్శక్రదేవతాం "ప్రయాతవై కురుక్షేత్రం పుష్యోద్యేతి పునఃపున" రితి దుర్యోధనవాక్యం - తత్ర సంగ్రామమిత్య నేనసంగ్రామే జయసాధనం కర్మ తస్యాంయోజయేదిత్యుక్తంశక్ర దేవతామిత్య నేన తస్యాం జ్యేష్ఠా నక్షత్రయోగ ఉచ్యతే - నచ తిథిద్వయక్షయాత్తత్రాసంభవన్నపి తత్ర తిథిపదేవ నక్షత్రక్షయాద్వా తిథినక్షత్రయో రాద్యంత యోగాద్వాజ్ఞేయ ఇతి సర్వసమంజసం—

1. మాఘమాసమున భీష్మనిర్యాణము సుప్రసిద్ధము. అది యుద్ధానంతరము కొన్నిదినముల కైనది. ద్రోణవధ యుద్ధములోనే జరిగియున్నది. అది మాఘమాసమునఁ గాలేదు. రెంటికిని సంబంధము కాన్పింపదు.

సావిత్రియందే కలదు. అమావాస్య శబ్దము "ఇష్టదినమగు" పాడ్యమియని గ్రహింపవలెను. యమదైవత నక్షత్రమున యుద్ధారంభమనుటలో "భరణీ నక్షత్ర" మని గ్రహింపరాదు. ఇఁక నేమనఁగా—యుగ్మదైవతమగు మృగశిరా నక్షత్రముగా గ్రహింపవలెను మృగశిరా నక్షత్రములో పూర్వార్ధ భాగము "వృషభరాశి" లోనిదై శుక్రదైవతాకమును, ఉత్తరార్ధ భాగము మిథునరాశి లోనిదై బుధదైవతాకమునై (పూర్వార్ధ మాసురము) ఉత్తరార్ధము దైవతమునై, రాక్షసాంశ సంభూతులగు దుర్యోధనాదులకు నష్టమును, దేవాంశ సంభూతులగు పాండవులకు జయమును సంపాదించు నక్షత్రమైనది. ఇంతియకాదు. యుద్ధారంభమైన పదునెనిమిదవనాఁడు, భీమ దుర్యోధనుల గదాయుద్ధముఁ జూచుటకు తీర్థయాత్రనుంచి వచ్చిన బలరాముఁడు 'నేను నేఁటికి నలువదిరెండు దినములకుఁ బూర్వము, పుష్యమీ నక్షత్రమునందు ప్రయాణమై వెడలితిని ఈనాఁడు శ్రావణా నక్షత్రమునందు మరల వచ్చితి' ననుటచే శ్రవణానక్షత్రము నందు యుద్ధసమాప్తి కాన్పించుచున్నది. అందువలన గతించిన పదునెనిమిదవ నక్షత్రమగు మృగశిరయందే యుద్ధారంభమగుచున్నది కాని కడచిన యిరువదియొకటవ నక్షత్రమగు భరణిలో యుద్ధారంభము కాదు. పదునెనిమిది దినములలో మూఁడు నక్షత్రములు క్షయించిన వని కల్పించుట యుక్తముగాదు. కార్తికశుద్ధ పూర్ణిమ కృత్తికానక్షత్రముతోఁ గూడినదగుటవలన మార్గశిరశుక్ల చతుర్దశియందు మృగశీర్షానక్షత్రము సంభవించినది. ఈ హేతువుచే భీష్మపర్వమునందు, మఘయందు యుద్ధారంభ మని సంజయుఁడు చెప్పిన వాక్యము నిరస్తమగుచున్నది. ఏమనఁగా బలదేవుఁడు చెప్పినమాట కీసంజయవాక్యము విరుద్ధమగుట చేతను—శబ్దార్థ మేమనఁగా మఘాశబ్దముచే, తత్సహచరులగు పితృదేవతలూహింపఁబడు చున్నారు. అందుచే యుద్ధమృతుల కుత్తమదేహముల నిచ్చుటకుఁగాను చంద్రుఁ డపుడు పితృలోక సన్నిహితుఁడై యుండెనని తలపవలెను. స్వర్గస్థులకు దివ్యదేహలాభము చంద్రాధీన మని శాస్త్ర ప్రసిద్ధి కలదు గదా—మఱియు ద్వాదశినాఁటి రాత్రి యుద్ధమునందు—చంద్రోదయకాలమునందు-మూఁడవవంతు రాత్రి మిగిలియుండఁగా యుద్ధము జరిగినది- అని చెప్పఁబడెను. అక్కడ మూఁడవవంతనఁగా మూఁడు ముహూర్తముల కాలముండఁగానని గ్రహింపవలెను. అట్లే "అష్టపంచాశతం రాత్ర్యః" "మాఘోఽయం సమనుప్రాప్తః" అను నానుశాసనిక పర్వాంతమున భీష్మునిచేఁ జెప్పఁబడిన వాక్యములలోని యర్థముకూడ మార్గశిరశుద్ధ చతుర్దశినాఁడే యుద్ధప్రారంభమనుదానికి సరిపోవుచున్నది. భీష్ముఁడు చెప్పిన "అష్టపంచాశతం రాత్ర్యః" అనుదాని కిటులనర్థముఁ జేయవలెను. గణితశాస్త్ర మర్యాద ననుసరించి కుడి

నుండి యెడమకు నంకెలను వేయుదురుగాన, 'అష్ట' యన నెనిమిది 'పంచ' యన నైదు అనఁగా యేఁబది యెనిమిది 'అశతం' నూటికి తక్కువ. అనఁగా నలువది రెండగును. ఇది "మాఘోయం" అను శ్లోకములోని "త్రిభాగమాత్ర పక్షము" పంచమి గాన, భీష్ముఁ డంపశయ్యపైఁ బడిన పుష్యబహుళాష్టమికి, మాఘశుద్ధ పంచమి నలువది రెండవదిన మగుచున్నది. (వెనుకను వ్రాసిన పద్ధతిప్రకారము పుష్యబహుళాష్టమి యన మార్గశిర బహుళాష్టమి యాంధ్రులకగునని తలఁపవలెను.) పై వాక్యార్థముల సారాంశ మేమనఁగా కార్తికశుద్ధ ద్వాదశిని రేవతిలో, కృష్ణుఁడు సంధికి హస్తిపురి కేగెను. మార్గశిర బహుళ పంచమిని పుష్యమిలో, కురుసేనలు ప్రయాణమైనవి. ఆ షష్టి మొదలు యేడవనాఁ డమావాస్య యనుటచే రెండు తిథులు క్షయించిన—పదుమూఁడు దినములైన—పక్షమిదియే. అది మహోత్పాత జనకమని వ్యాసుదు ధృతరాష్ట్రునితోఁ జెప్పియున్నాఁడు. క్షీణతిథులు, పై పక్షములలో మరల వృద్ధినొందును గాన మార్గశిర బహుళ పంచమినాఁడే, తీర్థయాత్రకుఁ జనిన బలదేవునకు పుష్యశుద్ధ ప్రతిపత్తులోని శ్రవణానక్షత్రము నలువది రెండవ దినములోని దగుచున్నది. మఱియు నేడుదినములలో నమావాస్య జ్యేష్ఠానక్షత్ర ముతోఁగూడిన దగుచున్నది. నాఁడే యుద్ధారంభముఁ జేయవలెనను దుర్యోధన వాక్యము, యుద్ధాదియందు జేయఁదగిన జయసాధనకర్మ యని తలఁపవలెను. (కాని కార్తికపూర్ణిమ కృత్తికానక్షత్రముతోఁ గూడినది గదా - రెండుతిథులు క్షయించినట్టియు, ననంతరమైనట్టియు బహుళామావాస్యకు జ్యేష్ఠానక్షత్ర మెటు లగునను శంక తిరిగి పుట్టినది) తిథులు క్షయించినటులనే, నక్షత్రములు కూడ క్షయింపవచ్చును. లేక పూర్ణిమారంభమునకు కృత్తికలోఁ గొన్ని గడియ లుండి యమావాస్యాంతమునకు జ్యేష్ఠాదిలోఁ గొన్ని గడియలు కలియవచ్చునని తలఁప వలసియున్నది. ఇట్లు సరిపెట్టుకొనుట మంచిది.

ఇట్లు వ్యాఖ్యాత "ఉద్యోగ భీష్మ శల్యానుశాసనిక" పర్వములలోని భాగములను సరిపెట్టినను "శాంతి పర్వము, ఏక పంచాశదధ్యాయము, పదు నాల్గవ శ్లోకమగు" పంచాశతం షట్చ" అను శ్లోకమునకు వ్యాఖ్యానమును వ్రాయుచు, భీష్ముఁడు శరతల్పఁ గతుఁడైన యిరువది తొమ్మిదవ దినమున కృష్ణుఁడు పాండవులతో భీష్ముఁ జూచుటకు వచ్చి, నేఁటికి ముప్పదవనాఁడు నీవు స్వర్గస్థుఁడ వగుదువని చెప్పినటుల నర్థముఁ జేసియున్నాఁడు. మన లెక్కను భీష్ముఁడు శరతల్పగతుఁ డగుట మార్గశిర బహుళ సప్తమి కృష్ణుడు భీష్మునితో మాటలాడిన దినము పుష్య బహుళ షష్ఠి నాఁటికి నెంయగు దినము, మాఘ బహుళ షష్ఠి కావలసి యున్నది కాన, వ్యాఖ్యాతభిప్రాయము సరిగా లేదని తలఁ తును. మూలమైన నొకదానితో నొకటి సరిపడి యుండలేదు, కార్తిక బహుళా

మావాస్య జ్యేష్ఠా నక్షత్రాదితోఁ గలిసినను, మకరసంక్రమణ "ముత్తరాషాఢా" ద్వితీయపాదమున, సూర్యుఁడు ప్రవేశించుటయేయైనచోఁ పుష్యబహుళ పంచమీ ప్రాంతముననే మకరసంక్రమణమగును. ఈ యన్యోన్యాశ్రయ దోషపుంజముల నడుమను, మకరసంక్రమణము ననుసరించి, భారతయుద్ధ కాలమును నిర్ణయింప వీలుకాకున్నది. [1]అన్యోన్య విరుద్ధములుగ భారత శ్లోకము లుండుటకుఁ గల కారణము "భారత గ్రంథకాలము" అను నంశమునఁ గొంత విమర్శింతును భారత శ్లోకములచే భారత యుద్ధకాలమును నిర్ణయించుట క్లిష్టము. విష్ణు భాగవత పురాణములో, భవిష్యత్కాల చరిత్రమును వ్రాయు సందర్భమునను, "కల్హణ మహాకవి" రాజతరంగిణియందు కాశ్మీరరాజుల కాల నిర్ణయ సమయమునను, మహాభారత యుద్ధకాల నిర్ణయమును జేసిరి. అందు భాగవతము ననుసరించి వ్రాసెదను. విష్ణు భాగవత పురాణములలో నిర్ణయింపఁబడిన యంశ మించుమించొకటిగానె యున్నది. దానిని వ్రాసి పిమ్మట రాజతరంగిణిలోని యంశమును వ్రాయుదును.

శ్రీమద్భాగవత ద్వాదశస్కంధ ప్రథమాధ్యాయమునందు "భావి కాల గతులు" అను శీర్షికతో, నీ క్రింది సంగతులు కలవు:

*"మగధరాజ్యము నేలిన జరాసంధ వంశజులలోఁ గడపటివాఁడగు" "పురంజయుని", అతని మంత్రియగు "శునకుఁడు" చంపి తన కుమారుఁడగు "ప్రద్యోతునికి" మగధరాజ్య పట్టముఁ గట్టెను ప్రద్యోతుఁడును నాతని సంతతి వారు నలువురును మొత్తమైదుగురు నూటముప్పది యెనిమిది ( 138) సంవత్సరములు మగధరాజ్యము నేలిరి ప్రద్యోతన వంశజులలోఁ గడపటివానిని శిశు

---

1. బుద్ధిమంతులెవరైన విశేషముల నాలోచింతురని పైయంశములు వ్రాసితిని.

* "యోఽన్త్యః పురంజయో నామ భవిష్యో బార్హద్రథః" శ్లో. తస్యామాత్యస్తు శునకో హత్వాస్వామినమాత్మజం। ప్రద్యోతసంజ్ఞం రాజానాం కర్తా యత్పాలకస్సుతః... పంచప్రదోతనాఇమే ... అష్టత్రింశోత్తరశ్శతం... భోక్ష్యంతి పృథివీం నృపాః శిశునాగ స్తతో భావ్యః కాకవర్ణస్తుతత్సుతః... శైశునాభాద్దశైవేతే షష్ట్యుత్తరశతత్రయం సమాభోక్ష్యంతి పృథివీం కురుశ్రేష్ఠకలౌనృపాః। మహానందసుతో రాజన్ శూద్రాగర్భోద్భవోబలీ మహాపద్మపతిః కశ్చిన్నందః క్షత్రవినాశకృత్...తస్యచాష్టౌభవిష్యంతి సుమాలి ప్రముఖాస్సుతాః యఇమాంభోక్ష్యంతిమహీం రాజానశ్చ శతంసమాః నవనందాన్ద్విజః కశ్చిత్ప్రపన్నానుద్ధరిష్యతి॥ తేషామభావేజగతీం మౌర్యాభోక్ష్యంతివైకలౌ సఏవ చంద్రగుప్తం వైద్విజోరాజ్యేభిషేక్ష్యతి........మౌర్యాహ్యేతేదశనృపాః సప్తత్రింశచ్ఛతోత్తరం—

నాగుఁడు వధించి, మగధము నాక్రమించెను. (శిశునాగునకు శిశునాభుఁ డని మఱియొక పేరు కలదు.) శిశునాగుఁడు మొదలు పదిమంది యా వంశజులు మగధరాజ్యము నేలిరి. (ఈ శిశునాగ వంశజులలో నైదవవాఁడగు "బిందు సారుఁడు" మగధరాజ్యము నేలుచుండినపుడే బుద్ధ భగవానుడు "రాజగృహ" మను మగధరాజధానికి వచ్చి, బిందుసారునికి బౌద్ధమతదీక్ష నిచ్చియున్నాఁడు.) శిశునాగ వంశజులు పదిమంది మూఁడువందల యఱువది (360) సంవత్సరములు పాలించిరి. శైశునాగులలోఁ గడపటివాఁడగు "మహానందునకు" శూద్రస్త్రీయందు "మహాపద్మనందుఁడు" పుట్టెను. ఆ మహాపద్మనందునకు "సుమాలి" మొదలగు నెనమండ్రు కుమారులు గలరు మహాపద్మనందుఁడు నాతని కుమారులు, నూతేండ్లు మగధమును బాలించిరి. ఆ నవనందులను బ్రాహ్మణుఁ డొకఁడు (చాణక్యుఁడు) చంపి, మౌర్య్య వంశస్థుఁడగు "చంద్రగుప్తుని" మగధరాజ్యమునకుఁ బట్టము గట్టెను. మౌర్య్య వంశస్థులు పదిమంది మగధ రాజ్యమును బాలించిరి.

పై యంశముల వలన మౌర్యచంద్రగుప్తుని రాజ్యారంభమునకుఁ బూర్వము అయిదువందల తొంబదియెనిమిది (598) సంవత్సరముల నాఁడు జరాసంధ వంశస్థుల రాజ్య మంతరించి యున్నదని తెలియవచ్చు చున్నది. మఱికొందఱు విమర్శకులు మహాపద్మనందుఁడు నాతని కుమారులు రాజ్యమేలిన నూఱు సంవత్సరముల కాలమును, శైశునాగుల రాజ్యకాలమగు (360) సంవత్సరములలోనే యిమిడియున్న దనుచున్నారు. అట్లయినను క్రీస్తుశకమునకుఁ బూర్వము (320) మూఁడువందల యిరువది సంవత్సరముల నాఁడు ప్రారంభింపఁబడిన చంద్రగుప్త రాజ్యసంవత్సరములతోఁ బై (498) నాలుగు వందల తొంబదియెనిమిది సంవత్సరములును గలుపఁగా క్రైస్తవ శకమునకుఁ బూర్వము (818) ఎనిమిదివందల పదునెనిమిది సంవత్సరములనాఁడే జరాసంధ వంశజుల రాజ్య మంతరించి యున్నది మఱియు శ్రీమద్భాగవతము, నవమ స్కంధమునందు భవిష్యద్రాజేతి హాసముఁ జెప్పు సందర్భమునందు "శ్రీశుకుఁడు", [1]"బృహద్రథుని" సంతతివారగు నేరాజులు కలరో వారు, వేయి సంవత్సరములు మగధేశముఁ బాలింతురు" అని చెప్పుటచే క్రీ. పూ. (819) సం॥రమున నంతరించినట్టియు, బృహద్రథ సంతతిలోఁ గడపటివాఁడై నట్టియు పురంజయునకుఁ బూర్వము వేయి సంవత్సరములు మగధను బార్హద్రథులు పాలించియుండిరి. కనుక బార్హద్రథ సంతతివారి రాజ్యము, వేయి సంవత్సరములును; ప్రద్యోతన శైశునాగమౌర్య్య వత్సరములు క్రీ. పూ. (818) ఎనిమిది వందల పదునెనిమిది కాని, (918) తొమ్మిదివందల పదునెనిమిది కాని, కలు

1. యేబార్హద్రథ భూపాలా భావ్యాస్తే సహస్రసంవత్సరం -

పఁగా 1000+818=1818 లేక 1918 క్రీస్తునకుఁ బూర్వము 19, 20 శతాబ్ది ప్రాంతములలో మగధమును, బార్హద్రథ భూపాలు రేలుట కారంభించి యున్నా రని స్పష్టమగుచున్నది. దేనిని మగధదేశమని మనమిపు డనుచుంటిమో దానిని, ఋగ్వేదకాల ఋషులు "కీకటదేశ" మనుచుండిరి. భాగవత ప్రథమస్కంధ వ్యాఖ్యలోఁగూడ కీకటదేశము మధ్యగయాప్రదేశ మని చెప్పఁబడెను. ఋగ్వేద మున, కీకటదేశ మనార్య ప్రదేశము. దానిని "ఉపరిచరవసువు" యొక్క కుమారుఁడగు "బృహద్రథుఁ" డేలుట కారంభించెను. బృహద్రథుని కుమారుఁడు "జరాసంధుఁడు." జరాసంధుఁడు కృష్ణునిఁ గూడ మహా యుద్ధమున బరుగిడు నటులఁ జేసిన శూరుడు. జరాసంధుఁడు కంసునకు మామ యగుటచేఁ బాండ వుల కంటెఁ గూడ వయస్సునఁ బెద్దవాఁడు. మగధ రాజ్యమును బృహద్రథుఁ డేలుటకు "ఉపరిచరవసువు" నియమించినటుల మహాభారతమునఁ గలదు. బార్హద్రథభూపాలురు మగధదేశమును వేయేండ్లు పాలించి రను స్థలమున బృహద్రథుఁడు మొదలుకొని పురంజయాంతము, వేయేండ్లు పాలించి రని చెప్పుట యుక్తమగు నర్థమగును అందువలన మగధ రాజ్యమున నార్యసంతతివారి రాజ్యాధిపత్యము క్రీ పూ. (1918) ఇరువదవ శతాబ్దమున నైయున్నదని చెప్పుట యుక్తము. బృహద్రథుని "సాపత్నిసోదరి" యగు "మత్స్యగంధి" శంతనుని భార్య. పాండవులకుఁ బ్రపితామహి భారత యుద్ధకాల మీ పద్ధతిని క్రీ. పూ. 17, 18 శతాబ్దముల లోనై యుండునని తోఁచుచున్నది. ఇంకొకపద్ధతి కలదు. అదియును భాగవతములోనిదే. చూడుఁడు—

శ్రీమద్భాగవత ద్వాదశస్కంధ ద్వితీయాధ్యాయమున, నిటుల నున్నది: శ్రీశుకుఁడు, పరీక్షిత్తుతో, నిట్లనుచున్నాడు. [1]ఓ పరీక్షిత్తా! నీ జన్మము మొదలు నందపట్టాభిషేకమువఱకు పదునొకండువందల పదునేను (1115) సంవత్సరము లగును—

[2]సప్తర్షులలో నాకాశమునందు పూర్వదిక్కున నుదయించు రెండు నక్షత్రములు "అశ్విన్యాది" నక్షత్రములలో నేనక్షత్రమునకు సమముగా

1. ఆరభ్య భవతో జన్మ యావన్నందాభిషేచనం ఏతద్వర్షసహస్రంతు శతం పంచదశోత్తరం॥

2. సప్తర్షీణాంతు యౌ పూర్వౌ దృశ్యేతే ఉదితౌ దివి। తయోస్తుమధ్యే నక్షత్రం దృశ్యతే యత్సమం నిశి, తేనైవ ఋషయోయుక్తా స్తిష్ఠంత్యబ్దశతం నృణాం తేత్వదీయే ద్విజాఃకాలే హ్యధునాచాశ్రితామఘాః। యదామఘా భ్యోయాస్యంతి పూర్వాషాఢాం మహర్షయః। తదానందాత్ప్రభృత్యేష కలిర్వృద్ధిం గమిష్యతి॥

నుండునో, సప్తర్షు లానక్షత్రమున నుండినటులఁ దలఁపవలయును. ఒక్కొక్క నక్షత్రమునందు సప్తర్షులు, నూఱేసి సంవత్సరము లుందురు. ఆ సప్తర్షు లిపుడు "మఘానక్షత్రము" నాశ్రయించియున్నారు. ఎపుడు మఘను వదలి (క్రమముగా) పూర్వాషాఢను సప్తర్షులు పొందుదురో, అపుడు "నందుఁడు" రాజగును. అది మొదలుకొని కలియుగము వృద్ధియగును— పై నందపట్టాభిషేకము "మహాపద్మనందునిదని" తోఁచును. మహాపద్మనందుని పట్టాభిషేకమునకుఁ బిమ్మట నూఱేండ్లకు చంద్రగుప్త రాజ్యాభిషేకమని తెలియుచున్నది. కాన, పరీక్షిన్నందుల మధ్యకాలము (1115 సం॥రము॥లు) నందపట్టాభిషేక చంద్రగుప్త పట్టాభిషేకముల మధ్యకాలము (100 సం॥రములు) కలుపఁగా (1115 + 100 = 1215) చంద్రగుప్తుని రాజ్యారంభమునకుఁ బూర్వము (పదిరెండు వందల పదునేను సంవత్సరములకుఁ బూర్వము) పరీక్షిజ్జననమనియు, క్రీ. పూ. 320 సంవత్సరములనాఁడగు, చంద్రగుప్తరాజ్యారంభ సంవత్సరములఁ గలుపఁగా క్రీ. పూ. (1535) పదునేనువందల ముప్పదియైదవ సంవత్సరమునందు పరీక్షిజ్జననమనియు, స్పష్టమగుచున్నది. మఱియు "ఖగోళము" నందలి సప్తర్షి సంచార నిదర్శనముతోఁ గూడిన విశేషాంశములు పరమప్రమాణములై యున్నవి కాని నేఁటి పాశ్చాత్యపరికరములచే, ఖగోళము శోధించు శోధకులు, సప్తర్షిమండలము చలింప దనుచున్నారు. దీని నెటుల సమాధానపఱుపవలెను? పైదానిని బట్టి పరీక్షిజ్జన్మకాలమునకుఁ బూర్వము నాలుగైదు మాసములలోనైన మహాభారత యుద్ధముకూడ, క్రీ పూ. 1535 సం॥రమున నగుచున్నది. వంగదేశీయుఁడును, శ్రీకృష్ణచరిత్రము నాంగ్లభాషలో వ్రాసినఁవాడునగు "ధీరేంద్రపాలు" అను శోధకుఁడుకూడ, శ్రీకృష్ణుఁడు క్రీ. పూ. 16-15 శతాబ్దముల నడుము నుండెనని వ్రాసియున్నాఁడు. అతనిలెక్క, భాగవత విష్ణుపురాణముల ననుసరించియే సరిపోయినది. కాని "పంచాంగములఁ" జేయు మన జ్యోతిశ్శాస్త్రజ్ఞులు పాండవులు "కలి" ప్రారంభమున నుండుటచే "కలియుగాబ్దములే" పాండవాబ్దములుగా దలఁచి నేఁటి కైదువేలేండ్లకుఁ బూర్వమే పాండవులు కలరని వ్రాయుచుందురు. కాని పాండవుల జన్మములకుఁ బూర్వముననే కలియుగము ప్రవేశించి యున్నదని, మహాభారతమునఁ బెక్కు చోటులను, శ్రీమద్భాగవతమునను, వ్రాయఁబడి యుండుటచే కలియుగము ప్రవేశించునాఁటికే, పాండవులుండి రనుటకు వీలు కాదు. పాండవులు కలియుగములోనివారే యనియు కురుపాండవ యుద్ధము కలియుగములోనిదే యనియు, నీ క్రింది ప్రమాణములఁ బట్టి యూహింపనగును:

"[1]నేనీ కలియుగమున నుంటిని. ధర్మములు సంకీర్ణ మగుచుండఁగో నింక నేమి మిగులును? ఇంకను వినఁ గుతూహలము కలదు. (చెపుమా)" ఇది ధర్మజుడు "మార్కండేయు" నడిగిన ప్రశ్న. మఱియు శల్యపర్వము (61) అధ్యాయమునఁ శ్రీకృష్ణుఁడు బలదేవకోపోపశమన సందర్భమున నిటు లను చున్నాఁడు:

"[2](బలదేవా) పొందఁబడిన కలియుగమును, భీముని ప్రతిజ్ఞను దెలిసి కొనుము" ఇది కలియుగము గాన యుద్ధశాస్త్ర విరుద్ధముగా భీముఁడు, దుర్యోధనుని తొడలను విఱుగఁ గొట్టవచ్చుననియుఁ గలియుగమునఁ దాముండినటులను శ్రీకృష్ణుఁడు సమర్థించు చున్నాఁడు (పై యంశము లించుమించు కృష్ణనిర్యాణమునకుఁ బూర్వము నలువది, ముప్పది యేండ్లనాఁడు జరిగినవై యున్నవి. కృష్ణనిర్యాణ దినముననే కలియుగ ప్రవేశమని చెప్పు వారి వాక్యములను పై యంశము ఃపాస్తము చేయుచున్నవి.)

''కల్హణ'' పండితుడును ''రాజతరంగణి'' యను ''కాశ్మీర రాజ" చరిత్రమున నిటుల వ్రాసెను.

[3]''కురుపాండవులు, భూలోకమునందు, కలియుగములో ''నాలుగువందల యేఁబదిమూఁడు'' సంవత్సరములు గతించిన పిమ్మట నుండిరి.'' (కల్హణుఁడు క్రీ.శ. పదునొకండవ శతాబ్దమున కాశ్మీరమున నుండిన మహాపండితుడు. ''నీల ముని పురాణాదులఁ" బరిశీలించి వ్రాసెను మఱియు జ్యోతిశాస్త్రనిదర్శనములఁ గూడ చూపి పై కాలనిర్ణయమును సమర్థించెను)

శ్రీమద్భాగవతమున ద్వాదశస్కంధమునం దిటులఁ గలదు.

---

1. అస్మిన్ కలియుగేత్వస్మి పునః కౌతూహలంమమ సమాకులేషు ధర్మేషు కిన్ను శేషం భవిష్యతి। అరణ్యపర్వ ౧౮౦ అధ్యాయ.

2. "ప్రాప్తం కలియుగం విద్ధి ప్రతిజ్ఞాం పాండవస్యచ" శల్యపర్వ ౧ అధ్యాయ.

3. శతేషు షట్సు సార్ధేషు త్ర్యధికేషుచ భూతలే. కలేర్గతేషు వర్షాణాం। అభవన్కురుపాండవాః। రాజతరంగిణి। (రాజతరంగిణీ నిర్ణయములను కాశీలోని మహా మహోపాధ్యాయ సుధాకర పండితుఁడు సమర్థించి వ్రాసి యున్నాఁడు.)

1"భగవంతుఁడగు విష్ణుని కిరణమగు (అంశము) శ్రీకృష్ణుఁడు స్వర్గస్థుఁడైనపుడే పాపమునందు రమించు మనస్సుగల కలియుగము ప్రవేశించినది."

"ఎంతవఱకు శ్రీకృష్ణుఁడు తన పాదములచే, భూమిని స్పృశించుచుండెనో అంతకాలము కలి భూమియందు పరాక్రమింపలేదు."

"ఏ దినమున శ్రీకృష్ణుఁడు స్వర్గము నొందెనో యా దినముననే కలి యుగము ప్రవేశించె నని ప్రాచీను లనుచున్నారు."

పై శ్లోకతాత్పర్యములు కలియుగారంభము, శ్రీకృష్ణుని మరణము, నేకదినమే యని కొందఱమతమై యున్నదనుట స్పష్టమగుచున్నదిగాని, భాగవత గ్రంథకర్త మతమది కాదని "ప్రాచీనులనుచున్నారు" అనుటచేతను, శ్రీకృష్ణుఁడుండఁగ, కలి, పరాక్రమింప లేదనుటచేతను వెల్లడియగుచున్నది. శ్రీ మద్భాగవత వ్యాఖ్యాత యగు శ్రీధరాచార్యుఁడును కలి భూమిపైఁ బరాక్రమింప లేదను చోట నిటుల వ్రాయుచున్నాఁడు:

2"శ్రీకృష్ణుడు భూమియం దుండినపుడే కలియుగము సంధ్యారూపముచేఁ బ్రవేశించియే యున్నది. నిజము అయినను, కలి పరాక్రమింపలేదు."

భాగవతమున నాఘట్టముననే, కలియుగ ప్రవేశమునకు ఖగోళ నిదర్శన మిటుల వ్రాయఁబడినది.

3"ఎపుడు సప్తర్షులును మఘానక్షత్రములయందు సంచరింతురో అపుడు (పదిరెండువందల సంవత్సరముల స్వరూపము గల కలి ప్రవృత్తియైనది" ఎపుడు మఘానక్షత్రములనుండి సప్తర్షులును, పూర్వాషాఢను బ్రవేశింతురో అవుడు) "నందుఁడు" మొదలుకొని కలి వృద్ధిఁగనును."

---

1. విష్ణోర్భగవతో భానుః కృష్ణాఖ్యోసౌ దివంగతః తదావిశత్కలిర్లోకం యత్పాపే రమతేమనః—యావత్సపాదపద్మాభ్యాం స్పృశన్నాస్తే రమాపతిః తావ త్కలిర్వైపృథివీం పరాక్రాంతుం నచాశకత్—యస్మిన్కృష్ణో దివంయాతః తస్మిన్నేవ తదాహని ప్రతిపన్నం కలియుగమితి ప్రాహుః పురావిదః—
2. "నను శ్రీకృష్ణే పృథివ్యాం వర్తమానేపి సంధ్యారూపేణ కలిఃప్రవిష్ట ఏవాసీత్ సత్యం తథాపి తావత్ తస్యపరాక్రమో నాభవత్."
3. యదా దేవర్షయస్సప్త మఘాసు విచరంతిహి। తదాప్రవృత్తిస్తు కలిర్ద్వాదశాబ్ది శతాత్మకః—యదామఘాభ్యో యాస్యంతి పూర్వాషాఢాం మహర్షయః తదా నందాత్ప్రభృత్యేష కలిర్వృద్ధిం గమిష్యతి"—

పై కారణములలో కల్హణుఁడు పరిశోధించి, కలియుగాబ్దములను స్పష్టముగా చెప్పుట గమనింపఁ దగియున్నది. భాగవతమున, "పదిరెండువందల" సంవత్సరములు మఘానక్షత్రమున సప్తర్షు లుండునపుడు కలిలోఁ బ్రవృత్తమైన దనుటచే, మఘానక్షత్రమున సప్తర్షులుండు కాలము పరీక్షిజ్జన్మ కాలముగాన నాఁటికి అనఁగా భారత యుద్ధకాలము నాఁటికి—కలియుగములో నించుమించు పదిరెండువందల సంవత్సరములు గడచినవని భాగవతకారుని తాత్పర్యమై యున్నది. ఇంకొక లెక్క—ఇది శ్రీమద్భాగవత వ్యాఖ్యాత యగు శ్రీధరాచార్యుని మతము. అతఁడు "ఆరభ్యభవతోజన్మ" అను శ్లోకవ్యాఖ్యలో నిటు లనినాఁడు:

[1]''పదునొకండువందల పదునేను సంవత్సరముల''ని యే కారణముచేఁ జెప్పఁబడినది? వాస్తవముచే—"పరీక్షిన్నందుల" మధ్యకాలము పదునాలుగు వందల తొంబదియెనిమిది. ఎందువలన ననఁగా—పరీక్షితునితో సమకాలికుఁడై మగధము నేలుచుండిన జరాసంధ పౌత్రుఁడగు ''మార్జారి'' మొదలు పురంజయాంతము వఱకు రాజులు వేయి వత్సరములు భూమి నేలుదురని ''నవమ స్కంధము''నఁ గలదు. బార్హద్రథులు వేయి సంవత్సరము లేలిన పిమ్మట ''ప్రద్యోతనులు'' నూట ముప్పది యెనిమిది సంవత్సరములు, శైశునాగులు మూఁడువందల యఱువది సంవత్సరములు నేలిరని యచటనే చెప్పియుండుట చేతను—పదునాలుగు వందల తొంబది యెనిమిది యైనది. ఈ ప్రకారముచే నైనను పాండవులు కలియుగారంభమున లేక, కలిలో (1182) పదునొకండు వందల యెనుబది రెండు సంవత్సరములు గడిచిన తరువాత నుండినటుల స్పష్టమగు చున్నది. అయినను, పరీక్షిజ్జన్మము మొదలు నంద పట్టాభిషేకమువఱకు పదునొకండువందల పదునేను (1115) అని భగోళ నిదర్శనముతోఁ జెప్పిన సంఖ్యయే పరమప్రమాణముగా నెంచవలసి యున్నది. "బార్హద్రథ భూపాలాః సహస్రవత్సరం" అనుచోట జరాసంధుని తండ్రి

1. ఆరభ్యేతి, వర్ష సహస్రం పంచదశోత్తరం శతంచేతి కయాపి విపక్షయా? అవాంతరసంఖ్యేయం వస్తుతస్తు—పరీక్షిన్నందయోరంతరం ద్వాభ్యామూనం వర్షాణాం సార్ధం సహస్రం భవతి. యతః పరీక్షిత్సమకాలం మాగధం మార్జారిమారభ్య రిపుంజయాంతాః వింశతిరాజానః సహస్రం సంవత్సరాన్ భోక్ష్యంతీత్యుక్తం నవమస్కంధే-యే బార్హద్రథభూపాలా భావ్యాస్తే సహస్రవత్సరమితి. తతః పరంచ ప్రద్యోతనా అష్టత్రింశోత్తర శతం. శైశునాగాశ్చ షష్ట్యుత్తరశతత్రయం భోక్ష్యంతి పృథివీమిత్యత్రైవోక్తత్వాత్.

మొదలుకొని పురంజయాంతము వేయి సంవత్సరములను నర్థము సరిపోవును. కాన "మార్జారి" మొదలు వేయి సంవత్సరము లని యింకొక (498) నాలుగు వందల తొంబది ఎనిమిది సంవత్సరముల గలుప నవసరము కాన్పింపదు. పై చర్చవలన క్రీ పూ. పదునేను పదునాలు శతాబ్దముల మధ్యమున మహాభారత యుద్ధమైయున్నదను "ధీరేంద్రనాథపాలు" గారి మతములతో నా మత మేకీభ వించుచున్నది. ఇందును గుఱించి లోకమాన్యతిలకు టూకీగా పదునాల్గవ శతాబ్ది మున యుద్ధమైయుండు ననుట దురూహము—

మఱికొందఱు నందవంశనాశకుఁడగు చంద్రగుప్తుఁడు క్రైస్తవ మతము నకుఁ బూర్వము మూఁడువందల సంవత్సరముల నాఁటివాఁడు కాఁడనియు, చంద్రగుప్తుఁ డంతకుముం దెపుడో క్రీస్తునకుఁ బూర్వము పదునేనవ శతాబ్ది ప్రాంతముననే గతించె ననియు, క్రీస్తునకు బూర్వము మూఁడువందల సంవత్స రములనాఁ డుండిన యాతఁడు గుప్తవంశస్థుఁడగు చంద్రగుప్త దనియుఁ జెప్పి కలియుగాదిని బాండవు లుండినటుల నంకెలను సర్దుచున్నారు. కాని దీనిని కొన్ని యంశములు బాధించుచున్నవి.

1. వ్యాసప్రోక్త మనిచెప్పఁబడు భాగవతముననే "శ్రీకృష్ణుఁడు దివంగ తుండైనపుడు కలి ప్రవేశించె నని ప్రాచీను లనుచున్నారు" అని కేచిత్పక్ష మును సూచించుట.

2. తద్వ్యాఖ్యాతకూడ కలి సంధ్యారూపముచే శ్రీకృష్ణుఁ డుండఁగనే ప్రవేశించె నని యంగీకరించుట (ఇంకను సంధ్యారూపముగానె కలి యున్నది.)

3. మహాభారతమునను దాము కలియుగములో నుంటిమని ధర్మజ, శ్రీకృష్ణులనిన (అరణ్య, శల్యపర్వములలో) వాక్యములు.

4. మౌర్య చంద్రగుప్తుం పౌత్రుఁడగు నశోకచక్రవర్తి క్రీస్తునకుఁ బూర్వము అయిదాఱు శతాబ్దములలో నుద్భవించిన "శాక్యసింహుని" బౌద్ధ మతమును వ్యాప్తిఁ జేసిన యంశములు.

5. అశోకుని (2, 13) శిలాశాసనములలోఁ బేర్కొనఁబడిన i సిరియా దేశ ప్రభుఁడగు, ఆంటియోకస్ థియాసు, ii ఈజిప్టు ప్రభువగు టాలెమీ ఫిలా డెల్ఫాసు iii సిరీణా ప్రభువగు మాగ్యాను iv మ్యాసిడోనియా ప్రభువగు ఆంటిగో నోసుగోనాటసు, v ఎపిరస్‌విభుఁడగు అలాగ్జండరు అనువారలకాలములు స్పష్ట ముగా క్రీస్తునకుఁ బూర్వము మూఁడవ శతాబ్దముననే యుండినటు లాయాదేశ స్థులు వ్రాసియుండుట.

6. అశోకునకుఁ బిమ్మట మౌర్య రాజ్యాంతకుఁడగు "పుష్యమిత్రుడు" తదాస్థాన విద్వాంసుఁడగు పతంజలి మహాభాష్యమున వర్ణింపఁబడుటయు, ఆ

భాష్యమున బౌద్ధమతాంశములఁ గూర్చి వ్రాసియుండటయు. (ఎవ్వరును బౌద్ధ మత స్థాపకుఁడగు శాక్యసింహుని క్రీ. పూ. ఏడవ శతాబ్దమునకుఁ బ్రాచీనునిగా వర్ణింపలేదు. ఆ మతమును వ్యాపింపఁ జేసిన యశోకుఁడు క్రీ. పూ. పదునేనవ శతాబ్దములో నుండిన మౌర్య చంద్రగుప్తునకుఁ బౌత్రుఁ డగుట యసంభవము.)

మహాభారత యుద్ధకాలమును గుఱించి ప్రాక్పశ్చిమ దేశస్థగ్రంథకర్తల యొక్కయుఁ బండితుల యొక్కయు నభిప్రాయముల నీక్రింద నిచ్చుచున్నాను.

| | | | |
|---|---|---|---|
| పంచాంగ కర్తలు క్రీస్తునకుఁ బూర్వము | 3100 | సంవత్సరములు | |
| కల్హణపండితుఁడు | ,, | 2447 | ,, |
| సుధాకరపండితుడు | ,, | 2447 | ,, |
| శ్రీమద్భాగవతము | ,, | 1565 | నవనందులపాలనము నూఱేండ్లని తలఁచి యా నూఱేండ్లను గలిపిన యెడల. |
| మత్స్యపురాణము | ,, | 1565 | |
| వాయుపురాణము | ,, | 1565 | |
| విష్ణుపురాణము | ,, | 1580 | |
| ధీరేంద్రనాథపాలు | ,, | 1620 | |
| బంకించంద్రచట్టోపాధ్యాయుఁడు | ,, | 1520 | |
| లోకమాన్యబాలగంగాధరతిలకు | ,, | 14 వ శతాబ్దము. | |

### పాశ్చాత్యపండితులు

| | | |
|---|---|---|
| కోల్బ్రూకు | క్రీ.పూ | 14 వ శతాబ్దము. |
| విల్సను | ,, | 14 ,, |
| ఎలిఫిన్స్టను | ,, | 14 ,, |
| విల్ఫ్రిడ్డు | ,, | 1870 సంవత్సరము. |
| బుకాననను | ,, | 18 వ శతాబ్దము |
| ప్రాటు | ,, | 18 ,, |

(క్రైస్తవశకమునకుఁ బూర్వము పదునాఱవ శతాబ్దమున మహాభారత యుద్ధమైన దనువారు చాలమంది కలరు. నాదియు నామతమె యై యున్నది)

# మహాభారత చరిత్రము

## మహాభారత రచనావిధానము

వేదములోని ఛందోనియమములను, లౌకికభాషకుఁ దెచ్చినవాఁడు 'వాల్మీకి.' సంస్కృతవాఙ్మయమున నాతని రామాయణమునకుం గల "కవితా వైశద్యము" మహాభారతమునకు లేదు. కాళిదాస మహాకవి సర్వవిధముల వాల్మీకి ననుసరించియే కవిత్వముఁ జెప్పినటులఁ గవితా విమర్శకులు తలఁతురు. రామాయణములోని యుత్తరకాండముగాక తక్కిన కాండముల నొక్కఁడే రచించియుండె నని, కవితాపద్ధతి వెల్లడి చేయుచున్నది. భారత మటులు లేదు. [1]కర్ణ పర్వములోని కర్ణవధ ఘట్టము కాక, మిగిలిన మహాభారత మంతయుఁ గవిత్వపు విశేషములను స్ఫురింపఁ జేయదు. లక్ష శ్లోకపరిమితి గల మహాభారత మంతయు "శతసహస్ర్యాం వై యాసిక్యాం" అనుటచే దానికి వ్యాసుఁడే కర్త యని స్థూలదృష్టిని గాన్పించును. కాని సూక్ష్మదృష్టితో నాలోచించినచో, వ్యాసుఁడు వైశంపాయనుఁడు, సౌతి, యను వారలు, జయభారత మహాభారతములను గ్రంథములఁ జేసి రనియు, వ్యాసుని "జయ" మును వైశంపాయనుండును; వ్యాస, వైశంపాయనుల గ్రంథములను, సౌతియుఁ దమ గ్రంథములలోఁ గలిపివేసి, యేది వ్యాసకృతమో, యేది వైశంపాయనకృతమో, యేది సౌతి కృతమో తెలియకుండఁగఁ జేసిరనియు విశదము కాఁగలదు. ఇందులకు మహాభారతముననే నిదర్శనములు కలవు మనకుఁ గాన్పించు మహాభారతము గాక, వ్యాసుని శిష్యులగు "సుమంతుఁడు, జైమిని, పైలుఁడు, శుకుఁడు, వైశంపాయనుఁడు" గూడ మహాభారత సంహితలఁ జేసిరని యీ క్రింది శ్లోకార్థములు చెప్పుచున్నవి.

[2]వ్యాసుఁడు - వేదములను, భారతమును "సుమంతుఁడు, జైమిని, పైలుఁడు శుకుఁడు, వైశంపాయనుడు" నను నైదుగురు శిష్యులచేఁ జదివించెను. వారైదుగురు నైదు వేర్వేఱు భారతసంహితలఁ బ్రకాశింపఁజేసిరి.

---

1. కర్ణవధ ఘట్టము, ఇంపుగా శబ్దార్థాలంకార భూయిష్ఠమై వ్రాయఁబడెను.
2. వేదానధ్యాపయామాస మహాభారత పంచమాన్ సుమంతుం జైమినిం పైలం శుకం చైవ స్వమాత్మజం। ప్రభుర్వరిష్ఠో వరదో వైశంపాయన మేవచ సంహితాస్తైః పృథక్త్వేన భారతస్య ప్రకాశితాః. ఆదిపర్వం॥ ౯౩—౯౦

5357

మఱియు క్రీ పూ. పదియవ శతాబ్ద ప్రాంతమునందుండిన "ఆశ్వలాయనుఁడు" తన గృహ్యసూత్రములలో భారత మహాభారత గ్రంథములు వేఱుగా నుండె ననియు, "సుమంత్వా"ది వ్యాసశిష్యులు భారత గ్రంథకర్త లనియు, జెప్పుచున్నాఁడు. చూడుఁడు.

[1]సుమంతుఁడు, జైమిని, వైశంపాయనుఁడు పైలుఁడు, సూత్రభాష్య భారత మహాభారత ధర్మాచార్యుల—

"జయ" మనునది వ్యాసకృతమనుట కారంభశ్లోకమె [2]సాక్ష్యము. ఈ జయశబ్ద మచటనచట సూచించియున్నాఁడు. [3]సుమంతు, పైలాదుల భారతము లిపుడంతర్హితమైనవి. జైమిని భారతములోని యశ్వమేధపర్వమె నిలచియున్నది. "వైశంపాయకృత" మను భారతమే నేఁడు మనచేఁ బఠింపఁబడుచున్నదట. నేఁడు కాన్పించు మహా భారతములోనే "వ్యాస, వైశంపాయన, సౌతి" కృత భాగము లున్నవని వ్రాసియుంటిని. కవిత్రయకృత సంస్కృత మహాభారతము నాంధ్రీకరించుటలోఁగూడ కవిత్రయ సంబంధమె కలిగియుండుట యాశ్చర్యకరము. ఆంధ్రీకృత మహాభారతములోని కవిత్రయ భాగములను విభజించినటుల సంస్కృత మహాభారతములోని వ్యాస వైశంపాయనాదుల భాగములను విభజింపలేము. కారణ మేమనఁగా వ్యాసుని జయమును, వైశంపాయనుఁడు తాను రచించు భారతమున కనువగునటుల నడుమనడుమ సవరించుకొనినాఁడు అటులనే సౌతి, వ్యాసుని జయముతో మిశ్రమైన వైశంపాయన భారతమును తన మహా భారతములో సవరించుకొనినాఁడు. అందువలన వ్యాస, వైశంపాయనుల "జయ భారతముల"ను విభజింప శక్యము కాకున్నది. కాని, సౌతి శౌనకాదులకును వైశంపాయన జనమేజయులకునునైన ప్రశ్నోత్తరములు మాత్రము

---

1. సుమంతు జైమిని వైశంపాయన పైల సూత్ర భాష్య భారత మహాభారత ధర్మాచార్యాః అ. గృ ౩—౪—౪
ఆశ్వలాయనుఁడు, ఆపస్తంబునికంటెఁ బూర్వికుఁడు. అత డాపస్తంబునికి మామయఁట! ఈ యంశము ౫ అంగీరస సం॥రపు ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వ్రాసియున్నాను.

2. నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం దేవీం సరస్వతీం వ్యాసప్తతో జయ ముదీరయేత్. (వ్యాసః అను పదమునకు మాఱుగా వ్యాప్తః, చైవ అను పదములు కొన్ని ప్రతులలో గలవు. మూఁడు విధములగు పదములకును సమర్థనీయార్థమును పండితులు చెప్పుదురు వ్యాప్తః అను పదమునే వ్యాఖ్యాత గ్రహించెను.)

3. జయోనామేతిహాసోయం॥ స్వర్గారోపణపర్వ। ఆదిపర్వ॥ ౬౨ అధ్యా.

వ్యాసుని జయములోనివి కావని, సూక్ష్మముగాఁ జెప్పవచ్చును. ఆశ్వలాయనుని కాలమునకు (క్రీ.పూ 10 శతాబ్ద ప్రాంతము) వ్యాసుని జయము కాకుండినను, భారత మహాభారతములు మాత్రము వేర్వేఱుగ నుండినటుల నాతని గృహ్యా సూత్రమె సాక్ష్యమిచ్చుచున్నది. క్రీ. శ. నాలవ శతాబ్దమునకు, జయభారత మహాభారతము లిప్పటివలె కలిసి యేకరూపముగా లక్షశ్లోకపరిమితి కలవిగా నున్నవని క్రీ. శ. (౩౬౨) సంవత్సరపు "గుప్త" శాసనముచే నూహింపఁబడు చున్నది. ఆ "శిలాశాసనము"యొక్క సంపూర్ణ ప్రతిబింబమును దొరతనపువారి శాసనశోధకులు ప్రకటించియున్నారు. మఱియు "భాసమహాకవి" నాఁటికి నేఁటి భారతరూప మేర్పడియె యుండునని యాతని నాటకమువలె సాక్ష్యమిచ్చుచున్నవి. ఆ మహాకవి భారతములోని "వనపర్వము"నుండి శల్య పర్వాంతము వఱకు నుండిన గాథల "నాఱు" నాటకములనుగా రచించియున్నాఁడు. 1. మధ్యమ వ్యాయోగము: ఇది పాండవు లరణ్యమున నుండఁగ భీమ ఘటోత్కచులకుఁ జరిగిన గాథ మఱియు నాదిపర్వములోని ఘటోత్కచ జన్మాదికమును, సభా పర్వములోని ద్యూతవిజితులగు పాండవులు వనవాసమున కేఁగుటయును సూచించుచున్నది 2 పంచరాత్రము—ఇది పాండవు లజ్ఞాతవాసమున నుండునపు డయిన కీచకవధ గోగ్రహణము, అభిమన్యు వివాహాదికము మొదలగు వానిని సూచించుచున్నది. 3 దూతవాక్యము ఇది శ్రీకృష్ణరాయబారముఁ జెప్పుచున్నది. ఇందు పాండవులు దుర్యోధనునకు సజాతిజులు కాకుండుటచేతనే కురుపాండవుల కైక్యము లేదను నంశము దుర్యోధను వాక్యములలోఁ జెప్పఁబడెను. 4. దూత ఘటోత్కచము ఇది భీష్మపర్వాది గాథను సూచించుచున్నది. 5. కర్ణభారము. ఇది యరణ్యపర్వాంత గాథను గర్ణపర్వ గాథతోఁ గలిపి చెప్పుచున్నది. 6 ఊరు భంగము. ఇది శల్యపర్వాంత గాథను జెప్పుచున్నది. *మఱియు "బాల చరితము" అను నింకొక నాటకమును భాసమహాకవి రచించియుండెను ఆ నాటక గాథ. హరివంశములోని గోపికలగు బాలకృష్ణునకు నైన కథలఁగూడఁ జెప్పుచున్నది గాన, హరివంశము కూడ భాసుని నాఁటికిఁ గలిగి యున్నదని స్పష్టమగు చున్నది. కాని భాసుఁ డెప్పటివాఁడు? కాళిదాసు కూడ మాళవికాగ్నిమిత్రమునందు భాసునిఁ దలఁచుటచే నంతకుఁ బూర్వుడు. స్వప్నవాసదత్త నాటకపుఁ టీకకలో, త. గణపతిశాస్త్రిలవారు భాసుఁడు చాణక్యునికంటెఁ గూడ ప్రాచీనుఁడని వ్రాసియున్నారు. కారణ మేమనఁగా, భాసుని నాటకము

* దుర్యోధనునితోఁ గౌరవులు నశింపలేదని యీ కథలోని దుర్యోధనపుత్ర శబ్దముచేఁ దెలియనగును. "పరిక్షిత్తు" గూర్చి వ్రాసినపుడా యంశము వ్రాయఁబడును.

లోని శ్లోకమొకటి "కౌటిల్యుని" (చాణక్యుని) యర్థశాస్త్రమున "నుల్లిఖింపఁబడి" యున్నదఁట. కౌటిల్యుఁ డచట నిది యన్యుని శ్లోక మని సూచించి యున్నాఁడఁట. కాన కౌటిల్యుఁడు భాసుని నాటకములోని శ్లోకమునే యుదాహరించి యుండునని, గణపతి శాస్త్రులవారి యభిప్రాయమై యున్నది. మఱియు భాసుని ప్రయోగములలోఁ గొన్ని "పాణినీయ" విరుద్ధములుగా నున్నవి గాన భాసుఁడు పాణినికంటెఁ గూడ పూర్వుకుఁడని కొంద ఱందురు గాని క్రీ.పూ. 7 శతాబ్ది ప్రాంతమున నుండిన "ఉదయనుని" గాథను భాసుఁడు నాటకముగా రచించియుండుటచేఁ "పాణిని" కంటె భాసుఁడు పూర్వుఁ డనుటకు వీలులేదు కాని, చాణక్యునికంటెఁ బూర్వుకుఁడై క్రీ.పూ. 5 శతాబ్ది ప్రాంతమున నుండి నుండవచ్చును. నాఁటికి భారత మహాభారత గాథలు వేర్వేఱుగ నుండినను నుండవచ్చును. వ్యాసుని భారతము సౌప్తిక పర్వాంతము వఱకే యని వ్రాయఁబోవుచున్నాను. అదియే భారతగాథ. ఆ భారతగాథనే భాసుఁడాఱు నాటకములనుగా రచించి, మహాభారతములోని గాథనుగూడ నాటకమునుగా రచించి యుంటి ననుటకుఁగాను తదంతర్గత మని యెన్నఁబడు హరివంశములోని గాథను "బాలచరితము"గా రచించియుండును లోకమాన్యతిలకు, భాసుఁడు కాళిదాసునికంటెఁ బూర్వుకుఁడై యైనను క్రీ.శ. 1, 2 శతాబ్దములనాఁటి వాఁడై యగునని తలఁతు ననినాఁడు. గణపతి శాస్త్రులవారి శ్లోకదృష్టాంత పూర్వకమగు నిదర్శనము, లోకమాన్యుని తలఁపుకంటె ప్రమాణము క్రీ.శ. నాలవ శతాబ్దములోని గుప్తరాజులనాఁటికి, లక్ష శ్లోకపరిమితి గల భారత ముండుటయు, ఆశ్వలాయన, భాసమహాకవులనాఁటికి, భారత, మహాభారత గ్రంథములు వేఱుగఁ నుండుటయు నిశ్చయమని నా తలంపు వ్యాసాదు లెపుడు జయాదులను రచించిరి? వారి గ్రంథముల కాద్యంతము లెచట నెచటనై యుండును? అనుదానిని గుఱించి విమర్శింతము.

వ్యాసుఁడు భారతయుద్ధ మింక నగుననఁగా, ధృతరాష్ట్రునికడకు వచ్చి, మహోత్పాతములను వర్ణించి, యుద్ధము ఘోరముగఁ దప్పక యగుననియు, అందుఁ గౌరవులు నశింతురనియు, వారి కీర్తిని గ్రంథరూపముతో లోకమున వ్యాపింపఁ జేయుదు ననియుఁ జెప్పి, యుద్ధవృత్తాంతములఁ జెప్పను సంజయుని నియోగించి హిమాలయారణ్యమున కేఁగెను. అతఁ డచట మూఁడేండ్లు భారతమును రచించె ననియు, అవి (8800) యెనిమిదివేల యెనిమిదివందల శ్లోకములుండు ననియు భేదింప శక్యము కాకుండు ననియు నీక్రింది శ్లోకార్థములు చెప్పుచున్నవి:

[1]కృష్ణద్వైపాయనుఁడు మూఁడేండ్లు దీక్షకలవాఁడై యీ మహాభారత మను నద్భుతమగు నాఖ్యానమును జేసియున్నాఁడు— (ఇది వైశంపాయన వాక్యము.)

[2]వ్యాసుఁడు గూఢమగు గ్రంథ గ్రంథిని గుతూహలముతో దేనిని బ్రతిజ్ఞ చేసెనో దానిని జేసెను—

(ఆ గ్రంథము) ఎనిమిదివేల యెనిమిదివందల శ్లోకములు కలది. దీనిని నేనెఱుఁగుదును. శుకుఁ డెఱుఁగును. సంజయుఁ డెఱుఁగునో యెఱుఁగడో, ఆ శ్లోక కూట మిపుడును సుదృఢముగా గ్రథితమైయున్నది సుమా! శౌనకా! అది గూఢ మగుటచేతను బ్రశ్రితమగుటచేతను, అర్థమునకు భేదింప శక్యము కాకున్నది. (ఇది సౌతి శౌనకునితోఁ జెప్పిన వాక్యము) ఎనిమిదివేల ఎనిమిది వందల శ్లోకములు వ్యాసకృత మగుట సత్యము. వానిని నేఁటి యాంధ్రదేశపుఁ బండి తులు వ్యాస ఘట్టములనియు గూఢార్థ యుక్తములనియుఁ దలఁతురు సౌతి కాలమున కవి, వైశంపాయన భారతము నందిమిడియున్నవి. వాని నాతఁ డెఱుఁ గును. శుకుఁ డెఱుఁగునట. సంజయుఁ డెఱుఁగునో యెఱుఁగఁడో యని సౌతి చెప్పుచున్నాఁడు. సౌతి యీ మహాభారత ముపాఖ్యానములతో లక్ష శ్లోకపరిమితి కలదనియు, నుపాఖ్యానములు లేనిదాని నిరువది నాల్గువేల శ్లోకపరిమితి కల దానిని (వ్యాసుఁడు) చేసియున్నాడనియు, ఉపాఖ్యానరహితమైనది భారత మనియు, పిమ్మట నధికమగు నర్ధశత శ్లోకములతోఁ దాఁ జేసిన గ్రంథమున కనుక్రమణికఁ జేసియున్నాడనియు నీ క్రింది శ్లోక తాత్పర్యములచేఁ దెలియ నగును

[3]ఈ పుణ్యమైన నూఱువేల శ్లోకములుగల భారత ముపాఖ్యానములతోఁ గూడినదని తెలిసికొనవలయును. ఉపాఖ్యాన రహితమగు నిరువది నాలుగువేల

---

1. త్రిభిర్వర్షై స్సదోత్థాయీ కృష్ణద్వైపాయనోమునిః। మహాభారతమాఖ్యానం కృతవానిద మద్భుతం (ఆదిపర్వ ౬౩—౩౨)
2. గ్రంథగ్రంథిం తదాచక్రే మునిర్గూఢం కుతూహలాత్, యస్మిన్ ప్రతిజ్ఞ యా ప్రాహమునిర్ద్వైపాయనస్త్విదం, అష్టౌ శ్లోకసహస్రాణి హ్యష్టౌ శ్లోక శతానిచ, అహంవేద్మి శుకోవేత్తి సంజయోవేత్తి వానవా, తచ్ఛ్లోకకూట మద్యాపి గ్రథితం సుదృఢం మునే, భేత్తుం నశక్యతేర్థస్య గూఢత్వాత్ప్ర శ్రితస్యచ॥—ఆదిపర్వ, అనుక్రమణికాధ్యాయ—
3. ఇదం శతసహస్రాఖ్యం శ్లోకానాం పుణ్యకర్మణాం ఉపాఖ్యానైస్సహ జ్ఞేయం శ్రావ్యం భారత ముత్తమం చతుర్వింశతి సాహస్రం చక్రేభారత సంహితాం ఉపాఖ్యానైర్వినైతావ ద్భారతం ప్రోచ్యతే బుధైః॥ తతోధ్యర్ధ శతం భూయః సంక్షేపంకృతవానృషిః॥ అనుక్రమణికాధ్యాయః.

భారత సంహితను జేసియుండెను. (వైశంపాయనుడు కావచ్చును) [1]అది భారత మని చెప్పబడుచున్నది. తరువాతను వ్యాసుఁ డేబదిశ్లోకము లధికముగ సంక్షేప ముగ (అనుక్రమణికను) చేసెను

ఇపుడు మనకుఁ గాన్పించు ముద్రిత భారతప్రతులు నాకుఁ దెలిసినంత వఱకు నాలుగున్నవి. నేను చూచుచున్న ప్రతులలోనే యన్యోన్య విరుద్ధపాఠము లుండుట యాశ్చర్యకరముగ నున్నది కొన్ని ప్రతులలో గాథలే మాఱి యుండుట మఱియు నాశ్చర్యకరముగ నున్నది. ఒక ప్రతిలో ద్రౌపదీ స్వయం వరమై వివాహమైన పిమ్మటఁ గర్ణాదులు హస్తినాపురమునుండి పాంచాల పురము పైకి (భీష్మాదులకుఁ దెలియకుండఁగ) యుద్ధముకురాఁగా భీమార్జునులు విజృం భించుటయు నర్జునుఁడు, కర్ణుని కుమారు నొకని సైంధవపుత్రు నొక్కనిఁ జంపఁ దక్కినవారు పరుగిడి హస్తిపురికిఁ జేరుటయు వర్ణింపఁబడి యున్నది ఇది యాంధ్రీకృత మహాభారతమునఁ గాని తెనుఁగున ముద్రింపఁబడిన సంస్కృత మహాభారతమునఁ గాని కాన్పింపదు. కుంభకోణమునందు, టి. ఆర్. కృష్ణమా చార్యునిచే ముద్రింపఁబడిన సంస్కృత మహాభారతము ఆదిపర్వము 218 అధ్యాయముఁ జూచిన నీవింత విశదము కాఁగలదు *

---

1. ఇరువదినాల్గువేల గ్రంథము వైశంపాయనకృత మగుటకుఁ వైశం పాయనుఁడు భారత సంహితాకారులగు సుమంత్వాదులలో నొక్కఁ డని చెప్పెడి ఆదిపర్వములోని (68—90) శ్లోకము దృఢపఱచుచున్నది.

* నేఁటికాలమున జర్మనీదేశీయులు నానాదేశ సంస్కృత భారత ప్రతులను శోధించి "యాదిసభ" పర్వములను నవీనముగ ముద్రించిరఁట. పూనా లోని "రామకృష్ణ భాండర్కారు" గారి యాధిపత్యమున భరతఖండపు నానాభాగకోశములను శోధింపఁబడి "విరాట పర్వము" ముద్రింపఁ బడినది. ఇపు డాదిపర్వమునుండి క్రమముగా సంచికల రూపమున ముద్రింపించుచున్నారు. రవీంద్రనాథఠాకూరుగారి "విశ్వభారతి" విశ్వ విద్యాలయమున, నానాదేశ కోశములను సేకరించి "డాక్టర్ వింటర్నిట్జు" గారి యాధిపత్యమున మహాభారతము శోధింపఁబడుచున్నది. ఇదివఱకు తెనుఁగులిపిలో ముద్రించిన దాని ననుసరించి వావిళ్ళ వేంకటేశ్వరులుగా రొక ప్రతిని ముద్రింపించి దానితోఁ దృష్టినొందక నాగరలిపిలో పాఠ భేదములతో మఱియొక ప్రతిని ముద్రింపించుచున్నా రఁట! ఇది యాంధ్రు లకు సంతోషకరమై యున్నది. నేఁడు ముద్రింపబడిన మహాభారత ప్రతు లలో "టి.ఆర్ కృష్ణమాచారిగారి" కుంభకోణ పుఁబ్రతియు, కలకత్తాలో ముద్రింపఁబడిన "ప్రతాపచంద్రరాయి" గారి ప్రతియు, ఆంధ్రాక్షరము

పర్వసంగ్రహాధ్యాయమునం "దేపర్వమున" నెన్ని యధ్యాయము లుండునో చెప్పఁబడియున్నది. ఆ ప్రకార మాదిపర్వమునందు రెండు వందల యిరువదియేడధ్యాయము లుండవలసియుండఁగా కుంభకోణపుఁ బ్రతిలోను యాది పర్వము 260 అధ్యాయములును, కలకత్తా ప్రతిలోని యాదిపర్వము 236 అధ్యాయములును ఆంధ్రాక్షరపుఁబ్రతిలోని యాదిపర్వము 234 అధ్యాయములును, కలిగియుండుట యాశ్చర్యముఁ బుట్టించుచున్నది నేను చూచిన వ్రాఁతప్రతు లాంధ్రాక్షరపుఁ బ్రతులతో సరిపోవుచున్నవి. ఆంధ్రాక్షరముద్రిత ప్రతియందు, నాలాయణ్యుపాఖ్యానము రెండధ్యాయములును, సుభద్రా పరిణయగాథ నాలుగ ధ్యాయములును బర్వాంతమందుఁ బ్రక్షిప్తమని కూర్పఁబడినది. నీలకంఠాచార్యు లీయాఱధ్యాయములును "జైమిని భారతము"లోనివని వ్యాఖ్యానముఁ జేయ లేదఁట. ఏ పర్వ మెన్నియధ్యాయములు కలిగియుండెనో యీ భారతరచనా చరిత్రలో వ్రాసిన పట్టికఁ జూచిన విశదము కాఁగలదు. ఇటులు నేఁడేకాక కాళిదాసుని కాలముననే భారతము చిందఱవందఱగా నుండెననియు, దాని నాతఁడు దిద్దఁ బ్రయత్నించె ననియు నేదియో విఘ్నము కలిగెననియు నొక కథ కలదు. ఆ కొఱఁత దీర్పుటకై జర్మని, పునా, వంగ దేశీయులు ప్రయత్నించు చున్నారు.

నేఁటి మహాభారతములో నేది వ్యాసకృతమో, యేది వైశంపాయకృతమో, యేది సౌతికృతమో చెప్పలేము కాని, యీ క్రింది శ్లోకార్థము భారతాదిని గుఱించి సూచించుచున్నది.

[1]కొందఱు "మను" అను చోటినుండి భారత ప్రారంభమనిరి. మఱి కొందఱు "ఆస్తికాది" భారతారంభ మనిరి. అట్లే మఱికొందఱు "ఉపరి చర వసువు" మొదలనిరి.

ఇది వ్యాసాది సంస్కృతి కవిత్రయకృతములోనిదై యుండదు కారణ మేమనఁగా భారత కవులలోఁ గడపటివాఁడగు "సౌతి"కి భారతారంభ మెచట నుండి యైనదో తెలియకపోదు. అట్టి సౌతి చేసిన శ్లోకమే యిది యైనచో "కేచిచ్ఛబ్దము" నుపయోగింపఁడు. కాని జయ, భారత మహాభారతములను గ్రంథములు మూఁడు కలవనియు, మూఁడు గ్రంథములకు మూఁడారంభములు

---

లతో నేఁటి కేఱదినాలుగేండ్లకుఁ బూర్వము, "నే. వేంకటసుబ్బాశాస్త్రిల వారిచే" ముద్రింపఁబడినప్రతియుఁ జూడఁగ నొకదానితో నొకటి సమా నము గాకున్నవి.

1. మన్వాది భారతంకేచి దసికాది తథాపరే
తథోపరిచరాదన్యే విప్రాస్సన్యు గధీయిరే. ఆదిపర్వ॥ ౧—౬౬.

కలవనియుఁ దెలిసికొనుట కీ శ్లోక ముపయోగపడుచున్నది. దీని ననుసరించి యారంభముఁ గనుగొందము. "మను" అను శబ్దముతోఁగాని, మన్వాది ప్రారంభముతోఁగాని యాదిపర్వమునం దేయధ్యాయము ప్రారంభింపబడలేదు. వ్యాఖ్యాత యీ శ్లోకమునకు వ్యాఖ్యానముఁ జేయుచు "మను" శబ్దమునకు "మంత్ర" మర్థమనియు "నారాయణ" శబ్దము అష్టాక్షరీమంత్ర ద్యోతకము గాన "నారాయణం నమస్కృత్య" యను ప్రారంభ శ్లోకమునుండియే భారత సంజ్ఞ కలదనియు వ్రాసియున్నాఁడు ఇది యుక్తియుక్తముగ నున్నది. ఆది పర్వము 75 వ అధ్యాయారంభమునందు "ప్రజాప తేస్తుదక్షస్యమ నోర్వైవ తస్యచ" అని కలదు. కాని దక్షప్రజాపతి వంశారంభము "మన్వాది" వృత్తాంత మన వీలులేదు. కాన "నారాయణ" శబ్దముతోఁ ప్రారంభింపఁ బడినదానికే "మన్వాది" భారతమనుట యుక్తము. ఇది సౌతిభారతమున కగును. ఆస్తి కాదిగాఁగల యధ్యాయములేదు. కాని "ఆస్తిక" పర్వమనునది యాదిపర్వాంతర్గ తమై, పదమూడవ యధ్యాయమునఁ బ్రారంభింపఁబడుచున్నది. ఇది "వైశం పాయన భారతమున కారంభమగును. కారణమేమనఁగా వైశంపాయనుడు జనమే జయునకు భారతముఁ జెప్పుటకుఁ గల కథాబీజమీ "యాస్తిక" పర్వముననే కలిగియున్నది. ఇది యిరువదినాలుగువేల శ్లోకముల మితికలదై యుండునని యిది వఱకే వ్రాసియున్నాను. అనుక్రమణికాధ్యాయమునందీ క్రింది యర్థముగల శ్లోకము కలదు. సౌతి తన భారతము లక్షశ్లోకముల మితికలదనియు మనుష్య లోకమున వైశంపాయనుఁడే భారతముఁ జెప్పియుండెననియు నాశ్లోకము సూచించుచున్నది.

[1]"ఈ మనుష్యలోకమునందు వైశంపాయనుఁడు (ఇరువదినాల్గువేల గ్రంథమును) చెప్పెను. ఒక లక్షశ్లోకముల మితిగల (మహాభారతము) నాచేఁ జెప్పఁబడె నని తెలిసికొనుము" (ఈ వాక్యము సౌతి శౌనకునకుఁ జెప్పి యుండెను.) వైశంపాయన భారతములో నితిహాసము లుండవు. "ఉపరిచర" నుండి ప్రారంభింపఁబడినది వ్యాసభారతమగును. దానికే "జయ" మని పేరు. ఇది యాదిపర్వమునం "దఱువదిమూఁడవ" యధ్యాయమునుండి యారంభమగు చున్నది. వ్యాసుఁడు గ్రంథరచనకు ముందు తన వృత్తాంతముఁ జెప్పుకొనుట యుక్తమై యున్నది గాన వ్యాసుఁడు తన మాతామహుఁడగు "ఉపరిచర" వసువుగాథనే యారంభించి చెప్పియున్నాఁడు. వ్యాసగ్రంథము కేవలము కౌరవ పాండవచరిత్ర మాత్రమే యై యెనిమిదివేల యెనిమిదివందల శ్లోకములు

1. అస్మింస్తు మానుషేలోకే వైశంపాయన ఉక్తవాన్
ఏకంశతసహస్రంతు మయోక్తంవై నిబోధత॥ అనుక్రమణికాధ్యాయః.

కలదిగా నుండెను. వ్యాసభారతము "కార్షి" వేదము, స్వరయుక్తము సంహితా స్వరూపము గద్య పద్యాత్మకమై కృష్ణయజుర్వేదమువలె నుండక శ్లోకసంఖ్యాయుత మగుటచే వేదమునందుండు "ననుష్టుప్" ఛందోరూపముగా నుండును. వేదమునకుండునటుల ననుక్రమణికా యుక్తముగా నుండును. అనుక్రమణికం దెలిసికొంటిమేని వ్యాసకృత భారతాంశములు లభింపఁ గలవు. అనుక్రమణికాధ్యాయమునందుండు "తతోధ్యర్ధశతం భూయః" అను శ్లోకములోని "అధ్యర్ధశతం" అను పదమునకు నూటయేఁబది శ్లోకము లని పెక్కండ్రర్థము చేయుచున్నారు. కాని యనుక్రమణికాధ్యాయము రెండు వందల యెనుబది శ్లోకములు కలిగియున్నది. వివిధ శ్లోకనిబద్ధమై యున్నది. అనుక్రమణిక లటులనుండవు. అనుక్రమణి కాధ్యాయమునం దాతని "శుక, శౌనకా"దులకును సౌతికిని జరిగిన యుత్తర ప్రత్యుత్తరములతోఁ దొంబది నాలుగు శ్లోకములను, శేషించిన నూట ముప్పదిమూఁడు శ్లోకములలోను నూట యెనిమిది శ్లోకములు ధృతరాష్ట్ర పరివేదనము, సంజయునోదార్పనను గాథ గాను పోఁగా దెబ్బదిఎనిమిది శ్లోకములే మిగిలియున్నవి కడను ముప్పదినాలుగు శ్లోకములలో సౌతి భారతపఠన శ్రవములచే నగు ఫలముఁ జెప్పియుంటచే నలు వదినాలుగు శ్లోకములే యనుక్రమణిక కావలసియుండును. కాని వ్యాఖ్యాత, అను క్రమణికాధ్యాయములోని 79 మొదలు 89 వఱకుఁగల శ్లోకములు కొన్ని ప్రతు లలో లేవనుచున్నాఁడు నాకును గొన్ని వ్రాతప్రతులలో నా శ్లోకములు కాన్పింప లేదు. పై కారణముల నన్నిటిఁ బరిశోధించితచో వ్యాసకృతానుక్రమణికాధ్యా యము "ఆదిపర్వము"లోని ప్రథమాధ్యాయము కాదనియు, అది సౌతి యొక్క మహాభారతమునకు ననుక్రమణికాధ్యాయ మనియు విశదమగును. మఱియు "అధ్యర్ధశత" శబ్దమునకు నూటయేఁబదియను నర్థముకంటె నిదివరకుఁ జెప్పిన గ్రంథమున కధికముగా నర్ధశతము, (50) అను నర్థము పొసఁగియున్నది గాన, నేఁబది శ్లోకములచేతనే "యనుక్రమణికను" వ్యాసుడు రచించె ననుట యుక్త మగును. అట్టి యధ్యాయ మెచటనైనఁ గలదా? కలదు. ఆదిపర్వములోని యఱు వదియొకటవ యధ్యాయ మట్టిదియే. ఆ యధ్యాయమునకుఁ గథాసంక్షేపాధ్యాయ మని పేరు. దానియందు యేఁబదియాఱు శ్లోకము లున్నవి. మొదటి యైదు శ్లోకములును వైశంపాయనుండు జనమేజయునకుఁ జెప్పిన వాక్యములు కడపటి శ్లోకము కూడ వైశంపాయనుని వాక్యమే నడుమనుండిన యేఁబదిశ్లోకములలో భారతేతిహాసము నిరూపింపఁ బడినది. కడపటిశ్లోకము నందీ యనుక్రమణి కాధ్యాయములోని గాథకు "జయ" మను పేరుగలదని చెప్పబడినది. [1]ఆ యధ్యా

---

1. ఏవమేవతత్పురావృత్తంతేషామక్లిష్ట కర్మణాం
   భేదోరాజ్యవినాశాయజయశ్చ జయతాంపర. ఆది. ౬౧ - ౩౬.

యమే 'యనుక్రమణికాధ్యాయ' మని కూడ యఱువదిరెండవ యధ్యాయము పది రెండవశ్లోకమునందు చెప్పఁబడి యున్నది. [1]ఆ యఱువదియొకటవ యధ్యాయ మునఁగల కథను మూఁరహితముగ వ్రాసెదను.

"పాండవు లరణ్యమునం దండ్రి మృతినొందిన పిమ్మటను హస్తినా పురికి వచ్చి స్వల్పకాలములోనె వేదమునందును, ధనుర్వేదమునందును విద్వాంసులైరి. వీర్యసంపన్నులును "పౌర" సమ్మతులునగు పాండవులఁజూచి కౌరవులు సహింపరైరి. పిమ్మటను దుర్యోధనుఁడు కర్ణ, శకుని సహితుఁడై పాండవుల కనేకాపకారములఁ జేయ బ్రారంభించెను దుర్యోధనుడు "కుశింగుని" మతము ననుసరించి రాజ్యమునకుఁగాను బాండవులఁ బీడించెను. భీమున కన్నమున విషముఁ బెట్టించెను. విషము భీముని బాధింపలేదు. నిద్రపోవుచున్న భీముని నీటిలోఁ ద్రోయించెను. కాని భీముఁడు కట్టులఁద్రెంచుకొని నీటినుండి వెడలివచ్చెను. నిద్రఁబోవుచున్న భీముని పాములచేఁ గఱపించెను. కాని విషమెక్కలేదు. దుర్యోధనాదులు పాండవులకుఁ జేయు నపకారము లన్నిటి యందును బుద్ధిమంతుఁడగు విదురుడు పాండవులకుఁ దోడ్పడుచు నా యపకారములు వారికి రాకుండగఁ బ్రతిక్రియల జేయుచుండెను. స్వర్గమునొందినవారి కెటులు దేవేంద్రుఁడు సుఖముఁ గలుగఁజేయునో విదురుఁడటులు నిత్యము, బహిరంగముగాను, రహస్యముగాను, పాండవులకగు నపకారముల నుండి రక్షించుచుండెను. పిమ్మటను దుర్యోధనుఁడు ధృతరాష్ట్రు ననుజ్ఞఁగొని వారణావతమున లక్కయింటిఁ గట్టించెను. ధృతరాష్ట్రుఁడు సుతహితము గోరి పాండవులను వారణావతమున కంపెను పాండవులు హస్తినాపురమునుండి వారణావతమునకు వచ్చిరి అప్పుడును విదురుఁడు పాండవులకు నుపదేశములఁ జేయుచునేయుండెను. పాండవులు ధృతరాష్ట్రాజ్ఞ ననుసరించి వారణావతమున లక్కయింటను, "పురోచనుని"చే రక్షింపఁబడుచు నొక సంవత్సరముండిరి. ఆ కాలముననే విదురోపదేశముచే లక్కయింటి నడుమనుండి వెలుపలకు "సొరంగముఁ" ద్రవ్వుకొని లక్కయింటి కగ్గిపెట్టి పురోచనునందు దహించి భయముచే నరణ్యమునకుఁ బరుగిడిరి. ధార్తరాష్ట్రులచే భయపడి వనమునఁ బరుగిడు పాండవులు హిడింబావనముఁ జొచ్చిరి. అట భీముఁడు హిడింబుఁ జంపి వాని చెలియలు హిడింబను బెండ్లియాడెను. ఆమెయందు ఘటోత్కచుఁడు పుట్టెను. పిమ్మట బ్రాహ్మణ వేషధారులై వేదముఁ జదువుకొనుచుఁ దల్లితోఁగూడ "నేకచక్రపురమునఁ" గొంతకాల ముండిరి. అచట మనుష్య భక్షకుఁడగు "బకా

2. క్షణంకురుమహారాజవిపులోయ మనుక్రమః
పుణ్యాఖ్యానస్యవక్తవ్యః కృష్ణద్వైపాయనేరితః. ఆది. ౬౨ - ౧౨.

సురుని'' భీముఁడు చంపి యేకచక్రపురవాసుల నోదార్చెను. అచటనే ద్రౌపదీ స్వయంవర వృత్తాంతమును విని పాంచాల నగరమునకేఁగి ద్రౌపదినొంది సంవత్సరమునకుఁ బైగా ద్రుపదపురమున నుండిరి అపుడు హస్తిపురికి వృత్తాంతము తెలియుటచేఁ బాండవులు తిరిగి హస్తిపురికి రప్పింపఁబడిరి. అపుడు భీష్మ ధృతరాష్ట్రులు సోదరులతో విరోధము మీకుండరాదని పాండవులకుఁ జెప్పి మీరు సుఖముగ రాజ్యముఁజేయుటకు "ఖాండవప్రస్థరాజ్యము" తగినదని యాలోచించితిమిగాన మీరచటికిఁబోయి రాజ్యముఁజేయుఁడనఁగా వారచటికిఁ దమసుహృజ్జనులతోనేఁగిరి. ఆ పట్టణమునందనేకవత్సరములు రాజ్యముఁజేసిరి. శత్రురాజుల నోడించుచు మిత్రులను సంతోషపెట్టుచు ధర్మముగ పాండవులు రాజ్యముజేసిరి. ఆ కాలమున భీముఁడు తూర్పు దిక్కును, ఉత్తరపుదిక్కు నర్జునుఁడును, పడమటి దిక్కును నకులుఁడును, దక్షిణమును సహదేవుఁడును జయించిరి. పిమ్మట నొక కారణముచే ధర్మరాజు సంవత్సరముపై నొకమాస మర్జును నరణ్యమున నుండఁ బంపెను. (ఇట నాంధ్రీకృత భారత మొకయేఁడని చెప్పుచుండఁగా సంస్కృత భారతము పదమూఁడుమాసము లని యొకచోటను, పండ్రెండేండ్లని రెండుచోటులను నర్జున తీర్థయాత్రా కాలముఁ జెప్పుట చర్చనీయాంశము). అపుడర్జునుఁడు ద్వారవతి కేఁగి శ్రీకృష్ణుని చెలియలు సుభద్రను బెండ్లియాడెను. పిమ్మట నర్జునుఁడు శ్రీకృష్ణునిఁగూడి ఖాండవవనము నగ్నికర్పించెను. అగ్ని యర్జునునకు గాండీవమను ధనుస్సును, అక్షయ తూణీరములను, కపిధ్వజ యుక్తమగు దివ్యరథమును నిచ్చెను. ఆ యగ్ని పాలు గాకుండఁగ నర్జునుఁడు "మయుఁ"డను రాక్షసుని రక్షించుటచే నాతఁడు రత్నమయ మగు సభనుజేసి పాండవుల కర్పించెను. ఆ సభను జూచి దుర్మార్గుఁడగు దుర్యోధనుఁడు లోభబుద్ధికలవాఁడై శకునితో ధర్మరాజు జూదమాడునటులఁ జేసి, పాచికలచేతనే ధర్మరాజును వంచించి, పాండవులు పదిరెండేండ్లు వనమునందును నొకయేఁడజ్ఞాతముగను నుండునటులఁ జేసెను. పాండవు లటులఁజేసి పదునాలవయేఁట తమభాగముఁగోరి దుర్యోధనునుండి భాగము నొందలేకపోవుటచే యుద్ధమొనర్చిరి. అందు శత్రువులను దుర్యోధనుని పాండవులు చంపి రాజ్యము నొందిరి."

[1]పిమ్మట వారు హయమేధాది క్రతువులను జేసిరి. తరువాతను, ధృతరాష్ట్రుఁడు విదురుఁడు మృతినొందిరి. పిమ్మటఁ గృష్ణుఁడు వైకుంఠమున కేఁగఁగా

1. నేఁటికి దెబ్బదియాఱు సం।రములకుఁ బూర్వము "కర్నాటక పటాలపు సుబేదారు'', పట్టాభిరామయ్య, కాశిలో నిరువురు పండితులచేఁ బ్రాచీనపుఁ గాకితములపై వ్రాయించిన భారతపుప్రతిలో, పాండవులు రాజ్య నొందుటకే యధ్యాయమున్నది. నన్నయ తెనిగింపు కూడ నంతవరకే.

'నతనిభార్యలఁ గోలుపోయి పాండవులు మహాప్రస్థానికముఁజేసి స్వర్గమునొందిరి ఇదియే రాజ్యనాశనమునకైన భేదము—"జయ" మనునదియు—

పై యనుక్రమణికలో మహాభారత గాథాంకురములున్నవి. కాని మహాభారత యుద్ధమైన ముప్పదియాఱేండ్లకైన కృష్ణనిర్యాణ మహాప్రస్థానిక గాథలు, పదునేను, లేక పదునెనిమిది సంవత్సరములకైన యుద్ధస్మృతుల భార్యలు స్వర్గగతులగుట, ధృతరాష్ట్రాదుల నిర్యాణము మొదలగునవి యుద్ధానంతరము మూఁడేండ్లకు రచింపఁబడిన వ్యాసుని గ్రంథమున నెటుల వ్రాయఁబడెను? కాని "సౌతి" యొక్క యనుక్రమణికాధ్యాయమునందు వ్యాసుఁడు "జయ" మును రచించి యెటులీగ్రంథమును లోకమునఁ బ్రకాశింపఁ జేయుదు నని యాలోచించుచుండఁగా బ్రహ్మ ప్రత్యక్షమై గణేశునిచే నీగ్రంథమును వ్రాయించి లోకమునఁ బ్రకాశింపఁజేయుమనుటయు వ్యాసుఁ డటులఁజేసి శుకాదులచేఁ జదివించిన పిమ్మట నను వైశంపాయనుఁడు భూమిపై వ్యాపింపజేయుటయు నను వృత్తాంతము కాన్పించుచున్నది. పై కారణముచే, నొకవేళ వ్యాసుఁడు జయమును యుద్ధానంతరము మూఁడేండ్లకు రచించినను శిష్యులకుఁ జెప్పునాఁటికి పాండవులు గతించుటచేఁ బాండవనిర్యాణగాథను గూడ జయముయొక్క చివరను జేర్చియుండును. కొందఱు పాశ్చాత్య విమర్శకులు "ధృతరాష్ట్రాదులు" వనమున కేఁగునాఁటికిఁ బరీక్షిత్తు తల్లి కడనుండిన బాలుఁడగుటచే యుద్ధానంతరము మూఁడేండ్లకే ధృతరాష్ట్రాదులు గతించియుందురనియు పిమ్మట స్వల్పకాలమునకే యా పాండవులు స్వర్గమున కేఁగియుందురనియు వ్రాసియున్నారు. ఆ ప్రకారముచే నైనను వ్యాసుఁడు పాండవనిర్యాణమును జయములో వ్రాసియుండుట విరుద్ధముకాదు. ఆదిపర్వపు మొదటియధ్యాయమున గూడ సౌతి ధృతరాష్ట్రాదులు మృతినొందిన తరువాతనే వ్యాసుఁడు భారతమును లోకములోఁ బ్రకటించినటులఁ జెప్పు నీక్రింది శ్లోకార్థములు గమనింపఁదగి యున్నవి.

[1]వ్యాసుఁడు పూర్వకాలమునందు తల్లియొక్కయు భీష్మునియొక్కయు నను మతినొంది, విచిత్రవీర్యుని భార్యలయందు త్రేతాగ్నులఁబోలు ధృతరాష్ట్రాదుల

---

1. మాతుర్నియోగాద్ధర్మాత్మా గాంగేయస్యచధీమతః। క్షేత్రే విచిత్రవీర్యస్య కృష్ణద్వైపాయనః పురా. త్రీనగ్నీనివ కౌరవ్యాన్ జనయామాస వీర్యవాన్। ఉత్పాద్య ధృతరాష్ట్రంచ పాండుం విదురమేవచ జగామ తపసే ధీమాన్ పునరేవాశ్రమం ప్రతి తేషు జాతేషు వృద్ధేషు గతేషు పరమాంగతిం అబ్రవీన్మానుషంలోకే మానుషేస్మిన్మహానృషిః......... విస్తరం కురువంశస్య గాంధార్యా ధర్మశీలతాం। క్షత్తుః ప్రజ్ఞాం ధృతిం కుంత్యా స్సమ్యగ్ద్వైపాయనో బ్రవీత్। వాసుదేవస్య మహాత్మ్యం పాండవానాంచ సత్యతాం। దుర్వృత్తం ధార్తరాష్ట్రాణా ముక్తవాన్ భగవానృషిః. - ఆదిపర్వ ౧ అధ్యా.

ముప్పేరఁగని పిమ్మటను తపస్సుకొఱకు స్వాశ్రమమున కేఁగెను. ఆ ధృత రాష్ట్రాదులు పుట్టి పెరిగి పెద్దవారై మృతినొందిన పిమ్మటను భారతమును జేసి మనుష్యలోకమునఁ బ్రకటించెను.........కురువంశముయొక్క విస్తరమును, గాంధారియొక్క ధర్మశీలతయు, విదురుని ప్రజ్ఞయుఁ, గుంతియొక్క ధైర్యము బాగుగఁ జెప్పెను వాసుదేవుని మాహాత్మ్యము, పాండవుల సత్యత్వము, ధార్త రాష్ట్రుల దుర్వృత్తమును వ్యాసుడు చెప్పెను—(వాసుదేవ మాహాత్మ్యము హరి వంశములోనిది). పై శ్లోకార్థములచే ధృతరాష్ట్రాదుల మృతి నొందిన పిమ్మటచే వ్యాసుఁడు "జయము"ను బ్రకటించియుండును గాన యుద్ధానంతర గాథలు కూడ జయములో నిమిడియుండుట యాశ్చర్యము కాదు. కాని పాండవులకుఁ బితామహుఁడగు వ్యాసుఁడు పాండవుల మరణానంతరమునఁ గూడ నుండునా యను పెద్ద సందియ మొకటి చాలమందిని బాధించును. నాఁడేకాక నేఁడును ముమ్మనుమలు పెద్దలగు వఱకు జీవించినవారును మనుమలు బిడ్డలఁగని యేఁబ దేండ్లువచ్చి స్వర్గస్థులైన పిమ్మట జీవించు తాతలను, అవ్వలనుగూడఁ జూచు చుంటిమి గాన, దీర్ఘాయుర్దాయమునకుఁ బుట్టినిల్లగు భరత ఖండమునందు యోగ శక్తిచేతను నింద్రియ జయముచేతను వ్యాసుఁడంత దీర్ఘకాలము జీవించి యుండె ననుటలో నతిశయోక్తిలేదు. స్వర్గారోహణ పర్వమునందును వ్యాస విరచిత భాగముండుటచేతనె దానియందును, [1]"ఇది జయమను నితిహాసము" అను నర్థముగల శ్లోకమున్నది. పైని వ్రాసిన "వ్యాస గ్రంథానుక్రమణిక" యందు కొన్ని విచిత్రములు కాన్పించును. చూడుఁడు బక, హిడింబ వధలవంటి చిన్న యుద్ధములను గుఱించి వ్రాసియు, కిమ్మీర, కీచక, జటాయు వధలు, అంగార పర్ణ నర్జునుఁ డోడించుట, నివాత కవచ కాలకేయాది యుద్ధములు, పెద్దవగు దక్షిణోత్తర గోగ్రహణములు వర్ణింపఁబడలేదు. భీమాదులు నాలుగు దిక్కుల జయించిన పిమ్మటనే ఖాండవ వన దహనము చెప్పఁబడినది. రాజసూయ యాగముయొక్క పేరైన గాన్పింపదు. భీముఁడు తూర్పుదిక్కును జయించె ననుటలో "జరాసంధ" వధయు, పాండవు లజ్ఞాతవాసానంతరము తమ రాజ్యము నడిగి రనుటలో, సంజయ కృష్ణ రాయబారములు నిమిడియున్నవి. ద్రౌపదీ వస్త్రాపహరణాదికము కించిత్తైనను సూచింపఁబడలేదు. యుద్ధమై దుర్యోధ నాదులు మృతినొంది రనియేకాని మహాయుద్ధ వివర మెంత మాత్రము చెప్పఁ

1. "జయోనామేతిహాసోయం"-స్వర్గారోహణపర్వ.

బడలేదు. యుద్ధమృతుల భార్యలు స్వర్గము నొందిరను స్వల్పాంశముఁ జెప్పు వ్యాసుఁడు ముఖ్యములగు ద్రౌపదీపరిభవమును గాని ఉత్తర దక్షిణ గోగ్రహణములఁగాని చెప్పక పోవుటకుఁ గారణమేమై యుండును? వ్యాసకృత జయమున నీగాథలు వ్రాయఁబడి యుండలేదేమో? [1]ప్రతిపర్వమునందలి యధ్యాయములసంఖ్య మాత్రమెకాక శ్లోకసంఖ్యకూడ "పర్వానుక్రమణికాధ్యాయము"నం జెప్పినటులు కాన్పింపదు. అన్ని పర్వముల శ్లోకసంఖ్యను బరిశీలించిన తిలక మహాశయునకు కలకత్తాప్రతి ననుసరించి 99 వేల శ్లోకములు కాన్పించినవి. నూఱువేలలో నొకవేయిమాత్రము కొదువ. మఱికొందఱు పాశ్చాత్యులు నూట యేడువేల శ్లోకములనిరి. కుంభకోణపుఁ బ్రతిని లెక్కించిన నూఱువేలకు మించి యుండును. చిన్నపర్వమగు సభాపర్వములోని శ్లోకములను లెక్కింపఁగ పర్వానుక్రమణిక ననుసరించి 2511 శ్లోకములుండుటకు మాఱుగ 2709 శ్లోకములాంధ్రదేశపుఁ బ్రతిలో నాకుఁ గాన్పించినవి. పెక్కుకారణములచే నాలోచింపఁగా "వ్యాసుఁడు, వైశంపాయనుఁడు, సౌతి" యనువారలేగాక తదితరులును గొన్ని శ్లోకములనేగాక కథలను, అధ్యాయములఁగూడ దృశ్యమాన మహాభారతమున నిమిడ్చి యున్నారని యనుభవముచే వ్రాయ సాహసించుచున్నాను. కాని కొందఱు తలఁచినటుల నవి బ్రాహ్మణులు కల్పించిన వనియు, బౌద్ధులు కల్పించినవనియు, మాత్రము చెప్పలేను.

వెవ్వేఱుదేశపుఁ బ్రతుల ననుసరించిన యధ్యాయ సంఖ్యాపట్టిక నిచట వ్రాసియున్నాను. చూడుడు :

---

1. కొందఱు అనుక్రమణిక సంక్షిప్తముగాఁ జెప్పఁబడును గాన నన్నియు నందుఁ జెప్పఁబడ లేదందురు కాని రాజసూయమువంటి పెద్ద యంశము ఎంత సంక్షిప్తములోనైన విడువఁతగినదా?

| * పర్వములు | అనుక్రమణిలోఁ జెప్పఁబడిన అధ్యాయములు | వ్రాఁతప్రతి ననుసరించి యధ్యాయసంఖ్య | చెన్నపురి ప్రతి | కుంభకోణ ప్రతి | కలకత్తా ప్రతి |
|---|---|---|---|---|---|
| ఆదిపర్వము | 227 | 236 | 240 | 260 | 236 |
| సభా ,, | 70 | 80 | 80 | 103 | 80 |
| వన ,, | 269 | 312 | 314 | 315 | 314 |
| విరాట ,, | 67 | 70 | 72 | 76 | 72 |
| ఉద్యోగ ,, | 186 | 199 | 197 | 196 | 197 |
| భీష్మ ,, | 117 | 120 | 124 | 122 | 114 |
| ద్రోణ ,, | 170 | 203 | 203 | 203 | 204 |
| కర్ణ ,, | 69 | 96 | 97 | 101 | 96 |
| శల్య ,, | 69 | 73 | 66 | 66 | 65 |
| సౌప్తిక ,, | 18 | 19 | 18 | 18 | 18 |
| స్త్రీ ,, | 27 | 19 | 27 | 27 | 27 |
| శాంతి ,, | 339 | 366 | 366 | 375 | 365 |
| అనుశాసనిక ,, | 146 | 168 | 168 | 274 | 168 |
| అశ్వమేధ ,, | 103 | 62 | 92 | 118 | 92 |
| అశ్రమవాస ,, | 42 | 39 | 39 | 41 | 39 |
| మౌసల ,, | 8 | 8 | 8 | 9 | 8 |
| మహాప్రస్థానిక ,, | 3 | 3 | 3 | 3 | 3 |
| స్వర్గారోహణ ,, | 5 | 6 | 6 | 6 | 6 |
| మొత్తము | 1935 | 2079 | 2120 | 2313 | 2104 |

పై పట్టికలో నన్నిటికంటె, కుంభకోణపుఁ బ్రతిలో, ననుక్రమణి కాధ్యాయమునఁ జెప్పఁబడినదానికంటె మూఁడువందల డెబ్బదియెనిమిది యధ్యా

* వ్రాఁతప్రతి డెబ్బది సం॥రములకు ముందు కాశిలో వ్రాయించినది. ఇది "దొడ్డంపేట"లోని "భాగవత లక్ష్మీపతి సోమయాజులుగారు" నా కెరవిచ్చిరి. చెన్నపురి ప్రతి తెనుగున ముద్రింపఁబడిన ప్రతి. కుంభకోణపు ప్రతి T. R. కృష్ణమాచార్యుల వారిది. కలకత్తా ప్రతి ప్రతాప చంద్రరాయి గారిది.

యములు హెచ్చుగ నున్నవి. వ్రాతప్రతియందు నూటనలువదినాలు గధ్యాయములు మాత్రమె హెచ్చుగ నున్నవి. అనుక్రమణి కాధ్యాయములోని యానుశాసనిక పర్వాధ్యాయములు నూటనలువది యాఱై యుండఁగా, కుంభకోణపుఁ బ్రతిలో రెండువందల డెబ్బది నాలుగై యున్నవి. నూటయిరువదియెనిమిది హెచ్చైయున్నవి. అనేకచిన్న చిన్న గాథలుకూడ యాంధ్రీకృత భారతములోను, ఆంధ్రలిపిగల సంస్కృత భారతములోను లేనివి కుంభకోణపుఁ బ్రతిలోఁ గాన్పించుచున్నవి. గ్రంథవిస్తరభీతిచే వానినిట వివరింపలేదు. *వ్యాసుఁడు మొదట వ్రాసిన "జయము" వ్రాతఁప్రతిలో నుండినటుల యుద్ధాంతము వఱకే యై యుండు ననుట కింకొక నిదర్శనము కాన్పించుచున్నది. భాగవతముకూడ వ్యాసకృతమను నైతిహ్యము కలదు. అది నేఁడు కాన్పించు భాగవతము కాకున్నమానె, భక్తిబీజ మగునదియై స్వల్పపరిమితిగల గ్రంథమై యుండునని తలఁప వలసియున్నది. భారతమునకువలె కాలాంతరమున నాగ్రంథము "శుకా"దులచే వ్యాప్తి నొందిపబడియున్నది. ఆ భాగవతములో నారదోపదేశముచే భాగవతముఁ జేయఁదలఁచుకొని, వ్యాసుఁడు సౌప్తికపర్వమునందలి యశ్వత్థామార్జున యుద్ధాంత గాథనే ప్రారంభించి యుండుటచేత వ్యాసకృత జయము మొదట నంతవఱకె రచింపఁబడి, లోకమునందు వ్యాప్తి నొందించునాఁటికి స్వర్గారోహణ పర్వాంత గాథలఁగూడ మొదటి "జయ"మునకు ననుబంధముగాఁ జేసియున్నాఁడని స్పష్టమగుచున్నది[1] వైశంపాయనునిచే జనమేజయునకుఁ జెప్పఁబడిన గ్రంథము వాల్మీకి రామాయణమువలె నిరువదినాలుగువేల శ్లోకములు కలదై, యితిహాసరహితమై కేవల కురుపాండవ చరిత్రము మాత్రమె యైయున్నది. అదియే భారతము. ఆ భారతము, పాండవులు స్వర్గతులగు నాఁటికి ముప్పదియాఱు(౩౬) సంవత్సరముల యీడుకలవాఁడై పట్టాభిషేకమునొంది యఱువది (౬౦) సంవత్సరములు రాజ్యము

---

* తెనుఁగులిపియందు మొదట ముద్రింపబడిన సంస్కృత భారతము కలకత్తా - "ప్రతాపచంద్రరాయి" గారి ప్రతి ననుసరించి ముద్రింపబడినదఁట. ఇందునుగూర్చి తొలుత సంస్కృత భారతమును మద్రాసునఁ బ్రచురించిన వారికిని మద్రాసునందలి ఓరియంటల్ లైబ్రరీ కపుడు క్యూరేటరుగా నుండినవారికిని నడచినలేఖ లాలైబ్రరీ యందున్నవఁట.

1. కాశీ వ్రాఁతప్రతియు, నన్నయాంధ్రీకరణమున కుపయుక్తమగు నాఁటి వ్రాఁత ప్రతియు నేనూహించిన యనుక్రమణికాధ్యాయములోని గాథయు సౌప్తిక వధాంతమెయై యుండెను సౌప్తిక వగాఁతగాథయె వ్యాసకృతమగు మొదటి జయము. అదియె భాగవతారంభము——

జేసి తక్షక విషముచేఁ జచ్చిన పరీక్షిత్తునకుఁ గుమారుఁడగు జనమేజయుఁడు, "శంకుకర్ణ, శతానీకు"లను కుమారులను, "అశ్వమేధదత్తుఁడు" అను మనుమనిఁ గనినపిమ్మట, సర్పయాగముఁ జేయఁగాఁ గారణాంతరముచే నది విఘ్నమై నపుడు "వైశంపాయనుని"చే జనమేజయునకు జెప్పఁబడినది. పరీక్షిత్తు భారత యుద్ధానంతరము తొంబదియాఱు (96) సంవత్సరములకు మృతినొందెను. అప్పటికి జనమేజయుఁడు తండ్రి మృతిని గూడ గుఱుతెఱుఁగని బాలుఁడు అతనికి మనుమల నెత్తునాఁటికి నఱువది (60) సంవత్సరములైన నుండును. అప్పుడే వైశంపాయనుఁడు భారతముఁ జెప్పి యుండుటచే యుద్ధానంతరము, లేక వ్యాసుఁడు భారతమును రచించిన పిమ్మటను నూటయేఁబది (160) సంవత్సరములకుఁ బైబడిన కాలమున వైశంపాయన భారతము చెప్పబడియున్న దని దృఢముగఁ జెప్పవచ్చును. అపుడు "సౌతి" యీ భారతమును వినియున్నాఁడు. తా నచటనుండి తీర్థయాత్రలఁ గావించుకొని శౌనకాదుల సత్రయాగమునకు వచ్చి మహాభారతము నంతయుఁ జెప్పియున్నాఁడఁట! సౌతి, వైశంపాయనుఁ డొకసారి జనమేజయునకు భారతమును వినిపించినంత మాత్రముననె యిరువది నాలుగువేల (24000) గ్రంథమును గంఠపాఠముఁజేయలేఁడుగాన దాని నింకొక పదియేండ్లలో, నేరిచి శౌనకాదులకుఁ జెప్పియుండె ననవచ్చును. అందువలన సౌతియొక్క మహాభారతము వ్యాసుఁడు ''జయముఁ'' జేసిన తరువాతను రమా రమి నూటడెబ్బది (170) సంవత్సరములకు రచింపఁబడియుండును.

ఇదివఱలోఁ జెప్పఁబడిన రీతిని వ్యాసుని జయము, ఆదిపర్వములోని యఱువది రెండవ యధ్యాయము మొదలుకొనియుండినను తదనంతరాధ్యాయము లన్నియు వ్యాసకృతము లని తలఁవరాదు. జయమును వైశంపాయనుఁడు జనమేజయునకు వినిపించుచుండఁగా జయములోని సూక్ష్మగాథలు జనమేజయుఁ డడిగినప్రశ్నలపైఁ బెంచి వైశంపాయనుఁడు చెప్పవలసి వచ్చుచుండెడిది. వ్యాసుని రచనాపద్ధతిని సూక్ష్మముగాఁ బరిశీలించినచో వంశావతరణ పర్వములోని యఱువదిమూడఁవ యధ్యాయమునకుఁ బిమ్మట నేయిరువది ముప్పది శ్లోకములలోనో ధృతరాష్ట్రోద్యుత్పత్తి గాథను జెప్పి సంభవ పర్వములోని నూట యిరువది యాఱవ యధ్యాయము చెప్పవలసియున్నది. కాని జనమేజయుని కూలంకష ప్రశ్నములచే నఱువది యధ్యాయములకుఁ బైఁబడిన గాథ పెరిగినది. ఆ యఱువదికిఁ బైఁబడిన యధ్యాయగాథలోను సౌతికృత కల్పనలేకాక సౌతికిఁ బిమ్మటివగు గాథలుకూడఁ గూర్పఁబడె నని నూటయిరువది రెండవ యధ్యాయ గాథచే నూహించుచున్నాను. ఆ గాథ యిది.

# సౌతికిఁ బిమ్మటనైన గాథలు

ఉద్దాలకుని కుమారుఁడగు శ్వేతకేతువు తనతల్లి నొకబ్రాహ్మణుఁడు పుత్రార్థియై కామింప దానిని సహింపక వివాహనిబంధన మేర్పఱచె ననునది ఇది పాండురాజు కుంతితోఁ జెప్పినటుల నున్నది నిజమున కీగాథ సౌతికిఁ బిమ్మటనై యున్నది. కారణమే మనఁగా శ్వేతకేతువు ఉద్దాలకుని కుమారుఁడు. ఉద్దాలకుఁడు వశియను పేరుగలిగి మిథిలరాజ్యము నేలుచున్న జనకుని సభలో యాజ్ఞవల్క్యునితో వేదాంత చర్చఁజేసి యోడిన ఋషి. యాజ్ఞవల్క్యుఁడు జనమేజయునకు భారతమును వినిపించిన వైశంపాయనుని శిష్యుఁడు యాజ్ఞవల్క్యునకు నుద్దాలకునితో వాదము జరుగునాఁటికి జనమేజయుఁడు కూడ స్వర్గస్థుడై యుండె నని యుద్దాలకుఁడు యాజ్ఞవల్క్యు నడిగినపుడే లాహ్యాయనిభుజ్యుఁడను ముని యాజ్ఞవల్క్యు నడిగిన ప్రశ్నలచేఁ దెలియుచున్నది. ('చూడుఁడు' బృహదారణ్యకోపనిషత్తును) అట్టి యుద్దాలకుని పుత్రుగాథను అనఁగా పాండురాజు గతించిన పిమ్మటను రెండు వందల యేఁబది యేండ్లకైన గాథను పాండురాజు కుంతితోఁ జెప్పినటుల సంభవ పర్వములోని నూటయిరువది రెండవ యధ్యాయమున నుండుట యసంభవముగా నున్నది. ఈ శ్వేతకేతుని గాథ జనమేజయుని మరణానంతరము గూడనై యుండును అందువలన వ్యాస వైశంపాయనుల జయ భారతములో నిది మాత్రమేకాక సౌతి యొక్క మహాభారతములోనిది కూడఁ గాదని తలఁతును ఇంత మాత్రమెకాదు. శ్వేతకేతుని కుమారుని గాథయు శ్వేతకేతుని మేనల్లుడగు నష్టావక్రుగాథయు, శ్వేతకేతుని భార్యయగు సువర్చలకు శ్వేతకేతునితో నైన సంవాదము మొదలగు గాథలు మహాభారతాంతర్గత మగు నరణ్య శాంత్యనుశాసనిక పర్వములలో సౌతికిఁ బిమ్మట నెవరిచేతనో కూర్పఁబడిన వని తలఁపవలసియున్నది. మఱియును "ఆశ్చర్యపర్వము, ఖిలసంహిత" యనఁబడు హరివంశమున జనమేజయుని ప్రపౌత్రుఁడగు శ్వేతకర్ణుని, అతని కుమారుఁడగు 'అజపార్శ్వుని' వృత్తాంతములు గూడ వర్ణింపఁబడుటచే నా హరివంశము జనమేజయునకుఁ బిమ్మట నూటయేఁబది సంవత్సరములకు వ్రాయఁబడియుండును. ఆ హరివంశపు గాథఁగూడ సౌతి శౌనకాదులకుఁ జెప్పినట్లుండుటచే నొకవేళ సౌతి భారత యుద్ధానంతరము మూఁడువందల యేండ్లనాఁటివాఁడైనఁ గావచ్చును. సౌతిశబ్దము గోత్రాపత్యమై వ్యాసశిష్యుఁడగు సూతుని వంశపువాఁడేమో? ఆ సౌతియే "వన, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ ఆశ్చర్య" పర్వములలోని గాథల నిచ్చవచ్చినరీతిని జేర్చియున్నాఁడు. అందువలనఁ బాండవులకును దనకు నడుమనుండిన రాజులయొక్కయు ఋషులయొక్కయు గాథలందు విచ్చలవిడిగాఁ

గూర్పఁబడియున్నవి. విస్తారముగా సీతఁడు వర్ణించిన గాథలు బృహదారణ్యకా ద్యుపనిషత్తులలోని గాథలకు మార్గదర్శకములైనఁ గావచ్చును. కారణమేమన బృహదారణ్యకోపనిషత్తులోని గురుపరంపర యాజ్ఞవల్క్యునుండి యిరువదేడు తరములకుఁ దాఁటుచున్నది. ఐతిరేయ బ్రాహ్మణములో జనమేజయుని యశ్వ మేధము, అతని కర్ధ్వర్యముఁజేసిన 'తురుడు'అను శూద్రఋషి యంశము బహు ప్రాచీనకాలమునందైనటుల వర్ణింపఁబడెను. అందువలన సౌతి మహాభారతమునఁ గూర్చిన గాథలు వైదిక వాఙ్మయమునకును "అర్థవాదముల" రూపముగా నుపయోగించియున్న వనవచ్చును. సౌతి ప్రౌఢుఁడగుకవి నూఱు పర్వములుగా నుండిన భారతమును దాను పదునెనిమిదిపర్వములుగాఁజేసినట్లుచెప్పియున్నాఁడు.[1] కాని తనకెన్నో శతాబ్దములకుఁ బూర్వమున జరిగిన గాథలను కాలనియమము లేకుండఁగ కూర్చియున్నాఁడు. లేక కాలాంతరమున మఱికొందఱు తమ కవి త్వమునైన నందుఁ జొన్పియుందురు. కాని మహారాష్ట్ర భాషలో[2] "భారత మీమాంస"మును వ్రాసినవారు "సౌతి" క్రైస్తవశకమునకుఁబూర్వము రెండు వందల యేబది (250) సంవత్సరములనాఁటివాఁడని వ్రాయుటమాత్ర మసం గతము. కారణ మేమనఁగా "అశ్వలాయనుని" నాఁటికే మహాభారత మేర్పడి యుండుటయు నాతఁడు ఆపస్తంబునకుఁ బూర్వికుడై క్రీ. పూ. వేయిసంవత్స రములనాఁ డుండుటయు డాక్టరు "బూలరు" గారు ఆపస్తంబధర్మసూత్రముల కింగ్లీషుభాషాంతరీకరణముఁ జేసియున్నారు. వా రాపస్తంబ శ్వేతకేతులు సమకా లీనులనియు ఆపస్తంబుఁడు క్రీ. పూ. ఐదవ శతాబ్దమువాఁ డనియు వ్రాసి యున్నారు కాని శాకటాయనునిచేతను, పాణినిచేతను దమవ్యాకరణములలో నుచ్చరింపఁబడిన యాపస్తంబుఁడును ఉపనిషత్తులలోఁ జెప్పఁబడిన శ్వేతకేతుఁ డును క్రీ. పూ. ఐదవశతాబ్దపువా రని చెప్పుటకు వీలులేదు. కాని జనమేజయు నకుఁ బిమ్మటివారు. అట్టివారిలోని శ్వేతకేతువుయొక్క గాథను పాండురాజు కుంతికిఁ జెప్పుటయు వ్యాస వైశంపాయన సౌతి కృత జయ భారత మహాభారత ములకంటెఁ గూడ కొన్నిగాథ లీదృశ్యమాన మహాభారతమున నిమిడియున్న వని తోఁపించును. దృశ్యమాన మహాభారతము సందర్భశుద్ధి లేకుండఁగఁగూడ గొన్నిచోటులఁ గూర్చఁబడినదని వ్రాసినందులకుఁ దద్‌జ్ఞులు నన్ను క్షమింతురు గాక — ఇందులకు రెండుమూఁడు నిదర్శనములనుమాత్రమే వ్రాయుచున్నాను.

---

1. ఆదిపర్వ. అనుక్రమణికాధ్యాయ.
2 మహారాష్ట్రభాషలో "సప్రే" పండితులు వ్రాసినది. దాని నిపుడు బ్ర. శ్రీ. చర్ల నారాయణశాస్త్రిగా రాంధ్రీకరించుచున్నారు.

పాండురాజు శతశృంగపర్వతమున మృతినొందగా మాద్రి పాండురాజుతోఁ జితాగ్ని నొంది మృతినొందినదని ఆదిపర్వముయొక్క ౧౨౫ అధ్యాయమున వర్ణింపబడినది. కాని ౧౨౬ అధ్యాయమున మాద్రీపాండుల శరీరములు హస్తినాపురికిఁ గొనితేఁబడి విదురాధిపత్యమున నచట దహింపబడునటుల వర్ణింపఁబడియున్నది. నన్నయభట్టు డీయసందర్భము దగ్గఱనే యుండుటఁ జూచికాఁబోలు మాద్రీపాండుల యస్థులు కొనితేఁబడి హస్తిపురిలో విదురాధిపత్యమున సంస్కరింపఁబడిన వని వ్రాసియున్నాఁడు.*

ఇంకనొకటి—ఆదిపర్వమునఁ గర్ణుఁడు సద్యోగర్భజనితుఁడుగా వర్ణింపఁబడినాడు. ఆ గాథ యచట నిష్ప్రశ్నముగాఁ జెప్పఁబడియున్నది. అరణ్యపర్వాంతమున జనమేజయుని ప్రశ్నకు వైశంపాయనుఁడు కర్ణవృత్తాంతముఁ జెప్పుచుఁ గర్ణునిఁ గుంతి పదిమాసములు గూఢముగా మోసి కనినది యని చెప్పియున్నాఁడు. కర్ణునిగాథను నన్నయభట్ట యెఱ్ఱాప్రెగ్గడ కవులు యథామాత్రకముగానే యాంధ్రీకరించియున్నారు.

---

* మాద్రీపాండురాజులు శతశృంగగిరిలో మృతి నొందిరి. మాద్రి భర్తతోఁ జితిపై దహింపఁబడెను. ఆ మాద్రీపాండుల దేహములు హస్తిపురికిఁ గొనివచ్చినట్లుండుట యసందర్భముగానున్న దని నేను వ్రాయఁగాఁ గృష్ణమూర్తి శాస్త్రిగారు దేహము లన నస్తిక లని కలదనిరి. అట్లే వ్యాఖ్యాత వ్రాసెను గాని, ఆ ఘట్టమున, దేహ, శరీర, శవ శబ్దములు వాడఁబడియుండుటచే నది సందేహాస్పదముగా నున్నది. శవ, శరీర శబ్దములకు అస్తికలను నర్థ మేనిఘంటువునను గానరాదు. శ్రీకృష్ణ భారతమునఁ గృష్ణమూర్తిశాస్త్రిగారు "అస్తి పంజర"ము లని వ్రాసిరి. అస్తి పంజరమన అస్తికలగునా?

కర్ణజన్మముఁగూర్చి ఆదివనపర్వములలో నన్యోన్యవిరుద్ధముగా వర్ణింపఁబడియున్న దని నేను వ్రాసినందులకు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు "మహాభారత చరిత్ర నిరాకరణము"న 25, 26 పుటలలో సంస్కృత వనపర్వమునఁ గర్ణుఁడు సద్యోగర్భజనితుఁడుగా నుండఁగా నెఱ్ఱాప్రగడ భారతమును, పండితంమన్యులు సంస్కరించిరి. అట్లా పండితంమన్యులు సంస్కరించుటకు సంస్కృతమున, శ్లో॥ తతో గర్భస్సమభవ త్పృథాయాః పృథివీపతే। శుక్లే దశోత్తరే పక్షే తారాపతి రివాంబరే। సాబాంధవభయా ద్బాలా గర్భం తం వినిగూహతి."

అను శ్లోకములలో దశోత్తర శబ్దము ప్రమాదముఁ గలిగించుటఁజేసి పండితంమన్యులు పొరఁబడి రని యేమేమో వ్రాసి, పై శ్లోకములకు నీలకంఠవ్యాఖ్యానము నీక్రిందిరీతిని వ్రాసిరి:

మఱియొకదానిఁ జూడుఁడు. ఆరణ్యపర్వమున రామాయణగాథ కలదు. అందుఁ గుంభకర్ణుని లక్ష్మణస్వామి వధించినటులఁ గలదు. ఇది సంస్కృతము ననుసరించియే యాంధ్రీకరింపబడియున్నది. లక్ష్మణస్వామి కుంభకర్ణునిఁ జంపుట రామాయణగాథా ప్రతిపాదితము లగు గ్రంథములలో నెచ్చటను గానము.

---

"తత ఇతి దశోత్తరే ఏకాదశే శుక్లే పక్షే ప్రతిపది చంద్ర ఇవ బాల ఉద్భూతః మాఘశుక్ల ప్రతిపది కర్ణనిషేక జన్మేత్యర్థః" అని యున్నది. దీనింబట్టి విచారింప సూర్యుఁడు మాఘశుక్ల ప్రతిపద్దినంబునఁ గుంతిం గూడె ననియు, నానాఁడే గర్భమయ్యెననియు, నానాఁడే కర్ణుఁడు పుట్టెననియు స్పష్టపడుచున్నది."

మఱియు, నీ యంశము తమ శ్రీకృష్ణభారతారణ్య పర్వమున విశదీకరించితి మనియు, దాని, జూచినవారికి విశేషాంశములు బోధపడు ననియు వ్రాసిరి.

నేను శ్రీ పిఠాపుర మహారాజావారి యానతిని, ఆంధ్రదేశములోఁ బదుమూఁడు మండలముల నుండి యాంధ్ర భారతపుఁ బ్రతులను సేకరించితిని. ఆ వ్రాఁత ప్రతులు మూడుఁ వందలేండ్ల నుండి నేఁటి కేఁబది యేండ్లకుఁ బూర్వము వఱకు వ్రాయఁబడినవి ఆ ప్రతులన్నింటియందును నేఁడు ముద్రణము నందుండిన రీతిని కుంతి పది నెలలు మోసి కనినట్లే యున్నది. అఱువదేండ్లనుండి పెక్కుతడవలు ముద్రణమగుచున్న నానా విధములగు భారతపుఁ బ్రతులలోను అట్లే యున్నది. ఆలోచింప, వ్రాసిన ముద్రించిన వీరందఱును బండితంమన్యులే యగుదురా! లేక శంభుదాస మహా కవియే పండితంమన్యుఁడా? కాని, శాస్త్రి గారుదాహరించిన నీల కంఠ వ్యాఖ్యలో "మాఘశుక్ల ప్రతిపది కర్ణనిషేక జన్మేత్యర్థః" అని యున్నది గాని జన్మమని లేదు. నిషేకజన్మ మన గర్భమున జీవుఁడు వీర్యము ద్వారా ప్రవేశించుట, లఘుజాతక, బృహజ్జాతక, సారావళ్యాది జ్యోతిశ్శాస్త్ర గ్రంథములు, భట్టోత్పలాది వ్యాఖ్యాతలు విశేషముగాఁ జర్చించియున్నారు. బృహజ్జాతకమునఁ, నిషేక జన్మమును, జన్మము (భూమియందు జన్మించుట)ను బురస్కరించి, ఫలములు చెప్పఁబడి యున్నవి. మఱియు శాస్త్రిగా రుదాహరించిన శ్లోకములలోఁగాని, వ్యాఖ్యానములోఁగాని నిషేకజన్మమనియే కాని, జన్మమని లేదు. వా రుదాహరించిన శ్లోకవ్యాఖ్యలో మాఘశుక్లప్రతిపత్తునఁ జంద్రునివలె నుద్భవించె ననుటలోఁగూడ, ప్రతిపత్తునందు, ఆకాశమునఁ జంద్రుఁ డుద్భూతుఁ డైనట్లను నుపమానము, చంద్రుని యేకకళనాఁ డుద్భవించి ప్రజలకుఁ

మఱియొకటి ఆదిపర్వమున "ఉదఙ్క" (ఉత్తంక) ఋషి జనమేజయుని సహాధ్యాయుఁడు. సర్పయాగమున కాతనిం బురికొల్పినవాఁడు. అశ్వమేధపర్వమున నాతఁడు "మరుస్థల" వాసి యగు మునియై కృష్ణునిచే భారతయుద్ధానంతరము శప్తుఁడైనటుల వర్ణింపఁబడెను. రెండుచోటులను వర్ణింపఁబడినవారు వేఱు మునులఁగారు. వారి గురుశుశ్రూషాదికము, గురుదక్షిణకై వారు పడినపాట్లు సమానముగానే యున్నవి.

ఇట్టి యసందర్భములు మహాభారతమునఁ బెక్కులు కలవు. కాని గ్రంథవిస్తరభీతిచే వ్రాయలేదు. ఇంకొకటి - వ్యాసుని యనుక్రమణికాపద్ధతిఁ జూడగా నాతని జయమున సభాపర్వాంతము వఱకగుగాథలు విపులముగా వ్రాయఁబడి తక్కినగాథలు క్లుప్తముగా వ్రాయఁబడె నని తలఁపఁబడుచున్నది. యుద్ధపంచకపుగాథలు చాల క్లుప్తముగా వ్రాసినటులఁ గలదు. భీష్మ పర్వపుగాథ యా పర్వమునఁ బదుమూఁడవ యధ్యాయమునఁ బదుమూఁడు శ్లోకములచేఁ జెప్పఁబడినది. కాని ధృతరాష్ట్ర సంజయులకును జనమేజయ వైశంపాయనులకును నగు నుత్తరప్రత్యుత్తరములచేఁ దక్కిన గ్రంథమంతయుఁ బెరిగినది.

---

గాన్పింపనిరీతిం గర్భుఁడు గర్భమున మాత్రమె ప్రవేశించె నను నర్థమగుచున్నది. కాని శాస్త్రిగారు రెండవ శ్లోకార్థము తాత్పర్యము కాక కాఁబోలు వ్రాయలేదు "తం గర్భం వినిగూహతీ = ఆ గర్భమును దాఁచుచున్నదై" క్రియ యేది? తరువాతంగల శ్లోకార్థమును పిమ్మటఁ గల శ్లోకములను జూచిన శాస్త్రిగారి తప్పు విశదమగును

శ్లో॥ ధారయామాస సుశ్రోణీ నచైనాం బుబుధే జనః। నహి తాం వేదనార్యన్యా
కాచిద్ధాత్రేయికామృతే కన్యాపురగతాం బాలాం నిపుణాం పరిరక్షణే।
తతః కాలేన సా గర్భం సుషువే వరవర్ణినీ.

"కుంతి గర్భమును రహస్యముగా ధరించెను. ఈ గర్భమును ధరించిన కుంతిని ఇతర పురుషుఁడుగాని, యన్యస్త్రీగాని యామె నేర్పుగా నంతఃపురమున రక్షింపఁబడుచుండుటచే నెఱుఁగరు. ఒక్కదాసికి మాత్రమె తెలియును. పిమ్మట సకాలముచే తనే యాకుంతి బిడ్డను గనెను." శాస్త్రిగారు తరువాతి శ్లోకములను వదలి కవిత్రయములో నొకఁడగు శంభుదాస మహాకవిని పండితంమన్యునిగాఁ జెప్పుట పెద్దతప్పు. మఱియు, పైశ్లోకముల కర్థము కాక తా మేమొ క్రొత్తయంశముఁ గనిపెట్టినట్లు తమ కృష్ణభారతపుటరణ్యపర్వమున "పుట్నోట్సు"న నీయంశము వ్రాయుట యంతకంటె తప్పు.

ద్రోణపర్వపుగాథ మాత్రము చిన్నచిన్నవి యగు నెనిమిది యధ్యాయములలోఁ జెప్పఁబడినది. తక్కినది జనమేజయాదుల ప్రశ్నోత్తరములచేతనే వృద్ధినొందినది. అటులనే కర్ణ పర్వగాథ. యిఱువది శ్లోకములు గల కర్ణపర్వపు రెండవ యధ్యాయముచేతను, శల్య సౌప్తిక పర్వముల గాథ ముప్పదియెనిమిది శ్లోకములు మాత్రమే గల శల్యపర్వపు మొదటి యధ్యాయము చేతను జెప్పఁబడి తక్కిన గ్రంథమంతయు జనమేజయాదుల ప్రశ్నోత్తరములచేఁ బెంపఁబడినది. భారత యుద్ధగాథ నంతయును సూక్ష్మదృష్టితోఁ జదివిన యెడల ద్రోణపర్వముననే మహాయుద్ధములు కలవని తెలిసికొనగలము. వీరాధివీరులు ద్రోణపర్వముననే వధింపఁబడినటుల వర్ణింపబడియున్నది. వ్యాసకృత భారత భాగముగాఁ దలఁపఁబడు పదుమూఁడు శ్లోకములలో భీష్ముడు పది దినములు సేనాధిపత్యముఁ జేసినటులఁ గలదు. కాని యాతఁడు విశేషయుద్ధముఁ జేసినటులఁ గాన్పింపదు. వ్యూహములను బన్నుకొనుటతో సరిపోయి యుండును. నాఁటి యుద్ధధర్మములు కూడ నేఁటివలె "సదసద్యుద్ధములు" (ఎదురఁబడి పోరాడుట, గోతులు, వనములు మొదలగువానిలోఁ బొంచియుండి శత్రువులను వధించుట) కలవని శాంతిపర్వము, మనుస్మృతి, కౌటిలీయార్థశాస్త్రము, కామందకము, శుక్రనీతి యను గ్రంథములలోఁ జెప్పఁబడి యుండుటచే నూహింపబడుచున్నది. భీష్ముఁడును నటులు వ్యూహములఁ బన్నుచు పదియవనాఁడెపుడో యర్జున శిఖండుల బారిఁబడి మడిసి యుండును. భీష్ముఁడు శతవృద్ధగుటచే నాతఁడు పొరఁబాటున శత్రువున కగ్గమై చనిపోవునని దుర్యోధనుఁడు తలఁచియే యాతనిఁ గాఁచుచుండవలెనని పెక్కు సారులు చెప్పినటులఁ బెంపఁబడిన భీష్మపర్వమునఁ గలదు. భీష్ముని మరణముతోఁ గౌరవులు భయకంపితులై పెద్ద ప్రయత్నముతో ద్రోణునకు సైన్యాధిపత్య మిచ్చిరి. ద్రోణుఁడు పెక్కు వ్యూహములఁ బన్నినటులఁ బెంపఁబడిన మహాభారతమునఁ గాన్పించుచున్నది. కాని ద్రోణుని సైన్యాధిపత్య కాలమున నాతఁడు శకట వ్యూహమును బన్నఁగాఁ బాండవులు క్రౌంచవ్యూహముఁ బన్నినటుల వ్యాసుని జయ మని తలఁపఁబడు మూలభారతమునఁ గలదు. ఒక్క శకటవ్యూహము చేతనే యాతని యుద్ధము పూర్తియైనది.

నేఁడు కాన్పించు మహాభారతములోని కొన్ని భాగములు బౌద్ధమత విజృంభణానంతరమునను, అలగ్జాండరు దండయాత్ర చేసిన పిమ్మటను రచింపఁబడియున్నవని కొందఱు పాశ్చాత్య విమర్శకులు నేఁటికాలపు మనదేశపుఁ బండితులలోఁ గొందఱు వ్రాసియున్నారు. విశేష పాఠ భేదములు కాళిదాసు నాఁటికే కలిగియుండును గాని అంతమాత్రముచే మహాభారత భాగములు గ్రీసు దేశీయుల దండయాత్రానంతరము గూర్పఁబడె నని కొందఱు విమర్శకులు

వ్రాసిన వ్రాఁతల కారణములచే నట్లు దలంప మనసుకొల్పుటలేదు. కారణ మే మనఁగా, [1]"ఏడూక" శబ్దము మహాభారతమున నుండుటచేతను ఆది బౌద్ధమతస్థుల యస్థికలఁ బూడ్చి దానిపైఁ గట్టిన స్తూప మగుటచేతను (డాగోబా యని పాలీభాషలోని పేరు) అట్టి యేడూకములు విస్తార మీ భరత ఖండమునఁ గలవని మహాభారతమున రచింపబడుట చేతను బౌద్ధమత విజృంభణానంతరము ననే మహాభారత భాగములు కొన్ని విరచింపబడెనని కొందఱితలంపై యున్నది. బౌద్ధమతధర్మములు భారతీయ సాంప్రదాయ యుక్తము లగుటచేతను బౌద్ధ మతమునకుఁ బూర్వముననే యేదేని యొకవిధమగు "నేడూక" చిహ్నము లుండియుండును. శాస్త్రకాలమున గృహనిర్మాణము గుంజలపై బొంగువెదుళ్ళను వేసి యిండ్లను గట్టుచుండిరి [2] మయునిచే ధర్మరాజునకుఁ గట్టఁబడిన సభా నిర్మాణమె గోడలఁబెట్టి గృహములఁ గట్టుట యార్యులలో మొదలు. మహాభార తములో మయసభా వర్ణనముఁ జూచినచో గోడలు వర్ణింపఁబడిన యంశములు కాన్పించును. ద్యూతమునకుఁ గృత్రిమాలోచనముఁ జేసినపిమ్మటను ధృత రాష్ట్రుఁడొక సభాశాలను నిర్మింపఁజేసియున్నాడు. అందు స్తంభములే కాని గోడలు లేవు. ఆకాలమున నిర్మింపఁబడిన గృహకుడ్యములైనను స్తంభ ములను నడుమనుంచి కట్టఁబడిన గోడలై యున్నవి. అందువలననే యము రుఁడు "ఏడూక మంతర్న్యస్తకీకసం" అనినాఁడు. అనఁగా లోపలను గొయ్యఁ బెట్టి కట్టిన గోడకు ఏడూకమని పేరు. కీకసశబ్దమునకుఁ గొయ్య యెముక కూడ నర్థ మగును మహాభారత రచనాకాలమునకు ధర్మజుని సభయొక్క నమోనాలచే దేశ మంతయుఁ గొయ్యలను నడుమ నుంచిన గోడలచే రాజమందిరములు ధనిక మందిరములు కట్టఁబడుచుండుటఁ జూచి యాకవి దేవగృహములఁ బూజింపక యేడూకములనే గౌరవించు చున్నారని వ్రాసియున్నాఁడు. ఇప్పటికాలమున

---

1. ఏడూకా న్పూజయిష్యంతి వర్జయిష్యంతి దేవతాః......
ఏడూకచిహ్నా పృథివీ నదేవ గృహభూషితా
భవిష్యతి యుగే క్షీణే తద్యుగాంతస్య లక్షణం. వనపర్వ ౧౯౦ అ.

2. ఇహైవ తిష్ఠ నిమితాతిల్వలా స్యాదిరావతీ మధ్యే తాల్పస్య తిష్ఠాన్మాత్వా ప్రాపన్నఘాయసః। ఋతేవ స్థూణా వధిరోహవగ్ంశో గ్రోవిరాజ న్నప సేధ శత్రూన్॥ ఏకాగ్ని మంత్రపన్న॥ ౨—౫.

తాత్పర్యం:- ఓ గుంజా! వడ్రంగి చేసిన నగిషీకలదానవై యీ ద్వార దేశమునఁ బాతఁబడినదానవై యుండుమా! గృహమధ్యముననుండిన నిన్ను దోషములు పొందకుండుఁగాక! ఓ వెదురా! గుంజలపైనుండి ప్రకాశించుచు శత్రువులను వెళ్ళఁగొట్టుము.

పాశ్చాత్య వాస్తుశాస్త్ర విధానముచేఁ గట్టఁబడిన మండువా లేని గృహములు(బంగాళాలు) ఎటుల భారతీయ వాస్తుశాస్త్ర విరుద్ధములో నాఁడటుల "సంతర్వ్యస్తకీకసములు"గల గృహము లార్యవాస్తుశాస్త్ర గర్హితములు. అందువలననే యాకవి వానిని గర్హించి యున్నాఁడు. నేఁడు కొందఱు పూర్వాచారపరులు బంగాళాలగు నిండ్లను నిందించుచుండుటఁ జూచుచున్నారము. అటులనే నాఁటివారేడూకములను నిందించుచుండిరి. అంతర్న్యస్తకీకసభిత్తులపైఁ గట్టిన గృహములు దత్తమండలాంధ్రులకును నైజాము రాజ్యవాసులకును గ్రొత్తకావు. బౌద్ధమత విజృంభణకాలమునం దెముకలపైఁ గట్టిన గోడలకు గౌరవము హెచ్చియుండెనే కాని యేడూకము మయునిచే నారంభింపఁబడినదే మొదలని మాత్రము నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

యవనశబ్దము పలుచోటుల మహాభారతమున వాడఁబడుటచేఁ బాశ్చాత్య విమర్శకులు కొందఱు మహాభారతములోని కొన్ని భాగము లలగ్జాండరు దండయాత్రను జేసినపిమ్మటనే కూర్పఁబడి యుండునని వ్రాసియున్నారు. కారణ మేమనఁగా, గ్రీకులను యవనులని భారతీయులు పిలుచుటయే యఁట!

గ్రీసుదేశమునకును భారతదేశమునకును నన్యోన్య సంబధము కలుగుట, అలగ్జాండరు దండయాత్రతోడనె రాలేదు. అంతకుముందు పెక్కుశతాబ్దముల క్రితమె సంబంధము కలిగియున్నది. పాణిన్యాచార్యులు క్రీ. పూ. ౭, ౮ శతాబ్దముల ప్రాంతపు వాఁడని మఱికొందఱును ౧౨ వ శతాబ్ద ప్రాంతపు వాడని మఱి కొందఱును పూర్వపాశ్చాత్య పండితులు వ్రాసియున్నారు పాణినికంటె శాకటాయనుఁడు ప్రాచీనుఁడనుటకుఁ బాణిని శాకటాయనుని బెక్కుసారులు తన వ్యాకరణమునఁ బేర్కొనుటయే నిదర్శనము. అట్టి శాకటాయనుఁడును, పాణినియుఁ దమతమ వ్యాకరణములలోఁ బలుసారులు యవనశబ్దము నుచ్చరించియున్నారు. పాణిని శాకటాయనులచేఁ బేర్కొనఁబడిన యవనులనే మహాభారత గ్రంథకర్తయు దనగ్రంథమునఁ బేర్కొనెను. పాణిని శాకటాయన మహాభారత గ్రంథములలోఁ బేర్కొనఁబడిన యవనులు గ్రీసు దేశీయులు? యవనుల లిపి దుష్ట లిపి.[1] వారు ముండనమును భారతీయాచార విరుద్ధముగఁ జేయించుకొనుచున్నారు[2] శాకటాయనుఁడు లిపిని మాత్రమె పేర్కొనినాఁడు. పాణిని లిపిని

1. యవనయవా ల్లిపిదుష్టే॥ (౧-౩-౫౬) శకటాయ వ్యాకరణము.
"ఇంద్ర వరుణ భవ శర్వ రుద్ర మృడ హిమా రణ్య యవ యవన మాతులా చార్యాణా మానుక్" ౪.౧.౪౯ పాణిన్యష్టాధ్యాయి.

2. ౨-౧-౭౨ అష్టాధ్యాయియొక్క "మయూర" వ్యంసకగుణముఁజూడుఁడు.

వృత్తిని ఆచారమునుగూడ పేర్కొనినాఁడు. మహాభారతమునఁ బెక్కుచోటుల యవనులు యోధులుగాఁ బేర్కొనఁబడిరి.

పై కారణములచే శాకటాయనాదుల కాలమునకే భారత దేశీయులకుఁ బాశ్చాత్యదేశ సంబంధము కలిగియున్న దనియుఁ బ్రాచీనులు తమ గ్రంథములలో నరేబియా దేశీయులనో గ్రీసు దేశీయులనో బేర్కొని యున్నారనియుఁ దలంపవలసి యున్నది. పాణిని శాకటాయనులు పేర్కొన్న లిపి దుష్టలిపి యగుటచే నాలిపి "ఫొనిషియా" లిపియో "కీల" లిపియోయై యుండును. ఆ యవను "లరబ్బులై" యుందురని తలఁచుచున్నాను అరబ్బుల ముండనము కూడ భారతీయాచార విరుద్ధమే. భారతదేశ "మరబ్బుల" దేశమునకు సమీపముకూడ నై యున్నది. అందువలన నరబ్బులచే యవనులని భారతీయులు వ్రాసియుందురేమో? గ్రీకులఁగూడ నిటీవల యవనులని పాశ్చాత్యతచే వ్రాయుట విరుద్ధము కాదు. పై కారణములచే "నలగ్జాండరు" వచ్చిన తరువాతను భారత భాగములలోఁ గొన్ని రచింపఁబడినవని చెప్పుటకు వీలులేదు.

మఱియు మహాభారతమునఁ బేర్కొనఁబడిన విష్ణుని యవతారములలో "బుద్ధావతారము" పేర్కొనఁబడలేదు.[1] అందు కృష్ణావతారమునకుఁ బిమ్మటను కల్క్యవతారమె చెప్పఁబడియున్నది. శాంతి పర్వములోని భాగము లించుమించన్నియు మహాభారతకవులలోఁ గడపటివాఁడగు "సౌతి" కృత భాగములోనివె యని తలఁపఁబడుచున్నవి ఆ శాంతిపర్వమున దశావతారములలో బుద్ధావతారము పేరు లేకుండుటచే బుద్ధునకుఁ బూర్వమె మహాభారతము పూర్తి చేయఁబడి యున్నదని నా నిశ్చయాభిప్రాయము అయినను బుద్ధ ప్రతిబుద్ధ శబ్దము లచటనచట మహాభారతమునఁ గలవు.[2] కాని యవి సాంఖ్యమతోదిత పారిభాషిక పదములై "జ్ఞాని" యను నర్థముమాత్ర మిచ్చు పదములై యున్నవి. బుద్ధునకుఁ బూర్వమె మహాభారతము రచింపఁబడియుండును కాని, షడ్దర్శనములలోని

1. "హంసః కూర్మశ్చ మత్స్యశ్చ ప్రాదుర్భావాద్ద్విజోత్తమ
వారాహో నరసింహశ్చ వామనో రామ ఏవచ"
రామో దాశరథిశ్చైవ సాత్వతఃకల్కి రేవచ॥ ౩౪౦ అధ్యా శాంతిపర్వ.

2. బుద్ధ మప్రతిబుద్ధత్వా ద్బుధ్యమానంచ తత్వతః
బుధ్యమానంచ బుద్ధంచ ప్రాహుర్యోగనిదర్శనం॥ ౩౮౦ అధ్యా॥ శాంతిపర్వ.
ప్రాదుర్భావాశ్చ కథితా భవిష్యా ఇహయే యథా
తత్ర యే పురుషాశ్శ్వేతాః పంచేంద్రియ వివర్జితాః
ప్రతిబుద్ధాశ్చ తేసర్వే భక్తాశ్చ పురుషోత్తమం
తేర్చయంతి సదాదేవం తైస్సార్థం రమతేచసః॥ ౩౪౪ అధ్యా॥ శాంతిపర్వ.

యోగసాంఖ్య దర్శనములు నిరుక్తము. అథర్వవేదము మఱికొన్ని నిఘంటువులు మాత్రము నాఁటికి రచింపఁబడి యుండెనని మాత్రము శాంతిపర్వములోని ౩౦౮ యధ్యాయముచేఁ దెలియవచ్చుచున్నది.

మహాభారతములోని "యానుశాసనిక" పర్వము "ప్రక్షిప్త" మనియు నిటీవలఁ గూర్పబడెనని ప్రొఫెసర్ "వింటర్నిట్జు" గారు వ్రాయుచున్నారు. ఎందువలన నటులఁ దలఁచిరో తెలియదు. ఆలోచింపఁగా, ననుక్రమణికాధ్యాయములో భారతవృక్ష వర్ణనమునం దానుశాసనికపర్వము పేరు లేకుండుటచేతను, వివిధదేశకోశములలో నధ్యాయభేదము విశేష వ్యత్యాసముతోఁ గూడియుండుటచేతను, పర్వాంత కర్తవ్యవిధులలో నానుశాసనిక పర్వమునకుఁ బ్రత్యేకవిధి గ్రంథాంతమునఁ జెప్పబడకపోవుటచేతను, దాని నిటీవలఁ జేర్పఁబడినదానినిగాఁ దలఁచి యుందురు. నిజమునకు భీష్మ స్వర్గారోహణగాథ తప్ప వేఱు భారతేతిహాసముతో సంధించిన గాథ లందుఁ గాన్పింపవు. కాని, లక్షశ్లోక పరిమితిగల మహాభారతమున నెనిమిదివేల శ్లోకములుగల భాగమంతయుఁ బ్రక్షిప్త మనుటకు మనసు గొలుపకున్నది. మఱియు వింటర్నిట్జుగారు వీరచరితమై యితిహాసమగు మహాభారతమున, బ్రాహ్మణులు స్వార్థపరులై స్వోపకారక వాక్యములను స్వోపకారక గాథలను జొనిపి స్మృతిగాఁజేసిరను నపవాదరూపకమగు "ఆస్ట్రియన్ హావిజరు గన్[1] ప్రాచీన భారతీయ బ్రాహ్మణులపైఁ బ్రయోగించియున్నారు. వింటర్నిట్జుగారిచే మహాభారత గ్రంథకర్తలుగాఁదలఁపబడిన వ్యాస వైశంపాయన సౌతులైనను గానముచేయు కురుపాండవసంస్థానములలోని సూతులైనను బ్రాహ్మణులు కారు. వ్యాసుఁడు నిషాదుఁడు. తచ్ఛిష్యుడగు వైశంపాయనుఁడు శాపతప్తుఁడగు భ్రష్టబ్రాహ్మణుఁడు. (యాజ్ఞవల్క్య చరితమున వైశంపాయనుని గాథకలదు.) సౌతి కాని కురుపాండవసంస్థానములలోని గాయకులగు సూతులుగాని యిప్పటి శుద్ధశ్రోత్రియులనుకొనునంతటి శుద్ధశ్రోత్రియబ్రాహ్మణులుకారు. భ్రష్ట బ్రాహ్మణుఁడగు వైశంపాయనుఁడైనను భారతము ఇతిహాసరహితముగ రచించెనే కాని బ్రాహ్మణధర్మ ప్రతిపాదకేతిహాసములతోఁగూర్చి యుండలేదు. సౌతికాలమున నే లక్షశ్లోకమితి మహాభారతమునకుఁ గలిగె. ఇట్టిస్థితిలో బ్రాహ్మణులు ప్రక్షిప్త గ్రంథముఁ జొనుపుటకుఁ దా వెటులఁ గలుగును? నాతలఁపున సౌతికిఁ బిమ్మటఁ గూడ కొన్ని భాగము లందుఁ జేరియున్నవి. కాని యవి బ్రాహ్మణధర్మ ప్రతిపాదకములై యుండవు. వింటర్నిట్జు గారికి జమదగ్ని చెప్పులజోడు గాథ

1. 'హావిజరు' అనునాతడు ఆస్ట్రియాదేశీయుఁడు. అతఁ డీశతాబ్దాదినె యొక ఫిరంగి (గన్) గనిపెట్టెను. అది ఎదుటివారిని గొట్టక పైకెగిరి దూర పాతమై దూరస్థులనే బాధించును (వింటర్నిట్జు ఆస్ట్రియా దేశీయుడు.)

మొదలగునవి బ్రాహ్మణ కల్పితములుగాఁ గాన్పించినవి. కాని, కౌశికుఁడు ధర్మ వ్యాధుఁడను కటికవానికడ జ్ఞానోపదేశము నొందుటయు నాళీకజంఘుని గాథలోని దుష్టబ్రాహ్మణుని యయోగ్యత మొదలగు బ్రాహ్మణ్య నీచతను సూచించు గాథలు కూడ మహాభారతమున నున్నవి. అవి వారికిఁ గాన్పింపకపోవుట విచారకరము. ఇంకొకటి వింటర్నిట్జుగారు యుద్ధపంచకము కౌరవపక్షపాతి (సంజయుడు కావచ్చును) చెప్పుటచేత నా భాగము కౌరవపక్షముగా వ్రాయఁబడె ననియు తక్కిన భాగము పాండవ పక్షముగా చెప్పఁబడెననియు వ్రాసియున్నారు. అది కూడ పొరబాటని చెప్పవలసియున్నది. కారణ మేమనగా, యుద్ధపంచకమంతయుఁ గౌరవపక్షముగా వ్రాయఁబడినచోఁ గౌరవసైన్యాధిపతియగు భీష్ముడు తానుపడి పోవు నుపాయముఁ బాండవులకుఁ జెప్పుటయు, దుర్యోధనుఁడు ద్రోణుని సైన్యాభిషేక సమయమున ధర్మజునిం బట్టిన తిరిగి జూదమాడించి యరణ్యమున కంపెద నను కృత్రిమాలోచనముఁ జేయుటయు ద్రోణుఁడు సైంధవ వధనాఁడు సైంధవుని మోసపుచ్చి యర్జునసాత్యకులను వ్యూహములోఁ జొరనిచ్చుటయుఁ గర్ణ భీష్ములు కృత్రిములై మంతనమాడుటయుఁ బెక్కుసారులు సంజయుడు ధృతరాష్ట్రునిఁ జివాట్లు వేయుటయుఁ గౌరవపక్షముగానే యాభాగము వ్రాసినచో నట్లు వర్ణింపఁ బడకపోవును. ఇతరభాగ మంతయుఁ బాండవ పక్షముగా వ్రాయఁబడె ననికూడ తలఁప వీలులేదు. అటులు తలఁచినచో ధర్మజుఁడు శల్యుని భేదోపాయముచేఁ గృత్రిమపఱచి కర్ణునిసారథ్యమున మోసముఁజేయ నియోగించుటయు ఆశ్రమవాసపర్వమున ధృతరాష్ట్రుఁడు తనకుమారుల శ్రాద్ధమునకు ధనము నడుగ భీముఁడు శ్రాద్ధమునకు ధనము నీయరా దనుటయు వర్ణింపఁబడక పోవును. కాన వింటర్నిట్జుగారి తలఁపు సరికా దని చెప్పవలసియున్నది.

ఇటీవల బ్రహ్మశ్రీ కేతవరపు వేంకటశాస్త్రిగారు భారతముఁ గూర్చి భారతీపత్రిక, ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలలోఁ గొన్ని వ్యాసములను వ్రాసియున్నారు. అందు మహాభారతము బౌద్ధులచే హిందూమతము సనహ్యించుకొను రీతిని ప్రాచీనపుశుద్ధభారతమున నచటనచట నాయాయంశములు కూర్పఁబడె నని వ్రాసి కొన్ని యుదాహరణముల నిచ్చిరి. అందొకటి, రెంటినిట క్లుప్తముగా వ్రాయుచు నవి యసంగతము లని నిరూపించుచున్నాను.

(1) వ్యాసుఁడు, "మత్స్యగంధీ" త్యాదినామములుగల సత్యవతీ పుత్రుఁడు గాక, వేఱొక శుద్ధశ్రోత్రియ బ్రాహ్మణియు, పరాశరుభార్యయు నగు, 'సత్యవతి'కి జన్మించెనట! వ్యాసునకు 'సాత్యవతేయ' శబ్ద ముండుటను సాకుఁ గొని బౌద్ధులు మత్స్యగంధీ పుత్రునిగాఁ జేసి భారతమునఁ జొన్పిరఁట!

(2) ద్రౌపదికిఁ బంచపతిత్వము లేదఁట! ఆమె ధర్మజుని భార్యయే కాని భీమాదులకు భార్యకాదఁట!

(3) పరశురామదిగ్విజయాదికము బ్రాహ్మణులపై నన్య్యలసహ్యించు కొనునట్లు వ్రాయఁబడెనఁట!

మఱియు వేంకటశాస్త్రిగారు భారతమున బ్రాహ్మణుల కల్పన (ఫోర్జరి) కలదని తలంచుచు రాజకీయవేత్తయు, భక్తుఁడు నగు విదురుని జన్మమునకు బ్రాహ్మణ సంబంధ ముండవలయునని బ్రాహ్మణబీజ జనితునిగా నాతని బ్రాహ్మణులే చేసి భారతమునఁ గల్పించిరఁట! పైని జెప్పిన వేంకటశాస్త్రిగారి వాదము విచిత్రముగా నున్నది! దీనిం బరిశీలింతము.

(1) వ్యాసుని తల్లి బ్రాహ్మణి యనిగాని, (ఉపరిచరవసుని కూఁతురు, శంతనునకుఁ బిమ్మట భార్యయు) దాశరాజుచేఁ బెంపబడిన సత్యవతి కాదనిగాని యే గ్రంథములును జెప్పుచుండలేదు వేదశిఖ యనఁబడి "వజ్రసూచక" మనఁబడు నుపనిషత్తున - "వ్యాసః కైవర్తకన్యాయాంజాతః" (వ్యాసుఁడు కైవర్తకన్యయం దుద్భవించెను.) అని కలదు. ఆ యుపనిషత్తు బౌద్ధమతము నకుఁ బూర్వముననే యావిర్భవించెను. మఱియు, విష్ణు, భాగవత, దేవీ భాగవతాది పురాణము లన్నియుఁ గంఠోక్తిగ దాశకన్యాసుతుఁడే కృష్ణద్వైపా యనుఁ డని చెప్పియున్నవి.

మఱియు ధర్మశాస్త్ర గ్రంథములలో నుత్కృష్ట గ్రంథమగు మను స్మృతికి వ్యాఖ్యానమగు "మన్వర్థముక్తావళి" యందు కుల్లూకభట్టీయర్థము వచ్చునట్లు బీజక్షేత్ర ప్రాధాన్యముఁగూర్చి వ్రాయుచు, వ్యాస ధృతరాష్ట్రాదులం బేర్కొనినాఁడు చూడుఁడు:

*"ఒకచోట, బీజము ప్రధానమగును. "ఎందుకై పుట్టింపఁబడెనతఁడు" అను న్యాయముచే బీజివలనఁ బుట్టింపఁబడినవాఁడు సోమునకు బుధునివలె అట్లే వ్యాసఋశ్యశృంగాదులు బీజముకలవారికే సుతులైరి,—ఒక్కొక్కచోట క్షేత్ర

---

* శ్లో॥ "క్వచిత్ప్రధానం బీజం స్యాత్ క్వచిద్యోనిస్తథా పరే" [illegible]

"పశిష్టం క్వచిద్బీజం, స్త్రీయోనిస్త్వేవకుత్రచిత్."

మను. 9. అ. 34 శ్లో.

వ్యా॥...క్వచిద్బీజం ప్రధానంజాయతే యదర్థముత్పాద్య మితిన్యాయేన. ఉత్పన్నో బీజినో సోమస్యబుధఇవ, తథా వ్యాసఋశ్యశృంగాదయః బీజినామేవసుతాః, క్వచిత్ క్షేత్రస్య ప్రాధాన్యం...అతఏవ విచిత్రవీర్య క్షేత్రేక్షత్రియాయాం బ్రాహ్మణోత్పాదితా అపి ధృతరాష్ట్రాదయః క్షత్రియాః క్షేత్రిణఏవపుత్రాబభూవుః-మన్వర్థ ముక్తావళి.

మునకుఁ బ్రాధాన్యము కలదు... కనుకనే విచిత్రవీర్యుని క్షేత్రమగు క్షత్రియ యందు బ్రాహ్మణోత్పాదితులైనను ధృతరాష్ట్రాదులు క్షత్రియులేయైరి.''—అని వ్రాసియున్నాఁడు. ఇందువలన సత్యవతి దాశకన్యయు వ్యాసజననియు నగుట స్పష్టముకాదా!

(2) ద్రౌపది పంచభర్తృక కాదని యెచటను నెవరును వ్రాసియుండ లేదు. ధర్మజుని భార్యయే యని చెప్పుట మఱియుఁ దప్పు. అర్జునునికే భార్య యగునేమో యని కుమారిల భట్టాచార్యుఁడు తన తంత్ర వార్తికమున వ్రాసి యున్నాఁడు. దానిం బిమ్మట వ్రాసెదను.

(3) పరశురాముని గాథ భారతముననే వ్రాయఁబడి యుండలేదు. బ్రహ్మాండాది పురాణములలో నింతకంటెను విపులముగా వ్రాయఁబడి యున్నది. అవియు బ్రాహ్మణులపై రాజులం బురికొల్పుటకు బ్రాహ్మణేతరులు వ్రాసినవేనా?

(4) విదురునకు గొప్పతనము, బ్రాహ్మణ బీజముచే వచ్చినదనియు, బ్రాహ్మణులు కల్పించి వ్రాసిరనుటయు నసంగతము. పురాణాంతరములు విదురుఁడు వ్యాసబీజోత్పన్నుఁడే యని వ్రాసియున్నవి.

కాన కేతవరపు వేంకటశాస్త్రిగారి వాదము నిలువనేరదు. వారు చెప్పిన చొప్పున భారతములోఁ బ్రక్షిప్తము లనిన వానిని దీసివైచినచో నిప్పటి గ్రంథములలో నాలవవంతు నిలుచుటయు దుర్ఘటమగును.

ఇంకొకటి మాత్రము నిశ్చయము. వ్యాసుఁడు వ్రాసిన జయము రణరంగమునకు సైన్యము నడచువఱకు మాత్రమె విపులముగాఁ జెప్పఁబడి యుద్ధ వృత్తాంత మేసంజయునివలననో విని యావ్యాసుఁడు యుద్ధ వృత్తాంతమును ముక్తసరుగాఁ జెప్పియుండును. కాని వైశంపాయనుఁడు జనమేజయునకుఁ జెప్పుటలో నసత్యగాథలు పెక్కులందు కల్పింపఁబడి యుండును. ఆ యసత్యములు దుర్యోధనాదుల దుర్మార్గాతిశయ నిరూపకములును పాండవుల సత్యాతిశయకములునై యుండును. అయినను జయములోని గాథలు మాత్రము మాఱకుండఁగ నున్నవని సూక్ష్మదృష్టితో మహాభారతముఁ జదివినఁ దెలియనగును. వైశంపాయనుఁడటుల నసత్యకల్పనలఁ జేయుటకుఁ దగిన హేతు వున్నది. కారణ మేమనఁగా, జనమేజయుఁడు పాండవ ప్రపౌత్రుఁడు. అందుచేఁ బాండవుల యందు గౌరవాతిశయము గలవాఁడు. అతఁడు ప్రశ్నించునపుడే, "దుర్మార్గులగు దుర్యోధనాదులు మహాత్ములగు ధర్మరాజాదులను మహా పతివ్రతయగు ద్రౌపదిని గష్టపఱచిన వృత్తాంతమును సావకాశముగా వివరముగాఁ జెప్పుమా"

యనియే ప్రశ్నించుటచే[1] నా మహారాజున కిష్టమగునటులనే వైశంపాయనుఁడు పాండవపక్షముగాఁ జెప్పవలసి వచ్చుచుండెడిది. అందువలన నిజముగా దుర్యోధను పక్షమునఁ గొంత న్యాయ ముండినను అది వైశంపాయన భారతమున నణఁగిపోయినది. మఱియు నాంధ్రీకృత మహాభారతమున విశేషించి నన్నయ భారత భాగమున నింకను దుర్యోధనపక్షపు న్యాయము నామమాత్రావశిష్టమై పాండవుల న్యాయ మతిశయోక్తులతోను నుత్ప్రేక్షలతోను నింపఁబడినది. కారణ మేమనగా నన్నయభట్టును సంబోధించునపుడే రాజరాజనరేంద్రుఁ డేమనెనో చూడుఁడు :

చ. హిమకరుఁదొట్టి పూరు భర తేశ కురుప్రభుపాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁ గా మహినొప్పిన యస్మదీయ వం
శమునఁ బ్రసిద్ధులై విమల సద్గుణశోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సత తంబు వినంగ నభీష్ట మెంతయున్.''

మా వంశపు మూల పురుషులలోఁ బ్రసిద్ధినొంది సద్గుణ శోభితులగు పాండవోత్తముల చరిత్ర నాకు వినఁగోరిక యున్నదని ప్రభు వడుగుచుండఁగా నన్నయభట్టుఁడా పాండవుల చరిత్రము మిక్కిలి యోగ్యమైన దానినిగా రచింపఁడా? అట్లే రచించినాఁడు. ఒకటి రెండుదాహరణములఁ జూడుఁడు. అనుక్రమణికాధ్యాయములో మూల భారతమునఁ బాండవులను గుంతి వనము నుండి తీసికొని వచ్చినపుడు పౌరులలోఁ గొంద ఱనుమానించిరని యుండుటచే నా భాగమును దెనిగింపలేదు. లాక్షాగృహ దహనానంతరము పాండవులు భీతులై పలాయితులైరని సంస్కృత భారతమున నుండఁగా దాని నాంధ్రీకరణమున సూచింపనైలేదు. సుభద్రాపరిణయ గాథ సంస్కృతమునఁ గ్లుప్తముగా నుండగఁ దానిని విపులము చేసియున్నాఁడు.

తిక్కన సోమయాజి స్వతంత్రముగా భారతము నాంధ్రీకరించుటచే గాథలను యథా మాతృకగా నాంధ్రీకరించెననవచ్చును గాని నన్నయ పోయిన పోకడల నతిక్రమింప నిష్టము లేకయో లోక ప్రఖ్యాతి నొందిన గాథలను మార్ప నిష్టము లేకయొ సంస్కృతమున నుండిన దుర్యోధన పక్షము నంతఁగా నాంధ్రమున సూచింపలేదు ఆ వివరమిట వ్రాయ నావశ్యకము లేనందున విడిచితిని.

1. చూడుఁడు ఆదిపర్వము ౬౨ అధ్యాయము.

5357

# మహాభారత గాథావిశేషములు

## సాంఘిక విషయములు

శ్రీమద్రామాయణముఁ జదివినయెడల, నార్యజాతి, సింధు, గంగా యమునా నదులనంటిన ప్రదేశమునమాత్రమే యున్నదనియు, స్వల్పముగ భరతఖండ ప్రాగ్భాగమున గోదావరివఱకుఁ బ్రాకుచున్నదనియుఁ దోచును. మహాభారతముఁ జదివినచో నార్యజాతి భరత ఖండమున నించుమించు నంతయు వ్యాపించిన దనియు నార్యజాతిలేని ప్రదేశమునఁగూడ నార్యజాతి విజ్ఞానము వ్యాపించిన దనియు నాఁటి యార్య జాతిరాజ్యములు పశ్చిమమున "కాస్పియన్" సముద్రప్రాంతమువఱకు వ్యాపించె ననియుఁగూడఁ దెలియఁగలదు. ఆర్యు లార్యేతరులపై రాజ్యాధికారమును వహించినను వారి మతసాంఘికవ్యాపారము లలో జోక్యము పుచ్చుకొనుచుండుట లేదనికూడ తెలియవచ్చును.[1] భరతఖండము నందుండు నార్యేతర, యార్యానార్య మిశ్రజాతీయుల రాజ్యములలో, నార్య సాంఘిక మతాచారములు వ్యాపించుచున్న వనియు నార్య ద్రవిడజాతు లన్యోన్య సంబంధ బాంధవ్యములఁ జేసికొనుచుండిరనియుఁ గూడఁ దెలిసికొనఁగలుగు దుము.[2] రామాయణకాలమున నార్యజాతి నిష్కళంకమై యనార్యమిశ్రమమును సహింపనిదై యున్నది. తన భార్యపై నణుమాత్రాపవాదము మోపఁబడినంతనె రాముఁడు భార్యం ద్యజించె ననుటయే యిందులకు నిదర్శనము. మహాభారతకాల మున కీ భావమార్యజాతిలో నామమాత్రావశిష్టమై యున్నది. ఆర్యానార్య మిశ్ర జాతీయులు విశేషించి ఆర్యులు - మిశ్రమజాతీయులు - స్వజాత్యున్నతికై పెనఁగు లాడుటయే మహాభారత యుద్ధమునకుఁ గారణమై యున్న దని తలంపవలసి యున్నది. దానికి హేతువు లీక్రిందివై యున్నవి:

---

1. కర్ణపర్వము 45, 46 అధ్యాయములఁ జూడుఁడు.
2. నాగకన్యక యగు "నులూపిని" ద్రావిడకన్యక యగు చిత్రాంగదను నర్జునుఁ డుద్వాహ మగుటయు, ఉలూపియు, మలయధ్వజుఁ డను ద్రవిడరాజును, ఆర్యధర్మముల నవలంబించినవారుగా వర్ణింపఁబడు టయు గమనింపఁదగియున్నవి.

1ఆర్యజాతి స్వల్ప సంఖ్య కలదై యార్యేతర జాతి బహుళమై యుండుటచే నార్య్య లనార్యస్త్రీల నుద్వాహ మగుచుండిరి. అందువలన మిశ్రజాతి కలిగినది.

2ఆర్య్య లన్యోన్యము స్వాధికారాతిశయముకొఱకు పోరాడుకొనుటలోఁ బురుషజాతి క్షీణింపంగా "నియోగపద్ధతి" (సంతతిలేని వాని భార్య సంతానమునకై యన్యపురుషుఁగూడి సంతతి నొందుట) చే సంతతి నొందుచుండిరి.

3"అనులోమ" (ఉన్నతజాతి పురుషునికిఁ దక్కువజాతి స్త్రీ యందు సంతతి కలుగుట) "ప్రతిలోమ" (తక్కువజాతి పురుషున కున్నతజాతి స్త్రీయందు సంతతి కలుగుట) విధులచేఁ గలిగిన సంతతి నోర్పుమై సహించుటయే గాక వారిలోఁ గలిగిన యాధిక్యమునకుఁ గౌరవము నిచ్చుట.

4వ్యాసుడు, జాబాలి, కవషుడు మొదలగువారు వారితల్లు లేజాతివారైనను బీజప్రాధాన్య, తపోవిశేషములచే మహర్షులైరి. జారిణి వనితయగు సత్యవతికి ఋషియగు పరాశరుని వలన మునియగు వ్యాసుడు పుట్టె. క్షత్రియుఁడగు శంతనుని వలన, చిత్రాంగద విచిత్రవీర్యులను క్షత్రియులు పుట్టిరి. జన్మముచే (స్మృతుల ననుసరించి) నిషాదుఁడును, తపోమహిమ బీజప్రాధాన్యముల ననుసరించి బ్రహ్మర్షియు నగు వ్యాసునకు క్షత్రియాంగనలయందు రాజులగు ధృతరాష్ట్ర పాండురాజులును దాసియందు "క్షత్త" యను విదురుఁడు నుద్భవించిరి.

---

1. పరాశర, వృషతాదులు వ్యాస, ద్రుపదాదులఁ గనుట గమనింపఁదగినది.
2. ధృతరాష్ట్ర పాండురాజులు, పాండవులు నియోగ పద్ధతిచే జన్మించినవారే. ఆదిపర్వాంతర్గత చైత్రరథ పర్వము చేతను బ్రహ్మాండ పురాణములోని సగర చరిత్రము చేతను ''నియోగ పద్ధతి'' వృత్తాంతము స్పష్టము కాఁగలదు.
3. బ్రాహ్మణునికి శూద్ర స్త్రీయందుఁ బుట్టినవాఁడు నిషాదుఁడు. (వ్యాసుఁడట్టివాఁడు) శూద్రునకు క్షత్రియ స్త్రీయందు పుట్టినవాఁడు ''క్షత్త'' (విదురుఁడట్టివాఁడు. మహా భారతమున విదురునకు ''క్షత్త'' శబ్దమే వాడఁబడినది) క్షత్రియునకు బ్రాహ్మణ స్త్రీ యందుద్భవించినవాఁడు సూతుఁడు. (సంజయుఁడు, కర్ణునిఁ బెంచిన వాఁడును, వ్యాస శిష్యుఁడగు రోమహర్షణుఁడు నిట్టివారే.) చూడుఁడు, మనుస్మృతిలో ''ననులోమ, ప్రతిలోమ జాతి'' ప్రకరణము
4. అవకీర్ణి = బ్రహ్మచర్య వ్రతభ్రష్టుఁడు. (వ్యాసుని బ్రహ్మచర్య వ్రతభ్రష్టతఁ గూర్చి తంత్రవార్తికమునఁ జర్చింపఁబడె.)

(విదురుని క్షత్త యనుటలో వనితాసంపర్కముచేఁ దత్కాలమున "అవకీర్ణి" యగు వ్యాసుని శూద్రునిఁగాఁ దలఁచియుండుటయే కారణమై యుండును).

1"క్రీత స్వయందత్తా" దులను స్వసంఘమునఁ గలిపికొని గౌరవించుట.

2మూఢవిశ్వాసముచే దేవతామహిమల నొప్పుకొనుట.

పై కారణములచే నార్యజాతి సంకీర్ణ ధర్మముల నొంది రామునినాఁ డుండినంత పవిత్రతలో నుండక స్వనిర్మలత్వమును గోలుపోయినది. ఆర్యేతరార్యజాతి సంపర్కముచేఁ గలిగిన మిశ్రజాతి, యార్యజాతిపై దాడి వెడలినది. (ఆర్యజాతిపై దాడి వెడలుట యన సనాతనార్య ధర్మముల నణచుటగాఁ దలంపవలెను.) ఈ దాడి వెడలుటయే మహాభారత యుద్ధముగాఁ బరిణమించినది.

రామాయణమునం దార్యజాత్యులలో విరుద్ధోత్పత్తులు వర్ణింపఁబడలేదు. సీతాజనన వృత్తాంతము మాత్రమె స్వల్పసందిగ్ధావస్థ నొందినది. అనార్యజాతుల లోని వాలి, సుగ్రీవ, హనుమదాదులు విరుద్ధోత్పత్తులు కలవారగుటచే వారిజన్మములకు దేవతామహిమము లారోపింపఁబడినవి. మహాభారతము నాఁటికి దేశమునం దనేక యుద్ధములై పురుషసంతతి నశించుటచే స్త్రీలలో వ్యభిచార మెక్కువయై సంకర సంతాన మెక్కువయైనది. అందువలననే నాఁటి స్మృతికర్తలు ద్వాదశ విధ సంతానములను దమ గ్రంథముల నెక్కించిరి. మహాయుద్ధములచే ననేక రీతుల సంతతి కలిగినటు లాది పర్వమునందును శాంతిపర్వము నందును గాథలు కలవు. ఔర్వ, పరశురామ, సగరుల గాథలఁ బరిశీలించినచో నీ సంగతి తెలియ నగును. దేశమునం దెవ దేవర్ణపువాఁడో తెలిసికొనలేమని యీ క్రింది ధర్మజ నహుష సంవాదములోని శ్లోకార్థములు చెప్పుచున్నవి.

*ఓ మహాసర్పమా? ఈ మనుష్యజాతియం దిపుడు సర్వవర్ణములయొక్క సాంకర్యము వలన జాతిని బరీక్షింపలేమని నా యభిప్రాయము. అన్ని వర్ణములవారు నన్నిజాతి స్త్రీల యందును సంతానమును గనుచున్నారు.

---

1. కర్ణుఁడు, ధార్తరాష్ట్రులలోఁ బెక్కండ్రును, క్రీతలును, స్వయందత్తాదులును.
2. నదికి కలశకు, రెల్లుగడ్డికి యమ, వాయ్వింద్రాదులకుఁ బుట్టినటుల నమ్మఁబడు భీష్మ, ద్రోణ, కృప, పాండవుల జననములలో దేవతామహిమ లారోపింపఁబడినవి.

* జాతిరత్ర మహాసర్ప మనుష్యత్వే మహామతే
సంకరాత్సర్వవర్ణానాం దుష్పరీక్ష్యేతి మేమతిః
సర్వే సర్వాస్వపత్యాని జనయంతి సదా॥ నరాః॥ అరణ్యపర్వ॥ ౧౮౦ అ.

భగవద్గీతలలోని యీ క్రింది యర్జునవాక్యము కూడ నాఁటి జాతిభ్రంశ విధానమును సూచించుచున్నది:

[1]ఓ కృష్ణా! కులక్షయకృత మగు దోషమును బాగుగఁ జూచుచున్న మనచే నీపాపమునుండి నివర్తించుట యెటులో తెలిసికొన శక్యము కాకున్నది. కులక్షయ మగుటచే సనాతన కులధర్మములు నశించుచున్నవి. కులధర్మము నష్టమగుటచే నధర్మ మభివృద్ధి యగుచున్నది కదా? అధర్మవృద్ధివలనఁ గృష్ణా! కులస్త్రీలు దోషయుక్తురాం డ్రగు చున్నారు. స్త్రీలు దుష్టురాం డ్రగుటచేతను వర్ణసంకర మగుచున్నది. వర్ణసంకరము కులమునకుఁ గులఘ్నులకు నరకము కొఱకే యగుచున్నది వీరల పితృదేవతలు లుప్తపిండోదక క్రియలు కలవారై యథోగతు లగుచున్నారు. కులఘ్నుల వర్ణసంకరకారకములగు నీదోషములచే జాతిధర్మములును శాశ్వతములగు కులధర్మములును నశింపఁజేయబడుచున్నవి.

అర్జునుని విషాద హేతువుల కన్నిటికి శ్రీకృష్ణుఁడు సమాధానమిచ్చె ననియు వర్ణసంకర మగుచున్న దను నీయంశమునకు మాత్ర మాతఁడు సమాధాన మీయలే దనియు నందువలన వర్ణసంకరభీతి శ్రీకృష్ణునకును గల దనియుఁ గొందఱు చెప్పుచున్నారు. కాని, అది తప్పు. సందేహము లేకుండగ శ్రీకృష్ణుఁడు శాస్త్రయుక్తముగ సమాధానము నిచ్చి యున్నాడు. శ్రీకృష్ణ భగవానుఁడు చెప్పిన యీ క్రింది శ్లోకములోనె యర్జున వివాద హేతువులలో నొకటి యగు స్త్రీల ప్రవర్తనము గూర్చిన సందేహము నివర్తింపబడినది: అందువలననే యర్జునుఁడు తద్విషయకమగు ప్రశ్నమును వేయక భీష్మాదుల నెట్లు చంపుదును? అనియే ప్రశ్నించినాఁడు. శ్రీకృష్ణమూర్తి చెప్పిన సూత్ర ప్రాయ మగు వాక్యమిది:

---

1. కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుం
కులక్షయ కృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన
కులక్షయే ప్రణశ్యంతి కులధర్మా స్సనాతనా.
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోభిభవత్యుత
అధర్మాభి భవాత్కృష్ణ ప్రదుష్యంతికులస్త్రియః
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః
సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్యచ
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః
దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః॥ -భగవద్గీత.

శ్లో॥ కుత స్త్వాకశ్మల మిదమ్ విషమే సముపస్థితమ్
**అనార్యజుష్ట** మస్వర్గ్య **మకీర్తికర** మర్జున। -భగవద్గీత. 2-2

తా॥ అర్జునా! నీ కీవిషమసమయమున నెచటనుండి **యార్యులు పొంద రానట్టియు**, స్వర్గము నొందరానట్టియు, **అపకీర్తికర** మగు తెలివితక్కువ దాపరించినది?

ఆర్యజాతియందు "శ్వేతకేతు"వను ముని వివాహనిబంధనము చేయు వఱకు స్త్రీనియతి దృఢముగా లేదు. ఆతఁడించుమించు జనమేజయుని యంత్య దశలో నీ వివాహనిబంధనముఁ జేసియుండెను శ్వేతకేతుని చరిత్రమున నా యంశము విపులముగా వ్రాయబడును. అర్జునుని కాలమునకు సంతానమునకై యే స్త్రీనైన ఋతుకాలమున నేపురుషుఁడైనఁ గోరి పొందవచ్చును. ధౌమ్యుని శిష్యుఁడగు "ఉద్దాలకమహర్షి" చెప్పిన యంశమును (ఆదిపర్వ. 122 అధ్యా) చూడుఁడు. అప్పటి కుండిన యార్యధర్మమును దూషించుటచె శ్రీకృష్ణుఁడది "యనార్యజుష్టము" అని సమాధాన మిచ్చియున్నాఁడు. అట్లు స్త్రీల ప్రవర్తనము గూర్చి యుగ్గడించుట "అకీర్తికరము" అనికూడ చెప్పినాఁడు. కారణమేమనఁగా, అర్జునునితల్లి యగు కుంతి, నాయనమ్మయగు నంబాలిక, ప్రపితామహియగు సత్యవతి, భార్యయగు ద్రౌపది, వీరి వృత్తాంతములు దీనివలన నుద్ఘాటితములగు చున్నవి. అందువలననే యర్జునుఁ డావిషయమును గూర్చి తిరిగి ప్రశ్నింపనేలేదు.

**అస్వర్గ్యము** అనుసంశమునకై యుద్ధము చేయకుండుట కారణమై యున్నది. భీష్మాదుల నెట్లు చంపుదును? స్వర్గరాజ్యాధిపత్యము లభించినను వారిం జంపలేను. కార్పణ్యదోషోపహత స్వభావుడనై ధర్మసమ్మూఢ చేత స్కుఁడనై యుంటి నని యర్జునుఁడు తిరిగి యడుగుటలోనె, అనార్యజుష్ట, శబ్దమునకు క్షమాపణము చెప్పఁబడె. అస్వర్గ్యము విషయమై సందేహము నర్జునుఁడు పొందియున్నాఁడు. దానికే శ్రీకృష్ణుడు విపులముగా సమాధానము నీయవలసి వచ్చినది.

మఱియు నర్జునునకు వర్ణసంకరము యుద్ధముచే భవిష్యత్తునం దగునని కాక, నాఁటికే - అప్పడే - యగుచుండినట్లు పైశ్లోకములలోఁగల వర్తమానార్థక క్రియలచే దృఢపఱుపఁబడుచున్నది. ఈ వర్తమానార్థకక్రియ "ప్రతిపదోక్త" మగుటచే నాఁటికే వర్ణసంకరమై యున్నదను నర్థము బలవత్తరమై యున్నది.

పై వాక్యమువలన నాఁటి జాతియొక్క సంకీర్ణస్థితి వెల్లడి యగుచున్నది. అనాఁడు వితంతూద్వాహము తప్పుగా నెన్నఁబడలేదు. కన్యకలు పెండ్లికాక ముందే బిడ్డలను రహస్యముగాఁ గనుటకూడ తప్పుకాదు. ఆ సంగతు లీక్రింది భారతశ్లోకార్థములచేఁ దెలిసికొనఁగలుగుదుము.

[1]ఓ భీష్మా! రూపయౌవనసంపన్నలు సంతానముగోరు నీ సోదరుని భార్యలయందు సంతతిఁ గనుమా! నా యాజ్ఞాప్రకారము ధర్మమును చేయుమా! రాజ్యమునం దభిషిక్తుఁడవుకమ్ము. భరతవంశస్థుల నేలుము ఈ నీ సోదర భార్యలను నీ భార్యలుగాఁ జేసికొనుము నీ పితరుల నధోగతిపాలు చేయకుము. ఇట్లు సత్యవతిచేతను, స్నేహితులచేతను జెప్పఁబడి ధర్మాత్ముఁడగు భీష్ముఁడు ధర్మముగానే తల్లితో ననుచున్నాఁడు: ఓయమ్మా! నీవు చెప్పినది సంశయము లేకుండఁగ నుత్కృష్టమగు ధర్మమే. (అనఁగా సోదరునిభార్యయం దానాఁడు బిడ్డలఁ గనవచ్చునఁట!)

నాఁడు కన్యకలు బిడ్డఁలఁ గనుట దోషముకా దని యాశ్రమవాసపర్వము లోని కుంతీవ్యాసుల సంభాషణము చెప్పుచున్నది.

(వనాశ్రమ నివాసులగు ధృతరాష్ట్రాదులఁ జూడ వ్యాసాదులు వచ్చినపు డీసంభావణము జరిగినది.)

[2]నేనంతఃపురమునందు గర్భమును ధరించి కర్ణునిఁగని పితృ గౌరవమును రక్షించుదాననై గూఢోత్పన్నుఁడగు బాలుని నీటియందు వదలితిని.

---

1. శ్లో. ఇమే మహిష్యౌ భ్రాతుస్తే కాశిరాజసుతే శుభే
రూపయౌవన సంపన్నే పుత్రకామేచ భారత
తయోరుత్పాదయాపత్యం సంతానాయ కులస్యనః
మన్నియోగా న్మహాబాహో ధర్మంకర్తు మిహార్హసి
రాజ్యేచై వాభిషచ్యస్వ భారతాననుశాధిచ
దారాంశ్చ కురుధర్మేణ మానిమజ్జీః పితామహాన్
తథోచ్యమానో మాత్రాస సుహృద్భిశ్చ పరంతపః
ఇత్యువాచాథ ధర్మాత్మా ధర్మ్యమేవోత్తరంవచః
అసంశయం పరోధర్మ స్త్వయామాత రుదాహృతః
-ఆదిపర్వ ౧౦౩' అధ్యాయ.

2. శ్లో. తతోహమంతర్భవనే పితృవృత్తాంత రక్షిణీ
గూఢోత్పన్నం సుతం బాలం జలే కర్ణమవాసృజం
నూనం తస్యైవదేవస్య ప్రసాదాత్పున రేవతు
కన్యాహమభవం విప్ర యథాప్రాహ సమామృషిః
సమయా మూఢయా పుత్రో జ్ఞాయమానోప్యుపేక్షితః
తన్మాందహతి విప్రర్షే యథాసువిదితంతవ
యది పాపమపాపంవా తదేతద్వివృతం మయా
ఇత్యుక్తః ప్రత్యువాచేదం వ్యాసో వేదవిదాంవరః

నిశ్చయముగా నా సూర్యదేవుని మహిమచే దిరిగి కన్యకగానే యుంటిని. ఎట్లొ ఋషిపలికెనో యట్లుజరిగెను. మూఢురాలనగు నాచే బుత్రుఁడు తెలిసికొనఁ బడియు నుపేక్షింపఁబడెను. ఓ వ్యాసా! అదియే నన్నుఁజాల బాధించుచున్నది. (కుంతికి రహస్యముగా బిడ్డం గంటినను విచారము లేదు కాని ఆ బిడ్డను దెలిసియు నుపేక్షించితి ననునదియే విచారకారణము.) ఇది పాపమైనను బాపము కాకుండినను నీకు నిజముఁ జెప్పితిని అపుడు వ్యాసుఁడిట్లనెను: నీవు నాతోఁ జెప్పినమాటలు మంచివే, నీ వపరాధముఁ జేయలేదు (బిడ్డను గనినపిమ్మట) కన్యాభావము నొందితివి. దేవత లణిమాద్యైశ్వర్య" వంతులుగాన శరీరములఁ బ్రవేశింతురు......మనుష్య ధర్మమునం బ్రవర్తించు నీకుఁ దప్పుకాన్పింపదు. ఓ కుంతీ! నేను జెప్పునది బాగుగా గ్రహింపుము. నీకాచింత యుండఁగూడదు.

వ్యాసుని తల్లి యగు "సత్యవతి" కూడ కుంతివలె రహస్యముగా వ్యాసునిఁ గని కన్యాభావము నొందుట గమనింపఁదగిన విషయము.

మామయగు వ్యాసునితోఁ గుంతి తన చిన్నతనపుఁజేష్టను వెల్లడించి నటులు వ్యాసునితల్లి సత్యవతి సవతికొడుకగు భీష్మునికిఁ దన చిన్న తనపుఁ జేష్ట నిట్లు సంతోషపూర్వకముగానే చెప్పియున్నది.

* ధర్మయుక్తుఁడగు నా తండ్రికి ధర్మమునకై పడవ యొకటి యుండెను. నే నదట నొకప్పుడు ప్రథమయౌవ్వనము నొందితిని పిమ్మటఁ బరమర్షియగు పరాశరుఁడు యమునా నదినుండి నాచే దాఁటింపబడుచు నాదగ్గఱకు వచ్చి బ్రతి మాలుచుఁ గామార్తుఁడై మధుర వాక్యముఁ బలికెను. నేను అతనిశాపమునకుఁ దండ్రికి భీతినొంది సుఃభముగాను వరముల నొంది యాతనికిఁ బ్రతిచెప్పుట

సాధు సర్వమిదంభావ్య మేవమేతద్యథాద్ధమాం
అపరాధశ్చ తేనాస్తి కన్యాభావం గతాహ్యాసి
దేవాశ్చైశ్వర్యవంతోవై శరీరాణ్యావిశంతివై...
మనుష్యధర్మే వర్తంత్యా స్తవమోహో నవిద్యతే
ఇతికుంతి విజానీహి వ్యేతుతే మానసోజ్వరః

-ఆశ్రమవాసపర్వ ౩౦ అధ్యాయ

* శ్లో॥ ధర్మయుక్తస్య ధర్మార్థం పితురాసీత్తరీమము
సాకదాచి దహం తత్ర గతా ప్రథమయౌవనమ్
అథ ధర్మవిదాం శ్రేష్ఠః పరమర్షిః పరాశరః
ఆజగామ తరీం ధీమాంస్తరిష్య న్యమునానదీమ్
సతార్యమాణో యమునాం మా ముపేత్యాబ్రవీ త్తదా
సాంత్వపూర్వం మునిశ్రేష్ఠః కామర్తోమధురం వచః

కిష్టపడలేదు బా-నైన న న్నాముని పొంది తేజస్సుచేఁ బరవశం జేసెను...
నా కంతకుముందు అసహ్యాకరమగు చేఁపకం పుండెడిది. దానిఁ బోగొట్టి యాతఁడు నా కిమంచిపరిమళము నిచ్చెను. పిమ్మట నాకుఁ గర్భము కలుగఁగా నాతో నాతఁ డిట్లనెను: ఈ నదీద్వీపమున నీవు కన్యవుగానే యుందువనెను. నాకు జన్మించిన యాతఁడు మహాయోగియు మహర్షియు నగు పారాశర్యుఁడు అనఁ బడెను. నాకుఁ గన్యాపుత్రుఁడగు నాతఁడు ద్వైపాయనుఁ డనియు, వేదములను విభజించుటచే వ్యాసుఁ డనియు, నల్లనివాఁ డగుటచేఁ గృష్ణుఁ డనియుఁ బేరుల నొందెను.

వ్యాసభీష్మలవంటి మహానుభావులట్టి యధర్మమును ధర్మముగా నంగీకరించుట కానాఁటి దేశ, కాల పరిస్థితులే కారణమై యున్నవాః లేక వ్యాసభీష్మలు కూడ ధర్మవైరుద్ధ్యమున కిష్టపడియుండిరాః ఆలోచింప, నాఁటిపరిస్థితులే యట్టివి కావచ్చునని తోఁచెడి.

మహాభారతము రచింపఁబడిన చాలకాలమునకుఁగాని వ్యాసుడు దానిని ప్రకటింపలేదు. పిమ్మట వైశంపాయనాదులుకూడఁ గాథలను దేవతామహిమల జొప్పించి యిచ్చవచ్చినరీతిని బెంచిరి. అందువలన వ్యాసుని మూలగ్రంథము వలెనే గాథలయొక్క నిజవృత్తాంతము కూడ గ్రహింప శక్యముకాకున్నది. నేఁటి కాలమున నదులు, గాలి, యగ్నికుండములు బిడ్డలు గనిన వన నమ్మరు. వీని నానాఁటి సాంఘిక దోషములఁ గప్పిపుచ్చుట కీటివలివారు కల్పించిన దేవతా మహిమలుగాఁ దలపవలసియున్నది. మహాభారతములో వర్ణింపఁబడిన దేవతామహిమలఁ గొన్నిటి నిందు సూచించుచున్నాను అందు భారతగాథకుఁ

---

శ్లో. త మహం శాపభీతాచ పితుర్భీతాచ భారత
వరై వసులభై రుక్తా నప్రత్యాఖ్యాతు ముత్సహే
అభిభూయ సమాం బాలాం తేజసా వశమానయత్...
......మత్స్యగంధో మహా నాసీ త్పురా మమ జుగుప్సితః
తమపాస్యశుభం గంధం మిమం ప్రాదా త్సమే మునిః
తతో మా మాహ సముని ర్గర్భ ముత్సృజ్యమామకమ్
ద్వీపేస్యా ఏవసరితః కన్యైవ త్వం భవిష్యసి
పారాశర్యో మహాయోగీ సంబభూవ మహాన్నృషిః
కన్యాపుత్రో మమపురా ద్వైపాయన ఇతి శ్రుతః
యోవ్యస్య వేదాం శ్చతురః తపసా భగవా న్నృషిః
లోకే వ్యాసత్వ మాపేదే కార్ష్ణ్యా త్కృష్ణత్వ మేవచ.

—ఆదిపర్వ. 100 అధ్యా.

ప్రధాన పురుషుఁ డగు శ్రీకృష్ణునియం దారోపించిన దేవతామహిమల ముందుగఁ బేర్కొనెదను.

## శ్రీకృష్ణుఁడు

శ్రీకృష్ణ బలరాములు సాక్షాద్విష్ణువు యొక్క యవతారములని పెక్కు పురాణములలోఁ గలదు; కాని మహాభారతము యొక్క ఆదిపర్వములో నిట్లు వాకొనఁబడినది:

[1]విష్ణుమూర్తి తెల్లనిదియు నల్లనిదియు నగు రెండు వెంట్రుకలను పెఱికి యాదవకులము నందలి దేవకీ రోహిణు లందుఁ బ్రవేశపెట్టెను. ఆ రెండు వెంట్రుకలలోఁ దెల్లని వెంట్రుక బలరాముఁ డయ్యెను నల్లని వెంట్రుక శ్రీకృష్ణు డయ్యెను.

శ్రీకృష్ణుని "పూతన" యను రక్కసి వధింపరాగా దానినే శ్రీకృష్ణుఁడు వధించె ననియు, శకటాసురుని వధించె ననియు, ఉలూఖలమునకుఁ గట్టఁబడె ననియు, శంఖచూడుఁడను గుహ్యకుని, కేశియను రాక్షసుని వధించె ననియుఁ బురాణములలోఁ గలదు. కాని యవి పిల్లలకుఁ గలుగు పీడాభేదములే యని శుశ్రుత మను వైద్యగ్రంథముచేతను "జాతకర్మము"లోఁ జెప్పఁబడు మంత్రముల చేతను దెలియవచ్చుచున్నవి. వానిలోఁ గొన్నిటి నిటఁ బ్రాయుచున్నాఁడను:

## పూతనారోగము - నిదానము

[2]బాలుఁడు స్రస్తాంకుఁడై రేయుంబవలు నిద్రలేనివాఁడై కాకివాసన వేయుచుండిన పలుచని విరేచనమును విడుచుచుండును. వమనములు కల వాఁడై నిక్కపొడుచుకొన్న రోమములు కలవాఁడై దాహము కలవాఁడై యుండును. (రోగ నివారణోపాయమును గ్రంథ విస్తరభీతిచే వ్రాయలేదు.) ఇట్టిరోగమే శ్రీకృష్ణునకుఁ జిన్నతనమున సోఁకి యది నివృత్తియై యుండును.

---

1. శ్లో. సచాపికేశౌ హరిరుద్బబర్హ శుక్ల మేక మపరంచాపి కృష్ణం
తౌచాపికేశౌ నివిశేతాం యదూనాంకులే స్త్రియౌ దేవకీంరోహిణీంచ
తయోరేకో బలదేవో బభూవ యోసౌశ్వేత స్తస్యదేవస్య కేశః
కృష్ణోద్వితీయః కేశవసంబభూవ కేశోయోసౌ వర్ణతఃకృష్ణఉక్తః.
—ఆదిపర్వ 197 అధ్యా.

2 శ్లో॥ స్రస్తాంకః స్వపితి సుఖం దివా నరాత్రౌ
విడ్భిన్నం సృజతిచ కాకతుల్యగంధిః
చర్ద్యార్తో హృషితతనూరుహః కుమార
స్తృష్ణాలుర్భవతిచపూతనాగృహీతః॥శుశ్రుతసం॥ఉత్తరభాగ,27అధ్యా.

వానిని కాలాంతరమున రక్కసిగాను దానిని శ్రీకృష్ణుఁడు వధించినటులను గ్రంథకర్తలు తమ గ్రంథములలోని కెక్కించియుందురు. భాషాంతరీకరణము నందు దానికి వన్నెలు చిన్నెలు ప్రవేశించియున్నవి. శకటాసుర, ఉలూఖల బంధనాదుల గూర్చి "మంత్రప్రశ్నముల"లో నిటులఁగలదు:

[1]శండేరథుఁడు, శండికేరుఁడు, ఉలూఖలుఁడు, చ్యవనుఁడు నశించుఁగాక! అయశ్శండుఁడు, మర్కుఁడు, ఉపవీరుఁడు, ఉలూకలుఁడు, చ్యవనుఁడు నశించుఁగాక! కుక్కరోమములవంటి రోమములు గల కేశినీగ్రహము, ఖజాపగ్రహము, అజోపకాశినీగ్రహము నశించుఁగాక! మిశ్రవాసస్సులు గలిగి రక్షోరాజగు కుబేరునిచే నంపఁబడి భార్యలతోఁ గూడుకొని గ్రామములఁ గూర్చి తిరుగుచు ననుపనీతబాలుర నపేక్షించు గ్రహములు నశించుఁగాక! పై మంత్రముల నుచ్చరించుచు "మరుద్భ్యఇదం" అని తవుడుతో నావాలుగలిపి జాతకర్మములో హోమముఁజేతురు. ఇప్పటికిని బళ్లెలయందు పూర్వాచారము ననుసరించి పురిటిండ్లలో తవుడు, ఉముక అచటనచట ప్రోవిడి పొగ వేయుదురు. దానికి కాఁపు అని పేరు. ఈ విధి మంత్రాభావముగా బ్రాహ్మణులయిండ్లను బ్రాహ్మణేతరుల యిండ్లను జరుగుచున్నది. (ఈ హోమము శిశువులకుఁగలుగు సోఁకుడురోగములు పోవుటకయియున్నది.) పైమంత్రములోని "శండేరథుఁడు" శకటాసురుఁడుగాను, "ఉలూఖలుఁడు" ఉలూఖలబంధముగాను, "కేశిని" కేశిగాను, "కౌబేరకరక్షోగ్రహ" మేదియో "శంఖచూడుఁడను గుహ్యకుఁడు" గాను భాగవతాదులలో వర్ణింపఁబడిరి. పై సోఁకుడు గ్రహములను శ్రీకృష్ణుఁడే చంపియుండినచో నేఁడు ద్విజులు తమ యిండ్లలో జాతకర్మసమయమున పై హోమముఁ జేయ నవసరముండకపోవును. పై సోఁకుడురోగములు శ్రీకృష్ణునకుఁ గలుగఁగా నాతఁడా రోగముల నుండి విముక్తుఁడయ్యె ననియే మనము గ్రహింపవలసియున్నది.

---

1. మంత్ర. శండేరథ శ్శండికేర ఉలూఖలః । చ్యవనో నశ్యతాదితస్స్వాహా
అయశ్శండో మర్కఉపవీర ఉలూఖలః। చ్యవనో నశ్యతాదితస్స్వాహా
కేశినీ శ్వలోమినీః ఖజాపో జోపకాశినీః। అపేతనశ్యతాదితస్స్వాహా
మిశ్రవాసనః కౌబేరకా రక్షోరాజేనప్రేషితాః
గ్రామగ్ం సజానయో గచ్ఛంతీ చ్ఛంతో పరిరాకృతాన్స్వాహా.
—ఏకాగ్నికాండ 2—18.

# నాగులు - నాగలోకము

మహాభారతగాథలో నాగులప్రశంస పెక్కుచోటులఁ గలదు [1]భీముని దుర్యోధనుఁడు నీటఁ ద్రోయింప నాగులు రక్షించి యెనిమిది కలశములరసమును వాసుకియానతిఁ ద్రావించి మహాజవసత్వసంపన్నుఁ జేసి రని కలదు. [2]అర్జునుని "ఉలూపి" యను నాగకన్య మోహించి స్వభవనమునకు మాయచేఁ దీసికొని పోయి యాతనివలన "ఇలావంతుఁ"డను కుమారునిఁ గనెను. (ఉలూపి వితంతు వయ్యు నర్జునుని వరించియున్నది) [3]అర్జునుఁ డశ్వసేనుఁ డను నాగునితోఁ బోరెను. [4]పరీక్షితుని నాగరాజగు తక్షకుఁడు చంపెను. [5]జనమేజయుఁడు సర్ప యాగమునం దనేకనాగులఁ జంపెను. [6]శ్రీకృష్ణుఁడు కాళియుఁడను నాగరాజును జయించెను. ఉదంకోపాఖ్యాన సుపర్ణోపాఖ్యానాదులలో విశేషముగా నాగులగాథ లభిహితములై యున్నవి. ఈ నాగులు పాతాళలోకమునను౦డు దేవసంబంధు లనుగాఁ బౌరాణికులు నుడువుదురు. కాని నాగులు భరతఖండమునందుండు మిశ్ర జాతీయులనుగాఁ దలఁపవలసియున్నది. నేఁడును "నాగులను" వా "రుత్తరమధురా" ప్రాంతమునం దాటవికజాతివారుగానున్నారు. అసాందేశమున నాగపర్వతమను నొక పర్వతము కలదు. తత్ప్రాంతమున నాగు లనెడి యనాగరకజాతివా రున్నారు. ఇంత యేల? మన యాంధ్రదేశములో విశాఖ పట్టణపు జిల్లాలో నాగజాతి వేశ్యాస్త్రీ లున్నారు. నాగకన్యకలు సంగీత పాటకురాండ్రని పెక్కు గ్రంథములలోఁ గలదు ఆంధ్రదేశపు నాగ కన్యకలును సంగీతపాటకురాండ్రే. అర్జునుని వరించిన నాగకన్యకకు వైధవ్యదోషము లేనటుల[7] వేశ్యలలోని నాగకన్యకలకును వైధవ్యదోషము లేదట! భీముని నాగులు కఱచినటుల వర్ణింపఁబడియున్నది. "అసాము" లోని నాగులు మనుజమాంసభక్షణాది దోషయుక్తులని యానడుమ వార్తాపత్రికలవలనఁ

---

1 ఆదిపర్వ 128 అధ్యాయ 2 ఆదిపర్వ 214, భీష్మపర్వ 91 అధ్యాయము. 3. ఆదిపర్వ 227 అధ్యాయ 4 ఆదిపర్వ 43 అధ్యాయ. 5. ఆదిపర్వ 51-52 అధ్యాయము. 6 శ్రీమద్భాగవత దశమస్కంధ.

7. ఉలూపి యర్జునుని వరించుట "నియోగము" (సంతానము కొఱకు తాత్కాలికవరణము) కాని వివాహము కాదని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు భారత చరిత్ర నిరాకరణమున వ్రాసిరి. అది తప్పు. నియోగ మైనచో పుత్రోత్పత్తికిఁ బిమ్మట నాపురుషునిఁ దిరిగి కూడరాదు. ఉలూపి యట్లుకాక మహాయుద్ధానంతరము అర్జునాదులు మహాప్రస్థానికముఁ జేయువఱకు నర్జునునితోడనె (౩౬ సం॥రములు) కాఁపురము చేసినది. కాన ఉలూపీవరణము వివాహమె కాని నియోగము కాదు.

దెలిసికొనుచున్నాము. అమరావతి మొదలగు స్తూపములలో నాగుల ప్రతిమలు మనుష్యాకార సర్పములుగాఁ జిత్రింపఁబడియున్నవి. అమరుడు నామలింగాను శాసనము భోగి వర్గములో నాగులకు మనుష్యత్వము నిచ్చి వర్ణించుట గమనింపఁదగియున్నది. వీనికన్నిటికి నిట సమాధానమును వ్రాయు నావశ్యకము లేదు. కాని భీముని రక్షించునపుడు వాసుకి, 'ఆర్యకుఁ'డను నాగరాజునకు భీముడు దౌహిత్రదౌహిత్రుఁడని చెప్పుటచేతను, భారతవ్యాఖ్యాత కుంతిభోజుని ద్వారా యీసంబంధము కల్గియుండు ననుటచేఁ గుంతినిఁ బెంచిన కుంతిభోజుఁడు నాగుల దౌహిత్రుఁడని స్పష్టమగుచున్నది. పరీక్షిత్తుఁ జంపునపుడు పెక్కండ్రు నాగులు మాఱు వేషములతోఁ బరీక్షిద్భవనముఁ బ్రవేశించి విషఫలముల నాతని కిచ్చినటులును భవన మగ్ని దగ్ధమైనటులను వర్ణింపఁబడి యున్నది. తక్షకునిచేఁ గట్టఁబడినదియే "తక్షశిలానగర"మని పురాణములలోఁ గలదు. ఆదిపర్వము యొక్క మూడవ యధ్యాయమున జనమేజయుఁడు తక్షశిలా రాజ్యమును జయించినట్లు గలదు. స్వర్గారోహణ పర్వము యొక్క యైదవ యధ్యాయమున జనమేజయుఁ డీభారతపురాణమును "తక్షశిలానగరముననే" విని సర్పయాగసమాప్తి నచటనే చేసి హస్తినాపురికి వచ్చినటులఁ గలదు. తక్షశిలానగరమున సర్పయాగముఁ జేయుట యనఁగా నా పట్టణమునందలి నాగజాతిజులను తండ్రిం జంపిన జాతివా రని ప్రాంతపగచే జనమేజయుఁడు చాల బాధించియుండు ననియు, అస్తీకుని ప్రార్థనచే నాగుల బాధింపక వదలె ననియుఁ దోఁచుచున్నది ఈ యంశము పరిక్షిజ్జనమేజయుల గాథలలోఁ దెల్పఁబడును. ప్రాచీన నాగవిగ్రహముల శిరస్సులపై నున్న సర్పచిహ్నము లానాఁటివారు ధరించు శిరోవేష్టన రూపము లనియు అడుగున నుండిన సర్పచిహ్నములు పాశ్చాత్య జాతిస్త్రీల లంగీలవంటి వనియు కొందఱు తలఁచుచున్నారు.

## శ్రీకృష్ణుఁడు - ద్రౌపదీమానరక్షకుఁడు

ద్రౌపదిని దుశ్శాసనుఁడు కట్టినబట్టల నొలిచి మానభంగము గావింప నామె శ్రీకృష్ణుని స్మరించె ననియు, నామె వస్త్రము "అక్షయమైన" వనియు, నొలిచినవస్త్రములు రాశిగా సభలోనుండిన వనియు సభాపర్వముయొక్క యఱువది యేడవయధ్యాయమున వర్ణింపబడియున్నది. గ్రంథవిస్తరభీతిచే మూలము నుదాహరింపలేదు. మఱియొకటి ద్రౌపదిని గీచకుఁడు పరాభవించునపు డామె సూర్యునిఁ బ్రార్థింపఁగా సూర్యునిచేఁ బంపఁబడిన రాక్షసుఁడు కీచకుని బోరగిలఁ ద్రోసె నని విరాటపర్వముయొక్క 15, 16 అధ్యాయములలోఁ గలదు.

[1]ఇంకొకటి దుర్వాసుఁడు దుర్యోధనప్రేరితుఁడై వనమున నుండిన పాండవులఁ బరాభవింప ననేకశత శిష్యులతో నకాలమున వచ్చి ధర్మజు నన్నము

1. అరణ్యపర్వ - 261, 262 అధ్యాయ.

నడిగెను. అతఁడు స్నానముఁ జేసి రండని దుర్వాసునితోఁ జెప్పి వీరిఁ దృప్తి నొందింపు మని ద్రౌపది కాఙ్క్ష నొసఁగెను. సూర్యవరప్రాప్త మగు తామ్రపాత్రములోని భోజ్యపదార్థములు ద్రౌపదీ భోజనానంతరము వఱకే యక్షయమగును గాని యామె భుజించినతరువాత నందేవస్తువు మఱునాఁటి వఱకు నుద్భవింపదు. నాఁడు ద్రౌపది దుర్వాసుఁడు వచ్చునప్పటికి భుజించుటచే వంటయింటిలో ద్రౌపది చింతామనిగ్నురాలై, హా కృష్ణా! ఈ యాపదనుండి నన్నెట్లు రక్షింతువని వేఁడఁగా ద్వారకలో శయ్యాగతుఁడగు శ్రీకృష్ణుఁ డీమె మొఱను విని తటాలునఁ బర్ణశాలలోని ద్రౌపదియెదుటఁ బ్రత్యక్షమయి, నా కాఁకలి యగుచున్నది నా కేదేని పెట్టుమని కోరఁగ ద్రౌపది యేమియు లేక పోవుటచే నంటతప్పేలలోని కూరాకును గృష్ణునకిడెనఁట! అంత మాత్రముననే శ్రీకృష్ణుఁడు తృప్తినొంది త్రేన్పగా నదిలో స్నానములఁజేయు శిష్యులకును దుర్వాసునకుఁగూడ విశేషాజీర్తి చిహ్నములు కలుగఁగా శ్రీకృష్ణ పాలితులగు పాండవులఁ బరిభవింపఁ గడఁగినచో "నంబరీషుని" బరిభవించినపుడు తనకుఁ గలిగిన పరాభవమువంటిది కలుగునేమో యని భయపడి సశిష్యుఁడగు దుర్వాసుఁడు పలాయితుఁ డయ్యెనఁట!

ఈ గాథ యసందర్భముగా నుండుటచేతను గాఁబోలు నెఱ్ఱాప్రగ్గడ యాంధ్రీకరింపలేదు. రెండు, మూఁడు గాథలకంటె ద్రౌపదీ వస్త్రాపహరణ కాల మున శ్రీకృష్ణుఁడు వస్త్రము లక్షయ మగునటులఁ జేసె ననునది లోకమునం దతిప్రసిద్ధముగానున్నది అందువలన ద్రౌపదీమానరక్షకుఁడను నపూర్వ బిరుదము శ్రీకృష్ణునకుఁ గలిగినది. దాని ననుసరించి కథలలోఁ బిలువలు పలువలు కలిగినవి.

ఈ క్రింది కారణములచే ద్రౌపదీ వస్త్రాపహరణమే జరుగలేదని తలంప వలసి యున్నది. మహాభారతమునందు నాకుఁ దెలిసినంతలో ద్రౌపదీపరిభవ ప్రశంస పదుమూఁడు స్థలములలోఁ జెప్పఁబడినది.

1) దుశ్శాసనుఁడు ద్యూతకాలమున ద్రౌపది జుట్టుపట్టుకొనిలాగి వస్త్రము లొలుచునపుడు—

2) ప్రథమ ద్యూతానంతరము ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరము లిచ్చు నపుడు—

3) అరణ్యమునందుండు పాండవులను శ్రీకృష్ణాదులు పరామర్శింప రాఁగా ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దనపరాభవముఁ జెప్పునపుడు —

4) కీచకవధముకై ద్రౌపదీభీములు రహస్యముగ నాలోచించు సమయ మున ద్రౌపది తనపడిన పాటులఁ జెప్పునపుడు—

5) పాండవులు ద్రుపద పురోహితుని రాయబారిగా నంప నాతఁడు కౌరవ సభలో మాటలాడునపుడు—

6) సంజయ రాయబార సమయమున పాండవులు దెప్పిపొడిచినపుడు—

7) సంధికేఁగు శ్రీకృష్ణునితో ద్రౌపది తానుపడిన కష్టములఁ జెప్పునపుడు—

8) శ్రీకృష్ణుడు కౌరవసభలోఁ గౌరవుల దుష్టకార్యములఁ జెప్పునపుడు—

9) దుర్యోధనుఁడు పాండవులను నిందించుచు నులూకుని దూతగా పంపినపుడు—

10) దుశ్శాసనవధ సమయమున—

11) దుర్యోధనవధ సమయమున—

12) అనుపభీముని ధృతరాష్ట్రుఁడు చూర్ణముఁ జేయునపుడు శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని నిందించువేళ—

13) భీముఁడు గాంధారికడఁ దాఁ జేసిన క్రూరకర్మముల నొప్పుకొను నపుడు—

పై పదుమూఁడు సమయములలోను 1, 10, 11 సమయములలోను మాత్రమే ద్రౌపదీ వస్త్రాపహరణ ప్రశంస కలదుగాని తక్కిన పది స్థలము లందును కచగ్రహణము, సభాప్రవేశము, దుర్యోధన దుశ్శాసనులు పరుషవాక్య ములతో ద్రౌపదిని నిందించుట యను తప్పులే కౌరవులపై మోపఁబడినవి. ద్రౌపది తన పరాభవమును శ్రీకృష్ణ ధృష్టద్యుమ్నాదు లోదార్చుటకు వనమునకు వచ్చినపు డందఱియెదుటను కృష్ణుఁడు సంధి కేఁగునపుడు పాండవులయెదుటను శ్రీకృష్ణునితోఁ జెప్పినది.

ఆ రెండుసమయములందును తనకు వస్త్రాపహరణమైన దని కాని "శ్రీకృష్ణా! నా వస్త్రాపహరణ సమయమున నిన్నుఁ దలఁపఁగా నక్షయవస్త్రముల నిచ్చి నన్ను రక్షించితి" వనికాని చెప్పలేదు. సూచింపనైన సూచింపలేదు. నాలుగు కారణములచే శ్రీకృష్ణా! నీవు నన్ను రక్షింపవలసియున్నదని మాత్రమిట్లు చెప్పుచున్నది.

[1]సంబంధమువలన గౌరవమువలన స్నేహమువలన ప్రభుత్వమువలనను నాలుగు కారణములవలన నిత్యము నీచే రక్షింపఁదగినదాననైయున్నాను.

---

1. శ్లో చతుర్భిః కారణైః కృష్ణ త్వయా రక్షాస్మి నిత్యశః।
సంబంధా ద్గౌరవా త్సఖ్యా త్ప్రభుత్వే నైవ కేశవ॥
—అరణ్యపర్వ॥ 12 అధ్యాయ॥

వస్త్రాపహరణ వృత్తాంతమును, కీచకవధముకై రహస్యముగ భీమునితో నాలోచించునపుడు తా నదివఱకుఁ బడినపాటులు నేడ్చుచు ద్రౌపది వెళ్ళఁబోసికొనినది. ఆ రహస్యసంభాషణములోఁగూడ చెప్పలేదు సూచింపలేదు. ద్రౌపది మాత్రమే కాదు, పాండవు లెవ్వరు నేసమయమునను ద్రౌపదీపరిభవములఁ జెప్పునపుడు వస్త్రాపహరణవృత్తాంతము నెత్తుకొనలేదు దుర్యోధనుఁ డూరువుపైఁ గూర్చుండు మనిఁ సంజ్ఞఁజేయుట, దుశ్శాసనుఁడు పాండవులు గొడ్డువోయి రని నిందించుట, కర్ణుఁడు నీవు దాసివిగాన యన్యునివరింపు మని పరిహసించుట, దుశ్శాసనుఁడు జుట్టుపట్టుకొని సభలోని కీడ్చి తెచ్చుటయే పెక్కుచోటులఁ జెప్పఁబడినవి. దుశ్శాసనుని భీముఁడు చంప నుద్యుక్తుఁడైనపుడు ద్రౌపదీ వస్త్రాపహరణముఁ దలఁచికొనె ననియు [1]దుర్యోధనునితలఁ దన్నినపు డందఱితో ద్రౌపదీవస్త్రాపహరణముఁ జెప్పె ననిమాత్రమే కలదు. [2]తక్కిన ప్రదేశములలో నెచ్చటను వస్త్రాపహరణవృత్తాంతమే లేదు. పౌలికలనిలో గాంధారి చచ్చినవారిఁ జూచుటకు వచ్చి పాండవులఁ గలిసికొనినపుడు భీమునిపైఁ గోపమూని కొన్ని ప్రశ్నముల నడిగినది. తన్ను శాపదగ్ధుం జేయు నని భీముఁడు భయపడుచు గాంధారికి సమాధానములఁ జెప్పునపుడును ద్రౌపదియొక్క కేశగ్రహణాదికమునే చెప్పియున్నాఁడు గాని వస్త్రాపహరణ వృత్తాంతమును సూచింపనైన సూచింపలేదు. అన్నియపరాధములలో వస్త్రాపహరణాపరాధము హెచ్చైనది. దాని నంతగ నెత్తికొనకపోవుటచేతను, అనుక్రమణికలోఁ జెప్పకపోవుటచేతను ద్రౌపదీవస్త్రాపహరణము జరగలే దనియు శ్రీకృష్ణునకు ద్రౌపదీమానరక్షకుఁడను బిరు దామెకు వస్త్రముల నిచ్చుటచే రాలేదనియు వ్రాయ సాహసించుచున్నాఁడను. ప్రాచీన మహాకవులగు "వభాస, భారవి, క్షేమేంద్ర'' కవులు కూడ భారతగాథా ప్రతిపాదకములగు తమ గ్రంథములలో సభాప్రవేశ కచగ్రహణములను మాత్రమే చెప్పిరి కాని వస్త్రాపహరణ వృత్తాంతమును సూచింపలేదు. ఆమె యేకవస్త్రయై రజస్వలగా నుండుట కూడ సత్యము కాదనియు ధార్తరాష్ట్రుల ''కపటద్యూతి'' దెచ్చుట కట్లు ధర్మజు నుపదేశముచే ద్యూతకాలమునఁ జేసినదనియు నీ క్రింది శ్లోకార్థములు స్పష్టపఱుచుచున్నవి.

---

1. శ్లో. స్మృత్వాథ కేశగ్రహణంచ దేవ్యా వస్త్రాపహారంచ రజస్వలాయాః॥
—కర్ణపర్వ॥ 84 అధ్యాయ॥

2. శ్లో. రజస్వలాం ద్రౌపదీ మానయన్ యే యేచాప్యకుర్వంత సదస్యవస్త్రాం।
తాన్ పశ్యధ్వం పాండవైర్ధార్తరాష్ట్రాన్ రణేహతాం స్తపసా యాజ్ఞసేన్యాః।
-శల్యపర్వ॥ 61 అధ్యాయ॥

[1]ఓ జనమేజయా! (వైశంపాయన వాక్యము) ధర్మరాజు ప్రాతిగామితో దుర్యోధనుఁడు చెప్పునంశమును (ద్రోపదిని సభకుఁ దోడ్తెమ్మనుట) విని ద్రోపదికి నమ్మకము కలిగిన దూతచే నామె కీవార్త నంపెను: "ఓ పాంచాలీ! నీవు ఏక వస్త్రమునే ధరించిన దానవై కట్టుబట్ట ముడిజాఱునట్లు చేసినదానవై ఏడ్చుచున్నదానవై రజస్వలవై సభకు వచ్చి ధృతరాష్ట్రుని యెదుట నుండుము.

పిమ్మట నట్లు సభను గూర్చి వచ్చిన రాజపుత్రివైన నిన్నుఁ జూచి ద్యూత సభయందున్న వారంఱును మనస్సులచే దుర్యోధనుని నిందింతురు" (ఇట్లు ధర్మజుఁడు చెప్పఁగా) ఆ దూత త్వరితముగా ద్రోవది గృహమున కేఁగి ధర్మరాజుయొక్క యేర్పాటు నామెకుఁ జెప్పెను.

(పై శ్లోకములకుఁ తేవప్పెరుమాళ్ళయ్యగారు తమయాంధ్రీకృత వచన భారతమునను, ప్రతాపచంద్రరాయిగారు తమయాంగ్లీకృత భారతమునను పైవిధముననే యర్థముఁ జేసియున్నారు. కుమారస్వామియొక్క యవతార మని 'శంకర విజయా'దులలోఁ బొగడఁబడిన "కుమారిలభట్ట పాదుఁడు"ను ఆ యర్థమునే పైశ్లోకములకుఁ జేసినట్లు క్రిందివ్రాయఁబోవు తంత్రవార్తికభాష్యవాక్యము స్పష్టపఱచుచున్నది. కాని కృష్ణ భారత గ్రంథకర్తలగు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు భారతచరిత్ర నిరాకరణము (87 పుట)లో ముందు వెనుకలగు శ్లోకములను వదలి "ఏక వస్త్రా" అను శ్లోకమున కిట్లర్థము వ్రాసియున్నారు; చూడుఁడు:

"ఏకవస్త్ర యైనను, అధోనివి యైనను, రజస్వల యైనను, దుఃఖించునది యైనను, పాంచాలి సభకు రావలయు" నని ధర్మరాజు వార్తనంపినాఁడు.

(పై పండితులు అందును కుమారిల భట్టాచార్యుఁడు చేసిన యర్థము గ్రాహ్యమో, కృష్ణమూర్తి శాస్త్రిగారియర్థము గ్రాహ్యమో చదువరులే యోచించుకొందురుగాక!)

---

1. శ్లో॥ యుధిష్ఠిరస్తు తచ్ఛ్రుత్వా దుర్యోధన చికీర్షితమ్
ద్రౌపద్యాః సమ్మతం దూతమ్ ప్రాహిణోద్భరతర్షభ
ఏకవస్త్రాత్వధోనీవీ రోదమానా రజస్వలా
సభా మాగమ్య పాంచాలి శ్వశురస్యాగ్రతో భవ
అథ త్వామాగతాం దృష్ట్వా రాజపుత్రీం సభాం తదా
సభ్యా స్సర్వే వినిందేరన్ మనోభిర్ధృతరాష్ట్రజమ్
స గత్వా త్వరితం దూతః కృష్ణాయా భవనం నృప
న్యవేదయ న్మతంధీమాన్ ధర్మరాజస్య నిశ్చితం
-సభాపర్వ ॥అధ్యా॥ 67.

''కుమారిలభట్టు'' తన ''తంత్రవార్తికము'' నందు ''ద్రౌపదీ పంచ పతిత్వ'' ప్రకరణమునం దీయంశమునే చెప్పియున్నాఁడు. ఆ వాక్యార్థము నిట సూచించుచున్నాఁడను:

[1]ధర్మజు నుపదేశముచే సభామధ్యమునకుఁ దీసికొనితేఁబడిన ద్రోవది పుత్రులతోఁ గూడిన ధృరాష్ట్రిన కపకీర్తిఁ దెచ్చుటకును తన కన్యాయముఁ జేసిరని లోకమునకు వెల్లడిచేయుటకును తత్క్షణము రజస్వలావేషమును ధరించినది.

ద్రోవది తాను పడిన కష్టములను శ్రీకృష్ణునితో నెటులఁ జెప్పినదో చూడుఁడు:

[2]ఓ కృష్ణా! నీకు చెలికత్తెను, ధృష్టద్యుమ్నుని చెలియలనగు నావంటిదే సభలోనికిఁ దేఁబడినది. ఇట్టి నేను పాండవులకెట్లు భార్య నగుదును?

* సభయందు రాజులనడుమను బహిష్ఠనగు ననుఁజూచి పాపాత్ములగు ధృతరాష్ట్రపుత్రులు నవ్విరి. పాండవులు పాంచాలురు వృష్ణివీరులు జీవించి యుండఁగా కృష్ణా! ఆ ధార్తరాష్ట్రులు దాసినిగా నన్ను ననుభవింపుట కిచ్ఛగించిరి.

* "ఓకృష్ణా! పాండవులైదుగురు చూచుచుండఁగా జుట్టుపట్టుకొనఁబడితిని. నేను మంచియాడుదానను కాను. అపుడు కర్ణుఁడు ననుఁజూచి నవ్వియున్నాఁడు. ఆ దుఃఖము నాకు శాంతింపదు." ఇట్లని ద్రోవదిచెప్పి చేతితో ముఖమును గప్పికొని పెద్దయేడ్పు నేడ్చెను.

---

1. యుధిష్ఠిరోపదేశాత్సభామధ్య మానీయమానా సహసైవ రజస్వలా వేషాస పుత్రస్య ధృతరాష్ట్రస్యాఽ ''ఆయశ'' ఉత్పాదయితుం ఆత్మానంచాన్యాయ్యమానం ప్రఖ్యాపయితుం ద్రౌపదీకృతవతీ॥ (తంత్రవార్తిక.)

2. శ్లో॥ కథంను భార్యా పార్థానాం తవ కృష్ణ సఖీ విభో
ధృష్టద్యుమ్నస్య భగినీ సభాం కృష్యేత మాదృశీ।

* రాజ్ఞాం మధ్యే సభాయాంతు రజసాభిపరిప్లుతాం
దృష్ట్వాచ మాం ధార్తరాష్ట్రాః ప్రహసన్ పాపచేతసః॥
దాసీభావేన మాం భోక్తు మీషస్తే మధుసూదన
జీవత్సు పాండుపుత్రేషు పాంచాలేషుచ వృష్ణిషు॥
కచగ్రహ మనుప్రాప్తా నాస్మికృష్ణ వరాసతీ
పంచానాం పాండుపుత్రాణాం ప్రేక్షతాం మధుసూదన
ఇత్యుక్త్వా ప్రారుదత్కృష్ణా ముఖంప్రచ్ఛాద్య పాణినా
వచమే శామ్యతే దుఃఖం కర్ణో యత్ప్రహసత్తదా।

-అరణ్యపర్వ 12 అధ్యాయ.

ద్రోవది వస్త్రాపహరణ సమయమునఁ గృష్ణుని దలఁచుకొనినటులఁ జెప్పలేదు కాని నన్ను జుట్టుపట్టుకొని సభలోని కీడ్చినపుడు పాండవులు నిశ్చేష్టితులైనపుడు మాత్రము నిన్ను స్మరించితినని సంధి కేఁగు శ్రీకృష్ణునితో నొక్కసారి చెప్పియున్నది.

[1]పాండవులు నిరహంకారులై చేష్టలుదక్కి చూచుచుండఁగా పాపాత్ముల సభామధ్యమున దాసిగాఁ జేయఁబడితిని. అపుడు కృష్ణా! నాయొక్క మనస్సునందు స్మరింపఁబడితివి..

శ్రీకృష్ణుని ద్రోవది యొకవేళ స్మరించిన స్మరించియుండును గాని కృష్ణుడు పాంచాలి కాయాపదలోఁ దోడ్పడుట మాత్రము కల్ల. కృష్ణుడపుడు ద్వారకలోనే లేఁడు. సాల్వునితో సముద్రతీరమున మహాయుద్ధముఁ జేయుచున్నాఁడు. యుద్ధానంతరము ద్వారకకు రాఁగా సాత్యకి కృష్ణునితోఁ బాండవులు ద్యూతజితులై వనమున కేఁగిరని చెప్పెనఁట.

[2]ఇటీవలి గ్రంథకర్తలు ద్రౌపదీమానరక్షకుఁడను బిరుదును శ్రీకృష్ణున కిచ్చి గోరంతలు కొండంతలుగా వర్ణించిరి. ఇట్టి దేవమహిమలు పెక్కు భారత గాథ ననుసరించి యల్లఁబడుచున్నవి. మహాభారతమునను గొన్ని దేవమహిమ లారోపింపఁబడియున్నవి. కాని, యవి "సౌతి" కాలమునకు లోకమునఁ జెప్పుకొనువానిని సౌతి పెక్కు తన గ్రంథమునఁ జెప్పియుండెనని తలఁపవలసియున్నది. వాని నన్నిటిని జర్చించిన విశేషముగ గ్రంథము పెరుగఁగల దని విడిచితిని. కీచకుని బోరగిలఁద్రోయుగాథ పిమ్మట వ్రాయఁగలను. దుర్వాసు గాథ మృషయని యెఱ్ఱాప్రగ్గడ భాషాంతరీకరణము చేయకపోవుటచేతనే స్పష్టమైనది.

## సాంఘిక దురాచారములు

మహాభారతకాలమున సంఘస్థితి యల్లకల్లోలముగా నున్నది. కురు, పాండవ, యుద్ధానంతరము జనమేజయుని కాలములో సాంఘిక ధర్మములు కొన్ని చక్కఁబడినవి. పాండవులనాఁడే వ్యాసుడు సంకరసంతాన రాహిత్యము కొఱకు వితంతువులఁ బెక్కండ్రం గంగలోఁ ద్రోసియున్నాఁడు. నాఁటి వ్యభిచారదోషముచే సంకరసంతానము కలిగి జాతివైషమ్యములు కలుగుటయే కాక,

1. శ్లో. దాసీభూతాస్మి పాపానాం సభామధ్యే వ్యవస్థితా
నిరమర్షేష్వచేష్టేషు ప్రేక్షమాణేషు పాండుషు
పాహి మామితి గోవింద మనసా చింతితోసి మే॥
-ఉద్యోగపర్వ 81 వ అధ్యాయ.

2. అరణ్యపర్వ 18 అధ్యాయ.

నాఁటి ద్యూతదోషముచే కురుపాండవ మహాయుద్ధమును, మద్యపాన దోషముచే యాదవకులనాశము నను మహోపద్రవములు సంభవించెను అందుచే భరత ఖండము నిస్సారమైనది. వ్యభిచారము, ద్యూతము, మద్యపానము, మహాభారత కాలమున దోషములు కావు. పాండురాజు కుంతికిఁ జెప్పిన శ్వేతకేతు గాథలో సంతతిఁగనుట కేస్త్రీనైనను ఋతుకాలమునఁ గవయుట దోషముకా దని కలదు. ధర్మజుఁడు రాజసూయ యాగకాలమున నొక్కొక "స్నాతకునికి" (వేద వేదాంగములఁ జదివినవానికి) ముప్పదిమంది దాసీల చొప్పున నెనుబదివేల మందికి దానమిచ్చియున్నాఁడు సంకర సంతానోత్పత్తి హేతువుల నిదివఱకె చెప్పియున్నాను గాన "వనితా" విషయమున నాఁడెట్టి దుర్నీతి కలిగియున్న దియు వేఱుగ వ్రాయనవసరము లేదు.

**ద్యూతము** - ద్యూతము రాజులకు నాఁడు విహితకర్మముగా నుండున టులఁ దోచును. రణమున కాహూతుఁడై యుద్ధమున కేఁగక పోవుటయు, ద్యూత మున కాహూతుఁడై జూదమాడక పోవుటయు రాజ ధర్మమునకు లోపమని ధర్మ రాజువంటి ధర్మాత్ముఁడే చెప్పి యున్నాఁడు అందువలననే ప్రథమ ద్యూత మున నానావమానముల నొందియు ద్రౌపది ధృతరాష్ట్రునిచేఁ బొందిన వరములచే నింద్రప్రస్థ రాజ్యమును దిరిగి పొందిన ధర్మరాజు రెండవసారి ద్యూతమున కాహూతుఁడై తిరిగి జూదమాడవలసి వచ్చినది. ఒక్క రాజుమాత్రమె కాదు, [1]సన్న్యాసులు కూడ జూదమడుచుండిరి ధర్మజుఁడు సన్న్యాసి వేషమున విరటుంగొల్వనేఁగినపుడు తళతళ మెఱయు పాచికలకట్టను చంకందగిలించు

1. "ధర్మజుఁడు సన్యాసి వేషమున విరటుంగొల్వ వచ్చె" నను నంశముఁ బురస్కరించుకొని నేను సన్న్యాసులు కూడ నాఁడు ద్యూతమాడుచుండి రని వ్రాయఁగా శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, ''భారత చరిత్ర నిరా కరణములో (89 పేజీ) తెనుఁగు భారతమున ధర్మజుఁడు సన్న్యాసి రూపము నొందినట్లున్నది గాని సంస్కృతమున నట్లు లేదు, ద్విజుఁడని మాత్రమె కలదు తిక్కన ప్రమాదమునఁ బట్టి యట్లు వాసిరి'' అనిరి. తిక్కన తెలివి తక్కువవాఁడా? కవి బ్రహ్మయే! అయినను సంస్కృత మున నెట్లున్నదో చూడుఁడు:

శ్లో. సవైద్విజాతి స్తరుణ స్త్రిదండభృత్
కమండలూష్ణీషకరో వ్యజాయత
సురక్త మాంజిష్ఠవరాంబర శ్శిఖీ
పవిత్రపాణి ర్దదృశే రదాద్భుకమ్.

తా॥ (ధర్మజుఁడు విరటుకడ కేఁగునప్పటి స్వరూపవర్ణము.)

కొనియె యేఁగినాడు తనకుఁ దెలిసిన మహావిద్యలలో జూదమాడువిద్య యొకటి యని విరటునకుఁ జెప్పియున్నాఁడు. రాజ్యభ్రష్టత్వమునకుఁ బెక్కు కష్టములకుఁ గారణమైన ద్యూతప్రియత్వము ధర్మజు నెడఁబాయలేదు. అరణ్యమున కేఁగునపుడును "నానావిధాక్షములఁ" గూడఁ దీసికొనిపోయి యున్నాఁడు. వానినె విరాటునకుఁజూపియున్నాఁడు కౌరవులలో వివింశతి,చిత్రసేనుఁడు పురుమిత్రుడు, జయుఁడు మొదలగు వారు ద్యూతవిద్యలోఁ బ్రసిద్ధులట. శకుని యందఱకంటె మిన్న.నాఁటివారిలో బలరాముఁడుకూడ గొప్పజూదగాడు. ధర్మజునియందు బలరామునకుఁ బ్రేమాతిశయము కలిగియున్నది కాని శకుని యధర్మముగా జూదమాడెననిమాత్ర మాటఁదొప్పుకొనడు. ధర్మజునకు జూదమాడు తెలివితేటలు లేకపోవుటచేతనే యోడిపోయి యున్నాఁడనినాడు [1]బలరాముడు త్రాగుడులోనేకాక జూదములోఁగూడ నిపుణుఁడని శ్రీమద్భాగవతాంతర్గత దశమస్కంధములోని

ఆ ధర్మరాజు పడుచువాఁడును ద్విజాతిజుఁడు నగు సన్న్యాసియై కమండలువు నష్టివము ధరించినవాఁడై మాంజిష్ఠపురంగుచే నెట్టఁగు వస్త్రమును ధరించి శిఖాధారియు పవిత్రపాణియునై యప్పు దద్భుతముగా గాన్పించెను.

—విరాటపర్వ ॥7 అధ్యా॥

మఱియొక స్థలమున ''త్రిదండకుండాంకుశ శిక్యపాణి'' యని వర్ణింపబడెను. విరటునికడ ధర్మజుడిట్లనినాఁడు: (తరువాతి పుట చూడుఁడు.)

శ్లో. దిజో వ్రతేనాస్మి న చ స్వతః ప్రభో
సంముండితః ప్రవ్రజిత స్త్రిదండభృత్
......అక్షాని వప్తుం కుసలో స్మ్యహం సదా...
నిరాశ్రయః ప్రవ్రజితోస్మి భిక్షుకః

—విరా. 7 అధ్యా.

తా॥ ఓ ప్రభువా! నేను వ్రతముచే ద్విజుఁడను. స్వతస్సిద్ధమగు ద్విజుఁడనుగాను. ముండితుడనైతిని. ప్రవ్రాజకుఁడను, త్రిదండధారియునైతిని. నేను పాచికలఁ జిమ్మటలో నెప్పుడును కుశలుఁడను, నిరాశ్రయుఁడను, సన్న్యాసిని, భిక్షుకుఁడను. పై శ్లోకములందు ధర్మజుఁడు బ్రాహ్మణసన్న్యాసియై జూదమాడుహాడువాఁడుగా వర్ణింపఁబడెనేగాని యన్యరీతిని లేదు కాన తిక్కన దోషికాఁడు. ఈ శ్లోకములు పెక్కు ప్రాఁతప్రతులలోను అచ్చుప్రతుల గాన్పించుచున్నవియే.

1. ఉద్యోగపర్వ. 2. అధ్యాయ.

రుక్మివధ ఘట్టమున నిరూపింపఁబడియున్నది. ఈ ద్యూతపిశాచము ఋగ్వేద కాలమునుండి నేఁటివఱకు మనలను వదలలేదు. కాని జూదములచే రాజ్యముల బోగొట్టుకొనిన రాజు లిపుడు కాన్పింపరు. పాచికల స్థానమున నిపుడు చీట్లపేక ప్రవేశించియున్నది. ఇది మహమ్మదీయులచేఁ గొనితేఁబడిన పాచికలకట్ట. ఈ చీట్లాటచే ననేకులు భ్రష్టులగుచున్నారు. ఈ చీట్లాటపిశాచమును పరమేశ్వరుడు మనలనుండి వదల్పఁడా?

**మద్యపానము**—ఇదియు ఋగ్వేదకాలమునుండి నేఁటివఱకు "నేకోత్తరాభివృద్ధిగఁ" బ్రవర్తిల్లుచున్నది. దీని నిపు డరికట్ట ననేకులు మహామహులు ప్రయత్నించుచున్నారు భవిష్యత్తులం దేమిజరుగునో తెలియదు. కాని, మహాభారతకాలమున మద్యపానము మితిమీఱియున్న దని చెప్ప సాహసించుచున్నాఁడను. రాజసూయయాగమునకు ధర్మజుగృహమునకు వచ్చినవారిలోఁ ద్రాగని వాఁడొకఁడును లేడఁట.[1] ధర్మజుని యశ్వమేధయాగమునందు "సురా, మైరేయ"(కల్లు,సారాల) సముద్రము కలిగినదఁట.[2] బలరామునివంటి యవతార పురుషుడు తెగఁద్రావుటచేఁ గల్లుకు "హాలిప్రియ" యను పేరు కలిగినది.[3] సంజయుఁడు సంధికేఁగినపుడు కృష్ణార్జునులు త్రాగి మత్తులై యుండిరి.[4] కృష్ణార్జునులవంటి సత్పురుషులు మద్యపానముఁ జేయవచ్చునా యని పూర్వమీమాంసా శాస్త్రజ్ఞులకు సందేహము కలిగినది. దానిని గుఱించి కుమారిలభట్టుడు తన "తంత్రవార్తికమున" నిటుల సమాధానముఁ జెప్పుకొనియున్నాఁడు:

[5]వాసుదేవార్జునులయందు యే స్మృతి విరుద్ధమగు మద్యపాన "ముపన్యసింపఁ" బడెనో, (దాని సమాన మిది) అన్నవికార సురామాత్రమె (రమ్‌సారా మాత్రమె) త్రైవర్ణికులకు నిషేధము - సురయే భోజ్యములలో నశుద్ధమైనది. అశుద్ధమె పాపమని చెప్పఁబడును. అందువలన బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు

1. సభాపర్వ 62 అధ్యాయ.
2. అశ్వమేధపర్వ. 89 అధ్యాయ.
3. నామలింగానుశాసన. శూద్రవర్గ. 37.
4. ఉద్యోగ్యపర్వ 58 అధ్యాయ.
5 యత్తు వాసుదేవార్జునయో ర్మద్యపానం స్మృతివిరుద్ధ ముపన్యస్త్యం, తత్రాన్నవికార సురామాత్రస్యైవ త్రైవర్ణికానాం ప్రతిషేధః॥ సురా వై మలమన్నానాం పాప్మాచ మలముచ్యతే తస్మా ద్బ్రాహ్మణరాజన్యౌ వైశ్యశ్చ ననురాంపిబేత్॥ మధుసీధ్వోశ్చ క్షత్రియవైశ్యయో ర్నప్రతిషేధః కేవల బ్రాహ్మణవిషయత్వాత్. -తంత్రవార్తిక.

కల్లు ద్రావరాదు. ద్రాక్ష, చెఱకు సారాయిలు మాత్రము క్షత్రియ, వైశ్యులకుఁ బ్రతిషేధములేదు. అవి బ్రాహ్మణులకు బ్రతిషేధము.

కుమారిలుఁడిట్టి సమాధానముఁ జెప్పుకొనుటకంటె నాఁటికాలమున సురాపానము నిషిద్ధము కాదని చెప్పినయెడల యుక్తముగా నుండును.

[1]సాత్యకి సైంధవ వధనాఁడా డాహ్వాయన "కైలాతక" మధుపానముచేఁ గన్నుల నెఱ్ఱగఁ జేసికొనినాఁడు.

[2]ద్వారకాపురియందు మహోత్పాతములు కలిగినపుడు ద్వారకలోఁ ద్రాగుడుచే మహోపప్లవములు కలుగునని యుగ్రసేన మహారాజైవరైన ద్వారకలోఁ గల్లు ద్రావినచో శూలారోపణముఁజేసి వధింతునని శాసించియున్నాఁడు. కాని యాదవులందఱును సముద్ర తీరమునకు జాతరసేయ నేఁగినపుడు కృష్ణునెదుటనె బలరాముడు, కృతవర్మ, సాత్యకి మొదలగు యాదవ ప్రముఖులతోఁ దెగద్రావియున్నాఁడు (తిక్కన తెనిఁగింపులో బలరాముఁడు త్రాగెనను వృత్తాంతమును విడుచుట చింత్యము).

మొత్తమునకు మహాభారత కాలమున వ్యభిచారము ద్యూతము మద్యపానము దోషయుక్తముగా నెంచఁబడలే దని తోఁచుచున్నది. ఇంతమాత్రమె కాదు. మిశ్రజాతీయులకు నుత్తమజాతీయులకు నంతఃకలహములు విశేషించి యున్నవి. రాజసూయ యాగమున "సర్ఘ్య" నిమిత్తక శిశుపాలవధను దీనికి నిదర్శనముగాఁ జూపవచ్చును. మిశ్రజాతీయులన దేవయోనులగు గంధర్వాదులును, దేవతామహిమ లారోపింపఁబడి జన్మించినవారు నని నాయభిప్రాయము. గూఢోత్పన్నాదులు ప్రాచీనాచారపరులై దాడి వెడలుటయె మహాభారతగాథగాఁ బరిణమించిన దని తలఁపవలసియున్నది. అందులకుఁ బెక్కు నిదర్శనములఁ జూపవచ్చును. శంతనునినాఁడే యుత్తమ క్షత్రియబీజము నీచక్షేత్రములఁ బ్రవేశించి చంద్రవంశము కళంకిత మైనటులఁ గాన్పించును. శంతనుని కొమరులు మువ్వురు, సంతానహీనులు కాఁగా విచిత్రవీర్యక్షేత్రమున మనుధర్మశాస్త్రముచే నిషాదుఁడుగాఁ దలఁపఁదగిన కృష్ణద్వైపాయనుని వలన గ్రుడ్డివాఁడు, పాండురోగి కలిగిరి. గ్రుడ్డివాఁడగు ధృతరాష్ట్రుఁడు రాజ్యానర్హుఁడగుటచేఁ బాండురాజే రాజయినటుల దృశ్యమాన సంస్కృత భారత ప్రతులలో గాన్పించుచున్నది. కాని నన్నియభట్టు కాలపు భారతపుఁ బ్రతిలో ధృతరాష్ట్రుఁడే రాజయి

1. ద్రోణపర్వ. అధ్యాయ. 112.
2. మౌసలపర్వ॥ 1, 8 అధ్యాయ॥

నకులను పాండురాజు సేనాధిపతియై పరరాజ్యములు జయించి యాదనమును ధృతరాష్ట్రునకు సమర్పింపఁగా నాతఁ డశ్వమేధ యాగముఁ జేసినటుల కలదు. అందువలననే నన్నయ ధృతరాష్ట్రుఁడు రాజని వ్రాసియున్నాఁడు. అంధునకు, బ్రహ్మచారికి యాగార్హత లేదు అంధుఁడగు ధృతరాష్ట్రుఁడు బ్రహ్మచారియగు భీష్ముఁడును యాగములఁ జేసినటుల మహాభారతమునఁ గాన్పించుచున్నది. ఇది యెట్లు సమర్థనీయ మని "పూర్వమీమాంసా" శాస్త్రజ్ఞులు తమగ్రంథములలోఁ జర్చించుకొని యెటులనో సమాధానములఁ జెప్పకొని యున్నారు. దాని నిట వివరింప నావశ్యకములేదుగాని 1"అపత్నీకుఁడగు భీష్మునకు సర్వాశ్రమవిరుద్ధముగా శ్రీరాముఁడు చేసినట్లు క్రతుప్రయోగము" అను ప్రశ్నమునకు, తంత్రవార్తికభాష్య మిట్లు సమాధాన మిచ్చుచున్నది. చూడుఁడు:

2"ఒక్కచోటఁ బుట్టిన సోదరుల కొక్కపుత్రుడు కలిగినను, ఆపుత్రుని చేతనె సోదరు లందఱు పుత్రవంతు లగుదురు అని మనువు చెప్పెను. (అనగా, పెక్కండ్రు సోదరులలో నొకనికిఁ బుత్రుఁడుండినను సోదరు లందఱు పుత్ర వంతులే యనఁబడుదురు.) ఇట్లనుటచే భీష్మునకు విచిత్ర వీర్యుని భార్యయందుఁ బొందఁబడినపుత్రులకు తండ్రి యను సంబంధము కల్గుటచే భీష్మునకుఁ గేవలము యజ్ఞముకొఱకు పత్నీ సంబంధము (విచిత్రవీర్యుని భార్యల యందు) అయ్యెను."

పైయంశముచే నపత్నీకుఁడగు భీష్ముఁడు ధృతరాష్ట్రాదులు పుట్టకముందో పిమ్మటనో అంబికాంబాలికలను యజ్ఞములయందు, పత్నులనుగాఁ జేసికొని యుండె. ఇది వింతగా నేఁటి కాలపువారికిఁ గాన్పించును కాని ప్రాచీన కాలములో జరిగిన యశ్వమేధములందును నేఁ డచట నచటఁ జరుగు యజ్ఞము లందును యజ్ఞము చేయువాని (భార్యలు లేక) భార్య, కొందఱు ఋత్విక్కులకు పత్నిగాఁ దత్కాలమునఁ గావలసిన విధి యున్నది.

1. భీష్మస్య సర్వాశ్రమధర్మవ్యతిరేకేణానుష్ఠానం. అపత్నీకస్య చ రామవత్క్రతుప్రయోగం"

2. భీష్మస్వచ భ్రాతౄణా మేకజాతానా మేకశ్చేత్పుత్రతా భవేత్. సర్వే తేనైవ పుత్రేణ పుత్రిణో మను రబ్రవీత్। ఇత్యేవం విచిత్రవీర్యక్షేత్రే లబ్ధపితృత్వకాత్యస్య కేవలయజ్ఞార్థం. పత్నీసంబంధ ఆసీదిత్యర్థాపత్త్యా నుక్త మపి గమ్యతే -తంత్రవార్తికభాష్య.

అది నాఁడే కాక నేఁడును దప్పు కాదు. కాని, యీవిధుఁ జేయు యజమాన యాజ్ఞికాదు లావిధులయొక్క యర్థములం దెలియరు. అందువలన నా తంతు నిర్బాధకమే కాక పవిత్రకర్మముగా పెంచఁబడుచున్నది. అర్థము తెలియని హేతువుచే యజమానపత్నిని నీవు స్వాధీనపఱచుకొమ్మను నాజ్ఞ (ప్రేష) నిచ్చు వాఁడు అధ్వర్యవమును జేయుచున్న యజమాన పుత్రుఁడును, స్వాధీనపఱచు కొను తంతుఁ జరుపువాఁడు (ఆగ్నీధ్రుఁడు) యజమానుని దౌహిత్రుఁడు నగు చుండుట నగఁబాటుగా నర్థముఁ దెలిసినవారి కగుచుండును. కుమారుఁడు తండ్రి యజ్ఞమునం దధ్వర్యుఁడగుటకు కొందఱు కృష్ణయజుర్వేదము (7 ప్రపాఠకము) లోని అత్రియొక్క గాథతోఁగూడిన యర్థవాదము నాధారముగాఁ జెప్పుదురు గాని యధ్వర్యుఁడు ఆగ్నీధ్రునకుఁ బత్నీ సన్నాహముఁ జేయుమని ప్రేషము (ఆజ్ఞ)నీయ నాగ్నీధ్రుఁడు యజమానపత్ని కడకుఁబోయి సత్సంతానముఁ గోరు చున్న నిన్ను సత్కర్మముకొఱకు పత్నింగాఁ జేసికొనుచుంటి నను నర్థమిచ్చు మంత్రము జెప్పుచు పెండ్లికూఁతురునకుఁ బెండ్లికొడుకు కట్టినటుల యోక్త్రము (ఒక విధమగు త్రాడు) కట్టుట మాత్రము నేఁటివారికి వింతగా నుండకమానదు. ద్విజులలో జరుగు పెండ్లిండ్లలో "మఱఁదలిమాడ" యను తంతుకూడ నిట్టిదే. దీని నిపుడు గోదావరీమండలపు బ్రాహ్మణు లవినీతికర కార్యమని మానుచు న్నారు.

పత్నీసన్నహనాద్యంశము శ్వేతకేతుని చరిత్రలో వివరింపఁగలను.

ధృతరాష్ట్ర, పాండురాజులలో నెవరు సింహాసనాధిపతులు కావలసినదియు నిశ్చయింపఁబడలేదనియు భీష్మవిదురుల బుద్ధివిశేషముచేతను ధృతరాష్ట్ర, పాండురాజుల యైక్యమత్యముచేతను రాజ్యపరిపాలనములో భేదములేకుండఁగనే జరిగినటులను సంస్కృతాంధ్ర మహాభారతములలో నాయామట్టముఁ జదివిన యెడల విశదము కాఁగలదు. కురు, పాండవ, దాయవిభాగము గుఱించి కీ॥ శే॥ రావుబహద్దరు వనప్పాకము అనంతాచార్యులుగారు బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారు బ్ర.శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు పెద్ద గ్రంథములను వ్రాసి యున్నారు. ఇందాచర్చను పెట్టుకొనునవసరము నాకు లేదు గాని "చంద్ర వంశ వృక్షము" నిందుఁజూపి పాండవుల కెట్టి రాజ్యార్హత కలిగినదియు స్వల్పముగా వ్రాయుచున్నాఁడను.

# చంద్రవంశము

(ఆదిపర్వ 94 అధ్యాయ.)

1 చంద్రుఁడు (తార)

|

2 బుధుడు (ఇళ)

|

3 పురురవుఁడు (ఊర్వశి)

|

ఆయువు

|

నహుషుఁడు

|

4 యయాతి (శర్మిష్ఠ) *

|

పూరుఁడు

|

మనస్యుఁడు

|

రౌద్రాశ్వుఁడు

|

అనాధృష్టి

|

మతినారుఁడు

|

---

1. తారాశశాంక విజయమున చంద్రుని గాథ వివరింపఁబడి యున్నది.
2. "ఇళ" ఒక నెల పురుషుడుగాను, నింకొక నెల స్త్రీగాను మాఱియుండెనఁట. చూడుఁడు, ఉత్తరకాండ.
3. విక్రమోర్వశీయమున నీతనిగాథ నింపుగ కాళిదాసు వర్ణించి యున్నాఁడు.
4. "శర్మిష్ఠ" రాక్షసవనిత—దేవయాని యను భార్యకంటె యయాతి కీమె యందు ప్రీతి మెండు

* ముందుపుట చూడుఁడు.

తంసుఁడు
|
ఈళినుఁడు
|
దుష్యంతుఁడు (శకుంతల)
|
భరతుఁడు
|
భుమన్యుఁడు
|
దివిరథుఁడు
|
సుహోత్రుఁడు *
|
అజమీఢుఁడు

| | | |
|---|---|---|
| [1] జహ్నుఁడు | ఋక్షుఁడు | దుష్యంతుఁడు |
| కుశికుఁడు | [2] సంవరణుఁడు (తపతి) | [3] పాంచాలురు |
| | [4] కురువు | |

---

*. అభిజ్ఞానశాకుంతలమున నీతనిచరిత్రను కాళిదా సింపుగవర్ణించియున్నాఁడు.

1. జహ్నునిచేతనే "గంగానది"కి జాహ్నవి యనుపేరు కలిగినది
2. సంవరణుని కాలమున నీతని పినతండ్రి సంతతివారగు పాంచాలు రీతని రాజ్యభ్రష్టునిఁ జేయ నీతఁడు సింధునదితీరమునకుఁ బెక్కేండ్లు ప్రచ్ఛన్నముగ నరణ్యావాసముఁ జేసెను. ఆ కాలమున "కురుదేశము"న మహాక్షామము సంభవించెనఁట. ఈ సంవరణ, పాంచాలుర గాథలు క్రీ॥ శ॥ పదియవ శతాబ్దములోని తూర్పు చాళుక్యుల గాథలను బోలియున్నవి. ఈ కాలపు గాథలే శతపథ బ్రాహ్మణములో వర్ణింపఁబడెను.
3. పాంచాలురే - ద్రౌపది యొక్క పుట్టినింటివారు.
4. కురువువలననే కౌరవవంశ మేర్పడెను. ఈతనిఁ బ్రజలే రాజుగ నెన్నుకొనిరని కలదు.

అపీక్షితుఁడు

|

పరీక్షితుఁడు

|

జనమేజయుఁడు

|

ధృతరాష్ట్రుఁడు


|

ప్రతీపుఁడు † — హస్తి 5

|

5. "హస్తి"చే నిర్మింపఁబడినదియే హస్తినాపురమట. ధర్మజుని తరువాత నేడవతరమువాఁడగు "చక్షుని" కాలమున గంగా ప్రవాహముచేఁ గొట్టుకొని పోఁబడెనని విష్ణు, భాగవత పురాణములలోఁ గలదు. నేఁడా హస్తిపురి చిన్నపల్లెగా నున్నది. కాని విశేష బౌద్ధాలయములు కలిగి యున్నది.

† ముందుపుట చూడుఁడు




1. దేవాపి పాషండమతావలంబి యగుటచే రాజ్యభ్రష్టుఁడైనాఁడు.
౨. శంతనుఁడు ప్రజలచే రాజుగఁ జేయఁబడినాఁడు.
౩. బాహ్లికుఁడు "బాకు" అని నేఁడు చెప్పఁబడు బాహ్లికదేశము నేలినవాఁడు.
4. ధృతరాష్ట్రునికి నూఱుగురు పుత్రు లని చెప్పఁబడినను ఇం దుదాహరింపబడినవారే ముఖ్యులని భారతమున నుండుటచే గాంధారిపుత్రులు వీరే యగుదురు. తక్కిన (౯౬) వారు స్వయందత్తాదులనుగాఁ దలఁపవలసియున్నది.

|

పరీక్షిత్తు

|

జనమేజయుఁడు

|

శతానీకుఁడు

|

[1]అశ్వమేధదత్తుఁడు

పైవంశవృక్షము మహాభారతముయొక్క ఆదిపర్వములోని (౯౪) తొంబది నాలవయధ్యాయానుక్రమముగా వ్రాయఁబడినది. కాని (౯౫) తొంబదియైదవ యధ్యాయమున వచనరూపముతో మఱియొక విధముగా చంద్రవంశ మభివర్ణితమై యున్నది. దానికిని దీనికిని భేదము గలదు. ఎందువలన నిట్లు చెప్పినదీ, మఱియొకసారి భేదముగాఁ జెప్పవలసివచ్చెనో దురూహ్యముగా నున్నది. నన్నయభట్టుయొక్క యాంధ్రీకరణము మఱియొకవిధముగా నున్నది. ధృతరాష్ట్రుని కుమారుడు "హస్తి" అజమీఢునకుఁ బూర్వికుఁ డొక "హస్తి" కలఁడు. వారిలో రెండవవాఁడే హస్తిపురి నిర్మాత యని నన్నయభట్టు వాకొనుచున్నాఁడు.

అధునాతనచారిత్రకులు సూర్యవంశమువలె చంద్రవంశము పరిశుద్ధమైనది కాదందురు. కారణ మాలోచింపఁగా శుద్ధక్షత్రియక్షేత్రములందు సూర్యవంశము వ్యాపించినటుల చంద్రవంశము వ్యాపింపలేదని పై వంశవృక్షమువలన విదితము గాఁగలదు. వంశములోని మూఁడవ వాఁడగు పురూరవుఁడు దేవయోని (తురేనియా) జాతిస్త్రీయగు నూర్వశియం "దాయు" వను కుమారునిఁ గనినాఁడు. అతని వంశమే వృద్ధి నొందినది. యయాతికిఁ గల భార్య లిరువురలో వృషపర్వాసురుని (అనార్యుని) కూఁతురగు శర్మిష్ఠా సంతతియే వృద్ధి నొందినది. దుష్యంతుఁకు శకుంతల యను నప్సరస్త్రీసంతతి(తురేనియా)యందే వంశవర్ధనుఁడగు భరతునిఁ గనినాఁడు. సంవరణుఁడను రాజు రాజ్యభ్రష్టుఁడై యడవులలో దిరుగుచు [2]"తపతి" యను స్త్రీయందు "కురు" రాజుఁ గనియున్నాఁడు. కురు రాజు దున్నిన ప్రదేశమే కురుక్షేత్రమై యదియే కురుదేశమైనదని పురాణాంతర

---

1. అశ్వమేధదత్తు కాలమున సౌతియొక్క భారతము రచింపబడియుండును.
2. తపతి సూర్యకన్యక యని మహాభారతమునఁ గలదు కాని యామె యాటవికజాతి స్త్రీగా నాపట్టములోని వర్ణనలచే నూహింపఁబడుచున్నది.

ములలోఁ గలదు. [1]కురురాజును ప్రభువుగాఁ బ్రజ లెన్నికొనిరట। ప్రదీపుని గంగ[2] వరింపరాఁగా నాతఁ డంగీకరింపలేదు గాని శంతనుఁ డంగీకరించెను. శంతనుఁడు దుష్టుడుగాఁ గాన్పించుచున్నాఁడు. అన్నయగు "దేవాపి" రాజు కాఁగా నాతనికి దుర్మార్గుఁడే దుర్బోధఁ జేయించి ప్రజలచే రాజ్యభ్రష్టుఁ జేయించి తాను రాజయినటుల భాగవతమునఁ గలదు[3] తండ్రిని వరించిన గంగను దాను వరించినాఁడు. యుక్తవయస్కుఁడగు కొడుకు భీష్ముఁడుండగ "పల్లెత"ను వరించియున్నాడు. ఈ పల్లెత మనుమలేగద ధృతరాష్ట్ర పాండురాజులు! కురు రాజునాఁడు శంతనునినాఁడు ప్రజలకు రాజు నెన్నుకొను నధికారముండినటుల గాన్పించుచున్నది.

పాండవుల కర్తరాజ్యార్హత యెట్లు కలిగినది? న్యాయమునకు భీష్ముడె రాజ్యార్హుఁడు. అతఁడు శంతనునికై చేసిన ప్రతిన ననుసరించి రాజ్యమును వదలుకొనినాఁడు కాని విచిత్ర వీర్యానంతరము ధృతరాష్ట్ర, పాండురాజులు యౌవనదశ నొందువఱకుఁ దానె రాజ్యముఁ జేసి సమిష్టిగనుచుండుటచే గ్రుడ్డి వాఁడైనను ధృతరాష్ట్రుని సింహాసనముఁ గూర్చుండఁబెట్టి విదురుని మంత్రిగఁ జేసెను పాండురాజు సైన్యాధిపతియై దిగ్విజయముఁ జేసి సంపాదించిన ధనముతో నన్నచే నశ్వమేధయాగముఁ జేయించినాఁడు ధృతరాష్ట్ర, పాండురాజుల కాలములో వారి కెట్టి విభేదము కలుగలేదు. పాండురాజు శాపదగ్ధుఁడై యరణ్యమునఁ దపము చేయునపుడు రాజ్యముతో నతఁడు తన కుండిన సంబంధమును వదలుకొని యున్నాఁడు ఆ సమయమున ధృతరాష్ట్రుఁడే పూర్వాచారము ననుసరించి రాజుగ నుండెను. పాండురాజ వీర్యము వలన సంతతి కలుగక యితనిక్షేత్రమునందే పాండవులు జన్మించిరి పాండవుల జన్మములు నాఁటివారి కనుమానస్పదములై యున్నవి. దానిని గుఱించి ముందు వ్రాయగలను ఎటులైనను పాండవులు పితృనిర్యాణానంతరము హస్తిపురికిఁ జేరిన పిమ్మట ధృతరాష్ట్రుఁడు తనపుత్రులతో సమముగ ధర్మరాజాదుల నాదరించి, యుక్తవయస్కుఁడైనపుడు మునుపటి సమిష్టి బుద్ధితో ధర్మజునకు యౌవరాజ్య పట్టాభిషేకముఁ జేసియున్నాఁడు.

---

1 కురురాజు తండ్రి సంవరణుఁడు పాంచాలురచే రాజ్యభ్రష్టుఁడైనాఁడు. తిరిగి వసిష్ఠుని మహిమచే రాజ్యము నొందెనట! ఏ దేశములకో తెలియదు కాని కురురాజు దున్నువాఁ డనుటచేతను, అతనిఁ బ్రజలు రాజుగా నెన్నుకొని రనుటచేతను తక్కువస్థితినుండి చక్రవర్తియైన "గయజుద్దీన్ టోగ్లకు" స్థితి జ్ఞప్తికి వచ్చుచున్నది

2 "గంగ" యను స్త్రీ యెవతెయో యార్యేతరజాతిస్త్రీ కావచ్చును.

3. శ్రీమద్భాగవతము నవమస్కంధము ౨౨ అధ్యాయము.

నర్హులే. (అంధక సంతతివారగుటను) మఱియు, వారింతకుఁ బూర్వమె నీవు ధర్మముచేఁ బొందినట్టి రాజ్యము నాఁడియుండి రనుటలో ధర్మజుని యౌవ రాజ్యాభిషేకము జ్ఞప్తిపఱచుటకై యున్నది. అప్పటిపరిస్థితులచేఁ బాండవులఁ గలిపికొనుటతప్ప వేఱుపాయము ధృతరాష్ట్రునకు, దుర్యోధనునకుఁ గాన్పింప నందునఁ బాండవులను రప్పించి యర్ధరాజ్యము ధృతరాష్ట్రుఁడు పాండవుల కిచ్చి యున్నాఁడు. అర్ధరాజ్యము పాండవుల కిచ్చునపుడు ధృతరాష్ట్రుఁడాడిన యీ క్రింది వాక్యములు పూర్వమెట్టుల నుండినను పాండవుల కర్ధరాజ్యార్హత నపుడు కలుగఁజేసినట్లు స్పష్టమగుచున్నది. భీష్ముఁడే పాండవుల కర్ధరాజ్యముఁ బంచిపెట్టించుటకుఁ గారకుఁడైనాఁడు

“[1]ధృతరాష్ట్రుఁ డిట్లనుచున్నాఁడు. ‘ఓ ధర్మరాజా! నేను చెప్పిన మాటలను సోదరులతోఁ గూడ వినుము తిరిగి మనలో విరోధము గలుగరాదు. (కనుక) ఖాండవప్రస్థమును బ్రవేశింపుము అక్కడనుండిన మిమ్ము నర్జునుఁడు సంరక్షించుచుండుటచే నింద్రునిచే సంరక్షింపఁబడిన దేవతలవలె నెవఁడును మిమ్ము బాధింపలేఁడు. రాజ్యము యొక్క సగమును బొంది ఖాండవప్రస్థములోఁ బ్రవేశింపుము” ఈ ఖాండవప్రస్థము హస్తినాపురికి దక్షిణముననుండిన యమునా నదీ ప్రాంత మహారణ్యము. పాండవుల నచటికి ధృతరాష్ట్రుఁ డంపుటలోఁ గొంత కృత్రిమాలోచన ముండినట్లుఁ గాన్పించును. ఆ ఖాండవ మహారణ్యమున నాగులను మిశ్రజాతీయు లున్నారు “అశ్వసేనాదు” లందు మహావీరులు. ఈ నాగ జాతివారితోఁ బోరాడి పాండవులు చత్తురని తలంచియే వీరి నచటికి నర్ధరాజ్య భాగమను మిషతో ధృతరాష్ట్రుఁ డంపియుండును శ్రీకృష్ణ సహాయులగు పాండవులా మహారణ్యమున “నింద్రప్రస్థ” పట్టణమును నిర్మించిరి. అదయే నేఁటి ఢిల్లీ. ఇప్పటి ఢిల్లీయందు ‘‘ఇంద్రపట్’’ అను ప్రదేశము కలదు అదియే ప్రాచీనపు టింద్రప్రస్థమందురు. ఆ ఖాండవప్రస్థ మహారణ్యముననుండిన నాగులతో నర్జునునకు ఘోర యుద్ధమైనది. శ్రీకృష్ణుఁడు తోడ్పడుటచే నా వనము నర్జునుఁడు దహించి సుక్షేత్రముగఁ జేసియున్నాఁడు. ఆ వనప్రదేశమె నేఁటి ఢిల్లీ బయలు. పాండవులనాడు మహారణ్యముగ నుండిన ఖాండవము నేఁడు బంగరు పండు మహాక్షేత్రముగను రాజాధిరాజులు, చక్రవర్తులు, నివసించు దివ్యస్థలముగానూ మాఱుట యీశ్వర మహిమాతిశయముకాదా! పాండవులు ఖాండవప్రస్థముఁ జేరిన

---

1. ధృతరాష్ట్ర॥ భ్రాతృభిస్సహ కౌంతేయ నిబోధ గదతోమమ పునర్వో విగ్రహో మాభూత్ ఖాండవప్రస్థ మావిశ, నచవో వసతస్తత్ర కశ్చిచ్ఛక్తః ప్రబాధితుం. సంరక్ష్యమాణాన్ పార్థేన త్రిదశానివ వజ్రిణా అర్ధం రాజ్యస్య సంప్రాప్యఖాండవప్రస్థ మావిశ. ఆదిపర్వం. 207 అధ్యాయ.

పిమ్మటనే వారి కధిక బలము చేకూరినది పాంచాలురతో ద్రౌపదీసంబంధమే కాక అర్జునుఁడు సుభద్రను బెండ్లియాడుటచే యాదవులతోఁ గూడ సంబంధ, బాంధవ్యము లేర్పడయెనవి. శ్రీకృష్ణున కప్పటికి యాదవులలోఁ బలుకు బడి హెచ్చుగ నున్నది. మహాయుద్ధకాలమునాఁటికి శ్రీకృష్ణుని పలుకుఁబడి యాదవులలోఁ జాల తగ్గినది. ఆ వృత్తాంతమును బిమ్మట వ్రాయఁ గలను. పాండవులకు వారణావతమునకుఁ బోవునాఁటికిఁ బ్రజలలో నంతగ పలుకుఁబడి లేదు. కారణము వారి జన్మవృత్తాంతము "అనుమానాస్పదము" అగుటయే దానిని దిఙ్మాత్రముగ వ్రాయుచున్నాఁడను.

పాండవుల జన్మములను నాఁటివారు సందేహింపలేదా? పాండవుల జన్మములు హస్తినాపురవాసులకు గూఢపఱచి మునులచేఁ జెప్పఁబడినవి. వారెట్లు చెప్పిరో చూడుఁడు:

[1]బ్రహ్మచర్యవ్రతమునం దుండిన యాపాండురాజునకు దివ్యమైన హేతువుచే ధర్మునివలనఁ బ్రత్యక్షముగ నీయుధిష్ఠిరుఁ డదటఁ బుట్టియున్నాఁడు. అట్లే భీముఁ డను నీమహాబలవంతుని "వాయు"వా పాండురాజున కిచ్చెను. ఇంద్రుని వలనఁ గుంతియందే యీయర్జునుఁడు పుట్టెను మాద్రి యశ్వినీదేవతలవలన నీశ్రేష్ఠులగు నకులసహదేవులఁ గనినది

పై వాక్యములు మునులు పాండవులఁ గుంతితోఁ దీసికొనివచ్చి హస్తిపురిలో భీష్మాదుల కొప్పగించునపుడు చెప్పినవి. మును లంతర్హితులైన పిమ్మట పౌరులలో నీక్రింది కలకలము కలిగెను.

[2]ఆ యా మునులచేఁ దెలుపుడు చేయఁబడిన పాండవులనపుడు కౌరవులు పట్టణమునందలి యన్ని వర్ణములవారలు, చూచి సంతసముచే నాక్రోశించిరి. కొందఱీబాలురు, పాండురాజు కుమారులు కారనిరి. మఱికొంద ఱగుదురనిరి.

---

1. శ్లో। బ్రహ్మచర్య వ్రతస్థస్య తస్య దివ్యేనహేతునా। సాక్షాద్ధర్మాదయం పుత్ర స్తత్ర జాతో యుధిష్ఠిరః. తథైనం బలినాం శ్రేష్ఠస్య రాజ్ఞో మహాత్మనః, మాతరిశ్వా దదౌ పుత్రం భీమం నామ మహాబలం, పురుహూతాదయం జజ్ఞేకుంత్యా మేవ ధనంజయః. యౌతు మాద్రీ మహేష్వాసా వసూత పురుషోత్తమౌ. అశ్విభ్యాం పురుషవ్యాఘ్రౌ విమౌ తావపి సత్యత॥ ఆదిపర్వ। 126 అధ్యాయ॥
2. శ్లో. తైస్తైర్ని వేదితాన్ దృష్ట్వా పాండవాన్ కౌరవా స్తదా. శిష్టాశ్చవర్ణాః పౌరాయే తేహర్షాచ్చుక్రుశు ర్భృశం ఆహుః కేచిన్నతస్యైతే తస్యైత ఇతి చాపరే. యదాచిరం మృతః పాండుః కథం తస్యేతి చాపరే. ఆదిపర్వ. 1 అధ్యాయ.

మఱికొందఱు పాండురాజెపుడో బాలకాలము క్రితము మృతినొందెనే, యెట్టి వీరతని బిడ్డ లనిరి. దేవీ భాగవతమునఁగూడ పాండవులఁ గుంతి హస్తిపురికిఁ గొనివచ్చినపుడు పౌరులీ పాండవుల జన్మముఁగూర్చి యనుమానించి నటు లున్నది.

1(ఋషులు) కుంతి నైదుగురు బిడ్డలతో హస్తిపురం బొందించిరి అపుడు పాండురాజు శాపమునఁ దెలిసిన జనులు (పాండురాజు స్త్రీసంపర్కము కలిగి నంత మాత్రమున మృతినొందునని జనులెఱుఁగుదురు.) "కుంతి నోవనితా యీబిడ్డ లెవరిబిడ్డ" లనిరి. అపుడు కుంతి దుఃఖాన్వితురాలయ్యెను...ఆ ప్రజలఁ గూర్చి కుంతి యీపిల్లలు దేవతల బిడ్డలే. కురుకులమున నుద్భవించినవారే. (అని) నమ్మకము కొఱకు దేవత లందఱామెచే నాహూతులైరి.

నిజమునకు పాండవులు కృత్రిమ జన్మము కలవారే. నాఁటి కాలమున వైదిక దేవతలయందు మహిమలను జనసామాన్యము తలఁచుచుండుటచేఁ గుంతి యెటులనో యైదుగురు బిడ్డలను సంపాదించెనని కాని కుంతిమాద్రుల కితరుల వలన బిడ్డలు కలుగగా వారు దేవ మహిమల వలనఁ బుట్టినవా రని మిష పెట్టినదని కాని చెప్పవలసియున్నది. కర్ణునిఁ గుంతి రహస్యముగఁ గనినసంగతి నామె చివరిదశలోఁగాని చెప్పలేదు. అర్జునుఁ డొక్కఁడే కుంతికిఁ బుట్టినటులఁ బార్థ శబ్దముచే నూహింపఁదగి యున్నది. యమ, మరుత్తులు, కుంతి జపించినంత మాత్రముననే వచ్చి ధర్మజ, భీముల నిచ్చిపోయిరి. ఇంద్రు డటులుకాక సంవత్సరము కుంతీ, పాండులు తపస్సు చేసినఁగాని వచ్చి యర్జును నీయలేదు. కుంతీ గర్భజనితు లగుటచేతనే కర్ణార్జునులు సమానవీరులైరని కూడ తలఁప వలసి యున్నది. మఱియుఁ బాండవులు సంవత్సర సంవత్సరము వ్యవధిగఁ బుట్టినన్ను అందఱు నైదుసంవత్సరముల ప్రాయముగల వారుగానే కాన్పించిరఁట![2] అనఁగా నైదేండ్లయీడు గల పిల్లలఁ గుంతి సంపాదింపలేదు కద! పాండవులఁ గుంతి "శతశృంగ" పర్వతమునఁ గనియున్నది. శతశృంగము "టిబెతు" దేశములోనిది. ఈ పాండవు లచటఁ బుట్టిరి. నన్నయభట్టునకు లభించిన సంస్కృతభారతమునఁ బాండురాజు మరణానంతరము పాండవులు

1. శ్లో. పంచపుత్రయుతాం కుంతీమనయ న్హస్తినాపురం. పప్రచ్ఛుశ్చ జనా స్సర్వే కస్యైపుత్రా వరాననే; పాండోశ్శాపం సమాజ్ఞాయ, కుంతీదుఃఖా న్వితా తదా...తానువాచ సురాణాంవై పుత్రాః కురుకులోద్భవాః విశ్వా సార్థే సమాహూతాః కుంత్యా సర్వే సురా స్తదా॥ దేవీభాగవతం ద్వితీయ స్కంధ 6 అధ్యాయ.
2. ఆంధ్రమహాభారతము 6 ఆశ్వాసము 140.

హస్తిపురికి వచ్చునాటికి 16, 15, 14, 18 సంవత్సరముల వయస్సుకలవారై యుండిరి.

[1]పాండవులు శతశృంగగిరిపై నుపనీతులై "శర్యాతి" అను రాజర్షి యొక్క ప్రథమపుత్రుఁడగు "శుక్రుడు" అను వీరునికడ ధనుర్వేదము నభ్యసించిరి. ధర్మజుఁడు "తోమరము" అను నాయుధముతోఁ బోరువిధమును, భీముఁడు మల్ల, గదాయుద్ధములఁ జేయురీతిని, అర్జునుఁడు శస్త్రాస్త్ర విద్యలను నేర్చెను. అర్జునుని నేర్పునకు మెచ్చి శర్యాతి కొన్ని యస్త్రములను ధనురాదికము నిచ్చెను. పాండవుల కచ్చటి యాచారము లలవడెఁగా

ధర్మజునకు మ్లేచ్ఛభాష బాగుగా వచ్చును వారణావతమున కాతఁడేఁగునపుడు విదురునితో నాభాషలోనె మాటలాడెను. మ్లేచ్ఛ భాష యన భారతీయేతర భాష. అది నాఁటికాలపు తిబెతుభాష

[2]ఒక్క దేశభాషమాత్రమే కాదు తిబెతీయాచారములు వారి కలవడినవి. నిజమునకు ధర్మరాజాదులు తిబేతుదేశీయులై యుందురు. తిబెతుదేశమునఁ బెక్కం డ్రొక్కవనితఁ బెండ్లియాడు నాచారము ప్రాచీనకాలమునుండి నేఁటివఱకుఁ గలదు. ద్రౌపదీ పరిణయ సమయమున ద్రుపదుఁడు పెక్కం డ్రొక్కవనితఁ బెండ్లియాడుట యుక్తమా! యన ధర్మజుఁ డిట్లనినాఁడు:

[3]ఓ ద్రుపద మహారాజా! ధర్మము సూక్ష్మమైనది. దీని గతిని మేమెఱుఁగము. (మాయొక్క) పూర్వులు వెళ్ళిన దారినే మేము పోవుచున్నాము.

ధర్మజుఁడు మా పూర్వికులు పోయినదారిని మేము పోయెద మనుటలో "తిబెతీయు"లని ధ్వని కలుగుచున్నది. కారణ మేమన కురు వంశములో నెవ్వరు నొకతె ననేకులు పెండ్లియాడలేదు గాన—కుంతీదేవి చాల గుట్టుగల స్త్రీ. ఆమె యర్జునునిఁ దప్ప మిగిలిన నలువుర నెటులనో సంపాదించి కాని (అర్జునుఁ గనియుండును) లేక వ్యభిచారముచేఁ దాను ముగ్గురఁ గని సవతిచేఁగూడ నటులఁ గనిపించికాని కౌరవులలో భాగస్వాములుగాఁ దీసికొనివచ్చి యుండును. పౌరు లందువలననే యనుమానించిరి. అనుమానించుటయే కాదు. ధృతరాష్ట్రుడు పాండవులను వారణావతమునకుఁ బొమ్మనఁగా ధర్మజునకు హస్తిపురిలో సహా

1. కుంభకోణపుఁ బ్రతి. 188 అధ్యా. వావిళ్ళవారి నాగరపులిపి గల ప్రతి 1,2 అధ్యా.
2. ఆదిపర్వ. 146 అధ్యాయ.
3. సూక్ష్మోధర్మో మహారాజ, నాస్యవిద్మో వయం గతిం పూర్వేషా మాను పూర్వేణ యాతం వర్త్మాను యాయహే. ఆదిపర్వ. 195 అధ్యాయ.

యము( జేయువారే లేరైరి[1] దీనులై పాండవులు భీష్మాదులకు వందనముచేసి యనుజ్ఞ( గోర(గా వా రనుమతించిరట! పాండవులయందు( గుంతీదేవియొక్క చెల్లెలిబిడ్డలగు శిశుపాల, దంతవక్త్రు, విందానువిందులకు(గూడ నిష్టములేదు. విందానువిందులు మహాయుద్ధములో( గౌరవపక్షముననుండి యర్జునుని చేతనె చచ్చిరి. శిశుపాలు(డు పాండవాహితు(డై రాజసూయయాగ సమయమున( గృష్ణుచే జచ్చుట నంద ఱెఱిగియున్నదియే దంతవక్త్రునకు భారతగాథతో సంబంధము లేదుకాని పాండవహితు( డగు శ్రీకృష్ణునితో( బోరి చచ్చినవా(డే.

శిశుపాలుడు జీవించియుండినచో( దప్పక కౌరవపక్షమునకు వచ్చువాడే యని శ్రీకృష్ణు( డర్జునునకు ఘటోత్కచవధ సమయమున( జెప్పియున్నా(డు. పాండవుల జన్మకర్మాదులు కౌరవాచార విరుద్ధములుగను, భారతీయాచార విరుద్ధ ములుగ నుండుటచేతనె దుర్యోధనుని ధన బలాదులను లక్ష్యపెట్టని బాహ్లిక, సోమ దత్త, భూరిశ్రవసులు, కుంతియొక్క సోదరీసుతులు, తుదకు మాద్రియొక్క యన్నయగు శల్యు(డు మొదలగువారు సయితము పాండవులలో జేరక కౌరవులలో( జేరిరి. పాండవులయందు నా(టి వైదికఋషులకు(గూడ గౌరవము లేదు. అందువలననే వైదికవాఙ్మయమున( బాండవులపే రప్పటి ఋషులు సూచింప లేదు. బాగుగ నాలోచింప( జంద్రవంశమున( బుట్టిన రాజులలో భరతు(డు మొదలు పరీక్షిత్తు వఱకు వైదిక ఋషుల కిష్టమగు ధర్మవృత్తము గలవారెవ్వ రును లేనందుననే వారి పేరులను వైదిక వాఙ్మయమున లిఖింప లేదని తో(చు చున్నది. దౌష్యంతిభరతునకే కృత్రిమ పుత్రు(డు సంభవించినా(డు. శంతనుని నుండి పరీక్షిత్తు వఱకు రాజవంశము నానా సంకరములతో( గూడి యున్నది. ఆ సంకరదోషము ప్రపంచోపద్రవము( దెచ్చిపెట్టి యించుమించు దెబ్బది లక్షల వీరులు రణ నిహతు లగునట్లు చేసినది. జనమేజయుని కాలము నుండి సంఘము కొంత వఱకు శుద్ధత నొందినటుల( గాన్పించును. జనమేజయు(డు తన భార్యపై నణుమాత్ర జారత్వశంక కలుగుట చేతనె శ్రీరామునివలె భార్యం ద్యజింప( బ్రయత్నించిన కథ పురాణాంతరములలో( కలదు. [2]ఈ క్రింద నైతరేయ బ్రాహ్మణములోని యశ్వమేధయాగ కర్తల పేరుల నధ్వర్యుల పేరులతో వ్రాయుచున్నా(డ, నందు వ్యాస ధర్మజుల పేరులు లేకపోవుట గమనింపదగిన సంగతి ధర్మజు(డశ్వమేధము( జేయలేదా? చేసినచో నపకీర్తి యగు వ్యాసు( డధర్మము( జేయ, సంకరు(డగు ధర్మజు( డశ్వమేధము( జేయుట నా(టి వారి కిష్టము లేదా? తద్‌జ్ఞులాలోచింప వలసియున్నది.

---

1. ఆదిపర్వ 1+3 అధ్యాయ
2. ఐతరేయ బ్రాహ్మణము 8 సంచిక 4 అధ్యాయము.

| సంఖ్య | అశ్వమేధయాగ కర్త | యాగకర్త తండ్రి | అధ్వర్యుడు | అధ్వర్య జనకుడు | విశేషాంశములు |
|---|---|---|---|---|---|
| 1. | జనమేజయుడు (*) | పరీక్షిత్తు | తురుడు | కవషుడు | ప్రపంచము నంతయు జయించెను |
| 2. | మానవుడు | శర్యాతి | చ్యవనుడు | భృగువు | డిటో |
| 3. | శతానీకుడు | సత్రాజిత్తు | సోమశుష్మ | వజీరత్నాయనుడు | |
| 4. | అంబష్ఠుని కుమారుడు | అంబష్ఠుడు | పర్వతనారదులు | | |
| 5. | యుధాంశ్రేష్ఠుడు | ఉగ్రసేనుడు | పర్వత నారదులు | | |
| 6. | విశ్వకర్మ | భువనుడు | కశ్యపుడు | | భూమి కాశ్యపిగా నీపమయ్య మునవెయైనది |
| 7. | సుదాసుడు | పిజవనుడు | వసిష్ఠుడు | | ఋగ్వేదమున సుదాసుని గాథ కలదు. |
| 8. | మరుత్తు | అవీక్షితుడు | సంవర్తుడు | అంగిరసుడు | |
| 9 | అంగుడు | ఉపాంగుడు | ఉదమయుడు | అత్రి | పదివేల యేనుగులను ఋత్విగ్దక్షిణనిచ్చెను. |
| 10. | భరతుడు | దుష్యంతుడు | దీర్ఘతముడు | మమత (తల్లి) | 133 అశ్వమేధములఁ జేసెను. ఇన్ని యజ్ఞముల నెవ్వరును జేయలేదఁట! |
| 11. | దుర్ముఖుడు | పాంచాలదేశపురాజు | బృహదుక్థుడు | | |
| 12. | అత్యరాతి | జనంతపతి | సాతహవ్యుడు | వసిష్ఠుడు | |

* పరీక్షిత్తుకుమారుఁడు జనమేజయుఁ డింక నొకఁడు చంద్రవంశమున కురు మహారాజునకు ముమ్మనుమఁడు కలఁడు. అతండును అశ్వమేధ

## పాండవపక్షపాతు లెవరు?

నేఁటికాలపు సామాన్యజను లందఱు పాండవ పక్షపాతులే. కాని నాఁటికాలమున వారిలోఁ గొందఱుమాత్రమె కలరని తోఁచును. అందువలననె కౌరవపక్షమునకు పదునొకం డక్షౌహిణుల సైన్యము చేరగాఁ బాండవ పక్షమున కేడక్షౌహిణుల సైన్యముమాత్రమె చేరెను. అయినను ముఖ్యులలోఁ గ్రిందఁ జెప్పఁబడువారలు పాండవపక్షులు. (1) భీష్ముఁడు, (2) ద్రోణుఁడు, (3) కృపుఁడు, (4) విదురుఁడు, (5) వ్యాసుఁడు, (6) శ్రీకృష్ణుఁడు, (7) విరటుఁడు, (8) మయూరధ్వజుఁడు, (9) ధృష్టద్యుమ్నుఁడు మొదలగువారు. పైఁజెప్పఁబడినవారిలో మొదటి నలువురును దుర్యోధనకార్యములను నిర్వహించుచుఁ బాండవపక్షమున మనస్సు నుంచువారు. పైవారింగూర్చి కొంత వ్రాసెదను.

## భీష్ముఁడు

భీష్ముఁడు, సమయము వచ్చినపు డెల్లఁ బాండవపక్షముగఁ జెప్పుచుఁ బదిదినములు సర్వసైన్యాధిపత్యముఁ జేసియు పేరు గలవాని నెవ్వనిఁ జంపక తుదకుఁ దొమ్మిదవనాఁటిరాత్రి ధర్మజునకుఁ దనగుట్టు నంతయుఁ జెప్పి కపటపు చావు చచ్చెను. స్థూలదృష్టిలో భీష్ముని బ్రహ్మచర్యదీక్ష, పితృభక్తి, ఈశ్వర భక్తి, బలపరాక్రమాదులు ననుపమానములుగఁ గాన్పించును. ఈ భీష్మున కాసేతు హిమాచలమును గల పూర్వాచారపరులు మాఘశుద్ధైకాదశినాఁడు భీష్మతర్పణముఁ జేయుచున్నారు వారిలో నీగ్రంథకర్త కూడ నొకఁడు ఈతని బ్రహ్మచర్య మనుమానాస్పద మని పూర్వమీమాంసా శాస్త్రజ్ఞులలోఁ గుమారిల భట్టుమొదలు, తెనుఁగు భారతమునకుఁ టీకచేసిన "భారతము లక్ష్మీపతి సోమయాజుల" వఱకుఁ గల భారతజ్ఞులు వ్రాసియున్నారు. దానితో మనకు నిమిత్తము లేదు. కాని భీష్ముఁడు సర్వసైన్యాధిపత్యము వహించి తాను పడిపోవుటకు హేతువును శత్రునకుఁ జెప్పుటమాత్రము మన దృష్టిని విచారణీయాంశమై యున్నది. డాక్టరు "వింటర్నిట్జు" వంటి పాశ్చాత్య దేశీయుఁడు కూడ భీష్మునిప్రఖ్యాతిం బట్టి యాతఁడట్టి కృత్రిమముఁ జేయఁడనియు భీష్ముఁడు పడుటకుఁ దగిన యుపా

యాగముఁ జేసెను ఆయశ్వమేధము నాఁడు చేసిన, బ్రహ్మహత్య, స్త్రీ హత్యల ప్రాయశ్చిత్తమునకై చేయఁబడెను. ఆతని కధ్వర్యుఁడు, శౌనకుని పుత్రుఁడగు, ఇంద్రోతుఁ డనువాఁడు ఈ యంశము శాంతి పర్వమునను, శతపథబ్రాహ్మణమునను గలదు పాండవవంశవర్ధనుఁ డగు జనమేజయుఁడు దిగ్విజయముకొఱకు, అశ్వమేధముఁ జేసెను. ఆ యంశ మాతనిఁ గూర్చి వ్రాయునపుడు విశదీకరింతును. ఈతని కధ్వర్యుఁడు "తురుఁడు." ఇట్లని విష్ణుభాగవత పురాణములలో గలదు.

యము కృష్ణుఁడే చెప్పియుండు ననియు వ్రాసియున్నాఁడు. కాని భీష్ముఁడు కపటియే! దుర్యోధనుపక్షమున బాగుగఁ బనిఁజేయు కర్ణునిఁగూడ నిరుత్సాహ పఱచినాఁడు. భీష్ముఁ డొకచోట దుర్యోధనాదులం జేరుటకుఁగల కారణము "అర్థస్య పురుషో దాసః దాస స్త్వర్థో న కస్యచిత్" అని చెప్పినాఁడు. అనఁగా ధనమునకుఁ బురుషుఁడు దాసుఁడు ధన మెవరికిని దాస్యము చేయదు. అందు వలననే (విస్తారము ధనమును దుర్యోధనుఁ డిచ్చుచుండుట చేతనె) యాతని పక్ష మున నుంటినని నాఁడు. మఱియుఁ బెక్కుచోటులఁ గౌరవులయన్నముఁ దిను చుండుటచేతనె యా పక్షమున నుండితి ననుచుండువాఁడు. ఇది భీష్మునివంటి విరాగికిఁ దగునా? ప్రభువునందును దేశమునందు నభిమానము లేక కేవలము ధనాపేక్షచేతనె రాజతంత్రముల నడపువారు రాజోపద్రవ దేశోపద్రవములకుఁ గారకులగుదురు అర్థార్థియైన భీష్ముఁ డట్లే చేసెను. భీష్ముఁడు, పాండవులు గాలికి వానదేవత మొదలగువారికిఁ బుట్టినటులఁ దాను 'నదికిఁ బుట్టిన సంకీ ర్ణుఁడు గాన పూర్వాచారపరుఁ డగు దుర్యోధనున కపకృతిని సంకీర్ణులగు ధర్మరాజాదుల కుపకృతిఁ జేసియున్నాఁ డని ముమ్మాటికిఁ జెప్పవచ్చును. భీష్ముఁడు భక్తి వైరాగ్యాదులద్వారా మనకు బూజ్యుఁడే యగును భీష్ముఁ డంపశయ్యపై నుండి ధర్మజున కుపదేశించిన శాంత్యనుశాసనిక పర్వపు గాథలు సౌతికాలమునఁ గల్పింపఁబడి యుండును. భీష్ముఁడు యుద్ధములోనె మృతి నొందెనని మహాభారతములో స్థలాంతరమునఁ గలదు.

## ద్రోణుఁడు

ద్రోణుఁడు భీష్మునివలె నదిలోఁ గొట్టుకొని రాలేదు కాని యొక జారిణికి (అప్సరసకు) భరద్వాజునివలనఁ గలిగినవాఁడు భరద్వాజముని జలకమాడు నప్సరసను జూచి మోహింపగఁ వీర్యపతన మయ్యెనఁట! దానిని ద్రోణకలశ మున నిడఁగాఁ బుట్టినవాఁడు గాన ద్రోణుఁడను పేరు కలిగినదఁట! స్త్రీ పురుషుల శుక్లశోణిత సమ్మేళనము లేకుండఁగ జన్మ మొక్కశుక్లముచేతనె కలుగునని పూర్వ పాశ్చాత్యశాస్త్రములేవియు నంగీకరింపవు. ద్రోణజన్మకథఁ జూడఁగ "ఘృతాచి"యను నప్సరస భరద్వాజునకు ద్రోణునిఁ గని యాబాలుని ద్రోణకలశములోఁ బెట్టఁగ భరద్వాజుఁడే పెంచి పెద్దవానిఁజేసి యాతనికి ద్రోణుఁ డను పేరు బెట్టియుండెనని తోఁచును. ద్రోణుఁడు పాంచాలరాజగు ద్రుపదునితోఁ జిన్నతనమునుండియుఁ బెరుగుటచే నీతనియందును రాజ్యాభిలాషము పెరిగినది. దీని కనుకూలముగా ద్రుపదుని యవివేకమును దోడ్పడుటచే ద్రోణ, ద్రుపదు లకు విరోధము సంభవించుటయు నందు "మాకంది; అహిచ్ఛత్రము" నను

భాగములుగల యుత్తరపాంచాల రాజ్యములను ద్రోణుఁడపహరించుటయు జరిగి నది. ఈగాథ పిమ్మట వ్రాయఁబడును ద్రోణ ద్రుపదుల వైరమె మహాయుద్ధమునకు ముఖ్యాంగ మైనది. ద్రోణునికృత్రిమముచేఁ గురుపాండవులలోఁ గల మహావీరులు పెక్కండ్రు యుద్ధమున మృతినొందిరి. భీష్ముని సైన్యాధిపత్య కాలముకంటె ద్రోణసైన్యాధిపత్య కాలముననె మహావీరులు పెక్కండ్రు పొంసిరి అభిమన్యుడు విరథుఁడగు నుపాయమును ద్రోణుఁడె దుర్యోధనాదులకుఁ జెప్పియున్నాఁడు. అర్జునుని ప్రతిజ్ఞకు సైంధవుడు జడిసి నేను పాఱిపోయెద ననఁగా నిన్ను దేవత లైనఁ దేఱి చూడకుండఁగ రక్షింతు నని నమ్మించి యర్జున, సాత్యకి, భీములు మొగ్గరములోఁ బ్రవేశించుట కుపాయముఁ జెప్పియున్నాఁడు. అర్జునుని మొగ మోటముచేతను దౌర్బల్యముచేతను విడిచియుండి నటుల మహాభారతములోఁ గాన్పించుచున్నది. కాని సాత్యకిని వదలుటలోఁ బరమ నైచ్యమున కొడంబడి వదలినటుల నాప్రకరణము చెప్పుచున్నది. సాత్యకి ధర్మజునానతి నర్జునుఁ జేరఁబోయి ద్రోణు నతిక్రమించుట కుపాయముఁ గానకున్న సమయమున ద్రోణుఁ డిట్లనినాఁడు:

1"ఓ సాత్యకీ, నీ గురువగు నర్జునుఁడు యుద్ధమును విడిచి కుత్సిత పురుషునివలెఁ బోయెను. యుద్ధముఁ జేయుచుండిన నాకుఁ బ్రదక్షిణముఁ జేసి వెళ్ళెను. నీవును నీగురువువలెనె నన్ను విడిచిపొమ్ము. నాతో యుద్ధముఁజేసినచో బ్రదికి వెళ్ళలేవు"

ఇట్లు స్పష్టముగఁ జెప్పినపుడు సాత్యకి యా విధముగాఁ గార్యసాధనముఁ జేసికొనఁడా? అట్లే చేసి సైంధవ వధము నర్జునునకుఁ దోడ్పడనేఁగెను. భీము నకుఁ గూడ నిట్టి యుపాయమునే ద్రోణుఁడు సూచించియున్నాడు. కాని భీముఁడట్టి పౌరుషహీనమగు కృత్రిమమున కొప్పుకొనలేదు. మఱియు సర్వ సైన్యాధిపత్యము నొందువేళ ధర్మజుఁబట్టి దుర్యోధనున కిత్తునని చెప్పి యొకటి రెండు మారులు ధర్మజుఁడు దొరకుటకు సిద్ధపడినను పట్టక వదలినాఁడు. దుర్యో ధనుఁ డనినటుల ద్రోణుఁడు "కప్పయెలఁగు పాము, తేనియ పూసినకత్తి"గానే ప్రవర్తించియున్నాఁడు

1. శ్లో॥ తవాచార్యో రణంహిత్వా గతః కాపురుషో యథా,
యుధ్యమానంచ మాం హిత్వా ప్రదక్షిణ మవర్తత.
త్వంహి మే యుధ్యతో నాద్య జీవన్ యాస్యపి మాధవ.
యదిమాం త్వం రణే హిత్వా నయాస్యా చార్యవద్ద్రుతం.
-ద్రోణపర్వ (118) అధ్యాయః.

పాండవ పక్షమునకుఁ గూడ ద్రోణుఁడపకారియే. పాంచాల వీరులఁ బెక్కండ్రను, ద్రుపద, విరాట, చేకితాన, ధృష్టకేతు "మాగధ సహదేవ" కేకయ సోదరాది మహా యోధులఁ జంపెను. అతనికిఁ గోపము పాంచాలురపై నెక్కుడు కలదు. [1]పాంచాలురఁ జంపికాని కవచమును విడువ ననియుఁ దాఁ జంపఁగా మిగిలిన పాంచాలురఁ దప్పక జంపవలయు ననియు దుర్యోధనుచే నశ్వత్థామకు వర్తమానమునంపెను. కాని తనవలె సంకీర్ణ సంభవు లగుటచేఁగాఁబోలు పాండవులపై నభిమానముఁ జూపుచుండెను. అర్జునునకు విలువిద్య నేర్పుటలోను పాండవుల కర్ధ రాజ్యమును మొదట నిప్పించుటలోను గోగ్రహణ కాలమున నర్జును నజ్ఞాత వాసవత్సరసమాప్తిఁ గృత్రిమముగ భీష్మునివలనఁ దెలిసికొనుటలోను సంధి సమయములోను, ధర్మజుఁ బట్టివసని పట్టకపోవుటలోను ద్రోణుని పాండవ పక్షపాతము స్పష్టపడి యున్నది. భాస మహాకవి "పంచరాత్ర నాటకము"న ద్రోణుని పాండవ పక్షపాతమును బాగుగఁ జిత్రించి యున్నాఁడు. ద్రోణున కుభయ పక్ష వీరులు మృతినొందినచోఁ దన కుమారునకు మహా రాజ్యాభిషేకముఁ జేయఁ గృత్రిమాలోచనము కలిగియున్న దనియు భీమునిచే నశ్వత్థామ చచ్చె ననుమాట వినఁబడఁగనె తన కోరిక వ్యర్థమాయె నని యస్త్ర సన్న్యాసముఁ జేసి యున్నాఁడనియు "భట్టనారాయణ మహాకవి" వేణీసంహార నాటకమున ద్రోణస్వభావముఁ జిత్రించి యున్నాఁడు. నాటక కథలు నిజమన వీలులేదు. కాని యుభయపక్షవీరుల నాశమునకుఁగూడ ద్రోణుఁ డిష్టపడె ననియు నాతనికి రాజ్యతృష్ణ కలిగియున్న దనియు, స్వామిద్రోహ మిత్రద్రోహ వీరహణ (వీరులఁజంపినవాఁడు వీరహణుఁడు. అతఁడు మహాపాపి యని వేదమునఁ గలదు.) దోషములు ద్రోణునకు గల వనియుఁ జెప్పవచ్చును. ద్రోణునిలో సుగుణములు లేకపోలేదు. కురు పాండవవీరులకే కాక తన్నుఁ జంపువాఁ డని తెలిసిన ధృష్టద్యుమ్ననకుఁగూడ నస్త్రవిద్యఁ జెప్పిన త్యాగి ధృష్టద్యుమ్నుఁడు ద్రోణవధముకే ద్రుపదునిచేఁ బెన్పఁబడె ననియు అవృత్తాంతము ద్రోణుఁ డెఱిఁగి యుండియు నస్త్రవిద్య దనయింట ధృష్టద్యుమ్ను నుంచుకొని చెప్పె ననియు మహాభారతమునఁ గలదు.

[2]"ద్రోణుఁడు ధృష్టద్యుమ్నుని దనయింటికి రప్పించి భవితవ్యదైవకర్మము నను వదల్చుకొనశే మని బుద్ధిమంతుఁ డగుటచేఁ దలఁచికొని తనకీర్తిని రక్షించుకొనుటకై యస్త్రవిషయ కోపకారము నాతనికిఁ జేసెను."

---

1. ద్రోణపర్వ 151 అధ్యాయ.
2. శ్లో॥ ధృష్టద్యుమ్నంచ పాంచాల్య మానీయ స్వం నివేశనం
ఉపాకరో దస్త్రహేతో ర్భారద్వాజః ప్రతాపవాన్

ద్రోణుఁడు ధనుర్విద్యోపదేశమున మహోపాధ్యాయుఁడు. నానాదేశ రాజకుమారు లాతనికడ నస్త్రవిద్యల నేర్చిరి కర్ణార్జునాది మహావీరు లాతని శిష్యులు. సాత్యకి ప్రద్యుమ్నాభిమన్యాదు లాతని ప్రశిష్యులు కాని యాయస్త్ర విద్యాప్రదానమె యప్పటి మహాయుద్ధమునకు వీరవంశ నాశనమునకు దేశోప ద్రవమునకుఁ గారణమైనది. అస్త్ర శస్త్రాతిశయము వీరాధిక్యము, దేశోద్ధరణము నకు దేశోపప్లవమునకు నాఁడు మొదలు నేఁటివఱకు సమానముగానే యుపయో గించుచున్నవని మహాభారత యుద్ధము మొదలు మొన్నటి యైరోపా మహా యుద్ధము వఱకుఁగల యనుభవముచే మన మూహింపవచ్చియున్నది. మొత్తమునకు ద్రోణుఁడు పాండవ పక్షపాతి

## కృపుఁడు

కృపుఁ డారంభాచార్యకత్వముఁ గురుపాండవులకుఁ జేసియున్నాఁడు. ఇతఁడు "శరద్వతుఁ" డను క్షత్రియ లక్షణములు గల బ్రాహ్మణునకుం "జానపది" యను "అచ్చర"కుఁ బుట్టిన సంకీర్ణుఁడు. "శంతన మహారాజు" కృపుని తలిదండ్రు లరణ్యమున విడువఁగ శిశుత్వముననె తెచ్చి పెంచి పెద్ద వానిఁగఁ జేసియున్నాఁడు. ఈ కృపుఁడు పాండవులు మహాప్రస్థానమున కరుగు నాఁటికిఁగూడ జీవించియుండుట యాశ్చర్యకరము చిరంజీవు లేడుగురిలో నీ కృపుఁ డొకఁడని ప్రాచీనులు వ్రాసియుండిరి. (కృపాచార్యుఁడు జనమేజయుని పుత్రుఁడగు "శతానీకున"కును ఆచార్యుఁడైనట్లు హరివంశాదులలోఁ గలదు. ఆ కృపుఁ డీకృపుఁడు కాక తద్గోత్రజుఁడై యుండును. గోత్రర్షినామముతోఁ బ్రవర్తించుట ప్రాచీనుల కభిమతము )

కౌరవులకూడుఁ దినుటలో నీతడు కౌరవ పక్షముగఁ బోరెను. కాని సంకీర్ణులగు పాండవ పక్షమున మాటలాడువాఁడు మహాయుద్ధములో "సుకే తుఁడ"ను పాంచాలవీరు నొక్కనినె వధించెను. సౌప్తిక వధములోఁ బాండవాప కారముఁ జేయుటచే నీతనిఁ బాండవులు పట్టాభిషేకానంతరము విశేషముగా గౌరవింపలేదు కాని మహాప్రస్థానిక సమయమునకుఁ గృపునితో నెప్పటిపరిచితి కలుగుటచేఁ బరీక్షిత్తుఁ గృపుని శిష్యునిగఁ జేసి యాతని సత్కరించిరి. ధర్మ జుని పట్టాభిషేక సమయమునఁ గృష్ణునిద్వారా ధర్మజునకుఁ జెప్పించుకొని కృపుఁడు పట్టాభిషేకముఁ జూచుట కనుమతినొందియున్నాఁడు. పట్టాభిషేకా నంతరము కృపుని గృహమున కాతని నంపిరి అనగా నతని యింట నాతని నుండనిచ్చిరనిమాత్రము తోఁచును.

---

అమోక్షణీయం దైవంహి భావిమత్వా మహామతిః
తథా తత్కృతవాన్ ద్రోణ ఆత్మకీర్త్యనురక్షణాత్.
-ఆదిపర్వ 187 అధ్యాయ.

# విదురుఁడు

విదురుఁడు పాండవపక్షపాతులలో ముఖ్యుఁడు. ఈతనికి "క్షత్తృ" శబ్దము మహాభారతమున వాడఁబడియుండెను. క్షత్తృశబ్దము "రథసారథి" పరముగా [1]వైదికవాఙ్మయమున వాడఁబడినది. మనుస్మృతిలో [2]శూద్రునకు క్షత్రియస్త్రీయం దుద్భవించిన ప్రతిలోమ జాతీయుఁడుగాను, అతని "వృత్తి" కలుగులలో నుండు "ఉడుము" మొదలగు జంతువుఁ బట్టుటయు నని కలదు. అమరకోశమున క్షత్తృశబ్దమునకు [3]సారథి ద్వారపాలకుఁడు శూద్రునకు క్షత్రియస్త్రీయం దుద్భవించినవాఁడు నను నర్థములు వ్రాయఁబడినవి "నానార్థ రత్నమాల"యందు దాసికొడుకు, మఱియొకవలన గనఁబడినవాఁడు నను నర్థములుకూడ వాడఁబడినవి. మహాభారతమున విదురోత్పత్తిఘట్టములో విదురుఁడు వ్యాసున కంబికయొక్క దాసియందుఁ బుట్టినటులను ఆమెకు విదురుఁ డుద్భవించిన పిమ్మట [4]దాస్యము లేకుండినటులను ఆమెను విచిత్రవీర్యుని క్షేత్రముఁ (భార్యగా) బరిగణించినటులను [5]సూచింపఁబడినది.

(పైఁ జెప్పఁబడిన యర్థములలో దాసికొడుకు అను నర్థము పొసఁగి యున్నది. లేక వ్రతస్థుఁడగు వ్యాసుఁడు స్త్రీసంపర్కముచే నపకీర్తి గాన, తత్కాలమున శూద్రావస్థయం దుండి విచిత్రవీర్యుని క్షేత్రముగాఁ బరిగణింపఁ బడుటచే క్షత్రియ యైన (విదురుతల్లి) యామె యందుద్భవించుటచే "ననులోమ" సంబంధ మని యెంచి గ్రంథకర్తలు విదురుని క్షత్త యని వ్రాసియుందురు.)

ఎటులైనను విదురుఁడు సంకీర్ణుఁడే. అందువలననే సంకీర్ణజాతి వారగు పాండవులపై ననురాగము. వ్యాసుఁడు "జయ"మునందు (వ్యాసభారతమున) విదురుఁడు పాండవహితుఁ డని స్పష్టముగా వ్రాసినటుల ననుక్రమణికలో స్వర్గము నొందినవారి కెటులు దేవేంద్రుఁడు సుఖముఁ గలుగఁజేయునో విదురుఁ డటులు నిత్యము బహిరంగముగను రహస్యముగను పాండవులకగు నపకారములనుండి రక్షించుచుండెను అని వ్రాయుటచే నూహింపవలసియున్నది. మహాయుద్ధమునకుఁ బూర్వము విదురునకుఁ బాండవులపై నభిమాన ముండెడిది. కాని యుద్ధములోఁ బాండవు లొనర్చిన యన్యాయకార్యములచే నాతనికిఁ బాండవులపై నభిమానము వాసెను. మృతపుత్రులగు ధర్మజాదుల నోదార్పనైన

1. తైత్తిరీయబ్రాహ్మణము (3-4)
2. మనుస్మృతి (10, 12), (10 49)
3. నామలింగానుశాసనము నానార్థవర్గ
4. ఆదిపర్వ (106-37)
5. ఆదిపర్వ (106-38)

నోదార్పలేదు. పట్టాభిషేక సమయమున ధర్మరాజు విదురునకు "సంధి విగ్రహాద్యధికారముల నిచ్చినటుల నున్నది కాని ధృతరాష్ట్రుని నీవే రాజువని చెప్పుటవంటిదే యీ యధికారము కూడ నని తోఁచుచున్నది. పట్టాభిషేకానంతరము ధర్మజుని కాతఁ డేయుపదేశమునుఁ జేయలేదు. ధర్మజుఁ డతని నేయాలోచనము నడుగలేదు. ధృతరాష్ట్రుని భీముఁ డవమానించు పద్ధతిఁ జూచి ధృతరాష్ట్రుని వనవాసోన్ముఖునిగా విదురుఁడే చేసియున్నాఁడు. విదురుఁడు ధృతరాష్ట్రునితో వనోన్ముఖుఁ డగునప్పుడు ధర్మజుఁడు మాటకైన విదురుని నివారింపలేదు. చివరదశలో ధర్మజుఁడు తణుమ విదురుని "క్షత్త" (దాసికొడుకా!) యనియే సంబోధించుటఁ జూడ ధర్మజ విదురుల కన్యోన్య ప్రేమానుబంధము వీడినటులఁ దోఁచును. భాగవతములో విదురుఁడు గాంధారీ ధృతరాష్ట్రుల కుద్బోధముఁజేసి ధర్మజాదులకుఁ దెలియకుండఁగనే రహస్యముగ వనమునకుఁ దోడ్కొని పోయినటులను అచట వారు మృతినొందినటులను గలదు.

ఆ కథాసరణి నాలోచింపగాఁ బాండవులచే యుద్ధానంతరము బాధల నొందలేక దుర్యోధనుకడ నుండు దోషములచే విదుర సంజయులును దుర్యోధనునకుఁ దల్లిదండ్రులగుటచే గాంధారీ ధృతరాష్ట్రులును వనమునకుఁ బలాయితులై యచట నగ్నిలోఁబడి గాంధారీ ధృతరాష్ట్రులును పిదికోనో పడి విదురుఁడును మృతి నొంది యుందు రనియు, సంజయుఁడు వనములో నెచటనో మృతినొంది యుండు ననియుఁ దోఁచును. భాగవతగాథ మహాభారతాంతర్గతమగు "ఆశ్రమవాస పర్వ" గాథకు విరుద్ధముగా నున్నది (అందువలననే కాఁబోలు కొందఱు ఆశ్రమవాస పర్వము పిమ్మటఁ గూర్పబడెనని తలఁతురు.)

మహాభారతములోని వర్ణనాంశములచే విదురుఁడు రాజనీతి విశారదుఁ డనియు భక్తాగ్రేసరుఁడనియు విరాగి యనియుఁ దోఁచును దుర్యోధనునకెపుడును విదురుఁడనిన భీతియే; విదురుఁడెపుడును దుర్యోధనుకెదురు చెప్పువాఁడే. విదురుఁడు లేనియెడల ధృతరాష్ట్రున కేకార్యమునుఁ దోఁచునదికాదు. ఒకప్పుడు విదురుని పాండవ పక్షపాతమును సహింపక ధృతరాష్ట్రుఁ డాతనిఁ బాండవుల కడకే పొమ్మనెను. అపుడు విదురుడు వనమునందున్న పాండవులకడకేగ ధృతరాష్ట్రుఁడు విదురుని విడిచియుండలేక సంజయునిచే వర్తమానముఁజేయించి విదురుఁ దిరిగి రప్పించుకొనెను పాండవులకు విదురుఁడు లాక్షాగృహదహన సమయమునను అర్ధ రాజ్యము నిప్పించు సమయమునను ద్యూత కాలమునను సంధికిఁ గృష్ణుఁడు హస్తిపురికి వచ్చినపుడును వాక్కర్మలచే విశేష సహాయముఁ జేసియున్నాఁడు లాక్షా గృహదహన కాలమున విదుర సహాయము లేకుండిన పాండవులగతి యేమగునో యూహింపఁ జాలము.

## వ్యాసుఁడు - (కృష్ణద్వైపాయనుఁడు)

వేద విభాగమును పురాణములను బ్రహ్మ సూత్రములను మహాభారత సంహితను జేసినవాఁడు వేద వ్యాసుఁడనియు నాతఁడు కృష్ణద్వైపాయన ద్వైపాయన బాదరాయణ సాత్యవతేయాది నామములు కలవాఁడనియు సామాన్యముగా నందఱును దలఁతురు. కాని వేదవిభాగ కర్తలు పౌరాణికులు బ్రహ్మసూత్ర స్మృతి, శిక్షా. భారత సంహితాకర్తలు వేర్వేఱుగా నుండిరని తలఁపరు. విష్ణు కూర్మ దేవీ భాగవత బ్రహ్మాండ భాగవత పురాణములలో వ్యాసులు పెక్కండ్రు కలరని కలదు. విష్ణు కూర్మ బ్రహ్మాండ దేవీ భాగవత పురాణములలో నిరువదెన మండ్రు వ్యాసు లాయా యుగములలో వేదవిభాగముఁ జేసినటుల కలదు. వేదాను క్రమణికలం జూచినయెడల నేయే వ్యాసుఁ డేయే వేదభాగములకుఁ గర్తయో తెలియనగును. "వ్యాస" యను నది బిరుదము కాని స్వతస్సిద్ధమగు పేరుకాదు. వ్యాస శబ్దమునకు నీ విధమగు నిర్వచనము చెప్పఁబడెను.

[1]ఏ హేతువుచే వేదములను విస్తరింపఁజేసెనో ఆ హేతువునే వ్యాసుఁడని చెప్పఁబడెను.

ఇరువదెనమండ్ర వ్యాసుల పేరుల నీ క్రిందను దేవీభాగవతము ననుసరించి వ్రాయుచు విష్ణు కూర్మ పురాణములలోఁ గల భేదముల నుదాహరింపుచు వేదాను క్రమణికల ననుసరించి వేదములలో వారి కెంతెంత భాగమున్నదనియు వారు చేసిన యితర గ్రంథములను నాకుఁ దెలిసినంతవఱకు వ్రాసి పిమ్మటఁ గృష్ణద్వైపాయనుని గుఱించి వ్రాసెదను. ఇందుఁ జెప్పబడిన "మంత్రద్రష్టలు" కొందఱు దేవతలగా స్థూలదృష్టికిఁ గాన్పింతురు కాని వారు దేవతలు కారనియు ఆ పేరుగల ఋషులే యనియుఁ దలంపవలయును.

## స్వాయంభువు

ఈతఁడే వేదములను విభజించినవాఁడు "మనువు" పేరుతోఁ గొన్ని ఋక్కులు సామములు కూడ కలవు. ఈతనినే "స్వాయంభువు మను"వని కూడ పురాణములు వాకొనుచున్నవి. విష్ణుపురాణములో మొదటి వ్యాసుడు "బ్రహ్మ" యని కలదు. బ్రహ్మపేరితో "అథర్వ వేదములో" 100 సూక్తములున్నవి. కృష్ణ యజుర్వేదములో నొక కాండము కలదు.

---

1. "వివ్యాస వేదాన్ యస్మాత్స తస్మాద్వ్యాస ఇస్మృతః"
ఆదిపర్వ. 63 అధ్యా.

## [1]ప్రజాపతి

ఈతఁడు కృష్ణయజుర్వేదములోఁ దొమ్మిది (9) కాండములకుఁ గర్త. సామాథర్వవేదములలోఁ గొన్ని నామములు సూక్తములు కూడఁ గలవు. ఈతనిని "కశ్యప ప్రజాపతి" యనుపేరుతోఁ గొన్ని పురాణములు చెప్పుచున్నది.

## ఉశనుఁడు (శుక్రుఁడు)

"ఉశన" నామముతోఁ గొన్ని సామములు శుక్రనామముతోఁ న్నియథర్వ సూక్తములుం గలవు. శుక్రునకు "ఉశన" నామము నిఘంటువుల గలదు. శుక్రనామముతో నీతిశాస్త్రమును ఉశనానామముతో నొకస్మృతియుఁ[2] బ్రసిద్ధములై యున్నవి. భార్గవ పురాణ మను పురాణము కూడఁ గలదు శుక్రునకు భార్గవనామము కూడ ప్రసిద్ధము.

## బృహస్పతి

కృష్ణయజుర్వేదములోఁ దొమ్మిది (9) కాండములకుఁ గర్త. ఋగథర్వ వేదములలోఁ గొన్ని సూక్తములును సామవేదములోఁ గొన్ని సామములు నీతని పేరునఁ గలవు.[3] బృహస్పతి స్మృతి, బృహస్పతి నీతిశాస్త్రము కూడ గలవు.

---

1. కశ్యప నామముతోఁ గొన్ని ఋక్కులు సామములు కలవు. అచట "మీ కాశ్యపుడు" అనుటచే నీతఁడు వేఱని తెలియవలసియున్నది.
2. ఔశనస్మృతి.
3. మంత్ర ఋషులు కాండఋషులు నని వేదఋషులు రెండు విధములుగా నుందురు. దీనిని గుఱించి అరుణము (4—1—1)లో నిట్లున్నది: "నమఋషిభ్యో మంత్రకృద్భ్యో మంత్రపతిభ్యః" అని పై మంత్రమునకు భాష్యముఁజేయుచు విద్యారణ్యులు "మంత్రకృద్భ్యః" మంత్రం కుర్వంతీతి మంత్రకృతః యద్యప్యపౌరుషేయే వేదే కర్తారో వసంతి. తథాపి కల్పాదావీశ్వరానుగ్రహేణ మంత్రాణాం లబ్ధారో మంత్రకృత ఇత్యుచ్యంతే. తథాచస్స్మర్యతే
"యుగాంతేంతర్హి తాన్వేదాన్ సేతిహాసాన్ మహర్షయః లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతా స్స్వయంభువేతి॥...... సంప్రదాయ ప్రవృత్త్యా మంత్రాణాం పాలనాన్మం త్రపతయ ఇత్యుచ్యంతే" అని వ్రాసియున్నారు. పై మంత్ర భాష్యముల యర్థముల నాలోచింపఁగా మంత్రకృత్తులనగా మంత్ర ఋషులనియు మంత్రపతులనగా కాండఋషులనియుఁ దాత్పర్యమగుచున్నది. వేద "మపౌరుషేయ" మని భారతీయులలోఁ బెక్కండ్రయభిప్రాయము. దానిని విద్యారణ్యులు కల్పాదినీశ్వరానుగ్ర

## సవిత

"ఆదిత్య" నామముతోఁ గొన్ని ఋక్కులు సవితయను నామమునఁ గొన్ని యథర్వసూక్తములును గలవు. ఆదిత్య సవితృ నామములు సూర్యపరమై యున్నవి. సూర్యునినుండియే శుక్లయజుర్వేదము పుట్టెనని పురాణములు వాకొను చున్నవి. అరుణ నామమునఁ గృష్ణయజుర్వేదములో నొక కాండము కలదు.

## మృత్యువు

"మృత్యు" నామముతో వేదములోను పురాణములలోను గ్రంథమేదియుఁ గాన్పింపలేదు కాని "కఠోపనిషత్తు"నందు మృత్యువను నాచార్యునిచేఁ జెప్పఁ బడిన కొంతభాగమున్నది. యమనామముతోను యమీనామముతోను వైవస్వత నామముతోను ఋక్సామాథర్వ వేదములలో సూక్తములు నామములు కొన్ని కాన్పించుచున్నవి ఋగ్వేదము యొక్క దశమమండలములో వైవస్వతయముఁ డనియు యమఋషి యనియు ఇద్దరు మునుల యొక్క సూక్తములున్నవి. సామవేద ప్రథమ పర్వమున "మృత్యు వాహోహితుఁడ"ను నొక ఋషి కలఁడు. యమి యను నామె వైవస్వతీ నామముతో నొకతె కలదు. ఆమె యముని జాయయో సోదరియో తెలియదు ఆమె పేరున ఋగ్వేద దశమండలమునఁ గొన్ని సూక్తములు కలవు. పురాణములలో యమున కలదు. ఆమెయే యమునా నది. యముని పేరున స్మృతికూడ కలదు.[1]

## ఇంద్రుఁడు

ఇంద్రనామముతో ఋగ్వేద దశమ మండలమునఁ గొన్ని సూక్తములు కలవు వైకుంఠుఁడగు నింద్రుఁడొకఁడు ముష్కములుగల యింద్రుఁడొకఁడును ఇరువురు ఋగ్వేద ఋషులు కాన్పించుచున్నారు. (క్రీ. శ. 16 శతాబ్దారంభ మున నంది తిమ్మన ముక్కు పెద్దదగుటచే ముక్కు తిమ్మన్న యైనటుల) అండములు పెద్దవగుటచే నీతనిని "ముష్క వానింద్రః" అని ఋషు లు చెప్పిరి. సూక్తప్రవక్తలగు యమ సవిత ఇంద్రాదులను దేవతలనుగాఁ దలఁపరాదు ఇంద్ర యమాది మునులు తమ సూక్తములలో ఇంద్ర యమాది దేవతలనే నుతించి

హాముచే మంత్రములఁ బొందినవారని సమర్థించుట గమనింపవలసి యున్నది. నా తాత్పర్యమేమన భగవదనుగ్రహముచే జ్ఞానమునొంది వానిని ఛందోరూపముగా గానముఁ జేసినవారు మంత్రఋషులు. ఆయా ఋషిప్రోక్త మంత్రములు నొకటిగా సమకూర్చినవారు మంత్రపతులు. వారే కాండఋషులు అని.

1. యమస్మృతి.

యున్నారు. ఇంద్రనామముతో వేఱుగ్రంథములు కాన్పింపవు. పై నుడువఁబడిన యమేంద్రాదులను మునులే ధర్మజార్జునులకుఁ బితలు కావచ్చును. వాయువను ఋషి యొకఁడు కలఁడు. అతఁడే భీమజనకుఁడై యుండును.

## వసిష్ఠుఁడు

ఋగ్వేదములో నేడవ మండలమునకు ఋషి. సామాథర్వవేదములలోఁ గొన్ని సామములను సూక్తములు కూడ కలవు. వసిష్ఠధర్మశాస్త్ర మొండు కలదు. వసిష్ఠ రామాయణము కూడ కలదుగాని అది కాశ్మీరదేశమునఁ గొన్ని శతాబ్దములకుఁ బూర్వము నందున్న ''అభినందనపండితుని''చే జేయఁబడినదని దానిఁజదువగా నాకుఁ దోఁచినది.

## సారస్వతుఁడు

ఈతని పేరునఁగల గ్రంథమేదియుఁ గాన్పింపలేదు. తైత్తిరీయ బ్రాహ్మణమున సారస్వతాధ్యాయములు మాత్రము కొన్ని కాన్పించుచున్నవి. అవి సౌత్రామణి యజ్ఞ సంబంధమైనవి. బ్రాహ్మణుల యిండ్లలోనగు వివాహసదస్య కాలమున వానిని ముఖ్యముగఁ జెప్పుదురు.

## త్రిధాముఁడు

ఈతని పేరుఁగల గ్రంథమేదియుఁ గాన్పింపదు. కాని ఋక్సామ వేదములలోఁ గొన్ని సూక్తములు సామములు త్రితత్రిశోక త్రిశిరనామములతో నున్నవి కాన్పించుచున్నవి.

## త్రివృషుఁడు

త్రిధాముని గ్రంథములవలెనే యీతని గ్రంథములును మృగ్యములు. కూర్మ పురాణములో త్రివమని స్థానమున వృషభుఁడు పేర్కొనఁబడెను. ఆ పేరునఁ గల గ్రంథములను గాన్పింపవు కాని ఋగ్వేదములో ఋషభుఁడను ఋషి యొక్క సూక్తములు కొన్ని కాన్పించుచున్నవి.

## *భరద్వాజుఁడు

ఋగ్వేదములోని యేడవ మండలమున కధిపతి. సామవేదములోఁ గొన్ని సామములు నథర్వములోఁ గొన్ని సూక్తములు నీతనివై యున్నవి. మఱియు భరద్వాజశిక్ష భరద్వాజకల్పము భరద్వాజ సంహిత యను ధర్మశాస్త్రము కూడ

* అపస్తంబుని కల్పసూత్రములలోలేని పితృమేధ బ్రహ్మమేధముల గూర్చి భరద్వాజుఁడు "కల్పసూత్రములఁ" జేసెను అపస్తంబునకు శిష్యుఁడగు నాభరద్వాజుఁడు వేదవిభాగకర్త కాక క్రీ.పూ. పదియవ శతాబ్దపుప్రాంతమున నుండు వేఱొక డుండెను.

కలదు. భరద్వాజుఁడు వ్యాకరణశాస్త్రముఁ జేసెనఁట! కూర్మపురాణములో భరద్వాజుని స్థానమున "శతతేజుఁ" డను ఋషి పేర్కొనఁబడెను. కాని శతతేజుని గ్రంథమేదియుఁ గాన్పింపదు. భరద్వాజునకు శతతేజుఁడను పేరు కలదేమో! భరద్వాజ శిక్షపై నాంధ్రుఁడగు "వెలమకన్ని సూరావధాని" భాష్యమొండు కలదు సూరావధాని యెప్పటివాఁడో తెలియదు.

## అంతరిక్షుఁడు

ఈతని గ్రంథమేదియుఁ గాన్పింపదు కాని "నభఃప్రభేదనుఁడు, వైరూపుఁడు" నను నామములు గల ఋషి ప్రోక్తములగు కొన్ని ఋక్కులు ఋగ్వేద దశమమండలమునఁ గాన్పించుచున్నవి. నభఃప్రభేదన, వైరూప శబ్దములు అంతరిక్ష శబ్దార్థములుగా ధ్వనియగుచున్నవి. కూర్మ పురాణములో నంతరిక్షుని స్థానమున "ధర్మ్యఁడు" అని కలదు. తాపసుడగు "ధర్ముని" సూక్తములు కొన్ని ఋగ్వేదమునఁ గలవు

## ధర్ముఁడు

ధర్ముని సూక్తములు ఋగ్వేదమునఁ గొన్ని కలవనియు అతఁడు ఋషియనియుపైని వ్రాసియున్నాను. ధర్ముని గ్రంథమేదియు వేఱు కాన్పింపదు. కూర్మ పురాణములో ధర్మునిస్థానమున "తరసుఁడు" చెప్పఁబడెను. తరసుని వృత్తాంతము గ్రంథాంతరముల నుండునేమో చూడవలసియున్నది.

## త్రైయ్యారుణి

"వైతహవ్య అరుణి" అరుణి అను ఋషిప్రోక్తములగు సూక్తములు ఋక్శుక్లయజుర్వేదములలోను సామశుక్ల యజుర్వేదోపనిషత్తులలోను కొన్ని కాన్పించుచున్నవి కాని "త్రైయ్యారుణి" కృత గ్రంథమేదియుఁ గాన్పింపదు.

వైతహవ్యఅరుణి అనుటచే వీతహవ్యుని కుమారుఁడగు అరుణి యను నర్థము కల్గుచున్నది. ఆ కాలమున మఱియొక యారుణి యుండునటుల స్పష్టము. కఠ. ఛాందోగ్య, బృహదారుణ్యకోపనిషత్తులలోను భారతమునఁ బెక్కుచోటులను మఱియొక యారుణిచరిత్రము కాన్పించుచున్నది. అతనికి నుపనిషత్తులలోను భారతములోను పాంచాలారుణి అను పేరు కలదు. అతఁడు శుక్లయజుశ్శాఖా ప్రవర్తకుఁడగు యాజ్ఞవల్క్యమహర్షి కాశాఖలో నాచార్యకుఁడని బృహదారుణ్యకోపనిషత్తులోని గురుపరంపరలో గలదు. ఆ యంశము శ్వేతకేతు యాజ్ఞవల్క్యుల చరిత్రమున విశదీకరింతును. ఆ పాంచాలారుణి వేదగురువగుటచే నాతని నొక వ్యాసునిగాఁ బిమ్మట నుండినవారు వ్యాసుఁడనిరేమో!

5357

## ధనంజయుఁడు

గోత్రప్రవరఖండములో విశ్వామిత్ర పరంపరగల "ధనంజయుఁడ"ను నొక ఋషి కలఁడు. ఆతఁడు గోత్రప్రవర్తకుఁడనియేకాని యాతని గ్రంథము మృగ్యమైయున్నది. "ధనంజయ" శబ్దమునకు "అగ్ని"యను నర్థము కలదు. అగ్నిఋషి కృష్ణయజుర్వేదమునం దేడుకాండల కధిపతిగా నున్నాఁడు.

## మేధాతిథి

ఋక్సామాథర్వ వేదములలోఁ బెక్కు సూక్తములు సామములు మేధాతిథి ద్రష్టములై యున్నవి. కూర్మ విష్ణు పురాణములలో "మేధాతిథి" స్థానమున "క్రతుంజయుఁ"డని కలదు మేధాతిథి యజ్ఞముఁజేయగా నింద్రుఁడాయజ్ఞముఁ జెఱుప మృతమేషమునం బ్రవేశించినటులను మేధాతిథి యింద్రునిఁ జయించినటులను వేదమున నొకగాథ కలదు "సుబ్రహ్మణ్యాచ్ఛంసి" యను యజ్ఞఋత్విక్కు "మేధాతిథేర్మేష" యని యజ్ఞములలో నింద్రునాహ్వానించుట వైదికులకు విదితమైయున్నది అందువలన మేధాతిథి "క్రతుంజయ" బిరుదముకలవాడై యుండెనేమో? అంగిరసుని పుత్రుఁడగు మేధాతిథి, కణ్వపుత్రుఁడగు మేధాతిథి యను నిరువురు వేదఋషులు కలరు ఇందే మేధాతిథికి వ్యాస బిరుదము కలదో తెలియదు. కణ్వపుత్రుని సూక్తములు విస్తారముగా ఋగ్వేదమునఁ గలవు. కాన కాణ్వుఁడే వ్యాసుఁడని తలఁతును.

## ఋతుంజయుఁడు

ఈతని గ్రంథమేదియుఁ గాన్పింపదు. విష్ణుపురాణములో ఋతుంజయుని స్థానమున "సంజయుఁడు" అని చెప్పఁబడెను. సంజయుని గ్రంథములు నాతని చరితమువలెనె మృగ్యములు.

## అత్రి

ఋగ్వేదములోని యైదవ మండలమున కధిపతి. అత్రిస్మృతియొం దరుదు. విష్ణు కూర్మ పురాణము "అత్రి" స్థానమున భరద్వాజునిఁ నిల్పినవి. ఇదివఱకొక భరద్వాజుఁ జెప్పియుండుటచే నత్రియే వ్యాసుఁడై యుండునని ఋగ్వేదములోని యొకమండలమున కధిపతి యగుటచే నూహింపవలసి యున్నది. ఇద్దఱు వ్యాసులైన భరద్వాజులుండి నటులఁ గాన్పింపదు. అత్రివంశజుల సూక్తములు సామములు కూడ ఋక్సామవేదములఁ బెక్కు కాన్పించుచున్నవి.

## గౌతముఁడు

ఋగ్వేదములోఁ బెక్కు సూక్తములు సామవేదములోఁ గొన్ని సామములు నీతనివై యున్నవి. గౌతమకులజులగు నోధా మొదలగువారును బెక్కు సూక్త

ములకు ఋగ్వేదములోఁ గర్తలై యున్నారు. సూత్రరూపకమగు ధర్మసూత్రములకును శ్లోకరూపకమగు ధర్మశాస్త్రమునకు న్యాయదర్శనమునకు నీతఁడు కర్తయై యున్నాఁడు.

## ఉత్తముఁడు

పురాణములలో నీపేరు కలవాఁడు మూఁడవ మనువు. ఉత్తమ నామముఁడు కర్తగా గల గ్రంథము లేవియుఁ గాన్పింపటలేదు గాని మనునాముఁడు కర్తగాఁ గలవి ఋక్సామవేదములలో సూక్తములు, సామములు కొన్ని కాన్పించును. స్వాయంభువునుఘనకు బ్రహ్మయని పేరుండుటచే మను వనునపుడు "ఉత్తముఁ" డనియు బ్రహ్మ యన స్వాయంభు వనియు "అనుక్రమణికలం" జేసినవారి తాత్పర్యమై యుంతును అందువలన నీతఁడు ఋక్సామవేదములలోఁ గొంతకు భాగస్వామి యని తలఁతును. కూర్మపురాణము "వాధ్ర్యశ్వుఁడు" అని వాని నుత్తముని స్థానమునఁ జెప్పుచున్నది. వాధ్ర్యశ్వనాముఁడు కర్తగాఁ గల గ్రంథ మేదియుఁ గాన్పింపదు

## వేనుఁడు (వాజశ్రవసుఁడు)

వేనుఁ డను చక్రవర్తి కాఁ డీతఁడు వేమనకు వాజశ్రవస ఉద్దాలకి నామము లుండినటులఁ బురాణములవలనను కఠోపనిషత్తువలనను దెలియనగును. వేనుఁడు ఋషిగాఁగల సూక్తములు ఋగథర్వ వేదములలోఁ బెక్కు లున్నవి. ఆరుణి ఉద్దాలక నామములతో ఛాందోగ్య బృహదారణ్యకోపనిషత్తులలోఁ గొన్ని బ్రాహ్మణములు ఖండలు కాన్పించుచున్నవి. వాజశ్రవస నామముతో నిండిన గ్రంథమేదియుఁ గాన్పింపదు. వాజశ్రవసుఁడు గొప్ప యన్నప్రదాత యనియు, సత్రయాగములో సర్వము దాన మిచ్చుటయే కాక నచికేతుఁడను కుమారుఁగూడ కుమారుననుమతి మీఁదనె యాడినమాటఁ దప్పకుండఁగ మృత్యువునకు దాన మిచ్చె ననియు తైత్తిరీయ బ్రాహ్మణమువలనను కఠోపనిషత్తువలనను దానిఁ దెలిఁగించిన "దగ్గుపల్లి దుగ్గయ్య, మిక్కిలి మల్లికార్జున" కవుల నాచికేతూపాఖ్యానములవలననుఁ దెలిసికొనఁగలము.

## సోముఁడు

సోముఁడు కృష్ణయజుర్వేదమునఁ దొమ్మిదికాండములకు ఋషి. ఈతనివి కొన్ని సామములు కూడఁ గలవు వ్యాకరణ మొండు కలదు. విష్ణు కూర్మ పురాణములు సోమునకు బదులు సోమశుష్మాయణుం డని తృణబిందుఁ డని చెప్పినవి. సోమశబ్దసామ్యముచే యజుర్వేదానుక్రమణిక చంద్రుఁడని చెప్పినది అన్నియు నొక్క యర్థము కలవియే.

## తృణబిందుఁడు (వాల్మీకి)

తృణపాణి యను ఋషియొక్క సామములు కొన్ని కలవు విష్ణుకూర్మ పురాణములు తృణబిందునిస్థానమున వాల్మీకిం జెప్పియున్నవి.

వాల్మీకిశబ్దము నడుమవచ్చిన నామ మని పౌరాణికులు వాకొనెదరు. అందువలన వాల్మీకియొక్క పూర్వనామము "తృణబిందుఁడు" అనియుండనోపు. తృణబిందునకుఁ దృణపాణియను పేరుకూడ నుండుననియు ఇవి వాల్మీకియొక్క పూర్వనామములై యుండుననియుఁ దలపవలసియున్నది. వాల్మీకి గాయకుఁడు. రామాయణమును వీణపైఁ బాడించె నని రామాయణమునఁ జదివియున్నాము. తృణపాణి కూడ సామగాయకుఁడే. వాల్మీకికిఁ దృణబిందు నామము కలదని పురాణములలోఁ గలదు. కాన తృణబిందు తృణపాణి శబ్దములు వాల్మీకిపరమై యున్నవని నా దృఢాభిప్రాయము. వాల్మీకికృత రామాయణమే లోకములోని ప్రథమ కావ్యము ఈతఁడు లౌకిక కవి కులగురువు ఏ కవియు వాల్మీకిని నుతింపకుండఁగ నుండఁడు. వాల్మీకికృత ప్రాకృత వ్యాకరణ సూత్రములు కలవు. వాల్మీకియొక్క ప్రాకృత సూత్రములపై నాంధ్రులగు "రామానంద, ఎలకూచి బాలసరస్వతి, అప్పయదీక్షితులు" విపుల వ్యాఖ్యానముఁ జేసియున్నారు.* అతని రామాయణముపై నమిత వ్యాఖ్యలు గలవు.

## భార్గవుఁడు

ఋగ్వేద ఋషులలో "చ్యవనుఁడు, స్యూమరశ్మి" యను నిరువురు భార్గవులు కలరు. అథర్వవేదసూక్తములు కొన్ని భార్గవప్రోక్తములు, ప్రసిద్ధి గల చ్యవనుఁడే యిరువదియైదవ వ్యాసుఁడై యుండును. "చ్యవన సంహిత" యను జ్యోతిశ్శాస్త్ర గ్రంథ మొకటి కలదు. భార్గవపురాణ కర్తృత్వము "శుక్రునిదే" యైయున్నది. విష్ణు కూర్మపురాణములు భార్గవుని స్థానమున "శక్తి"యని చెప్పియున్నవి.

## శక్తి (పరాశరుఁడు)

శక్తికృత గ్రంథ మేదియుఁ గాన్పింపదు. విష్ణు కూర్మ పురాణములు శక్తి యొక్క స్థానమునఁ "బరాశరునిఁ" జెప్పియున్నవి. శక్తి పుత్రుఁడు పరాశరుఁ డని మనకుఁ దెలిసియున్నది. పరాశరకృత గ్రంథము లనేకములు

---

* రామానందునకుఁ బూర్వ ...ము చెఱుకూరి లక్ష్మణసుధి. ఈతఁడు వాల్మీకి సూత్రములకు "షడ్భాషా చంద్రిక" యను వ్యాఖ్యాం జేసియున్నాఁడు. ఎలకూచి బాలసరస్వతి "షడ్భాషా వివరణము" అప్పయ దీక్షితులు "ప్రాకృత మణిదీపము" అను వ్యాఖ్యలఁ జేసిరి.

కలవు. ఋగ్వేదములో ననేక సూక్తములు పరాశర కృతములు. పరాశరస్మృతి జగత్ప్రసిద్ధమైయున్నది. పరాశరస్మృతి పదిరెం డధ్యాయములు కలది ముద్రితము నాకడనున్నది; పరాశరస్మృతి యిరువది రెం డధ్యాయములు కలదై యున్నది వ్రాతప్రతిలో సన్న్యాసధర్మము లభిహితములై యున్నవి. దీని నింకను శోధింపవలసియున్నది. పరాశరగృహ్య సూత్రములు పరాశర జ్యోతిషము ప్రసిద్ధిఁ గొందియున్నవి. మఱియు, పరాశరుఁడే సమస్త పురాణ ప్రవర్తకుఁడని విష్ణు పురాణములోఁ గలదు. వ్యాస బిరుదముచే సమస్త పురాణ కర్తృత్వము కృష్ణద్వైపాయనునకే స్థూల దృష్టిచే లోకము కట్టిపెట్టుచున్నది విష్ణు పురాణములోని యాయంశముఁ జెప్పు పరాశరవాక్యములగు రెండు పద్యముల నిట వ్రాయుచున్నాను.

మ. విను మైత్రేయ మదీయ శైశవకథా వృత్తాంత మంభోరుహా
సనపుత్రుండు జగన్నుతుం డగు పులస్త్య బ్రహ్మ యేతెంచి మ
న్నన లేపారఁగ నన్నుఁ గన్గొని పురాణ శ్రేణికిం గర్త వీ
వని నాకున్ వరమిచ్చిపోయెఁ బ్రమదవ్యాపార మేపారఁగన్.

క. అని కారణంబుగా నా, కొదవె పురాణ ప్రవీణ యోగ్యత నీవే
ట్టిది గోరి నన్ను నడిగితి, నది నీకుం జెప్పువాఁడ నాద్యంతంబున్.

పై కారణములచేఁ బురాణ కర్తయగు వ్యాసుఁడు పరాశరుఁడే కాని కృష్ణద్వైపాయనుఁడు కాఁడు.

## జాతుకర్ణి

ఈతఁడు ఋక్శాఖాప్రవర్తకుఁడగు శాకల్యుని శిష్యుఁడై తనకు శాకల్యుఁ డిచ్చిన శాకల్య సంహితను మూఁడు భాగములుగాఁ జేసియు, వేదార్థమును జెప్పుట కుపయోగించు నిరుక్తముఁ జేసియు "బలాక, పైంగ, వేతాళ, విరజ" లను నలుగురు శిష్యులకుఁ జెప్పెనని శ్రీమద్భాగవత ద్వాదశ స్కంధమునఁ గలదు. ఇప్పుడు మనకుఁ గాన్పించు ఋక్సంహిత శాకల్యసంహితయే దీనినే జాతుకర్ణి మూఁడు భాగములుగాఁ జేసియుండును. నేఁడు కాన్పించు నిరుక్తము (వేదనిఘంటువుయొక్క) టీక "యాస్కునిచేఁ" జేయఁబడినది. జాతుకర్ణి యొక్క వేద శాఖలవలెనే యాతని నిరుక్తమును నేఁడదృశ్యమై యున్నది.

జాతుకర్ణి యొక్క యిరువదియేడవ వ్యాసత్వముం గుఱించి కొన్ని కొన్ని సందియములున్నవి. అవి యేవనఁగాఁ జాతుకర్ణిని బురాణము లిరువదియేడవ వ్యాసుఁడనునది.[1] ఈతఁడు శాకల్యుని శిష్యుఁడు. శాకల్యుఁడు "మాండుకేయుఁ" డను మునికడ ఋక్సంహితను నేర్చెను. మాండుకేయుఁడు "ఇంద్రప్రమితి"

1. శ్రీమద్భాగవతము ద్వాదశ స్కంధము ఆఱవ యధ్యాయము.

యనువాని శిష్యుడు. ఇంద్రప్రమితి "పైలుని" శిష్యుఁడు పైలుఁడు వేదవ్యాసుని కడ ఋక్శాఖనంతయుఁ బొందెను అనఁగా జాతుకర్ణి వేదవ్యాసుని శిష్యవర్గములో నైదవతరమువాఁడు. ఇట్టి జాతుకర్ణి, వ్యాసవంశ వృక్షములో నిరువది యేడవ వాఁడు కాఁగా నాతని కైదు పురుషాంతరములకు ముందుండిన కృష్ణద్వైపాయనుఁ డిరువది యెనిమిదవ వ్యాసుఁడెట్లగును? మఱియు జాతుకర్ణి యొక్క గురువునకుఁ గురువగు "ఇంద్రప్రమితి" యొక్క సహపాఠియగు బాష్కలుఁడు "పరాశరుని" గురువని కూడ భాగవతమున నున్నది ఈ పరాశరుఁడు కృష్ణద్వైపాయనుని తండ్రి కాఁడా? ఆలోచింపఁగా జాతుకర్ణియొక్క గురుపరంపరలో మూలపురుషుఁ డగు వేదవ్యాసుఁడు కృష్ణద్వైపాయనుఁడు కాక యేవసిష్ఠుఁడో యై యుండునని తలఁపవలసి యున్నది. లేకుండిన నైదుతరములకుఁ బిమ్మట నుండినవాఁడు ముందుగ వ్యాసుఁడై పిమ్మట మూలపూరుషుఁడెట్లు వ్యాసుఁడగును? పైల జైమిని సుమంతు వైశంపాయనులు వ్యాసశిష్యులని పురాణములలోఁ గలదు. వేదఋషులు పెక్కండ్రొక్క పేరితోఁ బిలువఁబడుట వేదానుక్రమణికం జదివినవారికిఁ దెలియును. ఉదాహరణము కొఱకు కొందఱి నొక్కనామము గలవారిని వ్రాయుచున్నాఁడను:

విశ్వామిత్రు లిరువురు (1) దేవరాతుని పుత్రుఁడు (2) గాధి పుత్రుఁడు.
కణ్వు లిరువురు (1) ఘోరుని పుత్రుఁడు (2) కుసీదుని పుత్రుఁడు.
మేధాతిథు లిద్దఱు (1) ఆంగిరసపుత్రుఁడు (2) కణ్వపుత్రుఁడు.
భార్గవులు ముగ్గురు (1) శుక్రుఁడు (2) చ్యవనుఁడు (3) స్యూమరశ్మి.

ఇట్లే పైల జైమిన్యాదులు వేఱొక వ్యాసుని శిష్యులనుగాఁ దలంపవలసి యున్నది. పూర్వమీమాంసా సూత్రకర్త యగు జైమిని బ్రహ్మసూత్రకర్త యగు బాదరాయణుని శిష్యుఁడు కాఁడు. ఏమనఁ గర్మబ్రహ్మవాది నిర్గుణబ్రహ్మవాదికి శిష్యుఁడా? కాన సర్వవిధముల "జాతుకర్ణి" గురుపరంపరలోని వేదవ్యాసుఁడు వేఱనియుఁ గృష్ణద్వైపాయనుడు వేఱనియుఁ దలఁపవలసి యున్నది. జాతుకర్ణి గురుపరంపర నీక్రిందఁ జూపుచున్నాను.

- వ్యాసుఁడు
  - సుమంతుఁడు
  - జైమిని
  - పైలుఁడు
    - బాష్కలుఁడు
    - [1] ఇంద్రప్రమితి
  - శుకుఁడు
  - వైశంపాయనుఁడు
    - యాజ్ఞవల్క్యుఁడు

1. ఇంద్రప్రమితి వ్యాకరణశాస్త్ర కర్త. దాని నింద్రవ్యాకరణ మందురు.

పరాశరుఁడు మాండుకేయుఁడు శతానీకుఁడు (జనమేజయునిపుత్రుఁడు.)

1 శాకల్యుఁడు

జాతుకర్ణి.

## కృష్ణద్వైపాయనుఁడు

ఇతఁడు లోకమునఁ బ్రసిద్ధినొందిన వ్యాసుఁడు. ఈతని మొదటి పేరు కృష్ణుఁడు ద్వీపమున నివసించుటచే ద్వైపాయనుఁడనియు, సత్యవతీపుత్రుఁడగుటచే సాత్యవతేయుఁడనియు, బదరీవనమున నివసించుటచే బాదరాయణుఁడనియు[2] పరాశరపుత్రుఁడగుటచేఁ బారాశర్యుఁ డనియుఁ బేరులు కలిగెను. ఈతఁడు మహాభారతాంతర్గత మగు "జయ" మను గ్రంథమును రచించెను. అది (8800) యెనిమిదివేల యెనిమిదివందల గ్రంథమని[3] మహాభారతము యొక్క మొదటియధ్యాయమునఁ గలదు. వ్యాసశిక్ష వ్యాసస్మృతి యను గ్రంథములు కూడ సాత్యవతేయ కృతములుగానె యున్నవి

ఏ వేదమునందును కృష్ణద్వైపాయననామముతో నొక్కసూక్తము గాని సామముగాని ఖండగాని కాన్పింపదు కాని పారాశర్యవ్యాసుఁడని కృష్ణయజుర్వేదకారకములో నొక్కవాక్యము మాత్ర మున్నది. ఋగ్వేదదశమ మండలములో మూఁడు (42, 43, 44) సూక్తములు కృష్ణుఁడను ఋషిప్రోక్తములుగాఁ[4]

---

1 శాకల్యుఁడు యాజ్ఞవల్క్యునితో జనకసభయందు నాస్తికవాదముఁ జేసి మృతినొందెను ఈ యంశము బృహదారణ్యకోపనిషత్తునను, బ్రహ్మాండ పురాణమునను జెప్పఁబడియున్నది. శాకల్యుఁడు వ్యాకరణశాస్త్రకర్త, పాణినిచేఁ పేర్కొనఁబడియున్నాఁడు.

2. బ్రహ్మసూత్ర కర్తయగు బాదరాయణుఁడు కృష్ణద్వైపాయనుఁడు కాఁడని లోకమాన్య తిలకుగారు గీతారహస్యములోను శ్రీ పురాణపండ మల్లయ్య శాస్త్రిగారాంధ్రబ్రహ్మసూత్ర భాష్యపీఠికలోను స్పష్టపఱచిన సంగతిఁ జదువఁగా బ్రహ్మసూత్ర కర్తృ బాదరాయణసంబంధము సాత్యవతేయునకు లేదని తలఁతును.

3. మహాభారత రచనా విధాన మను భాగమున వ్యాసకృత భారత వృత్తాంతము విశదపఱచితిని.

4. కృష్ణప్రోక్తములగు (3) సూక్తములను (33) ఋక్కులు మాత్రమె యై యున్నవి.

గాన్పించుచున్నవి. (ఋగ్వేదముయొక్క యెనిమిదవ మండలమునను గొన్ని కృష్ణర్షియొక్క సూక్తము లున్నవి.) ఈ కృష్ణుఁడెవఁడు? శ్రీకృష్ణుఁడు కాఁడు. అతనిని ఛాందోగ్యోపనిషత్తు దేవకీపుత్రుఁ డనియే చెప్పినది. కృష్ణుఁడను నొకఁ "డసురుఁడుగా" ఋగ్వేద ప్రథమ మండలమున వర్ణింపఁబడియున్నాఁడు. అసురప్రోక్తములు సర్పప్రోక్తములు నగు సూక్తములు కొన్ని ఋగ్వేద దశమ మండలములో నున్నవి. కాని యీ కృష్ణుఁ "డసురుఁడుగాఁ" జెప్పఁబడనందునఁ బై సూక్తములఁ జెప్పిన కృష్ణుఁడు కృష్ణద్వైపాయనుఁడా? అయిన నాతఁడు అంగిరసుఁ డనుటచేఁ బారాశర్యుఁడు కాఁడనుట స్పష్టము. ఇందఱు వ్యాసు లిన్నిన్ని గ్రంథములఁ జేసియుండఁగా శ్రుతి స్మృతి పురాణేతిహాసము లన్నియు సాత్యవతేయకృతములే యని నేఁడు తలఁచుట విచిత్రాంశమై యున్నది.

బ్రాహ్మణునకు శూద్రస్త్రీయం దుద్భవించినవాఁడు "నిషాదుఁడు," లేక "పారశవుఁడు" అను ననులోమజాతీయుఁ డగు నని "మనుస్మృతి"లోఁ గలదు. నిషాదుఁడే చండాలుఁ డని యమరకోశమునఁ గలదు. నిషాదుఁడు బోయజాతిలో నొక తరగతివాఁ డని వేలు నిఘంటువులలో గలదు. వాల్మీకిమహర్షి యాతరగతి నిషాదుఁడే యని "ధర్మఖండా"దులలోఁ గలదు వ్యాసుని తండ్రి బ్రహ్మర్షి యగు "పరాశరుఁడు" తల్లి దాశకన్య కాన వీరికిఁ బుట్టిన వ్యాసుఁడు నిషాదుఁడు లేక పారశవుఁడై యుండెను. అతి ప్రాచీనకాలమునుండి క్రీ శ॥ 7, 8 శతాబ్దముల వఱకు బ్రాహ్మణుఁ డితరజాతి స్త్రీలఁ బెండ్లి యాడుటయుఁ బారశవు లుద్భవించుటయుఁ గలదు మహాకవి యగు "బాణునకుఁ" బారశవసోదరుఁ డుండినటుల "హర్షచరితము" వలనఁ దెలియనగును. కృష్ణద్వైపాయనుఁడు కూడ నట్టి పారశవుఁడే.

జన్మముచేఁ బారశవుఁడైనను, నిషాదుఁడైనను, కృష్ణ ద్వైపాయనుఁడు, వాల్మీకి యనువారు కర్మములచే, తపస్సుచే, వేదర్షులు, మహా కవులు నైరి. జన్మముచే బ్రాహ్మణుఁడైనఁగాని వేదర్షికాఁ డని చెప్పుట వెఱ్ఱి. ఒకవేళ వ్యాసుఁడు జన్మముచే బ్రాహ్మణుఁ డని త్రికమకపడి సాధించినను వాల్మీకిని జన్మముచే బ్రాహ్మణుఁ డని సాధింప శక్యము కాదు నాఁడును నేఁడును తమ సత్కార్మములచే మహానుభావులగు వారిం గాంచుచున్నాము వినుచున్నాము.

మత్స్యగంధి పరాశరుం డిచ్చిన "కస్తూరితావి"చే యోజనగంధియైనను వ్యాసుఁడుమాత్రము నిషాదరూపుఁడై "పూతిగంధుఁడు"గానె యుండెనని మహా భారతములోని వర్ణనమువలనఁ దెలియనగును. సత్యవతి వ్యాసు "నంబికాం బాలికల" యందు బిడ్డలఁ గను మని నియోగించినపుడు వ్యాసుఁడు తన వికృత రూపమును దుర్వాసనను మహారాజ భార్యలు సహింపలేరని తలఁచి యొక

సంవత్సరము వ్రతముఁ జేయవలయుననెను. సత్యవతి తొందరగాఁ బుత్ర సంతానము కలుగవలెననఁగా కృష్ణద్వైపాయనుఁ డిట్లనినాఁడు.[1]

"ఓ సత్యవతీ! నాయొక్క వికారరూపమును అంబిక సహింపవలెను. ఇదియే పరమ వ్రతము. ఆమె నా కంపును రూపమును వేషమును శరీరమును సహించిన యెడల గర్భమామెకు వెంటనే కలుగును." సత్యవతి యీ వృత్తాంతము నంబికకుఁ జెప్పుటలో నంతయుఁ జెప్పక కృష్ణద్వైపాయనుఁ డీరాత్రి నీ కడకు వచ్చును జాగ్రత్తగమాత్రముండుమా యనెను అంబిక యటులనె యుండెను. కాని వికృత రూపముతో నుండిన వ్యాసుని జూచి సహింపలేనిదై యా రాత్రి యొకమాత్రైన గన్ను దెఱవక మూసికొనియే యుండెను. ఆ కారణము చేతనే ధృతరాష్ట్రుఁడు గ్రుడ్డివాఁడాయెను. అంతఃపురమునకు వచ్చిన కృష్ణద్వైపాయనుఁడెట్టి రూపముతో నుండెనో చూడుడు.[2] ఆ వ్యాసునియొక్క కపిలజటను బ్రజ్వలించుచుండిన నేత్రములను కపిలవర్ణములు గల పొడుగు మీసములఁ జూచి రాణి కన్నులను మూసికొనెను.

అంబాలికకూడ వ్యాసుని వికృతరూపముఁ జూచి తెల్లవోయినది. అందు వలనఁ బాండురోగి పుట్టెను. పుట్టిన యిద్దఱు నయుక్తులుగా నుండుటచే సత్యవతి మరల నంబికంగూడ వ్యాసుని నియోగించెను. కాని యీమాఱు వ్యాసుఁడు దగ్గఱకు వచ్చుటకుఁగూడ "అంబిక" సహింపక దాసిని వ్యాసుం గూడ నియోగించినది; ఆ దాసి (ఊడిగములఁ జేయుటలో ననేకాసహ్యకార్యముల కలవాటుపడి యుండుటచేఁ గాఁబోలు) వ్యాసుని వికృతవేషమును పూతిగంధమును సహించి వ్యాసుని కామోపభోగముఁ దృప్తి నొందించినది. అందువలన దాసీవ్యాస దాంపత్యమున ననుకూలుఁడగు విదురుఁ డుద్భవించెను.

వ్యాసునిచేఁ జెప్పఁబడిన వ్రతము చేయకపోవుటచేతను, అతఁడు చెప్పిన వికృతరూపమును సహింపకపోవుటచేతను మాతృదోషముచేఁ బుట్టుగ్రుడ్డియుఁ బాండురోగియు గలిగిరని కొందఱందురు కాని వ్యాసుఁడు చెప్పిన వ్రతమేదియుఁ గాన్పింపదు. "విరూపతాం మే సహతాం తయో రేతత్పరం వ్రతం"

---

1. విరూపతాం మే సహతాం తయోరే తత్పరం వ్రతం
యదిమే సహతే గంధం రూపవేషం తథావపుః
అద్యైవ గర్భం కౌసల్యా విశిష్టం ప్రతిపద్యతాం॥
-ఆదిపర్వ 105 అధ్యా.

2. తస్యకృష్ణస్య కపిలా జటాదీప్తేచ లోచనే
బభ్రూణి చైవశ్మ శ్రూణీ దృష్ట్వా దేవీ న్యమీలయత్
-ఆదిపర్వ. 106 అధ్యా.

అనుటచే నాయొక్క వికారరూపమును సహింపవలెను. వా రిద్దఱికి నిదియె గొప్పవ్రతము అనుటచే వికారరూపసహనమే వ్రతమని యర్థము ఆవికారరూప సహిష్ణుత్వ మొక వత్సరమున కలవడు నని తలఁచి యావ్రతముఁ జేయు మని నాఁడు. "ఆఱునెలల సహవాసముచే వారు వీ రగుదురు" అనినటులు వ్యాసునితో నొకయేడాది రూపగంధాదికములను సహించి యంబికాదు లుండినచో వారి కలవాటయి దాంపత్యానుకూలత గలిగి యుక్త సంతానము వారికిఁ గలిగి యుండును. అట్లు కాకుండుటచేతనె యయుక్త సంతతి రాణులకుఁ గలిగెను. అపుడే కాదు నేఁడును అయుక్త దాంపత్యముచే నయుక్త సంతతి కలుగుటఁ జూచుచుంటిమి. అనులోమ ప్రతిలోమ వివాహములలోఁ బ్రతిలోమ (తక్కువ జాతి పురుషున కున్నతజాతి స్త్రీ భార్య యగుట) వివాహము స్మృతికర్తలచే మిగుల నిషేధింపఁబడినది. సాధారణముగా బీజప్రధానతయే సంతానములోఁ గాన్పించును. అనులోమాది వివాహములు కలుగుననియే "డాక్టరు గవరు" యొక్క వివాహచట్టమున కనేకులు ప్రతికూలురుగా నుండిరి వ్యాసుఁడు నిషాదుఁడు అంబికాంబాలిక లున్నతజాతి రాణులు వారి సంతతి యనులోమ సూచకమై రుగ్ణ్వయిష్ఠమైనది, ఇంచుమించు సజాతీయ దాసీసాంగత్యముచే వ్యాసునకుఁ దగినఁ "విదురుఁ" డుద్భవించెను. వ్యాసునియందు నీచజాతి రూపముండినను బీజప్రభావముచే విద్యావిశేషాదికము ప్రసరించినది వ్యాసుఁడు సంకీర్ణజాతీయుఁ డగుటచేతనే సంకీర్ణజాతివారగు పాండవులకుఁ బెక్కుచోటులఁ బెక్కుభంగులఁ దోడ్పడెను.

కృష్ణద్వైపాయనుఁడు బ్రాహ్మణి యగు సత్యవతీ పుత్రుఁడని కేతవరపు వేంకటశాస్త్రి గారును, సత్యవతి క్షత్రియాంగన యని చతుర్వేదుల రామవయ్య గారును (హిందూ బాంధవీ పత్రికాధిపతి) వ్రాసియున్నారు (ఆమె నావను నడుపుట "పీపిల్సుపార్కు"లోని సరస్సున ధనికవనితలు నావను నడపు శృంగార చేష్టిత సమమని రామవయ్యగారి తలంపు) శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు సత్యవతి క్షత్రియాంగన కానియెడల తమ వాదము నంతయు వదలుకొందు మని పెద్దప్రతినను జేసియున్నారు. దీనిఁగూర్చి విచారింతము వ్యాసునితల్లి సత్యవతి. ఉపరిచర వసువుయొక్క వీర్య మొకమత్స్యరూపిణి యగు నప్సరస గర్భమునఁ బడనం దొకపుత్రుఁడు పుత్రికయు జన్మించిరి. ఆ మత్స్యముఁ బట్టిన జాలరులు తచ్ఛిశుద్వయమును వసురాజున కొసఁగ నాతఁడామగవానిఁ గైకొని పెంచి పెద్దవానిం జేసి మత్స్యదేశపురాజుగాఁ జేసెను. ఆఁడు బిడ్డను సన్నిధియందుండిన యొకజాలరి కిచ్చెను. ఆదాశుఁడు యమునానదిలో ధర్మము కొఱకొకనావనుంచి యువతియగు మత్స్యగంధి నా నావను నడప నియమించెను. పరాశరమహర్షి

యాదారినేతెంచి మందరి యగు మత్స్యగంధిం గాంచి మోహించి తనయభీష్ట మామె కెఱింగించి కొన్ని వరముల నొసంగెను (మత్స్యగంధముపోయి కస్తురిపరిమళము నొసంగుట, కన్యాత్వమునకు లోపము లేకుండఁజేయుట, పగటివేళయైనను దాముండిన నావ కాన్పింపకుండఁగ చీకటి వ్యాపింపఁజేయుట యనునవి వరములు ) అప్పుడామె పరాశరుఁ గూడుట కంగీకరించి కూడెను. వ్యాసుఁ డుద్భవించె. పరాశరుఁడు కూడుట కర్హురాలగుటయు, వసురాజు వీర్యమున జన్మించుటయు ననుకారణములచే, మత్స్యగంధి బ్రాహ్మణి యనియు, క్షత్రియ యనియుఁబై పండితులు భ్రమ నొందుచున్నారు. బ్రాహ్మణి యని మత్స్యగంధి నెవరును వ్రాయలేదు. ఆమె క్షత్రియయే యైనచో పల్లెవానికి వసురాజు పెంపకమున కిచ్చుట యేల? తాను పెంచలేకయా? లేక దాశుఁడు గొప్ప రాజగుటచేఁ దన కూఁతురు విశేషసుఖము ననుభవించుననియా? దాశుఁ డొకవేళ రాజై యుండినను పెంపుడు కూఁతురునకుఁ జేసిన సుఖమేమి? నదిలో నావను నడపుటయా? ఇది విలాసవనితాచేష్టితము కాదు. పరాశరుఁడు వచ్చినపు డుండినటులనే శంతనుఁడు వచ్చినప్పుడును నావనే నడుపుచున్నది. నేను ధర్మముకొఱకు నావను పిత్రాజ్ఞా ప్రకారము నడుపుచునే యుండుదాన నని భీష్మునితో నామె చెప్పియున్నది. ఇందువలన నామె తండ్రియొక్క వృత్తి నావను నడుపు వృత్తియే యనుట స్పష్టము ధర్మము కొఱకు నావలను నదులలో నడపుట భారతీయదాశులకు దాశస్త్రీలకు నాఁడేకాక, బ్రిటీషువా రీదేశముఁ బరిపాలనము స్థిరపఱచుకొనువఱకుఁ గలదు. ఆ ధర్మాత్ములగు దాశులకు స్వదేశ ప్రభువులు విశేషముగా మడి మాన్యముల నిచ్చి బహూకరించుచుండుటయుఁ గలదు. గోదావరీ మండలముఁ బెద్దాపుర సంస్థాన ప్రభువులు ధర్మముగా నావలను నడుపు దాశుల కమితముగా భూముల నొసంగిరి. ఆ కుటుంబులింకను, ఆ మాన్యముల ననుభవించుచున్నారు. కాకినాడ తాలూకాలోని "తుల్యా, ఆత్రేయీ" నదీతీరములందా దాశకుటుంబము లున్నవి. దాశస్త్రీచే నావికవృత్తి చేయఁబడినచోటు "ఆడుదానిరే"వని నేఁడును వాడఁబడును. నదు లంతర్వాహినులై నను, పూర్వపుఁ జిన్నెలు కలవు కాలువలయం దుండిన తమ నావలచేఁ బూజ్యుల నుచితముగానె తత్కులములందలి స్త్రీలు పురుషులు నేఁడును దాఁటవేయుచుందురు. ఇట్టి వృత్తిలోనివారే దాశరాజును సత్యవతియు. "దాశరాజు" అని రాజు శబ్దము దాశశబ్దమునకు భారతమునఁ జేర్పఁబడియుండుట దాశుఁడు "నిషాదస్థపతి" కావచ్చునని కొందఱు తలంపవచ్చును ఔఁగాక! అపుడు మాత్రము సత్యవతి క్షత్రియాంగన యెట్లగును? వసురాజు వీర్యమున జన్మించుటచే సత్యవతిని క్షత్రియాంగాన యందురా? అదియును బొసఁగదు. వీర్య

ప్రాధాన్యమునే లెక్కఁగొనవలసి యుండినచో వ్యాసుని వీర్యమువలనఁ బుట్టిన శ్రీ శుకుడు మహర్షియు, ధృతరాష్ట్ర పాండురాజులు క్షత్రియులు, విదురుఁడు శూద్రుఁడు నెట్లయిరి? ఇచట వీర్యప్రధానత కాక క్షేత్ర ప్రాధాన్యమే వన్నె కెక్కెను. సత్యవతి బ్రహ్మణి యైనచో నామెను క్షత్రియుఁడు వరించి క్షత్రియులఁ గనునా? లేక క్షత్రియ యైనచో నామెను దాశుఁడు తన వృత్తిలో నెట్లు ప్రవర్తింపఁజేయును? కాన సత్యవతి సర్వవిధముల దాశకన్యయే. సత్యవతిని బెంచిన పిమ్మటనే దాశునకు రాజుశబ్దము చేర్పఁబడెను. అంతకుముం దాతఁడు దాశుఁడే. వసురాజమాన్య దగుటచేతనే యాతనికి రాజబిరుదము కలిగినది. ఇల్లు వాకిలి లేకుండినను రాజమాన్యులై తమ పేరితో రాజశబ్దముఁ దగిలించుకొనువారు నేఁడును గలరు. ఇంతకును మహాభారతమున సత్యవతికి దాశకన్య, దాశేయి, దాశరాజకన్య యను శబ్దములే చెప్పఁబడినవి కాని, వాసవి, వసురాజకన్య యను శబ్దములు మృగ్యములు. కృష్ణమూర్తిశాస్త్రి గారును దాశరాజకన్యాశబ్దమునే వాడియున్నారు. వసురాజు రాజైనను, ఆతని వీర్యముచే నే జాలరి వనితయందో పుత్రీపుత్రు లుద్భవింపఁ బుత్రుఁ జేసికొని మత్స్యాధీశుం జేసి, పుత్రికను దాశునకే పెంచ నిచ్చియుండును. ఆ వనిత యందకత్తె యగుటచేఁ బరాశర శంతనులు వరింప నర్హయై యుండెను. పరాశరశంతనులే కాదు, అసితుఁడను మహర్షి (ధౌమ్యుని సోదరుఁడు) వ్యాసుఁడు పుట్టిన పిమ్మట నామెను బెండ్లియాడ దాశరాజుం గోరెను. శంతనున కిచ్చు తలంపు దాశున కుండుటచే నా జడదారియగు నసితున కీయననెను శంతనుఁడు దివంగతుఁడైన వెంటనే ఆతని మృతాశౌచ దినములలోనే "అజమీఢుని" వంశస్థుఁడును శంతనుజ్ఞాతియు నగు "ఉగ్రాయుధుఁడు" అను రాజు హస్తిపురిపై దండయాత్ర సలిపి సత్యవతిపైఁ దనకు మక్కువకల దనియు, నామెను దన కిచ్చిన హస్తిపురి ముట్టడిని వదలిపోవుదు ననియు భీష్మునకు వర్తమానమంపెను భీష్ముఁడాశౌచ దినములు గడచువఱకు సామవాక్యముల నడపి పిమ్మట నాతనితోఁ బోరి యుగ్రాయుధుం జంపెనఁట! ఈ గాథ హరివంశమునఁ గలదు. సత్యవతీ సౌందర్యలాలసు లయియే పైవారామెను గోరుచుండిరి గాని, ఉత్తమ క్షత్రియాంగన యను కారణమునం గాదు మఱియు వ్యాసుని తల్లి కైవర్త కన్యయే యనియు బ్రాహ్మణేతర వనితలకు జన్మించిన వారును బ్రహ్మర్షులు కావచ్చు ననియు, వజ్రసూచికోపనిషత్తులోఁ గల వాక్యము నింతకు ముందు చూపియున్నాను మఱియు భవిష్య, దేవీ భాగవత, విష్ణుపురాణాదులు వ్యాసుఁడు దాశకన్య లేక కైవర్త కన్యాసంజాతుఁడే యని స్పష్టవాక్యములతోఁ జెప్పియున్నవి. ఒక్క వ్యాసుఁడే కాఁడు, అనేకులు మహర్షులు జాత్యంతర జనితులు కల

రని, వజ్రసూచికోపనిషత్తు భవిష్యపురాణ, భారతారణ్య పర్వములలోఁ గలదు. గ్రంథ విస్తరభీతిచే వజ్రసూచికోపనిషద్వాక్యమునే మరల నుదాహరించు చున్నాను :

1 "అయితే, జాతియే బ్రాహ్మణుఁ డనరాదు. ఆ ప్రశ్నమునందు జాత్యం తరులయం దనేక జాతులవారు పుట్టుచుండుట వలన. మహర్షులు పెక్కండ్రు కలరు - వ్యాసుఁడు కైవర్తక కన్యయందు వసిష్ఠుఁ డూర్వశియందు - అగ స్త్యుఁడు కలశమునందును బుట్టిరి."

బ్రాహ్మణుఁడు సితవర్ణుఁడుగా నుండవలయు నని శాంతిపర్వమునం గలదు వ్యాసుఁ డసితవర్ణుఁడు, మఱియుఁ గైవర్తజాతి షోడశవిధ చండాల జాతియందును నధమ మని "హేమాద్రి" కృతచతుర్వర్గచింతామణిలోఁ గలదు. అందువలననే వ్యాసునిఁ జండాలజాతిజుఁడని చెప్పితిని. కాని బ్రహ్మర్షియే.

ఏయే సమయములఁ బాండవులకు వ్యాసుఁడు తోడ్పడెనో చూడుఁడు :

2పాండవు "లనదలై" లక్షాగృహదహనానంతరము మాఱు వేషములతో "మత్స్య, త్రిగర్త, పాంచాలా"ది దేశములలోఁ దిరిగి తిరిగి యాధారము దొరకక వనములలో భ్రమించుచుండగా వ్యాసుఁ డామహారణ్యములోఁ బాండవులఁ గలిసికొని మనకు సఖ్యము తగియున్నదనియు, మీరు నా రాకను నిరీక్షింపుచు నొకమాస మీయేకచక్రపురమున నుండుఁ డనియు వారి నా యేకచక్రపురము నకుఁ జేర్చి యెన్నియేని హితబోధలం జేసెను. "నన్నయ" యాంధ్రీకరణ ములో హిడింబను భీముఁ డుద్వాహ మగుటకుఁ గూడ వ్యాసుండే ప్రోత్సహించిన టులఁ గలదు ఏ సహాయము లేక నవయుచున్న పాండవుల కీయాధారము మిగుల సంతోషకారి యైనది.

3బక వధానంతరము ద్రౌపదీ స్వయంవరమును విని పాండవు లేక చక్రపురమునుండి ప్రయాణ మగుచుండఁగా వ్యాసుఁ డిదివఱ కనిన ప్రకారము వారికడకు వచ్చి రహస్యముగానే వారిచేఁ బూజింపఁబడి యీ క్రింది గాథను రహస్యముగానే చెప్పియున్నాఁడు. ఆ కథ యిది:

---

1. తర్హి జాతిర్బ్రాహ్మణ ఇతిచేత్తన్న తత్రజాత్యంతరే ష్వనేక జాతి సంభ వాత్ మహర్షయో బహవ స్సంతి వ్యాసః కైవర్తకన్యాయాం...వసిష్ఠ ఊర్వశ్యాం...అగస్త్యః కలశజాత ఇతిశ్రుతత్వాత్.
2. ఆదిపర్వ. 156 అధ్యా.
3. ఆదిపర్వ. 169 అధ్యా.

[1]"ఒక ఋషికన్య స్వకర్మముచేతనే దుర్భగయై పెండ్లి చేసికొనుటకై శివుఁ గూర్చి తపస్సు చేయఁగా శివుఁడు ప్రత్యక్షమై నీ కేమివరము కావలె ననఁగాఁ బతి పతి యని యేనుమాఱు అడిగినది. నీవైదుమాఱులం భర్తఁ గోరితివి కానఁ బాండవు లైదుగురు నీకు భర్త లగుదురని శివుండు వరమిచ్చెను. తగిన భర్త యొకఁడే కావలె, నెట్లయిదుగురు భర్తలకు భార్యనగుదు. ననఁగా జన్మాంతరమున నగుదురని వరమిచ్చెను. ఆమె యిపుడు ద్రుపదుని యింటఁ బ్రభవించినది. ఆమె మీకు భార్యగా నిర్దేశింపఁబడియున్నది. ఆమెను బొంది మీరు సుఖవంతులగుదురు" అని వ్యాసుఁడు చెప్పి పోఁగాఁ బాండవులు హృష్టమానసులైరి.

[2]పాండవులు ద్రుపదుపురమునకుఁ జేరఁబోవుచుండఁగా వ్యాసుఁడు ప్రత్యక్షమై యాగామిఫలముఁ జెప్పి యంతర్హితుఁ డాయెను.

[3]ద్రుపదుఁ డైదుగుర కొకతెఁ బెండ్లిచేయుట యుక్తము కాదని విచారించుచుండఁగా వ్యాసుఁడు ప్రత్యక్ష మయ్యెను. అంతకుఁబూర్వమె వ్యాసునాలోచనముచేతను గుంతియొక్క ప్రోత్సాహముచేతను ద్రౌపది నైదుగురు పెండ్లియాడ నుద్యుక్తులగుటచే వ్యాసుఁడు వచ్చుటతోడనె ధర్మజుఁ డీవ్యాసుఁ డెట్లు చెప్పిన నట్లు చేయుదమని ద్రుపదు నొడఁబఱచెను. అపుడు వ్యాసుఁడు ద్రుపదునకుఁ "పంచేంద్రోపాఖ్యానము, నాలాయన్యుపాఖ్యానము" మొదలగువానిఁ జెప్పి ద్రుపదు నావివాహము చేయుటకు నొడఁబఱచెను ద్రౌపదీ వివాహముచే ద్రుపద పాండవులకు సంబంధము కలిసెను. పాండవులవలె నానాకష్టములఁబడి ద్రౌపదీ

---

1. ఋషికన్య "దుర్భగ" యనినాఁడు దుర్భగ యనగా దుష్టమైన గూఢావయవము కలది యని యర్థమగును "నాలాయన్యుపాఖ్యానము"లోఁ గూడ (ద్రౌపది పూర్వరూపమున నాలాయని) నాలాయని మౌద్గల్యుని, నా రహస్యావయవము నీరతిచేఁ దృప్తినొందలే దనుటచే నాతఁడు నీ కైదుగురు భర్తలగుదురు గాక యని శపించెనని కలదు. స్త్రీ రోగములలోఁ గొందఱకు గూఢావయవ "ముబ్బెత్తు"గ నుండుననియు రతియం దసంతృప్తి కలవారై బహుపతిత్వము గోరుదురనియు ఆ రోగనివృత్తిని "విద్యుత్సా"ధనములచే వైద్యులు చేతురనియుఁ గలదు అట్టి రోగమె ద్రౌపదికిఁ బూర్వరూపమున నుండెనని తలఁపవలసియున్నది. చరక,మాధవ నిదానములలో నీరోగమునకు, అతిచరణము అని పేరు గలదు. అత్యానందము అను మఱియొక రోగమునకును నీ లక్షణము లుండునఁట!
2. ఆదిపర్వ. 185 అధ్యా.
3. ఆదిపర్వ 196, 197 అధ్యా.

పరిణయకాలమున కొకవిధ మగు స్వాతంత్ర్యమును సంపాదించిన శ్రీకృష్ణ బలరాములుకూడ మేనత్తకుమారులగు పాండవులం గూడిరి. ఈ త్రివర్గసమ్మేళనమె పాండవుల కర్ధరాజ్యప్రాప్తికిం గారణ మైనది.

మాతృవాక్య పరిపాలనముచేం బాండవు లైదుగు రొకతెం బెండ్లియైరని స్థూలదృష్టిచే జనులు తలంతురుగాని వ్యాసుండే ద్రుపదుని సంబంధముచేం బాండవు లభివృద్ధి నొందంగల రని తలంచి వా రైదుగురు నొకతెం బెండ్లియాడుటకు ముందుగాం బ్రోత్సహించి యున్నాండు. మొదటిసారి నారాకను నిరీక్షింపుండనుట తాను ద్రౌపది నొడంబఱుచుటకై కాల వ్యవధిం గోరెననియు, రెండవసారి యామె యిట్లున్నది, మీ కిష్టమా యని వీరి నొప్పించుటకు వచ్చె ననియు మూండవసారి మీ రంగీకరించి నటులనె యామె యంగీకరించిన దని చెప్పె ననియు నాలవసారి ద్రుపదు నొప్పించుటకై ప్రత్యక్షమయ్యె ననియు సంస్కృతాంధ్ర మహాభారతముల సవిమర్శకముగాం జదివిన స్పష్ట మగును ఇతరములగు ద్రౌపదీ పరిణయ విశేషములు ద్రౌపదీవృత్తాంతములోం జదువనగును.

రాజసూయ మహాధ్వరములో నీతనికి "బ్రహ్మత్వము" అను "ఆర్త్విజము" ధర్మజుం డిచ్చి గౌరవించెను. ప్రధానార్త్విజములలో బ్రహ్మత్వము గౌరవప్రదమైనది. కృష్ణద్వైపాయనుని శిష్య ప్రశిష్యులగు "యాజ్ఞవల్క్య, పైల" దులు తక్కినయార్త్విజములం గైకొనిరి. సోముండు ధౌమ్యుండు మాత్రము వ్యాసునివర్గములోనివారుగాం గాన్పింపరు. ధౌమ్యుండు "హోత"గా నుండెను. అధ్వర్యుండు "యాజ్ఞవల్క్యుండు." ఈ యాజ్ఞవల్క్యుండు వైశంపాయన శిష్యుండు కాక "జైమి"ని శిష్యుడై యుండును. కాని ధర్మజుం డశ్వమేధముం జేయునపుడు "ఆర్త్విజ్యము" ధౌమ్యున కుండెనా లేదా? యని సందేహింపవలసి యున్నది. కృష్ణద్వైపాయనవర్గమే యశ్వమేధములో సమస్తా "ర్త్విజముల" నాపోశనముం గొనెను. రాజసూయాశ్వమేధ యాగములలో నార్త్విజముం గొనుట నేంటి శాసన సభాధ్యక్షత, శాసనసభామంత్రిత్వములవలె గౌరవకరమైన వైదికోద్యోగము ఆర్త్విజములకొఱకు "వసిష్ఠ విశ్వామిత్రా"దులు తమలో దాము పోరాడుకొనుటయే గాక తమ ప్రభువులకుంగూడ ఘోర పోరాటములం గల్పించిరి. సంకీర్ణ జాతీయమగు ద్వైపాయనపక్షముపై నీసు వహించి వైదికఋషులు తమ వాఙ్మయములో ద్వైపాయన పక్షాధ్వర్యయుక్త ధర్మరాజాశ్వమేధము పేరుం గూడం జెప్పరైరి. ధర్మజునిచే వ్యాసుండు "అహీన" నామకము లగు మూండశ్వమేధములం జేయించెనని కలదు. ఆయశ్వమేధముల వృత్తాంతముం బిమ్మట వ్రాయంగలను.

[1]పాండవులు ద్యూతజితులై "ద్వైతవనము"న నుండగాఁ గర్ణుని ప్రోత్సాహముచే దుర్యోధనాదులు రహస్యముగాఁ బాండవులపై దండెత్తి చంపఁ బ్రయత్నింపఁగా వ్యాసుడు వచ్చి యిది యుక్తము కాదని నివారించెను ఇంత మాత్రమే కాదు. [2]పాండవుల కడకేఁగి వారు ద్వైతవనమునుండి "కామ్యక" కేగునటులఁ జేసె. అర్జునుఁడు తపస్సుచేసి దివ్యాస్త్రముల నొందినఁగాని కౌరవులను జయింపలేరని యెటులఁ గౌరవుల జయింపగలమా యని విచారించుచున్న ధర్మజునకు ధైర్యముఁ బురికొలిపెను. ద్వైతవనము హస్తిపురికి సమీపమున నుండుటచే నెపుడైనను హఠాత్తుగాఁ గౌరవులు పాండవులపైఁ బడుదురని తలఁచియే దానిని వదలి దూరముగానుండఁ గృష్ణద్వైపాయనుఁడు చేసియుండును. మఱియు వనముల నుండినపుడు పెక్కుసారులు వచ్చి పాండవుల నోదార్చుచుండెను. సంజయ రాయబారానంతరము యుద్ధ ప్రయాణానంతరము, ధృతరాష్ట్రు కడకేఁగి యాతనికి పిఱికిమందులు పోసెను. అభిమన్య ఘటోత్కచుల వధములచే శోకించు చుండినపుడును, కర్ణుని భ్రాతృత్వముఁ దెలిసి రాజ్యముఁ జేయ నాసక్తి లేనపుడును ధర్మజునకు శోకోపశాంతిం జేసెను. దుర్యోధన వధానంతరము ధర్మజుఁడు కృష్ణుని ధృతరాష్ట్రుకడ కంపుచు [3]మా పితామహాదగు కృష్ణుఁడు నీవు ధృతరాష్ట్రుఁ జేరునపు డచట నుండును గాన యాయన సహాయముతో మాపై ధృతరాష్ట్రున కుండు కోపమును శాంతింపఁజేయుమా యని చెప్పెను ధర్మజుఁడు చెప్పినటులనే (వ్యాసధర్మజు లంతకుముందే కూడఁబలుకుకొని యుందురు) వ్యాసుఁ డచట నుండెను. అశ్వత్థామయొక్క శిరోరత్నమును బాండవుల కిచ్చునటుల నశ్వత్థామచే నొప్పించెను. ధర్మజు శపింప నుద్యుక్తురాలగు గాంధారిని శపింపఁకుండఁగఁ జేసెను. ధర్మజునకు యుద్ధ మృతుల భార్యలయొక్క తిట్టులు సహింపరానివై యుండెను. [4]సమస్త బంధురహితలగు నా వితంతువులు చత్తురనియే ధర్మజుఁడు తలంచెను. [5]కాని యావితంతువులు చావలేదు. వ్యాసు డావితంతువు లను యుద్ధమృతులఁ జూపునెపమున ధృతరాష్ట్రుని వనవాసకాలమున ధార్తరాష్ట్రు భార్యలను మోహపెట్టి వారికిఁ బతిలోకము గలుగు నని నమ్మించి[6] యాదుర్యోధనాదుల భార్యలను

---

1. అరణ్యపర్వ. 7 అధ్యా.
2. అరణ్యపర్వ 36 అధ్యా.
3. శల్యపర్వ. 34 అధ్యా
4. స్త్రీపర్వ. 12 అధ్యా.
5. శాంతిపర్వ. 33 అధ్యా.
6. ఆశ్రమవాసపర్వ. 33 అధ్యా.

గంగలోఁ బ్రవేశించునటులఁ జేసెను. గ్రంథవిస్తరభీతిచే గాథనంతయు వ్రాయలేదు. అన్నిటికంటె విశేషోపకృతి పాండవులకుఁ జేసినది, "జయము" అను గ్రంథమును రచించుట. యుద్ధ మింక నగు ననఁగా ధృతరాష్ట్రునితో వ్యాసుఁడిట్లనెను. [1]ఓ ధృతరాష్ట్రా! ఈ కౌరవులయొక్కయు, పాండవుల యొక్కయు, అందఱియొక్కయుఁ గీర్తిని నేను ప్రకటనఁ జేయఁగలను. విచారింపకుమా! ఇట్లని వ్యాసుఁడు మూఁడేండ్లు "జయ" గ్రంథముఁజేసి ధృతరాష్ట్రాదులు గతించిన పిమ్మటఁగాని లోకమున వెల్లడింపలేదు. ఆ వృత్తాంతము "మహాభారత రచనా విధాన"మను భాగమునఁ జెప్పియుంటిని. "జయమును" సంజయునకుఁగూడ వ్యాసుఁడు చూపినటుల లేదని "సౌతి" యనుక్రమణి కాధ్యాయములో వ్యాసుని యెనిమిదివేల యెనిమిదివందల శ్లోకములను [2]"సంజయుఁడుకూడ నెఱుఁగునో యెఱుఁగఁడో" అని చెప్పుటచే నూహింపఁబడుచున్నది. మొత్తమునకు వ్యాసుఁడు పాండవపక్షపాతియై జయమును పాండవపక్షముగా వ్రాసియుండుటచేఁ బ్రత్యక్షముగా వ్యవహారముఁ జూచిన సంజయునకుఁగూడ జయమును జూపకుండుటలో నాశ్చర్యములేదు. వ్యాసుఁడు వాల్మీకివలె "ధర్మాతిశయనిరూపక కవి" గాక "అర్థాతిశయనిరూపకకవి"యై యాన్యాయమున కొడఁబడినవాఁడుగాఁ గాన్పించును.

వ్యాస వాల్మీకులు ప్రసిద్ధులగు భారతీయ కవులు. అందు వాల్మీకి ప్రారంభమునఁ గిరాతుఁడై యకృత్యముఁ జేసి సద్బోధ మహిమచే నపూర్వ మహిమము నొంది సంస్కృత వాఙ్మయమునం దాదికావ్యమగు రామాయణమును రచించెను. అంతమాత్రమె కాదు మహారాజుచేఁ బరిత్యజింపఁబడిన మహారాణి కాశ్రయమిచ్చి (సీతకు) కన్నబిడ్డవలెఁ గాపాడి భవిష్యత్ప్రభుత్వమును నిర్వహించుకొనునటుల నామె బిడ్డలకు విద్యాబుద్ధులం గఱపి, మహారాజునకును మహారాణికిని సఖ్య మొనగూర్పఁ నెంతయేని ప్రయత్నించెను.

వ్యాసుఁడు వాల్మీకివలెఁ గాక మొదటనే బ్రాహ్మ్యసంస్కారముల నొంది వినుతికెక్కిన గ్రంథమును రచించెను. కాని తల్లి యానతి యను నెపమున రాణివాసముఁ జేరి రాణులను గూడి తన నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతమునకు లోపముఁ గలుగఁజేసికొనెను. [3]అపకీర్తి చేయఁదగిన గర్దభేష్టిం జేసెనో లేదో

1. "అహంతు కీర్తిం మేతేషాం కురూణాం భరతర్షభ పాండవానాంచ సర్వేషాం ప్రథయిష్యామి మా శుచః".-భీష్మపర్వ 2 అధ్యా.
2. "సంజయో వేత్తి వానవా"-ఆదిపర్వ. 1 అధ్యా.
3. నైష్ఠిక బ్రహ్మచారి క్రిందియస్ఖలనమైన యెడల గర్దభేష్టి యను యజ్ఞముఁ జేయవలయునని ఆపస్తంబాది ధర్మశాస్త్రములలోఁ గలదు. గర్దభేష్టి యన గాడిదను పశువుగాఁ జేసి చేయు యజ్ఞము.

కాని, వ్యాసునంతటివాఁడు వ్రతభ్రష్టుఁడగుట యెట్టిదని పూర్వమీమాంసాశాస్త్రజ్ఞులు "ధర్మ వ్యతిరిక్త సాహస" విచారణములో నానా విధములగు తిప్పలు పడి మాత్రాజ్ఞగాన వ్యాసుఁడు దోషి కాఁడని సరిపెట్టుకొనిరి. రాణులఁ గూడుటకును మాత్రాజ్ఞయే కాని, రాణివాసములోని దాసిని గూడుటకును మాత్రాజ్ఞయేనా? ఆ దాసి మాత్రాజ్ఞచేఁ గూడఁ దగిన రాణి కాదనియు దాసి యనియు వ్యాసుని వంటి సర్వజ్ఞునకుఁ గూడ తెలియలేదా? మాత్రాజ్ఞకు వ్యతిరేకముగా దాసిం గూడుటకుఁ బూర్వమైమాంసికులెట్టి సమాధాన మిచ్చెదరో? వ్యాసుఁడొక్కదానినే పొంది యవకీర్ణి కాలేదు. మఱియొకప్పుడును స్త్రీ లోలుఁడె యయ్యెను. శాంతిపర్వమున నీగాథ కలదు.

"సత్యవతీసూనుం డగ్ని కార్యపరుండై యొకప్పు డరణి పుచ్చుకొని మథింపఁదొడంగిన ఘృతాచి యను నప్సరోవనిత లోచనగోచర యగుటయుఁ దానును గామగోచరత్వంబు నొందిన నయ్యిందువదన యతని తెఱంగెఱింగి వంచనం జిలుకయై యుండె నతండును ధైర్యం బవలంబించి యరణికార్య ప్రవణుండై బ్రబలుఁడగు నంగజుని చెయ్వి నప్సరోరూపాతిశయసక్త చిత్తుండయిన యాసంయమి శుక్లం బయ్యరణి యందుఁబడియె నవ్విప్రుండు నిర్వికారం బగు నంతఃకరణంబుతో నరణిమథనం బొనరించె."

పిమ్మట శ్రీశుకుఁడు పుట్టె ననువంశముతో మనకు నిమిత్తము లేదు గాని వేదవ్యాసు నంతటివాఁడు పవిత్రమగు నరణిమథన సమయమునఁ బేరఁటాండ్రపై దృష్టిఁ బఱపుటయె కాదు - వలచుట - అంత మాత్రమె కాదు - అరణిని స్వశుక్లముచే నపవిత్రము చేయుట యెట్టి ధర్మము? కాన "దృష్టో ధర్మవ్యతిక్రమః సాహసంచ" అను నాపస్తంబుని సూత్రము వ్యాసునియందు వర్తించెను. కాన వాల్మీకివలె వ్యాసుఁడు ధర్మ ప్రతిపాదక స్వభావము గల ఋషి కాఁడని తలంపవలసి యున్నది.

అర్జునునకుఁ బ్రబోధమును జేసిన శ్రీ కృష్ణుని వాక్యములు కూడ యుద్ధానంతరము ధర్మజుని వ్యామోహమును మాన్పలేదు కాని వ్యాసుని "రాజ్యతృష్ణాతిశయ నిరూపక ధర్మవాక్యములే" రాజ్యాభిషేకోన్ముఖునిఁగాఁ జేసినవి. మొత్తమునకు ధర్మమును అర్థకామములచేఁ గ్రిందుగా నిరూపించినవాఁడు వ్యాసుడు. నాఁటి పరిస్థితులే యందులకుఁ గారణములై యుండును.భారతగాథలో నింతవఱకె వ్యాసుని చరితము కాన్పించును. "స్కాంధపురా"ణాంతర్గత మని చెప్పఁబడు భీమఖండ, కాశీఖండములలోని గాథలఁ బరిశీలించిన యెడల వ్యాసుని గాశిలో నుండనీయక కాశీప్రభు వాతనిని దక్షిణ దిశకుఁ దఱిమినటులను గాశిలో నాతనికిని శిష్యులకుఁ గూడ భిక్షము కూడ లభింపనటులను వ్యాసునిచే నిర్మింప

బడిన కాశీ భ్రష్టమైనటులను గాన్పించును. ఇది పాండవుల యనంతరము జరిగి యుండును.

## శ్రీకృష్ణుఁడు

అద్వైతమతమునఁ బ్రతి పురుషుఁడు నీశ్వరాంశ సంభూతుఁడే. ప్రతి వ్యక్తికి నీశ్వరత్వము నొందుటకు నర్హత కలదు. అట్టి యద్వైత మతముచేఁ గృష్ణునకు భగవదవతారసిద్ధియు మఱియొకనికి లేకపోవుటయు సంభవింపదు. కాని జ్యోతిలోని స్వల్పాధిక భేదమువలె శ్రీకృష్ణుని యందు భగవదంశము సాధారణ మనుష్యులందున్నదానికంటెఁ బెక్కు వందల మడుంగులు హెచ్చుగ నున్నదనుట మాత్రము నిర్వివాదాంశము.

పురాణపురుషులలో శ్రీరాముని విడిచినచో శ్రీకృష్ణుని మించిన యవతార పురుషుఁడు భారతీయ వాఙ్మయమునఁ గాన్పింపఁడు. అవతార నిర్ణయములో శ్రీకృష్ణునిఁ బౌరాణికులు దశావతారములతో నెన్నకపోవుటకుఁ గారణమేమి? మహాభారతములో శ్రీరామావతారమునకుఁ బిమ్మట "సాత్వత" యను నవతార మొకటి చెప్పఁబడియున్నది. [1]"సాత్వతి" యను నామె శిశుపాలుని తల్లి. భాగవతములో శిశుపాలుని తల్లి "శ్రుతశ్రవ" యని చెప్పఁబడియున్నది. యాదవులలోఁ గొందఱకు "సాత్వతుల"ను పేరు గలదు. వసుదేవుని తోఁబుట్టువగు "శ్రుతశ్రవకుఁ" బుట్టినింటి సంజ్ఞచే సాత్వతి యను పేరుకూడ కలిగి యుండును. కాని శాంతిపర్వమునఁ జెప్పఁబడిన దశావతారములలోని "సాత్వతావతారము" లోకములో నింతవఱకు విదితమగు "బలరామావతారమా?" లేక కృష్ణావతారమా? "క్షేమేంద్ర" మహాకవి తన "దశావతార చరిత్రములో" బలరామావతారముఁ జెప్పక శ్రీకృష్ణావతారమునే చెప్పియున్నాఁడు. అతని మనమున మహాభారతగాథను, శ్రీకృష్ణ చరిత్రముతో జోడించి వర్ణింపఁదలఁపు కలుగుటచేఁ గృష్ణావతారమును దశావతారచరితములోఁ జెప్పియున్నాఁడా? కాని బలరాముఁడు చేసిన ఘనకార్యము లేవియుఁ గాన్పింపవు. బలరాముఁడు కేవల విష్ణ్వంశము కాక శేషనియంశ మని భాగవతాదులలోఁ గలదు. కాని యతని కవతార సిద్ధి కలిగినది. రామాయణములోని లక్ష్మణున కట్టి పరిస్థితులుండినను నాతని కవతారసిద్ధి లేదు. పురాణములలో శ్రీకృష్ణ చరిత్రమె హెచ్చుగాఁ గాన్పించును అయినను బలరాముని దశావతారములలోఁ జేర్చి శ్రీకృష్ణునిఁ జేర్చకపోవుట మాత్రము విచిత్రాంశమైయున్నది బలరామకృష్ణులు విష్ణువు యొక్క సితాఽసితకేశము లని భారత భాగవతములలో స్థలాంతరములఁ గలదు. శ్రీకృష్ణావతారగాథ మహాభారతము ననుసరించి రాజకీయాంశములతోఁ

---

1. శాంతిపర్వ. 340 అధ్యా.

గూడియున్నది. భగవద్గీతలో త్రసగీతలలో వేదాంత ప్రతిపాదకముగా నతవి చరితము స్థూలదృష్టినిఁ గాన్పించును. కాని సూక్ష్మదృష్టిచే భగవద్గీతలోఁ గూడ రాజకీయములు కూర్పఁబడియే యున్నవని కొందఱు తలఁచుచున్నారు లేని యెడల—

[1]చచ్చినచో స్వర్గము నొందుదువు. జయించినచో భూమినేలుదువు. కాన యుద్ధముఁ జేయఁ గృతనిశ్చయుండవై లెమ్ము—

అని శ్రీకృష్ణుఁ డర్జునున కుపదేశించుట యెటులు తటస్థించు నందురు. రాజకీయ పురుషలక్షణము లీక్రింది విధముగా నుండును. అందు శ్రీకృష్ణున కన్వయించు గుణములఁ దద్జ్ఞులు గమనింతురుగాక!

రాజకీయ ధురంధరునకు స్వపక్షవిజయము పరపక్షాపజయమే ప్రధానము. అందు ధర్మము వాక్కులలోఁ బ్రధానము. చేతలలో నప్రధానము. సామాద్యుపాయము లవసరము ననుసరించి తాఱుమాఱు కావచ్చును. పరపక్షా ధర్మమును గోరంత దానిని గొండంతగాను, స్వపక్షాధర్మమును గొండంత దానిని గోరంతగాను లేక, తమయం దెంతమాత్ర "మధర్మము" లేదనియు, లోకమునకుఁ జాటించి శత్రుపక్షమునకు దౌర్బల్యమును గలిగించును - వేయు నేల రాజకీయపురుషుఁడన "సమయజ్ఞుఁ" డని చెప్పవలయును. ఇట్టి రాజకీయ లక్షణములు వేదకాలము నుండియు నేఁటివఱకు సమస్త రాజపురుషులలోను నించుమించు ప్రతిఫలించు చున్నవి. అవి సర్వాంగోపేతమై శ్రీకృష్ణునిలో నిండి యున్నవి. శ్రీకృష్ణుఁడు రాజకీయపురుషాగ్రేసరుఁడు. అతఁడు రాజకీయ ధురంధరాగ్రేసరుఁడనుటకంటె రాజకీయధురంధరాగ్రేసర ప్రపితామహుఁడని కాని రాజకీయ పురుష వంశవృక్షమునకు మూలమని కాని చెప్పుట యుక్తము. శ్రీకృష్ణుని రాజకీయ లక్షణములు మహాభారతమున సంపూర్ణముగ ద్యోతమగును. అట్టి రాజకీయ ధురంధరాగ్రేసరుని సహాయముచేతనె పాండవులకు విజయము లభించినది. లేనియెడల భీష్ముఁడు చెప్పినటుల నారదొక ధనుస్సుచేతనే పాండవులఁ జయించియుండును. [2]భీష్మ ద్రోణ విదుర సంజయులకు ధర్మజార్జునులకు శ్రీకృష్ణుని రాజకీయ పరిజ్ఞానము బాగుగఁ దెలియును. భీష్మాదు లీసంగతిని దుర్యోధనునకుఁ బెక్కుసారులు తెల్పిరి. కాని నేఁటి కాలమునఁ గేవలము పశుబలమునే నమ్మి మోసపోయిన "జర్మనీకై సరు" వలె దుర్యోధనుఁడు కేవలసైన్యబలాధిక్య

1 శ్లో॥ హతోవా ప్రాప్స్యసేస్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీం
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యద్ధాయ కృతనిశ్చయః।
-భగవద్గీత॥ 2 అధ్యా॥

2. భీష్మపర్వ. 120 అధ్యా.

మునే నమ్మి మోసపోయియున్నాడు. కృష్ణునిప్రజ్ఞ దెలిసిన యర్జునుఁడు శస్త్రాస్త్రములఁ బట్టని కృష్ణుని యాలోచనాసాహాయ్యమునే కోరియున్నాడు. మహాభారతము ననుసరించి పాండవులకు బలరామకృష్ణులతోఁ బ్రథమసమాగమము ద్రౌపదీ స్వయంవరకాలమునఁ గలిగినది అప్పుడే కృష్ణునిమనస్సు పాండవపక్షమైనది. శ్రీమద్భాగవత విష్ణుపురాణములలోఁ గృష్ణుఁడు కంసునిఁ జంపి మధురాపురిఁ జేరునాఁటికే పాండవులు పితృవియోగము నొంది హస్తిపురికిఁ జేరఁగా దుర్యోధనుఁడు వారిం బాధించుచుండినటులను దానిని గృష్ణుఁడు తెలిసికొని యుద్ధవుని ధృతరాష్ట్రికడ కంపి పాండవులఁ గాపాడ సందేశము నంపినటులను గలదు. మఱియు విష్ణుపురాణ హరివంశములలో ధృతరాష్ట్రుఁడు పాండవులను వారణావతమునకుఁ బంపఁగా దుర్యోధనుఁ డచటఁ బాండవులకుఁ జేయఁబోవు నపకారములనుండి వారింగాపాడ బలరామకృష్ణులు వారణావతమునకుఁ బోయిరి. కాని సత్రాజిత్తును శతధన్వుఁడు చంపెనను వార్తను విని పాండవులకేసాహాయ్యముఁ జేయలేక ద్వారకకు వెంటనే పోయి రనియుఁ గలదు. ద్రౌపదీ స్వయంవరమునాఁటికి యాదవులకేకాక సమస్తరాజలోకమునకును శ్రీకృష్ణునం దాదరము కలదు. కనుకనే మత్స్యయంత్రముఁ గొట్ట యాదవుల కనుజ్ఞ నీయకపోఁగా యాదవులాతనిమాట ననుసరించి మత్స్యయంత్రముఁ గొట్టకపోవుటయు [1]శల్యకర్ణులు భీమార్జునులచేఁ బరాజయము నొందఁగా సుయోధనాదులు భీమాదుల వృత్తాంతముఁ దెలిసికొనఁగోర శ్రీకృష్ణుఁడు వలదన నాతని మాట నాదరించి మానుటయుఁ గలిగినది

[2]ద్రౌపది నర్జునుఁడు కుంభకార కుటీరమునకుఁ దీసికొనిపోయిన వెంటనే కృష్ణుఁడు బలరామునితో నచటి కేగి తమ్ము నెఱిగించుకొనెను. పాండవులింకను ద్రౌపదిని బెండ్లియాడకుండుటచేతను వివాహ విధాన మెటులగునో యని తలఁచి కాఁబోలు శ్రీకృష్ణుఁడు మారాక యేరికిఁ దెలియరాదని యన్నతో రహస్యముగానే తమ శిబిరమునకుఁ జేరియున్నాఁడు.

ద్రౌపదీ వివాహ కాలమున కనేక బహుమానములఁ బాండవుల కంపియుఁ బిమ్మటఁ దాను ద్రుపదపురమునకు వచ్చియుఁ బాండవులతోఁ గృష్ణుడు దృఢమైత్రిఁ గలిపియున్నాఁడు. పాండవులతో నిటులు మైత్రి కలిగించుకొనుటకుఁ గల కారణము నాఁటికాలమునఁ దమ్ము మిగుల బాధించు జరాసంధుని దాడుల నరికట్టుటకై యుండునని తలఁపవలసియుండును. జరాసంధుఁ డెటులఁ దలఁచి యుండెనో కాని యాదవ పాంచాల పాండవుల కలయిక హస్తిపురిలోని రాజ

---

1. ఆదపర్వ. 189, 190 అధ్యా
2. ఆదిపర్వ. 191 అధ్యా.

కీయవేత్తలకుఁ గురుదేశోపద్రవకర మీ మిత్రమండలి (ట్రిపుల్ ఎల్లయన్సు) కూడికయని భీతిం బుట్టించెను. ఈ మిత్రమండలి నెటులు సమాధానపఱుప వలయునను వితర్కము భీష్మాదులకుఁ గలిగెను. తుద కర్ధరాజ్యముఁ బాండవుల కిచ్చి సమాధానపఱిచిరి. ఆ యర్ధరాజ్య ప్రధానము స్థూల దృష్టిచేఁ బాండవులకు లాభకారిగాఁ గాన్పించును గాని ధృతరాష్ట్రుఁ డింద్రప్రస్థరాజ్యము శత్రు మండలము నంటియుండుటచేఁ పాండవులు ప్రబలారిరణములచేఁ బత్తురనియే తలఁచియుండును. అందువలననే కాఁబోలు అర్జునుఁ డుండుటచే మీ క్రిందాదుల వలనఁగూడ భయము కలగదని యర్ధరాజ్యము నిచ్చునప్పుడనినాఁడు అట్టి పరిస్థితియే కలిగినది. ఖాండవ వన మింద్రప్రస్థము నంటియుండును. అందు "తక్షక అశ్వసేన, మయా'', ద్యనార్యవీరులు కలరు. శ్రీకృష్ణసహాయముచే నర్జునుఁడు తక్షకాశ్వసేనులఁ బాఱఁద్రోలి మయుని లోఁబఱచుకొనెను. శ్రీకృష్ణ సహాయము లేకుండిన నర్జునుఁడు ఖాండవ వనదహనముఁ జేయలేఁడు. కృష్ణుఁడు పాండవులతో దృఢసంబంధము కలిగియుండుటకుఁ దన చెలియలి సుభద్ర నర్జునునకుఁ బెండ్లిసేయించెను. ఈ వివాహము కూడదని నాఁడు బలరాముడు లును, మేనటికము శాస్త్రవిరుద్ధమని పిమ్మట పూర్వమీమాంసా శాస్త్రజ్ఞులును వాదించి యెటులనో సమాధానపడిరి. శ్రీకృష్ణుఁడు ధర్మరాజుచే రాజసూయ యాగముఁ జేయించి వారిపలుకుబడియు నైశ్వర్యము నభివృద్ధి నొందించెను. ఈ రాజసూయయాగసందర్భమున జరాసంధ శిశుపాలవధము లెన్నఁదగినవై యున్నవి.

## జరాసంధ వధము

జరాసంధుఁడు మగధ దేశాధిపతి మాత్రమె కాఁడు, చేది దేశాధిపతియగు శిశుపాలుని లోఁబఱచుకొని తనకు సేనానాయకునిగాఁ జేసికొని యున్నాఁడు. విదర్భదేశాధిపతి యగు "భీష్మకుఁడు", వంగ, పుండ్ర దేశముల కధిపతియగు "పౌండ్రకవాసుదేవుఁడు," ప్రాగ్జ్యోతిషాధిపతి యగు "భగవదత్తుఁడు", కళింగ దేశాధిపతి యగు "చిత్రాంగదుఁడు", జరాసంధుని కనుయాయులై యుండిరి. [1]అనఁగా నేఁటి బేహారు బంగాళా అసాం ఒరిస్సా బీరారు రాష్ట్రములును మధ్య రాష్ట్రములోని తూర్పుభాగమును చీనారాజ్యములోని కొంతభాగమును జరాసంధు నకు లోఁబడియుండెను. కాన ప్రాగ్భారత ఖండమునకు సార్వభౌముఁడు జరాసంధుఁడు. మత్స్య కుంతిభోజ పాంచాలాది దేశప్రభువులుకూడ జరాసంధునకు వినయముఁ జూపుచుండిరి. జరాసంధుఁడు తనకూఁతుల నిరువురను గంసునకుఁ బెండ్లిచేసియుండెను. కంసునిఁ గృష్ణుఁడు వధింపఁగా జరాసంధుఁడు కృష్ణునిపై

1. సభాపర్వ 14 అధ్యా.

దండెత్తివచ్చెను. కృష్ణుఁడు మాయచే నాతనిని సేనానాయకులగు "హంస, డిభకృలు" చచ్చునటులఁ జేసి జరాసంధుఁడు సేనలను సర్దుకొనులోపునఁ బదునెనిమిదివేల యాదవులతోఁ బశ్చిమ సముద్ర తీరస్థమగు "కుశస్థలిం" జేరి యచట ద్వారకాపురిని నిర్మించుకొని యచట నివసించెను. [1]జరాసంధుని జయించినఁగాని రాజసూయము నెరవేఱదు. కృష్ణుని ప్రబలశత్రువు నశింపఁడు ప్రత్యక్షముగా యాదవులు కాని పాండవులు కాని ఉభయులు కలిసికాని జరాసంధుని జయింపగల శక్తిసామర్థ్యములు గలిగి యుండలేదు. అందువలనం గృష్ణుఁడు భీమపార్థులతోఁ గూడి బ్రాహ్మణ వేషములను వేసికొని జరాసంధుని రాజధాని యగు "గిరివ్రజపురి" కేఁగి రాజబాటనుగాక పెడదారినే జరాసంధ గృహము నర్ధరాత్రమునఁ బ్రవేశించిరి. ఈ వికృత వేషధారులఁ జూచి మీ రెవ్వ రెందులకు వచ్చితిరని జరాసంధుఁడు ప్రశ్నింపఁ గృష్ణుఁడు వీరు నియమయుక్తులు. మధ్యరాత్రానంతరమునఁ గాని తమ వృత్తముఁ జెప్పరనఁగా (బ్రాహ్మణులపై నమ్మక మానాఁడు జరాసంధాదులకు విస్తార ముండుటచే) నగ్నిగృహమున వారినుంచి మధ్యరాత్రానంతరమునఁ బూజాద్రవ్యముతో జరాసంధుఁడు రాఁగాఁ గృష్ణుఁడు భీమునితో నాతనికిఁ బోరు కల్పించి రాత్రియందే చంపించెను. కార్తికశుద్ధ పాడ్యమి మొదలు త్రయోదశి వఱకు యుద్ధము ప్రవర్తించె ననియుఁ జతుర్దశినాఁటి యర్ధరాత్రమున భీముఁడు జరాసంధుం జంపెననియు మహాభారతమునఁ గలదు. ఈ యుద్ధములో భీముఁ డలసట నొందగాఁ గృష్ణుఁడు వాయుబలము నీబలముఁగూడ చూపుమా యనగాఁ భీముఁడు వాయువుఁ దలఁచి శక్తిసంపన్నుఁడై జరాసంధుం జంపెనఁట. [2]పై గాథాసందర్భము నాలోచింపఁగాఁ గార్తికశుద్ధ పాడ్యమినాఁ డింద్రప్రస్థములో నాలోచనము జరిగి త్రయోదశినాఁటికిఁ గృష్ణభీమార్జునులు గిరివ్రజముఁ జేరి చతుర్దశినాఁటి రాత్రి జరాసంధుని గృహమును దొంగదారిం బ్రవేశించి యగ్నిహోత్ర గృహమున జరాసంధుని భీముఁడు చంపి యుండును అపో రంతఃపురమున - నిర్వాతమగు నగ్నిగృహమున - జరిగి యుండుటచే భీమున కాయాసము రాఁగాఁ గృష్ణుఁడెటులనో భీమునకు గాలిలో విశ్రాంతిం గల్పించి జరాసంధుం జంపించియుండు ననియు వితర్కముచే నూహింపఁబడుచున్నది. [3]జరాసంధు నన్యాయముగా జంపిరనియే నాఁటివారు తలఁచిరి. ఈ జరాసంధవధము వలన నాతనిచేఁ జెఱఁ బెట్టబడిన రాజులు విము

1. సభాపర్వ 14 అధ్యా.
2. సభాపర్వ. 21, 23, 24 అధ్యా.
3. సభాపర్వ. 37, 42 అధ్యా.

క్తులై వారు కృష్ణ ధర్మజులకు విధేయులైరి. నాఁటి భారతీయ సాంప్రదాయము ననుసరించి జరాసంధుని పుత్రుఁడగు "సహదేవునిఁ" గృష్ణుఁడు మగధ దేశపు రాజుగా నభిషిక్తుం జేయించి యాతఁడు పాండవులకు విధేయుఁడగునటులఁ జేసెను కాని మాగధులకుఁ బాండవులపై విశ్వాసము కుదురలేదు అందువలననే మాగధులలోఁ గొందఱు మహాయుద్ధములోఁ గౌరవుల పక్షముగా వచ్చి పాండవులతోఁ బోరాడిరి. ధర్మజుఁ డశ్వమేధమునకై గుఱ్ఱమును విడువఁగా సహదేవుని పుత్రుఁడగు "మార్జారి" మగధ సైన్యముతో గూడి యర్జునునితోఁ దలపడి పోరాడెను. కాని జరాసంధవధముతోఁ గృష్ణునకుఁ బ్రబలారిక్షయ మయ్యెను.

## శిశుపాలవధము

చేది దేశాధిపతియుఁ గుంతికిఁ జెల్లెలి కుమారుఁడును గృష్ణునకు మేనత్త కుమారుఁడయ్యు నాతనికి సహజ వైరియు నగు శిశుపాలుఁడొకఁడు ప్రబలుఁడై యుండెను శిపాలుఁడు కృష్ణుని కంటెఁ జాల చిన్నవాఁడు. చిన్నతనమునఁ గృష్ణుఁడు శిశుపాలు నెత్తుకొనువాఁడు.[1] కృష్ణ శిశుపాలురకు మొదట విరోధ ముండెనో లేదో కాని, శిశుపాలునకు వివాహము సేయఁ బిత్రాదులచే సిద్ధపఱుపఁ బడిన రుక్మిణినిఁ గృష్ణుఁ డపహరించుటచేతనె వారికి విరోధ మేర్పడినటులఁ గాన్పించును. శిశుపాలుఁడు కూడ కృష్ణునకు సాపత్న్య సోదరుఁడగు "బభ్రు" వను వాని భార్యను గృష్ణాదులు లేనపుడు ద్వారకపైఁ దండెత్తి యపహరించెను వసుదేవుఁ డశ్వమేధముఁ జేయ నశ్వమును వదలఁగా నా యశ్వము నపహరించి యజ్ఞమునకు విఘ్నముఁ గలిగించెనట! ఇట్టి విరోధములుండఁగా నవి రాజసూయ యాగముఁ జేయునపుడు ప్రజ్వలించినవి ధర్మజుఁడు తనకు విశేషోపకారముఁ జేసిన కృష్ణున కేదేని మహా గౌరవముఁ జేయఁదలఁచి యుండును. తదనుకూలముగా భీష్ముని ప్రోత్సాహముచే నర్ఘ్య ప్రదానము జరిగెను. ఆచార్య ఋత్విక్స్నాతకాదుల కీయఁదగిన సభా తాంబూలము నట్టి పరిస్థితులేవియు లేని కృష్ణున కిచ్చుటచే రాజసూయముఁ జూడవచ్చిన రాజలోకమున కసూయ కలిగెను. కృష్ణునకుఁ బూర్వవైరి యగు శిశుపాలుఁడు దాని నాక్షేపించెను. సహదేవుఁడు మేము చేసిన దానిని కాదనినవారి పని పట్టెదమని తామపు డుత్కృష్ట బలవంతులుగా నుంశుఁచే వచ్చిన రాజులను బెదిరించెను శిశుపాలుఁడు మాత్రము జంకక కృష్ణుఁ డర్ఘ్యముం గ్రహించుట కెంతమాత్ర మర్హుఁడు కాఁడని ప్రోత్సాహకుఁడగు భీష్ముని, అర్ఘ్యమిచ్చిన ధర్మజుని దానం బుచ్చుకొనిన కృష్ణునిగూడ నిరసించెను భీముఁడు కోపోద్రిక్తుఁడై శిశుపాలునితోఁ బోరాడ సిద్ధపడెను గాని శిశుపాలుని బలముఁ దెలిసిన భీష్ముఁడు నీకు శిశుపాలుఁడు తీసి

1. సభాపర్వ. 48 అధ్యా.

పోవువాఁడు గాఁడని భీముని నివారించెను, శిశుపాలుఁ డింతలో సభను వదలి యుద్ధప్రయత్నమునకై బయట కేగఁగా ధర్మజుఁ డనునయ వాక్యములతో శిశుపాలునిఁ దిరిగి సభలోనికిఁ దీసికొని వచ్చెను అపుడు కృష్ణ శిశుపాలురకు కొంత వాక్కలహము జరిగెను ఆ వాక్కలహములోనే తటాలున శ్రీకృష్ణుఁడు చక్రముఁ బ్రయోగించి శిశుపాలుని శిరశ్ఛేదముఁ జేసెను. ఈ శిశుపాలవధము కూడ జరాసంధవధమువలె కపటముగాఁ జేయబడినదే. శిశుపాలునిఁ గపటముగాఁ గృష్ణుఁడు చంపెననికూడ నాఁటివారు తలఁచిరి. [1]పరాకుగా నుండిన శిశుపాలునిం గృష్ణుఁడు వధించెనని యీ క్రింది సాక్ష్యవాక్యము చెప్పుచున్నది.

[2]"ఇపుడా పాపకర్మమును జేసినట్టియు నీచుఁడును విశ్వాసఘాతకుఁడును నగు శ్రీకృష్ణుని యమలోకమునకుఁ బంపుదును. ఏ పాపాత్మునిచే నా సోదరుఁ డగు శిశుపాల మహారాజు చంపఁబడెనో వాని నీ భూమియందు వధించెదను. నా సోదరుఁడు-వీరుఁడు-బాలుఁడు-యుద్ధ భూమియందు లేక ప్రమాదము నొందిన శిశుపాలు నెవఁడు చంపెనో యాజనార్దనునిఁ జంపెదను.

ఈ యర్ఘ్యప్రదానము జాతిద్వేషముఁ బెంచుటకుఁ గారణమైనది. [నేడును గోదావరీమండల ప్రాంతమునందు బ్రాహ్మణ వైశ్యగృహములలో జరుగు వివాహ సమయములలో సదస్యమునాఁ డిచ్చు సభాతాంబూలము (అర్ఘ్యము) నిమిత్తము బ్రాహ్మణుల యధికా రానధికార విషయిక వివాదముల నపుడపుడు చూచుచుందుము. సభాతాంబూల, భూరి తాంబూల (వైశ్య వివాహములలో నిచ్చునది భూరితాంబూలము) వివాదములు దొమ్ములాడుటకును కోర్టులకెక్కుటకును గొన్ని చోటులఁ గారణమగుచున్నవి. శిశుపాలవధ సమయమునఁ గృష్ణ పాండవులతిశయబలవంతులగుటచే వారి నెవరు నెదిరింపలేదట! [3]శ్రీకృష్ణ పాండవుల యీ యతిశయమే సౌంభకయుద్ధమునకుఁ బాండవరాజ్యచ్యుతికిని పిమ్మట మహా భారతయుద్ధమునకుఁ గారణమైనది

1. సభాపర్వ 47 అధ్యా.

2 శ్లో॥ అద్యతం పాపకర్మాణం క్షుద్రం విశ్వాసఘాతినం
శిశుపాలవధామర్షా ద్గమయిష్యే యమక్షయం।
మమ పాపస్వభావేన భ్రాతా యేన నిపాతితః
శిశుపాలో మహీపాల స్తంవధిష్యే మహీతలే
భ్రాతా బాలశ్చ రాజాచ నచ సంగ్రామమూర్ధని
ప్రమత్తశ్చ హతోవీర స్తం హనిష్యే జనార్దనం।
అరణ్య పర్వ 14 అధ్యా.

3. సభాపర్వ. 47 అధ్యా.

# సౌంభకవధము

శిశుపాలుని వధించుటచే నాతనిసోదరుఁడును "మార్తికావత" [1]దేశమునకుఁ బ్రభువునగు "సాళ్వుడు" ద్వారకపై దండయాత్రఁజేసి యాదవులను మిగుల బాధించెను. సాళ్వుఁడు ద్వారకపైఁ బడునపుడు కృష్ణుఁ డింద్రప్రస్థముననే యుండెను సాళ్వుఁడు ద్వారకను భేదింపలేక తన సౌంభకపురిం జేరెను. కృష్ణుఁ డీవృత్తాంతమును విని సౌంభకపురిపై కేగి పదిమాసములు వానితో ఘోరముగాఁ బోరి వానిం జంపెనట![2] శ్రీకృష్ణ చరితముఁ జూడఁగా నాతఁడు రెండు మాఱులు రోదనముఁ జేసినటులఁ గాన్పించును[3] ఒకటి, సాళ్వయుద్ధ సమయమున, రెండు, సంశప్తకు లర్జునునిఁ దన్ను, రథమునఁ గాలు చేతులు కదల్పకుండఁగా మీఁదఁబడినప్పుడు కృష్ణుఁడు, సాళ్వునితోఁ దెఱపి లేకుండఁ బోరునపుడే పాండవులు ద్యూతజితులై యరణ్యావాసమున కేగిరి[4] సాళ్వుల జంపి కృష్ణుఁడు ద్వారకకు రా వేగమె సాత్యకి పాండవుల రాజ్యభ్రష్టత్వముఁ జెప్పెను. ద్యూతకాలమునఁ గృష్ణుఁడు ద్వారకలో నుండెననియు ద్రౌపదీ వస్త్రాపహరణ కాలమునం దామె "హాకృష్ణా! ద్వారకావాస" యనునంతనే "అశరీర" రూపముతో వచ్చి యామె కక్షయ్యవస్త్రముల నిచ్చెననియుఁ జెప్పు వాక్యమునకీ సౌంభక వధగాథ ప్రబల విరోధముగా నున్నది.[5] "నేను ద్వారకలోనే యుండిన యెడల ద్యూతకాలమున కనాహూతుఁడఁగా నైన వచ్చి ద్యూతమును నివారింపనా" యని శ్రీకృష్ణుఁ డనుట గమనింపఁదగిన యంశమై యున్నది.

---

1. మహాభారతములో మువ్వురు "సాళ్వులు" కాన్పించుచున్నారు. ఒకటి "అంబ" వరించినట్టియు భీష్మునితోఁ బోరినట్టియు సాళ్వుడు వీని చరితము "ఆది ఉద్యోగ" పర్వములలోఁ గాన్పించును రెండు శ్రీకృష్ణునితోఁ బోరాడిన సాళ్వుఁడు ఈతఁడే "మార్తికావత" దేశాధిపతియు సౌంభకపురి లేక సౌంభకవిమానము కలవాడు ఈతనిచరితము మహాభారతములోని యరణ్యపర్వములోను శ్రీమద్భాగవతములోని దశమస్కంధములోను విపులముగా వర్ణింపఁబడెను. మూడవ సాళ్వుఁడు ధృష్టద్యుమ్న సాత్యకులచే మహాయుద్ధములోఁ జచ్చెను. వీడు మ్లేచ్ఛసైన్యాధిపతియని మహాభారతానుక్రమణికలోఁ గలదు. మొదటి యిద్దఱు సాళ్వ లొక్కరే యనికూడ మహాభారతానుక్రమణిక సూచించుచున్నది.

2 అరణ్యపర్వ 18 అధ్యా.

3 అరణ్యపర్వ 21 అధ్యా. ద్రోణపర్వ. 19 అధ్యా.

4 అరణ్యపర్వ. 18 అధ్యా.

5. ద్రోణపర్వ. 18 అధ్యా.

జరాసంధ శిశుపాలురు జీవించియుండిన యెడల కురుక్షేత్ర యుద్ధములోఁ గౌరవపక్షముగానె వచ్చియుందురు [1]ఈ సంగతిని ఘటోత్కచవధానంతరము కృష్ణుఁ డర్జునునితోఁ జెప్పుచు నీకై వారి నెటులనో కడతేర్చితి ననుటచేఁ గూడ జరాసంధ శిశుపాలురను కపటముగానె వధించిరని స్పష్టమగుచున్నది. పాండవులు ద్యూతజితులై వనమున కేగిన పిమ్మటచే కృష్ణ ధృష్టద్యుమ్నాదులు వనమున కేగి పాండవుల నోదార్చిరి. కాని, సాళ్వయుద్ధముచే యాదవు లలసియుండుటచేతను, శిశుపాలవధముచే దంతవక్త్ర పౌండ్రక వాసుదేవాదు లలిగి యాదవులపై యుద్ధ సన్నాహములఁ జేయుచుండుటచేతను దక్కినరాజులు కూడ రాజసూయయాగ సమయమునం బాండవుల యౌద్ధత్య విభవములంగాంచి కోపాసూయలచే నెవరేపక్షమునకుం జేరుదురో యను సందిగ్ధస్థితి గలుగుటచేతను, యాదవ పాంచాల పాండవ త్రివర్గము కౌరవులపై దండయాత్రను సాగింపలేరైరి. అర్జునుఁ డస్త్రవిద్యాలాభము నొందుటకుఁ ద్రివిష్టపమునకుఁ బోఁగాఁ దక్కినపాండవులు తీర్థయాత్రలఁ జేయుచు ద్వారక సమీపమునకు వచ్చిరి. అపుడు బలరామాదులు పాండవులఁ బరామర్శము చేయుటలో సాత్యకి, సృంజయ కేకయులతో యాదవులు కౌరవులపైఁ బడి జయింపఁగలరని బలరామాదులఁ బురికొల్పెను. కాని, యర్జునుఁడు రాకపోవుటచేత ధైర్యముచాలక కాఁబోలు ధర్మజాదు లావిజృంభణము నంగీకరింపలేదు [2] పరిస్థితుల నాలోచింపఁగా నాఁటికి సృంజయ కేకయ పాంచాల యాదవుల కన్యోన్యత కలిగినటులఁ దోఁచును యాదవులలోఁగూడ రెండు పక్షములు కలవు భోజకులజులగు శతధన్వా క్రూర కృతవర్మలకును, వృష్ణికులజులగు శ్రీకృష్ణాదులకును బొత్తులేదు. దీనికిఁ గారణ మేమనగా—కంసుఁడు భోజకులజుఁడు. కృష్ణుఁడు వృష్ణికులజుఁడు. కృష్ణుఁడు కంసుం జంపి యాతనితండ్రి యగు "ఉగ్రసేనుని" నామమాత్రపు రాజుగాఁ జేసి సర్వాధికారములను దానె వహించుట, దీని నీ క్రింది హరివంశపద్యము స్పష్టపఱచుచున్నది:

సీ. భోజవంశమువారు • రాజులై యుండంగ
  యాదవుల్ కింకరు • లై చరింతు
రట్టి యన్వయమునఁ • బుట్టియుఁ గడుబాము
  మాలితి నీకంటె • బాలిశుండు
గలఁడె యెవ్వఁడు పుత్రుఁ • బొలియించె నాకృష్ణుఁ
  డెక్కటి తద్రాజ్య • మెల్లఁ దాన

1. ద్రోణపర్వ 181, 182 అధ్యా.
2. అరణ్యపర్వ. 119, 120 అధ్యా.

కొని రిత్తపట్టంబు • నినుబూన్ప నతని పె
ట్టెడు నన్నపిండంబు • గుడిచె దకట

గీ. యెట్లుగాఁ బెద్దవాఁడవై • తేమిబ్రతుకు
సిగ్గుటిన భోగమెట్లు రు • చించె నీకు
హరికి బంటవు గాక నీ • వవనిపతివె
యిట్టి రాజధర్మధ్వంసి • నేను నైప —హ॥ 2 ఆశ్వా.

ఈ వాక్యములు జరాసంధుఁ డుగ్రసేను నాక్షేపించు సందర్భము లోనివి.

సత్రాజిత్తు కుమార్తెయగు సత్యభావను శ్రీకృష్ణు డుద్వాహమగుట రెండవ విరోధ కారణము. సత్రాజిత్తు తన కుమార్తె యగు సత్యభామను "కృతవర్మాక్రూర శతధన్వు"లలో నొకనికిచ్చి పెండ్లిచేయుదునని మాట నిచ్చి "శమంతక మణి" వ్యవహారముచే[1] శ్రీకృష్ణునకు సత్యభామ నిచ్చియున్నాఁడు. ఇందులకే "శతధన్వుఁ" డలిగి కృష్ణుఁ డూరలేనపుడు సత్రాజిత్తుం జంపి శమంతకమణి నపహరించి, పిమ్మట శ్రీకృష్ణభయము మనస్సునకుఁ గలుగఁగా మణి నక్రూరునికి దాఁపనిచ్చి కృతవర్మాదులు తనకు దోడ్పడుటకు భయపడి నిరాకరించుటచేఁ బలాయితుఁ డయ్యెను. కృష్ణ బలరాములు పలాయితుఁడగు శతధన్వుని వెంటాడిరి. కృష్ణుఁ డరణ్యములోఁ బరువిడు శతధన్వుం జంపి వాని వస్త్రాదికముం బరిశీలింపఁగా మణి కాన్పింపలేదు. మణి కాన్పింపలేదని బలదేవునితోఁ గృష్ణుఁడు చెప్పఁగా (వెన్నతోడనె దొంగతనమును నేర్చినవాఁడని కాఁబోలు) బలదేవుఁడు నమ్మక నీవే యామణి నపహరించితివని కోపగించి యాకోపముతోడనె మిథిలాపురికేగి మూడేండ్లచటఁ గాపురముండెనని విష్ణుపురాణములోఁ గలదు.

దీనినిగూర్చి హరివంశమునం దిట్లు కలదు: సత్రాజిత్తుం జంపి శతధన్వుఁడు మణి నపహరింపఁ గృష్ణబలరాములు వానిఁ జంప నాలోచించు చుండఁగ నా సంగతి నెఱిఁగి శతధన్వుఁడు కృతవర్మాక్రూరుల సహాయముఁగోర వారు కృష్ణునకు జడిసి సహాయము సేయ నొల్లనందున శతధన్వుఁడు పురి విడిచి పరువిడెను. వానిఁ దఱుముచు రామకృష్ణులు పోవ శతధన్వుఁడు పొదలు డొంకలుఁ దూఱఁ గృష్ణుఁడు రాము నొక్కెడనునిచి వాని వెంబడించి చక్రముచే శతధన్వు మస్తకము ఖండించి,

క. తలయును జీరయు నోరు మొ
దులుగా శోధించి చూచి • తత్తనువున న
వ్విలసితరత్నము కానఁడ
హలధరుఁడును గూడ వచ్చె • నంతటిలోనన్.

---

1. శమంతకమణి గాథ 'విఘ్నేశ్వర చవితి' కథచే లోకవిదితమయియే యున్నది.

వ. అతం డవ్విధం బాతనికిం జెప్పి శతధన్వవధంబు వితథంబయ్యె నను పలుకు పలికిన నది బొంకను తలంపునం గటకం బడి బలుండు-

తే. అకట కృష్ణ యెట్టిదియొః నీ • యట్టివాఁడు
నిస్సిరో యింతమాత్రకు • నిట్టిఁదయ్యెఁ
బలుకు లేటికి నీతోడి • భ్రాతృధర్మ
మింక నింతియె చాలు నీ • యిచ్చఁ జనుము.

వ. అని యతని శపథవాక్యంబులు విశ్వసింపక సాంత్వనంబులు గైకొనక యిమ్మాయ లే నెఱుంగని యవియె యుడుగు మని పాసి యొక్కరుండును మిథిలాపురంబునకుం జని జనకరాజుచేత సత్కృతుండై తత్సదనంబున నుండె-

ఇచటఁ గృష్ణబలరాముల ప్రవర్తనము కేవలమానుషత్వము - మానుషత్వమె కాదు - పామరజనత్వమును సూచింపుచున్నది. భగవ దవతారపురుషులైనను కేవల పామర జనులవలె మెలఁగుట విచిత్రము. కృష్ణుఁడు ఒట్టులు సత్యములు పెట్టుకొనక, రాయబార సమయమునను, అర్జునుని మోహాపిష్ట సమయమునను జూపిన విశ్వరూపము నేల బలదేవునకుం జూపలేదో!

ఆ సమయముననే దుర్యోధనుఁడు మిథిల కేగి బలరామునికడ గదాయుద్ధ విద్య నేర్చెనట! శమంతకమణి నక్రూరుఁడు చేకొని కృష్ణ భయముచేఁ గాశిం జేరి యచటఁ గాపురముండెను. ప్రజ లక్రూరునిఁ దిరిగి ద్వారకకుఁ దీసికొని రావలసినదని కృష్ణుని గోరఁగా నాతఁడు ప్రజాహితముకై యక్రూరుని రప్పించి రత్న మతనికడ నుండుటఁ దెలసికొని సత్యాబలరాములకు "పైతృకము, జ్యేష్ఠము"నగు భాగములు గల శమంతకమణిని వారితో బోరుపడలేకయు జనహితుఁడగు నక్రూరున కిచ్చినచో గృహకలహము తీరునని తలఁచియు మనస్సు - నందిష్టము లేకుండినను బైమెప్పుకొఱకై యక్రూరునకే యాశమంతకమణినిచ్చి "అక్రూరవరదుఁ"డను బిరుదమును వహించెను. ఈ శమంతకమణిగాథ జరుగుచుండిన కాలమునం బాండవులు "ఏకచక్రపుర" ప్రాంతారణ్యములలోఁ దిరుగుచుండిరి. కృష్ణునకు స్వచక్ర (తన రాజ్యములోని) భయ ముండుట చేతనే కౌరవులపై స్వయముగా యుద్ధముఁ జేయఁగడఁగ లేదు. భోజ వృష్ణికులాల వివాదము, కృతవర్మ దుర్యోధనపక్షముగాఁ గురుక్షేత్ర యుద్ధములోనికి వచ్చుటకును పిమ్మట సర్వయాదవ నాశమునకుఁ గూడ కారణమైనది. పాండవులు ద్వాదశవర్షారణ్యవాసమును ముగించి యజ్ఞాతవాసముఁ జేయఁబోవుచు స్వసైన్యాధికమును శ్రీకృష్ణుని పరముఁ జేసిరి. మధురాపురి భోజులకు మొదటి రాజధాని. కంసుఁడు బలవంతుఁ డగుటచే నిర్భీకుఁడై దుర్గాది సంరక్షణమును జేయలేదు. అందువలన జరాసంధుఁడు కృష్ణుపైఁ జేసిన మొదటిదండయాత్ర యందే మధురా

పురి పూర్వముగా శిథిల మైనది. కాన మథురను వదలి యాదవులు "కుశస్థలి" యను ప్రాచీన పట్టణమునకు సమీపమున ద్వారకను నిర్మించుకొని రని హరి వంశమునం గలదు. పాండవు లరణ్యమున నుండిన కాలమునం గర్ణుడు "కుశస్థలి, మథుర" మొదలగు ప్రదేశములం జయించినటులఁ గాన్పించును. [1]కృష్ణుఁడు కర్ణవిజృంభణము నెటులు సహించెనో? బహుశః యాదవు లాసమయమున నే పౌండ్రకవాసు దేవునితోనో పోరు సల్పుచుందురు. శ్రీకృష్ణుఁడు తన యనుయాయులతో నజ్ఞాతవాసానంతర "మభిమన్యు" వివాహ సమయమునకు విరాట పురమునకుఁ జేరెను. పాండవ పాంచాల యాదవులతో మాత్స్యులు కూడఁ జేరిరి. కర్ణుని దిగ్విజయముచే మతికొందఱు రాజులు కూడా కౌరవులపైఁ గినిసి పాండవుల పక్షమునకు వచ్చినటులఁ గాన్పించెను. అందువలననే పాండవుల కేడక్షౌహిణుల బలమైన రాఁగలిగెను. అభిమన్యు వివాహానంతరము కృష్ణుఁడు పెండ్లికి వచ్చిన రాజులసభలో భవిష్యత్కురుక్షేత్రయుద్ధాంకురములను నాటెను. కూటయుద్ధము బలరామున కిష్టములేదు. నేఁడు భరతఖండమునం గాన్పించు "నతివాద, మితవాద" పక్షములపద్ధతి, "ఉపప్లావ్య" సభలోనె నాఁడు కాన్పించినది. శ్రీకృష్ణ నర్జునుఁడు సహాయముఁ గోరుటకు వచ్చిన సమయముననే దుర్యోధనుఁడును గృష్ణసహాయముఁ గోరుటకు వచ్చుటయుఁ దటస్థించినది. పాండవపక్షపమనస్కుండగు శ్రీకృష్ణునికంటె నాతని "నారాయణగోపాల" బలమె తన కుపకారియని దుర్యోధనుఁడు తలంచెను అస్త్రముం బట్టని కృష్ణుని యాలోచనా సాహాయ్యమే తనకు మహోపకారి యని యర్జునుడుఁ తలపోసెను సాత్యకి యెపుడును పాండవ పక్షపాతియే. కృష్ణ సాత్యకులు పాండవ పక్షముగఁ బోవుటచేతనె పూర్వ వైరములఁ దలపోసి కృతవర్మ "అక్షౌహిణీ" సేనాసమేతుఁడై దుర్యోధను పక్షమున కేగెను. "కృష్ణుని మాయచేతనె విస్తారమగు కురు బలము జయింపఁ బాండవులు ప్రయత్నించుచున్నా"రని సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ జెప్పియున్నాఁడు.[2] కృష్ణుని రాజకీయ దురంధరత్వ మాతని రాయబార సమయమున వెల్లడియైనది. శ్రీకృష్ణ ప్రోత్సాహముచేతనే పాండవులు యుద్ధమునకుఁ బ్రయత్నించుచున్నారు గాన కృష్ణుని లంచముచే (దానోపాయము) లోఁబఱుచుకొనవలెనని ధృతరాష్ట్రుఁడును, కట్టివేసి (దండోపాయముచే) లోఁబఱుచుకొనవలెనని సుయోధనుఁడును దలఁచిరి.[3] రెండును వ్యర్థములేయయ్యెను. శ్రీకృష్ణుని దండించి లోఁబఱుచుకొందు

1. ఆరణ్యపర్వ 258 అధ్యా.
2. ఉద్యోగపర్వ 66 అధ్యా.
3. ఉద్యోగపర్వ 85, 87 అధ్యా.

రనుభయము ధర్మజునకఁ గూడ కలిగెను 1 అట్టి భయముండుటచేతనే కృష్ణుఁ డస్త్రశస్త్రముల ధరించియు సాత్యకిఁగూడఁ దీసికొనియుపోయి యున్నాఁడు. కృష్ణుఁడు కౌరవ సభలో భీష్మాదులకే కాక తక్కిన రాజులకుఁ గూడ సుయోధనునిపై నహితము కలుగునటుల నుపన్యసించెను. పాండవులు తమ యభిప్రాయములఁ దెల్పు సమయమున - అందు భీముఁ బురికొల్పుటలోను ద్రౌపది నోదార్చుటలోను గూడ సంధి పొసఁగనీయకుండఁ జేయు తలంపు కలుగు రీతినె సంభాషించి యా ప్రకారమే చేసెను. అందఱి మనస్సులఁ దన పక్షమునుండి మార్చుచున్న కృష్ణుని బంధింప సుయోధనుఁడు తలఁచెను గాని విదురాదుల యడ్డంకిచే నటుల చేయలేదు ఈ సమయమునఁ జూపిన విశ్వరూప సందర్శనము మోహావిష్టుఁ డగు నర్జునునకుఁ జూపిన విశ్వరూపమువలె కార్యకారి కాలేదు. అట్లు కార్యకారియే యైనచో ధృతరాష్ట్రుఁ డర్ధ రాజ్యమును తప్పక యొసఁగియే యుండును. ఈ విశ్వరూప సందర్శన గాథ సౌతి కాలమునఁ గూర్పఁబడి యుండునని "భారత మీమాంస గ్రంథకర్త"2 తలపోయుట యుక్తముగానె యున్నది కృష్ణుని దుర్యోధనాదులు బంధింప నాలోచించుటను "సాత్యకి" ముందుగఁ దెలిసికొని తమవాఁడైన కృతవర్మం దనపక్షముగానుండు మని కోరియున్నాఁడు. నిజముగా దుర్యోధనుఁడు కృష్ణుని బంధింప యుద్ధమే చేసినయెడల కృతవర్మ యేపక్షమునకుఁ జేరునో? కృష్ణుఁడు కౌరవసభకుఁ బోవుటచేఁ గలుగు లాభములలోఁ గర్ణుని మనస్సును ద్రిప్పుట యెన్నఁదగి యున్నది కర్ణున కంతకుఁబూర్వమె చూచాయఁగా దెలిసిన పాండవ సోదరత్వ గాథను కృష్ణుఁడు బలపఱిచి సాంఘికనీతికి విరుద్ధమును "కౌటిలీయా"ది రాజనీతులకు సమ్మతము నగునటుల ద్రౌపది యాఱవ భర్తనుగా నిన్ను నంగీకరించునని చెప్పెను కర్ణుఁడు లోకమునకుఁ బాపమునకును వెఱచి పాండవులఁ గూడ నంగీకరింపలేదు. కాని పాండవులపైఁ బ్రేమాంకురము మాత్రము కలిగెను. కృష్ణుని దుర్యోధనుఁడు బంధింప నుద్యమించుటను ధర్మజునితోఁ జెప్పలేదు. కాని యుద్ధసన్నద్ధులై దుర్యోధను పక్షముగా వచ్చిన రాజుల కమానుషములఁ జూపి దుర్యోధనునిపై నహితము గలుగునటులఁజేసితి ననుటచేఁ గృష్ణుని బంధింప దుర్యోధనుఁడు యత్నించె ననుగాథకూడ మృష యనియు సౌతి కాలమునఁ గల్పింపఁబడినదనియుఁ జెప్పెడి "భారత మీమాంసా" వాక్యము సత్యమే

1. ఉద్యోగపర్వ 71 అధ్యా

2 "భారతమీమాంస" యను గ్రంథమును "మహారాష్ట్ర" భాషలో నొక పరిశోధకుఁడు వ్రాసియుండెనఁట! దానిని, బ్ర.శ్రీ చర్ల నారాయణశాస్త్రి గారాంధ్రీకరించి, ఆం. సా. పరిషత్పత్రికలోఁ బ్రకటించుచున్నారు.

యని మరల నొకసారి చెప్ప సాహసించుచున్నాఁడను. కౌరవసభలోఁ గృష్ణుఁడు కనఁబఱచినది యేదేని యింద్రజాల మని తలఁచిరేమో? కనుకనే దుర్యోధనుఁడు, ''ఉలూకునిచే'' నర్జునునకు సందేశ మంపుచు నిట్లనుమని చెప్పియుండును.

1''ఓ యర్జునా? వాసుదేవుని భయమువలనఁగాని, నీభయమువలనఁ గాని రాజ్యము నీయను. కేశవునితోఁగూడ వచ్చి యుద్ధముఁ జేయుము. శస్త్రధరుఁడ నగు నాకు యుద్ధమునందు మాయకాని యింద్రజాలముకాని యోర్వలేని తనముగాని భయపెట్టుటకాని యెదురు చెప్పలేవు''

యుద్ధానంతరము ద్వారకకుఁ బోవు మార్గములో ''ఉదంకుఁ''డను ముని కృష్ణుఁడు కురుపాండవులకు సంధిసేయక వృథాగా కురునాశముఁ జేయించె నని కుపితుఁడు కాఁగా నాతనికిఁగూడ విశ్వరూపముఁ జూపి యాతని లోఁబఱచుకొనె నని యశ్వమేధపర్వమునఁ గలదు. పదే పదే చూపు నీవిశ్వరూపములు జ్ఞానుల పక్షమున నెటు లున్నను శత్రువుల పక్షమున నింద్రజాలములుగానె కాన్పించును గదా? విశ్వరూప వ్యవహారము లెట్టి వైనను శ్రీకృష్ణుఁడు పాండవపక్షముగా—అం దర్జునునిపక్షముగా—మెలఁగి దుర్యోధనాదుల నెటులనైన వంచన సేయ వలయు ననియే తలఁచి యుండెను అది దుష్టసంహారమునకే జన్మించె నని పురాణములలో వ్రాయఁబడినను బలరామునకును, భగవద్భక్తాగ్రేసరు లనఁబడు "ఉద్ధవ, అక్రూరా" దులకును తుదకు శ్రీకృష్ణుని తనయులును పరాక్రమశాలురు నగు "సాంబ, ప్రద్యుమ్నా" దులకునుఁ గూడ సహ్యముగా లేదని యీ క్రింది గాథ చెప్పుచున్నది:

2"సమీపించిన యీయుద్ధము మహోపద్రవకరమైన దానినిగాఁ జూచి, బలరాముఁడు, పులులవలె బలవంతులగు "అక్రూరుఁడు" మొదలగువారితోను

1. శ్లో. నభయాద్వాసుదేవస్య, నచాపి తవ ఫల్గున
రాజ్యంప్రత ప్రదాస్యామి యుధ్యస్వ సహకేశవః
నమాయా హీంద్రజాలంవా కుహకా నాబిభీషికా
ఆత్తశస్త్రస్య మే యుద్ధే వహంతి ప్రతిగర్జనాః
- ఉద్యోగపర్వ 160 అధ్యా.

2. శ్లో. తద్దృష్ట్వోపస్థితం యుద్ధం - సహాసన్నం మహాత్యయం
ప్రావిశద్భవనం రాజన్ - పాండవస్య హలాయుధః
సహాక్రూర ప్రభృతిభిః - గద సాంబోద్ధవాదిభిః
రౌక్మిణే యాహుకసుతైః - చారుదేష్ణ పురోగమైః
వృష్ణిముఖ్యై రధిగతై - ర్వ్యాఘ్రైరివ బలోత్కటైః
అభిగుప్తో మహాబాహు - ర్మరుద్భిరివ వాసవః......
......తందృష్ట్వా ధర్మరాజశ్చ - కేశవశ్చ మహాద్యుతిః.

(భోజకులు) గదుఁడు, సాంబుఁడు, ఉద్ధవుఁడు, ప్రద్యుమ్నుఁడు ఆహుక సుతుఁడు, చారుదేష్ణుఁడు మొదలగు వృష్ణికులులతోను పరివృతుఁడై దేవతలచే సేవింపఁబడు నింద్రునివలెఁ బ్రకాశించుచు పాండవ శిబిరమున కేతెంచెను... అట్టి బలరామునిఁ జూచి ధర్మరాజు కృష్ణుఁడు అర్జునుఁడు భీముఁడు తదితర రాజులు లేచి బలరామునిఁ గౌరవించిరి. ధర్మరాజు బలరాముని కరస్పర్శముం గావించెను. ......బలరాముఁడు ధర్మజునితోఁ గూర్చుండెను. పిమ్మట నంద ఱును గూర్చుండిరి. తరువాత బలదేవుఁడు కృష్ణుం జూచి యిట్లనుచున్నాఁడు: ఈ యుద్ధము కఠినమును బురుషక్షయము నై ప్రవర్తింపఁబోవుచున్నది. దైవవశ మున నగు దీని నతిక్రమింప శక్యముకాదు......నేను వాసుదేవునితో 'బంధు వులయందు సమానముగా వర్తింపుము. పాండవు లెట్టివారో దుర్యోధనుఁడును మన కట్టివాఁడే' యని రహస్యమునందుఁ బెక్కుసారులు చెప్పితిని. అర్జునుం

శ్లో. ఉదితిష్ఠత్తతః పార్థో - భీమకర్మా వృకోదరః
గాండీవధన్వా యేచాన్యే - రాజాన స్తత్రకేచన
పూజయాంచక్రిరే తేనై - సహాయాతం హలాయుధం
తత స్తం పాండవో రాజా - కరేపస్పర్శ పాణినా......
......యుధిష్ఠిరేణసహిత - ఉపావిశ దరిందమః
తత స్తేషూపవిష్టేషు - పార్థివేషు సమంతతః
వాసుదేవ మభిప్రేక్ష్య - రౌహిణేయో భ్యభాషత
భవితాయం మహారౌద్రో - దారుణః పురుషక్షయః
దిష్టమేత ద్ధ్రువంమన్యే - నశక్య మతివర్తితుం......
......ఉక్తోమయా వాసుదేవః - పునఃపున రుపహ్వరే
సంబంధిషు సమాం వృత్తిం - వర్తస్వ మధుసూదన
పాండవాహి యథాస్మాకం - తథా దుర్యోధనో నృపః...
......తచ్చమే నాకరోద్వాక్యం త్వదర్థం మధుసూదనః
నిర్విష్ట స్సర్వభావేన-ధనంజయ మవేక్ష్యచ .
ధ్రువోజయః పాండవానా - మితి మేనిశ్చితామతిః
తథా హ్యభినివేశోయం - వాసుదేవస్య భారత
నచాహముత్స హే కృష్ణమృతే లోకముపేక్షితం
ఉభౌశిష్యౌహి మేవీరౌ - గదాయుద్ధవిశారదౌ
తుల్యస్నేహోస్మ్యతో భీమే - తథా దుర్యోధనేనృపే
......నహి శక్ష్యామి కౌరవ్యాన్నశ్యమానా నుపేక్షితుం.

\- ఉద్యోగపర్వ 156 అధ్యా.

జూచుచు - ఆ నా మాటను నీ కుపకారముఁ జేయువాఁడై వినలేదు పాండవులకు జయము ధ్రువ మని నా నిశ్చయాభిప్రాయము. అదియే శ్రీకృష్ణునితఁపుకూడ. నేను కృష్ణుని విడిచి యుండలేను. భీమ దుర్యోధనులు నాకు గదాయుద్ధములో నిపుణులైన శిష్యులగుటచే వారిద్దఱియందు నాకు సమానస్నేహము కలదు:...
.........కౌరవులు నశించుచుండఁగా నుపేక్షించి యుండలేను" అనెను

ఒక్క బలరామునకేకాక తక్కిన యాదవులకుఁ గూడ కృష్ణుని పాండవ పక్షపాతచర్య యిష్టములేదు. కృష్ణుని యీ వ్యవహార మెంతమాత్ర మిష్టము లేనందునను, అది న్యాయముగాఁ గాన్పింపనందుననే కృష్ణునికుమారులును మహాబలవంతులు నగు "ప్రద్యుమ్నుఁడు, సాంబుఁడు" మొదలగవారు కూడ పాండవ పక్షముగా రాలేదు. సాత్యకి యర్జునుని శిష్యుఁ డగుటచేతను పాండవ పక్షముగా రాక తప్పినది కాదు. పై బలరామ వాక్యములచేత నే గాక యీ క్రింది గాంధారీ వాక్యములచేఁ గూడ కృష్ణుఁడే సంధి పొసఁగకుండఁ జేసెనని స్పష్టమగుచున్నది.

[1]"ఓ కృష్ణా! నీ విచ్ఛయించుటవలననే కౌరవుల నాశ ముపేక్షింపఁబడెను. అందువలన నీ వాఫలము ననుభవింతువుగాక!"

ఇది గాంధారి పొలికలనిలో యుద్ధమృతులఁ జూచునప్పు డనిన మాట. భీష్ముని పదిదినముల యుద్ధములోను, అతనిచే దెబ్బలఁ దినిన రెండుమాఱు లర్జునునిఁ బురికొల్పుటకుఁ దాను నొగను విడిచి భీష్ము పైకిఁ బోవుటయు, భీష్ముని గృత్రిమాలోచనము చేతనే పడగొట్టుటకు విచారించు నర్జునునకుఁ బ్రోత్సాహము కలిగించుటయుఁ దప్ప వేఱుపాయములచేఁ గౌరవులకు నష్టము గలిగింపఁ గృష్ణున కవకాశము లభింపలేదు. భీష్ముఁడు పాండవ పక్షపాతియై పాండవ సైన్యమును విశేషముగా నష్టపుచ్చక పది దినములలోను పదివేల రథికులను మాత్రమే వధించెను గాని స్వసైన్యమున కెంతమాత్రము నష్టము రానిరీతి నద్భుతముగ వ్యూహములఁ బన్నుచుఁ గృష్ణుని మాయోపాయములకుఁ గానిఁ యర్జునుని వ్యూహభేదనా నైపుణ్యమునకుఁ గాని యవకాశ మొసఁగక నేఁటికాలమున జర్మనీ సర్వసైన్యాధిపత్యమును వహించిన "హిండెంబర్గు" వలె మెలఁగెను. కాని "మెత్తని పులి" యని సంజయుఁ డొకప్పుడు చెప్పిన ధర్మరాజే రహస్యముగా భీష్ముని పాదములపైఁ బడి యాతఁడు తనంత తానె పడిపోవు నుపాయముఁ జేసె నని, పెంపఁబడిన మహాభారతములో గాన్పించును. ఇందు శ్రీ కృష్ణుని పయోజకత్వము లేదు "వింటర్నిడ్జు" గారు

1. ఇచ్ఛతో పేక్షితో నాశః - కురూణాం మధుసూదన
యస్మాత్త్వయా మహాబాహో - ఫలంతస్మాదవాప్నుహి.
-స్త్రీపర్వ ౨౫ అధ్యా.

భీష్ముని బహిః ప్రఖ్యాతింబట్టి భీష్ముఁడట్టి రాజద్రోహమున కొడిఁగట్టఁడనియు భీష్మ పతనమున కేదేని యుపాయమును శ్రీకృష్ణుడే చెప్పియుండు ననియు వ్రాయుట విచారణీయాంశము భీష్మ పతన గాథను బరిశీలించి చదివినయెడల భీష్మధర్మజు లాలోచించుకొని భీష్ముఁడు పాండవులకు దొరకునటులఁ దన వ్యూహమును వదలి పాండవ సైన్యములోనికిఁ జొచ్చుకొనివచ్చి యుండును. అతనికిఁ దోడువచ్చుటకుఁ బ్రయత్నించు దుశ్శాసనాదుల నర్జునుఁ డడ్డుపఱిచి యుండును భీష్మ ధర్మజులనుకొనిన దానికి వ్యతిరేకముగాఁ బూర్వవైరి యగు శిఖండి భీష్ముని హతుం జేసియుండును. పెంపఁబడిన భారతములో నర్జునునిచేఁ బడఁగొట్టఁబడినటుల విశేషముగా వర్ణింపఁబడినది కాని మూల భారతములో శిఖండి చేతను భీష్ముఁడు హతుఁడయ్యె ననియే చెప్పఁబడియుండెను [1] భీష్ముని యొద్దన మున కెదురుగా శిఖండి యొద్దియుండుటచే దుర్యోధనుఁ డారంభములోనె దుశ్శాసనునితో భీష్ముని జాగ్రత్తగఁ గాపాడు చుండుము. శిఖండి యాతనిఁ బోరి గొనును జుమా యని చెప్పియున్నాఁడు దుశ్శాసనుఁడు కడపటి యుద్ధములోఁ గూడ భీష్మునికై విశేషముగాఁ బెనఁగులాడి యర్జునుని కాఁగ లేకపోయి భీష్ముని శిఖండి బారికై వదలియున్నాఁడు ఎట్లయినను భీష్మపతనమునకు శ్రీకృష్ణుని ప్రయోజకత్వము లేదనియు నాతని యుద్ధ సమయమున నీతని కృత్రిమము లేవియు సాగలేదనియు జెప్పవలసియున్నది. భీష్మయుద్ధారంభమున నర్జునునకుఁ గలిగిన మోహవిభ్రాంతినిఁ బోగొట్టుటకై చేసిన యుపదేశము మాత్ర మనుపమానము యావద్భగవద్గీత యొక్క కర్తృత్వము శ్రీకృష్ణునకు లేదని తలఁచువారు గలరు. అది సత్యమే యై యుండును. కారణమేమన, మహాయుద్ధము సంప్రాప్తమై యిఁక ప్రాణములను విడువఁబోవు చుండఁగా నర్జునునకు నాలువందల యిరువదిశ్లోకముల నాలువుగాఁ గవిత్వమును జెప్పి యుపదేశించె ననుట యయుక్తముగానె కాన్పించును. ఆ సమయమునఁ గృష్ణార్జునులకు జరిగిన సంభాషణము నేసంజయుఁడో విని హిమాలయమున భారతరచనముఁ జేయు వ్యాసునకుఁ జెప్పఁగా నాతఁడు కొంత పెంచి వ్రాసి యుండును. లేక జనమేజయుని కాలమునఁ బెంపఁబడియుండును. సౌతిచే మాత్రము పెంపఁబడియుండలేదని లోకమాన్యతిలకుగారు వ్రాసినది యథార్థముగాఁ గాన్పించుచున్నది. కాని మూలబీజమగు శ్రీకృష్ణుని యుపదేశము మాత్రము నిజమని నమ్మవలసియున్నది. సమస్త బంధువులు హతులగుటకు సిద్ధముగానుండి నపుడర్జునున కట్టివిషాదము కలుగుటలోను శ్రీకృష్ణుఁడు మోహవిభ్రాంతిఁ బోగొట్టుటలోను నబద్ధము లేదు కేవల కౌరవనాశనమే ప్రధానముగాఁ

1. భీష్మపర్వ 13 అధ్యా.

దలఁచి శ్రీకృష్ణుఁ డర్జునునిఁ బెక్కుసారులు ప్రోత్సహించి యున్నాఁడు. అందు యుద్ధారంభమునఁ గలిగిన విభ్రాంతి విశేషమైనది. సర్వబంధువ్యాప్త ప్రేమను పోఁద్రోయుటకు విస్తారముగాఁ జెప్పవలసియుండును. భగవత్సంబంధముగా నైన విశ్వరూపమును తదితరదృష్టిగా నైన నింద్రజాలము జూపవలసిన యవసర మపుడు పూర్ణముగా గలిగియుండెను. కర్తను, భోక్తను నేనేయనియు, "చచ్చిన స్వర్గము నొందుదువు. జయించిన మహాసామ్రాజ్యము నొందుదువు" అని కూడ చెప్పవలసియుండును. ఇట్టి వేదాంతోపదేశములు - తెగింపుమాటలు - పిమ్మట నేడువందలశ్లోకములకు మించిన భగవద్గీతగాఁ బరిణమించెను.

భారతీయ వాఙ్మయమున భగవద్గీతకుఁగల పూజ్యత యద్వితీయము, దీనిపై శ్రీ శంకరాచార్యాదులగు మహామహు లమిత భాష్యములను, వ్యాఖ్యానములను వ్రాసిరి. పై భాష్యములలో శంకరభాష్యము జగత్ప్రఖ్యాతిం గన్నది. అనూహ్యమతచిహ్నితుఁడగు శ్రీకృష్ణునకు పై భాష్యాదులచే నద్వైతు లడ్డబొట్టును విశిష్టాద్వైతులు ద్వాదశోర్ధ్వ పుండ్రములను, ద్వైతు లంగారముద్రలను దగిల్చిరి. ఇపుడు క్రైస్తవులు, మహమ్మదీయులు కూడ గీతలను బఠించుచుండుటచే భవిష్యత్తున సిలువ చిహ్నమును, చంద్రాంకితమును గూడ శ్రీకృష్ణుఁడు ధరించువాఁడు కావచ్చును.

శ్రీ శంకరాచార్యులు భాష్యమును రచించుటకుఁ బూర్వమే సంస్కృత మహాభారతము జ్యావాద్వీపగణములోని దగు "బలిద్వీపము" నకుఁ గొనిపోఁబడెను. అచటఁగల బ్రాహ్మణులు నేఁడును భగవద్గీతను బఠింపుచున్నారు. అచటఁ గల గీత యెట్లున్నదో 1914 సం॥రము జూలై నెల, మోడరన్ రివ్యూ పత్రికయందు వ్రాయఁబడియున్నది. తద్జ్ఞు లాయంశమును బరిశీలింతురుగాక.

కురుక్షేత్రమునఁ జెప్పినయంశములు తొందరలో నుండుటచే నాకు సరిగా బోధపడలేదు గాన ఆ గీతాంశముల మరఁల జెప్పు మని యర్జునుఁడు యుద్ధానంతరమున నింద్రప్రస్థపురిలోని మయసభలో సుఖముగాఁ గూర్చుండి శ్రీకృష్ణు నడిగెను. శ్రీకృష్ణుఁడును, ఆ యంశములు నాకును సరిగా జ్ఞాపకములే వని "అనుగీత" (ఉత్తరగీత) చెప్పెను.[1] ఈ యంశము కూడ నేఁటి భగవద్గీతకు మూలబీజము మోహావిష్టుఁ డగు నర్జునునికి శ్రీకృష్ణుఁ డుపదేశించురూపమునఁ గురుక్షేత్రమున నాటఁబడినను గీతావృక్ష మనుశ్రుతద్వారమున నన్యప్రదేశముననే పెంపఁబడియుండుటను దృఢపఱచుచున్నది.

---

1. అశ్వమేధపర్వ 6 అధ్యా.

ద్రోణుని సైన్యాధిపత్యకాలమున నాతని తొందర చతురంగపు టాటలో శ్రీకృష్ణుడు పాండవులచే దొంగయెత్తులను వేయించి కౌరవుల సైన్యమును విశేషముగా నష్టపఱచెను. "భగదత్త, భూరిశ్రవ, సైంధవ, ద్రోణుల" వధములు శ్రీకృష్ణునాలోచనా విశేషముచేతనె జరిగినవి. అర్జునునిఁ జంపుటకు గుప్తము చేసికొనిన కర్ణునిశక్తికి ఘటోత్కచు నెరఁజేసి యర్జునుఁ గాపాడుటయే గాక యర్జున సంతతికే కురురాజ్యాధిపత్యము కలుగుట కొకబీజమును గూడ నాటెను. అశ్వత్థామచే విడువఁబడిన నారాయణాస్త్రమును వ్యర్థము సేయుటలో నాతని చతురత మిగుల శోభించెను.

కర్ణుని సైన్యాధిపత్య కాలమున రెండవనాఁ డర్జునునకు విశ్రాంతిని గలిగింపఁదలంచి యర్జునుఁ డెపుడు కాన్పించిన నపుడు "భార్గవాస్త్రముఁ" బ్రయోగింప నుద్యుక్తుఁడగు కర్ణునకు భీమాదులతోఁ బోరి యలయిక గలుగు నటులఁ జేసి యర్జునునిఁ శ్రీకృష్ణుఁడు ధర్మజుఁ జూచు నెపమున శిబిరమునకుఁ గొనిపోయె ధర్మార్జునులకుఁ గలిగిన స్వల్ప వివాదమును దానె వృద్ధిచేసి తానె తగవుఁ దీర్చుటలోను, భార్గవాస్త్ర పీడితమగు స్వసైన్యముఁ జూచి కర్ణునితోఁ బోర భయపడు నర్జునునకు భీతిం బోఁగొట్టుటలోను, సర్పముఖాస్త్రమును వ్యర్థము సేయుటలోను, రథము నెత్తుటకై క్రిందికిఁ దిగిన కర్ణుని యుద్ధ ధర్మముచేఁ జంప సందేహించు నర్జునునకు యుద్ధధర్మ వ్యతిరేకముగాఁ బ్రోత్సాహమిడి కర్ణునిఁ జంపించుటలోను శ్రీకృష్ణుని ప్రతిభ మిగుల శోభించెను.

శల్యుని సైన్యాధిపత్య కాలమున గృష్ణునాలోచనావసర మంతగాఁ గలుగ లేదు. మడుఁగులో దాగికొనిన దుర్యోధనునిఁ బైకి రప్పించుటలోఁ గృష్ణుని యాలోచనము కార్యకారి యయ్యెను. దుర్యోధన వధములోఁ గృష్ణుఁ డూరు భంగముఁ జేయుమని భీమునకు నర్జునునిచే సూచింపబడకుండినచో భీముఁడే మృతినొందియుండును.

దుర్యోధనవధములోఁజేసిన యధర్మమునకుఁ గినిసిన తాత్కాలిక క్రోధియగు బలరామునకుఁ గోపోపశాంతి సేయుటయుఁ దన్నధిక్షేపించిన దుర్యోధనునకుఁ బ్రత్యుత్తర మిచ్చుటయు, ద్రోణాదులవధములకు నేనె కారకుఁడ నని యధర్మశంకితు లగు పాండవ పక్షరాజులకు జవాబు చెప్పుటయుఁ జూడఁగా రాజకీయవేత్తలు మొండిజవాబులఁ జెప్పుటను శ్రీకృష్ణుని నాఁటినుండియే పరంపరగా నభ్యసించి రని తలఁపవలసియున్నది.

అశ్వత్థామ దుర్యోధనవధము నాఁటిరాత్రియే పాండవశిబిరము పైఁబడునని కృష్ణుఁడు హస్తిపురికిఁ బోయి ధృతరాష్ట్రు నోదార్చుచుండినపుడె తెలిసికొనెను. అందువలన వేగముగా వచ్చి పాండవులను సాత్యకిని మిష పెట్టి శిబిర

మునకుఁ గొన్ని క్రోశములదూరమునం దున్న "యోమవతీ" తీరమునకుఁ దీసికొనిపోయెను "ధృష్టద్యుమ్నుఁడు, శిఖండి, ఉత్తమౌజుఁడు, యుధామన్యుఁడు" మొదలగు ప్రఖ్యాతిగల పాంచాల వీరులు "ఉపపాండవుల" తోను వీరులగు పాంచాల సైనికులతోను శిబిరమున నుండిరి. ద్రౌపదీ ధృష్టద్యుమ్నులు కృష్ణార్జునులఁ గూడఁ దృణీకరించు మానినీమానవంతులు. ధర్మజునంతరము రాజ్యము నెవరేలవలయునను వివాదాంశము రాఁగలదు. ధర్మజునకును బట్టమహిషియగు ద్రౌపదికిఁ బుట్టిన ప్రతివింధ్యుఁడే రాజ్యార్హుఁడు అతనికిఁ బట్టాభిషేకముఁ జేయింప ద్రౌపదీధృష్టద్యుమ్నాదులు విధిగాఁ బ్రయత్నింతురు. లేక జ్యేష్ఠత్వమునే ప్రధానముగాఁ దలఁచినచో ఘటోత్కచుఁడే రాజ్యార్హుఁడు. అర్జునునకుఁగాని యాతని సంతతికిఁ గాని రాజ్యము సంక్రమించుట యెటులు పొసగును? సాత్యక్యాదులకు మొదటినుండియు నభిమన్యునకే రాజ్యాభిషేకముఁ జేయింపవలయునను తలఁపు కలదు [1] ధర్మజ భీముల సంతతిఁ దప్పించి యర్జున సంతతికి రాజ్యమును సంక్రమింపఁ జేయుటకే ఘటోత్కచునిఁ గర్ణశక్తి కెరసేయుటయే గాక సౌప్తిక వధమునకుఁ గూడ నిష్టపడి ధృష్టద్యుమ్నాదుల నశ్వత్థామ కెరఁజేసెను. అశ్వత్థామ వృత్తాంత మేమాత్రమైనఁ బాండవులకుఁగాని పాంచాలురకుఁగాని తెలిసియుండినచో వారందఱు శిబిరమున "నప్రమత్తులై" చావులఁ దప్పించుకొందురు. కాని. ధృష్టద్యుమ్నాది పాంచాలుర పలుకుబడి హెచ్చయి కృష్ణాదుల పలుకుబడి తగ్గిపోవును. ఘటోత్కచుఁడు చచ్చినను ద్రౌపదీ భీములకుఁ జన్మించిన శ్రుతసేనుం డుండినను ద్రౌపదీ ధృష్టద్యుమ్న భీము లేకమై కృష్ణార్జునులఁ ద్రోసిరాజనఁగలరు దుర్యోధనునిచేఁ గష్టముల నొందినవారిలో భీముఁడే యగ్రగణ్యుఁడు దుర్యోధనాదులను యుద్ధములో నోర్చినవాఁడును భీముఁడే అందువలన రాజ్యమునందాతని కెక్కుడు భాగము కలదు . యుద్ధానంతర మాతఁడు యువరాజగుటయేకాక కోశాధికారికూడ నై యుండుటచేతను ధర్మజార్జునుల కిష్టముండినను ధృతరాష్ట్రుఁడు తన సుతులు మొదలగు వారికి శ్రాద్ధములఁ జేయుటకు ద్రవ్యమును వేఁడగా భీముఁ డనుమతింపనందున రాజస్వమునుండి యొక్కకానినైన నీయలేక ధర్మజార్జునులు స్వంత ధనమును ధృతరాష్ట్రుఁకు సేయు శ్రాద్ధాదుల కిచ్చుకొనిరి [2] ద్రౌపదీ సుతులలో నొకఁడు గాని భీముని సంతతిగాని నిలిచినచో పాండవులలోని భీముఁడు పాంచాలురతోఁ జేరి కృష్ణాదుల పలుకుబడి తగ్గింతురు. యుద్ధారంభమునకే కృష్ణుని చర్యల కయిష్టపడుచుండిన యాదవులు, పాంచాలురతోఁ జేరినను, చేరకుండినను,

---

1. అరణ్యపర్వ 120 అధ్యా.
2. ఆశ్రమవాసపర్వ 11 అధ్యా.

శ్రీకృష్ణుని పక్షమునకు రారు. అందువలనఁ గృష్ణుఁడు దీర్ఘదర్శియై యశ్వత్థామచేఁ బాంచాలురు నుపపాండవులు హతు లగునటులను వదలివేసెను ఇందువలన ద్రౌపదీ భీములు కోఱలు పెఱికిన పాములవంటివారైరి. (ధర్మజునకుఁ "బౌరవ" యను భార్యయు నామె యందు "దేవకుండు"ను, భీమునకుఁ "గాళి" యను భార్యయు నామెయందు "సర్వగతుండు"ను జన్మించి రని భాగవతాదులలోఁ గలదు. ఊరుఁ బేరు లేని వీరి వృత్తాంతము భారతమునం దెచ్చటను గాన్పింపదు) శ్రీకృష్ణుని రాజకీయవేత్తృతచేతనె యర్జునసంతతికి రాజ్యార్హత కలిగెను. తనచెలియలి పౌత్రుఁడగు పరీక్షిత్తు రాజు కాఁగలిగెను. స్త్రీ పర్వములోఁ జెప్పఁబడిన యయోమయ భీమునిగాథయు, 'గాంధారి యొక్క-శాపాదికము, అశ్వత్థామ బ్రహ్మశిరోస్త్రమున కడ్డుపడుటయుఁ బిమ్మట జనమేజయుని కాలమునఁ గూర్పఁబడిన గాథలైయుండును. కారణమేమనఁగా- "అయోమయ" భీముని గాథయే నిజమైనచో (ఆశ్రమవాసపర్వములోఁ జెప్పఁబడిన) భీముఁడు ధృతరాష్ట్రుని దెప్పిపొడుచు వాక్యములలో నయోమయ గాథ నొకసారియైన నెత్తుకొనఁడా? మఱియు గాంధారి పొలికలనిలోఁ జూచిన యభిమన్యాదుల శవములు కాకగృధ్రాదులకు వదలఁబడినను నాఁటి కైదాఱు దినముల క్రితము చచ్చినను ప్రకాశమానములుగా నుండుట యెటులు పొసఁగును? ఆ శవములు తైలద్రోణాదులలో నుంపఁబడలేదు గాంధారి శ్రీకృష్ణునకు శాపమిచ్చు గాథలో ముప్పదియాఱనుట సందర్భముగా లేదు. అట్లు శాపమునే యిచ్చినచో నంత వ్యవధి యేల? వెంటనే మీవా రందఱు చావఁగా దిక్కులేకుండ నీవును జత్తువుగాఁక యని యా మహాపతివ్రత యేల యనరాదు? "యతోధర్మ స్తతోజయః" యను నా పతివ్రతాశిరోమణి మావారల కన్యోన్య కలహము, బెంచి మాకులనాశముఁజేసిన నీపాపఫలము ననుభవింతువుగాఁకయని తిట్టినఁ దిట్టుననిసర్వయాదవ నాశనానంతరము విచారగ్రస్తుఁడగుశ్రీకృష్ణుఁడు గాంధారీవాక్యముఁ దలఁచెను[1] అనుటచేఁబై భావమూహింపఁబడుచున్నది. స్త్రీపర్వగాథలే నిజమైనచోఁ బట్టాభిషేకానంతరము ధర్మజునకు విశేషధర్మోపదేశముఁ జేసినట్టి భీష్ముఁడు తన్నుఁ జూచి శోకించు గాంధారి నొక్క- యోదార్పు వాక్యము నైన పలుకకుండునా? కాన స్త్రీపర్వగాథలసందర్భముగా నున్నవి. మఱియుఁ గృష్ణుఁ డశ్వత్థామ బ్రహ్మశిరోస్త్రము "నపాండవం" బయ్యెడుఁగాఁక యని విడుచు సందర్భగాథలో, ఉత్తరాగర్భమును రక్షించు సంవాదము కృష్ణుఁ డశ్వత్థామతోఁ జరిపినటులు సౌప్తికపర్వాంతమునఁ గలదు. అశ్వమేధపర్వములో "అశ్వత్థామ"చే విడువఁబడిన బ్రహ్మాస్త్రముచే నుత్తరాగర్భజనితుఁ డగు శిశువు శవాకారుఁడై యుండఁగా

1. మౌసలపర్వ 4 అధ్యా

దత్కాలగతుఁడగు శ్రీకృష్ణునితోఁ గుంతీ సుభద్రాదులు మొఱ్ఱనిడఁగా శ్రీకృష్ణుఁడు బ్రహ్మాస్త్ర మంత్రపఠనముఁ జేసి యా శిశువు నుజ్జీవింపఁజేసె ననియు, కులము పరిక్షీణమైనపుడు జన్మించినవాఁడు గాన పరిక్షిత్తను నామము కలవాడయ్యె నని కలదు. [1]బ్రహ్మశిరోఽస్త్రము బ్రహ్మశిరోనామకాస్త్రము నొక్కటి గావనియు వానికి వేర్వేఱు ప్రయోగోపసంహారాదులు గలవనియు మహాభారతమునందే కాక రామాయణాదులవలనను "పంచమహాస్త్ర విధానా"ది మంత్ర శాస్త్రగ్రంథముల వలనను దెలియనగును. కురు పాండవ వీరులలోఁ బెక్కండ్రకు బ్రహ్మాస్త్రము తెలియును. భీష్మ ద్రోణ కర్ణా శ్వత్థామ ధర్మజా ర్జున సాత్యకు లాయస్త్రముఁ బెక్కుసారులు ప్రయోగించిరి. బ్రహ్మశిరోనామకాస్త్రము ద్రోణాశ్వత్థామార్జును లకు మాత్రమె తెలిసినటుల సౌప్తిక పర్వమున సూచింపఁబడెను. సౌప్తిక పర్వములో నొక విధముగాను అశ్వమేధపర్వము మఱియొక రీతిగాను సందర్భశుద్ధి లేని యీ గాథ పిమ్మటఁ గూర్పఁబడి యుండును. శ్రీమద్భాగవతములో నిది మఱియు విరుద్ధముగాఁ జెప్పఁబడినది.

ఉత్తరాగర్భస్థ శిశువు బ్రహ్మాస్త్ర పీడితుఁడై బాధ నొందుచుఁ జావ సిద్ధముగా నుండు సమయమునఁ గృష్ణుఁ డంగుష్ఠ మాత్ర శరీరుఁడై గదాధారియై యామె గర్భముఁ బ్రవేశించి శిశువునకుఁ గాన్పించుచు బ్రహ్మాస్త్రముతోఁ బోరి వానిం ద్రుంచి శిశువును రక్షించి యంతర్హితుండయ్యె ననియు, జన్మించిన శిశువు తన్ను రక్షించిన కృష్ణునిఁ జూచుటకు నలుదిక్కులఁ బరీక్షించుటచేఁ బరీక్షిన్నామధారుండయ్యె ననియుఁ గలదు భారతములోనె యన్యోన్య విరుద్ధముగా వర్ణింపబడిన యీ గాథ భాగవతములో మిగుల విరుద్ధముగా వర్ణింపఁబడుట వింతకాదు. ఒకటి మాత్రము నిజమై యుండును పరీక్షిత్తు జన్మించిన పిమ్మట నేదేని బాలరోగపీడితుఁడై జీవిత సంశయము గలుగఁగాఁ గుంత్యాదులు పాండవులపైఁ గుపితుఁడగు నశ్వత్థామ యేదేని మంత్ర ప్రయోగముఁ జేసి బాలునిఁ జంప నుద్యుక్తుఁడగుచున్నాఁడని తలఁచి కృష్ణుతో మొఱ్ఱ నిడియుందురు. కృష్ణుఁడేదేని మంత్రతంత్రములఁ జేసియుండఁగా శిశువు తేఱుకొని యుండును. అందువలననే శ్రీకృష్ణునకు "పరీక్షిత్ప్రాణ సంధాత" అను బిరుదము పిమ్మటఁ గలిగియుండును "దయ్యములఁ బట్టించుటయు మంత్ర తంత్రాదులచే" వానిని వదల్చుకొనుటయు అథర్వ వేదముననే కలదు. బాలగ్రహాదులకుఁ గూడ మంత్రతంత్రాదులవలంబింప "సుశ్రుతా"ది వైద్య గ్రంథములు చెప్పుచుండఁగాఁ బ్రాచీనులు తప్పక వీనియందు పట్టుదలతో నుండి రనియు నిది మూఢాచారమె కాక ప్రాచీన నాగరికాచారమే యనియుఁ దేటపఱచి యున్నది.

---

1. అశ్వమేధపర్వ. 66, 67, 68, 69 అధ్యా.

ఈ మంత్ర తంత్రాదులయందు నేఁడు హూణ భాషాభ్యాసముచే నాగరికతను సంపాదించుకొనిన వారును నమ్మకమును కలిగి యుండుటఁ జూచుచుండలేదా? శ్రీకృష్ణుఁడు కౌరవవధము నన్యాయముగాఁ జేయించెనని "ఉద్దాలకు" వంటి ఋషికూడ తలఁచెను. ఉద్దాలకునకుఁగూడ శ్రీకృష్ణుడు విశ్వరూపముఁ జూపి కర్తను భోక్తను నేనె యని మోహమునో మోహాపనోదమునో కలిగించెను.[1]

వసుదేవుఁడుకూడ శ్రీకృష్ణుఁడు కురుక్షేత్రయుద్ధములోఁ జేసిన కార్యముల నంగీకరింపఁ దనికాఁబోలు సమరవార్తలను సంకుచిత పఱిచియే నుడివెను. కురు పాండవ సంగ్రామానంతరము కృష్ణుఁడు ముప్పదియాఱు సంవత్సరములు జీవించె నని మహాభారతములోఁ గలదు. ఆ కాలములోఁ గృష్ణుఁడు చేసిన కార్యములలో "అనుగీతను" అర్జునునకుపదేశించుటయుఁ బరీక్షిత్ప్రాణ సంధానముఁ జేయుటయు ననునవియే ప్రఖ్యాతకార్యములు అనుగీత సౌతికాంపు దని విమర్శకుల తలంపు. ఈ ముప్పదియాఱు సంవత్సరములోను మహావీరులందఱు కురుక్షేత్ర యుద్ధముననే మృతినొందుటచే ద్వారకపై దండయాత్రఁ జేయువారు లేకుండిరి కాని, అధికారబలముండుటచే శ్రీకృష్ణుని పక్షపువారగు "వృష్ణి"కులులను, రాజవంశీయులును, జనాధిక్యముగల భోజకులులును, అంతఃకలహములఁ బెంచుకొనుచుండిరనియు, సురాపానము మితిమీఱెననియు, అధికారమత్తతచేఁ గృష్ణసంజాతులు పెద్దలయెడ గౌరవము లేక ఋషీశ్వరులఁగూడ నిర్లక్ష్యము పెట్టుచుండిరనియు, "మౌసలపర్వ"గాథలవలన ద్యోతకమగును. నామమాత్రపు రాజును వృద్ధుఁడునగు "ఉగ్రసేనుని" యాజ్ఞను యాదవులు నిర్లక్ష్యము చేయుచుండిరి. సాక్షాద్భగవదవతార మని యెన్నఁదగిన శ్రీకృష్ణునకుఁ దనయుఁడును, శ్రీరామభక్తాగ్రేసరుఁడగు జాంబవంతుని దౌహిత్రుఁడు నగు సాంబుఁడే గర్భిణీస్త్రీ వేషమును ధరించి కృష్ణసందర్శనమున కేతెంచిన "విశ్వామిత్రా"ది మునులను పేళనముఁ జేసి వారిచేఁ దిట్టుఁ దినుట మత్తత కాక మఱియేమి యగును? అపుడు కలుగుచున్న "ఉత్పాతములం" జూచి యుగ్రసేనుఁడు ద్వారకాలో నెవరును, కృష్ణబలరామాదుల వంశములవారును గూడ సురాపానముం జేయరాదనియుఁ జేసిన యెడల సకుటుంబముగా శూలారోపణముఁ జేయఁబడుదురనియుఁ జాటింపు చేయించెను జనసామాన్యము రాజాజ్ఞచే భయము నొంది సురాపానమును మానిరి[2] కాని, అవతారపురుషుఁ దనఁబడు బలరాముఁడే శ్రీకృష్ణుఁడు సన్నిధి నుండఁగాఁ గృతవర్మతోను సాత్యకితోను గలిసి

1 అశ్వమేధపర్వ. ౫౪ అధ్యా.

2. మౌసలపర్వ 1 అధ్యా.

చెడఁద్రాపెను.[1] ఇది రాజాజ్ఞను లెక్కసేయకపోవుటయే కాక నాఁటికి శ్రీకృష్ణుని
యం "దావంత"యైన గౌరవమును యాదవులు చూపుచుండలేదని స్పష్టము గు
చున్నది. ఎపుడు ప్రజలు రాజాజ్ఞను మన్నింపరో, స్వనాయకుని గౌరవింపరో
నాఁడే యాజాతికి దురవస్థాకాలము సంప్రాప్తమగునని యాదవనాశపుగాథచేఁ
దెలిసికొనవలసి యున్నది. శ్రీకృష్ణుఁడు బలరామునివలెఁ దెగద్రావి "హలి
ప్రియా" యని కల్లునకు శాశ్వత బిరుదము నొసఁగలేదు కాని, మితపానమును
రహస్యముగాఁ జేయువాఁడని యింతకుముందే వ్రాసియుంటిని. తెగఁద్రావి
సాత్యకి సురాపానమత్తుఁడై తనకంటె నధికముగాఁ ద్రావిన కృతవర్మ నధిక్షే
పింపఁగా నాతఁడు సాత్యకిని దిరిగి యధిక్షేపించెను. సాత్యకి కృష్ణునితో
నది పెద్ద యాక్షేపణముగా సూచింప శ్రీకృష్ణుఁడు (వృష్ణి భోజకులజుల వివాద
మును మనస్సునం దుంచుకొని కాఁబోలు) భోజులపైఁ దన కోపదృష్టినిఁ
బ్రసరింపఁ జేసెను. అది యాజ్ఞగాఁ గొని సాత్యకి కృతవర్మఁ దెగవ్రేసి
భోజులపైఁ గవిసెను. అంత సంఖ్యాధిక్యముగల భోజులు బలవంతులై
నను సంఖ్యాహైన్యముగం వృష్ణికులులపైఁ బడి కృష్ణతనయులు నాతని సంబం
ధులు నగు "ప్రద్యుమ్న, సాంబ, అనిరుద్ధ, గద, చారుదేష్ణా"దులను
మడియించిరి భోజులలోఁ గూడ, కృతవర్మ, అక్రూరాదులు మృతినొందిరి.
సంఖ్యాధిక్యముచే మిగిలిన భోజులను శ్రీకృష్ణుఁడే స్వయముగఁ జంపెను.
ఇంతకు సాత్యకి కృతవర్మలకుఁ గల యాక్షేపణాంశము లేవి? కురుక్షేత్ర యుద్ధ
విశేషములే. సాత్యకి మత్తుఁడై యొడలు తెలియక కృతవర్మలను నుపలక్షిం
చుచు నిద్రపోవు సైనికులఁ జంపుట యేపాటి శౌర్యమో యనెను. దానికిఁ
బ్రద్యుమ్నుఁడు సంతసించెను కృతవర్మ, చేయితెగిన భూరిశ్రవసుం జంపుట
యెట్టి శూరత్వ మనెను. ఇదియే వివాదాంశము. సురాపానమత్తులు చేయు
ప్రసంగము లిట్టివియే కదా! లేకుండిన ముప్పదియాఱు వత్సరములకు
బూర్వము జరిగిన యుద్ధవిశేషముల నానాఁ డాక్షేపణారూపముగఁ ద్రవ్వు
కొనుట కేమి సందర్భము కలిగెను? కలహారంభముననే బలరాముఁ డొంటరిగా
సమీపవనమున నొక వృక్షమూలము నాశ్రయించి సమాధినిష్ఠాగరిష్ఠుఁ డయ్యెను.
సురాపానమును విశేషముగఁ జేసిన యాతనికి సమాధినిష్ఠ కుదురునేమో
యనుభవజ్ఞులు చెప్పవలసియున్నది. బలరాముని శ్రీకృష్ణుఁడు సర్వ యాదవ
నాశనాంతరము వనమునఁ జూడఁబోఁగా నాతని ముఖము నుండి మహాసర్ప
మొకటి వెడలి యంతర్హిత మయ్యెనని చెప్పఁబడుటచే బలరాముఁడు మత్తుఁడై
యే వృక్షము క్రిందనో పండుకొని యే దుష్టసర్పము వాతనో పడి మృతుఁ

2. మౌలసపర్వ 8 అధ్యా.

దయ్యెనని తలఁపవలసియున్నది బలరాముఁ డొకప్పుడు సురాపానమత్తుఁడై, ఋషులు సూతుని వలనఁ బురాణములను వినుచున్న నైమిశారణ్యమున కేగి ఋషులు ప్రత్యుత్థానముఁ జేసినను పౌరాణిక నియమము ననుసరించి ప్రత్యుత్థానముఁ జేయని సూతుపైఁ గినిసి నన్నేల మర్యాదం జేయవని యడిగినదే తడవుగా సూతునితలఁ దెగవ్రేసెను. ఋషులు జడిసి పరుగెత్తిరి. పిమ్మటఁ దెలిసి పశ్చాత్తప్తుఁడై తీర్థయాత్రలఁ జేసె ననియు సూతుఁడు బ్రహ్మపదప్రాప్తుం డయ్యె ననియు మార్కండేయ పురాణముఁ గలదు భాగవతములో శౌనకాదులు ప్రార్థింపఁ దన మహిమచే సూతునిఁ బునరుజ్జీవింపఁ జేసి తీర్థయాత్రకేఁగె ననియుఁ గలదు. ఎటులైన బలరాముఁడు తెగఁద్రావి యకార్యముఁ జేయువాఁ డనియు శరీర స్మృతి తెలియక మెలఁగు వాఁడనియుఁ దెలియఁగలదు శ్రీకృష్ణుఁ డనదయై యేమియుఁ దోఁపక శూన్యవనమున నొకచో శయనించి కురువంశక్షయ మెట్లయ్యెనో యాదవ వంశక్షయ మట్లయ్యెఁగదా యని గాంధారీ శాప వాక్యమును స్మరించు చుండఁగా నొకవ్యాధుఁడు దూరమునుండి పొంచి శయనించిన కృష్ణుని మృగముగాఁ దలఁచి బాణముతోఁ గొట్టెను అది కృష్ణుని పాదాగ్రమునఁ దగిలి దానితోనే మృతినొందెను. కృష్ణుఁ డెంతటి యవతారపురుషుఁడైనను, సర్వ యాదవనాశనాంతరము నష్టశేష యాదవకులమును గాపాడుమని "బభ్రువు"ను ద్వారకకు బొమ్మని చెప్పుటలోను, దారుకు నర్జునునికడకంపుటలోను, మృత యాదవ యగు ద్వారకను జేరి వసుదేవునితో నిప్పురుషయగు నిట్టిద్వారకలో నుండలేను. తపస్సుఁ జేయఁబోయెదను. అర్జునుఁడు వచ్చి తక్కినపనులఁ జక్కఁజేయు నని చెప్పి వనములో విచారించుచు శయనించుటలోను, సంపూర్ణ మానవత్వము నొందినరీతి గోచరించును. ఏ తపస్సును చేయలేదు. ఆత్యాసన్న మరణము కూడ శ్రీకృష్ణునకుఁ దెలియ లేదు ఇది సంపూర్ణ మానవత్వము కాదా? అట్టి మానవత్వమె లేకుండిన యెడల అర్జునుడు కృష్ణాంతఃపుర స్త్రీలంగాపాడ హస్తిపురికిఁ గొంపోవుచు బోయలచేఁ గోలుపోయిన యా స్త్రీల భవిష్యద్వృత్తాంతముఁ దెలిసినచో బభ్రువుతో దస్యులు ద్వారక లోని యాదవులు నశించుటచే ద్వారకం దోఁచుకొందు రనియు స్త్రీలఁ గాపాడు మనియు నేల చెప్పి యుండును? అర్జునునికంటెఁ గొన్నిమాసములు పెద్దగా నుండిన శ్రీకృష్ణుఁడు నిర్యాణముఁ జెందునాటికి 104 సంవత్సరముల వాఁడుగా భారతమువలనఁ దెలియనగును ఆంధ్రీకృతభాగవతమునకుఁ టీకవ్రాసినవారు కృష్ణుఁడు 120 సంవత్సరములకుఁ బైఁగా జీవించెనని యేదేదో వ్రాయుట చిత్రము ఆ సంగతిని, పాండవ వయో నిర్ణయసమయమున విమర్శింతును. శ్రీకృష్ణనిర్యాణానంతరము దారుకుని వలన యాదవనాశముఁ దెలిసికొని

యర్జునుఁడు ద్వారకకు వచ్చి వసుదేవునివలన సర్వవృత్తాంతముఁ దెలిసి యప్పుడె మృతినొందిన వసుదేవుని, నరణ్యమున రామకృష్ణుల శరీరములను దహించి, మృతయాదవకాంతలను, బాలురను, పరిజనులను, వీలైనన్ని ధన ధాన్యములను దీసికొని ద్వారక నుండి యింద్రప్రస్థమునకుఁ బ్రయాణమై పట్ట ణమునుండి వెడలఁగనే ద్వారకాపురి సముద్రముప్పొంగుటచే మునిఁగిపోయెను. నేఁటివలెఁగాని యింతకంటె హెచ్చుగాఁగాని భారతకాలమున "భూతో త్పాతశాఖ" (మెటిరియాలాజికల్ డిపార్టుమెంటు) బాగుగా పనిచేయుచున్న నిదర్శనములు కలవు. ఏడుదినములలో నుప్పెన వచ్చి ద్వారకను ముంచు నని నాఁటివారు తెలిసికొనఁగలిగి రనుటయే దీనికి నిదర్శనము. "భూతోత్పాత శాఖ" బాగుగా రాజ్యమునఁ బనిచేయు చుండవలె నని సభాపర్వమునను గలదు. దాని నిట వివరింప నావశ్యకము లేదు అర్జునుఁ డిటుల ననాథలగు స్త్రీ బాల బాలికలను భాగ్యభోగ్యములతో "మరుస్థల" (రాజపుత్రస్థానపుటెడారి) మార్గ మునఁ దీసికొనిపోవుచుండఁగా విశేషసైన్యబలము లేక రక్షణీయులే విస్తార ముగా నుండుటచే దారి దోఁపుడువృత్తిఁగల పంచనదప్రాంత కిరాతు లాసంఘ ముపైఁ బడి దోఁచుకొనిరి అందు స్త్రీలు-విశేషించి కృష్ణునియంతఃపురకాంతలు- కూడ దోఁచుకొనఁబడిరి. అర్జునుఁ డొంటరియగుటచేతను శతాధికవృద్ధుఁడై బలహీనుఁ డగుటచేతను సర్వయాదవ నాశముచేతను, అంతకు దనకు నండయై యుండెడి శ్రీకృష్ణుని నిర్యాణముచే విచారగ్రస్తుఁడై యుండుటచేతను దస్యులగు కిరాతులనుండి విస్తారమగు యాదవ నారీసంఘమును రక్షింపలేకపోయెను. కొందఱు యాదవకాంతలు కామాతురలై కిరాతులఁగూడుటకుఁ జెదిరిపోయిరని యీ క్రింది శ్లోకార్థము చెప్పుచున్నది [1]

"పిమ్మట నందఱు యోధులు నుండఁగా నానారీరత్నము లన్నివైపులను లాఁగివేయఁబడిరి. మఱియుఁ గామమువలననే వెళ్ళిపోయిరి."

పంచనదప్రాంతము నేఁటికాలమున "రావి, బియాస్, సట్లెజ్ చీనాబ్, జీలం'' నదులు ప్రవహించుచోటు. ఇది వేదకాలమునుండి నేఁటికాలము వఱకుఁ బవిత్రమై నటులనే మోటుజాతివారికిని నివాసమై యున్నది. పంచనద ప్రాంతమున ఏకలవ్యాదికిరాతు లుండినటులఁ దోఁచును అచటనే ఏకలవ్యపుత్రుఁ డర్జును నశ్వమేధాశ్వము నరికట్టెను. ఆ యేకలవ్యపుత్రుని యేలుబడిలోని కిరాతు లర్జును నెదిర్చి కృష్ణకాంతల నపహరించి యుందురు. లేక ప్రాచీన

---

1. శ్లో. మిషతాం సర్వయోధానాం । తతస్తాః ప్రమదోత్తమాః
సమంతతో వకృష్యంత కామాచ్చాన్యాః ప్రవవ్రజుః
- మౌసలపర్వ. 87 అధ్యా.

కాలమున నప్పుడప్పుడు భరత ఖండమును దోఁచుకొనిపోవుచుండెడి పారశీక, శక, యవనాదులకుఁ బ్రాచీనస్థానీయులుగానైన పైకిరాతులై యుందురని తలంపవలసి యుండును. దేశము యాదవకలహమునాఁటికె కిరాతావృతమై యుండుటచేతనే శ్రీకృష్ణుఁడు కిరాతులు వచ్చి ద్వారకను దోఁచికొందురని డోలాందోళిత మనస్కుఁడయ్యెను. అర్జునుఁడు ద్వారకకు వచ్చినచో ద్వారకలోనివారిం గాపాడునని తలంచెను. కాని ద్వారకాపురి సముద్రముచే ముంపఁబడు నుపద్రవ స్థితినిగూడ పొందనుండెను. పై కారణములచేఁ బెక్కు దేశములను జయించి తెచ్చిన మహాధనరాసులు, అనర్ఘమణులు, అనల్ప శిల్పములు కృష్ణనిర్యాణానంతరము కిరాతులచే దోఁచుకొనఁబడియు, సముద్రముచే ముంపఁబడియు నశించెను. ఇట్టి మహోపద్రవములచేతనె మన భరతఖండైశ్వర్యము నశించినది. అక్రూరునకుఁజేరిన "శమంతకమణి"యే నేఁడు మన జార్జిప్రభువుకడ నుండిన "కొహినూరు" రత్నమని కొందఱు తలంతురు. అది కృష్ణామండలమునుండి క్రమముగా ఢిల్లీ పాదుషాలకుఁ జేరి రంజితసింగు నొంది యాతనిపుత్రుని నుండి బలవంతముగా విక్టోరియా మహారాజ్ఞి కిప్పింపఁబడినట్లు చదివియున్నాము. శమంతకమణికిని దీనికిని సంబంధ మెంతవఱకుండునో! అక్రూరుఁడు భోజకులజుఁడు ఆతని సంతతివారు వజ్రునికడ నుండ నిష్టములేక చెదరిపోయినట్లు మహాభారతముననే కలదు. భోజులు కృష్ణాతీరమున రాజ్య మేలిన నిదర్శనము లున్నవి. ఆ భోజులద్వారమున శమంతకణి కృష్ణాతీరగతమై పైవిధమున విక్టోరియా మహారాజ్ఞికిఁ జేర్పఁబడినను విరుద్ధము కాకపోవచ్చును.

బహుపత్నీత్వ మయుక్త మని యీ షోడశసహస్రాంతఃపురస్త్రీ గాథయే చెప్పును. శ్రీకృష్ణుఁడు నిర్యాణసమయమునఁగూడ స్త్రీరక్షణ మెటు లగునో యనియే విచారించుచు నట్లు బభ్రువునకును, దారకునకుఁ జెప్పువాక్యములచే నూహింపవలసియున్నది. అర్జునునకు వ్యాసుఁడు షోడశాంతఃపురస్త్రీల యపహరణముఁగూర్చినగాథ కేవియో శాపసంబంధముఁ జెప్పినటుల గ్రంథాంతములఁ గలదు కాని యది నవీన కల్పితమై యుండును. అర్జునుఁడు కృష్ణప్రపౌత్రుఁడగు "వజ్రు" నకు నింద్రప్రస్థ రాజ్యమును, (ఇది ప్రాచీనమై యాదవులకు "అభిజన మగు మధురా రాజ్యముతోఁ గూడియుండి యాదవులు ద్వారకకు వలసపోయిన పిమ్మటను పాండవులచేతనో కౌరవుల చేతనో "ఇంద్రప్రస్థ" రాజ్యములోఁ గలుపబడియుండును. మధురాపురి, ఇంద్రప్రస్థ మని చెప్పఁబడు "ఢిల్లీ"కి నలువదిమైళ్ళకు లోపుననే కలదు. మధురాపురికోటలు కంసునినాఁడే రక్షణార్థముగా నుండుటచేత దృఢదుర్గాదికము గల యింద్రప్రస్థపురమును వజ్రున

కర్ణునుఁడిచ్చి యుండును.) "సరస్వతీపురి"ని సాత్యకి కుమారున కిచ్చెను. (సరస్వతీపురి యెచ్చటిదో తెలియదు) "మార్తికావతమును" కృతవర్మ కుమారున కిచ్చెను. ("మార్తికావతము" మొదట శిశుపాలసోదరుఁడగు సాళ్వుఁ డేలెడి వాఁడు. వానిని గృష్ణుఁడు సంహరింపఁగా వానిపుత్రుఁడు రాజ్యమునకు వచ్చెను. అతఁడు "మార్తికావతుఁడ"నియే భారతమునఁ గలదు కృష్ణపాండవుల యందుండు ప్రాఁబగచే నాతఁడు దుర్యోధనుపక్షమునకు వచ్చి పద్మ వ్యూహములో నభిమన్యుచేఁ జచ్చెను. ఆరాజకమగు నా ప్రదేశమునకుఁ గృతవర్మ సుతుఁడు పరిపాలకుఁడై భోజకులులగు యాదవులఁ గాపాడెను. యాదవులు భోజులునగు వారిసంతతియే "దేవగిరి ఓరుగల్లు, ఒల్లాల" యాదవరాజులకు, విజయనగరరాజులగు బుక్కరాయాదులకు మూలపురుషులుగాఁ దలఁపఁబడు చున్నారు భోజులనుపేరఁ గొందఱు గొల్లలు పశ్చిమాంధ్రమున రాజ్యముఁ జేసిరి. వారిసంతతి నేఁడును గలదు ఇప్పటి యోరుగల్లు పట్టణమునకు "మట్టి వాడ" అనుపేరు కలదు (మృత్తికావతాపరనామధేయ మగు, మార్తికావతము తద్భవరూపమున "మట్టివాడ" యైనదేమో పరిశోధకు లాలోచింతురుగాక!) భోజులలోని యక్రూరుని కుటుంబమును వజ్రునకు నర్జునుఁడు కాపాడ నియోగించెను. కాని పూర్వవైరములఁ దలఁచికాఁబోలు వారతనికడ నుండక చెదరి పోయిరఁట! ఇంతవఱకు వ్రాసిన శ్రీకృష్ణుని చరితము మహాభారతముతో సంబంధించినది.

## ఇతర విషయములు

కృష్ణుఁడు క్షత్రియుఁడు కాఁడు. అందువలననే యాతనికి రాజ్యార్హత కలుగలేదని భారతాదులలోఁ గలదు. ఉత్తమరాజకాంతలను రాక్షసవివాహము చేతనె యాతఁడు పరిగ్రహించెను. అందువలననే పెక్కండ్రు క్షత్రియు లాతనిం ద్వేషించిరి. దుర్యోధనుని కుమార్తె "లక్ష్మణ" యను నామెను కృష్ణపుత్రుఁడు సాంబుఁడు పెండ్లియాడఁ బ్రయత్నింపగా దుర్యోధనాదులు క్షత్రియేతరుఁడు క్షత్రియకాంతం బెండ్లియాడుట కూడదని నిరోధించియు, బలరాముని బలవంతముచేఁ బెండ్లిచేసినటుల భాగవతమునఁ గలదు. ఉద్దాలకుఁడు, దుర్వాసుఁడు శ్రీకృష్ణునిచేతను, "కణ్వవిశ్వామిత్రా"దులు శ్రీకృష్ణపుత్రుల చేతను, శౌనకాదులు గౌరవించు సూతుఁడు బలరామునిచేతను ధిక్కరింపఁబడి తిట్టఁబడుటఁ జూడగా యాదవులకు బ్రాహ్మణులపై నసూయ కలదని తోఁచును. దేవకీపుత్రుఁ డగు కృష్ణుఁడు "ఘోరఅంగిరస్సు" అను మునికి శిష్యుఁడై జ్ఞానోపదేశముఁ బొందినటుల ఛాందోగ్యమునఁ గలదు. ఆ పొందిన జ్ఞానమునకును గీతలలోఁ గృష్ణుఁ డుపదేశించిన జ్ఞానమునకును సంబంధము కానఁబడనందున గీతోపదేశకృష్ణుఁ

డాతఁడు కాఁడేమోయని తిలకు మహాశయుఁడు గీతారహస్యమున వ్రాసియున్నాఁడు. భారతకృష్ణుఁడు వేఱు భాగవతకృష్ణుఁడు వేఱు అని "రామకృష్ణ భాండార్కారు" గారు వ్రాసియున్నారు.

కలకత్తా నివాసియుఁ బ్రస్థానత్రయమునకు నాంగ్లభాషలో వ్యాఖ్యలను వ్రాసిన శ్రీ పండిత సీతానాధతత్త్వభూషణుఁడుగారు శ్రీకృష్ణుని గూర్చి నాకిట్లు వ్రాసియున్నారు: "నాచే రచియింపఁబడిన 1) కృష్ణగీత 2) కృష్ణ పురాణములు అను రెండు గ్రంథములలోను, 'మహాభారతము నేకులచే వ్రాయఁబడిన గ్రంథము. అది నానాయుగములలో వృద్ధి చేయఁబడినది మహాభారత కృష్ణుఁ డితిహాస పురుషుఁడు కాడు ఋగ్వేదములోని యాంగీరసకృష్ణుడు, అసురకృష్ణుఁడు, ఛాందోగ్యములోని దేవకీనందన కృష్ణుఁడు మిశ్రణమై భారతకృష్ణుఁ డయ్యెను' అని చూప యత్నించితిని. ఈ సృష్టింపఁబడిన జీవనచరిత్ర యందుఁ గాలక్రమమున ననేక కథలు కల్పింపఁబడి చేర్పఁబడినవి" అని వ్రాసిరి

భక్తి యనునది ప్రాచీనకాలమున లేకుండెననియు, "కర్మ, జ్ఞానము" అనునవియే ప్రాచీనకాలమున నుండెననియు కృష్ణవిషయిక భక్తి మధ్యకాలమున నేర్పడెననియు శ్రీ లోకమాన్య తిలకు గీతారహస్యములో విశేషముగఁ జర్చించియున్నాఁడు. దాని నిటవ్రాయుటకుఁ దావు చాలదు. కాని నాకుఁ దోచినరీతిని ఒక సంగతిని వ్రాయుచున్నాఁడను. [1]"శాకటాయనుఁ"డను ప్రసిద్ధ వ్యాకరణశాస్త్ర కర్తయు "పాణిని" యను లోకప్రసిద్ధ వ్యాకరణశాస్త్ర కర్తయు "పతంజలి" యను పాణిని వ్యాకరణ భాష్యకర్తయు "వాసుదేవార్జునుల"

1 శాకటాయనుఁడు "భక్తి" అను అధికార సూత్రమునకుఁ బిమ్మట "వాసుదేవార్జునాద్వుఞ్" (8.1-124) అని చెప్పెను. శబ్ద నిష్పత్తిలో వాసుదేవుని భక్తుఁడు వాసుదేవకుఁడు, అర్జునుని భక్తుడు అర్జునకుఁడు అగుననెను పాణిన్యాచార్యులు కూడ తన యష్టాధ్యాయిలో "వాసుదేవార్జునాభ్యాంవున్" (4-3-98) అని చెప్పెను. దీనివలనఁ గూడ పైవిధముననే రూపనిష్పత్తి యగును. కాని శాకటాయనుఁడు "వుఞ్" అనఁగా, పాణిని "వున్" అనెను. స్థూలదృష్టిచే రెంటికి రూపనిష్పత్తిలో నర్థమొక్కటియే, స్వరమునఁ గూడ భేదము లేదు కాని "పతంజలి" మహాభాష్యమునఁ జెప్పిన యీక్రింది వాక్యములచే శాకటాయనుని వాసుదేవార్జున భక్తులను "పాణిని" యొక్క వాసుదేవార్జునభక్తులకును భేదము కలదని తెలియనగును. మహాభాష్యమ్" (4-3-98) కిమర్థం వాసుదేవాశబ్దాత్ "వున్" విధీయతే? "గోత్రక్షత్రియాఖ్యేభ్యో బహులంవుఞ్" ఇత్యవసిద్ధం. నహ్యస్తివిశేషః వాసుదేవ శబ్దాత్ "వుఞోవా, వునోవా?"

యందు భక్తిగల వారుండిరని చెప్పియున్నారు. పతంజల్యాదులు ఋషులుగానె పరిగణింపఁబడిరి. (వైదికఋషులు కారు). పతంజలి క్రీ.పూ 3 వ శతాబ్దము నను, శాకటాయనుఁడు క్రీ.పూ. 12 శతాబ్దప్రాంతమున నుండిరి. శాకటాయనుని కాలమున వాసుదేవార్జునులను వీరులనుగా మాత్రమె తలఁచి భక్తిసేయువారుండిరి. పాణిని కాలమునకు వారిని భగవదవతారములుగాఁ దలఁచుచుండిరి. పతంజలి కాలమున వాసుదేవుని భగవంతునిగాఁ దలఁచుచుండిరి కాని, యర్జును నటులఁ దలఁపరైరి.

క్రీ.పూ. నాలగవశతాబ్దమున "సెల్యూకసు"చేఁ జంద్రగుప్త చక్రవర్తి కడ రాయబారిగా నంపఁబడిన "మెగస్థసీసు" శౌరసేనులను జాతివారు "మధురా పట్టణ" ప్రాంతమున శ్రీకృష్ణునిఁ గొలుచు భక్తులుగా నుండిరని వ్రాసెనఁట! కాన శాకటాయనుని కాలమునఁ గృష్ణార్జునులు క్షత్రియవీరులుగాఁ దలఁచి నేఁడు మనము "శివాజీ, కృష్ణదేవరా" యాదులపై భక్తి సూపుచున్నటుల భక్తిం

---

తదేవరూపం. సఏవస్వరః. ఇదం తర్హిప్రయోజనం వాసుదేవశబ్దస్య, పూర్వనిపాతం వక్ష్యామీతి అథవా నైషాక్షత్రియాఖ్యా, సంజ్ఞైషా తత్ర భగవతః"

తా। ఎందుకొఱకు వాసుదేవశబ్దముకంటె వున్ విధింపబడెను? "గోత్రక్షత్రియాఖ్యేభ్యో బహులంవుఞ్" (4—3—99) అను సూత్రము చేతనే యారూపము సిద్ధించును గదా! విశేష మేమియులేదు. "వుఞ్" అనినను "వున్" అనినను "రూపము, స్వరము" సమానమే. అయితే ప్రయోజన మొకటి కలదు వాసుదేవశబ్దమునకుఁ బూర్వనిపాతము కలదని, లేక క్షత్రియ శబ్దమాత్రముఁ జెప్పునది కాక, భగవంతునిఁజెప్పు శబ్దపరమై యున్నదని—పై భాష్యవాక్యములఁ బట్టి, "వుఞ్" క్షత్రియ మాత్రుని యందుండు భక్తిని "వున్" భగవత్పరముగా నగు భక్తినిఁ జెప్పునని స్పష్టమగుచున్నది. శాకటాయనుఁడు "వుఞ్" వాడుటచే నాతనికాలమున వాసుదేవార్జునులను క్షత్రియవీరులుగాఁ దలఁచుచు వారి యందు భక్తిసేయువారుండిరనియు, అపుడు వాసుదేవుఁడు భగవంతుడుగాఁ దలఁపఁబడలేదనియు, పాణినికాలమునకు వాసుదేవార్జునులు (నరనారాయణులు) భగవదంశా సంభూతులుగాఁ దలఁపఁబడిరనియు పతంజలి కాలమునకు వాసుదేవుఁడు కేవలభగవంతుఁడుగానె తలంపఁబడుచుండె ననియు సూక్ష్మముగా నాలోచించిన స్పష్టమగును. పతంజలి, అర్జున శబ్దముపేరైనఁ దలపెట్టకుండుటచే నర్జునుఁడు భగవత్పదవి నుండి నాఁటివారిచేఁ దొలగింపబడెనని స్పష్టమగుచున్నది.

జూపుచు, పాణిని కాలమునకు నేఁడు మనము బుద్ధ, శంకర, రామానుజాదులపైఁ భక్తిం జూపురీతిని భక్తిఁ జూపుచుండి రనియు "మెగస్థనీసు" కాలమున "శూర సేన" దేశీయులు మాత్రమె (మధురాప్రాంతము శూరసేనదేశము) శ్రీకృష్ణుని కులదైవతముగా సేవించుచుండి రనియు పతంజలి కాలమునకు నర్జునుఁడు పూజ్యస్థానమునుండి తొలఁగె ననియు శ్రీకృష్ణుఁడు కేవలము భగవంతుడుగానె పరిగణింపఁబడె ననియుఁ దెలఁపనై యున్నది.


"గోపాలతాపిన్యుపనిష" దాదులు సంతానగోపాలమంత్రాదులు దీనికిఁ దిమ్మటనే పుట్టియుండును. మహాభారతములోని కృష్ణుఁడు కొన్ని చోటులను మాత్రమే దేవుఁడుగా వర్ణింపఁబడెనుగాని, మిగిలిన ప్రదేశములం దెల్ల నాతఁడు రాజకీయధురంధరుఁడుగాను, వీరుఁడుగానె వర్ణింపఁబడెను పురాణములలోఁ బ్రాచీనముగాఁ దలంపఁబడు "విష్ణు" పురాణములోను, మహాభారతాంతర్గత మనఁబడు "హరివంశము"లోను, దైవ మానుష భావములు రెండు నించుమించు సమానముగానే శ్రీకృష్ణుని విషయమున వర్ణింపఁబడెను. దైవభావాతిశము కొంత హెచ్చుగా నుండిన నుండును శ్రీమద్భాగవతపురాణము, కృష్ణబలరాములు భగవంతుని నల్లని తెల్లని వెండ్రుకలని ద్వితీయ స్కంధమునఁ జెప్పెను. కాని దశమ స్కంధము వచ్చునప్పటి కా సంగతి మఱచి కాఁబోలు కేవలాపరవిష్ణుఁడే దేవకి గర్భమునం జన్మించెనని చెప్పెను బమ్మెరపోతన దాని నాంధ్రీకరించుటలోఁ దన్మయుఁడై పెంచి యాంధ్రీకరించెను బ్రహ్మాండ, పద్మపురాణాదులు శ్రీకృష్ణుని కేవలభగవంతుఁ డనియే చెప్పినవి. "బ్రహ్మవైవర్త" పురాణము శ్రీకృష్ణుఁడు భూలోకవాసి కాక "గోలోకము" అను లోకమున కధిపతి యనియు "రాధ" యను వనితకూడ గోలోకవాసిని యగు స్త్రీ యనియు రాధాకృష్ణులగాథలాలోకపుగాథలే యనియు లోకాతీతగాథలచేఁ బూర్తి సేయఁబడి యున్నది. ఆ లోకాతీతపుగాథలే కాక "రాధా" సంపర్కము కూడ మన భారత కృష్ణునకు లేదని దృఢముగాఁ జెప్పఁగలను. అమరసింహుఁడు తన నామలింగాను శాసనమునఁ దా నుజ్జయినివాసుఁ డగుటచేఁ గాఁబోలు శ్రీకృష్ణుని, నాతని కుటుంబస్థులఁగూడ జెప్పియున్నాఁడు. శ్రీరాముని పేరైనఁ జెప్పలేదు. కాని భారత భాగవతాదులలో నెచ్చటఁ గాన్పింపని "గయోపాఖ్యాన" గాథ యే పురాణములోనిది? ఇది యాంధ్ర దేశములో మాత్రము వ్యాపించెనా? ఆంధ్రేతరదేశములలోఁగూడ కలదా? అను సందియము మిగుల బాధించుచున్నది. పెక్కండాంధ్ర మహాకవులు "చిత్రభారతములు, కృష్ణార్జునుల చరిత్రలు, గయోపాఖ్యానములు"

కను పేరులఁ బెట్టి "పద్య కావ్యములు, ద్విపదకావ్యములు, నాటకములు"గా రచించి ప్రఖ్యాతి నొందియున్నారు[1] ఈ కథ కూడ ద్రౌపదీవస్త్రాపహరణ గాథవలె నాంధ్రదేశమున వ్యాప్తినొందుట యాశ్చర్యకరము గయోపాఖ్యాన గాథను గ్రంథ రూపకముగాఁజేయువారిలో "నాదెండ్ల గోపప్రధాని" ప్రథముఁడుగాఁ గాన్పించును. ఈతఁడు శ్రీకృష్ణదేవరాయల మంత్రి యగు తిమ్మనమంత్రి మేనల్లుఁ డగుటచే నాంధ్ర కావ్యములలోఁ బ్రథమకావ్య మగు "మనుచరిత్ర" వలె గణన కెక్కవలసియుండెను గాని, కవిత్వమంత సరసముగా నుండ నందున విఖ్యాతి నొందలేదు. గయోపాఖ్యాన గ్రంథములలో బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహకవిగారి నాటకమున కుండిన ప్రసిద్ధి దేనికిని లేదు. గయోపాఖ్యానకవులందఱు నింపుమించు కృష్ణార్జునుల వివాదమును బెంచి "ధీరోదాత్త" పురుషు లగువారిని "ధీరోద్ధతులు" కారుగదా "అధమాధములు"గాఁ గూడ నుండునటులఁ జేసిరని "యలంకారశాస్త్ర" దృష్టిచేఁ జెప్పవలసియున్నది. కృష్ణార్జునులు మధుపానముఁ జేయువారని భారతమున వర్ణింపఁబడినందున, "మధుశాలల" దగ్గఱ సంచరించు మధుపుల సంభాషణములవలె వారి సంవాదమును వర్ణించిరా యని యుత్ప్రేక్షింపవలసియున్నది. గీతాభాష్యాదికముచే మహాపురుషుఁడుగాఁ దలఁపఁబడు శ్రీకృష్ణుని చారిత్రక దృష్టిచే వివిధముగా విమర్శించినందులకుఁ జదువరు లలుగకుందురుగాక! ధీరేంద్రనాథపాలు, బంకిన్ చంద్ర ఛటర్జీ, శ్రీ బొబ్బిలి మహారాజు, లాలా లజపతిరాయి మొదలగు మహామహులు శ్రీకృష్ణ చరితములను వ్రాసియున్నారు వారి విమర్శనములకును నా విమర్శనమునకుఁ గొంతభేదము కలదు. కేవల చారిత్రక దృష్టిచేతనే యిది వ్రాయఁబడెను.

---

1. గయోపాఖ్యానగాథను గ్రంథరూపముగా రచించిన మహాకవుల పేరులు గ్రంథ నామములు తెలిసినంతవఱకు వ్రాయుచున్నాఁడను (1) నాదెండ్ల గోపప్రధాని "కృష్ణార్జున చరిత్ర" (2) చరిగొండ ధర్మన్న "చిత్ర భారతము" (3) కస్తూరి రంగకవి "కృష్ణార్జున సంవాదము" (4) రామనామాత్యుఁడు "గయోపాఖ్యానము" (5) పోచిరాజు వీరన్న "కృష్ణార్జునసంవాదము" (6) పుట్టిపాక ఓబయకవి "కృష్ణార్జున చరిత్ర" (7) కోనప్పకవి "గయోపాఖ్యానము" (8) వెలిదెబ్బకుల వేంకటరామకవి "కృష్ణార్జున సంవాదము" (9) చిలకమర్తి లక్ష్మీనృసింహకవి "గయోపాఖ్యానము." (1, 5, 6, 7, 8 గ్రంథములు ద్విపదకావ్యములు; 2, 3, 4 పద్యకావ్యములు; 9 ప్రసిద్ధి నొందిన నాటకము.)

## కృష్ణుని జాతకము.



శ్లో. విజయాబ్ది శ్రావణకృష్ణాష్టమ్యా మర్ధరాత్రౌతు రోహిణ్యాం
వృషలగ్నే ఒథతు రాహుశ్చొమబుధౌచ తృతీయేస్తః
శుక్రస్సుత గోరవిమందౌచ చతుర్థేష్టమే కేతుః
ద్వాదశభావే జీవశ్చైవం శ్రీకృష్ణజన్మసమయేఒభూత్.

ఈ జాతక మొక నవీనరచిత మగు జాతక గ్రంథమున వ్రాయఁబడెను. ఇట్లే యాగ్రంథమున, ధర్మజార్జునుల జాతకములును వ్రాయఁబడెను. ఆ జాతకములలో రాహుకేతుగ్రహప్రసక్తి లేదు. తద్జ్ఞులు ఫలములను నిర్ణయించు కొందరుగాక! కాని పై యార్యావృత్తము తప్పులతోఁ గూడియున్న దని మాత్రము చెప్పవలసి యున్నది.

## విరాటుఁడు

ఈతఁడు మత్స్య దేశాధిపతి. ఈతని తండ్రి పేరు మహాభారతమునఁ గాన్పింపదు. కాని "సత్యవతి" సోదరుఁడు మత్సదేశాధీశ్వరుఁ డయ్యెనని "ఉపరిచరవసువు" గాథలోఁ గలదు. అతని సంతతివాఁడే విరటుఁ డని పురాణాంతరములలో వ్రాయఁబడియుండుటచే నీతఁ డుత్తమక్షత్రియుఁడుకాఁ డని స్పష్టమగుచున్నది. ఈతని కిరువురు భార్యలు గలరు. అందు "సుధేష్ణా" నామము ప్రసిద్ధము. ఈమె నీచజాత్యుత్పన్నుఁడు, త్రాఁగుబోతు, స్త్రీలోలుఁడు నగు కీచకుని సోదరి. కీచకుఁడేకాఁడు సుధేష్ణకూడ త్రాఁగుఁబోతే. సైరంధ్రీవేషముతో నుండిన ద్రౌపదిని గీచకునింటికిఁ గల్లు దెమ్మనునెపమున నామె కిష్టము లేకుండినను బంపినది. ఆ కథాసందర్భము నాలోచింప సుధేష్ణ త్రాఁగుఁబోతే కాక తార్పుఁగత్తె యనికూడ నూహింపవలసియున్నది. సుధేష్ణయే పతివ్రతారక్షకయైనచోఁ గీచకుఁడు ద్రౌపదిని దనకడ కంపుమని కోరినపుడన్నివిధముల నాదౌష్ట్యము

నాఁపఁ బ్రయత్నింపవలసియుండును. వాఁడు మొఱకైవిననియెడల ద్రౌపది నన్యస్థలమునకైనఁ బంపవలయును. భర్తతోఁ జెప్పి కీచకుని పాపకృత్యము నాఁపఁ బ్రయత్నింపవలయును పతివ్రత యన్యస్త్రీ పాతివ్రత్యముఁ గాపాడఁ బ్రయత్నించును గదా! అట్టి యత్నము లేమియుఁ జేయక కీచకుఁ డడిగిన చొప్పున సురను దెమ్మని సైరంధ్రి యిష్టపడకుండినను బలవంతముగా నామెను గీచకునింటికిఁ బంపినది.

విరటుని రాజ్యమున (నేఁడు భరతఖండమునఁగల కొన్ని సామంత రాజ్యములలో వలె) జనుల మానప్రాణములకు రక్షణము లేకుండెను. ద్రౌపది విరాటరాజ సమీపముననే - విరటుఁడు చూచుచుండఁగానె - కీచకునిచేఁ దన్నఁ బడినను రా జేమియుఁ గీచకుని మందలింపక నీకును వానికినిఁగల వివాదపు సంగతి యింతకుముందు తెలియదు కాన నే నేమియుఁ జేయ నీలు లే దని ద్రౌపది తన్ను నిందింపఁగా సమాధాన మొసఁగెనెకాని యపుడైన నావివాదాంశ మును విచారింపలేదు. [1]కీచకుని మందలించుశక్తి సామర్థ్యములు లేమినె వాని నేమియుఁ జేయలే దనియు సాంత్వనవాక్యములచేతనె కీచకుని సాగనం పెననియు భారతమునఁ గాననగును. మఱియుఁ గీచకుఁడు ద్రౌపదితోఁ దనపరాక్రమ విశేషములఁ జెప్పునపుడు నే నీమత్స్యరాజును రాజ్యమున నిల్పఁబెట్టితి ననినాఁడు.[2] ఆంధ్రీకరించుటలో "తిక్కనసోమయాజి" "రా జనఁగా నెపం బిడి విరాటునకుం దగఁ గూడు పెట్టుదున్" అని వ్రాయుట యుక్తముగానె యున్నది. ఇంత మాత్రమె కాదు. "ఉపకీచకులు" ద్రౌపదిని గీచకశవముతో నంటఁగట్టి దహ నముచేయుదు మనినపుడుకూడ విరటుఁడు వారి నేమియుఁ జేయనేరక దాని కంగీకరించియున్నాఁడు. [3]ద్రౌపదిని గీచకవధానంతరము తనపురమును వదలిపొ మ్మనుటకుఁగూడ భయపడి సుదేష్ణచేఁ జెప్పించియున్నాఁడు [4] సన్న్యాసియగు "కంక" భట్టును బాచికలతోఁ గొట్టుటలోమాత్ర మీతనిపరాక్రమము ప్రకాశిం చెను గాని సుశర్మతోఁ బోరాడునపుడు కాన్పింపలేదు వలలుని సహాయమె లేకుండిన నీతఁడు సుశర్మచేఁ జెఱపెట్టఁబడియే యుండును. ఉత్తర కుమారుఁ డీతనికిఁ దగినకూరుఁడగు కుమారుఁడే. అతని ప్రజ్ఞలు లోకవిదితములై యున్నవి. గోగ్రహణ సమయమున కుత్తరుఁడు బాలుఁడని సాధారణముగాఁ దలఁపఁబడు చుండును. కాని యాతఁ డంతకుముందు (ముప్పదియేండ్లకుఁ బూర్వము) ద్రౌపదీ

1. విరాటపర్వ. 14 అధ్యా.
2. విరాటపర్వ. 16 అధ్యా
3. విరాటపర్వ. 28 అధ్యా.
4. విరాటపర్వ 24 అధ్యా

స్వయంవర కాలముననకే యుపకుఁడై ద్రౌపదిని వరింపను, మత్స్య యంత్రముఁ గొట్టను, పాంచాలరాజధానికి బోయియున్నాఁడు[1]. కాన గోగ్రహణ సమయమున కించుమించ బువది వత్సరముం యీడుగఁవాఁడె. సుధేష్ణ కుత్తరకుమారుఁడే కాక "బభ్రువ" అను మఱియొక పుత్రుఁడు నుత్తర యను కుమారియుఁ గలరు. విరటునకు "సురథ" యను వేఱుభార్యయందు "శంఖ శ్వేతులు" అను నిరువురు కుమారులు గలరు. "శతానీకా"దులు పదునొకండుగురు సోదరులు గలరు. శ్వేతుఁడు మాత్రము పరాక్రమము గలవాఁడుగా సంస్కృత భారతమున వర్ణింపఁబడెను[2] ఎందువలననో యాతని వృత్తాంత మాంధ్రీకరింపఁబడలేదు. విరటుఁడు నాతనిసోదరులు, సుతులుఁగూడ మహాయుద్ధములో, భీష్మ ద్రోణ శల్యులచే నిశ్శేషముగాఁ జంపఁబడిరి. మాత్స్యుల సంఖ్యాధిక్యము మాత్రమె కాని శూరత్వము గాన్పింపదు. కాని నిమ్న జాత్యుత్పన్నులుగాఁ గాన్పించు మాత్స్యులు పాండవులకుఁ దోడువచ్చుట మాత్రము పాండవ సంకీర్ణతను దృఢపఱచుచున్నది.

## మలయధ్వజుఁడు

చిత్రవాహనుఁడు, ప్రవీరుఁడనను మాఱుపేరులు గల యీతఁడు ద్రవిడ (పాండ్య) దేశపురాజు. మన్వాదిస్మృతులలో ద్రవిడుఁడు సంకీర్ణజాతి వాఁడుగాఁ జెప్పఁబడెను. అట్టి యీతని కూఁతురు "చిత్రాంగద" నర్జునుఁడు పెండ్లియాఁడి యామెయం దుద్భవించిన "బభ్రువాహనుఁ"డను కుమారుని మలయధ్వజునకే దత్తత నిచ్చెను నాఁటికాలమున దత్తుని యుద్ధమున కాహ్వానింపరు. కాన బభ్రువాహనుఁడు యుద్ధమునకు రాలేదు మలయధ్వజుఁడు యుద్ధముఁ బాండవులకు సహాయుఁడుగా వచ్చి శూరత్వముతోఁ బోరాడి యశ్వత్థామచేఁ జచ్చెను. మలయధ్వజుఁ డతిరథుఁడు. ద్రవిడోర్వీశుని సంబంధముకూడ పాండవ సాంకర్యమును దృఢపఱచుచున్నది.

## పాంచాలురు

కురుక్షేత్ర సంగ్రామములోఁ బాంచాలుర ప్రశంసయె విస్తారము కలిగి యుండుటచేతను, "శతపథ బ్రాహ్మణము"లో కురుపాంచాలుర యుద్ధమొకటి సూచింపఁబడుటచేతను కొందఱు పాశ్చాత్యపండితులే కాక వివేకానందస్వామి మహానుభావుఁడుకూడ పాండవులకుఁ గౌరవులకు యుద్ధము జరుగలే దనియు, "కురుపాంచాలు"రకే యుద్ధము జరిగి యుండు ననియుఁ జెప్పుటకుఁ గారణ

1. ఆదిపర్వ 1౮౬ అధ్యా.
2. భీష్మపర్వ 47, 48 అధ్యా.

మైనది.[1] కాని కురుపాంచాల యుద్ధ మొకటి కురుక్షేత్ర సంగ్రామమునకుఁ గొన్ని శతాబ్దములకు ముందే జరిగెను [2] "సంవరుణుఁ" డను కురరాజపితకును, దుష్యంతుఁడను పాంచాలరాజు మూలపురుషుని సంతతికిని సంగ్రామము జరిగెను. అందు సంవరణుఁడు పదచ్యుతుఁడై పెక్కేండ్లు వనములపాలై సింధునదీ తీరమునఁ బరిభ్రమించుచు "తపతి" యను వనితను బెండ్లియై వసిష్ఠుని మహిమముచేఁ దిరిగి రాజ్యము నొందెను. ఈ గాథను బైపరిశోధకులు గమనింపలేదని తలఁపవలసి యున్నది. పాంచాలురు సంవరణునితోఁ బోరునపుడు విశేషసైన్యము నుపయోగించి నటులును, ఆ యుద్ధ మనేక వత్సరముల కాలము జరిగి నటులను బురాణాంతరములలోఁ గలదు ఆ పోరే "శతపథమున" వర్ణింపఁబడినది. శతపథము నాంగ్లీకరించిన "జ్యూలియస్ యగ్గుహింగు" దొరగారు, తాము రచించిన "యాంగ్లీకృతశతపథ" పీఠికలోఁ బాండురాజుచేఁ గుంతికిఁ జెప్పఁబడిన "శ్వేతకేతు" చరిత్రలోని "శ్వేతకేతువు శతపథము"లో యాజ్ఞవల్క్యునితోఁ గలిసికొని నటులుండుట చేతను, శతపథము పాండురాజునకుఁ బూర్వమె రచింపఁబడి యుండునని యనుమానముగా వ్రాసి యున్నారు. కాని శతపథ రచనము, శ్వేతకేతువు యాజ్ఞవల్క్యుఁడు పుట్టుట మహాభారత యుద్ధానంతరమె కలిగెను. శతపథమును రచించిన ఋషి యాజ్ఞవల్క్యుని శిష్యుఁడు. యాజ్ఞవల్క్య, శ్వేతకేతులు జనమేజయునకుఁ బిమ్మటి వారని యీ గ్రంథము యొక్క 44 పుటలో వ్రాయఁబడి యున్నది.

యాజ్ఞవల్క్యుఁడు జనమేజయునిచేఁ జివర దశలో దర్శపూర్ణిమాసేష్టులఁ జేయించెనని మత్స్యపురాణమునఁ గలదు శ్వేతకేతువు జనమేజయుని సర్పయాగమున సదస్యుఁడై యుండినటులు మహాభారతమునఁ గలదు. కాన నా యిరువురు జనమేజయుని వృద్ధదశలో యువకులుగా నుందురని తలంపవలసియుండును ఆ యంశము ముందు విశదముగా వ్రాయఁబడును.

శతపథ బ్రాహ్మణమును బాగుగఁ బరిశీలించినచో నది "ఐతిరేయ, తైత్తిరీయాది" బ్రాహ్మణములలోని భాగములను "ఛాందోగ్యా, ద్యుపనిషత్తులలోని భాగములను నేటి సమకూర్చిన గ్రంథ మనియు బ్రాహ్మణ గ్రంథకర్త యొక్క కవిత్వము స్వల్పముగా మాత్రమె యుండెననియు స్పష్టమగును. ఆ చర్చనిట వ్రాయనవసరము లేదు. అయినను, శతపథోదిత "కురు పాంచాలో" యుద్ధము సంవరణుని కాలమున జరిగినదే యని మాత్రము చెప్పఁగలను.

1. చూడుఁడు వివేకానందుని ద్వాదశోపన్యాసములు.
2. ఆదిపర్వ 94, 172, 178, అధ్యా.

పాంచాలురు వైదిక కాలము నుండి నేటివఱకు మహా శూరులుగా నుండుట లోకవిదితమై యున్నది మహాభారత కాలమునందు బాంచాలదేశప్రభువు ద్రుపదుఁడు.

## ద్రుపదుఁడు

ఈతఁడు "పృషతుడు" అనువాని పుత్త్రుఁడు. పృషతుఁడు, "ఉగ్రాయుధుఁడు" అను రాజుచే యుద్ధములోఁ దనతండ్రి యగు "దండసేనుఁడు" చంపఁబడుటచేఁ బలాయితుఁడై రాజ్య భ్రష్టుఁడై వనములలో సంచరించుచుండెను. ఆ సమయమున నీతఁడొక "అప్సరస" యందు ద్రుపదునిఁ గనెను. ద్రుపదునిఁ పృషతుఁడు భరద్వాజాశ్రమమున విద్యాభ్యాసమునకై విడువఁగా ద్రోణునితో నీతఁడు వేదమును ధనుర్వేదము నభ్యసించెను. ఉగ్రాయుధుఁడు హస్తిపురిపైఁ గూడ దండయాత్రను సాగించి తత్కాలమునందె మృతినొందిన శంతనుని భార్య యగు "సత్యవతిని" దనకిచ్చిన ముట్టడిని విడుతు ననఁగా భీష్ముఁడు శంతనుని యంత్యక్రియలు ముగియు వఱకు నెటులనో సంధి వాక్యములను నడుపుచుఁ, బిమ్మట నుగ్రాయుధునితో ఘోర రణము సల్పి వానిం జంపుటయే కాక పెక్కేండ్లనుండి పదభ్రష్టుఁడై వనములలో నవయుచుండిన పృషతుని రప్పించి పాంచాల రాజ్యమున వానిని నిలిపెనఁట![1]

పృషతుని యనంతరము ద్రుపదుఁడు తన రాజ్యమునకుఁ బోవుచు సతీర్థుఁ డగు ద్రోణునితోఁ, దన రాజ్యమునకు వచ్చినయెడల విశేషలాభము గలుగఁజేయుదునని యాశ గొలిపి చనియెను. కాని కాలకర్మవశమున ద్రుపదుఁ డట్లుచేయక ద్రోణునితో విరోధముఁ దెచ్చికొనియెను. ద్రుపదునకు "సత్యజిత్తు" అను నొక వీరుడగు సోదరుఁడు గలఁడు. సత్యజిత్తు నర్జునుఁడు కూడ వీరుఁ డనియుఁ దనతో సమానుఁడనియు నొకప్పుడు ప్రశంసించియున్నాడు[2] మఱియు మహాయుద్ధములోఁ బ్రసిద్ధినొందిన "ఉత్తమౌజుఁడు యుధామన్యుడు" ననుజ్ఞాతులును, "సౌత్రామణి" యను భార్యయందుద్భవించిన "సుమిత్రుడు, ప్రియదర్శనుడు, వీరకేతువు శత్రుంజయుడు, సురథుఁడు, ధ్వజకేతువు" నను నార్వురు కుమారులును ద్రుపదునకుఁ గలరు. "సృంజయు" లను జ్ఞాతు లగు శూరసైనికులు కలరు. ఇట్లుండినను ద్రుపదుఁడు తటాలున ద్రోణప్రేరితులై వచ్చిపడిన కురుపాండవులతోఁ బోరలేక యోడి యర్జునునిచేఁ గట్టఁబడి ద్రోణున కర్పింపఁబడి "అహిచ్ఛత్ర" దేశము ("మాకంది" రాజధానిగాఁ గలిగి గంగానదికుత్తరమున నుండిన దేశము) ద్రోణున కిచ్చునటులను గంగకు దక్షిణమై "కాంపిల్య" నగరము రాజధానిగా గలిగి "చర్మణ్వతీ" నది

---

1 హరివంశములో నీ గాథ కలదు.

2. ద్రోణపర్వ. 17 అధ్యా

కుత్తరముగాఁగల దేశము తానేలుటకును జేయునదిలేక సంధి చేసికొనెను. పైకి ద్రుపదుఁడు ద్రోణునకు మిత్రుఁడుగా నటించుచుండినను ద్రోణుపైఁ బగదీర్చుకొనుటకును (బాలురగు కురుపాండవులు దనపైఁ జేసిన దండయాత్ర కంగీకరించుటచేఁ గాఁబోలు) భీష్ము నుక్కణగించుటకును బ్రయత్నించుచుండెను తన కప్పటికుండిన సుత సోదర జ్ఞాతి వర్గములో నెవ్వరును ద్రోణుని జయించువారు లేకుండుటచే "వీరందఱెందుకు, వీరిం గాల్పనా? ఛీ" యని విసిగికొనుచు[1] బ్రాహ్మణుని జయించుకొఱకు బ్రాహ్మణవీర్యమె కావలెనని గంగాతీరమునందలి బ్రాహ్మణాశ్రమములోఁ దిరుగుచు ద్రోణుని జయించు కుమారుని దయసేయుఁడని మునీశ్వరుఁ బ్రార్థించుచుండెను ఎవ్వరు నాతని కోర్కెఁ దీర్పలేరైరి. తుదకు కాశ్యపగోత్రికుఁడగు "ఉపయాజుఁడు" మహాతపశ్శాలి యనియుఁ దన కోర్కెఁ దీర్పగలవాఁడనియుఁ దెలిసికొని యాతని నొకసంవత్సర మాశ్రయించెను. ఉపయాజుఁడు నిష్కామకర్ముఁడు గాన ద్రుపదుఁ డెంత వేఁడినను వాని కోరికఁ దీర్ప నంగీకరింపక ద్రుపదుఁ డిచ్చు లక్షగోవులకు నితర సత్కృతికిఁ గక్కుఱితిపడు స్వభావముగల "యాజుఁడ"ను తన సోదరుని కేఁడ నాతనిఁ బంపెను. యాజోపయాజు లిరువురును వ్యాసునివలె, గర్ణునివలె గానీనులు.[2] ద్రుపదుఁడు కార్యార్థిగాన "యాజు" నాశ్రయించి యెంతయేని లాభముగలుగఁ జేతుననియు, ద్రోణునిజయించు కుమారునిఁ దయచేయుమనియు వేఁడెను. యాజుఁ "డుపయాజుని" మోమోటపెట్టి తనకుసహాయునిఁగాఁ దీసికొని యొక యజ్ఞము ద్రుపదునిచేఁ జేయించెను (1) యజ్ఞాంతమున ద్రుపదునిఁ భార్యను హవిస్సును గ్రహించి పుత్రునిఁగనుటకు సిద్ధముగానుంటివా యని యాజుఁడడుగఁగా గంధాద్యలంకారములను ధరించియుంటినని ద్రుపదునిభార్య యనెను. అటులైన నీవు పుత్రునిఁగనుటకు నర్హురాలవుకావు. దూరముగానుండుమని యాజుఁ డగ్నికుండమున హోమముఁజేయఁ గవచాదియుక్తుఁడై ధనుస్తూణీరములను ధరించిన ధృష్టద్యుమ్నుఁ డగ్నికుండమునుండియే యావిర్భవించెను. అంతకుముందు ద్రుపదుఁడు కోరని ద్రౌపది కూడ వేదిక (అగ్నికుండపుటరుగు)పై యావిర్భవించెను. ద్రౌపదీధృష్టద్యుమ్ను లప్పటికే పదుచువారలై యుండిరి. పైకి మిత్రునివలె నటించుచున్న వాఁడు గాన ద్రుపదుఁ డాధృష్టద్యుమ్నుని ద్రోణుని కడనే ధనుర్విద్య నభ్యసింపఁబంపెను. ద్రోణుఁడు ధృష్టద్యుమ్నుని చర్యలఁ జూచి యాతఁడు తన్నుఁ జంపువాఁడే యగు నని తలఁచియుఁ దనకుండిన ధనురాచార్య

1. ఆదిపర్వ 167 అధ్యా.
2. యాజోపయాజులు "తారణేయులు" అని కలదు. తారణేయులనఁ గానీనులని "మేదనీకోశము."

బిరుదమును బోఁగొట్టుకొననేరక ధృష్టద్యుమ్నునకు ధనుర్విద్య నంతయు నేర్పెనట! పై గాథాసందర్భము నాలోచింపఁగా యాజుఁడు ధనలోభముచే మంచిని చెడ్డను నాలోచింపనివాఁడు గాన ద్రుపదుని సంతోషపెట్టుటకై తన సంబంధుఁడో పుత్రుఁడో యగు యువకుని యజ్ఞవాటికకు వెనుక నుంచి హోమాంతమున నా యువకుఁడు ధనుర్బాణాదికము ధరించి హోమకుండముఁ ద్రొక్కి (మొహరము పండుగులలో నిప్పుగుండముఁ ద్రొక్కువానివలెఁజేసి) రాఁజేసి యుండును 1 ద్రుపదుఁడు ద్రోణు నోర్చు కుమారునే కోరెను గాని, యర్జునునకు భార్య కాఁదగు కుమార్తెను మొదటఁగోరలేదు. ద్రౌపదీ స్వయంవరకాలమున మాత్రము అర్జున కీకన్య నిచ్చిన బాగుగ నుండుననని మాత్రము తలఁచె నని సంస్కృత భారతమునఁ గలదు నన్నయభట్టాంధ్రీకరించుటలో ద్రోణనిజంపు పుత్రుఁడును "పార్థునకు" భార్య గాఁదగిన కుమార్తెయుఁ గావలయు నని యజ్ఞముఁ జేసి నటులు గలదు అదియు నవ్యాప్తిదోషయుక్తముగా నుండె నని పరామర్శముతో నాంధ్ర భారతముఁ జదివిన చదువరులకు విశదమగును. ద్రౌపదీవృత్తాంతము పిమ్మట వ్రాయఁబడును.

## ధృష్టద్యుమ్నుఁడు

ఈతఁ డతిరథశ్రేష్ఠుఁడు, న్యాయశీలుఁడు నని కృష్ణార్జునులే కాక, భీష్ముఁడును బెక్కుసారులు నుడివియున్నాఁడు. ఏనాఁడైన యుద్ధారంభమున ధృష్టద్యుమ్నుఁడు కాన్పించిన ద్రోణుఁ డది తనకు దుశ్శకునముగాఁ దలఁచు చుండువాఁడు. ఈతనికి 1. క్షత్రంజయుఁడు, 2. క్షత్రదేవుఁడు, 3. క్షత్రవర్మ, (ధృష్టవర్మ) 4. క్షత్రధర్ముఁడు నను నలువురు వీరు లగు కుమారులు గలరు. పాండవులను గౌరవులపైఁ బురికొలుపు మొనగాఁ డెవఁ డని ధృతరాష్ట్రుఁడు సంజయు నడిగినపుడు ధృష్టద్యుమ్నుఁడే ముఖ్యుఁడని సంజయుఁడు చెప్పి యున్నాఁడు.[2] ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిఁ జంప మొదటినుండియు సిద్ధపడు చుండెను.[3] ద్రుపద ధృష్టద్యుమ్నుల కిష్ట మగురీతినె ధర్మరాజు మెలఁగువాఁడు. అయిదు గ్రామముల నిచ్చినఁ జాలును మా కని నిక్కచ్చముగాఁ గాన్పించు సంధికి సంపుచుడు కోరిన గ్రామములలో "మాకంది, వారణావతములు" కలవు "మాకంది" ద్రోణుఁ డపహరించిన రాజ్యము వారణావతము కూడా బహుశః ద్రుపదుని రాజ్యములోనిదై యాతని రాజ్యమునకుఁ దూర్పు హద్దయినది.[4] ధృష్ట

---

1. అగ్నిని ద్రొక్కవచ్చు రసాయన తంత్రము లాహాడు గలవని "కౌటిలీయార్థ" శాస్త్రమునఁగూడ చెప్పఁబడెను.
2. ఉద్యోగపర్వ. 56 అధ్యా.
3. అరణ్యపర్వ. 12 అధ్యా.
4. ఉద్యోగపర్వ. 30 అధ్యా.

ద్యుమ్నుని శౌర్యసాహసాదుల నాతనివర్గపు వారి బల పరాక్రమాదులను గమనించియే యాతనికి సర్వసైన్యాధిపత్యము నీయఁ గృష్ణార్జునులు ధర్మజుఁ బ్రోత్సాహ పఱచిరి. పాండవ సైనికుల కందఱకు నీ ధృష్టద్యుమ్నుని సర్వ సైన్యాధిపత్యోద్యోగ ముత్సాహవంతమై యుండెను. ఈతని సంబంధులు కూడ మహాబలవంతు లగుటచేత భీష్మ ద్రోణ కర్ణాదుల కలవిగానివారై, కడకు స్వపక్షపువారగు కృష్ణుని కృతిమాలోచనమునకు లోనై యశ్వత్థామచే నిద్రలోఁ జంపఁబడిరి. ఆవృత్తాంతము శ్రీకృష్ణునిచరితమున స్పష్టపరుపఁబడినది. పాండవపక్షవీరులలోఁ బాంచాలురే ప్రఖ్యాతవీరులు. వీరితోడ్పాటు - అందు ధృష్ట ద్యుమ్నుని తోడ్పాటె - లేకుండిన పాండవులు జయము నందలేకపోవుదురు. భీష్ముని యాఱవనాటి యుద్ధములోను సైంధవవధ ద్రోణవధ దినములలోను ధృష్టద్యుమ్నుని శౌర్యము మిగుల శోభించినది.

[1]ధృష్టద్యుమ్నుఁడు బలపరాక్రమసంయుక్తుఁడు మాత్రమే కాక న్యాయయుక్తుఁ డనికూడ ధర్మజునితో నర్జునుఁడు చెప్పియున్నాఁడు న్యాయముఁ జెప్పునపుడు ధృష్టద్యుమ్నుఁ డర్జుననుగూడ లెక్కసేయలేదు ద్రోణుని జంపుట న్యాయముగా లేదని యర్జునుఁ డనినపుడు ధృష్టద్యుమ్నుఁ డిటులు ధిక్కరించి పలికి పాండవు లను సిగ్గుపఱిచెను.[2]

---

1. ఉద్యోగపర్వ. 150 అధ్యా.
2. శ్లో......హతో ద్రోణో మయా యస్తు కింమాంపార్థ విగర్హసే, అప క్రాంతః స్వధర్మాచ్చ క్షత్రధర్మముపాశ్రితః అమానుషేణ హంత్యస్మా నస్త్రేణ క్షుద్రకర్మకృత్। యథా మాయాం ప్రయుంజాన మసహ్యం బ్రాహ్మణబ్రువం మాయయైవ నిహన్యాద్యో । నయుక్తం తత్ర పార్థ కిమ్. యచ్చమాం ధార్మికో భూత్వా బ్రవీషిగురుఘాతినమ్. తదర్థమహ ముత్పన్నః పాంచాలస్య సుతోఽనలాత్ । యస్య కార్యమకార్యంవా యుధ్యతస్స్యా త్సమంరణే. బ్రాహ్మణంతం కథంబ్రూయా క్షత్రియం వాధనంజయ యోహ్యనస్త్ర దోహన్యా ద్బ్రహ్మాస్త్రైః క్రోధమూర్ఛితః .........యోసౌ మమైవ నాన్యస్య బాంధవాన్ యుధి జఘ్నివాన్ । ఛిత్వాపి తస్యమూర్ధానం. నైవాస్మి విగతజ్వరః। తచ్చమేకృంతతేమర్మ యన్నతస్య శిరోయథా. నిషాదవిషయే క్షిప్తం జయద్రధశిరో యథా నశత్రుర్నిహత స్సంఖ్యే మయా ధర్మేణపాండవ్య యథాత్వయా హత శ్శూరో భగవదత్తః పితుస్సఖా పితామహం రణేహత్వా మన్యసే ధర్మ మాత్మనః. మయాశత్రౌ హతే కస్మా త్పాపే ధర్మంనమన్యసే। సంబంధా వనతంపార్థ నమాంత్వం వక్తుమర్హసి. స్వగాత్రకృతసోపానం నిషణ్ణ

ఓ యర్జునా! నాచే ద్రోణుఁడు చంపఁబడెనని యేల నన్ను నిందించెదవు? (ద్రోణుఁడు) స్వధర్మమగు బ్రాహ్మ్యమును వదలి క్షత్రధర్మము నవలంబించెను నీచకర్మఁ జేయుచు మమ్ము దివ్యాస్త్రములచే హింసించియున్నాఁడు. మాయను బ్రయోగించునట్టియు బ్రాహ్మణబ్రువుఁడై సహింప శక్యముగానట్టియు నీచబ్రాహ్మణుని మాయచేతనె చంపుట యుక్తము కాదా యేమి? నీవు ధార్మికుఁడవై నన్ను గురుఘాతకునిఁగాఁ జెప్పుచుంటివే; నేనతనిఁ జంపుటకే యగ్ని నుండి పుట్టితిని. మఱియుఁ గార్యమైనను నకార్యమైనను రణమున సమముగానె యుద్ధముఁ జేయవలెను. ఓ యర్జునా! ఆ ద్రోణుని బ్రాహ్మడుఁ డనికాని క్షత్రియుఁ డనికాని యెటుల ననవలయునో? అతఁడు క్రోధుఁడై బ్రహ్మాస్త్రముచే నస్త్రవిద్య నెఱుఁగనివారిం జంపుచుండును (ఉత్తము లటుల చంపరు) ......మఱియు నాతఁడు నా బంధువులనే యుద్ధములోఁ జంపువాఁడు ఇతరుల బంధువులను జంపువాఁడు కాఁడు. అతని శిరస్సుఁ ద్రుంచియు నా తాపము పోలేదు. సైంధవుని శిరస్సును (నీవు) నిషాద దేశమునఁ బడవైచినటుల ద్రోణుని శిరస్సును బడవేయ లేనైతినిగదా యని నా హృదయము బాధ నొందుచున్నది.

(ద్రోణుఁడు తాను పాంచాలురఁ జంపినఁగాని కవచమును విడువననియుఁ దానటులు సేయకుండిన శేషించిన పాంచాలురఁ జంపుమని యశ్వత్థామకు దుర్యోధనునిచే సందేశ మంపుటయు నిచట ప్రసక్తము[1]) నీచే పితృసఖుఁడగు భగదత్తుఁ డెటుల చంపఁబడెనో అట్లే ధర్మముగా నా శత్రువు యుద్ధములోఁ జంపఁబడెను పితామహుని (భీష్ముని) యుద్ధమునఁ జంపుట నీకు ధర్మముగాఁ దలఁపబడుచున్నది. నాచే పాపాత్ముఁడగు శత్రువు చంపఁబడినపుడేల పాపమని

---

కృతదంతికం। క్షమామితే సర్వమేవ వాగ్వ్యతిక్రమ మర్జున. ద్రౌపద్యా ద్రౌపదేయానాం కృతేనాస్యేన హేతునా। కులక్రమా గతం వైరం మమాచార్యేణ విశ్రుతం. తథాజానాత్యయంలోకో నయూయం పాండునందనాః ... శిష్యద్రోహీహతఃపాపో యుధ్యస్వ విజయస్తవ...

-ద్రోణపర్వ. 198 అధ్యా.

శ్లో. శృత్వా ద్రుపదపుత్రస్యతా వాచః క్రూరకర్మణః తూష్ణీంభూతా స్తదారాజన్ సర్వఏవవిశాంపతే అర్జునస్తు కటాక్షేణ జిహ్మంప్రేక్ష్య పార్షతం సబాష్ప మతినిశ్వస్య ధిగ్ధిగిత్యేవచాబ్రవీత్ యుధిష్ఠిరశ్చ భీమశ్చ యమౌ కృష్ణ స్తథాపరే ఆసన్ సువ్రీడితారాజన్

ద్రోణపర్వ 199 అధ్యా.

1. ద్రోణపర్వ. 151 అధ్యా.

తలఁచుచున్నావు? స్వశరీరమునే సోపానముగాఁ జేసిన యేనుఁగనై సంబంధముచే లోఁబడిన నన్నో యర్జునా? నిందింప నర్హుఁడవు గావు. ద్రౌపది యొక్కయు ద్రౌపదేయుల యొక్కయు సంబంధము చేతను, ఇతర కారణముల చేతను నీ తప్పు మాట క్షమించితిని నాకు ద్రోణునితో వంశక్రమాగతమగు వైరము గలదు. దాని నీ లోకమంతయు నెఱుఁగును. మీ పాండవులట్టి విరోధులాతనికిఁ గారు... శిష్యద్రోహి యగు పాపాత్ముఁడు చచ్చెను యుద్ధముఁ జేయుము. నీకు విజయమగును-."

"క్రూరకర్ముఁడగు ధృష్టద్యుమ్నుని యా వాక్యములను విని యందఱును మిన్నకుండిరి. అర్జునుఁడు కోపకటాక్షముతో ధృష్టద్యుమ్నునిఁ జూచి కన్నీటితో నిట్టూర్పు విడిచి ఛీఛీ యనెను. ధర్మరాజు భీముఁడు నకుల సహదేవులు శ్రీకృష్ణుడు తక్కిన రాజులును సిగ్గునొందిరి-"

సాత్యకితో వివాదముఁ జేయునపుడును ధృష్టద్యుమ్నుఁడు భీష్మ భూరిశ్రవసాదుల నన్యాయముగానె మనము చంపితిమని నిజమును వెల్లడించియున్నాఁడు. దుర్యోధన వధము కూడ న్యాయము కాదని తలఁచియుండును ఇట్లు లమ మత మునకు వ్యతిరేకముగా నభిప్రాయమిచ్చు ధృష్టద్యుమ్నుఁడు, నాతని పక్షము వారు నురదుట కిష్టము లేకయే సౌప్తిక వధమునకుఁ గృష్ణుడంగీకరించిన సంగతి యిది వఱకె సూచింపఁబడెను ద్రోణవధము నంగీకరించి ధృష్టద్యుమ్నునకు వెనుకఁ దాళము వాయించు వారిలో భీముఁడొకఁడు వీరిద్దఱి సమ్మేళనము కూడ కృష్ణ పక్ష దౌర్బల్య హేతువు గాన భీమ వంశనాశము కూడ కృష్ణుని కిష్టమైనది. ధృష్టద్యుమ్నుఁడు "శ్వేత'' వంశజాతుఁడనియు నాతనికి "శ్వేతుఁ''డను ప్రఖ్యాతి గలదనియు ''తిక్కన సోమయాజి'' ఉద్యోగ పర్వమునఁ జెప్పియున్నాఁడు నేను చూచిన సంస్కృత భారతపుఁ బ్రతులలో ''తిక్కయజ్వ'' యాంధ్రీకరించిన ఘట్టమున నటులు లేదు స్థలాంతరమునఁ గాని, సోమయాజి చదివిన ప్రతిలోఁగాని యట్లుండునేమో శోధింపవలయును శ్వేతుఁడు పాండాలు రకుఁ బూర్వుఁడును కాఁడు. ఎవ్వఁడో బ్రాహ్మణుఁడై యుండును. ధృష్టద్యుమ్నుఁడు మాత్రము ద్రుపదరాజ కుటుంబమున జన్మింపక యే సంకీర్ణ బ్రాహ్మణునకో జన్మించెను వ్యాసునియందు వైదికము కృప ద్రోణులయందు క్షాత్రము సంక్రమించి నటులు ధృష్టద్యుమ్నుని యందు క్షాత్రము వ్యాప్తిఁ జెందినది. ద్రౌపది ధృష్టద్యుమ్నునకుఁ దగినసోదరియె. ఇరువురును యాజోపయాజుల సంబంధులే యని తోఁచును. ద్రుపదుఁడు పృషతున కచ్చర లేమయందు జన్మించిన సంకీర్ణుడగుట చేతను తత్సదృశుఁడగు ధృష్టద్యుమ్నుఁడు పుత్రుఁడగుటయు ద్రౌపది పుత్రిక యగుటయు నేతాదృశులగు పాండవులతో వారికి సంబంధము సరిపడినది.

## శిఖండి

ఈతఁడు భీష్ముని జంపుటకుఁ బ్రథమమున స్త్రీగా జన్మించి; పిమ్మట పురుషుఁడై విఖ్యాత శూరుఁడై భీష్ముని బడఁగొట్టి యుద్ధములో విశేష పరాక్రమముతోఁ బోరి పదునెనిమిదవ నాఁటిరాత్రి యశ్వత్థామచే మృతినొందెను. ఈతనికిఁ బెక్కండ్రు పుత్రులు కూడ గలరని మహాభారతమునఁ గలదు. ఈ గాథలోని సత్యమెంత వఱకో.

స్త్రీలు పౌరుషాభినయము నలవఱచుకొనుటచేఁ బురుష సదృశలును, పురుషులు స్త్రీత్వాభినయముచే స్త్రీ కల్పులునగుట లోకవిదితము. స్త్రీగాఁ బుట్టిన శిఖండిని బురుషుఁడని ద్రుపదుఁడు ప్రకటించుటయే కాక ద్రోణునికడ నాతఁడు పుంరూపముతో నస్త్రశస్త్ర విద్యలనారితేర్చినవానిఁగాఁ జేసి భీష్ముని జంపునటుల శిఖండినే బురికొల్పుచు "దశార్ణ" దేశరాజుకుమార్తెను బెండ్లిసేసెను. దశార్ణ భూపతి యీ కృతిమముఁ దెలిసి యుద్ధసన్నద్ధుఁడై వచ్చినపుడే శిఖండియొక్క స్త్రీత్వము లోకవిదితమైనది. స్థూలకర్ణుఁడను యక్షుఁడు శిఖండికిఁ బుంస్త్వమిచ్చె నను గాథ నిటులు సమర్థింపవచ్చును పుంరూపముతో నుండిన శిఖండియొక్క పోలిక గలవాఁడు స్థూలకర్ణుఁడను నొకఁడుండ వచ్చును. ఆ స్థూలకర్ణుని స్థానమున శిఖండి నిలిచి తన స్థానమున కాపరీక్షా సమయమునకు స్థూలకర్ణు నంపియుండును. శిఖండి స్త్రీకదా, ఆమెకు నల్వురెట్లు పుత్రులు కలిగిరి? గాలికి, నీటికిఁ బిడ్డలు పుట్టునాకాలమున "క్షత్రదేవ, ఋక్షదేవా"దులు శిఖండి పెండ్లియాడిన దశార్ణ భూపతి పుత్రిక యందు క్షేత్రజులుగాఁ బుట్టి యుందురనవచ్చును. లేక, బహుళపుత్ర దత్తత గలకాల మగుటచే నల్వురను శిఖండి దత్తునుగాఁ జేసికొనియుండును. లేకుండిన స్థూలకర్ణునకుఁ బ్రత్యుపకృతిగ బీదవాఁడగు నాతనిపుత్రులను తానె పెంచి తనపుత్రులే యని ప్రకటించియైన నుండవచ్చును. శిఖండి చిన్నతనము నుండియు సాముగరిడీలను నేర్చి శస్త్రాస్త్రవిద్యల నలవఱచుకొనుటచే భీష్మునితోఁ బోరు సామర్థ్యము కలిగి మెలఁగెను స్త్రీలు పుంభావముతో మెలఁగినఁ బురుష నిర్విశేషలగుదురని "మాధురీ" పత్రికనుండి యుల్లిఖించి యాంధ్రీకరించిన వ్యాసమొకటి "భారతీ" పత్రికయొక్క ప్రభవసంవత్సర మార్గశిర మాస సంచికలోఁ బ్రకటింపఁబడెను దానిచే శిఖండియొక్క పుంస్త్వ మట్టిదేయని విశద మగును. స్త్రీ లస్త్ర శస్త్రములను ధరించి వీరత్వముతోఁ బోరాడుట పాశ్చాత్య దేశములయందే కాక భారతదేశమునను వేదకాలమునుండి గతశతాబ్దమధ్యము వఱకుఁ గలదని గ్రంథనిదర్శనములు గలవు. శిఖండి జన్మాదికముకూడ దేవతా మహిమలతోఁ జొప్పింపఁబడి సంకీర్ణత నొందియున్నది. తనతండ్రికి రాజ్యము నిప్పించిన భీష్ముఁడు ద్రుపదునకు విరోధియగుటకుఁ గారణము ద్రోణుఁ "దహి

చ్ఛత్రము" నాక్రమించుట కంగీకరించుటయే యని తోఁచును. దాని కొఱకే శిఖండిని మొదటినుంచియుఁ బ్రోత్సాహపఱుచుట గలిగినది.

## ద్రౌపది

అహల్యాది పంచకన్యలలో నీమె యొకతెగాఁ బేర్కొనఁబడినది. పంచ కన్యలు "నైకపత్నులే" యగుదురు. ద్రౌపదీచరిత మాపంచ కన్యల చరితములో విలక్షణమై జగత్ప్రసిద్ధమై యున్నది. ద్రౌపది మున్దొక ఋషికన్యయై కొంత కాలము భర్తృ పరిగ్రహణము నంగీకరింపక పిసిగి రుద్రునిగూర్చి తప మాచరింపఁగా నాతఁడు ప్రత్యక్షమైనపుడు పతి పతి యని యేనుమాఱు లుచ్చరించినది. అందులకు రుద్రుఁడు పతి పతి యని యేనువాఱు లంటివి గాన, పాండవు లేవురును నీకుఁబతు లగుదురని వరమిచ్చె ననియు నామె యిపుడు ద్రుపదునింట నావిర్భవించినది గాన మీకామె భార్య గాఁదగియున్నదని యేకచక్ర పురమునఁ బ్రచ్ఛన్న వేషులై యవయుచున్న పాండవులకుఁ దొలిసారి వ్యాసుఁడు చెప్పియున్నాడు.[1] మత్స్య యంత్ర భంజనానంతరము ద్రుపదుఁడెటులైదుగుర కొకతెం బెండ్లిసేయుట యని చింతించుసమయమునఁ బారాశర్యుఁడు ప్రత్యక్షమయి "పంచేంద్రోపాఖ్యానమును" జెప్పి పంచేంద్రులే పాండవు లనియు రుద్రునానతిచే నింద్రుఁగొని తెచ్చిన కన్యయే ద్రౌపద యనియు మఱియొక విధముగాఁ జెప్పియున్నాఁడు[2] ఆంధ్రీకృత భారతమునను గొన్ని సంస్కృతపుఁ బ్రతులలోను "నాళాయన్యు పాఖ్యానము" అను వేఱుకథ గలదు. ఆంధ్రలిపిలో ముద్రితమగు సంస్కృత భారతమున నాళాయన్యుపాఖ్యాన మాదిపర్వాంతమునఁ బ్రక్షిప్తమనియు జైమిని భారతమునుండి యీ గాథ యుల్లిఖింపఁబడి యుండు ననియు ముద్రాపకులు వ్రాసియున్నారు. ఆ కథ యిది :

"నాళాయని [3]యనునొకతె మౌద్గల్యుఁడను వృద్ధుఁడును కుష్ఠియునగు మునిభార్యయై యుండెను అతఁడు నాలాయనిం గామోపభోగములఁ దృప్తి నొందింపఁ దపస్సునంతయు ధారవోసియు నామెం దృప్తినొందింప లేకుండెను. నీ రతిచే నా గుహ్యేంద్రియము దృప్తి నొందక బాధ నొందుచున్నది. ఏ రీతినైనఁ దృప్తి నొందింపుమని నాళాయని మౌద్గల్యుని వేధింప నాతఁడు కుపితుఁడై చెప్పగూడని మాటను నిశ్శంకతోఁ జెప్పితివి గాన ద్రుపదునింట భూలోకములో

---

1. ఆదిపర్వ 169 అధ్యా
2. ఆదిపర్వ 197 అధ్యా
3. నలమహారాజుకుమారుఁడగు నింద్రసేనుని పుత్త్రికయే 'నాలాయని' యని కాకమానిమూర్తి (పాంచాలీ పరిణయ గ్రంథకర్త) యభిప్రాయమై యున్నట్లు తోఁచుచున్నది.

నావిర్భవింపుము. నీ కపట నైదుగురు భర్తలు సంభవింపఁగలరని శపించెనట! ఆమెయే రుద్రుఁగూర్చి తప మాచరించి పంచపతిత్వవరము నొందెనని పంచేంద్రోపాఖ్యానమునకు ముడిపెట్టఁబడినది. మౌద్గల్యునిచేఁ బంచపతిత్వమునకు శప్తురాలగు నాళాయని రుద్రునిఁగూర్చి పంచపతిత్వమునకై యేల తపస్సు చేయ వలసివచ్చెనో? పై యుపాఖ్యానములను విమర్శించి చూడఁగా ద్రౌపది హిమవత్పర్వతోత్తరభాగమున మౌద్గల్యుఁడను మునిని వరించి "దుర్భగరోగిణి" యగుటచే మౌద్గల్యునివలనం దృప్తి లేక వెడలఁగొట్టఁబడి భరతఖండమున కేతెంచి 'యాజు'' నాశ్రయించి ద్రుపదుని యజ్ఞవేదికకుఁ గొనితేఁబడియుండు నని తోఁచుచున్నది. కృష్ణద్వైపాయనుని చరితములో నీ వృత్తాంతము కొంత చెప్పఁబడెను

ద్రుపదుని యజ్ఞవేదికయందామె యావిర్భవింపక పూర్వమే యామె యాజోపయాజులచేఁ బంచపతివరణమునకు నిశ్చయింపఁబడెనని యీ క్రింది శ్లోకార్థము చెప్పుచున్నది.[1]

వ్యాసు డిటు లనుచున్నాఁడు: ''ఓ ద్రుపదరాజా! నా కుమార్తె కైదుగురు భర్తలేమని మనస్సునఁ బాపము నొందకుము యాజోపయాజు లిరువురును ధర్మప్రకాశకులు. వా రిరువురు నీమెకుఁ బంచపతిత్వముఁ జేసియున్నారు.''

పై శ్లోకార్థముచే ద్రౌపది ద్రుపదుని వేదికపైఁ బుట్టకముందే పాండవుల కైదుగురకు నామెను యాజోపయాజులు భార్యగా నేర్పఱచిరని స్పష్టమగుచున్నది. యాజోపయాజులు "కానీనులు." వ్యాసుఁడు కానీనుఁడు వారి కైకమత్యము సమకూడియుండును. పాండవులకు వ్యాసోపదేశముచే నుపకృతిం జేయుటకును మగలు. మగలని వేధించు నాళాయనిని వదల్చుకొనుటకు స్వలాభముకొఱకును కక్కుఱితికాఁడగు యాజుఁ డీసంబంధమును నిశ్చయపఱచి యుండును దానికి వ్యాసోపయాజులు ప్రోత్సాహకారకులై యుందురు. ద్రుపదుఁడు ద్రోణుని జయించు కుమారుఁడు కావలయునని పలవరించెనే కాని, యర్జునునకు భార్య గాఁదగిన కుమార్తెను మొదట కోరియుండలేదు. ధృష్టద్యుమ్నునితో నయోనిజగా ద్రౌపదికూడ పుట్టెనని యాజుఁ డగ్నివేదికమీఁద ద్రౌపదిని గూర్చుండఁబెట్టి యుండును. ఎట్లయినను ద్రౌపదీ స్వయంవరమునకుఁ బూర్వమె ద్రౌపది పాండవుల నైదుగురఁ బెండ్లియాడుటకును వా రామెఁ బెండ్లియాడుటకును వ్యాస యాజోపయాజులచే నిశ్చయింపఁబడి యంగీకరింపఁజేయఁబడి

---

1. శ్లో॥ వ్యాసః:— మాభూద్రాజం స్తవతాపోమనస్థః పందానాం భార్యా దుహితా మమేతి యజోప యాజౌ ధర్మమ్మణీతపోఖ్యాం తౌచక్రతుః పంచపతిత్వమస్యాః -నాళాయన్యుపాఖ్యాన. అధ్యా. 1. శ్లోక. 1.

యుండును. ద్రుపదుఁడును తొలుత నీ వృత్తాంతము నెఱుఁగక ద్రోణుని జయించు కుమారునకుఁ దోడు బలవంతుఁడగు నర్జునుఁడు తన కల్లుఁడైన శోభించు నని ప్రచ్ఛన్నులగు పాండవులకొఱకు వెదకించెను వారు కాన్పింపనందున వీర్య శుల్క స్వయంవరమును జాటింపించెను. ఆ స్వయంవరమును జాటుటలో నెవఁడైన నైదుబాణములతో నీమత్స్య యంత్రముఁ గొట్టిన నాతఁడు నాపుత్రిక నొందవచ్చు ననెను.[1] పై చాటింపుప్రకార మెవఁడు మత్స్య యంత్రముఁ గొట్టిన వానినే ద్రౌపది వరింపవలసియున్నది. కాని మత్స్య యంత్రముఁగొట్టఁ గర్ణుఁడు ధనుస్సును సజ్యము చేయుచుండఁగా ద్రౌపది సూతపుత్రుని నేను వరింపనుశి అనుటచే నంతకుఁ బూర్వమె పాంచాలి పాండవులకు వ్యాసాదులచే ప్రధానము చేయబడియున్న దని దృఢముగాఁ జెప్పవలసి యున్నది. మఱియు మాతృవాక్య పరిపాలనముకొఱకుఁ బాండవు లొకతెఁ బెండ్లియాడి రని స్థూలదృష్టిచేఁ బదు వరులు తలంతురు కాని సూక్ష్మముగా నాలోచించిన వ్యాసుఁడే పంచపతిత్వము నకుఁ బాండవుల నంగీకరింపఁజేసె నని విశద మగును. కుంతీదేవి కూడఁ బాండురాజు కాక సూర్యాదులను నల్వురను వరించినది గాన సమాన స్కంధు రాలగు కోడ లుండిన మంచిదే యని తలఁచినఁ దలంచి కొంత ప్రోత్సాహముఁ జేసియుండును.

శ్రుతి స్మృతి పురాణేతిహాసోక్త ధర్మములను సమర్థించువారిలో "పూర్వ మీమాంసా" శాస్త్రజ్ఞులు ముఖ్యులు. అందు "కుమారిలభట్టాచార్యుఁడు" ముఖ్య తముఁడు.ఆతఁడు "తంత్రవార్తిక" భాష్యమున "ధర్మవ్యతిరిక్త సాహసములు" అను శీర్షికతోఁ బురాణోక్త గాథలను సమర్థించుచు ద్రౌపదీ పంచపతిత్వ విచా రము నిటులఁ జేసి యున్నాఁడు:

[3]"పాండుపుత్రుల కొకతెయె భార్య యని ధర్మ విరుద్ధముగా నేది చెప్పఁ బడెనో యది కృష్ణద్వైపాయనునిచేతనె విశేషముగా నుత్పాదింపఁబడి ప్రతిపాదింప

---

1. ఆదిపర్వ. 186 అధ్యా.
2. ఆదిపర్వ. 187 అధ్యా
3. "యాచోక్తా పాండుపుత్రాణా యేకపత్నీ విరుద్ధతా, సాపిద్వైపాయ నేనైవ వ్యుత్పాద్య ప్రతిపాదితా యౌనసస్త్వేవ కృష్ణాహి వేదిమధ్యా త్సముద్గితా సాచ శ్రీ శ్రీశ్చ భూయోభి ర్యజ్యమానా నదుష్యతి" అత ఏవోక్తం॥

శ్లో॥ "ఇదంచ తత్రాద్భుత రూపముత్తమం జగాద విప్రర్షి రతీతమానుషం।
మహానుభావాకిల సాసుమధ్యమా బభూవ కన్యైవగ తేగ తేహని" ఇతి.
(ఈ శ్లోకము ఆదిపర్వము 189 అధ్యాయములోనిది)

బడినది. ద్రౌపది యువతిగానె వేదిమధ్యమునుండి లేచినదికదా! ఆమె లక్ష్మి, శ్రీయు మాటిమాటికిఁ గలిసికొనఁబడినను దోషయుక్తురాలు కాదు. అందువలననే చెప్పఁబడెను. మనుష్యాతీతమై యద్భుతమైన యామె రూపమును వ్యాసమహర్షి ద్రుపదునితోఁ జెప్పియున్నాఁడు. సుమధ్యమ యగు నాద్రౌపది మహానుభావురాలు కదా? దినములు గడచినను ఆమె కన్యకయే యై యున్న దని కూడ చెప్పెను. (పాండవు లైదుగురు నైదుదినములు ద్రౌపదిని పెండ్లియాడినపుడు ద్రౌపది దినమున కొకవిధ మగు వేషమును వేయుచుండుటఁ జూచి వ్యాసుఁడు ద్రుపదునితోఁ జెప్పిన సందర్భము లోనిది) మానుషియే యైన నిది సిద్ధింపదు గనుకనే మానుషాతీత యని చెప్పఁబడెను. అందువలననే శ్రీకృష్ణుఁడుకూడ (సంధికిఁ బోయినపుడు) కర్ణునితో ద్రౌపది నినుఁగూడ నాఱవదినమునఁ బొందఁగల దని చెప్పియున్నాఁడు. మఱి యొకలాగైనచోఁ గృష్ణుఁ డేప్రమాణముచే నిటుల చెప్పను? అటుల గాకుండిన ద్రౌపదికి సమానరూపము గల పెక్కండ్రు ద్రౌపదీ వ్యవహారముఁ జేసియుండి రని కూడ వ్యవహారార్థాపత్తిచేఁ దోఁచుచున్నది. అటులు కాకుండినయెడల ద్రౌపది యర్జునున కొక్కనికె భార్య యగును. ఆ ద్రౌపది లోకములోఁ దమలోటు కానిపింపకుండఁగఁ జేసినది. ఎట్లనఁగా (ద్యూత సమయమున) ధర్మజు నుపదేశముచే సభామధ్యమునకుఁ దేఁబడి పుత్రులతోఁ గూడిన ధృతరాష్ట్రున కపఖ్యాతిం బుట్టించుటకును తనకుఁ గౌరవు లన్యాయముఁ జేసి రని ప్రకటనము చేయుటకొఱకును ద్రౌపది తత్క్షణమె రజస్వలావేషమును ధరించినది. కనుక ద్రౌపది యర్జునున కొకనికె భార్య యనియు నామెయే

---

నహి మానుషీ త్వేతదుపపద్యతే తేనాతీతమానుషమిత్యుక్తం। అత ఏవచ వాసుదేవేన కర్ణోక్తః "షష్ఠే చత్వాహని పర్యుపస్థాస్యతీతి" ఇతర థాహి కథం ప్రమాణభూతస్స న్నేవంవదేత్? అథవా బహ్వ్య ఏవ తాస్సదృశీరూపాః ద్రౌపద్యా ఏకత్వే నోపచరితా ఇతి. వ్యవహారార్థాపత్త్యా గమ్యతే యద్వా భార్యార్జునస్యైవ కేవలస్య భవిష్యతి. సాధారణ్య ప్రసిద్ధిస్తు నిచ్ఛిద్రత్వాయ దర్శితా। యథా యుధిష్ఠిరోపదేశా త్సభామధ్య మానీయమానా సహసైవ రజస్వలావేషం సపుత్రస్య ధృతరాష్ట్రస్యా యశ ఉత్పాదయితుం ఆత్మానం చాన్యాయ్యమానం ప్రఖ్యాపయితుం ద్రౌపదీ కృతవతీ తథాచ కేవలార్జున భార్యాయా ఏవ తస్యాః శ్రీత్వం జనావిదితం. పరస్పర సంఘాతాతిశయం చ భేదప్రయోగానవకాశార్థం దర్శయితుం సాధారణ్య ప్రఖ్యాపన మిత్యేవమాది। వికల్పేన్ను పరిహారత్వా ద్రాగలోభకృతస్య వ్యవహారస్య శిష్టై రేవ ధర్మత్వేనా పరిగ్రహాన్నో క్తత్వా దనుపాలంభః"-తంత్రవార్తిక। అధ్యా. 1 పాద 3.

శ్రీత్వము కల దనియు జను లెఱుగుదురు. అన్యోన్య దృఢ సంబంధము కొఱకు, తమలో భేదభావము లేకుండుటం జూపుట కొఱకు నటులు చేసియుండు నని వికల్పముచే సుపరిహారము (పంచపతిత్వ దోషము) అగును రాగలోభాదులచేఁ జేయఁబడిన వ్యవహారము శిష్టులచేతనే నిరాకరింపఁబడినది గాన ద్రౌపదీ పంచపతిత్వమును దూషింపరాదు - పై "తంత్ర వార్తిక భాష్య" వాక్యములచే "భట్టకుమారిలుని" కాలమున ద్రౌపదికైదుగురుభర్తలు కలరా? అర్జును డొక్కఁడేనా? యను సందేహము విద్వాంసులలోఁ గలిగియున్న దనియు అర్జునుఁ డొకఁడే నిజముగ భర్తయై యుండును గాని ద్రౌపది పంచపాండవైకమత్యమును లోకములో సూచించుటకై తానైదుగురకు భార్యనే యని ప్రకటించుకొనుచుఁ గృత్రిమముగా సంచరించునది యనియుఁ బాండవులుకూడ ద్రౌపది వలెనె గూఢవర్తనులై సంచరింపవారనియు, ద్యూతకాలమునఁగూడ లోకములోఁ జెప్పుకొను నంత మానభంగము ద్రౌపదికిఁ గౌరవులు చేయక పోయినను ద్రౌపదియే ధార్తరాష్ట్రుల కపఖ్యాతి విశేషముగాఁ గలుగురీతిని రజస్వలాది వేషమును వేసియున్న దనియు స్పష్టమగుచున్నది ద్రౌపది కర్జునుఁ డొక్కఁడే భర్తయై యుండుననుటకు ధర్మరాజు భీమునితో ద్రౌపది సర్జునునందే పక్షపాతమని యొకప్పుడు[1] చెప్పిన వాక్యము దృఢపఱుచుచున్నది.

ద్రౌపది సత్యభామతోఁ దన పాతివ్రత్య విశేషమును గూర్చి శ్రీరంగనీతు లెన్నియైనఁ జెప్పినది. భర్తల యడుగులకు మడుఁగు లొత్తుచు వారి కనుసన్నల మెలఁగుచుండు నని నది కాని పాండవులే యామెకు జంకుచుండు రని కొన్ని సందర్భములచేఁ జెప్పవలసియున్నది అర్జునుడు సుభద్రను బెండ్లియాడి యామెతో నింద్రప్రస్థపురికి వచ్చుచు ద్రౌపది యేమనునో యనుభీతిచే పట్టణపు వెలుపలనుండి సుభద్రను ముందుగాఁ ద్రౌపదికడ కంపి బ్రతిమాలించినాఁడు. ఆమెను సాంత్వనవాక్యములచేఁ బ్రతిమాలియున్నాడు.[2] సమయము వచ్చినపుడు ద్రౌపది పాండవులను నిశ్శంకముగా నెదిరించి ధిక్కరించుటలో వెనుదీయునది గాదు. ధర్మరాజు తన కర్మములఁ దలఁచుకొనుచు మూఢుఁడై యున్నాఁ డనియుఁ దనబ్రతుకు కొఱకుఁ బరులకుఁ బ్రియవాక్యములఁ జెప్పు ధర్మజుఁ జూచిన నాకుఁ గోప మగుచున్న దనియు నొకప్పు డనినది [3]

ద్రౌపది, కృష్ణుఁడు తమ్ము నోదార్ప వచ్చినపుడును[4] సంధికిఁ బోవు సమయముననును[5] నీవు బ్రతికి యుండఁగాఁ బాండవులు జీవించి చూచుచుండగా

1. మహాప్రస్థానిక పర్వ 2 అధ్యా
2. ఆదిపర్వ. 221 అధ్యా.
3. విరాటపర్వ. 18 అధ్యా.
4. అరణ్యపర్వ. 12 అధ్యా.
5. ఉద్యోగపర్వ. 81 అధ్యా.

నేను సభామధ్యమున నవమానింపఁబడితిని ఛీ! భీముని బలమును అర్జునుని ధనుర్ధరత్వమును గాల్పనా యనియు, అర్జునుని గాండివము పౌరుషము మంటఁ బెట్టనా యనియు పాండవుల యెదుటనే నిందించినది.

కర్ణునిచే దెబ్బలు దిని శిబిరమున బాధ నొందుచు ధర్మరాజు కర్ణుని వలన భీతినొంది తన్నుఁ బరామర్శించు నెపమున వచ్చిన యర్జునునితో వ్రణ వేదనచే నొడలు దెలియక యర్జునా! నీవు కర్ణుని వధింప లేకుండిన నీ ధనుస్సు కృష్ణుని కిచ్చినచో నాతఁడు కర్ణునిఁ జంపునే యనినంత మాత్రమున ధర్మరాజుం జంపఁ గత్తిఁ దీసిన యర్జునుఁడు, నీ ధనుర్ధరత్వము కాల్పనా నీ గాండివమును మంటఁబెట్టనా యని రెండుమూఁడుసారు లని నను నోరు తెఱవక యర్జునుఁడును, నీ బలము గాల్పనా యనఁ గిమ్మనక భీముఁడు నుండుటఁ జూడఁగా ద్రౌపది యొక్క మానవతీత్వ మెట్టిదియో ద్రౌపదీవాక్యములకుఁ బాండవు లెటులు లోఁబడు చుండిరో స్పష్టమగును పాండవులనే కాదు. కృష్ణునంత వానిఁ గూడ లెక్క సేయక నీవు బ్రతికియుండఁగా నాకవమానము జరిగెనే దుర్యోధనుఁ డొక్క క్షణము బ్రతికియుండినను నేను సహింప ననినది కృష్ణుఁడు సంధిసేయ నేఁగు నపుడు భీమార్జునులు సంధిసేత కనుకూలముగా మాటలాడుటను సహింపక భీమార్జునులు నిర్భాగ్యులై సంధి కోరుదురేని నా తండ్రి నా సోదరులఁ గూడి కౌరవులతోఁ యుద్ధముఁ జేతు రనియు, అభిమన్యుం బురస్కరించుకొని నా కుమారులైదుగురు కౌరవులతోఁ బోరాడుదు రనియు వీరత్వసూచకముగాఁ బలికినది. ప్రచ్ఛన్న రూపముతో నుండియుఁ గీచకుని వ్యవహారములో విరటునిఁ దత్సభ వారిఁగూడ లెక్కసేయక నిందించినది. ద్రౌపది తనపై నణు మాత్రపుమాటను గూడ పడనీయని మానవంతురాలు విరటుని దత్సభవారిని నిందించుచు సభలో నిలిచియుండిన ద్రౌపదికి ధర్మరాజు తమ రహస్యము బయ లగునేమో యను భయముతో నామె నచటనుండి పొమ్మని సూచించినాఁడు ఆమె యచటనుండి కదలక పోవుటచే నాట్యమాఁడు దానివాలెఁ గులస్త్రీ సభలో నిలిచియుండరాదు. పొమ్మనఁగా ద్రౌపది గూఢముగా ధర్మజార్జునుల నిట్లు దెప్పి పొడిచినది:

గీ. నాదువల్లభుండు • నటుఁ డింత నిక్కంబు
పెద్దవారియట్ల • పిన్నవారు
గాఁక బతులవిధము • గాక యే శైలూషి
గా దనంగ రాదు • కంకభట్ట.

వ. అట్లగుటంజేసి నాకు నాట్యంబును బరిచితంబు. మత్పతిశైలూషుండ కాఁడు గీతవుండును గావున జూదరియాలికి గరువతనం బెక్కడిది?" అనినది.

ద్రౌపది విశేషవిద్యావతి. ద్యూతసమయమున ధర్మశాస్త్రపు బ్రశ్నములచే సభికులను నిరుత్తరుల జేసినది. ప్రథమద్యూతమున బాండవులు కౌరవదాసులు కాగా ద్రౌపదియే బానిసతనము నుండి యుక్తిచే బాండవులను విడిపించి వారియాయుధాదులం గౌరవ మిచ్చునటుల చేసినది పాంచాలి కేవల విద్యావతి మాత్రమె కాదు. బలవతి దేహదార్ఢ్యమునం దామె భీమున కీడైనది. తనుం బట్టవచ్చిన సైంధవుని బోరగిలం ద్రోసినది. కీచకుని బడగొట్టి కీచు మనిపించి నది. కీచకుని బడగొట్టుటలో నొక దైవ మహిమము కవిచే గల్పింపబడెను. యది సందర్భశుద్ధిగా లేదు. ఇట్టి యబల- అబలకాదు, బలవతి- మానవతి- పాండవుల కనుసన్నల మెలగునా? వనవాస కాలమున బలుమారులు ధర్మ రాజాదులను గౌరవులపై నుసికొలుపుచుండెడిది. బంధువర్గ వధముచే ఖిన్నుడయి రాజ్యము నంగీకరింప నొల్లని ధర్మజుని రాజ్యోన్ముఖునిగా బురికొనజేసిన యుపన్యాసము ప్రశంసనీయము ఈమె యాభిజాత్యమున కీసునొందియే కృష్ణుం డీమెసంతతి నిలువకుండగ జేసిన సంగతి యింతకుముందే చెప్పబడెను.

భారత వర్ణనా విశేషములచే ద్రౌపది నేటి పాశ్చాత్య ప్రౌఢ వనితామ తల్లికల దలదన్నిన ప్రౌఢత్వము గలదిగా దోచును.

పాతివ్రత్యమునం గాక తదితర విషయములలో నేటికిని భారతవర్ష వనితామతల్లికల కాదర్శముగా నుండదగినదై యున్నది

## కుంతి

ఈమె చరితము లోకవిదితము. పాండురాజు పోయిన పిమ్మటనే యీమె బిడ్డల గనియుండు నని నాటివారె తలచిరను వృత్తాంత మిదివరకె వ్రాసి యుంటిని కుంతియొక్క రహస్యపు బ్రవర్తనమె యింతటి మహాయుద్ధమునకు గారణమని యుద్ధాంతరమున ధర్మరాజు కుంతిపై గినిసి శాపమిచ్చెనని "శాంతి పర్వము" నం గలదు. ఈమె యాదవ (గొల్ల) వంశమున బుట్టెను. ఆమె తండ్రి "శూరుడ"నువాడు తన మేనత్త కుమారుడగు "కుంతిభోజుడు" సంతతిలేక నీమెను దత్తత జేసికొనుట కడుగగా నిచ్చెను కుంతిభోజుడో శూరుడో "నాగులలో" ముఖ్యుడగు "ఆర్యకుడు" అను వాని దౌహిత్రుడని చెప్పబడియున్నది.1 నాగు లనార్యు లనియు నాగవనితలు వేశ్యలుగా గూడ నుండిరనియు నిదివరలోనె చెప్పబడెను. కుంతి యట్టి వేశ్యకుల సంపర్కము కల దగుటచేతనె రహస్యముగాను బహిరంగముగాను బరులకే గంగగోవువలె బిడ్డలం గనినది. సవతి తన్నునాక్షేపింపకుండగ నామె కిరువురం దార్చినది. కోడల కైదుగురు మగలగుట కనుజ్ఞ నిచ్చినది కుంతీ ప్రవర్తనమునకు ధర్మ

---

1. ఆదిపర్వ. 128 అధ్యా. వ్యాఖ్య.

ఁడు మాత్రమె కాక కర్ణుఁడును నీచకార్యముం జేసితివని నిందించియున్నాఁడు.[1] కుంతి కర్ణునిఁ గనుటలో సూర్యుఁడు రహస్యముగాఁ బొంచిపొంచి యంతఃపుర మున నుండిన కుంతిని గలిసియుండె ననియు గర్భమును తొమ్మిదిమాసములు రహస్యముగా మోసి యొ నాఁటిరాత్రి కర్ణుఁ గని తనకాప్తురాలగు దాసిచే నదిలోఁ బాఱవేయుటకుఁ బంపుచుండఁగా దాసి కిష్టురాలగు రాధ యనునది మార్గమధ్య మునఁ దారసిల్లి రహస్యముఁ గుఱుతుపట్టి తనకు బిడ్డలు లేనందున రహస్య భేదనము కాకుండఁ బెంతు ననుటచే దాసి రాధ కాకర్ణు నిచ్చినటులను దేవీ భాగ వతములోఁ గలదు. కుంతి తొమ్మిది మాసములు మోసియె కర్ణునిఁ గనినటుల భారతమున రెండుచోటులఁ గలదు. ఈమె రహస్యము బయలైనపిమ్మట ధర్మజుఁ డామెను గౌరవింపలేదు ఈ నిరాదరణము నొందలేకయే యామె వానప్రస్థయై మృతి నొందినది

## పాండవులు

వైదిక వాఙ్మయమును మహాభారతమును బరిశోధించిన పాశ్చాత్య పరిశోధ కులు వైదిక వాఙ్మయమునఁ బాండవులపేరులు కాన్పింపనందున భారతోక్తిత పాండవులు కల్పితపురుషులని తలఁచిరి. అందు "ప్రొఫెసర్ లాస్సెన్" ముఖ్యుఁడు. రమేశచంద్రదత్తు మహాశయుని తలఁపు కూడ నట్టిదియే. వివేకా నందస్వాములవారు "యగ్గిహింగుకృత శతపథాంగ్లీకరణముఁ" జూచి కాఁబోలు "భగవద్గీతావిచారణ" మను నుపన్యాసమునఁ గురుపాండవ యుద్ధమగుట నను మానాస్పదముగా నంగీకరించిరి. "హాప్కిన్సు, విన్సెంటు స్మిత్తు" అనువారు పాండవులు టిబెటు దేశమునుండి భరతఖండమునకు వచ్చిన విజాతీయులనియు, అందువలననే టిబెటుదేశమునం దుండిన బహుపతిత్వమే ద్రౌపదిని వరించుటలో వారవలంబించి రనియు వ్రాసియున్నారు. అందు "విన్సెంటు స్మిత్తు" యొక్క "అక్స్ఫర్డు ఇండియన్ హిస్టరి", పాఠశాలలలో విద్యార్థులకుఁ జెప్పఁబడు చున్నది. మఱికొందఱు క్రీ. పూ. 2, 3 శతాబ్దములలో మధ్యాసియానుండి భరతఖండముపై దాడివెడలిన "పార్థియనులు" పాండవులుగా మార్పఁబడి భారతములోఁ జేర్పఁబడి యుందురను నపూర్వవాదముఁ గల్పించిరి. పార్థి యనులు పాండవు లగుటకుఁ బాండవుల కుండిన "పార్థులు" అను శబ్దసాదృశ్య మొకటి వారికిఁ దోడ్పడుచున్నది. క్రీ. పూ 5-12 శతాబ్దముల కాలముల నడుమనుండిన "పాణిని, శకటాయన" ఋషులే "వాసుదేవార్జున యుధిష్ఠిరా" దులఁ గూర్చి తమ గ్రంథములలోఁ బ్రశంసించియుండుటచేతను మహాభారత రచనము కూడ పార్థియనుల దండయాత్రకుఁ బూర్వమే రచింపఁబడియుండుట

---

1. ఉద్యోగపర్వ. 145 అధ్యా.

చేతను పార్థియనులు పాండవు లనువాదము మిక్కిలి యసంగతముగా నున్నది. దాని నట్లుండనిండు.

యగ్గిహింగు దొరగారు తనకు బర్లిన్ (జర్మనీ) లైబ్రరీలో "కాఠక ములు" అను శిథిలమగు వ్రాతప్రతిలో వైచిత్రవీర్య ధృతరాష్ట్రుని ప్రశంస (10.6) కనిపించినదని తానాంగ్లీకరించిన శతపథ బ్రాహ్మణపు టీకలో వ్రాసియున్నారు. పై కాఠకము లేవేవసంబంధపుదో? కాని పాండవులపేరు లెవ్వారును వైదికవాఙ్మయమునఁ జూచినటుల వ్రాయరు. దీనికిఁ గారణ మిది వఱకె వ్రాయఁబడె వ్యాసుఁడుకూడ పాండవులు హస్తిపురి జేరినపిమ్మట జరిగిన చరిత్రనె తన "జయానుక్రమణికలో" సూచించి యున్నాఁడు హస్తిపురికి వచ్చినపుడే పౌరులు వీరి జన్మాదిక్రమ ననుమానించిరి విద్యాభ్యాసకాలమునఁ బౌరులకు వీరి సంబంధావసరము గలుగలేదు ధర్మజునకు యౌవరాజ్యాభిషేక మైన పిమ్మట పాండవ సంబంధము పౌరులకుఁ గలిగియుండెను. అవైదికాచార యుక్తులగు వీరిపైఁ బౌరులకు, రాజబంధువులకు ననిష్టము కలిగెను ధృతరాష్ట్రు నానతిచేఁ బాండవుల వారణావతమునకుఁ బోవుచు[1] భీష్మాదులకు దీనాననులై మ్రొక్కి యనుజ్ఞ గొనఁగా నొక్కఁడును పాండవపక్షముగా మాటలాడలేదు. పురమును వదలిన పిమ్మటఁ గొందఱు బ్రాహ్మణులు మాత్రము (ధర్మజునిచే నుపకృతి నొందినవారు) ధృతరాష్ట్రుఁ డిటులు మిమ్ము నంపుట యుక్తముగా లేదనిరట.[2] పాండవులతో సంబంధించిన విదేశీయులు కొందఱు హస్తిపురిలో నుండిరేమో యని ధృతరాష్ట్రుఁ డనిన యీ క్రిందిశ్లోకార్థ మనుమాన పెట్టుచున్నది.

"[3]మీ గణములతోను, మీ వంశములతోను, దేవతలవలె (వారణావతమున) విహరింపుడు" అనెను.

ధర్మజుఁడు తన కాపులగువారు కొందఱు తనతో వారణావతమునకు వచ్చుటకు సిద్ధపడఁగా మీరు రావలదు సమయము వచ్చినపుడు మా పనిని

---

1. వారణావతము కురుదేశములోనిది కాదు. అది ద్రుపదుని జయించి యర్జునుఁడు ద్రోణునకిచ్చిన "అహిచ్ఛత్ర" రాజ్యమునకుఁ దూర్పుగా నుండిన స్వల్ప రాష్ట్రమునకు ముఖ్యపట్టణము. మహాయుద్ధ సమయమున దానిని ద్రుపదున కిచ్చుట కొడంబడిక ధర్మజుఁడు చేసియుండును. అందువలననే సంధిలోఁ గోరిన యైదు గ్రామములలో వారణావత మొకటియై యున్నది.
2. ఆదిపర్వ. 145 అధ్యా
3. సగణాః స్వాన్వయాశ్చైవ విహరధ్వం యథామరాః ఆదిపర్వ 144 అధ్యా

జేయుఁడని హస్తిపురి వెలుపలనుండి వారి నంపఁగా వారు తిరిగి హస్తిపురికిఁ బోయిరట![1] ఇదికూడ పాండవజాతికిఁ జేరినవారు కొందఱు హస్తిపురిలో నుండి యుందురను నను మానమునకుఁ గారణము వారణావతమునఁ బాండవుల కమాత్యుఁడుగా "పురోచనుఁడు" కౌరవులచే నియమింపఁబడెను. అతఁడు లాక్షా గృహమును దానికి సమీపమున నాయుధాగారమును నిర్మించి పాండవుల కుప చారములఁ జేయుచుండెను పురోచనుఁడు మ్లేచ్ఛుఁడు (పారశీకుఁడని కొందఱు తలఁతురు). పురోచనుఁడు దుర్యోధనోపదేశముచే లక్కయింటిని గాల్చనను భయమేకాక యేదియో గొప్ప తిరుగుబాటు జరుగఁబోవు సూచనలఁ దెలిసి కొనియే పురోచనునుండి తమ గుర్తు తెలియకుండఁగాఁ బురోచనుఁ గూడ లాక్షా గృహమున దహించి యంతకుముందే వేఁటనెపమునఁ దెలిసికొనిన గుప్త మార్గ ముల కనుగుణముగా లక్కయింటినుండి చేసికొనిన బిలద్వారము వలన వెలువడి పాండవులు లాక్షాగృహ దాహాపుటపవాదమును దుర్యోధనునకును, మరణమును పురోచనుతో గూడ విషాదవనితకును, దత్సుత పంచకమునకును బంచిపెట్టి పలాయితులైరి లాక్షాగృహమునుండి వెలువడు బిలమును జేయుటకు విదురునిచే హస్తిపురినుండి పంపఁబడిన ఖనికుఁడు (ఉప్పరి) తోడ్పడెను. లాక్షాగృహము నుండి యరణ్యములో గొంతదవ్వేఁగిన పిమ్మట గంగానది యడ్డువచ్చెను[2] హస్తిపురి నుండి విదురునిచే పంపఁబడిన నావికుఁడొకఁ డంతకుఁబూర్వమె కొందఱిచే సిద్ధపఱుపఁబడిన నావపైఁ బాండవుల నెక్కించి గంగానదిలోఁ గొంత దవ్వు తీసికొనిపోయి హిడింబావన ప్రాంతమున వారు పరుగిడ వదలెను. చీమ చిటుక్కుమనిన బెదురుచుండిన మనస్సులతోఁ బాండవు లుండుటచే నావికుని గూడ నమ్ముటకు సందేహించుచుండఁగా విదురుఁడు చెప్పిన కొన్ని గుఱుతుల నా నావికుఁడు చెప్పవలసివచ్చెను. (పాండవుల నావ పయన మాంధ్రీకరింపబడ లేదు)[3] హిడింబ వధానంతరము పాండవులు "తాపస" వేషములను ధరించి కంగారుపడుచు ధార్తరాష్ట్రి భీతులై[4] యొకొక్కప్పుడు పెడదారులఁ బట్టికూడ మత్స్య, త్రిగర్త, కీచక, పాంచాల" దేశములలోఁ దిరిగి తిరిగి యేకచక్రపుర

---

1. ఆదిపర్వ 145 అధ్యా.
2. ఆదిపర్వ 149, 50 అధ్యా
3. ఆదిపర్వ 156 అధ్యా
4. పాండవు లెపుడును ధార్తరాష్ట్రి భీతులు కాలేరని నన్నధిక్షేపించుచు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వ్రాసిరి ఇది వారి తెలియమిని సూచిం చుచున్నది అదిపర్వము యొక్క యఱువది యొకటవ యధ్యాయమున నిట్లున్నది:

సమీపమును జేరఁగా వ్యాసుడు తారసించి యాపదలగు వీరికిఁ గొంత యాలోచనా సహాయముఁ జేసి వారి నేకచక్రపురమునకుఁ జేర్చెను.

ఆ వృత్తాంతము వ్యాస ద్రౌపదుల వృత్తాంతములోఁ జెప్పబడెను. ఎంత వేదాధ్యయనము చేయుచుండినను, ఎంత బ్రాహ్మణవేషము వేసి సంచరించినను వీరిపై దేశీయుల కనుమానము నసూయ కలుగుచునే యుండెడిది. ఏకచక్రపురిలో నుండిన నెలదినములకే వీరి కచటనేకాక చుట్టుప్రక్కల గ్రామములలోఁ గూడ భిక్షము దొరకుట దుర్లభమైనది.[1]

వీరి నెఱిగిన "యంగారపర్ణుఁ"డను గంధర్వుఁడు కూడ వీరు భారతీయాచారయుక్తులుగా లేరని ధిక్కరించి యున్నాడు.[2] పాండవుల గోత్రమేమి? వైయాఘ్రపద్యగోత్రమని ధర్మజుఁడు విరటు కడ నుడివినాఁడు. రాజులకుఁ బురోహితుని పేరుగల గోత్రమె పెట్టఁబడునని శ్రౌత సూత్రమునఁ గలదు. ధౌమ్యుఁడు వ్యాఘ్రపాదుఁడను వాని పుత్రుఁడు. అందువల్ల వైయాఘ్రపద్యుఁడై ధర్మజుఁడు ధౌమ్యుని పేరి గోత్రముతో నొప్పెను ధౌమ్యుఁడు పురోహితుఁడు కానపుడు పాండవులకు గోత్ర నామమె లేదు. ఇది భారతీయాచార విరుద్ధము ద్యూతజితులై వనమున కేఁగినపుడు ధర్మజాదులు సమయ బద్ధులగుటచే నటుల వనమున నుండిరే గాని, లేకుండిన (నొక్క) భీముఁడు గాని, యర్జునుఁడు గాని కౌరవులను జయింపలేఁడా యని భారత పాఠకులు తలఁతురు. అట్టి వాడు లాక్షా

శ్లో॥ "నిశి సంప్రాద్రవన్ పార్థాః ధార్తరాష్ట్ర భయార్దితాః"
(తా॥ పాండవులు ధార్తరాష్ట్రుల భయమునఁ బీడింపబడిన వారై రాత్రి యందు బయలుదేరిరి) అని కలదు :
జనమేజయుఁడును పాండవులు దుర్యోధనునకుఁ జడిసినటులనే తలఁచెను. విరాటపర్వ ప్రథమాధ్యాయమున నిట్లు కలదు.
జనమేజయః శ్లో॥ కథం విరాటనగరే మమపూర్వా పితామహాః
అజ్ఞాతవాస ముషితా దుర్యోధనభయార్దితాః
[తా॥ జనమేజయుఁడు (వైశంపాయనునితో) ఇట్లనుచున్నాఁడు: నా పూర్వులు పితామహులు నగు పాండవులు దుర్యోధనుని వలనఁ బీడింపఁబడిన వారై యెట్లజ్ఞాతవాసమున నుండిరి?] అని కలదు.
భీముఁడు తాను దుశ్శాసన, దుర్యోధనులం జంపునపుడు భీతిచే నన్యాయముగఁ బ్రవర్తించితి నని గాంధారితోఁ జెప్పుకొనినాడు గ్రంథవిస్తర భీతిచే మూలమును వ్రాయలేదు.

1. ఆదిపర్వ 157. 168 అధ్యా.
2. ఆదిపర్వ 170 అధ్యా.

గృహ దహనానంతరము భీతులై నిస్సహాయులై యనదలై పలాయితు లగుట కేసందర్భముఁ గల్పించుతురో?[1] భీష్మాదులకుఁ గూడ పాండవులభారతీయాచారవిరుద్ధ కార్యములకుఁ దత్కాలమున నసహ్యము కలిగి పాండవ ప్రవాసమునకు, నాశనము నకు గూడ నిష్పక్షి యుండిరాయని వారి తాటస్థ్యముచే నూహింపవలసి యుండెను. పాండవులు కాక నిషాదవనితయు నామె యొక్క పుత్ర పంచకమె లాక్షాగృహ మున దహింపఁబడిరని పిమ్మటఁ దెలిసియుండును. కృష్ణునకుఁ బాండవులు లాక్షా గృహదహమునుండి వెలువడిరని తెలిసినదట.[2] ద్రుపదునకుఁ గూడ తెలియుట చేతనె యర్జునునకు ద్రౌపది నిచ్చుటకు వెదకించెను?[3] కాని పాండవులు ధార్త రాష్ట్ర భీతులై ప్రచ్ఛన్నతపవేషులై కొన్ని యేండ్లాయా దేశములలోఁ దిరిగి తిరిగి పాంచాలీ స్వయంవరమున బయలు పడిరి. ద్రౌపదీ పరిణయముచే ద్రుప దుని సహాయమె కాక కృష్ణాదుల తోడ్పాటు కూడ కలుగుటచేఁ గౌరవులకు దమ వృత్తాంతముఁ దెలియఁ జేయుటకు ధైర్యము కలవారైరి. పాండవులు ద్రౌపదీ వివాహానంతర మొకవత్సరము ద్రుపదునింట నుండిన పిమ్మటనే హస్తిపురికి వర్తమాన మంపిరని యనుక్రమణికాధ్యాయమున నుండిన యంశము నాలో చింపఁగా, నా సంవత్సర మంతయు ద్రుపద పాండవ శ్రీకృష్ణులు కౌరవులతోఁ బోరాడుటకుఁ దగిన యాలోచనములఁ జేయుచుండిరని తోఁచుచున్నది. ఈ త్రివర్గ సమ్మేళనమునకు జడిసియే భీష్మ ధృతరాష్ట్రు లర్ధ రాజ్యమును బాండ వుల కిచ్చినటుల ననుక్రమణికచే నూహింపఁబడుచున్నది.

ఇంద్రప్రస్థ రాజ్యము హస్తిపురి రాజ్యమువలె నిర్బాధకము కాదు గావి పాండవులు కాలూనుకొనుటకు సాధనమగుటచేఁ బాండవులంగీకరించిరని తోఁచు చున్నది. తీర్థయాత్ర నెపమున నర్జునుఁడు దేశములఁ దిరిగి ద్రవిడరాజగు "మల యధ్వజుని" తోడను కృష్ణుని తోడను దృఢమైత్రిం గలిగించుకొనెను; విధవయు నాగకన్యయునగు "నులూపి"ని బెండ్లియాడి యావితంతువు నందు "ఇలా వంతుఁడు" అను కుమారునిఁ గనెను. ఖాండవ వన దహనములో నర్జునుఁడు నాగులఁ బెక్కండ్రం జంపుటచే నీ "యిలావంతుని" నాతని సవతి నాగలోకము

1. భీష్మునకు వైయ్యాపద్యగోత్రము, సాంకృతిప్రవరము భీష్మతర్పణ విధిలో నిటీవల ధర్మశాస్త్ర నిబంధన గ్రంథకర్తలు దూర్చిరి. భారత మునకు నొక్కచోటునఁ గలదు. కాని యది యిటీవలఁ గల్పింపఁబడె నని తలఁతును. గోత్రప్రవరఖండంలో వైయ్యాఘ్రపద్య గోత్రముగాని సాంకృతిప్రవరమున నాగోత్రముకాని కాన్పింపదు.

2. ఆదిపర్వ 189 అధ్యా.

3. ఆదిపర్వ 185 అధ్యా.

విరుద్ధాచార, విదేశ సంపర్కములఁ జూచియె పాండవు లన్యదేశీయు లని కొందఱు వ్రాసిరి.

పాండవులు త్రివిష్టపదేశీయుల సహాయమునే విస్తారము పొంది రనుటకుఁ బెక్కు నిదర్శనములు కలవు.[1] ధర్మజభీమార్జునులు త్రివిష్టప దేశముననే (శతశృంగమున) శర్యాతి యను రాజర్షియొక్క పుత్రుఁడగు శుక్రుఁడను మహా వీరునికడ యుద్ధశాస్త్రమును నేర్చిరఁట! అందు ధర్మజుఁడు తోమర ప్రయోగమును, భీముఁడు గదావిద్యను, అర్జునుఁడు ధనుర్విద్యను నేర్చిరఁట!

పాండవులలో ధర్మజ భీమార్జునులు కుంతీసుతు లనియు నకులసహదేవులు మాద్రేయు లనియు వ్రాయఁబడి యుండెను ధర్మజుడు, భీముఁడు, కుంతీసుతులు కారేమో యను సందియముకూడఁ గలదు. ఎంతటి దేవతలైనను మనుష్య వ్యవహారములలో మానుష ధర్మము నవలంబింపవలసి యుండును. సూర్యుఁడు కుంతితోఁ దొలుత భోగించుటచే, సూర్యసుతుఁడగు యమునిఁ గుంతి మాతృసదృశ కావలసి యుండును. అందువలననే కాఁబోలు భారతములోఁ బాండురాజునకు దివ్యమగు నొకకారణముచే "ధర్మున" కా శతశృంగ పర్వతమున నీయుధిష్ఠిరుఁడు జన్మించె ననియు వాయుదేవుఁను భీముఁ డనుకుమారు నొసఁగె ననియు, దేవేంద్రునివలనఁ గుంతియందే యర్జునుఁడు జన్మించెననియు మునులు హస్తిపురిలోఁ జెప్పిరి.[2] పాండురాజునకు ధర్మజ భీములను యమ మరుత్తు లిచ్చిరట! అర్జునుఁడు మాత్రము కుంతియం దింద్రుని వలనఁ బుట్టెనట! కర్ణపార్థుల తండ్రులగు సూర్యేంద్రులదిత పుత్రులగు సోదరులు. ఏకోదరులు త్రివిష్టపమున (టిబెతు) నేఁడును నొక్కవనితయందు సంతానవంతులగు నాచారము కలదు.

పై యంశములేగాక భీముఁడు నాగులసంబంధుఁడని వ్రాయఁబడుటయు "శ్వేనజిత్తు" అనువాఁడు భీముని మేనమామ యని కర్ణ భీష్మ లొకప్పు డుగ్గడించుటయు.[3] ధర్మజ భీములు కూడ, కుంతీగర్భజనితులు కారేమోయని సందేహింపఁబడుచున్నది. "పార్థ" శబ్ద మొక యర్జునునియందే (పృథకుమారుఁడు గాన) రూఢిగా వాడఁబడుట కూడ భిన్నోదరత్వము కౌంతేయులయం దనుమానింపఁబడుచున్నది.

---

1. కుంభకోణపుఁ బ్రతి-ఆదిపర్వ 133 అధ్యా., వావిళ్ళవారి నాగరపుఁబ్రతి ఆదిప. 114 అధ్యా
2. ఆదిపర్వ 123 అధ్యా.
3. ఉద్యోగపర్వ. 140, 171 అధ్యా.

మఱియొక విశేషము. పాండురాజు శతశృంగ పర్వతమునం "దపత్యా" ర్థియై కుంతిని సద్బ్రాహ్మణునివలన సంతతి నొందు మని నియోగించెను. తనకు మంత్రము వచ్చునని కుంతి చెప్పఁగ పిమ్మటను, "ధర్మ వాయ్వింద్రుల" గోరి సంతతి నొందు మనెను. పురాణమునులలో, అందు వేదప్రవర్తక మునులలో ధర్ముఁ డనుముని, ఋగ్వేద దశమ మండలము 114వ సూక్తమునకును, వాయు ఋషి, ఋగ్వేదము 10 మండలము 168 సూక్తమునకును గొన్ని సామములకుఁ బ్రవర్తకులు. ఇంద్రులను మును లిరువురు కలరు. వారు ఋగ్వేదదశమ మండలమున 7 సూక్తముల కధిపులు పై ఋషులే ధర్మజ భీమార్జునులకు జనకులు కాఁగూడదా? పాండురాజు మరణానంతరము హస్తిపురికిఁ బాండవులను శతశృంగమునులు తీసికొనివచ్చి యొప్పఁజెప్పుటచేతను పై వితర్కము కలుగుచున్నది. ఈ యంశము నింకను బరిశోధింపవలసియున్నది.

## ధర్మరాజు

ఈతఁడు నాఁటి రాజకీయ దురంధరు లగు విదుర గాంగేయ శ్రీకృష్ణులను రాజనీతిలో మించినవాఁడు. ఏ సమయమున కేయాట నాడవలయునో యది ధర్మజునకుఁ దెలిసినటుల శ్రీకృష్ణునకుఁ గూడఁ దెలియదు లక్కయింటి నుండి వెడలుట, ప్రచ్ఛన్నులై పలాయితులగుట, ద్రౌపది నందఱుఁ బెండ్లి యగుట, ద్యూతానంతర మరణ్యవాసమునఁ దొందరపడు ద్రౌపదీ భీములను సమయము వచ్చువఱకు వేఁచియుండుఁ డని శాంతులఁ జేయుట, అర్జునుని దివ్యాస్త్ర సంపాదనమునకై తపశ్చర్య కనుపుట, అర్జునుఁడు లేని సమయమునఁ దీర్థయాత్ర నెపమునఁ దక్కిన వారితోఁ గౌరవులదాడి కంద కుండఁగ నానాపర్వతవనాదుల దిరుగుట, కీచకునిపైఁ బడఁబోవు భీము నపుడు వలదని సంజ్ఞ చేయుట మొదలగు విషమసమయ కార్యములలో ధర్మజుని రాజనీతి సుశోభితమై యున్నది. శల్యునిఁ బాండవులఁ జేరకుండఁ గపటముఁ బన్నిన దుర్యోధనుని కపటమును మించి యాశల్యునే కర్ణునివధమునకు సహాయునిగా జేసికొని తానే యాశల్యుని రణ నిహతునిఁ జేయుట, భీష్మాదుల మనములు కరుగు నటుల యుద్ధారంభమున వారికి వందన మాచరించుట, యుయుత్సుని గౌరవుల నుండి విడదీసి యుద్ధాంతమున నాతని కేలాభముఁ గలుగఁజేయకుండుట, భీష్ముని పతనమున కాతఁడె కారకుఁ డగునటులఁ జేయుట, మొదట నిష్టపడకుండినను సమయానుసారముగా ద్రోణ వధమున కసత్యమాడుట, మొదలగు వ్యవహారములలో ధర్మజుని రాజకీయ దురంధరత్వ "మప్రమేయమై" శోభించినది. సంధిసేయుట కైదుగ్రామములను మాత్రమే కోరినను దుర్యోధనుఁ డంగీకరింప లేదే యని స్థూలదృష్టికిఁ గాన్పించును గాని దానిలోనె స్వపక్షమునకు వచ్చిన రాజుల కుత్సాహమును శత్రుపక్ష

మునకు నిరుత్సాహము కలుగు నంశము లిమిడి యున్న వని స్పష్టమగును. ఆ యైదూళ్ళేవి?[1] (1) కుశస్థలము (2) వృకస్థలము (3) మాకంది (4) వారణావతము (5) ఏదేని మఱియొక గ్రామము.

కుశస్థలము- కర్ణుడు యాదవుల నుండి పుచ్చుకొనినది మాకందీ వారణావతములు పాంచాలుర నుండి లాగికొని ద్రోణుఁడు, కౌరవులు ననుభవించు చున్నవి. వృకస్థలమునకుఁ గూడ నిట్టి సంబంధ మేదియేని కలిగియుండును. కర్ణ ద్రోణు లనుభవించు భాగములను దుర్యోధనున కిచ్చుట కెటులు సాధ్యమగును? ఒకవేళ బలాత్కరించి యిచ్చినచోఁ గర్ణ ద్రోణులకు మనమున నసూయ గలిగి దుర్యోధను పక్షమునఁ బనిసేయరు. కుశస్థలి నడుగుటచే ధృష్టద్యుమ్నాది పాంచాలురకు నుత్సాహము కలుగు ననియే యట్టి సంధిని కోరియున్నాఁడు గాని ధార్తరాష్ట్ర వినాశమే ధర్మజుని ముఖ్యోద్దేశ మని యర్జును నస్త్రసంపాదనమునై తపమున కంపుటకు ముందు భీమునితో నాడిన మాటలవలననే స్పష్టమగు చున్నది పంచగ్రామసంధి, గత యైరోపా మహా సంగ్రామములో "కైజరు" (జర్మను ప్రభువు) "జిబ్రాల్టరు"ను స్పెయిను వారికిని, ఈజిప్టును తుర్కీ సుల్తానున కిచ్చినయెడల "అల్సేసు, లోరైను" లను ఫ్రాంసువారికి మే మిచ్చెద మనుటవంటిదే యని స్ఫురించును పంచగ్రామ సంధిని వినిన సంజయుఁడు ధర్మజుని "మెత్తని పులి"తోఁ బోల్చియున్నాఁడు విదురుఁ డెంతయేని సహాయముఁ జేసియుండియు జ్ఞాతివధములో ధర్మజుని ఘోరకృత్యములకు రోసెనని యిదివఱకె వ్రాయఁబడి యుండెను. పేరికి ధర్మరాజె కాని యాతని చేఁతలు మాత్ర మధర్మయుక్తము లని యొక తెనుఁగుకవి ప్రాచీనకాలమున నుడివెను. ("పేరు ధర్మరాజు - పెదవేఁపవిత్తయా విశ్వదాభిరామ వినురవేమ ")

ధర్మజుఁ డశ్వమేధయాగదీక్షితుఁ డైనపుడు, అర్జును నశ్వసంరక్షణమునకు నియోగించుచు సామవాక్యములతోడనె యశ్వముఁ బట్టవచ్చినవారిని సమాధానపఱుపుమని రాజనీతి విశద మగునటులఁ జెప్పినాఁడు. మహాయుద్ధములో పేరు కలవారు పెక్కండ్రు మడిసినను, యువకు లగు ప్రాగ్జ్యోతిష, మగధ, పాండ్యదేశాధీశులును, పౌరుషవంతులగు త్రిగర్త, సింధు గాంధారాది దేశస్థ సైనికులును పాండవాధిపత్యమును ధిక్కరింప నుద్యుక్తులుగానె యుండిరి. అందువలన యజ్ఞధనముఁ దెచ్చుటకు హిమవంతమున కేగినపుడును[2] వనాశ్రమవాసు

1. శ్లో. కుశస్థలం వృకస్థలం మాకందీం వారణావతం
అవసానం భవేదత్ర కంచదేకంచ పంచమం
'ఉద్యోగపర్వ. 80 అధ్యా.

2. అశ్వమేధపర్వ. 63 అధ్యా.

లగు ధృతరాష్ట్రాదులఁ జూచుట కేగినపుడును[1] హస్తిపురి నెవరేని ముట్టడింతు రను భీతిచేఁ బట్టణమును గాఁపాడ "యుయుత్సు" దులను ధర్మజుఁడు నియోగింపవలసి వచ్చుచుండెది. సామవాక్యము సమాధాన మాత్మలాభకరమె గాని కేవలదయారసముచేఁ గాదేమో?

ధర్మాత్ముఁడు, బుద్ధిశాలి, రాజకీయవేత్త యని ప్రసిద్ధికెక్కిన ధర్మరాజు, ద్యూతసమయమున నధర్మముగా - బుద్ధిహీనముగా - ప్రవర్తించి పెద్దలచే సభ యందుఁ ఛీఛీ యనిపించుకొనుట వింతగ నున్నది. ధర్మజుఁడు ద్రౌపది నొడ్డి నపు డేమనెనో చూడుఁడు:

[2]"యుధిష్ఠిరుఁడు (శకునితో) ఇట్లనుచున్నాఁడు: పొట్టిది పొడుగుది కానట్టిదియు, చిక్కినది కానట్టిదియు, మిక్కిలి యెఱ్ఱనిది కానట్టిదయు, నల్లనై యుంగ్గులుదేఱిన తలకట్టు గలదియు నగు ద్రౌపది నొడ్డుచున్నాను. శరత్కాలము నందలి కలువపలవంటి నేత్రములు కలిగినట్టిదియు, శరత్కాలపుఁగలువల పరి మళమువంటి సువాసన కలిగినట్టిదియు, రూపముచే శరత్కాలపుఁగలువలచేఁ బూజింపఁబడు లక్ష్మీ సమానురాలైనట్టిదియు, పురుషుఁ డెట్టి స్త్రీ కావలెనని తలంచునో అట్టి సత్యము, రూపసంపత్తి, శీలసంపత్తి కలిగినట్టిదియు, సర్వ సుగుణములతోఁ గూడినట్టిదియునై ఎవతె (అందఱును) నిద్రించిన పిమ్మట నిద్రించునో, (అందఱికంటె) ముందుగా నిద్రనుండి లేచునో, గోపాలురు,

---

1. ఆశ్రమవాసపర్వ. 18 అధ్యా.
2. యుధిష్ఠిరః శ్లో. నైవహ్రస్వా నమహతీ, నకృశానాపిరోహిణీ నీలకుంచిత కేశీచ, తయా దీవ్యామ్యహం త్వయా। శారదోత్పలపత్రాక్ష్యా, శార దోత్పలగంధయా శారదోత్పల సేవిన్యా రూపేణ శ్రీసమానయా॥ తథైవస్యా దానృశంస్యా, త్తథాస్యా ద్రూపసంపదా తథాస్యా చ్ఛీల సంపత్త్యా, యా మిచ్ఛే త్పురుషః స్త్రియం। సర్వైర్గుణైర్హి సంపన్నా మనుకూలాం ప్రియంవదాం। యాదృశీం ధర్మకామార్థ, సిద్ధి మిచ్ఛే న్నరః స్త్రియం। చరమం సంవిశతి యా, ప్రథమం ప్రతిబుధ్యతే। ఆగోపాలాఽ విపాలేభ్యః, సర్వం వేదకృతాకృతం। ఆభాతి పద్మవ ద్వక్త్రం. సస్వేదం (సురభిః) మల్లికేవచ। వేదిమధ్యా దీర్ఘకేశీ. తామ్రా స్యాన్యాతిలోమశా తథైవంవిధయా రాజన్ పాంచాల్యాఽహం సుమ ధ్యయా। గ్లహం దీవ్యామి చార్వ్యంగ్యా పాంచాల్యాహంత! సౌబల!
వైశంపాయనః శ్లో. ఏవ ముక్తేతు వచనే, ధర్మరాజేన ధీమతా। ధిగ్ధిగి త్యేవ వృద్ధానాం సభ్యానాం నిస్సృతా గిరః। చుక్షుభే సా సభా రాజన్, రాజ్ఞాం సంజజ్ఞి రేశుచః। -సభాపర్వ 64 అధ్యా.

గొల్లెలఁ గాఁచువారు మొదలగు నందఱి ప్రవర్తనము తెలిసియుండునో; ఎవతె యొక్క ముఖము పద్మమువలెఁ బ్రకాశించునో, మల్లికవలెం బరిమళించునో, వేదికవంటి హ్రస్వమైన మధ్యము కలదియో, పొడవైన తలవెండ్రుకలు కలదియో లావణ్యయుక్తురాలైన యట్టిపాంచాలితోఁ బందెము వేయుచున్నాను. శకునీ! ఎంతకష్టము!" అనెను.

(పెండ్లామును జూదమున నొడ్డువాఁడు పెండ్లామును మిగుల వర్ణింప వలయుం గాఁబోలును.)

ఇట్లు బుద్ధిమంతుఁడగు ధర్మజుఁడు పలుకఁగా సభయందుండిన పెద్ద లందరు ఛీఛీ యనిరి. ఆ సభ క్షోభించెను. రాజులకు విచారము కలిగెను. ఇంత మాత్రమె కాదు. సభలోనికి ద్రౌపదిని రజస్వలావేషమును వేసికొని పోఁకముడి వదులు చేసికొని ఏడ్చుచు రమ్మనుట మఱియొక యనాలోచనాకృత్యము. లోకమునం దుండిన ధర్మజుని ప్రఖ్యాతి నీరెండు దుష్కార్యములు కలంకముఁ గలుగఁజేయుచున్నవి. ద్యూతకాలమున ధర్మజుని యకృత్యములకు రోసియే సోదర ప్రియత్వము, 'అగ్రజునియం దత్యంతభక్తియుఁ గల' భీముఁడును ధర్మజుని నీ చేతులు తగులఁ బెట్టవలయు ననినాఁడు.

ధర్మజు డెంతటి ధర్మాత్ముఁ డయినను, కృష్ణ బలరాము లెంతటి యవతారపురుషు లైనను, ఆ కాల మెంతధర్మకాల మని పౌరాణికులు నుడివినను దేశమున ద్యూతము, పానము, స్త్రీ లోలత మొదలగు దౌష్ట్యములే కాక, మ్లేచ్ఛులు కిరాతులు దేశోపద్రవముఁ జేయుచునే యుండిరని కృష్ణనిర్యాణానంతర మర్జును నకుఁ గలిగిన కిరాతకృత పరాభవముచే నూహింపవలసి యున్నది. శ్రీకృష్ణుఁడు కూడ మ్లేచ్ఛకృత పరచక్ర భయముమ దలఁచుచునే మృతినొందియున్నాఁడు. ధర్మజు డెంతటి ధర్మాత్ముఁడుగాఁ దలఁపఁబడు చుండినను, పరలోకము నొందిన పిమ్మటఁ గూడ దుర్యోధనుని శ్రేయస్సును సహింపరానివాఁడై స్వర్గమున నాతఁడు సుఖియై యుండెనే యని మనస్సునఁ గాక, పైకిని విలాపముం జేసి యున్నాఁడు.[1] ధర్మజుని రాజ్యోత్తరకాల మంతయుఁ బశ్చాత్తాపము తోడను, వితంతు విలాపములతోడను ద్రోణాదుల బ్రహ్మహత్యల కగు నశ్వమేధాది ప్రాయశ్చిత్తముల తోడను ముగిసినది కాని సుఖకరముగా - ఆనందకర ముగా - ముగియలేదు. తాము చేసిన సర్వదోషప్రాయశ్చిత్తముఁగా బాండవులు ద్రౌపదీ సహితులై మహాప్రస్థానికముఁ జేసి మృతినొందిరి. పరలోకమున వారు నరకమునే ముందు చూచిరనుట యుక్తియుక్తముగానే యున్నది.


1. స్వర్గారోహణపర్వ 1 అధ్యా.

శ్రీకృష్ణ నిర్యాణమైన వెంటనే యర్జునుఁడు మ్లేచ్ఛులచేఁ బూర్తిగఁ బరాభూతుఁ డయ్యెను. శ్రీకృష్ణుఁడు మృతినొందుటచేతనె యర్జునునకుఁ గల్గిన బలహీనత దైవికమని తలంతురు. కాని నైతిక మనుట యుక్తము. పార్థుఁడు హస్తిపురి కేతెంచి బలముఁ గూర్చికొనియు, భీమాదులఁ జేర్చికొనియు నేల కిరాతులపైఁ బడి వారిని నిర్జించి యపహృత ధనరాసులను, కృష్ణుని వనితలను దేలేదు? ధర్మాత్ముఁ డగు ధర్మజుఁ డేల యాయధర్మము నణఁపలేదు? మిత్రుని వనితలను ధనమును నపహరించినవారిని జేఁతకానివానివలె నుపేక్షించుట యుక్తమా? కాదు. దేశమునం దెన్నియో పాండవులపైఁ బెద్ద తిరుగబాటులు సంభవించుటచేతను, సింధు, గాంధార, మగధ, త్రిగర్తాది కురురాజ్య పరిసర దేశస్థులు పాండవులపై నీసు కలవా రగుటచేతను, మిత్రులగు యాదవులు మృతినొందుటచేతను నిస్సహాయులగు పాండవులు తమ కీదేశమున నుండిన మాట దక్కదని రాజ్యమును పరిక్షిత్తునకు వశపఱచి రాజ్యమునఁ బ్రాచీనకాలము నుండియుఁ బరిచితులగు కృపాదుల నుపద్రష్ఠలనుగా నుండ నియమించి హిమాలయాదుల నతిక్రమించి టిబెత్తునను మృతినొందిరి. ఈ పలాయనోపాయమును జెప్పినవాఁడు ధర్మజుఁడే. వారణావతమున లాక్షాగృహదహనముం జేసియు నిట్టి పలాయనోపాయముఁ జెప్పినవాఁడు ధర్మజుఁడే. ఇంక నొక్క విశేషము, దుర్యోధనపుత్రుఁ డొకఁడు బాలుఁడై బావక మిగిలినట్లును, అతని పేరు "దుర్జయుఁ" డైనట్లును క్రీస్తుపశకమునకుఁ బూర్వము రెండవ లేక మూఁడవ శతాబ్దములలో నుండిన భాసమహాకవి తన యూరుభంగ నాటకమునం జెప్పి యున్నాఁడు. ఇంతమాత్రమె కాదు, అథర్వసంహితలోఁ బరిక్షిత్తున కనుయాయుఁ డగు కౌరవ్యుఁ డొకఁడుండినటులఁ జెప్పఁబడెను. ఆ కౌరవ్యుఁడు పరిక్షిత్తుతో సమానముగా యజ్ఞములలో గౌరవింపఁబడుచున్నట్లు ఐతరేయ బ్రాహ్మణమునఁ జెప్పఁబడెను. ఆ కౌరవ్యుఁడు దుర్యోధన పుత్రుఁడేల కాఁగూడదు? దుర్యోధన పుత్రుఁడు పాండవుల చేఁజిక్కక యెచటనో పెరిగి యుద్ధానంతరము ముప్పది యాఱేండ్లకు పంచనదప్రాంత కిరాతులఁ గూర్చికొని యర్జును నోడించెనేమో? కాలాంతరమున నుభయులకు సముఁడగు కృపాచార్యుఁడు పరిక్షిత్తుతో సమాధానపఱచి పరిక్షిత్తుతో సమానమగు గౌరవప్రపత్తులను రాజ్యమునం గలుగఁజేసి పరిక్షిత్తు పట్టభద్రుఁ డగునట్లును సుయోధనసుతుఁడు మంత్రి యగునట్లును జేసి యుండెనేమో?

మఱియొక విషయముకూడ నిచట స్ఫురించుచున్నది. అర్జును నోడించిన కిరాతులు పంచనదదేశస్థులు. వితస్తానది పంచనదులలో నొకటి. తక్షశిల వితస్తానదికి సమీపమున గలదు. తక్షకుఁడు నిర్మించినది యే తక్షశిల యని కొందఱి

మతము. శ్రీరాముని సోదరుఁడైన భరతుని పుత్రుఁడగు తక్షకుఁడనువానిచేఁ దక్షశిల నిర్మింపఁబడినట్లు శ్రీమద్రామాయణోత్తరకాండమునఁ గలదు. కాని, భారత యుద్ధమునకుఁ బూర్వమునఁ దక్షశిలానామము కాన్పింపదు. ధర్మజుని రాజసూయాశ్వమేధదిగ్విజయముఁలోఁగాని కర్ణుని దిగ్విజయములలోఁగాని తక్షశిల పేరు కాన్పింపదు. అది జనమేజయుని దండయాత్ర సందర్భమునఁ జెప్పఁబడెను. కాన, అర్జునునిచే ఖాండవ వనదహన సమయమునఁ బత్నింగోలుపోయినట్టియు, కర్ణుని సర్పముఖాస్త్ర ప్రయోగానంతర మర్జునునిచేఁ జచ్చిన యశ్వసేనునకుఁ దండ్రియైనట్టియుఁ బరిక్షిత్తుం బరిమార్చినట్టియుఁ దక్షకుఁడనువాఁడే పై తక్షశిలా నగర నిర్మాతయై యుండును పాండవులు, ఇంద్రప్రస్థపురిని నిర్మించుకాలమున నాతఁడు కొంతకాలము ఖాండవ వనమునను, మఱికొంత కాలము కురుక్షేత్రమునను నివసించు వాఁడఁట! ఖాండవవన దహన కాలమునఁ గురుక్షేత్రమున నుండుటచేఁ దక్షకుఁడా ఖాండవవనదహన సమయమునఁ జావలేదని యాఘట్టముననే వర్ణింపబడెను. ఖాండవ వన, కురుక్షేత్రములలోఁ దక్షకుఁడుండువాఁడని యుదంకోపాఖ్యానమునను గలదు. పాండవులతోఁ బడలేక తక్షకుఁడు నాతని సంతతియు వితస్తా నదీప్రాంతముఁ జేరి యచట రాజ్యస్థాపనముఁ గాలాంతరమునఁ జేసియుందురు. ఆ తక్షక సంబంధులగు నాగులే పై కిరాతులై యుండవచ్చును అర్జునునితో నెడతెగని వైరము వారికిఁ గలదు, వారే యర్జును నోడించియుందురు. ఇంకను నీయంశమును ముందు వివరింతును.

ధర్మరాజజాతకము.




శ్లో. శ్రీకృష్ణజన్మనః ప్రాగబ్దద్వితీయే వికృత్యబ్దే జ్యేష్ఠసితపూర్ణిమా
యాం మధ్యాహ్నే సింహలగ్నే చ జ్యేష్ఠాంగతే శశాంకే కుంత్యాం
ధర్మాంశతో జాతః, ఇందోర్వారే వృషభే రవికుజబుధభార్గవాః
ఘటేజీవః మందః కుళీరగ స్యాత్ఫల మఖిలం భారతేన విజ్ఞాతం.

(ధర్మరాజు జ్యేష్ఠా నక్షత్రమునఁ బుట్టుటచే ననేక కష్టముల ననుభవించుటయు ద్వాదశమున శనియుండుటచే ననేక పాపకార్యముల నొనరించుటయు తక్కిన విశేషములకంటె విశదముగా దెలియనగును.)

## భీముఁడు

ఆలంకారికు లీతనిని "ధీరోద్ధతుఁ" డందురు. భీముని జన్మాది వృత్తాంత మిదివఱకె సూచింపఁబడెను. భీముఁడు చిన్నతనపు టాటలలోఁ గౌరవులను బాధించుటచేతనె కురుపాండవులకు విరోధబీజ మేర్పడెను. నన్నయభట్టాంధ్రీకరణములో హస్తిపురికిఁ జేరునాఁటికిఁ భీమునకుఁ బదునాఱువర్షము లుండె ననెను. పదునెనిమిది లేక, యిరువదివత్సరముల యీడుననే దుశ్శాసనాదులను బాధించువాఁడు. ఈ బాధఁ బడలేకయే దుర్యోధనుఁ డీతనిఁ జంపుటకు నదిలోఁ ద్రోయుట, విషము నిడుటయు నను మహాపకారములఁ దలపెట్టెను. లోకులు సుయోధన కృతాపకారములను లెక్కింతురే గాని, భీమకృతాపకారముల నేలకో లెక్కింపరు! అపకారబుద్ధి లేక బాల్యముచేతనె యాతఁడట్టి బాధలఁ గౌరవులకుఁ జేసియుండెనని మహాభారతమునఁ గలదు. కాని బాల్యమైన నబాల్యమైన, నపకారబుద్ధి యుండిన నుండకుండినఁ, బెట్టినబాధలు బాధలేకదా? అపకారబుద్ధి లేక యొకఁడగ్నిఁ దటికొలిపిన నిండ్లు కాలకుండునా? భీమునిచర్య లట్టివియే యైనవి. భీముఁ డెట్టిబాధలను గౌరవులకుఁ గలిగించెనో నన్నయభట్టు సంగ్రహపఱచి చెప్పిన పద్యములే రెండు వ్రాయఁబడును :

క. వదలక పెనఁగి పదుండ్రం
బదియేవుర నొక్కపెట్ట పట్టి ధరిత్రిం
జెదరఁ బడవైచి పవనజుఁ
డదయుం డయి పీఁపు లొలియ నందఱ నీడ్చున్.

సీ. కూడి జలక్రీడ లాడుచుఁ గడఁగి యా
ధృతరాష్ట్రతనయుల నతులశక్తి -
లెక్కించియుఁ బదుండ్ర నొక్కొక్కభుజమున
నెక్కించుకొని వారి నుక్కడంగఁ.
గొంచక నీరిలో ముంచుచు నెత్తుచుఁ
గారించి తీరంబు సేరఁబెట్టుఁ
గోరివలార్థులై వారలయెక్కిన
మ్రాఁకుల మొదలుల వీఁకఁబట్టి

గీ. వడిఁ గదల్పఁ బండ్లు దడఁబడి వారల
తోన ధరణిమీఁదఁ దొరగఁచుండ

నిట్టిపాట గాడ్పుపట్టిచే దుశ్శాస
నాదులెల్ల బాధితాత్ము లైరి. -ఆదిపర్వ.

కురుకులవృక్షమునకు నినుపసీలగా నుద్భవించిన భీముఁడు లక్కయిండ్ల నంటించుటలోను నాఁటి రాత్రి యరణ్యమున సోదరులఁ గుంతిని దాఁటించుట లోను, అర్ధరాత్రమున హిడింబు బారినుండి తమ్ము రక్షించుకొనుటలోను జటాయు కీచకవధములలోను స్వరక్షణాతిశయముచేఁ బ్రకాశించెను.

కౌరవవధముచే నగు సామ్రాజ్యప్రాప్తిని, జరాసంధవధముచేఁ బూర్వ సముద్రవ్యాప్తిఁ బాండవసామ్రాజ్యము నొందించినవాఁడు భీముఁడే. జరా సంధుఁ గపటముగా భీముఁడు కృష్ణప్రేరితుఁడై చంపెనని నిశ్శంకముగా శిశు పాలుఁ డధిక్షేపించినపుడు తన ఛిద్రము వెల్లడి యగుచున్నదని శిశుపాలుపై భీముఁ డఱఁగి తలపడఁదలచెను. కాని శిశుపాలుఁడు భీముని మించిన బల వంతుఁడని యెఱిఁగిన భీష్ము డా యుద్యమమునుండి మరలించెను. దుశ్శాసన, దుర్యోధనవధము లన్యాయముగాఁ జేయఁబడినవని భీముఁడే గాంధారియెదుటఁ బొలికలనిలోఁ జెప్పియున్నాఁడు. మఱియుఁ గురుకులములోఁ బెద్దయు, భీష్ముని పినతండ్రియు, శతవృద్ధుడు నగు "బాహ్లికుని" జంపుటలోను, అతని కుమారుఁ డగు ''సోమదత్తుని'' సాత్యకిచేఁ జంపించుటలోను, ధార్తరాష్ట్రులలో నొక్కనిఁ గూడ మిగులకుండఁ దుదముట్టించుటలోను, శ్రాద్ధములఁ జేయుటకు ద్రవ్యము నిండని ధృతరాష్ట్రుఁ డడుగఁగాఁ బరలోకమున ధార్తరాష్ట్రు లతికష్టము లనుభవింతురుగాక, వారికి శ్రాద్ధములఁ జేయనక్కఱలే దని కఠినముగాఁ జెప్పుటలోను1 (దుర్యోధనాదుల శ్రాద్ధములకు భీమునాజ్ఞ లేకపోవుటచే రాజ కోశమునుండి ద్రవ్యము నీయ వీలులేక ధర్మజ ధనంజయులు స్వంతద్రవ్యము నిచ్చి ధృతరాష్ట్రుచే శ్రాద్ధములఁ జేయించిరి.) అన్యాయముగా దుర్యోధనుఁ బడఁ గొట్టి యాతనితలను రెండుసారులు తన్నుటలోను (తల నన్యాయముగాఁ దన్ని నపుడది గర్హ్యమని ధర్మరాజుకూడ మిగుల గర్హించి విలపించియున్నాఁడు) భీముని క్రూరత్వము విఖ్యాతినొందినది. భీముఁడు స్వపక్ష పరపక్ష బలముల తారతమ్యము నెఱుఁగక సదా శత్రువులపై విజృంభింప నుంకించువాఁడు. ధర్మ జుఁడు, మదించిన యేనుఁగును నేర్పరి యగు మావటివలె, నాతని శాంతునిఁ జేయువాఁడు స్వపరబలములఁ దెలియకపోవుటచేతనే భగదత్త, సైంధవ, కర్ణా శ్వత్థామాదుల కపు డపు డోడుట సంభవించినది. కృష్ణార్జునులు సూచింపనియెడల జరాసంధ దుర్యోధనులను భీముఁడు వధింప లేకుండు నని యాప్రకరణములఁ జదివిన విశదమగును. భీష్ముని సేనాపత్యకాలమున రెండు, ఆఱు, పది దివసము

1. ఆశ్రమవాసపర్వ. 11 అధ్యా.

లలోను, గురుని సేనాధిపత్య కాలమున నాలుగు అయిదు దివసములలోను, కర్ణుని సేనాధిపత్యకాలమున రెండవ దివసయుద్ధమునను భీముని పరాక్రమము ప్రశంసనీయమై యున్నది. ద్రోణాధిపత్య కాలముననైదవనాఁడు "ద్రుమా"దులను వధించుటలో నగువిక్రమ మత్యద్భుతము. దుశ్శాసనువధములోఁ జేసిన దారుణమగు రక్తపానము కర్ణ దుర్యోధనాదులు తనపైఁ గవియుదు రనుభీతిచేతనె చేసితి నని గాంధారికడ చెప్పుకొనియున్నాఁడు. భీము దుర్యోధను లొక్కదినముననే జన్మించి నందుల కిరువురును తెలియని మూఢులే యని చెప్పవలసియున్నది. భీముఁడు, తన పక్షపువాఁడగు కృష్ణుడు తన కుమారుఁడగు ఘటోత్కచుని వధింపఁ గర్ణుపై కంపుటయు "శ్రుతసోముని" (ద్రౌపదికి భీముని వలన జన్మించినవాఁడు.) అశ్వత్థామ బారికి వదలుటయుఁ దెలియక తన సంతతి లేకుండఁగఁ జేసికొని యున్నాఁడు. ఒక్క కృష్ణుఁడే కాదు అర్జునుఁడును ఘటోత్కచ వధమును దెలిసియు భీమునకుఁ జెప్పక కృత్రిమముఁ జేసెను. కర్ణవధ దివసమున సమరభార మంతయు భీముఁడే వహించి యర్జునుని ధర్మజుసేమ మరయునెపమున శిబిరమున కంపి విశేషవిశ్రాంతిని గలిగించెను. కిమ్మీరాసురవధము, హనుమత్సమాగమము, అజగరరూపనహుషకృతపరిపీడనము, యక్షరాక్షసవధము మొదలగు గొన్ని యంశములు కల్పితములుగాఁ గాన్పించును. మహాయుద్ధములోఁ బ్రబలవీరు లితనిచేతనే పొలిసిరి. తన శత్రువుఁ జంపి పగఁదీర్చుకొనుటలో నితఁ డద్వితీయుఁడే కాని దుర్యోధనవధానంతర మాతని కొనరించిన యవమాన మత్యంతగర్హ్యముగా నున్నది. క్రూరత్వమునఁగాక దేహబలమున భీముఁడు నిర్వీర్యులగు ప్రస్తుతపు భారతీయుల కాదర్శపురుషుఁడుగా నుండఁదగినవాఁడు.

## అర్జునుఁడు

నరుఁ డను మునియంశమున జన్మించెనను నీమహాపురుషుఁడే యింద్రువంశమునఁ బుట్టెనని యసందర్భముగాఁ జెప్పఁబడుచుండును. మార్కండేయపురాణము జలదేవతాంశమున నర్జునుఁడు జన్మించెనని చెప్పుచున్నది. ఏ దేవతాంశమైన నితఁడు "పార్థుడు" (పృథయను మాఱుపేరుగల కుంతికుమారుఁడు). శాకటాయనుని కాలమున నితఁడు క్షత్రియవీరుఁడుగా బరిగణింపఁబడి పాణిని కాలమున కంతకంటె హెచ్చగు మతప్రవక్తుఁడుగా లెక్కింపఁబడి పతంజలి కాలమునకుఁ గృష్ణునితో సమమగు పూజ్యస్థానమునుండి తొలఁగింపఁబడి నేఁటికాలమున భారతీయ వీరాగ్రేసరుఁడుగాఁ బొగడఁబడుచున్నాఁడు. కురు పాండవ వీరులలో నితఁ డద్వితీయుఁడై యుండుట కితనికిఁ గృష్ణసారథ్యమె తోడ్పడినది. విద్యాభ్యాసకాలము నుండియు నితఁ డతిజాగ్రత్తతో మెలఁగుటచేతనే ప్రసిద్ధి


నొందఁగలిగెను. ఈతని విజయములు ద్రుపద విజయముతోఁ బ్రారంభమై యశ్వమేధాశ్వ సంరక్షణముతో నంతమై విజయాభిధాన మీతనికి సార్థకపఱచినవి. ధర్మజుని రాజనీతి యందును కృష్ణు నాలోచనా నైపుణ్యమునందును నీతనికి నమ్మక మెక్కుడగుటచే వారి యాజ్ఞల నెపుడును దాఁటువాఁడు కాఁడు. ధర్మజు నానతిచేతనె తీర్థయాత్రకుఁ బోయి పాండ్య యాదవ వనితలఁ బెండ్లియాడి స్వవర్గ మైత్రిని వృద్ధిఁజేసికొనియు, తపంబునకుఁబోయి రుద్రేంద్రాదులవలన దివ్యాస్త్ర లాభము నొంది పరాక్రమాతిశయముఁ గలిగించుకొనియు విజయుఁడయ్యెను. కృష్ణు నానతిచే ఖాండవ వనమును దహించి రాజ్యాభివృద్ధితో మయసభాలాభముఁ గూడ నొందెను. మహాయుద్ధములోఁ గృష్ణు నానతిచేతనె భీష్మ భగదత్త సైంధవ కర్ణులను రణనీతి విరుద్ధముగాఁ బడఁగొట్టెను. అర్జున కృతము లగు ఘోషయాత్రా సందర్భపు గంధర్వవిజయము, ఉత్తర గోగ్రహణము కల్పితములని కొందఱు తలఁతురు. నివాతకవచ కాలకేయ జయములు కూడఁ గల్పితము లనియే కేచిన్మతము. పైని జెప్పఁబడిన విజయములలో నివాతకవచ కాలకేయ విజయములఁ గొంత సందేహము కలదు. నివాతకవచులు శ్రీరాముఁడు పుట్టకపూర్వమె రావణునితోఁ ద్రేతాయుగమునఁ బోరాడినవారు. వారు కొన్ని యుగములకుఁ బిమ్మటకూడ నుండురా యనునది గొప్ప సందేహము. కాలకేయులు వింధ్య పర్వత విజృంభణమునకుఁ బూర్వమె యగస్త్యుఁడు సముద్రోదకముఁ బానము చేసినపుడు దేవతలతోఁ బోరాడిన వీరులు. రావణుని సోదరియగు శూర్పణఖ కాలకేయాసురాధిపతియగు "విద్యుజ్జిహ్వుని" భార్యయై యున్నది. విద్యుజ్జిహ్వుని రావణుఁడె వధించె నని రామాయణమునఁ గలదు. నాఁటి కాలకేయులు భారతకాలమువఱకు నుండురా? తక్కిన యుద్ధము లెటులుండినను, భీష్ముని యంత్యదివసయుద్ధమునను, సైంధవవధమునాఁడును విజయుఁడు చూపిన పరాక్రమ మవర్ణ్యము. సైంధవ వధ దివసమున ద్రోణు నతిక్రమించి శకట వ్యూహముఁ బ్రవేశించుటకును, శ్రుతాయుధునిగద తాఁకుడు సోఁకకుండుటకును, సైంధవుని మోసపుచ్చుటకై[1] మాయాతిమిరముఁ గల్పించుటకును శ్రీకృష్ణ

1. ఒక విధమగు ధూమమును వ్యాపింపఁజేసి శత్రువులను మోహపెట్టుట చాణక్యుని కాలమునను గలదని యాతని యర్థశాస్త్రము చెప్పుచున్నది. జర్మనుల యుద్ధనావలలోఁ గొన్ని ధూమవ్యాపనముచే నింగ్లీషు వారి యుద్ధనావల దృష్టి చెదరునటులఁ జేసినవి. ఇట్టి ధూమవ్యాప్తి చేతనె కృష్ణుఁడు మాయాతిమిరముఁ గల్పించి సూర్య మండలము నాచ్ఛాదించి యుండును.

సాహాయ్యమె యర్జునునకు విశేషముగాఁ గల్గెను. భీష్ముని తృతీయ నవమదివస యుద్ధములలో నర్జునుఁడు భీష్మునకోడె ననియె చెప్పవలసియున్నది. కర్ణుని భార్గవాస్త్ర పీడిత స్వసైన్యముఁ జూచి "మాధవా! మనరథ మింక మరల నిమ్ము, బ్రతికియుండిన సుఖములు పడయవచ్చు" నను సమయమె విజయుని విజయదశలో నీచతను సూచించు నవస్థయై యున్నది. కర్ణుని వధింప నేఁడు సమయమునఁ గృష్ణుఁడెంతధైర్యవాక్యములఁ జెప్పుచుండినను, భీతిచే నర్జునుఁడు ప్రస్వేదగాత్రుఁడయ్యె నననదియే యాతని జీవితములోని భీతావస్థ. యుద్ధ రంగమునఁ గర్ణుని జూచినంతనె యర్జునుఁడు భీతిచేఁ బరుగిడు నని సుయోధ నుఁడు చెప్పెనట![1] ఈ వాక్యము సత్యమే యని యాతని ప్రస్వేదగాత్రావస్థ సూచించును. కృష్ణసహాయము లేకుండఁగ నర్జునుఁడు కొన్ని విజయముల నందినను, అవి కురుక్షేత్రవిజయ సదృశములు కావు. రాజసూయాశ్వమేధ యాగకాలములలోని విజయము లతిశయోక్తులతో నిండియున్నవి. జైమినిభారత మున నశ్వమేధయాగకాలమున నయ్యెనని చెప్పఁబడు యుద్ధములు బూటకములు. జైమిని భారత గాథలు దాక్షిణాత్యకవి కల్పితము లని కొందఱు తలఁతురు. కృష్ణనిర్యాణానంతరము కృష్ణభార్యలఁ గిరాతులవలనం గోల్పోవుటయే యీతని జీవితములోని నికృష్టసమయము. కృష్ణాభిమానమీతనియం దుండుటచేతనె సర్వ కురుపాండవసంతతి నశించినను, ఈతని సంతతి భరతఖండస్థ పాండవ వంశాంకు రముగా నిలిచియుండుటకుఁ గారణ మయ్యెను. ఇపుడు భరతఖండస్థ క్షత్రియు లలోఁ గొందఱు "ధనంజయ" గోత్రకులు కలరు. వారు తెలియక తా మర్జున సంతతివార మనుకొందురు. కాని యది పొరపాటు. గోత్రర్షియగు ధనంజ యుఁడు విశ్వామిత్రగణములోనివాఁడు. ఈ ధనంజయునకు నాధనంజయునకు సంబంధము లేదు. అర్జునునకుఁ గల ప్రఖ్యాతు లన్నిటిలో నాతనికిఁ గృష్ణుఁ డుపదేశించె నను విఖ్యాతిగల భగవద్గీతలె మిన్నయైనవి. గీతలన్నిటి నాసమయ మునఁ గృష్ణుఁ డర్జునున కుపదేశించినను నుపదేశింపకుండినను గీతాలతాబీజము నకు క్షేత్రమై యర్జునుఁడుండుటయె విఖ్యాతి హేతువు.

1. కర్ణపర్వ 69 అధ్యా.

### అర్జునునిజాతకము.




శ్లో. శ్రీకృష్ణ జన్మవర్షే కార్తిక్యాం కృష్ణదశమ్యాంతు, ఇందోర్వారే చోత్తరఫల్గున్యాం సర్వలక్షణోపేతః కోదండాఖ్యే లగ్నే శుక్ర శిఖీ వాక్పతి స్సుతభేమందేదశమేలాభేసౌమ్యోవ్యయేభానుః ఏవం యథాగ్రహ స్థితిర్వ్యదతః శ్రీమన్మాహేంద్రాంశాత్ పార్థర్జునః పృథాయాం ఫల మఖిలంభారతేనగమ్యమ్.

## నకుల సహదేవులు

పాండవులలో వీరు కలిసియుండుటచేతనె వీరికిఁ బ్రసిద్ధి కలిగినది. కాని వీరు చేసిన ఘనకార్యము లంతగాఁ గాన్పింపవు. నకులుఁ డశ్వశిక్షానిపుణుఁడని విరాటపర్వమునఁ గలదు కాని, శకునితో సశ్వసైన్య యుద్ధము సల్పినవాఁడు సహదేవుఁడే. నకులుఁ డందగాఁడట! అతఁ డందగాడై యితరుల నధిక్షేపించువాఁడు.1 నకులుఁడు కర్ణసుతుఁ జంపెనెగాని పేరుగలవారి నెవరిని జంపినటులు లేదు. సహదేవుఁడు నకులునికంటె శూరుఁడుగఁ గాన్పించును. ప్రఖ్యాతి గన్న వీరుఁడగు శకుని, యాతని కుమారుఁ డులూకుఁడు సహదేవునిచే జచ్చిరి. సహదేవుఁడు జ్ఞానియట! అందువలన నితరులను దృణీకరించువాఁడు.2 రాజసూయసమయమున మేము కృష్ణుఁ బూజింతుము, దీని కంగీకరింపక యెదురు చెప్పువారి తలపై నేను కాలుంతునని యాతఁడు సభలో రాజులఁ దృణీకరించుటయె రాజుల మనస్సునం దసూయ కంకురమైనది. కుంతి వరముగోరకుండినఁ గర్ణుచే నకులసహదేవులు మృతిహొంది యుందురు.

ఇంతదనుక మహాభారతచరిత్రములోని ముఖ్యాంశములు వర్ణింపఁబడినవి. పాండవులే న్యాయస్థు లనియు దుర్యోధనాదు లన్యాయమున కొడఁబడి పాండవుల

1. మహాప్రస్థానికపర్వ. 2 అధ్యా.
2. మహాప్రస్థానికపర్వ. 2 అధ్యా.

గడగండ్ల పాలుచేసి రనియు స్థూలదృష్టిఁ దలఁపఁబడు వంశము లన్నియు నిజము గావని నిదర్శనములతోఁ జూపఁబడినవి. ఇఁకను సుయోధనుపక్షము కూడ సంగ్రహముగా విమర్శింపఁబడును.

## దుర్యోధనుడు

ఈతఁడు గాంధారీ గర్భజనితుఁడు. భీముఁడు నీతఁడు నొక్కదివసముననే జన్మించిరి. సమానబలవంతులు. భిన్నభిన్న కాలములలో నీ యిరువురును బలరామునికడ గదాయుద్ధ నైపుణ్యము నందిరి. కృపద్రోణులకడఁ జిన్నతనమున విద్యాభ్యాసముఁ జేసిరి. దేహబలమున భీముఁ డెక్కుడు. గదానైపుణ్యమున దుర్యోధనుఁడు మిన్న. భీముఁడే తొలుత నాటల నెపమున సుయోధనాదుల బాధించి వారి కీర్ష్యను జనింపఁజేసె నని యిదివరకే వ్రాయఁబడెను. నీటిలోఁ ద్రోయుట, విషము నిడుట యనునవి. భీముఁడు పెట్టుబాధలకు సహింపక చేసిన చేఁతలు, వారణావతమునకుఁ బాండవులను సాగనంపుటలోఁ బౌరులకుఁ గూడ నసూయ కలుగుటచేతను, స్వరాజ్య ప్రతిష్ఠాపన కౌఱకుఁ గూడనై యుండి సుయోధనుని కృత్రిమము వ్యక్తమగును. లాక్షాగృహదహనపు టపవాదము మాత్రమే దుర్యోధనునిదికాని కర్మము మాత్రము భీమునిదె యై యున్నది. పాండవులు లాక్షాగృహము నుండి యదవుల పాలైనపుడె కళింగదేశాధీశుని "శుభాంగి'' యను దానిని (గర్ణుని సహాయముచే) స్వయంవరమున నాతఁడు పెండ్లియాడెను. ద్రౌపదీస్వయంవరానంతరము యాదవపాంచాలురతోఁ బాండవులు కలియుటచే రాజనీతి ననుసరించి పాండవుల కింద్రప్రస్థరాజ్యము నిచ్చెను ధర్మజుని రాజసూయపు విభవముఁ జూచి లోన క్షత్రియసామాన్యపుటీసు జనించినది. అది మయసభలోఁ గాలుజాఱి పడినపుడు ద్రౌపదీభీములు పరిహసించుటచే వృద్ధియై ద్యూత కార్యమున కంకురమైనది. ద్యూతసమయమునకు సమస్త రాజులకుఁ బాండవులపై నీసు కలిగియుండుటచేతను, పాండవ మిత్రులగు యదు వృష్ణి భోజాంధకులు సాల్వుతోడి పోరాటములోఁ దగుల్కొనుటచేతను దుర్యోధనునిచే ద్యూతజితులై పాండవులు వనముల పాలైరి.

ద్యూతమున కాహ్వానింపఁబడిన ధర్మజుఁడు ప్రౌఢుఁడువోలె సభలో నుండిన వారిలో నెవరు నాతో ద్యూతమునకుఁ గడగెద రనినపుడు సుయోధనుఁడు నాకై శకుని యాడు నని తన యప్రౌఢిమను సత్యముగానె చెప్పి యున్నాఁడు. అందాతని లోపము గాన్పింపదు శకుని యొడ్డిన పణముల నన్నిటిని గెలిచెను. ఇందు ధర్మజుని యప్రౌఢిమయే గాని దుర్యోధనుని యన్యాయము కాన్పింపదు. దీనిని విరటునిసభలో బలరాముఁడుకూడ స్పష్టపఱిచియున్నాఁడు. ద్రౌపదిని సభలోనికిఁదెచ్చుట తన్ను మయసభలో హేళనముఁ జేసినదానికిఁ బ్రతిగాఁ జేసిన

యవమానమై యున్నది. ద్రౌపది ప్రాతిగామిని దిరాయించి పెంకి ప్రశ్నములు వేయుటచేఁ దాత్కాలిక క్రోధముచే దుశ్శాసనుఁడు ద్రౌపదీ కేశగ్రహణముఁ జేసియుండెను. ద్రౌపదిని మాత్రమె సభలోనికిఁదెచ్చుటఁ కామెయొక్క యయుక్త చర్యలచేతనైయై యున్నది. ఆమె దుర్యోధనాదుల కపఖ్యాతిఁదెచ్చుటకే రజస్వలా వేషమును ధర్మజోపదేశముచే వేసినదనియు, వస్త్ర విసర్జనముఁ జేయుట కల్ల యనియు నిదివఱకె స్పష్టపఱుపఁబడెను.

పాండవులకుఁ గల యితర భార్యలను సభలోనికి దెచ్చుట కాని వారల నవమానించుటగాని సుయోధనుఁడు చేయక ద్రౌపదని మాత్రమె పరాభవింపఁ జేయుట, పాంచాలియొక్క యయుక్త ప్రవర్తనము చేతనె యై యున్నది. ధర్మజున కప్పటికి ధనమత్తత యుండుటచే, నాకు విస్తారము ధనము కలదు. దీనికిఁ బ్రతిపణముగా నెవ రేమి పెట్టుదు రని నుడివియున్నాఁడు. కాలకర్మ వశమున శకుని జయించుటచే ధర్మజాదులు వనవాసగతులైరి గాని ధర్మజుడే జయించిన సుయోధనునివనవాసగతునిగా ధర్మజుఁడు చేయఁడా? ధర్మజ భీమ నకుల సహదేవు లాయాసము నొందఁగా యుద్ధములోఁగర్ణుఁడు చంపక విడిచెను. ధర్మజుని ద్రోణుఁడు, ధృష్టద్యుమ్నుని గృపుఁడు యుద్ధమునం దోడినపుడు వదలిరి. పాండవులు, అందు విఖ్యాతశూరుఁడగు నర్జునుఁడే తనకు దొరకిన భీష్మ సైంధవ కర్ణుల నన్యాయముగాఁ బడఁగొట్టెను. నీటిలో నొప్పిచే నాయాసముఁదీర్చుకొనుచుంటి నని బతిమాలుకొనినను ధర్మమూర్తియగు ధర్మజుఁడే సుయోధనునిం బరిమార్ప హ్రదము నుండి వెడలించి చంపించియున్నాఁడు. తమ కుపకారము చేయునో చేయకపోవునో నిరూపింపకుండఁగఁ బురోచనుని, తమ కూడిగము జేయు నిషాదవనితను సపుత్రకనుగాను లక్కయింటను పాండవులే దహించిరి. తమకుఁ గర్ణువధములో నుపకృతిఁ జేసిన శల్యని సపుత్రునిగాఁ జంపిరి. ఇట్టి పాండవులే ద్యూతములో జయము నందినయెడల దుర్యోధనుని గడగండ్లపాలు చేయరో? మొదటి జూదమునఁ బరాభవమొందినను రెండవసారి ధర్మజుడు ద్యూతమునకు సిద్ధపడుట సుయోధనుని జయింతునను దురాశ చేతనైయై యున్నది. మొదటి జూదములో నోడి రెండవసారి తిరిగి జూదమునకు సిద్ధపడున్నన్నఁజూచి భీమార్జునాదులుగాని ద్రౌపదిగాని యేల ధర్మజుని వారింపలేదు? ఈసారి ధర్మజుఁడే జయించును. దుర్యోధనుని వనమునకుఁ బంద్రెండేఁడులు పంపుదుమను దురాశచేతనె నివారింపరైరి. హ్రదమునుండి దుర్యోధనుని బలవంతముగా ధర్మజుఁడు తీసికొనివచ్చినటులు దుర్యోధనుఁడు ధర్మజుని ద్యూత సభారంగమునకు బలవంతముగాఁ దీసికొనిరాలేదు.

మొదట జూదమునఁ బరాభూతులగు పాండవుల నంతకు ముందుండిన మయసభాపరాభవాదికమును దలఁచికొని సుయోధనుఁ డవమాన పఱచెను గాని రెండసారి ద్యూతజితులైనపు డేయవమానముఁజేయలేదు. కాని పాండవులే "పరుగెత్తలేక బలాదూఱు" అను సామెత చొప్పున రెండవసారికూడ ద్యూతమున జయింపలేక కురుకులము ను న్మూలించు ప్రతిజ్ఞలు చేసిరి. వీరి ప్రతినలు "ఊయివిసరిన గుండ్లం బారుజేసెడి" నేఁటి క్వాచిత్క రాజనీతికి సరిపడి యున్నవి. పాండవులు వనమునకు బోయిన వెంటనే యాదవ పాంచాలురు వారిం జేరి యొదార్చి కౌరవులను నశింపఁజేయు నాలోచనలఁజేయఁగ సుయోధనుఁడు రహస్యముగఁ బాండవులపై దండెత్తి వారి నున్మూలింపఁ దలపెట్టెను గాని కౌరవుల చేఁతలపైఁ గన్నుగలిగి మెలఁగు కృష్ణద్వైపాయనునిచే నా రహస్యము వెల్లడికాఁగా నపుడా ప్రయత్నమునుండి దుర్యోధనుఁడు విరమించెను. ఘోషయాత్రాగాథ మృషయని యిదివఱకే చెప్పఁబడెను. నిజమని తలఁచినను కర్ణునంతటి యోధుఁడు రాజును వదలి పలాయితుఁడగునా? మఱియు సుయోధనుని పాతాళలోకమున కసురులు తీసికొనిపోవుట మొదలగు నసందర్భపుగాథ లందు కూర్చఁబడుటయే యది మృషాగాథగాఁ దలఁప మనసుగొల్పును. ఆ గాథ కేమి గాని, పాండవు లర్జునుఁడు దివ్యాస్త్రముల నొందుట కైదేండ్లు త్రివిష్టపమున కేగినపు డా యైదేండ్లను సుయోధనభీతులై తీర్థయాత్రా నెపమున నానాపర్వతారణ్యములలో నదీనదపరిసరముల భ్రమించిరి. విరటుని ప్రోల నుండినపుడు సుయోధనుఁడు తెలివిలేమిచేతనే పాండవులఁ గనుఁగొనలేకపోయెను. చివరకుఁ దెలిసియుఁ గార్యకారి కాలేదు. గోగ్రహణపు గాథను గొందఱు మృష యనియే గాథాసందర్భములచే నూహించిరి. దక్షిణ గోగ్రహణపుగాథలోఁ గొంత సత్యముండును. అందు సుశర్మ యోడుటకూడ సంభవించియుండునుగాని, యర్జునుఁడొక్కఁడే భీష్మాదుల జయించె ననుట పొసఁగియుండదు. మఱియు నర్జునుఁడు గోవులను మరలించి యుండినను, దానిలోఁగూడఁ గొంత నిజ ముండును. వ్యూహరచనములో మూఁడు తెగలుగాఁ గౌరవులు సైన్యమును నడపించుచుండిరి అందు ముక్కడిమూఁకలోనే గోవు లుండెను. వాని నొకవేళ మళ్ళించిన మళ్ళించియుండును గాని భీష్మాదులను జయించుట కల్ల యని పక్షాంతరమున నుత్తర గోగ్రహణము నంగీకరించువారి మతముగఁ దలఁపఁబడుచున్నది. ద్రుపద పురోహితునివలన సంధి వాక్యముల నందియ్యకముందే పాండవులు సైన్యములఁ గూర్చుకొనిరి దానిఁ దెలిసియే సుయోధనుఁడు సైన్యములఁ గూర్చుకొనెను గాని తొలుత యుద్ధమునకు సిద్ధపడలేదు, తొలుత సమరసన్నాహముఁ జేయక సామమె పాండవులు నడపినచో సమయబద్ధులు పాండవు లని

దుర్యోధనుఁ డేల రాజ్య మీయఁడు? పాండవులే తొలుత యుద్ధసన్నద్ధులై మాపైఁ గాలుద్రువ్వుచుండిరే కాని మేము వారిపైఁ గాలుద్రవ్వుట లేదని కృష్ణుతో రాయబారసమయమున దుర్యోధనుఁ డనిన యీ క్రింది వాక్యములు సుయోధనానపరాధత్వముఁ జెప్పును:

క. వనితం బఱిచి రరణ్యం
బున నిడుమఁ బడితి మనుచుఁ బోటరులై చం
పను జెలుపఁ బూని మాదెసఁ
గనఁబడు రప్పాండుసుతు లకారణము కడున్.

మ. అరయం దప్పొకయింత నావలనలే దాధర్మపుత్రుండు జూ
దరివెంటం దమకించి సౌబలునిచేతన్భూమి గోల్పోయి ము
ష్కరుఁడై వెండియు నొడ్డఁగా నతఁడు నక్షప్రౌఢియై గెల్వ నే
తెరువైనం దనయిచ్చతో మెలఁగె నింతేకాక యేఁ బూఁటయే.

గీ. మాత్స్య పాంచాల పాండ్యాది మనుజపతులఁ
గూర్చుకొని తార కయ్యంబుగోరి యెత్తి
విడిసి రింతియకాక యివ్విధము నుగ్ర
కర్మమున కేము దొడరుట గలదె చెపుమ.

ద్రుపదపురోహితుఁడుగాని, శ్రీకృష్ణుడుగాని తమ సంధివాక్యముల నించుకంతయు సామరంభముగాఁ గాక దుర్యోధనాదుల యపకృతులను ముందర నుద్ఘాటింపుచునే ప్రారంభించి దుర్యోధనాదుల కోపము నుద్రేకింపఁజేసిరి. అందుఁ గొన్ని యప్రస్తుత ప్రశంసలు కూడఁ గలవు. ద్రౌపదీ పరిణయానంతరము ధృతరాష్ట్రుఁడు పాండవుల కర్ధరాజ్యము నిచ్చుటతో ముగిసిన దుర్యోధనాపరాధముల నేల కృష్ణుఁడు సంధి సమయమునఁ ద్రవ్వుకొనవలసెను? మఱియుఁ గృష్ణుఁడు కౌరవులతో సంధిసేయక విగ్రహమునే జరుపఁ దలపెట్టి సంధి వాక్యములఁ బూర్తిచేయక పాండవులకడ కరిగి యుద్ధప్రస్థానముఁ జేయించినటులు సుయోధనుని యీ వాక్యములచేఁ దెలియనగును.

1"సంధిని జేసికొనక శ్రీకృష్ణుఁ 'డుపప్లావ్యము'నకు వెడలిన పిమ్మట దుర్యోధనమహారాజు కర్ణ శకుని దుశ్శాసనులతో నిట్లనెను. 'సంధిచేసికొనకయే

1. శ్లో॥ ప్రతియాతేతు దాశార్హే రాజా దుర్యోధన స్తదా
కర్ణం దుశ్శాసనంచైవ శకునిం చాబ్రవీదిదం
అకృతే నైవ కార్యేణ గతః పార్థా నధోక్షజః
సఏనా న్మన్యునావిష్టో ధృవం ధక్ష్యత్య సంశయం
ఇష్టోహి వాసుదేవస్య పాండవైర్మమ విగ్రహః

శ్రీకృష్ణుఁడు పాండవులకడకుఁ బోయినాఁడు. అతఁడు క్రోధాత్ముఁడై వీరిని నిశ్చయముగా యుద్ధమునకుఁ బ్రేరేపించును. పాండవులతో నేను పోరాడుట వాసుదేవున కిష్టము. భీమార్జునులు కృష్ణు నిష్టముచొప్పునఁ బ్రవర్తింతురు. ధర్మజుఁ డత్యంతము భీమార్జునుల వశముననే సంచరించును. ఇంతమాత్రమె కాక రెండవజూదమున నాచే సోదరులతోఁ గూడ యోడియున్నాఁడు. (లేక నాచే వంచితుఁడై యున్నాఁడు.) విరాటద్రుపదులు నాతో విరోధపడియున్నారు. వారిపుడు సేనా నాయకులుగా మాత్రమె కాక వాసుదేవునివశమునఁగూడఁ గలరు. కాన భవిష్యత్తునందు మహాయుద్ధము దొమ్మిగాఁ గాఁబోవుచున్నది. కాన సంగ్రామకార్యమునంతను జాగ్రత్తతోఁ జేయింపుడు" అని యన్నాఁడు.

యుద్ధకాలమునఁగూడ దుర్యోధనుఁ డెవరిని న్యాయవిరుద్ధముగాఁ జంపలేదు. చంపింపను లేదు. అభిమన్యుని విరథునిఁ జేయుటలోఁ గూడ దుర్యోధన ప్రేరణము లేదు. "స్వపక్ష పరపక్ష నిర్ధూమధాముఁడ"గు ద్రోణుఁడే యాపనిఁ జేయించెను. సౌప్తికవధమునకును దుర్యోధన ప్రేరణములేదు. అశ్వత్థామ సౌప్తికవధమును జేసినపిమ్మట మరణవేదనలోఁ గొంత సంతసముఁ జూపినఁ జూపుట లోకవిరుద్ధము కాదు. భీష్మ ద్రోణ కర్ణ శల్యులు దుర్యోధను పక్షమున నుండియే యుద్ధములో నాతని కపకృతిఁ జేసిరి. అందుఁ దాను ముఖ్యముగా నమ్మిన బంటగుఁ గర్ణుఁడే జామదగ్న్య బ్రాహ్మణ శాపతప్తుఁడై ఇంద్రశల్య కుంతీదేవులచే వంచితుఁడై తన కపుడపుడు యుద్ధములో దొరకిన యుధిష్ఠిరాదులఁ ద్రుంపక సుయోధనుని గూడ మిషచే వంచన చేసెను. దుర్యోధనుని వధించుటలో గర్హ్యముగాఁ బాండవులు మెలఁగిరని పాండవపక్షపువారికే కాక ధర్మజునకే తోఁచి భీముని నిందించి మిగుల విచారించి దుర్యోధనునితో నాయనా, నీవు ధర్మముగానే యుద్ధము చేసితివి, నీవు స్వర్గము నొందఁగలవు, మేమె నరకసమమగు దుఃఖము నొందఁగల మని యెంతయేని దుఃఖించి

---

భీమసేనార్జునౌ చైవ దాశార్హస్య మతేస్థితౌ
అజాతశత్రు రత్యర్థం భీమార్జున వశానుగః
నికృతశ్చ మయాపూర్వం సహసర్వై స్సహోదరైః॥
విరాటద్రుపదౌచైవ కృతవైరౌ మయాసహ
తౌచ సేనాప్రణేతారౌ వాసుదేవవశానుగౌ
భవితా విగ్రహస్సోయం తుములో రోమహర్షణః
తస్మా త్సాంగ్రామికం సర్వం కారయధ్వ మతంద్రితాః
-ఉద్యోగపర్వ. 152 అధ్యా.

యున్నాఁడు. బలరాముఁడు కూడ భీముని యన్యాయమునకుఁ గినిసి భీముఁగొట్ట సిద్ధపడియు, కృష్ణుఁడు కౌఁగిలించుకొని బతిమాలఁగా వెడలిపోవుచు ధర్మార్థములు పాండవులచేఁ గామమునకుఁ గ్రిందుచేయఁబడిన వనినాఁడు. [1]ఊరుభంగానంతరము కృష్ణ దుర్యోధన సంవాదములో దుర్యోధనునిదే న్యాయమని దేవతలు పుష్పవృష్టిని దేవదుందుభి నిస్వానమును గలిగింపఁగాఁ గృష్ణాదులు సిగ్గుపడిరట! [2]ఆతడు పుట్టినపుడు నక్క లఱచెనట! అట్టి యశుభమును సూచించిన దేవత లిపుడేల పుష్పవృష్టిని వర్షించిరో? కాని కృష్ణుఁడే సిగ్గును విడిచి యన్యాయముల నన్నిటినిఁ జేయించిన "పాపాల భైరవుఁడను" నేన యనుట మాత్రమఁట సమయస్ఫూర్తిగ నున్నది. దుర్యోధనుఁడు రావణునివంటి దుర్మార్గుఁడు కాఁడని పాండవపక్షమును వహించినవారుకూడఁ దలఁతురు. "భాస" మహాకవి దుర్యోధనుని యోగ్యతను "పంచరాత్ర, ఊరుభంగ" నాటకములలో మిగుల వర్ణించియున్నాఁడు. భాసునినాఁడు లోకులు నేఁటి సామాన్యులవలె దుర్యోధనుం గ్రూరునిగాఁ దలంపలేదు. భాసుఁడె కాఁడు, "భారవి" కూడ దుర్యోధనుడు మొదట జిహ్మాఁడే యైనను ధర్మజుని మించ ధర్మముగా మెలగువాఁడని తన "కిరాతార్జునీయ" కావ్యమున వర్ణించియున్నాఁడు. వేదశాస్త్రములఁ జదివి యజ్ఞాదులఁ జేసి దేవతలఁ దృప్తి నొందించి ప్రజలను సుఖపఱచి ధర్మముగా యుద్ధముఁ జేసి మృతి నొందుటచేతనే యాతనిపక్షము నెంతనికృష్టముగా వర్ణించినను, మహాభారతకవి యాతనికి స్వర్గమె లభించినట్లు వర్ణింపక తప్పినదికాదు. జయమును రచించిన వ్యాసుఁడు పాండవహితుఁడగుటచేతను, భారతమును రచించిన వైశంపాయనుఁడు, ప్రపౌత్రుఁడగు జనమేజయున కిష్టముగా భారతగాథను జెప్పవలసివచ్చుటచేతను, సౌతి కృష్ణద్వైపాయనుని శిష్యపుత్రుఁడగుటచేతను సంస్కృత మహాభారతము సుయోధనాపకర్షకముగా రచింపఁబడెనని తిరిగి చెప్పవలసియున్నది. కాని యచట నచట సుయోధనుని యోగ్యతను సూచింపక తప్పినదికాదు. ఆంధ్రీకృత భారతములో నన్నయ కేవలము పాండవ వంశ సంభూతుఁడనని చెప్పుకొను రాజనరేంద్రునకుఁ గృతి నిచ్చుటచేతను, తిక్కన యెఱ్ఱనలు సూర్యచంద్ర వంశస్థులగు రాజుల నాశ్రయించువారె యగుటచేతను ఆంధ్రభారతములోఁగూడ దుర్యోధన యశోపకర్షణమె వర్ణింపఁబడెను. కవిచేతనె మహారాజులయొక్క కీర్త్యపకీర్తులు వెల్లడియగును గదా? శివాజి కొండయెలుక యనియు, క్లైవు దేశోద్ధారకుఁడనియు మన యింగ్లీషు కవులు చరిత్రలలో వర్ణింపఁ గొంతకాలము నిజమే యని మనము తలఁచుట

---

1. శల్యపర్వ. 60, 61 అధ్యా.
2. శల్యపర్వ. 62 అధ్యా.

కలిగెను. దుర్యోధనాన్యాయము, పాండవన్యాయము కూడ తాదృశమే యని తలఁపవలసియున్నది. దుర్యోధనునిపైఁ గల యీర్ష్యను మహాపతివ్రత యగు గాంధారిపైఁ గూడ వ్యాసాదులు కొంత దొరలించి యామె తన తోడికోడలగు కుంతి బిడ్డలఁ గనుచున్నదని తాను కడుపు బాఁదుకొని మాంసఖండముఁ గనిన దని ప్రకృతి విరుద్ధపుగాథ నొకదానిఁ గల్పించిరి. మహాపతివ్రతయై భర్తకు లేని కన్నులు తనకేల యని గంతలు కట్టుకొని నయనానందసుఖము యావజ్జీవము వదలిన మహాపతివ్రత - మరణ సంశయమగు యుద్ధమున కేగుచుఁ దన్ను దీవింపుమని వచ్చిన కుమారుని "యతోధర్మ స్తతోజయః" యని ధర్మైకాగ్రచిత్తయై దీవించిన ధర్మవనితామతల్లిక - శత్రుపక్షపు వారిచేఁగూడ భయభక్తులతో సేవింపఁబడు పవిత్రచరిత్ర - అట్టిది - తోడికోడలి సంతతిఁ జూచి కడుపు బాఁదుకొనునా? ఈమె కుమారులలో, నల్వురే యౌరసులుగాఁ గాన్పించుతు రనుసంశ మింతకుఁ బూర్వమె చెప్పఁబడెను. ఔరసు లుండినను, స్వయందత్తాదులను పుత్రులుగా నంగీకరింపఁ బూర్వపు స్మృతు లంగీకరించు చున్నవి. రాజరాజనరేంద్రుని నాఁడుకూడ "కులోత్తుంగచోళు" డుండగా "రాజేంద్రచోడుని" దత్తునిఁగా రాజనరేంద్రుఁడు చేసికొనినటులఁ జనశ్రుతి కలదు. ఈ స్వయందత్తాదు లన్యజాదులుగాఁగూడ నుండవచ్చును.ఇట్టివారే గాంధారి యొక్క తొంబది యాఱుగురు పుత్రులును. గాంధారీ పుత్రుల కపార్థములనిచ్చు దుర్ముఖాది నామములను వ్యాసాదులు కల్పించియుందురని తలఁతును. నామ కరణముఁ జేయునపుడు "గృహ్యాసూత్రకారులు" శుభ చిహ్నముగా నుంపు మనిరేకాని యశుభచిహ్నముగా నుంపు మనలేదు. పెంటయ్య, తుక్కమ్మ మొద లగు నవీన నామములును, శునశ్శేప, పశుమేఢ్ర, కాసర, జంబుకాది ప్రాచీన నామములును కారణాంతరముచేఁ బెట్టఁబడియుండును. వ్యాసాదులు దుర్యోధను పక్షముఁ గ్రిందుపఱచు రీతిని వ్రాసిన ప్రక్రమముం గమనింప "కుండాశ్యా"ది నామములు వ్యాసకృత మగునని చెప్పవలసి యున్నది.

## దుశ్శాసనుడు

రాముని యందు లక్ష్మణున కెట్టి భ్రాతృత్వ భక్తి కలదో దుర్యోధనునం దట్టిభ్రాతృభక్తి దుశ్శాసనునకుం గలదు. రామునకు లక్ష్మణునందు వలె సుయోధనునకును దుశ్శాసనునం దట్టి సోదర వాత్సల్యము కలదు. కాని, చదువరులు మనంబునఁ బాండవ పక్షము నూని దుర్యోధనాదులయం దసూయఁ దాఁచుచు భారతముఁ జదువుచుండుటచే మంచియుఁ జెడ్డగానె కాన్పించును. చిన్నతనము నందాటలనెపమున భీముఁడు దుశ్శాసనునె బాధించుచుండువాడు. ("దుశ్శాసనాదు లెల్ల బాధితాత్ములైరి.") సోదరుల యాబాధలంజూచి సహింపకయే దుర్యోధనుడు

భీమునకు విషాన్నదానాదిక బాధల నొందించెను. ఆ కపటోపాయములతో దుశ్శాసనున కెంతమాత్రము సంబంధము లేదు. భ్రాతాజ్ఞచే నెట్టి పనినైన దుశ్శాసనుఁడు చేయుచుండువాఁడు. దుర్యోధను నానతిచేతనె ద్రౌపదిని సభ కీడ్చుకొనివచ్చినాడు. వస్త్రాపహరణగాథ మృషయని యిదివఱకె చర్చింపఁ బడెను. ద్రౌపదీ కేశగ్రహణము కూడ నామె సభకు రాక నిరాకరించుటచేతను, మంచిగాని చెడ్డగాని భ్రాతాజ్ఞను నెఱవేర్చు తలంపు కలవాఁడగుటచేతను, సభకు ద్రౌపదిం దెచ్చుటయె ముఖ్యమని యట్లు దుశ్శాసనుఁడు చేసియున్నాఁడు.

తన్ను వలచుట యయుక్తమని రాముఁడు శూర్పణఖను ముక్కుచెవులం గోయు మనినంత మాత్రమున లక్ష్మణుఁడు సందేహింపక శూర్పణఖయొక్క ముక్కుచెవులం గోయుట యుక్తమా? లక్ష్మణుఁడు శూర్పణఖను భ్రాతాజ్ఞయే ముఖ్యమని మానభంగముఁ జేసినట్టులనే ద్రౌపదిని దుశ్శాసనుఁడు మానభంగముఁ జేసియున్నాఁడు. కాని, శూర్పణఖామానభంగము ధర్మమై ద్రౌపదీ మానభంగ మధర్మ మగుచున్నది. ఇది చదువరుల మానసిక వైచిత్ర్యము.

సోదరునకు రాజ్యాభిషేకము చేయలేదని లక్ష్మణుఁడు దశరథునిపని పట్టెదననియు, కైకేయీ సంబంధులపని పట్టెద ననియు, భరతుఁడు రాముని బతిమాలుటకు వచ్చుచున్నాఁడని యెఱుఁగక (చిత్రకూటాద్రిలో) భరతునితోఁ బోరుదుననియు తొందరపడియున్నాఁడు. అది ధర్మమా? అచట భ్రాతృభక్తియె ప్రధానము. అట్లే దుశ్శాసనుఁడు కూడ కృష్ణరాయబార సమయమున శ్రీకృష్ణుఁడు భీష్మవిదురాదులం గూడఁ దీసికొని దుర్యోధనుని బంధించుట కాని, అతని మెడలువిఱిచి లొంగదీయుట కాని జరిగించునని తలంచి భ్రాతృభక్తియె ప్రధాన మని యెంచి రాయబార సభనుండి దుర్యోధనుని వెలుపలకుఁ దీసుకొనిపోవుట కును, శ్రీకృష్ణుని బంధించు నుద్యమములోఁ బాల్గొనుటకును దుశ్శాసనుఁడు కారకుఁడయియున్నాఁడు. అది-భారత పాఠకులకుఁ దప్పనిపించును. అతనికిఁ గల సోదరప్రేమము గంధర్వులచే నవమానితుఁడయిన దుర్యోధనుఁడు ప్రాయోపవేశమున కుద్యుక్తుఁడగునపుడు బొందిన దుఃఖము దుర్యోధను నా యుద్యమము నుండి మరల్చుటకు నుడివిన యనునయ వాక్యములు వర్ణనాతీతములు. తనకు దుర్యోధనుఁడు రాజ్యాభిషేకముం జేయుదు ననినను దానంగీకరింపలేదు.

దుశ్శాసనుఁడు బాహుబలశాలి. శస్త్రాస్త్రవిద్యాకోవిదుఁడు. కీచకసైంధవులంగూడఁ బోరగిలం ద్రోయఁగలిగిన ద్రౌపది నీడ్చి తీసికొని రాఁగలిగెను.

దుర్యోధనునకు దుశ్శాసను పరాక్రమమునం దమితమగు నమ్మకము కలదు. అందువలననే భీష్ముని శిఖండిబారిం బడకుండఁ గాపాడ నియోగించెను. దుశ్శాసనుఁడును సోదరాజ్ఞ ననుసరించి భీష్ముని దశమ దివసయుద్ధమున

పాండవయోధులతో ఘోరముగాఁ బోరెను. ఆనాటి దుశ్శాసనుని తీవ్రపరాక్రమమునకు భీమాదులు తాళలేరైరి. భీష్మపైఁ గవియు నర్జునుని దుశ్శాసనుఁ డనేకపర్యాయము లెదిర్చి మహాహవముచేసి యర్జునునకు విశేషాంతకములఁ జేసి విసిగించెను. తాఁ బడు నుపాయమును గృత్రిమముగాఁ జెప్పి పడిపోవుచున్న భీష్ముని దుశ్శాసనుఁడె కాఁడు, బ్రహ్మయైనఁ గాపాడఁగలఁడా? కాని, యానాఁటి దుశ్శాసనునియందుఁ గల భ్రాతృాజ్ఞానిర్వహణేచ్ఛ, పరాక్రమాతిశయము వర్ణనాతీతములు.

దుశ్శాసనుఁ డభిమన్యుఁడు పద్మవ్యూహముఁ జొచ్చునాఁడును, అర్జునుఁడు సైంధవుఁ జంపునాఁడును, అభిమన్యుసాత్యకులతోఁ బోరియోడెను. కాని, అర్జునసాత్యకులఁ గృత్రిమముగా మొగ్గరంబునఁ బ్రవేశపెట్టి సైంధవ వధమునకును, మహాసైన్య నాశనమునకును గారకుఁడగు ద్రోణుఁడు సాత్యకి కోడిన దుశ్శాసనుని నిందించుటమాత్రము "మగనిఁగొట్టి యెదురు మొత్తుపెట్టిన యాఁడుదాని పద్ధతి" వలె నున్నది.

దుశ్శాసనుఁడు కర్ణాదులయెదుట భీమునిచే ఘోరముగా వధింపబడుట లోకవిదితము. యుద్ధమునఁ బడుట దుశ్శాసుని తప్పుకాదు గాని యాతనిపొట్ట చీల్చి రక్తపానముసేయుట మాత్రము భీముని తప్పై యున్నది. ఆ యంశమును భీముఁడే గాంధారికడ నంగీకరించియున్నాఁడు.

దుశ్శాసనునకు మహావీరుఁ డగు పుత్రుఁ డొకఁడు కలఁడు. వాని పేరేదియొ భారతమునం గాన్పింపదు. కాని, అభిమన్యు దుశ్శాసన పుత్రు లిరువురు గదలతోఁ బోరి యన్యోన్యప్రహారములచే నిరువురును మృతినొందుటలు ద్రోణపర్వమునఁ గలదు.

అభిమన్యుం జంపిన దౌశ్శాసని మహావీరుఁ డనవలసి యుండును. భ్రాతృభక్తి తత్పరుఁడు మహావీరుఁడు నగు దుశ్శాసనుఁడు దుర్యోధనుని తమ్ముఁ డను కారణమున నాతనిం దుష్టులలోఁ జేర్చుట విచిత్రాంశమై యున్నది.

## కర్ణుఁడు

దుర్యోధనపక్షపు వీరులలో దుర్యోధనుఁడు నమ్మిన ముఖ్యయోధులలో కర్ణుఁడె యగ్రగణ్యుఁడు. దుర్యోధనపక్షపు వీరులలోనె కాదు, పాండవపక్షపు వీరులలోఁగూడఁ గర్ణున కెన యగు వీరుఁడు లేఁడు. అందువలననె "కర్ణుఁడు లేని భారతమా?" అను సామెత కలిగినది. కృష్ణార్జునులుతప్ప తక్కిన పాండవవీరు లందఱును గర్ణున కోడినవారె. అర్జునుఁడోడకుండుటకుఁ గృష్ణసారథ్యపు మహిమయె ముఖ్యమైనది. కవచహీనత, ఇంద్రదత్త శక్తికిఁ గృష్ణుఁడు కృత్రిమముగా ఘటోత్కచు నెఱసేయుట భార్గవాస్త్రసర్పముఖాస్త్ర ప్రయోగములను,

సైన్యమునుండి యర్జునుం దొలఁగించియుఁ, బల్లమునకు రథముఁ దెచ్చియుఁ గృష్ణుఁడు కాపాడుట, తీవ్రముగ నస్త్రములం బ్రయోగించుసమయమున శల్యుడు కర్ణుఁ దూలనాఁడి లక్ష్యశుద్ధి లేకుండఁజేయుట మొదలగు ప్రబల కారణములచే నర్జునుఁడు కర్ణున కోడలేదు. కాని యొకప్పుడు కర్ణుని విజృంభణముం జూచి యర్జునుఁ డాతని నెదుర్కొనలేక,

"మాధవా మనరథమింక • మరలనిమ్ము
బ్రతికియుండిన సుఖములఁ • బడయవచ్చు"

అని తనధీరోదాత్తతను బోఁగొట్టుకొనినాఁడు. వేయొకప్పుడు కర్ణప్రతాపము మనంబునకు భీతిం గలిగింపఁ బ్రస్వేదగాత్రుండైనాఁడు. కర్ణు నర్జునుఁడు చంపుటకుఁ గల కారణము లీక్రింది వని భారతమునఁ జెప్పఁబడెను:

ఉ. వినుము నరేంద్ర విప్రుఁ డలి • వెన్ జమదగ్నిసుతుండు శాపమి
చ్చె నమరభర్త వంచనము • సేసె వరం బని కోరి కుంతిమా
న్చె నలుక, భీష్ముఁ డర్ధరథుఁ • జేసి యడంచెఁ గలంచె మద్రరా
జనుచిత మాడె శౌరి విధి • యయ్యె నరుం డటఁ జంపెఁ గర్ణునిన్.

వ అట్లుంగాక,

క. హరసురపతియమవరుణుల
గురుకృపులును దివ్యబాణ • కోటు లొసఁగుటన్
నరుశక్తి కర్ణుతేజ
స్ఫురణము నార్పంగఁజాలెఁ • జువ్వె నృపాలా.

-శాంతిపర్వ.

అని నారదుఁడు ధర్మజునకుఁ జెప్పియున్నాఁడు.

పాండవపక్షవీరులలో భీమార్జునులె కౌరవపక్షవీరులకు భయావహులు. దేహబలమున నెట్టివాఁ డయినను, గదాయుద్ధమున దుర్యోధనుఁడు భీమునికంటె నెక్కువవాఁ డగుటచే ననాయాసముగానె భీముని దాను జయింపఁగల ననియు, నర్జునునిఁ గర్ణుఁడు తప్పక జయించు ననియు దుర్యోధనుఁడు దృఢ మగు నమ్మకము కలిగియుండెను భీష్మ ద్రోణాశ్వత్థామాదులు పాండవ హితైషులై వారలను జంపకపోయినను మాత్స్యపాంచాలాది పరబలంబులఁ దునుమాడుదు రనియు, సంశప్తక భగదత్తాదులయొక్క యుద్ధముచే శ్రాంతి నొందిన యర్జునుని గవచ హీనుఁడైనను గర్ణుఁడు తప్పక వధింపఁగలఁ డనియె సుయోధనుఁడు తలఁచియుండెను. నిజమున కట్టిదియే తన ప్రభుసోదరుఁడు మిత్రుఁడునగు దుశ్శాసనుఁడు తనకన్నులయెదుటనే ఘోరముగా వధింపఁబడుటయు, మహా వీరుఁడు తన పుత్రరత్నము నగు వృషసేనునకుకూడ నప్పుడె వధింపఁబడుటయు

నను మనోదౌర్బల్యకరకార్యములై కాక యంతకుముందు తెలుపిలేకుండఁగ భీమ ధృష్టద్యుమ్నాదులతోఁ బోరి దస్సియుండుటయు నతని దౌర్బల్యమునకు కారణములై యుండెను. అట్టిసమయమునఁ గృష్ణుఁడు నెపముపెట్టి శిబిరమున కేఁగున ట్లర్జునుం జేసి, యాతఁడు కోలుకొనునట్లు చేయుటయె కాక శల్యుఁడు నిరుత్సాహపఱుచుటచే సర్వముఖాస్త్రము వ్యర్థముకాఁగా, రథచక్రము భూమిలోఁ గ్రుంగ, రథచక్ర మెత్తువలకుఁ గొట్టుట యుద్ధధర్మము కాకున్నను, నిరాయుధుఁడై రథచక్రము నెత్తునపుడు కృష్ణుఁడు ప్రోత్సాహపరచి యన్యాయముగనె యర్జునునిచేఁ గర్ణునిఁ జంపించెను. లేకుండినఁ గర్ణుఁడె యర్జునుం జంపియుండును.

కర్ణుఁడు వినుతి కెక్కిన రాజభక్తి పరుఁడు. అందువలనఁ దనప్రాణములను యుద్ధభూమిలోఁ ద్యజించెను. చేతికి దొరకిన ధర్మజభీమనకులసహదేవులను వదలుట రాజభక్తికి లోపముగాఁ గాన్పించును. కాని, ప్రభు వగు సుయోధనుఁడు కర్ణుని నర్జునుని జయించుటకే యేర్పఱచెను గాని తక్కినవారిని జయించుటకుఁ గాదు. తాను గుంతి కిచ్చిన మాటచొప్పున నర్జునేతర పాండవులం జంపవా దను ప్రతిజ్ఞానిర్వాహణముకై వారిని వదలివేసెను. అట్లు చేయుట ప్రభువుయొక్క యానతికిని వ్యతిరేకము కాదు. ఆ మిషచేతనె ధర్మజాదులను వదలినాఁడు.

కర్ణుఁడు స్వార్థత్యాగి. అందువలననే కృష్ణుఁడు కర్ణు నుద్బోధించి నీవు పాండవులం గూడినచో సామ్రాజ్యాధిపత్యము నీకె వచ్చునని యాశ పెట్టినను, ప్రభునకు భక్తి సేయుటయె సామ్రాజ్యలాభము కంటె నెక్కువయని యాఁతడు తలఁచినాఁడు. మఱియుఁ గష్టముల నొందినట్టియు సమర్థుఁడును నగు ధర్మజుఁడె సమ్రాట్టగుట యాతని కిష్టము[1]. మఱియు శ్రీకృష్ణుఁడు సహాయుఁడగుటచే నర్జునుఁడే జయించు ననిఁయు దన కాతనిచే మృతి సంభవించు ననియుఁ గూడ నాతఁ డెఱుఁగును. కర్ణుఁ డవిద్యావంతుఁడు నవినీతిపరుఁడును గూడఁ గాఁడు. అతఁడు నేర్చిన విద్యలఁ గూర్చి శ్రీకృష్ణుఁడె చెప్పియున్నాఁడు: [2]"వేదవేద్యులైన బ్రాహ్మణుల నుపాసించి సనాతనధర్మములను దెలిసికొనెనఁట! సూక్ష్మమైన ధర్మశాస్త్రార్థము లాతనికిఁ దెలియునట!" శస్త్రాస్త్ర విద్యలను ద్రోణపరశురాములనుండి సమగ్రముగ నేర్చియున్నాఁడు.

---

1. ఉద్యోగపర్వ 140 అధ్యా.

2. ఉపాసితా స్తే రాధేయ బ్రాహ్మణా వేదపారగాః
తత్త్వార్థం పరిపృష్టాశ్చ నియమే నానసూయయా.
త్వమేవా కర్ణ జానాసి వేదవేద్యాన్ సనాతనాన్
త్వమేవ ధర్మశాస్త్రేషు సుక్ష్మేషు పరినిష్ఠితః -ఉద్యో. 180 అధ్యా.

కర్ణుని పరాక్రమాతిశయముఁ గూర్చి యాంధ్రభారతమున సంకుచితముగా వర్ణింపఁబడెను. ఆ స్వల్పవర్ణనములోనె కర్ణుఁడు జరాసంధుని జయించె ననుట ముఖ్యమగు నంశము.

ఒకప్పుడు (పాండవులు లాక్షాగృహదహనానంతరము మాఱువేషములతో దిరుగుచుండిన కాలమున) కలింగదేశ ప్రభువగు "చిత్రాంగదుఁడు" తన కుమార్తె శుభాంగికి స్వయంవరమును జాటింపించెను. ఆ స్వయంవరమునకు శిశుపాలుఁడు, రుక్మి (రుక్మిణీదేవి సోదరుఁడు), నీలుఁడు (మాహిష్మతీపురరాజు), జరాసంధుఁడు మొదలగు మహాబలవంతులగు రాజులు వచ్చిరి. దుర్యోధనుఁడును గర్ణసహాయుఁడై ససైన్యుఁడై కళింగ రాజధాని యగు "రాజపురి" అను పట్టణమున కేగెను. శుభాంగి స్వయంవర మంటపమును దాదితోఁజేరి మంచోపరిస్థిత రాజుల చరితముల నాదాది తెలుపుచుండ వినుచు మంచల నడుమనుండి పోవుచు దుర్యోధనుని వరింపక యాతని వదలి పైఁ బోవుచుండ సుయోధనుఁడు సాహసించి యామెను బట్టుకొని రథమునఁ గూర్చుండి హస్తిపురిదారిం బోవుచుండెను. స్వయంవరాగతు లగు శిశుపాలాదులు సుయోధనుపైఁ గవిసి పోర నాతఁడును గర్ణుఁ గూడి యారాజులతోఁ బోరఁదొడంగెను. అందుఁ గర్ణుఁడు తన పరాక్రమముచే జరాసంధాదులఁ దూలనేసి దుర్యోధనునకు మార్గము సురక్షితము చేసెను. శిశుపాలాదులు చేయునది లేక వెడలిపోయిరి. ప్రాగ్భరతఖండసమ్రాట్టగు జరాసంధుఁడు మాత్రము కర్ణపరాక్రమమును సహింపక ప్రత్యేకము కర్ణుని బోరితమున కాహ్వానించెను. అందులకుఁ గర్ణుఁ డంగీకరించి జరాసంధునితో ద్వంద్వ యుద్ధముఁ జేసె. అం దిరువురు సమానముగ విరథులై మల్లయుద్ధమునకుం దీకొనిరి. ఆమల్లయుద్ధములో జరాసంధునకు నంగసంధి వికలమైనదట! (ఎముక బెణికినది.) అందువలన జరాసంధుఁడు చేయునది లేక కర్ణుని మెచ్చి సంధిచేసికొని కర్ణుని యంగదేశమునకుఁ జేరిన తనదగు మాలినీ నగరమును బహుమతిగా నిచ్చెను. (శాంతిపర్వమున నీయంశము గలదు.) జరాసంధుఁడు కృష్ణబలరాములను యుద్ధమునఁ బెక్కుసారు లోడించిన మహావీరుఁడు. భీముఁ డతిమాత్రముగఁ గష్టపడికాని యాతనిని జయింపలేకపోయెను. అట్టి జరాసంధునితోఁ గర్ణుఁడు పోరి యాతనిని జయించియున్నాఁ డనుటచేతనె కర్ణుని బలపరాక్రమాదులు వెల్లడి యగుచున్నవి. అస్త్రబలముననేకాక, భీమునితో సమానముగఁ బోరిన జరాసంధునితో మల్లయుద్ధము చేయుటచేఁ గర్ణుఁడు దేహబలమునందును భీమునకుఁ దీసిపోవువాఁడు కాఁడని స్పష్టమగుచున్నది. మఱియు ధృతరాష్ట్రుఁడు కర్ణుని మరణమును విని శోకించునపుడు-

"నై దేహపౌండ్రాది • వసుధేశు లెవ్వని
కడిమిసొంపున సరి • గాపులైరి"

అను కర్ణపర్వములోని సీసపద్యము నందలి వాక్యముచేఁ గర్ణుఁడు పౌండ్రక దేశాధీశుఁడగు పౌండ్రక వాసుదేవుని, జనకమహారాజును (జహాంగాశ్వుఁడు) గూడ జయించినటుల స్పష్ట మగుచున్నది. పౌండ్రక వాసుదేవుఁడు శ్రీకృష్ణునితోఁ గూడఁ బోరిన మహాబలవంతుఁడు. ఆంధ్రమహాభారతమున నింతమాత్రమె కలదు. కాని సంస్కృత మహాభారతమున వనపర్వములో [1]ఘోషయాత్రానంతరము దుర్యోధనుని పరాభవబాధ పోఁగొట్టుటకై రాజసూయయాగమున భీమార్జున నకుల సహదేవులు నల్వురు జయించిన దేశముల నీకర్ణుఁ డొక్కఁడె జయించినట్లుకలదు. అందీక్రిందిరాజులు కలరు: వారిలో "పాంచాలరాజగు ద్రుపదుఁడు, ప్రాగ్జ్యోతిషాధిపతి యగు భగదత్తుఁడు, మాగధుఁ డగు సహదేవుఁడు, చేదిరాజును శిశుపాలతనయుఁడు నగు ధృష్టకేతువు, పాండ్యరా జగు మలయధ్వజుఁడు, మాహిష్మత్యధిపతి యగు నీలుఁడు, కోసలాధీశుఁ డగు బృహద్బలుఁడు, విదేహాధిపతి యగు నీలుఁడు, విదర్భాధీశుఁడగు రుక్మి, కేకయాధిపు లగు చేకితానాదులు, మద్రాధీశుఁ డగు శల్యుఁడు ననువారలు ముఖ్యులు. పైవారిలో కౌరవులకుఁ బ్రబలవిరోధియు ధృష్టద్యుమ్నాది మహావీరులతోఁ గూడినవాఁడు నగు ద్రుపదుఁ దోడి విశేష రత్నాదులను కరముగా నిచ్చిన ట్లుండుటయు శ్రీకృష్ణుని బావమఱఁదియు కృష్ణార్జునులనుఁ గూడ సరకుసేయనివాఁడు నగు రుక్మి మహాయుద్ధము చేసి కర్ణునకు సంపూర్తిగ నోడి "నీకు నే నోడితిని. వలసినంత ధనమును దీసికొనిపొ"మ్మనుటయు నెంచఁదగిన విషయములు. కొందఱిమతమున నీవనపర్వములోని కర్ణదిగ్విజయ యాత్ర ప్రక్షిప్తమని కలదు. కాని భీష్మునితోఁ గర్ణుఁడు, అంపశయ్యపై నాతఁ డుండఁగ రహస్య సంభాషణముఁ జేయునపుడును కర్ణమరణమునకును ధృతరాష్ట్రుఁడు విచారించునపుడును పై దిగ్విజయములఁ గూర్చి వారు చెప్పినటులుండుటచే వనపర్వోక్త దిగ్విజయములు సత్యములే యని చెప్పవలసియున్నది. అందుఁ గర్ణు నెప్పుడును నిందించు చుండెడి భీష్మునివాక్యములు స్వభావోక్తులె కాని యతిశయోక్తులు కావు. కాన యాభీష్మవాక్యముల నిట వ్రాయుచున్నాను. మరియు భీష్ముఁడు కర్ణుని యోగ్యతా దాదృత్వాదులఁ గూడ సూచించియుండుట ముఖ్యతమమై యున్నది.

1. వనపర్వ ౨౫౪ అధ్యా.

భీష్ముఁడిట్లనుచున్నాఁడు:

1"ఓకర్ణా! నిన్నీభూమియందు యుద్ధవీరునిగాను శత్రువులచే సహింప శక్యముగానివానిఁగాను ఎఱుఁగుదును. మఱియు నీ బ్రహ్మణ్యతను శౌర్యమును దానమునిచ్చుటలో నీకుఁగల యుత్కృష్టతను నెఱుఁగుదును.

అమరోపముఁడ వగు నోకర్ణా! నీతో సమానుఁడగు పురుషుఁడు పురుషులలో లేఁడు......... నీవు ఇష్వస్త్రమునందు, అస్త్రసంధానమునందు లాఘవమునందు అస్త్రబలమునందు ఫల్గునునితోడను మహాత్ముఁడగు శ్రీకృష్ణునితోడను సమానుఁడ వగుచుంటివి. ఓ కర్ణా! కురురాజునకు కన్యకొఱకు కాశీపురి కేఁగితివి. అచట ఏకధనుర్ధరుఁడవగు నీచే రాజులు పీడింపఁబడిరి. అట్లే బలవంతుఁడు, ప్రభువు, సహింప శక్యము కానివాడు, యుద్ధప్రియుఁడు, బ్రహ్మణ్యుఁడు, సత్యముగాఁ బోరువాఁడు, యుద్ధమునందు విస్తారము యోధులు కలవాఁడు, నగు జరాసంధుఁడు సమరమందు నీకు సాటికాలేదు ²కర్ణుఁడా! నీవు రాజపురి కేఁగి

---

1. శ్లో. జానామిసమరేవీరం శత్రుభిర్దుస్సహంభువి
బ్రహ్మణ్యతాంచ శౌర్యంచదానేచ పరమాం స్థితిం
నత్వయాపురుషః కశ్చిత్పురుషేష్వమరోపమ
ఇష్వస్త్రే చాస్త్రసంధానే లాఘవేస్త్ర బలేతథా
సర్వశః ఫాల్గునేనాసికృష్ణేనచ మహాత్మనా॥
కర్ణ కాశీపురం గత్వా త్వ యైకేన ధనుష్మతా
కన్యార్థే కురురాజస్య రాజానో మృదితాయుధి
తథాచ బలవాన్ రాజా జరాసంధో దురాసదః
సమరే సమరశ్లాఘీ వ త్వయా సర్వశోభవత్
బ్రహ్మణ్య స్సత్యయోధీ చ మనుష్యై రథికో యుధి
-భీష్మపర్వ 124 అధ్యా

2. శ్లో కర్ణ రాజపురంగ త్వాకాంబోజా నిర్జితా స్త్వయా
గిరివ్రజ గతా శ్చాపి నగ్నజిత్ప్రముఖా నృపాః
అంబష్ఠాశ్చ విదేహాశ్చ గాంధారాశ్చ జితా స్త్వయా
హిమవద్దుర్గనిలయాః కిరాతా రణకర్కశాః
దుర్యోధనస్య వశగాః కృతాః కర్ణ త్వయా పురా
ఉత్కలా మేఖలాః పౌండ్రాః కళింగాంధ్రాశ్చ సంయుగే
నిషాదాశ్చ త్రిగర్తాశ్చ బాహ్లీకాశ్చ జితా స్త్వయా
తత్ర తత్ర చ సంగ్రామే దుర్యోధన హితైషిణా
బహవో నిర్జితా వీర త్వయా కర్ణ మహాజనః॥
-ద్రోణపర్వ. 4 అధ్యా.

కాంభోజులను జయించితివి గిరివ్రజ వాసులగు నగ్నజిత్తు మొదలగువారిని అంబష్ఠులను వైదేహులను గాంధారులను నిర్జించితివి. పూర్వము రణకర్కశులు హిమవద్గిరివాసులు నగు కిరాతులు నీచే దుర్యోధనునకు వశులైరి. నీచే నుత్కలులు, మేఖలులు, పౌండ్రులు కళింగులు, ఆంధ్రులు, నిషాదులు, త్రిగర్తలు, బాహ్లీకులు యుద్ధమున జయింపఁబడిరి. ఓ వీరా! అక్కడ నక్కడ యుద్ధములలో దుర్యోధన హితము గోరిన నీచే మహాబలవంతులగు పెక్కండ్రు నిర్జింపఁబడిరి.

కర్ణుని పరాక్రమముగూర్చి భీష్ముఁడు చెప్పుటయే కాదు. [1]పాండవులకును నాతని దిగ్విజయయాత్ర వినినపుడును ప్రతిజ్ఞావాక్యములను వినినపుడును నిద్రపట్టలేదట.

కర్ణుఁడు సైంధవ వధ దినమున బెక్కుసారులు భీమునకును, ఒక్కసారి సాత్యకికి నోడినటులు కలదు. ఇందతిశయోక్తి కలదు. అర్జునున కనేకపర్యాయము లోడినటులను గలదు. ప్రతిపర్యాయ మోడినవాడుఁ అర్జునుని జయింతుననునా?

కర్ణు డెట్టిరణవీరుఁడో అట్టి దానవీరుఁడు. తన జీవితమున కాధారమగు కవచ కుండలములు నెఱిఁగియుండియు నింద్రుఁ డడిగినంత మాత్రమున నిచ్చియున్నాఁడు! నిన్ను గవచకుండలముల నింద్రుఁ డడుగును. నీ వీయవలదని సూర్యుఁ డెంతయు బోధించినను వాని నాతఁడు లెక్కసేయక అడిగినదాని నిచ్చుటయే నాకు వ్రతమని చెప్పియున్నాఁడు. కర్ణునిఁ దాతృత్వముఁగూర్చి పెక్కులు కథలు చెప్పుదురు అందు రెండింటిని వ్రాసెదను :

"దాతృత్వమున ధర్మజుకంటెఁ గర్ణుఁ డెక్కువవాఁడని శ్రీకృష్ణునకు దెలియును. కాని ధర్మజుఁడు తాను మహాదాతనను గర్వము కలవాఁడై యుండువాఁడట! ఆ గర్వమును భంగము చేయఁదలఁచి కృష్ణుఁడొకప్పు డిష్టగోష్ఠిలో ధర్మజుఁ జూచి యోబావా! నీవు గొప్ప దాతవు. నీకు మేరుపర్వతము స్వాధీనమైనయెడల నెంతకాలములో నా బంగారపురాశిని దానము చేయగలవనెను. ధర్మరాజు మేరువుయొక్క యెత్తు పొడవు మొదలగు పరిమాణముల దెలిసికొని కొన్ని యేండ్లు పట్టునని చెప్పెనట! అంతలోనె యచటికిఁ గర్ణుడుకూడ రాఁగా, శ్రీకృష్ణుఁడు కర్ణునిగూడ ధర్మజు నడిగినట్లే యడుగ, కర్ణుఁడు ఎంతయో కాలమెందులకు, ఒక్కక్షణములోనె సన్నిధి నే బ్రాహ్మణుఁ డుండిన నాతనికి పుచ్చుకొమ్మని యిచ్చివేయుదు ననెనట! శ్రీకృష్ణుఁడీమాటను వినుచు సన్నిధి నున్న ధర్మజుఁ జూచి చిఱునవ్వు నవ్వ, నాతఁడు తాను కర్ణునంతటి దానవీరుఁడను కానుగదా యని సిగ్గుతోఁ దలవంచుకొనెనట.

1. అరణ్యపర్వ. 256 అధ్యా.

మఱియొకటి. వీరులు వీరత్వసూచకముగా నెడమచేతి కొక కంకణము వేసికొందురు. దానికి వీరకంకణ మనిపేరు. దాతయైనచోఁ గుడిచేతికి గంకణము వేసికొందురు. దానికి దానకంకణమని పేరు. దుర్యోధనుడు వీరకంకణమునె వేసికొనెను. కర్ణుడు దానకంకణమును వీరకంకణమునుగూడా వేసికొనెను. ఒకప్పుడు దుర్యోధనుఁడు కర్ణుఁడు రెండుకంకణములను వేసికొనుటఁ జూచి తనకు మాత్ర మేల దానకంకణ ముండరా దని తలఁచి తానును గుడిచేతికి దాన కంకణమును వేసికొని దానకంకణ చిహ్నముకై తగు దానముఁజేయు చుండెను. ఇంద్రుఁడీ యంశమును విని దుర్యోధనుఁడు దాన కంకణార్హుఁడు కాఁడని దానిం దీసివేయింపఁదలచి బ్రాహ్మణవేషము నూని దుర్యోధనుని కడకు వచ్చి 'రాజా! నేను యజ్ఞముఁ జేయఁదలపెట్టితిని. వర్షకాలము సమీపించినది. అన్ని వస్తువులను సమకూర్చికొంటిని. కాని ఎండినవగు వంట కట్టియలు లభింపలేదు. తమరు మహా దాతలు గాన నాకట్టి వంట కట్టియలను మాత్ర మిప్పింపవలె' ననెను. అందులకు సుయోధనుఁడు సమ్మతించి యిప్పుడె తీసికొని పొమ్మనెనఁట! అందుల కామాయబ్రాహ్మణుఁడు సంతసము నభినయించి నేను ఋత్విక్కులఁ బిలుచుటకై పోవుచున్నాను. నాల్గుదినాలలో మరలవచ్చి తీసికొని పోయెద నని రారాజుచే నంగీకరింపఁజేసి వెడలిపోయి "ఝంఝూవాతము"ను వదలెను. పెద్ద గాలితోఁగూడిన వర్షముచేత బయటనుండిన వంటకట్టియలే కాక హస్తిపురిలో గృహస్థులు ప్రభువులుకూడ ఇటుకులలో నాఁచుకొనిన వంట కట్టియలు, సమస్త పదార్థములుకూడ తడిసి ముద్ద లయ్యెను. ప్రొయ్యిలు రాఁజక ప్రజలు వంటలనే మానుకొనిరి. ఇట్లు మూఁడు దినములు ఝంఝూవాతము వీఁచి వెలిసిన వెంటనే కపట బ్రాహ్మణుఁ డేతెంచి "రాజేంద్రా! ఋత్విక్కులం బిల్చికొంటిని. రేపు నేను యాగశాల ప్రవేశముఁ జేయవలెను. నీవు వాగ్దత్తము చేసిన రీతిని యెండు కట్టియల నిప్పింపు" మనెను. అంతకుముందు ఝంఝూ వాత బాధచే నవయు ప్రజల యొక్కయు స్వకుటుంబముయొక్కయు నవస్థలం జూచుచుండుటచే సుయోధనుఁడు "ఏమయ్యా! ఎండు కట్టియలు లేక మేము మా పట్టణవాసులుకూడ వంట చేసికొనక నిరాహారులమై యుండఁగా నిపు డేరీతి నెండు కట్టియలను నీ కీయఁగలఁ? యజ్ఞమును మఱియొకప్పుడు చేసికొను" మని విసిగికొనుచు నా బ్రాహ్మణునిఁ బొమ్మనెను. అంత నా కపటబ్రాహ్మణుఁ డప్పుడె కర్ణుకడ కేఁగి "అయ్యా! నేనొక యజ్ఞముఁ దలపెట్టితిని. సమస్త సంభారములను సమకూర్చికొంటిని. కాని ఎండు వంట కట్టియలు కొదువ యయ్యెను. వాటిని మీ రిప్పించవలయు"ననెను అప్పుడు కర్ణుఁడు సేవకులం బిలిచి యెండు వంట కట్టియలు కలవా? అన వారు ఝంఝూవాతోపద్రవముచే శుష్క కాష్ఠా

భావముం దెల్పిరి. "అట్లైన గృహముల నిడియఁగొట్టించి తద్గృహస్థము లగు దూలములు మొదలగునవి యీ బ్రాహ్మణునకు వలసినన్ని శుష్క కాష్ఠములకు మాఱుగా నిం"దని యాజ్ఞ చేసెను. కవచ కుండల దానముచే దేహమే పోవునని యెఱిఁగియు కవచ కుండలములను దాన మిచ్చిన కర్ణునకు గేహముల నిడియఁ గొట్టించి దాన మిచ్చుట యొక లెక్కలోనిదా? ఆ కుహనావిప్రుఁడు శుష్కకాష్ఠ సంచయమును బండ్లపై నెత్తించి యెడ్లకు ఖంగుమని మ్రోగెడు గంటలఁగట్టించి దుర్యోధనుఁడు చూచునటుచుల నాతనివీధినె నడిపించెను ఆ ధ్వని విని దుర్యోధనుఁ డదియేమనుచుండ, కపట బ్రాహ్మణుఁ డేతెంచి "అయ్యా! మీ రీయలేని శుష్క కాష్ఠములను రాధేయుఁ డిప్పించి యున్నాఁడు. దానకంకణ మాతనికె తగును గాని మీకుఁ దగ" దనఁ గర్ణుఁడు గృహముంగూడఁ గూలద్రోయించి యెండుకట్టియలనిప్పించిన తెఱఁగుఁ దెలిసి కొని యాశ్చర్యపడి దానకంకణము కర్ణునకె తగఁగాని నాకుఁ దగదనుకొని యాశ్చర్యపడి తన దానకంకణముం దీసివేసికొనెనట!"

పై కథలు పుక్కిటిపురాణగాథలె కాని భారతాదులలో లేవు. కాని వినోదముగా నుండు నని వ్రాసితిని. శిబికర్ణబలిదధీచులు పెక్కు యుగములనుండి భారతీయులలో మహాదాతలుగాఁ బరిగణింపఁబడుచున్నారు. అట్టిమహాదాత యగు కర్ణుఁడు దుష్టుఁ డనుట యుక్తమా?

కర్ణుఁ డర్జునునకుఁ బరాక్రమములోఁ దక్కువవాఁ డగుఁగాక! అతఁడు దుష్టచతుష్టయములో (దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు) నొక్కఁ డని యందురుగాక, కానీనుఁ డగుఁగాక! అతని యనన్యసామాన్య త్యాగ గుణము భారతవీరులలో నెవ్వరికిఁ గలదు? అతఁడు దుష్టుఁడగుట యెవ్వరికి? తనప్రభు వగు దుర్యోధన శత్రువు లగు పాండవులకు. తన ప్రభువు మంచివాఁడైనను జెడ్డవాఁడైనను తన నాతఁడు నమ్మినపుడు తనప్రభునాజ్ఞ చేసెడివారి కపకృతి సేయుట భృత్యలక్షణముకాదా? కర్ణుఁ డట్లే చేసియున్నాఁడు. దుర్యోధనకృతము లని చెప్పఁబడు విషప్రయోగ జలప్రవేశ గృహదాహాదికర్మములలోఁ గర్ణునకు సంబంధము లేదు ద్యూతమునకుఁ గూడ నాతఁడు ప్రేరేపింపలేదు. కాని పాండవులు వనవాసమున నుండ నొకప్పుడు (విదురుఁడు ధృతరాష్ట్రిపై నలిగి పాండవులకడకేగ ధృతరాష్ట్రుఁడు సంజయునిచేఁ దిరిగి విదురుఁ బిలిపించినపుడు) దుర్యోధనునిం బ్రేరేపించి రహస్యముగాఁ బాండవులపై దండయాత్రను జేయింప సిద్ధపఱచుటయు, ఘోషయాత్రానెపమున దుర్యోధనుని ద్వైతవనముననున్న పాండవులను హేళనము చేయుమని ప్రోత్సాహపెట్టుటయును నీచకృత్యములు కర్ణుని గళంకితునిగాఁ జేయుచున్నవి. ఇవి పాండవులు తనసోదరులని తెలియ

నపుడు చేసినవిగాఁ దలంపవలసియుండును. ద్రౌపదిని ద్యూతసభలో "బంధకి" యనుట మిగులఁ గటువుగాఁ గాన్పించును బంధకి యన జారిణి యని నిఘంటువులఁ గాన్పించును గాని పంచభర్తృకయే బంధకి యని ధర్మశాస్త్రపుఁగారికలలోఁ గలదు. చూడుఁడు:

[1]స్త్రీల కొక్కఁడె భర్త కావలయును. అతఁడు కౌమారుఁ డని పిలువంబడును. ఆపత్తుల యందు సంతానము కొఱకు కన్యుఁడు నియోగింపఁబడును. ఎవతె మూఁడవ పురుషు నొందునో దానికిఁ బ్రాయశ్చిత్తము కలదు. నాలవ పురుషు నొందిన స్త్రీ పతితురా లనఁబడును. అయిదవ పురుషు నొందిన యాపె బంధకి యనఁబడును.

ద్రౌపది పంచభర్తృక యగుటచే నామె నట్లు కర్ణుఁడు చెప్పియున్నాడు. మఱియు నాతఁ డిట్లు సభలో "ఏకసక్కెము" నాడుట యధర్మముగాఁ గాన్పించును. కర్ణుఁడు సభలో నవమానింపఁబడిన ద్రౌపదిం జూచి యిట్లనినాఁడు:

గీ. తరుణి యేవురుకంటె నొ • క్కరుఁడు భర్త
యగుట లగ్గు జూదంబునం • దాలినోటు
పడనివానిఁ గాఁదగు భర్తఁ • బడయు మింక
ననుచు రాధేయుఁ డుల్లస • మాడె నంత. —సభాపర్వము.

ఇది కటువగుమాటయే. ఇదియె యర్జునునిమనంబునకు ములికిగా నుండెడిది. కడపటికర్ణ యుద్ధములో శ్రీకృష్ణుఁ డర్జునునిఁ బురికొలుపుటకీ వాక్యమునె జ్ఞాపకముగఁ జేసియున్నాఁడు. కాని ద్రౌపదీ స్వయంవర కాలమున ధృష్టద్యుమ్నుఁడు ద్రౌపదికి స్వయంవరాగతవీరులం జూపుచుఁ గొందఱు వీరుల పేరుల జెప్పినియున్నాఁడు. ఆ వీరులలోఁ గర్ణుఁడు నొక్కఁడు. ఈ వీరులలో నెవ్వఁ డీయంత్రముఁ గొట్టునో వానిని నీవు వరింపవలయునని చెప్పెను. ఇతరులు కొట్టలేరైరి. కర్ణుఁడు వింటినెత్తి యంత్రమును భేదింప సిద్ధపడుచుండ, నీవు సూతపుత్రుఁడవు గాన నీవు యంత్రముం గొట్టినను నిన్ను వరింపనని ద్రౌపది మహావీర సంఘములోఁ గర్ణు నవమానపఱచినది. కాని పిమ్మట నైదుగురను వరించుట కిష్టపడినది. సూతపుత్రుఁడు గాన కర్ణుని వరింప ననినట్లు నా కైదుగురు భర్త లేమి? నే నొక్క యర్జునునే వరింతును గాని తక్కినవారిని వరింపనని ద్రౌపది చెప్పినదా? లేదు! అయిదుగురు భర్త లగుట కిష్టపడినది. నా కైదుగురు భర్త లేమిటికని యొక్క మాటైన ననలేదు సరికదా, అయిదుగురిని పెండ్లి

1. శ్లో। ఏకో భర్తా హి నారీణాం, కౌమార ఇతి లౌకికః, ఆపత్సు చ నియోగేన
సంతానార్థే పరస్మృతః గచ్ఛేత తృతీయంతు తస్యా నిష్కృతిరుచ్యతే,
చతుర్థీ పతితా ధర్మా త్పంచమే బంధకీ భవేత్ (స్మృతికారిక)

యాడుటలో వింత సింగారములను వేసికొనినది. ఆ వేషములఁ జూచి ద్రుపదుఁడే యాశ్చర్యము నొందెనటులం గలదు. తన్ను నవమానించి యైదుగురికిఁ బెండ్లామగుట కంగీకరించిన ద్రౌపదిని బంధకి యనియు, నైదుగురు భర్తల కంటె నొక్కఁడే భర్త యగుట యుక్తమనియు ద్యూతమునఁ బెండ్లాము నోడని హాని నొక్కనిం గోరికొమ్మనియుఁ గర్ణుఁడు దెప్పిపొడిచియున్నాఁడు. కాన కర్ణుపక్షమున నిది దోషము కాదు.

కర్ణునిపై ద్రౌపదికి మక్కువ యున్నదని యేవేవో కథలు చెప్పుదురు అవి పుక్కిటిపురాణములే. కర్ణునికి మాత్రము ద్రౌపదిపైఁ గోరికలేదు. శ్రీ కృష్ణుఁడు సంధిసమయమునఁ గర్ణునితో రహస్యముగా భేదవాక్యము లాడునపుడు ద్రౌపది నిన్నాఱవవానినిగాఁ బొందునన, నాకు సూతకన్యలు భార్యలు కలరు. వారియందే నా కతిశయప్రేమ మనినాఁడు. కాన కర్ణుఁడు కామియై ద్రౌపదిని మనంబుననైనఁ గోరినవాఁడు కాఁడు

కర్ణుఁ డభిమన్యుని విల్లు వెనుకనుండి కొట్టుట యనునది మఱియొక యధర్మకార్యము. దీనినే కృష్ణార్జునులు పెక్కుసార్లు ఉగ్గడించువారు. కాని యా యధర్మకార్యమును ప్రోత్సహించినవాఁడు ద్రోణుఁడు. విల్లు విఱిగినచోఁ బిమ్మట చూచుకొందమనఁ గర్ణుఁ డట్లు చేసియున్నాఁడు. అంతమాత్రమే కాని యధర్మముగా నభిమన్యుఁ జంపుటకును నాతని ప్రోత్సాహ మెంతమాత్రము లేదు. ఒకవేళ నయుక్తముగా వెనుకనుండి ధనుర్భంగముఁ జేసినను, పాండవులు యుద్ధములోఁ జేసిన యయుక్తకార్యములలో నిది దశాంశమైనఁ గాదు. కాన కర్ణుఁడు నిర్దోషి. యోగ్యుఁడు. మహావీరుఁడు త్యాగి స్వధర్మనిర్వాహకుఁడు. ప్రభుభక్తిపరుఁడు. అట్టివానిని దుష్టుఁ డనుట యయుక్తము.

కర్ణుఁడు దుర్యోధనునివలన నంగరాజ్యము నొందినట్లు భారతమునఁ గలదు. కాని భాగవతములోని నవమ స్కంధమున దశరథుని పుత్రిక యగు శాంతను బెంచి ఋశ్యశృంగున కామె నిచ్చిన 'అంగ'దేశరాజగు రోమపాదు నకుఁ గర్ణునిం బెంచిన 'అతిరథుఁడు' పదునొకండవతరమువాఁడని కలదు. కాన కర్ణున కంగరాజ్యము వంశక్రమాగతమైనదియే. దీనిగూర్చి యింకను శోధింప వలయును.

## శకుని

"సర్వనాశాయ మాతులః" (అందఱి నాశముకొఱకు మేనమామ యగు చున్నాఁడు) అను లోకోక్తి శకునివలననే లోకమునం గలిగెనని తలంపవలసి యున్నది. శకునికి భారతగాథలో దుర్యోధనుఁడు పాండవుల నెట్లు హస్తిపురి నుండి తొలఁగింపవలయు నను నాలోచనమున నుండఁగా ప్రసక్తి కలిగినది.

దుర్యోధనునకు రాజనీతి నుపదేశించుటకు "కణికుడు" అను నొక మంత్రినిదెచ్చి యాతనిచే దుర్యోధనునకు రాజనీతి నుపదేశముఁ జేయించెను. అప్పు డంత మాత్రమే యాతనికి ప్రసక్తి గలదు.

"ద్రౌపదీ వివాహానంతరము బయటపడిన పాండవులను హస్తిపురికిం దెచ్చుటయా? వలదా?" యను నాలోచనము దుర్యోధన ధృతరాష్ట్ర భీష్మాదులు చేయునపు డీతఁడు మంత్రాలోచనమున నున్నాఁడు. కాని యాతని యాలోచనా విశేష మేమియుఁ గలుగలేదు రాజసూయానంతరము దుర్యోధనుఁడు పాండవుల 'ఔత్కృష్ట్య' ఔద్ధత్యము'లకును మయసభలో ద్రౌపదీభీములు తనకుఁ గలిగించిన యవమానమునకును లోలోనం గుందుచుండ శకుని కలిసికొని యాతని మనోవిచారకారణముఁ నారసి తత్పరిహార కారణముగా ద్యూతపుటాలోచనముం జెప్పి దుర్యోధనధృతరాష్ట్రు లందుల కొడంబడునట్లు చేసినాఁడు. ఆ యాలోచనా ఫలితమే సర్వనాశకరమగు యుద్ధబీజోత్పత్తికిని, పదమూఁడేండ్లు దుర్యోధనుడు నిరాటంకముగా సమ్రాట్టగుటకును హేతువైనది. "ఆ పదమూఁడేండ్లలోను పాండవులు నశింపవచ్చును, లేక అజ్ఞాతవాస వత్సరమున నియమభంగమైన యెడలఁ దిరిగి పదమూఁడేండ్లు వనవాసాదికముఁజేసి యపుడైన వారు సంపూర్తిగ నశింపవచ్చును." అనునదియే శకునియొక్క యాలోచనము. కాని కృష్ణ ధర్మజులయొక్క రాజనీతి నిపుణత శకునియొక్క రాజనీతి నిపుణతను మించి సామభేదదండోపాయముల ననుసరించి దుర్యోధన సామ్రాజ్యచ్యుతికిం గారణమైనది. శకుని రాజనీతి పదుమూడేండ్లు మాత్రమె లాభకారియైనది. కృష్ణధర్మజుల రాజనీతి మాత్రము శాశ్వత ఫలకారియయ్యెనా? వారి రాజనీతి ధర్మజునకు జన్మాంతదుఃఖ హేతువు కాలేదా? కృష్ణుని రాజనీతి యాదవకుల నాశము నాఁపఁ గల్గెనా? ఎంతటి రాజనీతి విశారదుఁడైనను దాత్కాలికముగాఁగాని యొకటి రెండు తరముల వఱకుఁగాని ఫలభుక్కే యగుఁగాని శాశ్వత ఫలభోక్త కాఁడు.

కొందఱు రాజనీతి విశారదు "లుచితానుచిత" పరిజ్ఞాన శూన్యులై స్వకార్య సాధనముకై ధర్మమును విడిచి మెలఁగుదురు. ధర్మజుఁడు భీష్మ ద్రోణుల పతనమున కెట్లు మెలఁగెను? అది ధర్మమా? కృష్ణుఁడు 'జరాసంధ, ఘటోత్కచ, కర్ణ, దుర్యోధనుల' పతనమునకెట్లు ప్రవర్తించెను? అది ధర్మమా? కృష్ణుఁ డవతారపురుషుఁడు గాన దుష్టసంహారమున కట్లు చేయించెను! భగవంతున కధర్మ మన నేమి? అనువారి పక్షమున నది యుక్తమని మన మంగీకరించినను పరమేశుఁడు సత్యస్వరూపుఁడను పదమెక్కడ ప్రసక్తము? ధర్మమూర్తి యనఁబడు ధర్మరాజుయొక్క ప్రవర్తనమెట్లు సమర్థనీయము? కాని ధర్మజుఁడు ధర్మమూర్తియై శకుని దుష్టుఁ డగుటమాత్రము చదువరుల మానసిక విలసనమె

కారణమైయున్నది. శకుని యుక్తి శత్రుపక్షమువారి రక్తపు చుక్క యొక్కటియైనఁ బడకుండఁగ శత్రురాజ్యాపహరణ హేతువైనది చాణక్యుఁడు నందవధానంతర మిట్టి యుక్తులచేతనె చంద్రగుప్తుని రాజ్యమును స్థిరపఱిచెను. గత శతాబ్దమునను "బిస్మార్కు" (జర్మనీ దేశపు మంత్రి) యుక్తులచే జర్మన్ సామ్రాజ్యమును వృద్ధిపఱిచెను ఆ బిస్మార్కు యొక్క పన్నుగడయె గతించిన యిరోపా మహా సంగ్రామమునకు హేతువైనది. శకుని బిస్మార్కు వంటివాఁడు గాఁడోటు? ఇప్పటి రాజకీయవేత్తలు చాణక్య బిస్మార్కులను బొగుడుదురు. జన సామాన్యమునకుఁ జాణక్య బిస్మార్కుల వృత్తాంతము తెలియదు గాని శకునిని మాత్రము దూషించుట నెఱుఁగుదురు. రాజనీతి విశారదు లొక్కొక్కప్పుడు రాజ్యాభివృద్ధికి హేతువులగునట్లు మెఁగి జనసామాన్యమునకు ముప్పునుగూడఁ గలుగఁజేయు చుందురేమో యని సందేహింప వలసి యున్నది. పరుల మనశ్శరీరములకు బాధను గల్గనీయక సర్వసంఘాభివృద్ధికర రాజనీతి యేరి కలవడునో? భారతకాలమునందలి శకునీ కృష్ణధర్మరాజుల రాజనీతి పదునెనిమిది యక్షౌహిణుల సైన్యము నశించుటకు హేతువైనది ఇప్పటికాలమున "లాయడు జార్జి" (ఇంగ్లండు) పాయంకిరు (ఫ్రాన్సు), కైజరు (జర్మని) అను వారల రాజనీతి ప్రపంచ సంక్షోభకరమగు మహాయుద్ధమునకే కాక నేఁటి ప్రపంచార్థిక స్థితికిని గారణము కాలేదా?

శకుని ద్యూతకాలమునం జేసిన కృత్రిమోపాయము కాక వేఱొక కృత్రిమోపాయము నెప్పుడును దుర్యోధనున కుపదేశింపలేదు. ఘోషయాత్రం దలపెట్టిన వాఁడు కర్ణుడె కాని శకుని కాఁడు. ఘోషయాత్రలోఁ బరిభవింపబడి విచారింపుచున్న దుర్యోధనునకు, నీవుఁ బాండవు లుపకృతి చేసిరి గాన వారిని నీవును గౌరవించి అర్ధరాజ్యమును వారి కిమ్మని ధారాళహృదయముతోడనె చెప్పి యున్నాఁడు.[1] సంధికార్యమున నర్ధరాజ్యము ధర్మజున కీయవల దని చెప్పలేదు. ఘోషయాత్రాపరాభూతుఁడగు దుర్యోధనున కుపదేశించినదానికి వ్యతిరేకముగాఁ జెప్పుట కిష్టము లేక సంధిసమయమునం "గిమ్మ"నకుండఁగ శకుని యూరకుండె నని తోఁచుచున్నది. కాని తా నుండినపక్షమున భీష్మాదులవలె కృత్రిమముగా సంచరింపక స్వపక్షముకు శత్రువు లగువారితో ఘోరముగానే పోరాడెను.

శకుని మహాబలవంతుఁడు ఉలూకుఁ డను శక్తిమంతుఁడగు కుమారుఁడాతనికిఁ గలఁడు. వీరులగు పెక్కండ్రు సోదరులును శౌర్యవంత మగు నాశ్విక

1. అరణ్యపర్వ 250 అధ్యా.

సైన్యము నాతనికిఁ గలదు. భీమార్జుననకుల సహదేవులతో నాతఁడు పెక్కుసారులు పోరాడెను. ఇతర మగు సమస్త సైన్యమును నశించిన పిమ్మటఁగూడ శకుని యొక్క యాశ్వికసైన్యము మిగిలియే యున్నది. దాని నర్జున నకుల సహదేవులు సంహరించిరి. శకునిని సహదేవుఁడు సంహరించిన పిమ్మటనే దుర్యోధనుఁడు పలాయితుఁడై మడుగులో దాఁగుకొనెను. రాజనీతి నిపుణుఁడు, వీరుఁడు నగు శకుని లోకమున శాశ్వతముగా దుష్టుఁ డనిమాత్రము వాకొనఁబడుచున్నాఁడు

## సుశర్మ (త్రిగర్తలు)

మహాభారతకాలమునుండి పాణిన్యాచార్యుని కాలము (క్రీ. పూ. 6వ శతాబ్దము) వఱకుఁ త్రిగర్తులు మహాశూరులైన 'ఆయుధజీవికులు'గా నుండిరి.

మహాభారతయుద్ధకాలమునఁ త్రిగర్తాధీశ్వరుఁడు "సుశర్మ" అతనికి సోదరులుగ "సత్యరథ, సత్యవర్మ, సత్యవ్రత, సత్యేషు సత్యకర్మ"లను మహారథికులైన శూరులును గలరు.

పాణిన్యాచార్యుని కాలమున [1]'జాలంకి' యను త్రిగర్తుని యాయుధజీవిక సంఘముతో "కౌణ్డోపరథుఁడు దాణ్డకి, క్రోష్టుకి, జాలమాణి, బ్రహ్మగుప్తుడు" నను నార్వుర యాయుధజీవికసంఘము కలిసియున్నది.

మఱియుఁ త్రికర్తలతోఁ గలిసి సంశప్తకులను మహాశూరులు కురుక్షేత్ర సంగ్రామమునఁ బాండవులతోఁ బోరిరి. సుశర్మ సంశప్తకాధీశుఁ డనికూడ మహాభారతమునఁ గానవచ్చెడివి. దానియందే త్రిగర్తలు వేఱు సంశప్తకులు వేఱు ననియుఁ గానఁబడుచుండును. సుశర్మయు నాతని సోదరులును అర్జునుం జంపుదు మనియు లేక చత్తు మనియుఁ దిరుగ మని యొట్టులు (ద్రోణుని రెండవ నాఁటి యుద్ధమున) పెట్టుకొనుటచే వారికి సంశప్తక (సంశప్తక = తిరుగమని యొట్లు పెట్టుకొనినవారు) నామము సిద్ధించినట్లు కాన్పించును. కాని సంశప్తక నామము వనపర్వమునను గాన్పించెడిని. దీనింగూర్చి యింకను శోధింపవలసి యున్నది.

భారతకాలమునఁ త్రిగర్తులతో సంశప్తకయోధగణముండినటులు పాణిని కాలమునం త్రిగర్తషట్కముతో "దామన్యాది" ఆయుధజీవికగణము కలిపి చెప్పఁబడుట విచిత్రముగాఁ గాన్పించును. అ దామన్యాదిగణ మిట్లు చెప్పఁబడెను:

---

1. సూ. దామన్యాదిత్రిగర్తషష్ఠాచ్ఛః పా. 5-3-116

శ్లో. ఆహుస్త్రిగర్తషష్ఠాంస్తుకౌణ్డోపరథదాణ్డకిః
క్రోష్టుకిర్జాలమాణిశ్చ బ్రహ్మగుప్తోఽథజాలకిః।

1"దామని జౌలపి బైజవాపి ఔదకి ఔదజ్కి అచ్యుతన్తి అచ్యుతదన్తి శాకున్తకి ఆక్తిదన్తి జౌదవి కాకదన్తకి శాత్రున్తపి సార్వసేని బిద్దు బైన్దవి తులభ మౌఞ్జాయన కాకన్ది సావిత్రీపుత్ర"

త్రిగర్తేశుఁడగు సుశర్మ, విరటుని గోవుల నపహరింపవలయునని, కౌరవుల సభలో నాలోచనము జరుగుచుండిన సమయమునఁ దాఁగలుగఁ జేసి కొని తనకును విరటునకును విరోధము కలదనియుఁ గీచకుఁడు (విరటుని బావమఱఁది) సాల్వ కేకయులతోఁ గూడి తన్నుఁ బెక్కుసారులు బాధించె ననియుఁ నా పగఁ దీర్చికొనుటకుఁ దాను దక్షిణ గోగ్రహణముఁ జేయుదు

1. పాణిన్యష్టాధ్యాయిలోని దామన్యాదిగణముం జూడుఁడు:
భారత కాలమునందలి త్రిగర్త సంశప్తక సంబంధముననే పాణినికాలము లోని దామన్యాదిగణ త్రిగర్తషష్ఠగణములకు సంబంధముండిన నుండ వచ్చునేమో! భారతములోఁ ద్రిగర్తసంశప్తకులు కలిపియే చెప్పఁబడు చుందురు. పాణినియు నట్లే దామన్యాదులతోఁ ద్రిగర్తషష్ఠగణమును గలిపియే చెప్పియున్నాఁడు శాకటాయనాదులెట్లు చెప్పిరో పరిశీలింప వలసి యున్నది
ఇంక నొకవిశేషము: దామన్యాది గణమున 'కాకన్ది' అనునొక యాయుధ జీవికసంఘము చెప్పఁబడినది. పాణిని కాలమునఁ గల కాకన్ది యనఁబడు శబ్దము మఱి పదునాఱు వందల సంవత్సరములకుఁ బిమ్మట (క్రీ. శ. పదియవ శతాబ్దము) 'కాకతి'గా మాఱియున్నదేమో! త్రిలింగదేశము నించుమించు మూఁడువందలేండ్లు పాలించిన కాకతీయుల ప్రాచీనపుగాథ గుప్తముగానె యున్నది. కాకతి శబ్దము జైన దేవతాపరముగాను, ఏదియో కాకతి యను పరశక్తి సంబంధమగు గుమ్మడి తీగ గాను కల్పింపఁబడినది. కాకతి యను దేవతా నామము జైన వాఙ్మయమునం గలదా? కాకతీయుల కులదేవత పద్మాక్షికాని కాకతి కాదు. గుమ్మడితీగ నుండి పురుషుఁ డుద్భవించునా? ఈ రెండు కల్పనల కంటెఁ బాణిని కాలమున నుండిన 'కాకన్ది'యే కాకతిగా మాఱియున్నదేమో యని తోఁచెడివి. కాకన్ది గణము ఆయుధజీవిక గణము. కాకతి జాతిజులును ఆయుధజీవులై రాజ్యస్థాపకులై యున్నారు. పదునాఱువందలేండ్లలో శబ్దము స్వల్పముగా మారుట విరుద్ధము గాదు. బాణినినాఁటి సంస్కృతో చ్చారణమునకును కాకతీయులనాఁటి సంస్కృతోచ్చారణమునకును జాలభేదము కలదు. కాన కాకన్దిశబ్దమె కాకతిగా మాఱినదని తలంచు చున్నాను. ఇంకను విజ్ఞులు విశేషముగా నాలోచింతురుగాక!

ననియు గర్గాదులతో నాలోచించి కౌరవుల సిందుసభలో నా యంశముఁ జెప్పి యున్నాఁడు. సుశర్మ యాలోచనము భీష్మ దుర్యోధనాదులకు సమ్మతమైనందున దాని కంగీకరించిరి. అట్లే సుశర్మ త్రిగర్త సైన్యముతో విరటుని దేశమున దక్షిణమునఁ గల గోవులం బట్టుకొని యుద్ధమువచ్చిన విరటుని ససైన్యునిఁగా నోడించి యాతని బంధించెను. అపుడు ధర్మజప్రేరితుఁడై భీముఁడు విరటుని విడిపించుటయే కాక సుశర్మను ధర్మజునికోరికచేతనె బంధముక్తునిఁ గావించెను. సుశర్మ కర్ణునివలన దుర్యోధనునకు లోఁబడిన సామంతుఁడుగా నుండినట్లు కాన్పించుచున్నాఁడు.

అర్జునుఁడు సుశర్మను దత్సోదరులను బలహీను లని హేళనముఁజేయు వాఁడనియు నాపగ నీఁగుట కెట్లయిన నాతనిం జంపుటయో అతనివలనఁ దాము చచ్చుటయో కాని వేఱుగ జరుగదని ద్రోణుని రెండవనాఁటి యుద్ధమున సుశర్మయుఁ దత్సోదరులను శపథములఁ జేసి యర్జునునిఁ బ్రత్యేక యుద్ధమున కాహ్వానించిరి. అర్జునుఁ డట్లెపోయి వారితో ఘోర రణము సల్పెను. ఆనాఁటియుద్ధములోఁ ద్రిగర్తులు కృష్ణార్జునులకుఁ దెఱపి లేకుండఁగ - రథము కదలకుండఁగ-తాము మూఁగి అర్జునుఁ డేమయ్యెనో యను సందేహముతోఁ గృష్ణుఁడు కంటఁదడిపెట్టి కుయ్యాడునట్లు చేసిరి. అవతారపురుషుఁడగు శ్రీకృష్ణుఁడు మానుష భావముతో సాల్వయుద్ధ కాలమున మాయావసుదేవుఁ జూచియుఁ ద్రిగర్తల యుద్ధములో నర్జునుం గూర్చియు మాత్రమె రెండుసారులు విలపించినట్లు కాన్పించును. ఆనాఁటి యుద్ధమున నర్జునుఁడు త్రిగర్తులం గెడించి స్వసైన్యమును సంక్షోభపెట్టు భగదత్తుని సుప్రతీకముతోఁగూడ నడ్డి చంపఁ గలిగెను. కాని ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధమునందిరిగి త్రిగర్త లర్జునుం బ్రత్యేకముగ యుద్ధమున కాహ్వానించి రాత్రివఱకు నాతనిం గదలనీయక మహాహవము చేయుటచే నానాఁడు పద్మవ్యూహమునఁ జిక్కువడిన యభిమన్యున కర్జునుఁడు తోడ్పడలేకపోయెను. కర్ణుని రెండవనాఁటి యుద్ధమునను సంశప్తకు లశ్వత్థామతో గూడి యర్జునునితో ఘోరముగాఁ బోరిరి. పైనుడువబడిన సుశర్మ సోదరు లెప్పుడైన నేమి సంశప్తక సైన్యముతో నర్జునునిచేతనే మడిసిరి సుశర్మ మాత్రము కొంత సైన్యముతోఁ బదునెనిమిదవనాఁటి వఱకు నర్జునునితోడనె పోరుచు శల్యమరణానంతర మర్జునునిచేతనె మడిసెను. సుశర్మాదులు కురుక్షేత్ర సంగ్రామమున హతులైనను సుశర్మని పుత్రపౌత్రులగు "సూర్యవర్మ, కేతువర్మ, ధృతవర్మ" అను వీరులు ధర్మజుఁడశ్వమేధయాగమున కశ్వసంరక్షకుఁడుగా నేగు నర్జునునిపైఁ బ్రాఁబగ మనంబున నుంచికొని యాతనితో ఘోర

ముగాఁ బోరిరి. అందు కృతవర్మ యర్జునుని చేతినుండి గాండీవమూకి నేలపైఁ బడునట్లుకూడఁ జేయఁగలిగెను కాని తుదకోడి త్రిగర్తు లాతనికి శరణుసొచ్చిరి.

త్రిగర్తదేశ మన మూఁడుపల్లములు, లేక గుంటలు గల దేశమని వ్యుత్పత్త్యర్థ మగును. భారతములోని వర్ణనముంబట్టి నేఁటి రాజపుత్రస్థానములోని యొకభాగము త్రిగర్త దేశముగా దోఁచును. రాజపుత్రస్థానములో "సాంబర్, సర్; డిడ్వానా" అను మూఁడు సరస్సులుగల దేశమె యుండు నని తలంపవలసి యున్నది. నేఁడును దత్రత్యరాజపుత్రవీరులు మహాశూరులుగానే యుండుట ప్రశంసనీయము.

## విశేషములు

1. న్యాయ మన్యాయముగాను, అన్యాయము న్యాయముగాను వ్రాయుటచే వ్యాసుఁడే చింతించి నారదోపదేశముచే భాగవతమును రచించియుండుటయే కాక మన సింకను బాధించుటచేఁ గాఁబోలును సుయోధనునకు స్వర్గసౌఖ్యప్రాప్తిని, పాండవులకుఁ గొంతకాలము నరక ప్రాప్తిఁగూడఁ బిమ్మటఁ జెప్పియున్నాఁడు.

2. ప్రఖ్యాత మహాకవి యగు "వేమన" కూడ పాండవులయందు గౌరవముఁ జూపుట వెఱ్ఱి యని యిటులు నుడివి యున్నాఁడు.

ఉ. తాతజనించెఁ గన్యకకుఁ దండ్రియు • దాముసు గుండగోళకుల్
మాత వరానుకూల మఱి • పుణ్యవ ద్రౌపది భర్త లేవురౌ
నీతులుసెప్పఁ బాండవుల • నేమము లిట్టివియంచు నెన్నుచున్
భూతలమందు వారలకుఁ • బూజలఁజేతురు వెఱ్ఱివేమనా!

3. మహాభారతయుద్ధమునఁ బదునెనిమిది యక్షౌహిణుల సైన్యము పోరి యుండునా? అట్లుండినఁ దగినచోటు కురుక్షేత్రముననుండెనా? యను ప్రశ్నము కలదు పదునెనిమిది యక్షౌహిణుల సైన్య మున్నదనియు నేఁటి "అలహాబాదు" మొదలించుమించు రాజపుత్రస్థానపు టెడారివఱకు యుద్ధరంగమనియు నందు వారణావతము, అహిచ్ఛత్రము, పంచనదము, కురుజాంగలము, రోహితకారణ్యము, కాలకూటము గంగాకూలములలోఁ గౌరవుల సైన్యము వన్నెఁబడి యించుమించుగ నైదువందలమైళ్ళు యుద్ధరంగమై యుండె ననియుఁ దెలియ నగును.[1] ఆ యుద్ధరంగములో భీష్మద్రోణాదులకుఁ బాండవులలోనివారగు శిఖండి ధృష్టద్యుమ్నాదు లెదురుగ నొద్దనములఁ దీర్చుచుండిరి. సైంధవ వధము నాఁ డన్నిసైన్యముల నొక్కటిగాఁ గూర్పవలసివచ్చినపు దేవైపునఁ జూచినఁ గౌరవసైన్యము పదిరెండుయోజనముల స్థలము నాక్రమించినదై యున్న దని

1. ఉద్యోగపర్వ 18 అధ్యా.

వర్ణింపఁబడుటచేఁ బదునెనిమిది యక్షౌహిణులు పోరాడిన వనుటలో విరుద్ధము లేదు. సైంధవుని జంపినప్రదేశము నిషాదప్రదేశమని ధృష్టద్యుమ్నుఁడు చెప్పుట గమనింపఁదగినది.[1] ఇన్ని వందల మైళ్ళ ప్రదేశములో నిషాదులుండు ప్రదేశము కూడ నుండిన నుండును.

ఆయా దేశకాల పరిస్థితులలో వార్తాహరణాది వ్యవహారములను ద్వరగా నడిపించు సౌకర్యము లుండుటచే నవి యపు డట్లు జరగలేదని తలఁప వీలులేదు. సాంకేతిక శంఖచిహ్నాదులచే వ్యవహారములఁ ద్వరగా నడుపుచుండినటుల నాయాస్థలములలోని వర్ణనములఁబట్టి యూహింపఁ బడుచున్నది.

4. శ్రీకృష్ణప్రోత్సాహమునఁ బాండవులు భారతవర్షమున నేకచ్ఛత్రాధిపత్యమును స్థాపింపఁ దివిరిరిగాని యది నిల్వలేదు. ఆ యంశమిదివఱకె సూచింపఁబడెను.

నాఁటి దేశపటము, తద్వర్ణనముఁ జూడుఁడు:

---

1. ద్రోణపర్వ 198 అధ్యా.

# మహాభారతకాలపు రాజ్యములు


మహాభారతచరిత్ర జరుగు కాలమున భరతఖండస్థరాజ్యములపటమిందుఁ జూపఁబడియున్నది ఆ పటమందుఁ జూపఁబడిన హద్దులు సరియైనవియే యని చెప్పలేము. ఇంచుమించటుల నుండునని మహాభారతమును జదువగాఁ దోఁచినవి. వాని నించుమించుగ వర్ణింపుచున్నాను. భరతఖండ మన నేఁటి బ్రిటిషిండియా మాత్రమే కాదు. హిమాలయోత్తరభాగమునఁ గల నేఁటి టిబేతులోనివగు "ఉత్తరకురు, కాంభోజ, ఉలూక" దేశములను, తూర్పున చైనా, అసాం దేశములలోని "ప్రాగ్జోతిష"మును, మధ్యాసియా, అఫ్గనిస్థానములలో "ఉశీనర, మద్ర, బాహ్లిక" దేశములను భరతఖండస్థరాజ్యములుగా నాఁడు పరిగణింపఁబడినవి కురుదేశము వేదకాలమునందును మహాభారతకాలమునందును నేఁడును మహాప్రసిద్ధినే పొందియున్నది కురుదేశమును "మనువు, కాళిదాసు" కూడ బ్రహ్మావర్తమని వర్ణించిరి.[1] భరతఖండము నెవరు పరిపాలింపవలయునని మహాభారతయుద్ధము తరువాతఁగూడ మూఁడు కురుక్షేత్ర యుద్ధములైనవి.[2] "పానిపత్తు, ఢిల్లీ, స్థానేశ్వరము" అను నేఁటి ప్రసిద్ధస్థలములు కురుక్షేత్రములోనివే. నాఁటి కురుదేశమున కుత్తరమున హిమాలయమును, తూర్పునఁ బాంచాల దేశములోని "అహిచ్ఛత్రము మాకంది, కాంపిల్య" యను భాగములును.[3] దక్షిణమున మత్స్యదేశము, నాఁడు "మరుస్థల"మని పిలువఁబడు రాజపుత్ర

---

1. మనుస్మృతి (2-17) మేఘసందేశము (1-49)
2. (1) "పృధ్వీరాజు మహ్మద్ఘోరీల" యుద్ధము. (2) "బేబరు ఇబ్రహీం లోడీల" యుద్ధము. (3) "మహారాష్ట్రుల అహమదబ్దాలీల" యుద్ధము ముఖ్యమగు కురుక్షేత్రయుద్ధములు.
3. ద్రుపదుని పరిపాలనములోఁగల గంగ కుత్తరమునను౦డిన "అహిచ్ఛత్రము, మాకంది"యను పాంచాల రాజ్యభాగములను ద్రోణుఁడు కురుకుమారులతోను పాండవులతోను ద్రుపదునిపై దాడివెడలి లాగుకొనియున్నాఁడు ఆప్రదేశములోనిదియే "వారణావతము". ఆ లాగుకొనిన భాగములు కురురాజ్యములోఁ జేరినవి దానికి భీష్ముఁడంగీకరించుటచేతనే ద్రుపదునకు భీష్మ ద్రోణులపై మహావిరోధము కలిగిన దనునంశమిది వఱకె వర్ణింపఁబడినది.

స్థానపు ఎడారియును, పశ్చిమమున నేఁటి "కాంధహారు, పశ్చిమోత్తర పరగణాలలోను, పంజాబులోను" గలిసిన గాంధారదేశములును గలవు గాంధార దేశమునకుఁ బశ్చిమోత్తర భాగములో "బాహ్లిక మద్ర, కాశ్మీరదేశములును, నైరృతిదిక్కున, సింధుసౌవీర" దేశములును, నేఁటి "రాజపుత్రస్థాన గుజరాతి" దేశములలో మరుస్థలమను ఎడారియును, "మత్స్య, త్రిగర్త, దశార్ణ" దేశములు "శూరసేన, అవంతి, సౌరాష్ట్ర" దేశములును, నేఁటి "మాల్వా మధ్యరాష్ట్ర" భాగములలో "నిషధ, హైహయ, విదర్భ, చేది, దక్షిణకోసల" దేశములును, పాంచాలమునకుఁ దూర్పునఁ "గాశి, కోసల" దేశములును "బీహారు బాంగాళా" రాష్ట్రములలో "విదేహ, మగధ, అంగ వంగ, పుండ్ర" దేశములును "అసాం, చీనా, బర్మా" భాగములలోఁ బ్రాగ్జ్యోతిషరాజ్యమును గలవు. "ఉత్కల, ఆంధ్ర, మహారాష్ట్ర" దేశములలోఁ "గళింగాంధ్ర, మణిపుర, శోణ, మల్ల" దేశముల భాగములును "ద్రవిడ, కర్ణాటక, మళయాళ, మహారాష్ట్ర" భాగములలోఁ "చోళ, పాండ్య, కేరళ, కొంకణ, సాళ్వ" దేశములును గలవు. మహాభారత యుద్ధకాలమునందలి దేశములు, రాజధానులు, రాజులు యొక్క పట్టిక యీక్రింద ముఖ్యమైనవానిఁ జూపుచున్నాను:

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
|---|---|---|---|---|
| 1. | కురు దేశము | హస్తిపురి | ధృతరాష్ట్రుఁడు | మహాభారతిగాథ ఈ కురురాజ్య సంబంధపుదే. |
| 2. | పాంచాల దేశము | కాంపిల్య నగరము | ద్రుపదుఁడు | ద్రుపదుని కొమరుఁడు ధృష్టద్యుమ్నుఁడు పాండవసైన్య సర్వాధికారి. |
| 3. | గాంధార దేశము | పుష్కలావతి | శకుని | దుర్యోధనుని మేనమామ. |
| 4. | మద్ర దేశము | శాకల్య పురము | శల్యుఁడు | నకుల సహదేవుల మేనమామ యైనను దుర్యోధనునిపక్ష మవలంబించి, కర్ణుఁడు చచ్చుటకుఁ గారకుఁడైనాఁడు. "శల్యసారథ్య" మను సామెత యీతనిచేతనే కలిగినది. బాహ్లికదేశములోఁ గూడఁ గొంతభాగ మీతనికి లోఁబడి యుండెను. |



మహోదధి
రత్నాకరము
సింధుదేశము
మగధదేశము
మల్లదేశము
త్రివిష్టపము
పాండవపక్షదేశములు
కౌరవపక్షదేశములు
72
76
80
84
88
92

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
|---|---|---|---|---|
| 5. | బాహ్లీక దేశము | | బాహ్లీకుఁడు | భీష్ముని పినతండ్రి. శతవృద్ధయి సను సోమదత్తుఁడను కొమరుని తోను, భూరిశ్రవసను మనుమని తోను మహాయుద్ధమునఁ గౌరవుల పక్షమునఁబోరి పాండవులచేఁ జచ్చెను బాహ్లీకుఁడు మేనమామకు దత్తుఁడై తద్దేశాధీశుఁడయ్యెనఁట! |
| 6. | కేకయ దేశము | | జయత్సేనాదు లైదుగురు | ధర్మజుని పినతల్లి కుమారులు. కుంతి చెల్లెండ్రబిడ్డలందఱిలో వీరే పాండవపక్షులు. |
| 7. | సింధు దేశము | | జయద్రథుఁడు (సైంధవుఁడు) | దుర్యోధనుని బావ. "శ్యాలకో గృహనాశాయ" యను సామెత యీతనివలననె కలిగియుండును. |
| 8. | సౌవీర దేశము | | పండ్రెండుగు రుసోదరులు | ఈ దేశము సైంధవునకు లోబడి నది ఆ దేశ ప్రభువులందఱు ద్రౌపది నరణ్యమున సైంధవుఁ డెత్తికొనిపోయినపుడు యుద్ధమున నర్జునుఁడు వీరినందఱఁ జంపెను. |
| 9. | కుంతిభోజ దేశము | | శ్యేనజిత్తు | కుంతి యొక్క తమ్ముఁడు. ఈతఁడు నాగుల సంబంధుఁడఁట! |
| 10. | శూరసేన దేశము | ద్వారక | ఉగ్రసేనుఁడు | శ్రీకృష్ణుని మాతామహుఁడు. ఉగ్రసేనాదులు కురు, పాండవ యుద్ధమునఁ దటస్థులై యున్నారు. |
| 11. | అవంతి దేశము | ఉజ్జయిని | విందాను విందులు, | పాండవులకుఁ జినతల్లి కుమారు లైనను దుర్యోధను పక్షమునకు వచ్చిరి |
| 12 | త్రిగర్త దేశము | | సుశర్మ | సంశప్తసేనఁతో గడవఱకు నర్జునునిఁ బ్రతిఘటించి పోరిన మహావీరుఁడు గోగ్రహణమున విరటునిఁ బట్టుకొనఁగాఁ బాండవులు |

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
|---|---|---|---|---|
| | | | | విడిపించిరి భీముఁడపు డీతనిఁ బట్టుకొనెను. |
| 13. | మత్స్య దేశము | ఉపప్లావ్యము | విరటుఁడు | విరాట పర్వమున నీతని గాథ ప్రసిద్ధమైయున్నది. |
| 14. | దశార్ణ దేశము | | హిరణ్యవర్మ | భగవదత్తునితోఁ బోరి చచ్చెను. పాండవపక్షపాతి. |
| 15. | హైహయ దేశము | మాహిష్మతి | నీలుఁడు | సహదేవుని రాజసూయ కాలము నుండియు విరోధించుటచేఁ గౌరవ పక్షమునకు వచ్చెను. |
| 16 | కాశీ దేశము | కాశి | | కాశిరాజు యుద్ధాత్పూర్వమెకృష్ణునితోఁబోరి చచ్చుటచే సైన్యము మాత్రము పాండవపక్షమునకు వచ్చెను. పౌండ్రకవాసదేవునిగాథలోఁగాశిరాజుగాథ యిమిడియున్నదని విష్ణు, భాగవత, పురాణములఁ జదివినవారికి దెలియును. |
| 17 | ఉత్తరకోసఁదేశము | అయోధ్య | బృహద్బలుఁడు | పద్మవ్యూహములో నభిమన్యుచేఁ జచ్చెను. |
| 18 | మగధ దేశము | రాజగృహము | సహదేవుఁడు | జరాసంధుని పుత్రుఁడు ఈతఁడు పాండవపక్షమునఁ బోరి ద్రోణుని చేఁ జచ్చెను. కాని యీతని కొడుకు "మార్జారి" పాండవుల కెదురొడ్డి యర్జునున కోడెనని యశ్వమేధపర్వమునఁ గలదు |
| 19 | చేదిదేశము | శక్తిపురి | ధృష్టకేతుఁడు | శిశుపాలుని కుమారుఁడు పాండవ పక్షమునకు వచ్చెను. |
| 20 | ప్రాగ్జ్యోతిషదేశము | ప్రాగ్జ్యోతిషపురము | భగదత్తుఁడు | నరకాసురుని కుమారుఁడు. కౌరవ పక్షమునకు వచ్చి యర్జునునిచేఁ జచ్చెను. మహావీరుఁడు. ఇంద్రునకు మిత్రుఁడఁట! |

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
|---|---|---|---|---|
| 21 - | అంగ దేశము | చంపా నగరము | కర్ణుఁడు | పాండవులు మొదట నరణ్యముల<br>పాలైనపుడు "రాజపుర"మునఁ<br>జరిగిన స్వయంవరములో దుర్యో<br>ధను పక్షమునఁ గర్ణుఁడు జరా<br>సంధునితోఁ బోరి యాతని నోడించి<br>బహుమతిగ "మాలినీ" నగరముఁ<br>గొనెను. కుమారవిద్యా ప్రదర్శక<br>సమయమునఁ గర్ణ దర్జునితోఁ<br>బోరుటకుఁ గర్ణుఁడు రాజు కాఁ<br>డను నాక్షేపణమునుఁ గృపాచా<br>ర్యుఁడు చేయఁగా దుర్యోధనుఁడు<br>కర్ణున కంగరాజ్య మిచ్చెనని<br>యాదిపర్వమునఁ గలదు. కాని<br>యది యసత్యముగా గాన్పించు<br>చున్నది దుర్యోధనున కపుడెట్టి<br>యధికారమును రాజ్యమునలేదు.<br>ధర్మజునకు యువరాజ్యపట్టాభిషే<br>కము చేయుటచేఁ దనకెట్టి యధి<br>కారము లేదని దుర్యోధనుఁడు<br>విలపించినాఁడు. అట్టి దుర్యోధ<br>నునకు నంగరాజ్య మిచ్చుట కధి<br>కార మెట్లు కలిగినది? కాన జరా<br>సంధునిచేఁ గర్ణుడు బహుమతిగ<br>నొందినది యంగ రాజ్యభాగమ<br>గును. కర్ణుఁడు 'రోమపాదుఁడు'<br>అను నంగరాజుయొక్క వంశము<br>లోనివాఁడని భాగవతమునఁగలదు.<br>కాన అంగరాజ్యమాతనికి వంశప<br>రంపరగా వచ్చినదియే కాని దుర్యో<br>ధనదత్తముకాదు. కాని దుర్యోధన<br>సామ్రాజ్యమునకు లోఁబడిన |

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
|---|---|---|---|---|
| | | | | సామంతుడై యున్నాడు. ద్రోణుడు, కర్ణుడు, బాహ్లికుడు కురురాజ్యమునకు లోఁబడి "అహిచ్ఛత్ర, అంగ, బహ్లిక"రాజ్యముల నేలుచుండిన సామంత రాజులు. అందు వలననే దుర్యోధనునకు రారాజని పేరు కలిగెను. |
| 22 | పాండ్య దేశము | మణిపురము | మలయధ్వజుఁడు | ఈతఁడు పాండవ పక్షమునఁబోరి యశ్వత్థామచే యుద్ధమునఁ జచ్చెను. |
| 23 | కళింగ దేశము | రాజపురము | చిత్రాంగదుఁడు (యుద్ధ సమయమున శ్రుతాయువు) | ఈతఁడు దుర్యోధనుని మామ. వృద్ధుఁడగుటచే యుద్ధమునకు రాలేదు. కళింగ సైన్యములు మాత్రము వచ్చి ఘోరముగఁ గౌరవుల పక్షమునఁ బోరెను భీముఁడు శ్రుతాయువుం జంపెను. |
| 24 | సాళ్వ దేశము | సౌంభకపురి (మృత్తికావతము) | సాళ్వుఁడు | అంబవిషయమై భీష్మునకితనికిఁ బోరాటము కలిగినది. కృష్ణునిచే నీతఁడు చచ్చెను. సాత్యకి ధృష్టద్యుమ్నులచే జచ్చిన సాల్వుఁడు మ్లేచ్ఛదేశాధీశుఁడఁట! (అంబ కొఱకు భీష్మునితోఁ బోరిన సాల్వుఁడు మొదటివాఁడఁట! |
| 25 | ఉలూక దేశము | | క్షేమధ్వని | కౌరవపక్షమున వచ్చి భీమునిచేఁ జచ్చెను |
| 26 | కాంభోజ దేశము | | సుదక్షిణుఁడు | సైంధవవధము నాఁడర్జుననిచేఁ జచ్చెను. |
| 27 | అంబష్ఠ దేశము | | శ్రుతాయువు | డిటో |
| 28 | విదర్భ దేశము | కుండిన నగరము | రుక్మి | శ్రీకృష్ణు బావ, రుక్మిణియన్న. బలరామునకు నీతనికి వైరము |

| సంఖ్య | దేశము | రాజధాని | రాజు | విశేషములు |
| --- | --- | --- | --- | --- |
| | | | | కలదు. బలరాముఁ డేపక్షమునకు జేరనందున నీతఁడు నేపక్షమునకు రాలేదు. తటస్థుఁడై యుండెను. |

# కౌరవ, పాండవ పక్ష వీరులలో ముఖ్యుల పేరులు

### కౌరవ వీరులు

1. దుర్యోధనుఁడు
2. దుశ్శాసనుఁడు
3. కర్ణుఁడు
4. శకుని
5. సైంధవుఁడు
6. భీష్ముడు
7. ద్రోణుఁడు
8 కృపుఁడు
9. అశ్వత్థామ
10. కృతవర్మ
11. ఉలూకుఁడు
12. శల్యుఁడు
13 బాహ్లికుఁడు
14. సోమదత్తుఁడు
15. భూరిశ్రవస్సు
16. భగదత్తుఁడు
17. లక్ష్మణుఁడు (దుర్యోధనుని పుత్రుఁడు)
18. వృషసేనుఁడు
19. సుశర్మ
20. నీలుఁడు
21. బృహద్బలుఁడు
22. సాల్వుఁడు
23 శ్రుతాయువు (కాళింగుఁడు)
24. సుదక్షిణుఁడు
25. క్షేమధ్వని
26 విందుఁడు } అవంతి
27 అనువిందుఁడు } ప్రభువులు
28. శ్రుతాయువు (అంబష్ఠుఁడు)
29. జలసంధుఁడు (ఒక రాజు)
30. సుదర్శనుఁడు (మఱియొక రాజు)
31. అలంబసుఁడు
3 . హలాయుధుఁడు

### పాండవ వీరులు

1. ధర్మరాజు
2 భీముఁడు
3. అర్జునుఁడు
4 నకులుఁడు
5 సహదేవుఁడు
6 శ్రీకృష్ణుఁడు
7 ద్రుపదుఁడు
8. విరటుఁడు
9 శ్వేతుఁడు (విరటుని పుత్రుఁడు)
10 ఉత్తరుఁడు
11. ధృష్టద్యుమ్నుఁడు
12. శిఖండి

13. సాత్యకి
14. అభిమన్యుఁడు
15. ఘటోత్కచుఁడు
16. సహదేవుఁడు (జరాసంధ పుత్రుఁడు)
17. ధృష్టకేతుఁడు (శిశుపాల సుతుఁడు)
18. మలయధ్వజుఁడు (పాండ్యదేశ రాజు)
19. చేకితానుఁడు (యాదవుఁడు)
20 ఇలావంతుఁడు (అర్జునుని సుతుఁడు)
21. శైబ్యుడు (శిబిదేశ ప్రభువు)
22. జయత్సేనుఁడు, మఱియైదుగురు (కేకయులు)

23 ప్రతివింధ్యుఁడు
24. శ్రుతసోముఁడు
25 శ్రుతకీర్తి
26 శతానీకుఁడు
27. శ్రుతసేనుఁడు } ఉప పాండవులు

28. ఉత్తమౌజుఁడు
29 యుధామన్యుఁడు } అర్జునచక్ర రక్షకులు ద్రుపదు జ్ఞాతులు.

30 అంజనపర్వుఁడు (ఘటోత్కచ పుత్రుఁడు)
31. ధృష్టవర్మ (ధృష్టద్యుమ్న పుత్రుఁడు)
32. హిరణ్యవర్మ (దశార్ణదేశ ప్రభువు)

# మహాభారత చరిత్రానుబంధము

## పరిక్షిత్తు

కురుక్షేత్రయుద్ధమునఁ బాండవపంచకము కృష్ణసాత్యకులు కృపకృతవర్మాశ్వత్థామలు, సంజయుఁడు మాత్రమె జీవించిరి. పాండవులు వృద్ధులై తత్పుత్త్రులు వృద్ధులై యుండుటచేతను ద్రౌపదీసూను లవివాహితులై మృతినొందుటచేతను, పాండవవంశమున నభిమన్యుఁడు మాత్రమె వివాహితుఁడయి యాతనిపత్నియగు నుత్తర గర్భవతిగా నా యుత్తరాగర్భస్థుఁడె వంశవర్ధనుఁడు కావలసియుండెను. ఆ యుత్తర ప్రసవింపగాఁ బుత్రుఁడె పుట్టెను పుట్టినవెంటనే యాతఁడు మృత్యునిపలె నిశ్చేష్టుఁడుగానుండ నంతకుఁ బూర్వము (సౌప్తికవధానంతరము) అశ్వత్థామనుఁ బాండవులు పరాభవించుటచేతను, ఆ యశ్వత్థామ క్రోధోద్దీపితుఁడై వెడలిపోవుటచేతను, ఆ యశ్వత్థామ యేదేని మంత్రప్రయోగము (చిల్లంగి)చేసి యాశిశువును జంపియుండునని యంతఃపురములోని కుంతీ సుభద్రాదులు తలఁచి తత్కాలమున సన్నిధినున్న శ్రీకృష్ణుతో మొఱ్ఱ నిడియుండిరి. (పాండవాశ్వత్థామలు వివాదముపడునప్పుడు మీవంశము నిర్వంశము కాకుండునాయని స్వశిరోమణ్యపహరణాదిజనితక్రోధముచే నశ్వత్థామ పరుషముగాఁ బలికియుండెను. ఆ మాటను దలంచియే యశ్వత్థామ శిశువుం జంపెనని కుంత్యాదులు విలపించిరి) శిశువులకుఁగల రోగములను దయ్యములనుగాను ప్రయోగములనుగాను బాలగ్రహములనుగాను దృష్టిదోషములనుగాను, ఆ ప్రయోగములను దమ్ముచూచి యోర్వలేనివారె చేసినవిగాను భారతకాలమునుండి నేఁటివఱకు భారతీయులలోఁ బామరులే మొదలు పండితులవఱకుఁ దలంచుచుండుట యాచారమై యున్నది. అట్లు తలఁచువారలలో స్త్రీలే మొదటివారు. ఈ తలంపె కుంత్యాదులకుఁ గలిగినది బాలురకుగల్గిన పైప్రయోగాదులను వివిధరోగములనుగా 'చరకసుశ్రుతా'ది గ్రంథములు చెప్పిన యంశము నిదివఱకె సూచించితిని. పై బాలరోగములకు మంత్రతంత్రాదులును మన గ్రంథములలో లేకపోలేదు, అథర్వ సంహితలోఁ బెక్కులు ప్రయోగోప సంహారాదులు చెప్పఁబడియున్నవి. పామరులు తమ బిడ్డలకును దమకుఁగలిగిన రోగాదులకు మందుల నుపయోగింపక మంత్రతంత్రములకే ప్రథమ ప్రయత్నముచేసి నష్టపడుటయుఁ గలదు. రానురాను మూఢత్వ మిపుడు తగ్గుచున్నందులకు సంతసింపవలసియున్నది. కొన్ని వ్యక్తుల

యందుఁ గల్గురోగాదులకు మందులకంటె మంత్రములె యెక్కువ పనిచేయుటయుఁ గలదు. రోగమొకప్పుడు మనస్సన్యథామాఱినను మాఱును. అది వ్యక్తి ననుసరించియు రోగము ననుసరించియు నుండునని చరకాది గ్రంథములును గొన్ని తంత్రములు నంగీకరించుచున్నవి.

పరిక్షిత్తు శ్రీకృష్ణుని మంత్రతంత్రాదులచే సచేతనుఁడగుటచే నాతనికిఁ 'పరిక్షిత్ప్రాణసంధాత' యనుబిరుదముగల్గెనని యిదివఱకె చెప్పితిని. భారత భాగవతములలో "పరిక్షిత్తు, పరీక్షిత్తు" అని రెండు విధములుగా నాతనినామము పేర్కొనఁబడెను. కులము పరిక్షీణమైనపుడు పుట్టిన వాఁడుగాన పరిక్షిత్తయ్యెనని భారతమును, తనను గర్భమున రక్షించిన కృష్ణుని దాను భూమిపైఁబడగనే పరీక్షించుటచేఁ బరీక్షిత్తయ్యెనని భాగవతమును చెప్పుచున్నవి భాగవతములోఁ జెప్పినయంశము ప్రకృతి విరుద్ధముగా నున్నది.

ఐతరేయ బ్రాహ్మణము "పరిక్షి"చ్ఛబ్దము నింకొకరీతిని సమర్థింపుచున్నది. [1]"పరిక్షిత్తన నగ్ని. అగ్ని ప్రజలను జుట్టుకొనును లేక ప్రజలగ్నిం జుట్టికొందురు. (అట్లే పరిక్షిత్తగ్నివలెఁ బ్రజలఁ జుట్టి యోగక్షేమములం దెలిసికొనుచుండును. లేక ప్రజలు పరిక్షిత్తును జుట్టి యుందురు) మఱియుఁ బరిక్షిత్తన సంవత్సరము. సంవత్సరము ప్రజలందఱిపై వ్యాపించును లేక ప్రజలు సంవత్సరమును జుట్టుకొనియుందురు" (అట్లే పరిక్షిత్తు ప్రజలతో నవినాభావముగా మెలగుచుండును. ప్రజలు పరిక్షిత్తుతో నవినాభావులై సంచరించుచుందురు)

పరిక్షిచ్ఛబ్దమునకు నగ్నియను నర్థము నిఘంటువులలోఁ గలదు. సంవత్సరమను నర్థము కాన్పింపదు. ఇందుకై నిరుక్తమును శోధింపవలసియున్నది.

పరిక్షిత్తు దేశము మహా దుఃఖమగ్నమై యుండినపుడు జన్మించియున్నాఁడు. ఈతఁడు పుట్టిన స్వల్పకాలముననే ధర్మజుఁ డశ్వమేధ యాగము చేసియున్నాఁడు. ఆ మహా యాగముచే బ్రహ్మహత్యాది దోషములు పోయినఁ బోవుఁగాక. దిగ్విజయమునకై పోయిన యర్జుననిచేఁ బెక్కండ్రు సైనికులు మడియుటయు నర్జునునకు లోఁబడిన రాజులు పార్థునకిచ్చు కప్పములకై ప్రజలఁ బీడించుటయు నను నుపద్రవములు ప్రత్యక్షాప్రత్యక్షములుగా జరిగియున్నవి.

---

1. న్యూంఖః పాంక్షితిశ్శంస త్యగ్నిర్వై పరిక్షిద్ అగ్నిర్హీమాః ప్రజాః పరిక్షియం త్యగ్నింహీమాః ప్రజాః పరిక్షియంతి......సంవత్సరోవై పరిక్షిత్సంవత్సరో హీమాః ప్రజాః పరిక్షితి సంవత్సరం హీమాః ప్రజాః పరిక్షయంతి. -ఐతిరేయ బ్రాహ్మణ 6-6.

పరిక్షిత్తు పదునైదు లేక పదునెనిమిది యేండ్లవాఁడైనపుడు దుర్యోధనాదుల భార్యలు వ్యాసుని కపటోపాయముచేఁ బరిక్షిత్తు నెదుటనే గంగలోఁ బ్రవేశించి సంఘ మరణము నొందిరి. పిమ్మట నచిర కాలముననే కుంతి గాంధారీ ధృతరాష్ట్రులు దావాగ్నిలోఁబడి మడసిరను దారుణవార్త వినఁబడెను. మఱికొంత కాలమునకు మహాబలవంతులగు యాదవు లన్యోన్య కలహములచే మృతినొంది రను దుఃఖవార్త వీతెంచెను. ఆ వార్తతోఁ గూడఁ దమ కులమున కేడుగడ యగు శ్రీకృష్ణుఁడు వైకుంఠమున కేగెనను నుపద్రవ వార్తయే కాక పితామహుఁడగు విజయుఁడు బోయలచే నపజయము నొంది కష్టనంతఃపుర స్త్రీలను నపార ధనరాసులను గోలుపోయె నను మహా దుఃఖ వార్తలును వినఁబడెను.

అప్పటికిఁ బరిక్షిత్తునకు ముప్పదియాఱవ యేఁడు. ధర్మజుఁడు శ్రీకృష్ణుని నిర్యాణముచే నిస్సహాయుఁడై "ప్రాగ్జ్యోతిష మాగధ త్రిగర్తసింధు గాంధా"రాది దేశస్థులు కురుక్షేత్ర సంగ్రామమునం దమ వారికిఁ గలిగిన యన్యాయ మరణములకె కాక 'గోచుచుట్టుపై రోకఁటిపో'టను నట్లు అశ్వమేధ యాగపు నెపమునఁ దమ్ముఁ బీడించి యపారధనమును గప్పముగాఁ బుచ్చుకొనుటచేఁ గినిసి సమయమునకై వేచుచుందు రనుభయము ధర్మజునకుఁ గలిగి యుండును కృష్ణ నాలోచనా సహాయము కల్గుట చేతను బలవంతులగు యాదవులు బంధువులుగా నుండుట చేతను బైనుడివిన మాగధాదు లేమియుఁ జేయలేకుండిరనియు స్వబంధులగు మాత్స్యులు పాంచాలురు మూలముట్టగ నశించుటచే నన్యసహాయ మభావమయ్యె ననియు ధర్మజుఁడు తలఁచియుండును. దీనికి నిదర్శనముగా నంతకుఁ బూర్వమూరు పేరులేని కిరాతులే మహాబలవంతుడును ప్రఖ్యాతి గన్నవాఁడునగు విజయునిం జదుకఁగొట్టి యోడించుటచేతను,[1] స్వరాజ్యమునఁ బ్రజలు రాజ శాసనోల్లంఘనమునకుఁ గడంగునట్లుండుట చేతను, దాపి దేశమున నుండిన నేదైన దండయాత్ర చేసి పై నుడివిన మాగధాదులు తమ్ముఁ బదభ్రష్టులఁ జేతురనియే తమ వంశాంకురమగు పరిక్షిత్తునకుఁ బట్టముగట్టుమని రాజ్యమును యుయుత్సుని పరము చేసి కృపుని సంరక్షకునిగాఁ బరిక్షిత్తునకు నియమించి జంఘాబలముంజూపి త్రివిష్టపముం జేరిరి దీనికిఁ జిలువలుపలువలు పిమ్మటఁ జేర్పఁబడి యుండును.

స్వశత్రువు పలాయితుఁడైనం దద్వంశమునందును దద్దేశమునందును విరోధభావము భారతీయుల కుండకపోవుట స్వభావము మఱియు ధృతరాష్ట్ర పుత్రుఁడగు యుయుత్సుఁడు రాజప్రతినిధియగుటచేఁ బ్రజలలోఁ దృప్తియుఁ

1. హస్తిపురిలోఁ గొందఱు ప్రజలు నివేశనములకై హద్దుమీఱి సహదేవుఁడు చెప్పిన తీర్పు నతిక్రమించినట్లు మహా ప్రస్థానిక పర్వమునఁ గలదు.

గలిగెను. పరిక్షిత్తు యుయుత్సునివల్ల రాజనీతిని నేర్చి కృపునికడ నస్త్రశస్త్ర విద్యలు నేర్చి ప్రజారంజకముగాఁ బరిపాలించుటయేకాక యన్యులతో విరోధముఁ బెట్టుకొనకుండుటచే నితరులును బరిక్షిత్తును ద్వేషింపరైరి. దీనినిగూర్చి మహాభారతముననే యిట్లు కలదు:

[1]శ్రీమంతుఁడు మహాబలవంతుఁడు ధర్మమువలననే ధర్మముఁ దెలిసినవాఁడు నగు పరిక్షిత్తు ధర్మము మూర్తీభవించినట్లై భూదేవిని బాలించెను అతనిని ద్వేషించువారెవరును లేరైరి. అతఁడెవ్వరిని ద్వేషించలేదు. అతఁడు సర్వభూతములయందును బ్రజాపతివలె సముఁడయ్యెను. బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులు తమతమ కర్మములయందు మంచిమనస్సు కలవారై మెలఁగిరి. ఆ మహారాజు వితంతువులను అనాథలను అంగవైకల్యము గలవారిని దీనులను భరించెను. అతఁడు సర్వభూతములకు రెండవ చంద్రునివలె సుదర్శనుఁడయ్యెను. సంతోషింపఁబడిన పోషింపఁబడిన జనులు కలిగినట్టియు సత్యవాక్కులు కలిగినట్టియు దృఢపరాక్రముఁడైనట్టియు మహాకీర్తి మంతుఁడైనట్టి యామహారాజు సమస్త ప్రజలకుఁ బ్రియుఁడయ్యెను. అట్లా పరిక్షిన్మహారాజఱువదేండ్లు [2]పరిపాలనముఁ జేసెను.

---

1. శ్లో॥ ...ధర్మతో ధర్మవిద్రాజా ధర్మో విగ్రహవా నివ
   రరక్ష పృథివీందేవీం శ్రీమానతుల విక్రమః
   ద్వేష్టార స్తస్యనైవాసన్ సచద్వేష్టి నకంచన
   సమ స్సర్వేషు భూతేషు ప్రజాపతి రివాభవత్
   బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రాశ్చైవ స్వకర్మసు
   స్థితా స్సుమనసో రాజన్! తేనరాజ్ఞా స్వధిష్ఠితాః
   విధవాఽనాథనికలాన్ కృపణాంశ్చ బభార సః
   సుదర్శ స్సర్వభూతానా మాసీత్సోమ ఇవావరః
   తుష్టపుష్టజన శ్శ్రీమాన్ సత్యవా గ్గూఢవిక్రమః
   లోకస్య చైన సర్వస్య ప్రియఆసీ న్మహాయశాః
   ప్రజాఇమా స్తవపితా షష్టివర్షాణ్య పాలయత్. ఆదిపర్వ.
2. మహాభారత వ్యాఖ్యాత యగునీలకంఠా చార్యుఁడు 'షష్టివర్షాణ్య పాలయత్' అను వాక్యమునకు వ్యాఖ్యంజేయుచు పరిక్షిత్తు అఱువదేండ్ల వయస్సు వచ్చు వఱకే (అనఁగా ముప్పది యాఱవయేడున రాజ్యమునకు వచ్చి యిరువదినాలుగేండ్లే)పాలించెనని వ్రాసియున్నాఁడు. ఈ యంశము నింకను శోధింపవలయును.

ప్రజలను సర్వసమత్వముగా బాలించుటయేకాక వితంతువులను (ప్రాంగవులనాఁడు వారు గంగా ప్రవేశము చేయుంచిరట్లుకాక) పోషించుటయు ననాథలను గాపాడుట యను విశేషాంశముంచే జనసామాన్యము యొక్క భక్తికిఁ బరిక్షిత్తు పాత్రుడయ్యెనని చెప్పవలసి యున్నది సర్వప్రజా రంజకుఁడగు ప్రభువగుటచేతనె పరిక్షిత్తు ప్రజలు 'అగ్నిషోముల'తోను దేవునితోడను బోల్చి విశేషముగ వినుతించిరి. పరిక్షిత్తుఁగూర్చి మహాభారతమునవేకాక వైదికవాఙ్మయమగు "అధర్వసంహితలోను, ఐతరేయ బ్రాహ్మణములోను" గూడ నాతఁడు సత్ప్రభువనియే చెప్పఁబడి యున్నది. అధర్వసంహితలోని యంశము లెట్లుండెనో చూడుఁడు:

[1]ఓగాయకుఁడా! పశువులను భాగ్యమును సమకూర్పఁగల ఋక్కును బఠింపుము విలుకాఁడు విశిఖమును గుఱిపెట్టునటులు దేవతలకుఁ బ్రార్థనమును సిద్ధము చేయుము.

[2]పరిక్షిత్స్తవమును వినుఁడు. అతఁడందఱు ప్రజలకుఁ బ్రేమాస్పదుఁడగు రాజు మానవులకు భగవంతుఁ డగు నగ్నివలె నధికుఁడు.

[3]బీటలలోనుండి పండిన యవధాన్య మాకాశమునందలి వెలుఁగుకొఱకుఁ బైకిఁ బొడుచుకొని వచ్చుచున్నది. పరిక్షిత్తు పాలించుచున్న రాజ్యమునఁ బ్రజలు సుఖముగా వృద్ధినొందుచున్నారు.

[4]పరిక్షిత్తు సింహాసనమెక్కి మాకు క్షేమముఁ జేయుచున్నాఁడు (అని) గృహనిర్మాణముం జేసికొనుచు నొకకౌరవ్యుఁడు భార్యతో ననుచున్నాఁడు.

[5]పరిక్షిన్మహారాజుయొక్క రాజ్యమునందు భార్య భర్తను గూర్చి నీకేమి తెత్తును? పెరుగా? పాయసమా! మద్యమా! అని యడుగుచున్నది.

---

1. ప్రరేభరం భరస్వ గోవిదం వసువిదం దేవత్రేమాం వాచం కృణోమేవ
పీరో అస్తా।
2. రాజ్ఞో విశ్వజనస్య యోదేవో మర్త్యాఅతి వైశ్వానరస్య సుష్టుతిమా
శృణోతా పరిక్షితః॥
3. అభీవస్వః ప్రజాహితే యవః పక్వః పరోబిలం జనః సభద్రమేధతే
రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః।
4. పరిక్షిన్నః క్షేమమకర త్తన ఆసనమాచరన్ కులాయం కృణ్వాన్ కౌర
వ్యః పతిర్వదతి జాయయా
5. కతరత్తవ అహరాణి దధి మన్థం పరిస్రుతం జాయా పతిం విపృచ్ఛతి
రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః।

-అధర్వసంహిత. కా 20 సూ. 128 (కుంతాపసూక్తమ్.)

మహాభారతములోని పరిక్షిత్తుయొక్క యోగ్యమగు పరిపాలనా వర్ణన మును అధర్వసంహితలోని పరిక్షిత్త్సవ రూపకమగు వర్ణనము దృఢపఱచు చున్నది. మఱియుఁ బరిక్షిత్తును గూర్చి పై 'కుంతాపసూక్తము'నకు బ్రాహ్మణ మైన ఐతరేయ బ్రాహ్మణ వాక్యమునఁగూడఁ బరిక్షిత్తు నగ్నితోను సంవత్సరము తోను బోల్చి వర్ణించుటచేఁ బరిక్షిత్తు ప్రకారంజకముగా రాజ్యముఁ జేసినట్లు విశేషముగా స్పష్టమగుచున్నది. ఇంకనొక విశేషము కలదు. పై కుంతాప సూక్తపు ఋక్కులలో (4) కౌరవ్యుఁడొకఁడు గృహనిర్మాణము జేసికొనుచు భార్యతోఁ బరిక్షిత్తు సింహాసనమెక్కి మాకు క్షేమముఁ జేయుచున్నాఁడనుటచే ధర్మజునినాఁడు నా కష్టముల ననుభవించి దేశభ్రష్టులైన కౌరవులను దిరిగి హస్తి పురికి రప్పించి వారు గృహములఁ గట్టుకొని నివసించునట్లు చేసెనని తోఁచుచు న్నది. కాని కాలాంతరమున నాకౌరవులు రాజ్యమునఁ బరిక్షిత్తుతో నమానమగు గౌరవమునే పొందియున్నారని యీ క్రింది యైతరేయబ్రాహ్మణ వాక్యముచే నూహింపఁబడుచున్నది:

[1]"దేవతలే కల్యాణకర్మమును జేసిరో యది కారవ్యులచే (ప్రజలు) పొందుచున్నారు. యజమానులే కల్యాణకర్మమును జేసిరో యాకల్యాణకర్మ మును యజమానులు కారవ్యులచేఁబొందుచున్నారు."

అధర్వసంహితలోఁ గౌరవుఁడొకఁడు గృహముఁ గట్టుకొనుచున్నట్లు మాత్రమే అనఁగా నవీనముగా హస్తిపురిం జేరినట్లే చెప్పఁబడినది. ఐతరేయ బ్రాహ్మణమునఁ బై సూక్తమును బ్రాహ్మణించుటలోఁ గారవ్యులు దేవతలుచేసిన శుభకర్మముఁ జేయుచుండిరనియు యజమానులు కారవ్యులచేఁ దాము చేయు కర్మముఁ జేయించుకొను చుండిరనియుఁ జెప్పఁబడుటచే దుర్యోధనాదుల సంతతి వారు క్రమముగాఁ బరిక్షిద్రాజ్యమునఁ బ్రవేశించి ప్రధానోద్యోగపదముల నాక్ర మించిరని తోఁచుచున్నది.

మఱియొక విశేషము. "పరిక్షిత్, కారవ్య" శబ్దములను "న్యూంఖ"గాఁ జెప్పవలయునని యైతరేయ బ్రాహ్మణము చెప్పుచున్నది. [2]'న్యూంఖ'గాఁ

1. న్యూంఖః. కారవ్యాః శంసతి దేవావై యత్కించకల్యాణం కర్మాకుర్వం స్తత్కారవాంభిరవాప్నువం స్తథైవ తద్యజమానా యత్కించకల్యాణం కర్మాకుర్వం తి తత్కారవ్యాభిరాప్నువంతి.

-ఐతరేయబ్రాహ్మణ. అధ్యా. 30 ఖం. 6.

2. 'న్యూంఖ' యనఁగా షోడశోకారోచ్చారణమైన పిమ్మట పదము నుచ్చ రించుట యని "యజ్ఞకర్మణ్యజపన్యూంఖ సామాస్సు"అను పాణినిసూత్ర మునకుఁ గాశికాభాష్యటీకాకారుఁడగు 'హరదత్తుఁడు' తన పదమంజరీ

జెప్పుట నాఁటికాలమునఁ బ్రజభువులు వచ్చునపుడు యజ్ఞములలో వారిపేరికి ముందుచ్చరించు నొక గౌరవ స్వరప్రయోగము. ఆ న్యూంఖోద్చారణమును (కుంతాపసూక్తాంతర్గతమగు పారిక్షితి కారవ్యపదములను) "బ్రాహ్మణాచ్ఛంసి" యనుఋత్విక్కు చేయవలెనని యైతరేయ బ్రాహ్మణము చెప్పుచున్నది. అనఁగాఁ బరిక్షిత్తుకాలమున నాతనితో సమానముగాఁ గౌరవులు యజ్ఞాదులంజూడనేఁగినపు డాయజ్ఞములలో గౌరవించుచుండిరని స్పష్టమగుచున్నది. న్యూంఖోద్చారణ మిపు

టీకలో వ్రాసియున్నాఁడు. ఈ యంశముఁగూర్చి నాచే రచింపఁబడిన 'పరిక్షిత్తు' అను పుస్తకమున వివరించితిని. ఈ కుంతాపసూక్తములోని 'న్యూంఖోద్చారణమును' ఆంధ్రదేశస్థశ్రోతులు షడోకార యుక్తముగా నుచ్చరింతురు. అమరవ్యాఖ్యాతయగు 'లింగాభట్టు' తన వ్యాఖ్యలో న్యూంఖయన షడోకార పుంజమేయని చెప్పియున్నాఁడు. దీనిఁ గూర్చి యింకను శోధింపవలెను. మఱియొక విశేషము. అథర్వసంహితలోని 'కుంతాపసూక్తము' ఋక్సంహితనుండి గ్రహింపఁబడినదై యుండును. కావుననే ఋగ్వేద బ్రాహ్మణమగు నైతరేయమున దానికిఁ బ్రవేశము కలిగినది. ఇప్పటి ఋక్ (శాకల్య) సంహితలోఁ గుంతాప సూక్తము కాన రాదు. ఈ కుంతాపసూక్త మన్యమగు ఋక్శాఖలోనిదయి యుండును. నేఁడు కాన్పించు నథర్వసంహితయంతయు సాయనాచార్యులవారికి లభింప లేదు. అందువలననే సభాష్యకముగా 'హరినారాయణ ఆప్టే పండితుఁడు' పునాలో ముద్రించిన ప్రతిలోఁ గుంతాపసూక్తమునకు భాష్యము లేదు. సాయనాచార్యులు ఐతరేయ బ్రాహ్మణ భాష్యమున నీకుంతాపసూక్తము, 'ఖిల' సూక్తములోనిదని చెప్పియున్నారు. మఱియు నైతరేయబ్రాహ్మణ మునఁ గౌరవ్యశబ్దము "కారవ్య" అని చెప్పఁబడెను ఈ కారవశబ్దమున కర్థము 'ఇంద్రుఁడు' (కారుశబ్దోపేతాః కారవ్యాః కారు రింద్రః) అని విద్యారణ్యుఁ డర్థమును వ్రాసియున్నాఁడు. కాని నేఁడు "బర్లిన్, పునా, లాహోరు"లలో ముద్రింపఁబడిన యథర్వసంహితలోని కుంతాపసూక్త మునఁ గౌరవ్యశబ్దమే కలదు. ఐతరేయ బ్రాహ్మణమునాఁడు కౌరవ్య శబ్దముఁ గారవ్యయని యుచ్చరించిరేమో! మఱియుఁ గుంతాపసూక్తమున గౌరవ్యుఁడు గృహమునుగట్టుకొనుచున్నట్లున్నది. కారవ్యుఁ డింద్రుఁడైన నాతఁ డింటిని గట్టుకొనుచున్నాఁ డనుట యయుక్తముకాదా! కాన అథర్వ సంహితలోని కుంతాపసూక్తము సాయనునకు లభింపనందుననే యిట్లు కారవ్యశబ్దమున కింద్రుఁడను వేఱగునర్థముఁ జెప్పియున్నాఁడని తలంప వలసియున్నది.

డాంగ్ల ప్రభువులకుఁ జేయు "హిప్ హిప్ హురేవ్" అను నుత్సాహ వాక్యసమ మగును. పరిక్షిత్తుకాలమున దుర్యోధనుసిపుత్రుఁ డొకఁడుండినటులు గాన్పించును. కౌరవ్యుఁ డొకఁడు కలఁడని యథర్వసంహితలోఁ గలదు. ఆ కౌరవ్యునకుఁ గల గౌరవము పరిక్షిత్తుతో సమానముగా నుండెనని యైతరేయ బ్రాహ్మణము చెప్పుచున్నది. మరియుఁ 'భాస' మహాకవి నేఁటికి రెండువేలేండ్లనాడు రచించిన "ఊరుభంగ" నాటకమున దుర్యోధనుఁడు తొడలువిఱిగి పడినపుడు బాలుఁడైన "దుర్జయుఁడు" అను పుత్రుఁడు వచ్చి తండ్రితో సంభాషించినట్లు వ్రాసి యున్నాఁడు. ఆ బాలుని సుయోధన మరణానంతరము తల్లి పుట్టినింటివారు (కళింగ దేశపువారు) తమ దేశమునకుఁ దీసికొనిపోయి పెంచి పెద్దవానిఁగఁ జేసిరేమో! ఆ కౌరవ్యుఁడే యథర్వవేదమునఁ జెప్పఁబడినవాఁడై యుండునేమో! మఱియుఁ బాండవులు మహాప్రస్థానికమున కేఁగునపుడు ధర్మజుఁడు తన రాజ్యమునంతయు యుయుత్సుని పరముచేసి పరిక్షిత్తునకుఁ బట్టాభిషేకము చేయుమను టలోఁగూడ విశేషము కలదు ముప్పదియాఱేండ్ల వయస్సుకల పరిక్షిత్తునకే ధర్మజుఁడేల రాజ్యాభిషేకముఁజేయరాదు? ఇందును ధర్మజుని రాజనీతి నైపుణ్యము గాన్పించుచున్నది వైశ్యాపుత్రుఁడగు యుయుత్సునకు రాజ్యాభిషేకార్హతలేదు [1] కాన యుయుత్సుఁడు రాజ్యమును రాజప్రతినిధిగానుండి పాలించునే కాని రాజుగా నుండడు. తన కప్పనసేసిన రాజ్యమును బరిక్షిత్తునకు రాజ్యాభిషేకముఁజేసి దుర్యోధన పుత్రుని రప్పించి యాతనికిఁ బ్రాచీనపు కౌరవులకుఁగల గౌరవముల నొసంగునట్లు పరిక్షిత్తుచేఁ జేయించియుండును. అదియే యథర్వవేదోదితకౌరవ్యుని వాక్యము. పరిక్షిత్తుయొక్క యోగ్యతను గూర్చి 'శమీకముని' పరిక్షిత్తు ప్రపితామహుఁడగు పాండురాజువలె సుపరిపాలనముఁ జేయుచున్నాఁడని తన కుమారుఁడగు శృంగిమునితోఁ జెప్పియున్నాఁడు

శమీకుఁడు పరిక్షిత్తు పాలనమును పితామహుఁడగు ధర్మజుని పాలనముతోఁ బోల్పక పాండుని పాలనముతోఁ బోల్చుటకు హేతువేమి? ధర్మజుని పాలనమున దేశము నానాకష్టములను బొందినదనుటయేకాక, జ్ఞాతులనఁబడు కౌరవులకు బహుకష్టములఁ గలిగించెను పాండురాజు ధృతరాష్ట్రుఁ డంధుఁడై రాజ్యార్హుఁడు కాకుండినను దానా ధృతరాష్ట్రుని సింహాసన మెక్కించి యాతనికిఁ బెక్కు మర్యాదలఁగలుగఁ జేసి యుండె నియుఁ బరిక్షిత్తుకూడ నట్లే రాజ్యచ్యుతినొంది దేశభ్రష్టుఁడైన దుర్యోధనపుత్రుని దెచ్చి స్వసమానగౌరవముల నాతనికిఁ గలుగఁజేసి యుండెననియు శమీకుని వాక్యము స్పష్టపఱచుచున్నది.

---

1. శ్రుతిః "వైశ్యాపుత్రం నాభిషించేరన్"-కృష్ణయజుర్వేద.

[1]పరిక్షిత్తును కౌరవ్యునిఁ గూర్చి చెప్పిన వేదవాక్యములకు 'నారాశంసి' యను పేరు గలిగినట్లు ఐతరేయ బ్రాహ్మణమునఁ గలదు. 'నారాశంసి' యన నరులఁ గూర్చి చెప్పఁ బడునట్టిదని నిఘంటువు-లోను విద్యారణ్య భాష్యముననుఁ గలదు కాన నాఁటి వైదికబుధులు పరిక్షిత్తును, తదనుయాయుఁడగు కౌరవునిఁ విశేషముగా గౌరవించుచుండిరని స్పష్టమగుచున్నది. మొత్తమునకుఁ బరిక్షిత్తు రాజ్యము సర్వజనసుఖకరముగా నిరువదినాలుగేండ్లు ప్రవర్తించెను. (అఱువదేండ్లని కొందఱు) పరిక్షిత్తు "భద్రవతి" (మద్రవతి యని గ్రంథాంతరములలో గలదు.) యను నామెను బెండ్లియాడి యామెయందు "జనమేజయ, శ్రుతసేన, భీమసేన ఉగ్రసేను"లను నల్వురసుతులం బడసి సుఖంబుగ నుండెను.

మన భరతఖండమున నేరాజ్యమును జాలకాలము స్థిరస్థాయిగ నుండలేదు అందు కురురాజ్యము (ఢిల్లీప్రాంత రాజ్యము) తొందరలకు రాజుల మార్పునకుఁ బ్రసిద్ధికెక్కియున్నది. భరతఖండ చరిత్రముఁ జదివినచో హస్తిపుర ప్రాంతరాజ్యపు టల్లకల్లోలములె - తద్రాజ రాజ్యచ్యుతులె-తత్కారణమ్మున యావద్భరతఖండరాజ్య పరిణతులె-కాన్పించును పాండవులకు బ్రాచీనులగు 'సంవరణ శంతనుల' కాలమున రాజ్యసంక్షోభ రాజపరిణామములు కలిగినవి. పాండవులనాఁటి బీభత్సము జగద్విదితము పరిక్షిత్తునకుఁ బిమ్మటను "నిచక్షుని

---

1. అథర్వవేదోదిత పరిక్షిత్తు ఐతరేయ బ్రాహ్మణోదిత జనమేజయుఁడు పాండవుల పౌత్ర ప్రపౌత్రులని నేను వ్రాయఁగా శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వేదము పౌరుషేయమా? కాక వేదోదిత పరిక్షిజ్జనమేజయులు పాండవేయసంతతి కాదనియు జైమినియొక్క పూర్వమీమాంసలో వేదోదిత పురుషులు యజ్ఞాది క్రతువులం జేసిన రాజశ్రేష్ఠులనియు వ్రాసి యున్నాఁడనిరి. కృష్ణమూర్తిగారి వ్రాఁత అవ్యాప్తి దోషయుక్తముగా నున్నది. వేదమపౌరుషేయమైనచో నీ పరిక్షిదాదులు పాండవుల సంతతి వారు కాకుండినను, తత్పూర్వీకులైన నగుదురు గదా! వారు మాత్ర మెట్లు అపౌరుషేయ వేదములోఁ దూఱిరి? అపౌరుషేయ వేదమున నొక మనుష్యుని పేరెట్లు ప్రవేశించును? కాని కృష్ణమూర్తిశాస్త్రిగారి వ్రాఁత యపాస్తమగుచున్నది పరిక్షిన్నాములు పురాణములలో నల్వురు కలరు. (1) అవీక్షితుని పుత్రుడు, (2) అనశ్వుని పుత్రుడు, (3) సుశోభనయను మండూక కన్యకాభర్త. ఈతనికి శల, దలాదులు పుత్రులు. పై మువ్వురును పాండవేయ పరిక్షిత్తువలెఁ బ్రసిద్ధినొందినవారును యోగ్యులును గారు. కాన వైదికవాఙ్మయోదిత పరిక్షిత్తు పార్థపౌత్రుఁడే యైయున్నాఁడు.

నాఁడు, ఉదయనునినాఁడు" కురురాజ్యమున నుపద్రవములు కలిగినవి. 'మహంమదీయుల' నాఁటి ఢిల్లీరాజ్య బీభత్సములు జగద్విదితములు కదా!

పరిక్షిత్తు కాలమున యావద్భరతఖండ మెట్లుండెనో తెలియదు గాని, కురురాజ్యము మాత్రము సుపరిపాలితమై స్వారాజ్యముఁబోలె సుఖకరముగా నుండెను. పరిక్షిత్తుపాలనమునకు వచ్చునాటికి "సింధు కాశ్మీర గాంధార మద్ర బాహ్లిక" దేశప్రభువులగు "సైంధవపౌత్ర గోనంద (కాశ్మీరదేశప్రభువు. కురుసంగ్రామమునాఁటి కఁతడు బాలుఁడని హరివంశమునంగలదు) శకునిపౌత్ర శల్యపౌత్ర, బాహ్లికప్రపౌత్రులు" బాలురుగా నుండిరి. వీర్యవంతులగు సైనికులు కురుసంగ్రామమున నశించిరి. ఆ దేశములలో బాగుగఁ బాలించు రాజులు లేకుండిరి. అందువలన నాదేశములు 'అల్లకల్లోలముగా' నుండినట్లు కాన్పించును. కర్ణపర్వములోని కర్ణ శల్యుల సంవాదములో శల్యునిపాలనములోనున్న మద్ర బాహ్లికదేశములలోని సాంఘిక దురాచారములు, తత్రస్థ స్త్రీపురుష నైచ్యకృత్యములు వర్ణింపఁబడియున్నవి. అవి కురుసంగ్రామానంతరమున నచటనుండిన యకృత్యములే. పిమ్మట నేసౌతిచేతనో మూలభారతగాథలోఁ జేర్పఁబడియున్నవి. కర్ణుఁడు పంచనదీప్రాంత దేశములస్థితినే దూషించియున్నాఁడు ఆ పంచనదీ దేశము వేదములందు పవిత్రప్రదేశముగా నెన్నఁబడియున్నది. శల్య, శకుని బాహ్లిక భూరిశ్రవసులవంటి బలవంతులు, వేదోదితాచారపరులు పాలించుకాలమునం గర్ణుఁడు నుడివి రీతి నుండునా? శల్యాదు లట్టిదురాచారముల నణఁపరా? కాన కర్ణోదితవర్ణనములనఁబడునవి గురుసంగ్రామానంతరము ముప్పదియాఱేండ్లకుఁ బవిత్ర పంచనదీ దేశమునుండి బయలు వెడలిన కిరాతులే యర్జును నోడించి కృష్ణభార్యలం దోఁచుకొనిరి. అప్పటికాపంచనదీ ప్రాంతదేశము కిరాత సదృశ జనపరివృతమై పాండవ విరోధులు కలదై యున్నది.

## తక్షకుఁడు

పురాణములలో "కద్రూ కశ్యపులకు" శేష వాసుకి తక్షకాది సహస్ర నాగము లుద్భవించినటులు కలదు. వేదమునం దీక్రిందివారు సర్పముఖ్యులని కలదు:

[1]"తక్షకుఁడు, వైశాలేయుఁడు (విశాలయొక్క సుతుఁడు) ధృతరాష్ట్రుఁడు ఐరావతుఁడు"

అనువారు సర్పముఖ్యులని 'సర్పబలి'కర్మమునఁ జెప్పఁబడియున్నారు. ఆ వేదోదితుఁ డీతక్షకుఁడు కాఁడు. ఈతఁడు పాండవు లింద్రప్రస్థపురిని నిర్మించు

---

1. తక్షక వైశాలేయ ధృతరాష్ట్రైరావతస్తే జీవా స్త్వయి సద్భ్యో వర్షాభ్యోనః పరిదేహి...ఏకాగ్నికాండమంత్రపన్న.

నాఁటికి 'అశ్వసేన, శ్రుతసేనులను' నిరువురు పుత్రులతోడను, భార్యతోను ఖాండవ వనమున నివసింపుచు నపుడపుడు కురుక్షేత్రమునం గూడ నివసించు చుండువాఁడు. కృష్ణార్జునులు ఖాండవ వనమును దహించునాఁడీ తక్షకుఁడు రెండవ కుమారుఁడగు శ్రుతసేనునితోఁ గురుక్షేత్రముననుండుటచేఁ జావలేదు. తక్షకునిభార్య నర్జునుఁడు చంపెను. (ఆ స్త్రీ హత్యాదోషము నర్జునకెవరు నారోపింపలేదు.) అశ్వసేనుఁ డాపగ నెద నుంచుకొనియె కర్ణుం జేరి పిమ్మట నర్జునునిచేతఁ జచ్చెను. పిమ్మట తక్షకుఁడెచటికేగెనో శ్రుతసేనుఁడేమయ్యెనో తెలియదు. జనమేజయుని సహాధ్యాయుఁడగు 'ఉదంకుని' కుండలాపహరణ గాథలోఁ తక్షకుని పట్టణము దుర్గమమార్గములు కలదని వర్ణింపఁబడియున్నది. భూ వివరమునుండి యా పట్టణమున కేగవలసినదైనట్లు వర్ణింపఁబడెను. ప్రాచీనులు దుర్గములను శత్రువుల కభేద్యమగురీతిని వన పర్వతాదులలో నేర్పఱచికొను చుండిరి. కడచిన పదునెనిమిదవ శతాబ్దమునను అట్టి దుర్గములు పెక్కులుండెవి. బొబ్బిలికోట బొబ్బిలియుద్ధము జరుగుకాలమున వనదుర్గముగా నుండెనఁట! నేఁటికి ముప్పదియేండ్లకుముందు బ్రిటీషువారు "సోమలిలాండు" (ఆఫ్రికా)లో నిట్టి దుర్గములపైకే దాడి వెడలిరి.) తక్షకుఁడును బాండవులకు జడిసి కురుక్షేత్ర యుద్ధానంతరము దుర్బల పరిపాలనములో నుండిన పంచనదీప్రాంత ప్రదేశములోఁ గొంత దేశమును స్వాధీనపఱచికొని తక్షశిలానగరము నిర్మించి పరిపాలించియుండును. తక్షశిల యీ తక్షక నిర్మితమె. ఇపుడు తక్షశిలానగర శైథిల్యములను దొరతనమువారి భూగర్భ పరిశోధకులు శోధింపుచున్నారు. ఆ పట్టణము నేలమట్టమునకు లోపలనె యున్నదట! ఉదంకుని గాథలోని వర్ణనమున కీవర్ణనము సరిపోవుచున్నది. తక్షకుఁడు పాండవులు బలవంతులై యుండినంతకాలము జడిసి తలనెత్తలేదు. అర్జును నోడించిన బోయ లీతని సంబంధులై యుందురు. పాండవులు గతించిన పిమ్మటను గూడ యుయుత్సాదు లుండినంతకాలము తక్షకుఁడు తలయెత్తినట్లు కాన్పింపదు. మఱియు రాజ్యము లోని వారంచఱును బరిక్షిత్తుపై భక్తితత్పరులుగా నుండుటచేఁ గూడఁ దక్షఁకు డేమి సేయుటకును వీలుకలుగలేదు.

ఇట్లుండ, పరిక్షిత్తొకనాఁడు వేటకేఁగి యలసి దారితప్పి దప్పికతో 'శమీకమహర్షి' వివిక్తముగాఁ దపము సేయుచోటున కేఁగి నీరినడుగ సమాధి నిష్ఠాగరిష్ఠుఁడగు శమీకుఁడీయఁడయ్యె. అందులకుఁ బరిక్షిత్తు గినిసి రాజసముచే నచటనున్న మృతసర్పమును ధనుష్కోటినెత్తి శమీకుమెడను వైచి వెడలి పోయెను. శమీకుఁ డందులకేమియుఁ గోపింపక యూరకుండెను గాని క్రోధియు యువకుఁడు నగు శమీకుని పుత్రుఁడు 'శృంగి' ముని యీ వృత్తాంతమును విని

పరిక్షిత్తుపై నలిగి పాండవ జాతిపైఁ గోపముకల్గి తక్షకుఁ బరిక్షిత్తుం జంపఁ బ్రోత్సాహపఱచెను. శృంగి శాపముచేఁ దక్షకుడుఁ పరిక్షిత్తుం జంపెనని జనమేజయుడుఁ తలఁచియున్నాడు.[1] తక్షకుడు తన్నుఁ జంపునని పరిక్షిత్తునకుఁ దెలిసి ప్రాయోపవేశముఁ నొంది శ్రీశుకునివల్ల వేదాంతోపదేశము నందినట్లు భాగవతము నందలదు కాని మహాభారతమునం దానికి విరుద్ధముగాఁ బరిక్షిత్తు ప్రాణ సంరక్షణమునకై యతి జాగరూకతతో నుండినట్లు వర్ణింపఁబడియున్నది.

పరిక్షిత్తుం జంపుటకు శృంగి ప్రోత్సాహమునఁ దక్షకుఁడు వచ్చుచు విషవైద్యుడగు కశ్యపునకు లంచమిచ్చి మఱలించుట మొదలగు నంశములు భారత పాఠకులకు విశదమె తక్షకుఁడు మాయావేషములు గల నాగకుమారులచే విషమిశ్రఫలాదులను పరిక్షిత్తునకంప వానినాఁత డుపయోగించి అందులోని విషక్రిమి కఱవ మృతినొందినట్లును వెంటనె పరిక్షితుండిన మేడకూడ దగ్ధమై నటుల భారతమున నొకా స్థలమునను[2] పరిక్షిత్తుండిన మేడను బరిక్షిత్తును గూడఁ దక్షకుఁడు విషాగ్నిచే దహించినట్లు మఱియొక చోటునను గలదు. ఆ రెండవ యంశముఁ జూడుఁడు:

"ఆ కశ్యపుఁడను బ్రాహ్మణుఁడు పెక్కునపిమ్మటఁ దక్షకుఁడు మోసముతో సమీపించి నీకఁ దండ్రియు ధార్మికుఁడను రాజశ్రేష్ఠుడును మేడపై నుండిన వాఁడు నగు నా పరిక్షిన్మహారాజును బ్రాసాదమును విషాగ్నితో దగ్ధము చేసెను." (ఇది మంత్రులు జనమేజయునకుఁ జెప్పిన యంశం) తక్షకుఁడు పండ్లను విష పూరితములు గావించి వానిచేఁ బరిక్షిత్తుం జంపించియుండుట సత్యాంశమై యుండును చాణక్యుఁడు నవనందుం తండ్రిని విషఫలములచేతనే చంపినట్లు 'ముద్రారాక్షసమునఁ' గలదు. అట్లు విషప్రయోగములఁ జేయుట నాఁటివారిలోనె కాక రాజకీయపు విరోధములచే మహారాజులకును మహారాజపుత్రులకును విష ప్రయోగములఁ జేయువారీనాఁడును గలరని వినుచుందుము.

### జనమేజయుఁడు[3]

పాండవవంశ వర్ధనుఁడును భద్రవతీ పరిక్షిత్తునకుఁ బుత్రుఁడు నగు జనమేజయుఁడు, తండ్రి తక్షకవిషాగ్నిచే దగ్ధుఁడగునాఁటికిఁ దండ్రిని గుర్తెఱుఁగని బాలుఁడై యుండెనఁట!

---

1 ఆదిపర్వ: 3౦ అధ్యా

2 శ్లో ......తస్మిన్ ప్రతిగతే విప్రే ఛద్మనోపేత్య తక్షకః
తం నృపం నృపతిశ్రేష్ఠం ధార్మికం పితరం తవ
ప్రాసాదస్థం యత్తమపి దగ్ధవాన్ విషవహ్నినా -ఆదిపర్వ. 50 అధ్యా.

3 పాండవవంశ వర్ధనుఁ డగు జనమేజయుఁడుకాక మఱియైదుగురు జనమేజయులు పురాణేతిహాసాదులలోఁ గాన్పించుచున్నారు.

పరిక్షిత్తు మృతినొందిన వెంటనే పురోహితుఁడు పరిక్షిత్తునకు నంత్యకర్మ ముఁల జేసె ననియు మంత్రి సామంతాదులు జనమేజయుని సింహాసనమున నునిచి పట్టాభిషిక్తుం జేసి రనియు మంత్రులె కాశీదేశాధీశుఁడగు 'సువర్ణవర్మ' కడకేగి యాతనిపుత్రిక యగు 'వపుష్టమ'నడిగి యామెను జనమేజయునకు వివాహముచేసి రనియు జనమేజయుఁడు వపుష్టమయందు బద్ధానురాగుఁడై యన్యవనితాసక్తుఁడు గాక యామె తోడనె వనవిహారాదికము సల్పుచుండువాఁ డనియు, వపుష్టమయు జనమేజయ నానందవార్ధి నోలలాడించుచుండినదనియు ఆదిపర్వమున వర్ణింపఁబడియున్నది

ఆదిపర్వారంభమున జనమేజయుఁడు దీర్ఘసత్ర మొక్కటి చేయుచుండఁగ నాయజ్ఞశాలలోనికి [1]'సరమ' యను దేవతలకుక్కయొక్క పుత్రుఁడగు 'సార

---

1. దుష్యంతుఁడను చంద్రవంశపు రాజునకును 'లాక్షి' యను స్త్రీకి జన్మించినవాఁడు

2. కురుమహారాజు పుత్రుఁడు; తల్లి వాహిని యను నామె.

3 పూరుని పుత్రుఁడగు పరిక్షిత్తునకుఁ గౌసల్యాదేవికి జన్మించినవాఁడు. ఈతని భార్య సునంద. ఈతఁడు 'గార్గ్యుఁ'డను ఋషియొక్క పుత్రుం జంపి బ్రహ్మహత్యా దోషము నొందెను. స్త్రీహత్యగూడఁ జేసెను. ఆ పాపపరిహారమునకై "ఇంద్రోతుఁడు" అను శౌనకముని పుత్రుడు 'అధ్వర్యవముఁ' జేయగ నశ్వమేధయాగముఁ జేసెను. ఆ చరిత్రము విపులముగా భారతమున శాంత్యనుశాసనిక పర్వములలోను, హరివంశ బ్రహ్మాండ పురాణములలోనె కాక, 'శతపథబ్రాహ్మణము'నను వర్ణింపఁబడియున్నది

4 పార్వతీయపు రాజు. పాండవపక్షమునఁ బోరి దుర్యోధన సోదరుఁడగు దుర్ముఖునిచేఁ జచ్చెను.

5. ద్రుపదునిజ్ఞాతి పాండవపక్షమునఁ బోరి మృతినొందెను.

1 మంత్ర పన్నములందు బాలురకుఁ గలుగు రోగములలో "శ్వగ్రహము" (శునక రూపగ్రహము) గలదని తత్పరిహారక హోమాదులను జెప్పిన యంశములు కలవు ఆ మంత్రములలో సరమ యనుశుని ఆమె కుమారుఁడు సారమేయుఁడు (భారతములో జెప్పఁబడినవారు) మాత్రమేకాక, సరమ యొక్క భర్త 'రోహితుఁడు' అనియుఁ గలదు మఱి యాఋశునక గ్రహములును జెప్పఁబడినవి. "బాహ్వృచశాఖ" వారు సరమాసూక్తముం జపింతురని మంత్రపన్న భాష్యకర్తయగు హరదత్తుఁడు వ్రాసియున్నాఁడు. జనమేజయ సోదరులు సరమాపుత్రు నణఁచుట యన్నేమో! విజ్ఞులు పరిశీలింతురుగాక.

మేయ (దనుకుక్క రాఁగా జనమేజయునిసోదరు లగు 'శ్రుతసే'నాదు లాకుక్కను గొట్ట నాకుక్క యేడ్చుచుఁ దనతల్లి యగు 'సరమ'తో నావృత్తాంతముఁ జెప్ప నాదేవశుని జనమేజయుకడకు వచ్చి యనపరాధియగు నాపుత్రుం గొట్టుట యుక్తమా! ఇందువలన మీకదృష్టమగు భయము రాఁగలదని శపించి యంత ర్హిత యయ్యె నని కలదు. జనమేజయుఁడు దేవశునివాక్యముల కాశ్చర్యవిషా దముల నొంది తనకు దేవశునిశాపము తగలకుండఁగఁ దగు మంత్ర తంత్రముల నుపయోగించు పురోహితునకై వెదకుచు నొక వనమున 'శ్రుతశ్రవుఁ'డను వాని పుత్రుఁడు 'సోమశ్రవుఁ'డను వేదవేదాంగవేత్తను దగినవానిఁగ నాలోచించి శ్రుత శ్రవునితో నీకుమారుని నాకుఁ బురోహితుఁనిగా నిమ్మన, శ్రుతశ్రవుఁడు నాకు నాగకన్యయం దీసోమశ్రవుఁడు పుట్టె ననియు, ఈతని కే బ్రాహ్మణుఁ డేమి యడిగిన దానిని వెంటనే యిచ్చు నభ్యాసము కల దనియు, అట్లు సోమశ్రవుఁడు దాన మిచ్చుటకు నీ వోపినయెడల సోమశ్రవునిఁ బురోహితునిఁగా వరింప వచ్చుననియుఁ జెప్ప, నాతనిచే శాంతికి పౌష్టిక క్రియలం జేయుచుచుండియు తాను 'తక్షశిలా' దేశముపై దండయాత్రను జేసి జయించె ననియుఁ గలదు.

పిమ్మట ధౌమ్య ప్రశిష్యుఁడును వేదునిశిష్యుడును జనమేజయునకును.[1] పౌష్యుఁడను రాజునకును సహాధ్యాయుఁడు నగు 'ఉదంకుడు' తన గురుపత్నికి, పౌష్యునిభార్యయొక్క కుండలములను దెచ్చుటకుఁ బోయి తెచ్చునపుడు మార్గ మధ్యమునఁ దక్షకుఁడు మాయ చేసి యా కుండలముల నపహరింప నుదంకుఁడెట్లో కష్టపడి తక్షకునివలనఁ గుండలములను దిరిగిపొంది, గురుపత్నికిచ్చి గుర్వానతిచేఁ దపస్సుఁ జేసెననియు, కాని తక్షకుఁడు తనకు గల్గించిన యపకారమును మదిలో నుంచికొని జనమేజయుకడ కేగి మంత్రులతోఁ గూడిన జనమేజయునితోఁ దక్ష కుఁడు తనకుఁ గల్గించిన యపకారముఁ జెప్పి మఱియు, నీ తండ్రియగు పరి క్షిత్తు నా దుర్మార్గుఁడే చంపెను గాన తక్షకుని నాతని వంశస్థులం గూడ సర్ప యాగము చేసి నశింపఁజేయుమనియు జనమేజయునిం బురికొల్పి యాతనిచే నట్లు చేయుదు ననిపించుకొని యుదంకుఁడు తన యాశ్రమమున కేగెనని కలదు.

జనమేజయుఁడు మంత్రులతో నాలోచించి సర్వ సర్ప నాశకముగా సర్ప యాగముఁ జేయుచుండినపుడు పెక్కండ్రు "వాసుకి, తక్షక, ధృతరాష్ట్ర, ఐరా వత, కౌరవ్య" కుల సంభూతులగు నాగులు హోతచే నాహూతులై యజ్ఞకుండ

---

1. అశ్వమేధ పర్వమున నుదంకుడు 'సౌదాసుఁ'డను రాజు భార్య యగు 'మదయంతి'ని గుండలము లడుగఁ జనెనని కలదు. పౌష్యునకు సౌదా సుఁడను వేఱు పేరు కలదేమో. మదయంతీ సౌదాసుల కథ ఆదిపర్వము లోను గలదు. దానికి నశ్వమేధ పర్వగాథకుం గొంత పోలిక కలదు.

మునం బడి దగ్ధులైరఁట! అందు మడసిన ముక్కడి మూఁడు ప్రసిద్ధు లెనుఁ బదినల్వురై యుండిరి. తక్షకుఁడీయుప ద్రవముఁ జూచి భీత చేతస్కుఁడై స్వర్గ నముకేగి యింద్రుని శరణుఁ జొచ్చెనఁట! ఇంతలో 'వాసుకి' యను సర్పరాజు నకు సోదరి యగు 'జరత్కారు' యను నామెకు 'జరత్కారుఁ'డను మునివలనఁ బుట్టిన 'అస్తీకుఁడు' అను ముని వాసుకిచేఁ బ్రోత్సహింపఁబడి యాగమునకు వచ్చి జనమేజయుని దత్కృత యజ్ఞమును ఋత్విగ్గణమును విశేషముగా స్తోత్రము చేసి వారి మెప్పునొంది నీ కేమి కావలసిన దాని నిచ్చెదనని జనమేజయుచే నని పించుకొనెను. ఈలోఁగా 'హోతృ'చే నాహూతుఁడై యింద్రునిచేఁ ద్రోసివేయఁ బడిన తక్షకుఁ డంతరిక్ష మార్గము నుండి యగ్ని కుండమున భయభ్రాంతుఁడై పడఁబోవుచుండ నస్తీకుఁడాఁగుమాఁగుమని తక్షకునాఁపి రాజా! సర్వసర్పనాశక హేతు వగు నీ సర్పయాగము నాపి సర్పకులమును రక్షించుటయే నా కొసఁగ వలసినవరమని వేఁడఁగా ఋత్విక్కు లందఱును దానికి జనమేజయునిఁ బ్రోత్సాహపఱచి యజ్ఞమును ముగించునట్లు చేసిరి. రాజు యజ్ఞాంతమున ఋత్వి క్కులకుఁ దక్కిన వారికి భూరిదక్షిణల నిచ్చి యస్తీకుని గౌరవించి తాఁ జేయఁ బోవు 'అశ్వమేధయాగము'న కాతనిని రమ్మని కోరెను అతఁడట్లే వచ్చెదనని చెప్పి సర్పకులస్థుల మెప్పు నొందెను.

పిమ్మట జనమేజయుఁడు మంత్రి సామంతాదులతోఁ గూడి యుండ వ్యాస మహర్షి వైశంపాయనాది శిష్య వర్గముతోఁ గూడి జనమేజయుకడకు వచ్చి యాత నిచే సత్కృతుల నొంది, 'ప్రస్తావ' వశమున జనమేజయుఁడు భారతగాథ నడుగఁ దన శిష్యుఁడగు వైశంపాయనుని భారతగాథ నా జనమేజయునకుఁ జెప్ప నియమించెను. ఆ జనమేజయునకు వైశంపాయనుఁడు 'సాంతముగా' భారత గాథను జెప్పిన పిమ్మట జనమేజయుఁడు[1] తక్షతశిలా నగరమునుండి హస్తి

1. ఆదిపర్వమున సుదంకుఁడు హస్తిపురికే వచ్చి జనమేజయునకుఁ దక్షకు నిపైఁ గోపము గల్గించు రీతిని సంభాషించి యాతనిని సర్పయాగోన్ముఖుం జేసినట్లు కొన్ని భారత ప్రతులలోఁ గలదు. మఱికొన్ని ప్రతులలోను నన్నయభట్టు పాఠమునను ఉదంకుఁడు జనమేజయుకడ కేఁగి సర్పయా గోన్ముఖుం జేసిన స్థలమిది యది యని కాన్పింపదు కాని యన్ని ప్రతుల లోను సర్పయాగ పరిసమాప్తి 'తక్షశిలా' నగరముననే యైనట్లు స్వర్గా రోహణ పర్యాంతమునఁ గలదు అన్ని ప్రతులలోను ఆదిపర్వముయొక్క మూడవయధ్యాయమున జనమేయుఁడుడు తక్షశిలాదేశముఁ జయించుట కేఁగినట్లె కాని హస్తిపురికిఁదిరిగివచ్చినట్లు కాన్పింపదు కానసర్పయాగము తక్షశిలా దేశముననే జరిగినట్లు స్పష్టమగుచున్నది. హరివంశ మునను.

పురికి వచ్చి సుఖముగా నుండెను. ఇంత మాత్రమె భారతమున జనమేజయునకు సంబంధించిన యంశములు కలవు. పైగాథ సారాంశము నాలోచింప జనమేజయుఁడు పరిక్షిత్తు మృతినొందిన పిమ్మటను 'ధౌమ్యుని' 'వేదుఁడు' అను ఋషి దగ్గఱ 'ఉదంకుఁ'డను బ్రాహ్మణునితోడను 'పౌష్యుఁ'డను నాకరాజుతోడను గూడి విద్యలను నేర్చి పిమ్మట హస్తిపురిరాజ్యము నేలుచు 'సువర్ణవర్మ' యను కాశీరాజపుత్రిక యగు 'వపుష్టమ'ను బెండ్లియాడి ధర్మకార్యములం జేయుచుఁ దండ్రిని జంపిన తక్షకునిరాజ్యమగు 'తక్షశిలా' రాజ్యముపై దండయాత్రం జేసి దానిని జయించియుండెనని తోఁచును. జనమేజయుఁడు దండయాత్రను జేయుటకుఁ గారణము తక్షశిలాప్రాంతపు నాగకులజులు (వీరే యర్జునుని జయించిన కిరాతకులు) దేశము నల్లకల్లోలము చేసి యవినీతిపరులుగా నుండుటచేఁ దన దేశమునకు సమీపమునజరుగు నాయల్లరులచే స్వదేశమున కుపద్రవము రాకుండఁ జేయవలయు ననుతలంపుచేతనే యైయుండును.

తక్షశిలను జయించిన సంగతిని జనమేజయుని సహాధ్యాయుఁడును 'తక్షకుని' వలన నంతకుఁ బూర్వము బాధనొందినవాఁడు నగు 'నుదంకుఁడు' విని యిదియే సమయమనుకొని పరిక్షిత్తుం దక్షకుఁడు విషప్రయోగముచేఁ జంపుట, తమ గురుపత్నికిఁ దాను దక్షిణగాఁ దెచ్చుచున్న కుండలములను దక్షకుఁ డపహరించి తన్నుఁ జిక్కులుపెట్టుట మొదలగు నంశములం జెప్పి విజితులగు నాగులపైఁ గోపముఁ గలిగించి యాతనిని సర్పయాగోన్ముఖుం జేసి వెడలిపోయి యుండును సర్పయాగము వేదోక్తము కాదు, పురాణోక్తమని మహాభారతము ననే చెప్పబడినది.

| | |
|---|---|
| ఆ సర్పయాగమునందు వాసుకి వంశస్థులు పదునైదుగురు | (15) |
| తక్షకకులసంభూతులు పదునేడుగురు | (17) |
| ధృతరాష్ట్ర(కద్రూపుత్రుఁడు) కులజులు ముప్పది నల్వురు | (34) |
| ఐరావత కులజులు పదుండ్రు | (10) |
| కౌరవ్యకులజులు పదుండ్రు | (10) |
| మొత్తమెనుబదియార్వురు | 86 |

నాగముఖ్యులు బంధింపఁబడి యగ్నిగుండములోఁ ద్రోయఁబడి దారుణ మరణములపాలు చేయఁబడిరి.

ఇంకను బెక్కండ్రు నాగులు చంపఁబడియున్నారు. తక్షకుఁడీ భయంకరవార్త విని స్వర్గమున కేగెను. (మృతినొందియుండును.) తక్షకుఁడు మోస

సర్పయాగానంతము భారతగాథను విని హస్తిపురికి వచ్చినట్లే కలదు గాన సర్పసత్రము తక్షశిలలోనె జరిగియుండుట స్పష్టము.

గాఁడె కాని ధైర్యశాలియు బరాక్రమవంతుఁడునుగాఁ గూడఁ గాన్పింపఁడు. అర్జునుఁడు తన భార్యను గుమారుని జంపినను నాతని నేమియుఁ దక్షకుఁడు సేయలేదు. పరిక్షిత్తుని మాయచేఁ జంపించెనె కాని ప్రత్యక్షముగాఁ జంపలేదు. ఉదంకుని మోసముచేసియె కుండలముల నపహరింపఁగా నుదంకుఁడు తక్షకునిపురిని జేరి యగ్నిం దరికొల్పఁ దక్షకుఁడు భీతుఁడై కుండలములం దెచ్చి యుదంకున కిచ్చెను. పుష్యుని భార్య యుదంకునితోఁ దక్షకుండు కుండలముల నపహరించును జుమా యని ముందుగనె జాగ్రత్త సెప్పియున్నది. అనఁగా దక్షకుఁడు దొంగయై దారులఁగొట్టువాఁడుగా నాఁడుండె నని తలఁపవలసియున్నది.

కుండలాపహరణగాథ 'అశ్వమేధపర్వము'నను గలదు. ఉదంకుని నుండి కుండలము లపహరించినవాఁడు తక్షకుఁడుగాక ఐరావతుఁడను నాగముఖ్యుని పుత్రుఁడని యచటఁ జెప్పఁబడెను. ఎట్లయినను దక్షకుఁడు నాతనిసంబంధులు మోసగాండ్రు దొంగలునై నాఁడు వర్తించుచుండి రనియు, ఇపుడును భరతఖండముయొక్క పశ్చిమోత్తరపుపరగణాలలో నుండిన దారిదోఁపుడుగాండ్రవలె 'చైనా'దేశములోని దొంగల గుంపువలె నాఁడు నాగులుండి రనియుఁ దోఁచుచున్నది. జనమేజయుని కాలమున దారిదోఁపుడుగాండ్రు విస్తారముండిరనియు 'ఋత్విఙ్నిర్ణయ' విధిని జెప్పుచు 'ఐతరేయబ్రాహ్మణమున' పరిక్షిత్తనయుఁడగు జనమేజయుఁడు చెప్పినవాక్యమె కలదు. దానిని గ్రింద వివరించుచున్నాఁడను:

"[1]అవిద్వాంసులగు ఋత్విక్కులు యజమానుఁడగు క్షత్రియుని 'అభిషేక' విధానముం దెలియక, 'నిషాదులు, దొంగలు, పాపాత్ములు' ఎట్లు విత్తవంతుఁడగు పురుషు నరణ్యమధ్యమునం బట్టుకొని ధనము నపహరించి యాపురుషుని గోఁతిని(లేక యంధకూపమునం) ద్రోచి పరుగెత్తుదురో యట్లు యజమానుని ధనాపహరణము(దక్షిణా రూపమున) మాత్రముచేసి యాతనిని నరకరూప మగు గోఁతిలోఁ ద్రోయుచున్నారు."

---

1 అథహ తం వ్యేవ కర్షంతే యథాహవా ఇదం నిషాదావా సెలగావా పాపకృతోవా విత్తవంతం పురుష మరణ్యే గృహీత్వా కర్త మన్వస్య విత్తమాదాయ ద్రవం త్యేవమేవ త ఋత్విజో యజమానం కర్త మన్వస్య విత్తమాదాయ ద్రవంతి యమనేవం విదోయాజయం త్యేతద్ధస్మవై తద్విద్వానాహ జనమేజయః పరిక్షిత ఏవం విదం హివై మామేవం విదో యాజయంతి. తస్మా దహం జయా మ్యభీత్వారీం సేనాం జయామ్యభీత్వార్యా సేనయా నమాదివ్యా నమానుష్య ఇషవ ఋచ్ఛం త్యేష్యామి. సర్వమాయుః సర్వభూమి ర్భవిష్యామీతి.

-ఐతరేయబ్రాహ్మ, అధ్యా. 37, ఖం. 7.

ఈ యంశమును దెలిసిన విద్వాంసుఁడగు పరిక్షిత్తుపుత్త్రుఁడగు జనమేజయుఁడు సభామధ్యమున నిట్లనుచున్నాఁడు: "ఈ యంశమునాపుఁ దెలియుటచే విద్వాంసులగు యాజకులే నాచేఁ గర్మముఁ జేయించుచున్నారు. అందువలన నేను మంచిసేనతో శత్రువులయొక్క మంచి సైన్యమును జయించితిని. దేవ మనుష్య సంబంధములగు బాణములు నా కేమియు బాధ గలుగఁజేయలేదు. నేనిందువల్ల పూర్ణాయువు నొంది భూమండలము నంతయు నొందగలను."

తక్షకుఁడు చేసిన కుండలాపహరణమెకాక పరిక్షిత్తునకు విషముఁ బెట్టి చంపుటయు దొంగపనియే. జనమేజయుఁ డట్టిచోరజాతి నణఁచి దేశము సుపరిపాలిత మగునట్లు చేసెను.

పరిక్షిత్తు మతినొందిన పిమ్మట నెంతకాలమొకాని జనమేజయుఁడు హస్తిపురిలో నుండక, 'వేదు'ని యాశ్రమమున విద్యాభ్యాసముఁ జేసెనని చెప్పితిని. జనమేజయుని గురుపరంపర యిట్లున్నది:

- [1]ధౌమ్యుఁడు
  - వేదుఁడు
    - ఉదంకుఁడు
    - జనమేజయుడు
    - పౌష్యుఁడు
  - [2]ఉద్దాలకుఁడు (అరుణి)
    - శ్వేతకేతువు
    - యాజ్ఞవల్క్యుఁడు
      - కణ్వుఁడు
        - బోధాయనుఁడు
      - అయస్థూణుఁడు (జనకుడు)
      - శతానీకుఁడు (జనమేజయుని సుతుఁడు)

---

1\. ఈ ధౌమ్యుఁడు పాండవ పురోహితుఁడు. పాండవులు మహాప్రస్థానికమున కేఁగునపుడు విస్తార ధన మీతనికిచ్చిరని కలదు. పిమ్మట శిష్యులచే వ్యవసాయముఁ జేయించుచు వారిని గష్టపెట్టుచుండెనఁట. అరుణుని పుత్త్రుఁడగు నుద్దాలకుడు యాజ్ఞవల్క్యుని గురువని శతపథ బ్రాహ్మణమునఁ గలదు. శుక్లయజుస్సులనే యుద్దాలకుఁడు యాజ్ఞవల్క్యునకుఁ జెప్పినట్లు బృహదారణ్యకోపనిషత్తునను స్పష్టముగా నున్నది. ఆ యంశము ముందు వ్రాయఁబడును.

జనమేజయుఁ డేల హస్తి పురిలో విద్యను నేర్వలేదు? గురుకుల వాసము చేయవలసిన యవసర మేలకలిగెను? పరిక్షిత్తు మృతినొందిన పిమ్మటను జనమేజయుఁ డజ్ఞాతవాసమున విద్యను నేర్చియుండునా? పుష్యుఁడు (సౌదాసుఁడు) అను రాజుకూడ నజ్ఞాతవాసముఁ జేయునా? సౌదాసునిగాథలోఁ గూడ నతఁ డెద్దియో కారణమున నజ్ఞాతవాసమున నుండినట్లు కాన్పించును. ద్రుపదుని తండ్రి యగు 'పృషతుఁడు' ఉగ్రాయుధుఁ డను రాజుచేఁ బదభ్రష్టుఁడై వనాశ్రమముననే ద్రుపదుం గని యాతఁ డచటనె విద్యకఱపినట్లు చేసియున్నాఁడు. అట్లె జనమేజయుఁడును బరిక్షిత్తుమృతినొందినపిమ్మట నజ్ఞాతవాసము చేయవలసివచ్చెనేమో!

## అశ్వమేధము

బ్రహ్మహత్యాది దోషనివృత్తికొఱకు ప్రాచీన భారతీయ ప్రభువు లశ్వమేధయాగములఁ జేయుచుండిరి. 'ఐతరేయ, శతపథ' బ్రాహ్మణములలో నశ్వమేధముఁ జేసిన సమ్రాట్టుల నామము లుదాహరింపబడిన యంశము నిదివఱకె (119 పుటలో) చెప్పియున్నాను ఆ యశ్వమేధ కర్తలలో నీ జనమేజయుఁడె ముఖ్యుఁడు. ఈ జనమే జయుఁ డశ్వమేధయాగముఁ జేసినట్లు మహాభారతమున లేదు కాని సర్పయాగమునకు వచ్చిన 'ఆస్తీకుని' తాఁ జేయఁబోవు వాజిమేధమునకు రావలయు నని కోరినట్లున్నది. 'విష్ణు, శ్రీమద్భాగవత'పురాణములు రెండును బరిక్షిత్పుత్రుఁడగు జనమేజయుఁడు కావషేయుఁడు పురోహితుఁడుగా నశ్వమేధముఁ జేసినట్లు చెప్పినవి. హరివంశమున జనమేజయుఁడు వాజిమేధముఁ జేయునపుడు పట్టమహిషి యగు 'వపుష్టమ' అశ్వమును సేవింపుచుండఁగా[1] ఆ యశ్వము కదలినట్లును, అట్లు కదలుట దోషము గాన జనమేజయుఁడు ఋత్విక్కులపైఁ గినిసి (వారశ్వమును సరిగా విశసింపలేదని) ఆ ఋత్విక్కులను దన దేశము నుండి యన్య దేశమునకుఁ దొలఁగిపొండని యాజ్ఞాపించి తన భార్య యగు వపుష్టమను గుఱ్ఱము కదలుటచే నీ శీలము చెడినది గాన నీవు నా భార్యగా నుండ నర్హురాలవు కావని స్త్రీలనడుమను నిందింపుచుండ 'విశ్వావసుఁడు' అను గంధర్వరాజు వచ్చి గుఱ్ఱము కదలుటకు ఋత్విక్కులు కాని, యీ వపుష్టమ కాని దోషులు కారనియు దేవేంద్రుఁడు నీవుచేయు యజ్ఞముఁజూచి సహింపక గుఱ్ఱములో ప్రవేశించి కదలె ననియుఁ జెప్పి జనమేజయుని సమాధానపఱప జనమేజయుఁ డలిగి వాజిమేధముఁ జేయువారిలో నేనె కడపటివాఁడ నగుదునుగాక! నేఁడు మొద

1. మత సాంఘిక సంస్కారములగూర్చి వ్రాయునపు డీయంశము వ్రాయఁగలను.

లేరాజును నశ్వమేధముఁ జేసి యింద్రున కాహూతు లీయకపోవుఁగాక యని శపించి[1] తక్కిన క్రతుతంత్రమును నిర్వర్తించె ననియుఁ గలదు.

మత్స్యపురాణములో నీక్రిందియంశములు కలవు.

[2] "పరిక్షిత్తు కొమరుఁడగు జనమేజయుఁడు యజ్ఞమునందు 'వాజసనేయుని' (శుక్లయజుర్వేద ప్రవర్తకుఁడగు యాజ్ఞవల్క్యుని) బ్రహ్మనుగాఁ జేసికొనెను. ఆ వాజసనేయుని వైశంపాయనుఁడు (భారతమును జనమేజయునకుఁ జెప్పిన వ్యాసశిష్యుఁడు) 'ఓ దుర్బుద్ధీ! నీ వాక్కు (నీవు చదివిన చదువు) నీపీ భూమిలో నుండు నంతకాలమె యుండి పిమ్మట నశించునుఁగాక' యని శపించెనఁట! అట్టి

1. జనమేజయుఁడు శపించెనేకాని యశ్వమేధ యాగములం జేసినవారు కలియుగమునం బెక్కంద్రు కలరు. మౌర్యరాజ్య ధ్వంసకుడగు 'పుష్యమిత్రుడు' చాళుక్య వంశములోని మొదటి 'పులకేశి' విష్ణుకుండిన ప్రభువగు 'మాధవవర్మ' (ఈతఁడు పదునొకం డశ్వమేధయాగములఁ జేసినట్లాతని 'పాలమూరు' శాసనమునఁ గలదు.) అశ్వమేధములఁ జేసినవారే. మనకుఁ దెలిసినంత వఱకుఁ గడపటి యశ్వమేధము 'కనోజా' దేశపు రాజగు జయచంద్రునిది. ఈతఁడు విడిచిన యశ్వమును 'పృథ్వీరాజు' బంధించి యజ్ఞమునకు విఘ్నముఁ గలుగఁజేసెనఁట.

2. శ్లో॥ జనమేజయః పరిక్షిత్తః పుత్రః పరమధార్మికః
బ్రహ్మాణం కారయామాస మఖే వాజస నేయకం
స వైశంపాయ నేనైవ శప్తఃకిల మహర్షిణా
నష్టాస్యతీహ దుర్బుద్ధే తవైవ వచనం భువి
యావత్స్థాస్యసిలోకేత్వం తావదేవ ప్రవత్స్యతి!
క్షత్రస్య విజయం జ్ఞాత్వా తతఃప్రభృతిసర్వశః
అభిగమ్యస్థితశ్చైవం నృపంచ జనమేజయం
తతఃప్రభృతి శాపేన క్షత్రియస్యతు యాజినః
క్షత్రస్య యాజినఃకేచి చ్ఛాపాత్తస్య మహాత్మనః
పౌర్ణమా సేవహవిషా ఈజే తస్మిన్ ప్రజాపతిం
సవైశంపాయనేనైవ పవిశన్ వారిత స్తతః
పరిక్షిత స్సుతస్సోవై పౌరవో జనమేజయః
ద్విరశ్వమేధ మాహృత్య మహావాజసనేయకః
ప్రవర్తయిత్వా తత్సర్వ మృషిర్వాజసనేయకం,
వివాదే బ్రహ్మణాసార్థ మభిశప్తో వనంయయౌ.

-మత్స్యపురాణ. అధ్యా. ౕ౦.

వాజసనేయునె బ్రహ్మనుగాఁ జేసికొని జనమేజయుఁడు ధీరుఁడై యాగమును నిర్వర్తించుటచే నదిమొదలు కొందఱు జనమేజయుని బొందియుండిరి. (జనమేజయునివలె వాజసనేయ శాఖలోఁ జేరిరనియు నది మొదలు కృష్ణయజుశ్శాఖను విడిచి పాండవ వంశస్థులు శుక్ల యజుశ్శాఖవారైరనియు వ్యాఖ్యాత యభిప్రాయము) వాజసనేయకుఁడు 'పౌర్ణమాసేష్టి' జనమేజయునిచేఁ జేయించుచుండఁగ వైశంపాయనుఁడు ప్రవేశించి జనమేజయు నాటంకపఱచెను. వాజసనేయకుఁడగు జనమేజయునిచే మహావాజసనేయకుఁడు (కవషుని పుత్రుఁడగు 'తురుడు') రెండశ్వమేధములం జేయించెను ఆ యాగమున బ్రహ్మతో వివాదము నొంది యా బ్రహ్మచే శాపము నొంది (తురుఁడు కావచ్చును) వనమున కేగెను."

పై యంశముల నాలోచింప జనమేజయుఁడు తనకు భారతముఁ జెప్పిన వైశంపాయన శిష్యుఁడును వైశంపాయనుచే నీ విద్య స్థిరముగా నుండకపోవుఁగాక యని శాపము నొందినవాఁడు నగు యాజ్ఞవల్క్యుని పౌర్ణమాసేష్టి యను యజ్ఞమున బ్రహ్మను (యజ్ఞములో నొక ప్రధాన ఋత్విక్కు)గాఁ జేసికొనె ననియు, వైశంపాయనుఁ డాయజ్ఞము నట్లు నిర్వర్తింపరాదని యాటంకపఱచినను జనమేజయుఁడు వైశంపాయనుని మాట నతిక్రమించి యజ్ఞముంజేయుటయే కాక తాను శుక్లయజుశ్శాఖలోఁ బ్రవేశించెననియు మఱికొందఱు క్షత్రియులు నట్లే శుక్లయజుశ్శాఖవారై రనియుఁ బిమ్మట జనమేజయుఁడు మహావాజసనేయుఁడగు 'తురుని' అధ్వర్యునిగాఁ జేసికొని రెండశ్వమేధయాగములం జేసె ననియు 'తురుఁడు' బ్రహ్మతో (యాజ్ఞవల్క్యుతో) వివాదము నొంది యాతనిచే శప్తుఁడై వనమున కేగెననియుఁ దెలియనగుచున్నది. వాజసనేయుఁడు, వైశంపాయనునిచే నభిశప్తుఁడనుటచే వాజసనేయ శాఖా ప్రవర్తకుఁడగు యాజ్ఞవల్క్యుఁడే యని 'విష్ణు, భాగవతాది, పురాణగాథలలోఁగల యాజ్ఞవల్క్య చరిత్రముచే నూహింపఁబడుచున్నది గాని 'కవషుని పుత్రుఁడగు తురుఁడు' అను నంశము గోచరింపదు. 'మహావాజస నేయకుఁడు' అను పదముచే 'తురుఁడె' అశ్వమేధముఁ జేయించె ననుట నిశ్చయము. కవషుని పుత్రుఁడగు తురుఁడు యాజ్ఞవల్క్యాదులు ప్రవర్తింపఁజేసిన శుక్లయజుశ్శాఖకుఁగాక వేఱొక శుక్ల యజుశ్శాఖలోఁ బ్రథమాచార్యుఁడని బృహదారణ్యకోపనిషత్తునం గలదు. చూడుఁడు:

1"సమానముఁ దనువాఁడు సాంజీవీపుత్రుని వలనను సాంజీవి పుత్రుఁడు మాండూకాయనునివల్లను... రాజస్తంబాయనుఁడు కావషేయుఁడగు తురుని

1. సమానమా సంజీవీపుత్రా త్సాంజీవీపుత్రః మాండూకాయనేః ......... ...రాజస్తంబాయనస్తు రాత్కావషేయాత్ తురఃకావషేయః ప్రజాపతేః ప్రజాపతి ర్బ్రహ్మ బ్రహ్మ స్వయంభు. బృహదారణ్యకోపనిషత్: 8-5-4.

వలనను కవషుని పుత్రుఁడగు తురుఁడు ప్రజాపతివలనను ప్రజాపతి బ్రహ్మ వలనను (శుక్లయజస్సనెడి) వేదము స్వయముగను నుద్భవించినది."

పై యంశమువలన 'తురుఁడు' ప్రత్యేకమొక శుక్లయజుశ్శాఖలోఁ బ్రజాపతికిఁ బిమ్మటఁ బ్రథమాచార్యుఁడని చెప్పఁబడియున్నది. అందువలననే మత్స్య పురాణమున జనమేజయున కశ్వమేధమున నధ్వర్యవముఁ జేసినవాఁడు 'మహా వాజసనేయుఁ'డని చెప్పబడెను.

విష్ణు భాగవత పురాణములలో కావషేయుఁ డధ్వర్యవముఁ జేయఁగా జనమేజయుఁ డశ్వమేధముఁ జేసెనని యుండుటచేతను శుక్లయజుశ్శాఖలలో నొకదానికిఁ బ్రథమాచార్యుఁడు 'తురుఁ' డగుటచేతనె మత్స్యపురాణములోని మహావాజసనేయుఁడన 'తురుఁ'డని సమర్థింప నక్కఱలేదు. ఐతరేయ బ్రాహ్మణమునను జనమేజయున కధ్వర్యవముఁ జేసినవాఁడు కావషేయుఁడగు తురుడే యని స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. ఆ యైతరేయమున జనమేజయుని యశ్వమేధము గూర్చి యిట్లు కలదు:

1"(ఇంతకుముందు చెప్పఁబడిన యింద్ర సంబంధమగు) ఈ మహాభిషేకముచేతను 'కవషుని పుత్రుఁడగు తురుఁడు' పరిక్షిత్పుత్రుఁడగు జనమేజయునకు మహాభిషేకముఁ జేసెను. ఆ యభిషేకమహిమము చేతనె జనమేజయుఁడు సమస్తమగు భూమిని దిరిగి జయించెను. పవిత్రమగు నశ్వమేధముం జేసెను. ఆ యజ్ఞగాథ యిట్లు మునులచే గానము చేయఁబడుచున్నది."

"జనమేజయుఁడు 'ఆసందీవతి' యను ప్రదేశమున ధాన్యముం దినుచున్నట్టియు లలాటమున బంగరుపట్ట (శ్వేతలాంఛనము) నలిగినట్టియు పుష్ప మాలవలె దేహమును వ్యాపింపఁజేసి నడుచునట్టియు బలముకలిగి యాగమున కర్హమైనట్టిదియు నగు గుఱ్ఱమును దేవతలకొఱకు బంధించెను" అని కలదు.

శతపథబ్రాహ్మణమున 'శౌనకుఁ' డధ్వర్యుఁడుగా పరిక్షిత్తు కొడుకగు జనమేజయుఁ డశ్వమేధముఁ జేసినట్లు కలదు. భారతమున నాతఁడు పూరుని పౌత్రుఁడని కలదు. ఐతరేయోదిత జనమేయుఁడు పాండవప్రపౌత్రుఁ డనుటకు విష్ణు, భాగవత, పురాణములలో జెప్పఁబడినట్లే యున్నందున నితఁ డాతఁడుకాఁ డనుట స్పష్టమగుచున్నది. జనమేజయునకుఁ దొలుత బ్రహ్మత్వముఁ జేసిన

1. ఏతేనహవా ఐంద్రేణ మహాభిషేకేణ తురః కావషేయో జనమేజయం పారిక్షిత మభిషిషేచ తస్మాద్ జనమేజయః పారిక్షితః సమంతం సర్వతః పృథివీం జయన్ పరీయా యాశ్వేనచ మేధ్యేనేజే తదేషాభియజ్ఞ గాథాగీయతే ఆసందవతి ధాన్యాదంరుక్మిణం హరితస్రజం అశ్వం బబంధ సారంగం దేవేభ్యో జనమేజయంతి.

వాఁడు యాజ్ఞవల్క్యుఁడై యుండెను. అతఁడు వైశంపాయనునిచే శప్తుఁడయ్యెను. ఆ యాజ్ఞవల్క్యుఁ డేలనో మహావాజసనేయుఁడగు గురు నెందులకు శపించెనో తెలియదు. హరివంశమునందుఁ జనమేజయుఁడు తక్షశిలాదేశముం జయించిన పిమ్మట ప్రాగ్దేశములను జయించెనని కలదు. ఐతరేయ బ్రాహ్మణము యొక్క భాష్యమున 'సమంతం పరియాయ' అనుదానికి ప్రాక్సముద్ర పర్యంతమని సాయనాచార్యుల వారర్థము వ్రాసియున్నారు. పై యంశముల నాలోచింప క్రీస్తునకుఁ బిమ్మట (16 శతాబ్దమున) 'అక్బర్' చక్రవర్తివలె జనమేజయుఁడు హిమవద్వింధ్య పర్వతముల మధ్యఁగల యార్యావర్తమంతయు నేలెనని తలంప నగుచున్నది. మఱియు ధర్మజునకు లోఁబడని తక్షశిలాదిదేశము లీతనికి స్వాధీనమై యున్నవి. పాండవవంశమున నీతఁడె చక్రవర్తి.

## జనమేజయుఁడు విద్యాప్రియుఁడు

సౌతికాలమునఁ బంచమవేదముగాఁ జేయఁబడిన మహాభారతము ఇతిహాస రూపముగా నీతని కారణముననె వైశంపాయనునిచేఁ జెప్పఁబడినది. నవీనమగు శుక్లయజుశ్శాఖలలో నొక భాగమునకుఁ బ్రవర్తకుఁడగు యాజ్ఞవల్క్యునకు బ్రహ్మత్వమును, వేఱొక శాఖకు మూలపురుషుఁడగు కవషునకు 'అధ్వర్యవము' నిచ్చి తచ్ఛాఖలను గౌరవించెను. ఇంతమాత్రమేకాదు, శుక్లయజుస్సును దన పుత్రుఁడగు 'శతానీకునకుఁ' జెప్పించెను. (శతానీకుఁడు యాజ్ఞవల్క్యునికడఁ జదివినట్లు విష్ణు భాగవత పురాణములలోఁ గలదు)

ఈతనితో సంబంధముండినను లేకుండినను 'తిత్తిరి' ఋషిప్రోక్తమగు కృష్ణయజుశ్శాఖయు నీతని కాలముననే యావిర్భవించెను. నేఁటి కృష్ణయజుస్సు యాజ్ఞవల్క్యుఁడు క్రక్కఁగా 'తిత్తిరి' పక్షులు తినుటచే నా శాఖకు 'తిత్తిరి' శాఖ యను పేరు గల్గెనని పురాణములలోఁ గలదు. కాని, పాణిని పతంజలి మునులు తమ గ్రంథములలోఁ దిత్తిరిమునిప్రోక్తమే తైత్తిరీయవేదమనిరి.

## మత సాంఘిక సంస్కరణములు

జనమేజయునకుఁ బూర్వము మత సాంఘికాచారము లెట్లుండెనో యిది వఱకే సూచించియున్నాను. ప్రాచీనకాలమున మతమన యజ్ఞాది కర్మములే. వానిలో నశ్వమేధయాగము ప్రధానమైనది. జనమేజయుఁడు తనకుఁ బూర్వీకులగు ధర్మజాదులు కృష్ణయజుర్వేదోదితముగా యజ్ఞములఁ జేసియుండినను నవీనముగా సంస్కరింపఁబడిన శుక్లయజుర్వేదమునకే ప్రధానత నొసఁగి తచ్ఛాఖానుగుణ్యముగా నశ్వమేధముఁ జేయుటయుఁ బిమ్మటఁ దనపుత్రునకు శుక్లయజుస్సునే చెప్పించుటయు మతసంస్కరణమైయున్నది.

భారతకాలమున స్త్రీలకు నియమములేదని వ్రాసియున్నాను ఆ నియమా భావము యజ్ఞములలోనే ప్రధానతనొందియున్నది ప్రతియిష్టికిని 'అగ్నీధ్రుఁడు' చేయు 'పత్నీసన్నహన' కర్మము, జ్యోతిష్టోమమున 'నేష్ట' చేయు పత్నీసమ్మార్జన కర్మము మొదలగునవి స్త్రీ కేకపత్నీత్వాభావమునే సూచించును. [1]స్త్రీనిఁ 'సోముఁడు, గంధర్వుఁడు, అగ్ని' యను దేవతలు వరించిన పిమ్మటను మనుష్యులు వరింతురు అను సంశముకూడ స్త్రీ అనేకపతులు కలవారను సంశమునే దృఢపఱచుచున్నది, 'అగ్నీధ్ర, నేష్టా'దుల కర్మములు స్త్రీయొక్క యేకపతిత్వ ధర్మమును బాహ్యముగనో, అంతరంగికముగనో కళంకిత మొనర్చుచున్నవి. ఈ యజ్ఞకర్మము లన్నింటికంటె 'అశ్వమేధము'నఁ జేయు సోమిదమ్మయొక్క యశ్వసేవ మఱియు నసహ్యాకరమైయుండును. చూడుఁడు: [2]పట్టపురాణి 'అంబే అంబా ల్యాంబికే' అను మంత్రమును జపించుచు (వధింపఁబడిన) అశ్వముండాసి 'గణానాంత్వా' అను మంత్రముతో నా యశ్వము నభిమంత్రణముఁజేసి 'ఉత్సక్థ్యోర్గుదం దేహి' యనుచు మృతాశ్వము యొక్క గూఢావయవమును దన గూఢావయవమున నుంచికొని శయనింపవలయును. ఆపు 'డధ్వర్యుఁడు' 'సుభగే కాంపీలవాసిని' యను మంత్రముఁ జదువుచుఁ బట్టుబట్టతో రాణిని గుఱ్ఱమును గప్పును. అగ్నీధ్రుఁడు 'వృషాగ్ం రేతో దధా' అను మంత్రమును జపించును. ఆ రాత్రి తక్కిన ఋత్విక్కులు మహారాజు నిద్రింపకుండఁ జేయుదురు."

ఇంతమాత్రమె కాదు యజమానుఁడు తన భార్యల నల్వురను ఋత్విక్కులకు దానమీయవలయును. ఆ యంశ మిట్లు చెప్పఁబడినది: [3]"పట్టపురాణిని

---

1. వివాహపు మంత్రములలో 'సోమః ప్రథమోవివిదే...మనుష్యజాః' అను మంత్రార్థముఁ జూడుఁడు.

2. "అంబే అంబా ల్యాంబికేతి జపంతీ, మహిష్యశ్వ ముపసంగమ్య 'గణానాంత్వా గణపతిగ్ం హవామహే' ఇత్యభిమన్త్ర్య 'ఉత్సక్థ్యో ర్గుదందేహీతి ప్రజననే ప్రజననం సన్నిధా యోపవిశతి. సుభగే కాంపీలవాసినీతి క్షౌమేన వాససాధ్వర్యుర్మహిషీ మశ్వంచ ప్రచ్ఛాద్య 'వృషాగ్ం రేతో ధా రేతో దధాత్వితి' జపత్యాగ్నీధ్ర ఏతాం రాత్రిమృత్విజో యజమానం జాగరయంతి. ఆపస్తంబశ్రౌతసూత్ర.

(పట్టపురాణి యశ్వసేవచేయు వంశము శృంగార నైషధపాఠకులకు విశేషముగా తెలియును.)

3. మహిషీం బ్రహ్మణేదదాతి. వావాతాం హోత్రే పరివృక్తి ముద్గాత్రే పాలాకలీ మధ్వర్యవ ఇతి. -ఆపస్తంబశ్రౌతసూత్ర.

బ్రాహ్మ యను ఋత్విక్కునకును, ఉపేక్షింపఁబడిన రెండవ భార్యను 'హోత' యను ఋత్విక్కునకును, రాజుయొక్క భోగకన్యను 'ఉద్గాత'యను ఋత్విక్కునకును, రాజునకు పాత్రాదుల నొసఁగు స్త్రీని 'అధ్వర్యుఁడు' ఋత్విక్కునకును రాజు దానమీయవలెను." "ఆ స్త్రీలను ఋత్విక్కులు భర్తలవలె హస్తములను గ్రహించిన పిమ్మటను రాజు తగిన ధనమిచ్చి ఋత్విక్కుల నుండి యా స్త్రీలను బిమ్మట పుచ్చుకొను." అని "ఆపస్తంభ, అశ్వలాయన" శ్రౌత సూత్రములు చెప్పుచున్నవి. గ్రంథవిస్తరభీతిచే నా యంశములను విస్తరించి వ్రాయలేదు. జనమేజయుని భార్య గుఱ్ఱముకడ శయనించినపు డా గుఱ్ఱము కదలినదఁట! అట్లు కదలుట తప్పు. ఈ యశ్వసేనాది నికృష్టకర కార్యములఁ జూచియే జనమేజయుఁడు నేఁడు మొదలెవరు నశ్వమేధయాగముఁ జేయరా దనినాఁడు. ఇది మత సంఘ ధర్మములలో గొప్పదగు మార్పె యగును. పిమ్మట స్మృతి కర్తలు కలియుగమున నశ్వమేధము కూడదని శాసించిరి. దానికి మూల కారకుఁడు జనమేజయుఁడే యైయుండెను.

## వివాహనియమము - శ్వేతకేతువు.

జనమేజయుని కాలమున మహామేధావంతుఁడగు 'శ్వేతకేతువు' అను ఋషి పుట్టియున్నాఁడు. ఈతనికి 'ఆరుణేయుఁడు' ఔద్దాలకియను వేఱుపేరులు కలవు. స్వల్పకాలమె చదివి మహావిద్యావంతుఁడైన ఋషి. ఈతని గూర్చి తన ధర్మసూత్రమున 'ఆపస్తంబుఁ' డిట్లు వ్రాసియున్నాఁడు:

[1]"శ్వేతకేతునివలె కొందఱు (కలియుగమున) కర్మఫలశేషముచే పునర్జన్మమున (స్వల్పకాల బ్రహ్మచర్యము చేతనే) వేదజ్ఞులగుచున్నారు" అని పొగడియున్నాఁడు. మఱియుఁ దనధర్మసూత్రములలో నచట నచట శ్వేత కేతు మతమునే యాపస్తంబుఁ డుదాహరించి యున్నాఁడు. ఈ శ్వేతకేతుని తండ్రి 'ఉద్దాలకుఁడు' (యాజ్ఞవల్క్యుని గురువు); తాత 'అరుణుఁడు' తల్లి కుశికసుత. సోదరుఁడు సరికేతుఁడు భార్య సువర్చల తోఁబుట్టువు సుజాత. అష్టావక్రుఁడు మేనల్లుఁడు (అష్టావక్రుఁడు తల్లిగర్భముననే విద్యలు నేర్చినట్లు భారతారణ్య పర్వమునఁ గలదు) కహోడుఁడు సోదరీభర్త. శ్వేతకేతువు గౌతమగోత్రజుఁ డగుటచే నీతఁడు 'గౌతమ' యని ఛాందోగ్యాద్యుపనిషత్తులలో సంబోధింపఁ బడెను.

ఈ శ్వేతకేతుఁడు నాఁడు పాంచాల దేశమున నుండిన 'విద్యాపరిషత్తు'న విజయమునొంది విశేషగౌరవము నొందియున్నాఁడని 'బృహదారణ్యకోపనిషత్తు'నం

---

1. బ్రుతర్షయస్తు భవంతి కేచిత్కర్మఫలశేషేణ పునస్సంభవే యథాశ్వేతకేతు.
-ఆపస్తంభధర్మసూత్ర 1-5.

గలదు. 'జనక, యాజ్ఞవల్క్యులతో' నీతఁడు వాదించినట్లు శతపథ బ్రాహ్మణమునఁ గలదు. జనమేజయుని సర్పయాగము నందు శ్వేతకేతుఁడు 'సదస్యుఁ'డై యున్నాఁడు. ఈతనిని గురించిన విశేషాంశములు 'శతపథ బ్రాహ్మణ, ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తుల'లోను, మహాభారతముననను విపులముగా వర్ణింపఁబడియున్నవి. ఈతఁడు విద్యావంతుఁడై తండ్రి కడ నుండగా నొకప్పు డొక బ్రాహ్మణుఁడు ఋతుస్నాతయైన కుశికసుత యను శ్వేతకేతుని తల్లిని బలాత్కరించి సంతానము నొందుటకుఁ జేయిపట్టుకొని (శ్వేతకేతూద్దాలకులు దగ్గఱ నుండఁగనే) తీసికొనిపోవుచుండఁగా శ్వేతకేతుఁడు మహాక్రోధముతో వలదని నిషేధించియున్నాఁడు 1"కోపించిన యాశ్వేతకేతునితోఁ దండ్రియగు నుద్దాలకుఁ డిట్లనుచున్నాఁడు. ఓ నాయనా! కోపింపకుము. ఇది సనాతనధర్మము. గోవువలె భూమియం దన్నివర్ణములలోను స్త్రీలు 'అనావృతలై' (ఒక పురుషునకే లోఁబడనివారై) యుందురు ప్రజలు పశువలెఁ దమ వర్ణములలో నుందురు అనెను.

శ్వేతకేతుఁ డాధర్మము నంగీకరింపలేదు. అపుడు శ్వేతకేతుఁ డీమర్యాదను (ఒక స్త్రీ యొకపురుషునకుఁలోబడుటను) స్త్రీ పురుషులకుఁ జేసెను. అది మొదలుకొనియే యీక్రింది మర్యాద యున్నదని మనకు వినఁబడుచున్నది. ఇది మొదలు భార్య భర్త నతిక్రమించి చరించిన యెడలఁ బురుషునకును బాపము కలుగును. అట్లే యువతియై యోగ్యురాలైన భార్య నతిక్రమించిన యెడల బురుషునకును బాపము కలుగును. ఇట్లా శ్వేతకేతునిచేఁ బూర్వకాలమున నో భయ స్వభావులారా! (కుంతీ!) బలాత్కారముచేతనే యీ నిబంధనము చేయఁబడెను" (ఈయంశము కుంతితోఁ బాండురాజు చెప్పినట్లునది కాని యది యసందర్భ

---

1. శ్లో ...క్రుద్ధం తంతు పితా దృష్ట్వా శ్వేతకేతు మువాచహ
మా తాత కోపంకార్షీ స్త్వ మేషధర్మ స్సనాతనః
అనావృతాహి సర్వేషాం వర్ణానా మంగనాభువి
యథా గావః స్థితా స్తాత స్వేస్వే వర్ణే తథాప్రజాః
ఋషిపుత్రోథ తంధర్మం శ్వేతకేతు ర్నచక్షమే
చకారచైవ మర్యాదా మిమాం స్త్రీపుంసయో ర్భువి
తదాప్రభృతి మర్యాదా స్థితేయ మితిశః శ్రుతం
వ్యుచ్చర త్యాః పతింనార్యా అద్యప్రభృతి పాతకం
భార్యాం తథా వ్యుచ్చరంతః కౌమారబ్రహ్మచారిణీం
ఇతితేన పురాభీరు మర్యాదా స్థాపితాబలాత్. -ఆదిపర్వ. 122 అధ్యా.

ముగా నున్నదని యిదివఱకె వ్రాసియున్నాను. ఈ నిబంధనము జనమేజయుని కాలముననే యై యున్నది.) ఋతుస్నాతయైన స్త్రీ యెవతెయైనను బురుషుఁడుచేరి మంచిమాటలంచేతఁగాని ధన వస్త్రాదులనిచ్చి కాని యామెనుఁగూడి సంతతిఁ గన వచ్చుననియు, అట్లా స్త్రీ యంగీకరింపనిచో నామెను బలాత్కరించియు రజ్జువుతోఁ గాని దండముతోఁగాని కొట్టియు ఆ స్త్రీని లోఁబఱచుకొని యామెను గూడవచ్చు ననియుఁ బైనుడువఁబడిన 'ఉద్దాలకుఁడేకాక నాక, కుమారహారీతు'లను ఋషుల వాక్యములను బృహదారణ్యకోపనిషత్తుయొక్క యెనిమిదవయధ్యాయము నాల్గవ బ్రాహ్మణమునఁ గలవు గ్రంథవిస్తరభీతిచే నావాక్యములను వ్రాయలేదు.

ఉద్దాలకుఁడు తాను జెప్పిన ధర్మమే (ఏ స్త్రీనైన నేపురుషుఁడైన పొంద వచ్చును.) యగుటచేఁ తన భార్య నన్యుఁడు బలాత్కరించినను సహించుటయె కాక వలదను శ్వేతకేతుని సమాధానపఱచుటకును యత్నించియున్నాఁడు. శ్వేతకేతుఁ డీవివాహబంధనము యౌవనముననే చేసినట్లు కాన్పించుటచె నిది జనమేజయుని కాలముననే జరిగినది. వివాహనిబంధనము బలాత్కారముగానే చేయఁబడెనఁట! ఎంత యాశ్చర్యము! వివాహబంధనము సనాతనధర్మ విరుద్ధము. స్త్రీలు స్వేచ్ఛగ గోవులవలెఁ దిరుగుట సనాతనధర్మమఁట! జనమేజయుఁడు రాజ్యమును వృద్ధిపఱిచి చక్రవర్తియై 'సత్రయాగ, సర్పయాగ, అశ్వమేధ యాగములఁ జేసి వైదిక ధర్మమునకు నవీన మార్గముఁ ద్రొక్కుటచేతను విద్యాభివృద్ధి నొందుటచేతను, ఆ దురాచారముల నాటంకపఱచుటచేతను, ఆ మహారాజు మృతినొందిన పిమ్మట నాతఁ డేలోకమునకుఁ బోయె నని యామహారాజుపై భక్తిచేఁ గొందఱు జ్ఞానులను బ్రశ్నించుచుండిరి. చూడుడు. [1]లహ్యానిపుత్రుఁ డగు 'భుజ్యుఁ'డను ఋషి జనకుని పండిత సభలో యాజ్ఞవల్క్యునిట్లుప్రశ్నించు చున్నాఁడు:

భుజ్యుఁడు - ఓ యాజ్ఞవల్క్యుఁడా! మేము బ్రహ్మచర్య వ్రతముఁ జేయుచు వేదాధ్యయనము కొఱకు 'మద్ర' దేశములలో సంచరించుచుఁ గపి గోత్రజుఁడగు 'పతంజలి' యను వానియింటి కేగితిమి. ఆ పతంజలి కూఁతురు గొప్ప గంధర్వ గ్రహావిష్టయై యున్నది మేమా గంధర్వ గ్రహమును నీ వెవఁడవని యడుగఁ, దాను 'అంగిర' గోత్రమునఁ బుట్టిన 'సుధన్వుఁ'డను వాఁడనని చెప్పెను. మేమా గంధర్వుని వలన లోకముల యవసానముల నెఱుఁగఁ గోరి యాతనిని, 'బరిక్షిత్పుత్రు'లే లోకమున నుండిరని యడిగితిమి. మాకా

---

1. బృహదారణ్యకోపనిషత్తుయొక్క పంచమాధ్యాయములో తృతీయ బ్రాహ్మణమున నీ యంశము కలదు. గ్రంథవిస్తర భీతిచే మూలహితముగా వ్రాసితిని.

గంధర్వుఁడు పరిక్షిత్పుత్రులే లోకమున నుండిరో సవిస్తరముగాఁ జెప్పెను. ఓయీ యాజ్ఞవల్క్యుఁడా! మాకా గంధర్వుఁడేమి చెప్పెనో యా యంశమును నీవు చెప్పఁగలవా?

భుజ్యుఁడు - అశ్వమేధ యాగముఁ జేసిన వారేలోకమునకుఁ బోదురు?

యాజ్ఞవల్క్యుఁడు - ప్రాణులు కర్మఫం మనుభవించు లోకము "ముప్పది రెండు దేవరథాహ్నముల పరిమితి గలది ఇట్టి లోకమును రెండింతల పరిమితితో భూమి చుట్టుకొని యున్నది. ఆ పృథివిని రెండింతల మితితో సముద్రము చుట్టుకొని యున్నది. ఆ భూసముద్రములచే నావరింపఁబడిన బ్రహ్మాండము యొక్క వెలుపలికి బోవుదురు. ఆ యండకపాలము యొక్క మార్గమగు నాకాశము మంగలకత్తి యొక్క వాయివలెను ఈగ యొక్క రెక్క దళసరివలెను మిక్కిలి సూక్ష్మమగు పరిమితి కలదయి బ్రహ్మాండ కపాలమునకు నడుమ నున్నది. అట్టి మార్గము నుండి యింద్రుఁడు పక్షి రూపుఁడై పరిక్షిత్పుత్రులను మోసికొని పోయి బాహ్యాభ్యంతరముల సమిష్టి వ్యష్టి రూపములతో నిండియుండిన వాయువున కప్పగించెను.

ఆ వాయు వాపారిక్షితులను దనయందుంచుకొని (తన రూపులనుగాఁజేసి) అండ కపాలమునకు మధ్యమున నున్న సూక్ష్మతర మార్గమున బ్రహ్మాండమునకు వెలుపలనున్న లోకమునకుఁ దీసికొనిపోయెను. ఈ యంశమునే మీకా గంధర్వుఁడు చెప్పి యున్నాఁడు "

(గంధర్వుఁడు నట్లే చెప్పుటచేఁ గాఁబోలు భుజ్యుఁడూరకుండెను.)

ఇచట పరిక్షిత్పుత్రులన జనమేజయాదులేయై యున్నారుగాని 'మండూక' కన్యకా పరిక్షిద్రాజుల పుత్రులగు 'శలదలాదులు' కారు. వారశ్వమేధముఁ జేయలేదు. దుర్మార్గులనియే 'వనపర్వమునఁ' గలదు తక్కిన యిరువురు పరిక్షితులకుఁ బహుపుత్రతలేదు.

ఈ 'భుజ్యుఁడు' భరత ఖండమునకుఁ బశ్చిమమున నున్న మద్రదేశము మొదలు ప్రాగ్భాగమున నున్న మిథిల వరకుఁ బరిక్షిత్తనయు లేలోకమున నుండిరని శకునములఁ నడుగుచు వచ్చినట్లు కాన్పించును ఇది యాతనికి జనమేజయాదుల యందున్న మహా గౌరవమునే సూచించుచున్నది.

## శతానీకుఁడు

జనమేజయునకు శతానీక, శంకుకర్ణులను నిరువురు పుత్రులుండిరని భారత భాగవత విష్ణు మత్స్య పురాణములలోఁ గలదు హరివంశమున జనమేజయునకు 'చంద్రాపీడ, జయాపీడుల'ను నిద్దఱు పుత్రులుండిరని కలదు. శతానీక శంకుకర్ణులకు చంద్రాపీడ జయాపీడులను మాఱు పేరులు కలవేమో! జనమేజ

యునకుఁ బిమ్మట శతానీకుఁడె రాజయ్యెను. ఈతఁడు యాజ్ఞవల్క్యుని శిష్యుఁడని వ్రాయఁబడెను యాజ్ఞవల్క్యునకు మిథిల దేశపు రాజగు 'అయస్థూణుఁడు' అను జనకుఁడు కూడ మఱియొక శిష్యుఁడు [1]ఈ శతానీకుఁడు అయస్థూణుని సోదరినో కొమరితనో పెండ్లాడియున్నాఁడు. జనమేజయుడువలె నీతఁడు సమ్రాట్టుకాక మహారాజై యుండెను. 'పాంచాల మిథిల కాశీ మగధ' రాజ్యములు స్వాతంత్ర్యము నొందినని [2]పాంచాలదేశమును జీబలుని పుత్రుఁడు 'ప్రవాహణుఁడు'ను కాశీరాజ్యమును 'అజాతశత్రువు'ను మిథిలను 'అయస్థూణుఁడు'ను మగధదేశమును 'అయుతాయువు'ను పాలించుచుండిరి. శతానీకుని కాలమున వడగండ్ల వానచే నాతనిరాజ్యమున క్షామము కల్గినట్లు ఛాందోగ్యములోని 'ఉషస్తిచాక్రాయణుఁ'డను ఋషిగాథచే నూహింపఁబడుచున్నది. శతానీకుని కాలమున నాతనికిఁగురువగు యాజ్ఞవల్క్యుఁడు మహాప్రసిద్ధినొంది తన శుక్లయజుశ్శాఖ నత్యభివృద్ధికిఁ దెచ్చి యున్నాడు. ఈతనిని గురించి స్వల్పముగా వ్రాసెదను.

## యాజ్ఞవల్క్యుఁడు

ఈతనికి 'బ్రహ్మరాత, వాజసనేయ' యను వేఱువేఱు నామము లున్నవి. ఈతఁడు వ్యాసశిష్యుఁడగు వైశంపాయనునికడ కృష్ణయజుర్వేదమును నేర్చి యాతనికోపమునకుఁ బాత్రుఁడై శుక్ల యజుర్వేదమును సూర్యు నారాధించి యాతనివలనఁ బొందియున్నాఁడని 'విష్ణుభాగవ'తాది పురాణములలోఁ గలదు. కాని శుక్లయజుర్వేదబ్రాహ్మణమగు 'శతపథ బ్రాహ్మణము'నను తద్వేరశిఖయగు 'బృహదారణ్యకోపనిషత్తు'నను యాజ్ఞవల్క్యుఁడు 'అరుణుఁ'డను వేదర్షిపుత్రుఁడగు 'ఉద్దాలకు'నకు శిష్యుఁడై శుక్ల యజుర్వేదమును జదివినట్లున్నది. ఆ శ్రుతి వాక్యములఁ జూడుఁడు:

[4]"అరుణపుత్రుఁడగు నుద్దాలకుఁడు శిష్యుఁడును వాజసనేయుడు (శుక్ల యజుర్వేదముఁజదువువాఁడు) నగు యాజ్ఞవల్క్యునకుఁ జెప్పె."

---

1. శతపథ బ్రాహ్మణ, బృహదారణ్యకోపనిషత్తులలోని వంశ బ్రాహ్మణము జూడుఁడు.

2 పైరాజులలో ముగ్గురు శ్వేతకేతు యాజ్ఞవల్క్యుల సంబంధముకలవారై యున్నారు.

3 యాజ్ఞవల్క్య చరిత్రము అను గ్రంథము సంస్కృతమునవొకటి పూనాలో ముద్రింపఁబడియున్నది. తెనుఁగున బ్రహ్మశ్రీ భాగవతుల లక్ష్మీపతి శాస్త్రిగారు రచించియున్నారు.

4. తగ్ంహైత ముద్దాలక అరుణిర్వాజసనేయాయ యాజ్ఞవల్క్యాయాం తేవాసినఉక్త్వా. -శతపథ 17-8-4-8.

1యాజ్ఞవల్క్యుఁ డుద్దాలకునినుండియు నుద్దాలకుఁ డరుణుని నుండియు నరుణుఁడు 'ఉపవేశి'నుండియు (శుక్లయజుస్సును నేర్చిరి)

2"ఆ యంశము నరుణపుత్రుఁడగు నుద్దాలకుఁడు శిష్యుఁడు వాజసనేయుఁడు నగు యాజ్ఞవల్క్యునకుఁ జెప్పె"

3"యాజ్ఞవల్క్యుఁ డుద్దాలకునివలనను ఉద్దాలకుఁ డరుణుని వలనను అరుణుఁడు పవేశివలనను. .(పిమ్మటఁ బదిమందికలరు) అమ్బ్రిణియనువాఁ డాదిత్యుని వలన నాశుక్లయజుస్సులను (ఉపదేశింపఁబడిరి.) ఇట్లని వాజసవేయుఁడగు యాజ్ఞవల్క్యుచేఁ జెప్పఁబడుచున్నవి "

పై వేదవాక్యములచే యాజ్ఞవల్క్యుని గురువు 'అరుణియగు నుద్దాలకుఁ' డని స్పష్టమగుచున్నది. అరుణశబ్దసంబంధము యాజ్ఞవల్క్యుని గురువున కుండుటచే నీతఁడు, అరుణశబ్దవాచ్యుఁ డగు సూర్యునివలననే శుక్లయజుస్సులను నేర్చెనని పురాణములలోఁ గల్పింపఁబడినది. యాజ్ఞవల్క్యునితో నిపుడు మనకు లభించిన ఋక్సంహితాప్రవర్తకుఁడగు 'శాకల్యుఁడు' సమకాలికుఁడు జనక సభలో వితండవాద మొనర్చి యాజ్ఞవల్క్యుచే శపింపఁబడి యాసభలోనే మృతి నొందెనని బృహదారణ్యకోపనిషత్తునను బ్రహ్మాండ పురాణమునను గలదు. యాజ్ఞవల్క్యుఁడు మేధావి. బ్రహ్మజ్ఞాని. వాగ్మి. జనకసభలోఁ జక్రాంబ్రుమును లీతనితో వాదించియోడిరి. ఈ మేధావి ప్రచారముచేతనే నాఁటినుండి నేటివఱకు మిథిలాదిదేశములలో నీతని శాఖయే ప్రధానవేదశాఖయైనది. గ్రంథ విస్తరభీతిచే నీఋషిని గుఱించి విస్తరింపలేదు.

## అశ్వమేధజుఁడు

భారతమున (ఆదిపర్వము) శతానీకున కశ్వమేధజుఁ డుద్భవించెనని కలదు. భాగవతమున (నవమస్కంధము) శతానీకునకు 'సహస్రానీకుడు'. నాతని కశ్వమేధజుండు పుట్టెనని కలదు. మత్స్యపురాణమున శతానీకునకు 'అధిసీమకృష్ణుఁడు' పుట్టెనని కలదు.

---

1. "యాజ్ఞవల్క్య ఉద్దాలకా దుద్దాలకోరుణా దరుణ ఉపవేశేః."
-శతపథ బ్రాహ్మణ 17-6.5-3

2. "తగ్ం హైత ముద్దాలక ఆరుణి ర్వాజసనేయా యాంతేనాసిన ఉక్త్వా"
-బృహదారణ్యక 8-8-7

3. యాజ్ఞవల్క్య ఉద్దాలకా దుద్దాలకోరుణాదరుణ ఉపవేశేః. .అమ్బ్రిణ్యాదిత్యా దాదిత్యాత్తానీమాని శుక్లాని యజూగ్ంషి వాజసనేయేన యాజ్ఞవల్క్యే నాఖ్యాయంతే. -బృహదారణ్యక 8-5-8.

హరివంశమున శతానీకునకు (చంద్రాపీడునకు) సత్యకర్ణుఁడు పుట్టి హస్తిపురి నేలెనని కలదు. మఱియు సత్యకర్ణునకు శ్వేతకర్ణుఁడుపుట్టి విరక్తుఁడై రాజ్యమును విడిచిపోవఁగా నాతనిభార్య గర్భిణియైనను భర్తతో వనమునకేగి పర్వతపులోయలో శిశువుఁగని యచటనే విడిచి పోయెననియు నాశిశువు రాల నడుమ దొరలుచుండఁ గౌశికగోత్రజులగు బ్రాహ్మణు లాశిశువుఁబెనిచి ప్రక్కలు పుండ్లుపడి నల్లనిమచ్చలుగా మాఱుటచే నాతనికి 'అజపార్శ్వుఁడు' అను పేరు నిడిరనియు నాతఁడు రాజ్యముఁ జేసెననియుఁ గలదు.

భాగవతమున సహస్రానీకునకు నశ్వమేధజుఁడు వానికి నాసీమకృష్ణుండు వానికి నిచక్నుండు పుట్టెననియు వాఁడు గంగలో హస్తిపురి కొట్టుకొని పోవుటచే 'కౌశాంబిఁ' జేలెననియుఁ గలదు.

మత్స్యపురాణ విష్ణుపురాణాదు లించుమించుగ నీరీతినె చెప్పుచున్నవి. పిమ్మట హస్తిపురి కురురాజ్యమున కెపుడును రాజధానిగా లేదు. పాండవవంశజు లలో 'ఉదయనుఁడు' అనుమహారాజు (క్రైస్తవ శకమునకుఁ బూర్వ మేడవ శతాబ్దమున) ప్రసిద్ధినొందియున్నాఁడు. ఆతని రాజధాని కౌశాంబి. ఆతనిచరితము 'కథాసరిత్సాగరమున' విస్తారము వర్ణింపఁబడియున్నది. 'భాస, సుబంధు' కవు లాతని చరితమును నాటకముగాను గద్యకావ్యముగాను గ్రంథములఁ జేసిరి. కాళిదాసాదికవులును 'ఉదయనునిఁ' బ్రశంసించిరి. 'ఉదయన, శతానీకు' లకు నడుమనుండిన వా రనామతరువులగు రాజులై యున్నారు.

హస్తిచేఁగట్టబడిన హస్తిపురి నిచక్నునినాఁడు గంగాప్రవేశమై యిపుడొక చిన్నపల్లెయై జీర్ణమగు జైన దేవాలయములతోఁ గూడి జైనులకు యాత్రా స్థలముగా 'మీరతు'జిల్లాలో నున్నది. ఒక వైశ్యునకది నేఁడు ముఖాసాగ్రామమటఁ!

హైదరాబాద్-500 044
5357

## పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి

సంస్కృతాంధ్ర భాషా పండితుడు, విమర్శకుడు; పరిశోధకుడు. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురము తాలూకా చోడవరము గ్రామములో 1877. నవంబరు 5 (బహుధాన్య కార్తిక బహుళ షష్ఠి) న జన్మించెను. బాల్యమున ప్రైమరీ పరీక్షలోనెగ్గి రూ.4/-ల నెలసరి జీతముపై ఒక వీధిబడిలో పంతులుగ పనిచేయుచు, తన పినతండ్రి వద్ద కాళిదాసత్రయమును, తండ్రి వద్ద జ్యోతిషమును చదువుకొనెను. పిమ్మట శాంతి భద్రాద్రి రామశాస్త్రి వద్ద కావ్య నాటకాలంకారములను చదివి సంస్కృతమున సమగ్ర పాండితిని పొందెను. తరువాత ఎలిమెంటరీ పాఠశాలోపాధ్యాయుడుగ పలుతావులందు ఆయన పనిచేసి, తదుపరి కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాలలో ఆంధ్రోపాధ్యాయుడుగ నియమితుడయ్యెను. తరువాత వరుసగ బందరు నేషనల్ కాలేజీలోను, రాజోలు బోర్డు హైస్కూలులోను కూడ ఆయన ఆంధ్రోపాధ్యాయుడుగ పనిచేసి, కడకు ఉద్యోగ విరమణ చేసెను.

ప్రాచీన సంస్కృత వాఙ్మయమును ఒక నూత్న రీతిలో పరిశోధించిన విమర్శకుడిగా సుబ్రహ్మణ్యశాస్త్రి పేరు గడించెను. సనాతన అధునాతన విధానముల మేలి కలయిక యని చెప్పదగు ఒక నవ్య విమర్శన రీతిని ఆయన ప్రవేశ పెట్టెను. అట్టి కృషికి ఫలితముగ ఆ పండితుని లేఖని నుండి 'మహాభారత చరిత్ర' అను విమర్శాత్మక గ్రంథము వెలువడినది. ఆ గ్రంథము ఆంధ్రదేశపు పండితలోకమున ఒక కల్లోలమును రేపినది. ఆ గ్రంథమును సమర్థించుచు కొందరు, వ్యతిరేకించుచు కొందరు వాద వివాదములకు దిగిరి. ప్రొఫెసర్ కీతు (ఎడింబరో) సర్వేపల్లి రాధాకృష్ణన్, కట్టమంచి రామలింగారెడ్డి, డాక్టర్ హెత్తెంకర్ (పూనా) మొదలగు వారు సుబ్రహ్మణ్య శాస్త్రిని సమర్థించిరి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి మొదలగువారలు ఆ గ్రంథమును ఖండించుచు, గ్రంథములనే రచించిరి; అంతట శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రియును, వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రియును పరస్పరము దూషించికొనుచు, పత్రికలలో వ్యాసములు ప్రకటించుకొని కడకు కోర్టులకు ఎక్కిరి. వీరి వాదనలను వినిన మేజిస్ట్రేటు వారిలో చెరియొకనికి రూ.20/-లు జరిమానా విధించెను.

సుబ్రహ్మణ్యశాస్త్రి. రచించిన గణనీయములగు ఇతర గ్రంథములు : 1. వేదకాలపు వ్యవసాయ చరిత్ర 2. పరీక్షిత్తు 3. మాంసభుక్తి 4. రామోపాఖ్యానము 5. నవకథా మంజరి 6. ఉత్తర భారతము 7. చిత్రరత్న పేటి 8. రాజసూయరహస్యము.

ఆ పండితుడు 1950, జనవరి 7న పిఠాపురమున నిర్యాణము చెందెను.

—ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం.

ISBN : 81-7098—274-X

Cover Printed at Nandini, Hyd.